
ప్రేమవెలుగే

శ్రీ శ్రీరామకృష్ణ దివ్యజీవనం



ప్రేమావతారి

శ్రీ శ్రీరామకృష్ణ దివ్యజీవనం

(మూడవ భాగము)



డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాస్టర్‌గారు, ఎమ్మెస్సీ, పి.హెచ్‌డి



అంకితం



నమామి శ్రీరామకృష్ణ పాదపంకజం
కరోమి శ్రీరామకృష్ణ పూజనం సదా
వదామి శ్రీరామకృష్ణ నామ నిర్మలం
స్మరామి శ్రీరామకృష్ణ తత్వ మవ్యయం ॥

సక్కుబాయి తనూజాతం, గురుదేవ సమప్రభం ।
శిష్యానుగ్రహ కారకం శ్రీరామకృష్ణం నమామ్యహం॥

ప్రాతఃస్మరణం

ప్రాతఃస్మరామి శ్రీరామకృష్ణ ముఖారవిందం
మందస్మితం మధురభాషి విశాల ఫాలం,
దివ్యాధి దివ్య వర శోభిత గండభాగం,
కర్ణాంత దీర్ఘనయనం నయనాభిరామం ॥



అమెరికాలోని నయాగరా వాటర్‌ఫాల్స్ వద్ద మాస్టర్ ఆర్.కె.

ప్రేజ్ఞావతారులు శ్రీ శ్రీరామకృష్ణ దివ్యజీవనం -

మూడవ భాగము

ప్రథమ ముద్రణ : **30 జూన్ 2025**

(పూజ్యశ్రీ మాస్టర్‌గారి ఏకాదశ ఆరాధనోత్సవం)

ప్రతులు : **1,000**

వెల : **రూ. 200/-**

ప్రచురణ మరియు ప్రతులకు

: **అపూర్వ పబ్లికేషన్స్**

ఇ.నెం. 36/71/336, శ్వేతద్వీపము

పవిత్ర కాలేజి రోడ్, ఒంగోలు - 523 001

మొబైల్: 94913 17670

వెబ్‌సైట్: **www.missionrk.com**

ముద్రణ : **శ్రీలక్ష్మీ సాయి ప్రింటర్స్**

ఫీవర్ ఆసుపత్రి దగ్గర, మెయిన్‌రోడ్,

ఓల్డ్ నల్లకుంట, హైదరాబాద్ - 500 044.

మొబైల్: 98491 55699, 91777 55699

E-mail: slsprinters8@gmail.com

కృతజ్ఞతలు

ఈ విరాట్‌విశ్వంలో నాకు జీవితాన్ని ప్రసాదించిన పరమాత్మకు, కులదైవమైన శ్రీ వేణుగోపాల స్వామికి, నాకీ దేహాన్నిచ్చి, సన్మార్గంలో నడిపించిన నా తల్లిదండ్రులు శ్రీమతి చంద్రమౌళీశ్వరి, శ్రీలక్ష్మీనరసింహారావుగార్లకు అనంత కోటి ప్రణామాలు.

మహాకాలస్వరూపులు పూజ్యగురుదేవులు పండితశ్రీరామశర్మ ఆచార్య, మాతా భగవతీదేవి గార్ల ప్రత్యక్ష దర్శనాలనిప్పించి, వారిచ్చిన గాయత్రీపరివార్ కార్యక్రమాలను చేయటానికి మాకు కొండంత అవకాశాన్నిచ్చి, అఖండ సేవా భాగ్యాన్ని ప్రసాదించిన ప్రజ్ఞావతారులు, ప్రేమస్వరూపులు, మహాపురుషులు పూజ్యశ్రీ శ్రీరామకృష్ణ మాస్టర్‌గారికి సహస్రాధిక వందనములు. ఈ పుస్తకరచనకు పరోక్షంగా ప్రేరణనిచ్చిన శ్రీమతి విజయావిశ్వనాథ్ గారికి ధన్యవాదాలు.

నాలుగు సంవత్సరాలపాటు జరిగిన ఈ రచనా వ్యాసంగంలో త్రికరణశుద్ధిగా నాకు సహకరించిన

డి.టి.పి.: శ్రీమతి కె. కృష్ణకుమారి, శ్రీమతి లక్ష్మీరాజగోపాల్, శ్రీమతి వల్లీశ్రీనివాస్

ఎడిటింగ్: శ్రీమతి వల్లీశ్రీనివాస్, చిరంజీవి చవ్వాకుల హవి

ఎడిటింగ్ & డిజైనింగ్: శ్రీమతి కాటూరి తేజశ్రీ

ప్రూఫ్‌రీడింగ్: శ్రీమతి అట్లూరి శ్రీలక్ష్మి & శ్రీమతి మెంటా గీతా రాధిక

కవర్‌పేజీ డిజైనింగ్: చిరంజీవి కాటూరి గార్గేయ ఋత్విక్

ఈ పుస్తక ప్రచురణకు సహకారాన్ని అందించిన పరివార్ సభ్యులందరికి మా కృతజ్ఞతాభివందనములు తెలుపుకుంటూ వీరికి వీరి కుటుంబాలకు పూజ్యశ్రీ గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య– మాతాభగవతీదేవి శర్మగార్ల దివ్యఆశీస్సులు, శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురుదేవుల దివ్య ఆశీస్సులు పుష్కలంగా వర్షించాలని కోరుకుంటూ

మీ రాజ్యలక్ష్మి

ఓం తత్సత్

ముందుమాట

24000 రోజుల దివ్యజీవనానికి పూర్ణాహుతినిచ్చిన పూజ్యశ్రీ మాస్టరుగారు, 1948 అక్టోబరు 14వ తేదీన జన్మించిన మాస్టరుగారు 2014 జూన్ 30వ తేదీన తమ భౌతికశరీరాన్ని స్వచ్ఛందంగా వదిలివేశారు. జీవితాన్ని గాయత్రీమయంగా జీవించిన పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య తమ భౌతిక శరీరాన్ని గాయత్రీ జయంతి రోజున వదిలివేశారు. ఆ విషయాన్ని వారు ముందుగానే తమ సన్నిహితులకు తెలియచేశారు. అదేవిధంగా

సిద్ధపురుషులైన పూజ్యశ్రీమాస్టరుగారు,

ప్రేమకు ప్రతిరూపమైన మాస్టరుగారు,

ప్రజ్ఞాపుత్రులైన మాస్టరుగారు,

గురుపరంపరలనందించి, యోగవిద్యను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చిన మాస్టరుగారు, ఆంధ్రప్రదేశ్‌ను గాయత్రీప్రదేశ్‌గా మార్చటానికి బహుధా కృషి చేసిన మాస్టరుగారు, తమ భౌతిక శరీరాన్ని ఇంత తొందరగా, ఇంత సులువుగా వదిలివేయడమనేది ఆత్మీయ పరిజనులకు ఎంతో దుఃఖాన్ని కలిగించింది. If it is simple, it is Great అనే ఐన్‌స్టీన్ మాటలను పూజ్యశ్రీ మాస్టారు తరచుగా వాడుతుంటారు. అలానే వారు తమ భౌతిక జీవనయానాన్ని కూడా అంతే సింపుల్‌గా ముగించారు. గాయత్రీ పరివార్ సంస్కార పద్ధతిలో అంత్యేష్ఠి సంస్కారము మౌంట్ శంబళ తీర్థం హైదరాబాదులో నిర్వహించటం జరిగింది. శ్రీశ్రీమాస్టరుగారి వైకుంఠసమారాధన అంటే 13వ రోజున చేసే వైదిక క్రతువును శ్రీవిశ్వనాథ్‌గారు సప్తర్షి ఆశ్రమంలో జరిపించారు. ఆత్మీయ పరిజనులందరూ సామూహికంగా ఇచ్చే ప్రేమపూర్వక శ్రద్ధాంజలిని ఆత్మీయ వాతావరణంలో ఎంతో నిష్టతో చేయించారు. కానీ శ్రీశ్రీమాస్టరుగారి సరళమైన జీవితం వెనుక ఎంత అద్భుతమైన దైవీప్రణాళిక వున్నదో గదా! అందులో ఒక సత్యం 12-07-2014 గుంటూరు సప్తర్షి ఆశ్రమంలో జరిగిన శ్రద్ధాంజలి రోజున బోధపడింది. ఆశ్రమప్రాంగణంలో ఒక పెద్ద బోర్డు పెట్టారు. అందులో ఇలా వ్రాసి వుంది.

దేవమానవుడు వచ్చాడు.

24000 రోజుల దివ్యజీవనాన్ని జీవించి వెళ్ళిపోయాడు.

కానీ ఎవ్వరం గుర్తించలేదు.

ఆ వాక్యం చదివిన వారందరూ ఒక్కసారిగా షాక్ అయ్యారు. కారణం ఆ సంఖ్య యొక్క మహాత్మ్యం అలాంటిది. 'ఒక్కటి మాత్రం నిజం. ఇప్పుడు మనం 24 కోట్ల సంవత్సరాల తరువాత లభించిన అద్భుతమైన కాలంలో ఉన్నాము. ఇది దాటితే మళ్ళీ 24 కోట్ల సంవత్సరాలకుగాని ఇలాంటి అవకాశం మీకు రాదు' అని అనేకసార్లు మాస్టరుగారు హెచ్చరించటం జరిగింది. ఆ సంఖ్య యొక్క ప్రాధాన్యతను ఆయన హద్దుగా పెట్టుకొని తమ జీవితానికి 24000 రోజులను అవధిగా నిర్దేశించుకోవడమనేది వారి చేతనత్వపు స్థాయిని తెలియజేస్తున్నది. శ్రీమాస్టరుగారి జీవితంలో ప్రతి క్షణం అంటే అది ప్రయాణం చేస్తున్నప్పుడు కానీ, ఆ సమయంలో ఎప్పుడైనా, ఎక్కడైనా ఆగి టీ తాగడం కానీ, అన్నీ కూడా ముందే నిర్ణయించబడి ఉంటుంది అని శ్రీమాస్టరుగారు చెప్తుండేవారు.

అందుచేత మాస్టరుగారి జీవిత అవధి 24000 రోజులు కావడమనేది కాకతాళీయం కాకపోవచ్చు. అద్భుతమైన దైవీ ప్రణాళికలో అదీ ఒక భాగమే. గాయత్రీమంత్రానికి 24 అక్షరాలున్నాయి. ఈ మంత్రాక్షరాల సంపుటీకరణతో వాల్మీకి మహర్షి శ్రీరామరాజ్యాన్ని గురించి 24 వేల శ్లోకాలతో 'శ్రీరామాయణం' అనే కావ్యం ద్వారా విశదీకరించారు. ప్రతి వెయ్యిశ్లోకాలకు మొదటి అక్షరం గాయత్రీమంత్రాక్షరంతోనే మొదలౌతుంది. అలా గాయత్రీమంత్రానికి వ్యాఖ్యగా శ్రీమద్రామాయణ రచన కొనసాగింది.

ప్రస్తుత సత్యయుగ పునరాగమన కాలంలో శ్రీరామరాజ్యం యొక్క వైభవం సమస్తవిశ్వంలో ఆవిర్భవించాలనే దైవీప్రణాళికని శ్రీమాస్టారు పదే పదే చెప్తుండేవారు. ఈ దైవీప్రణాళికకు సారధ్యం వహించే శ్రీమాస్టారు, సహజంగానే తమ జీవిత అవధిని 24 వేల రోజులుగా నిర్ణయించుకోవడంలో అతిశయోక్తి ఇసుమంత కూడా లేనేలేదు. మొట్టమొదటగా ఈ అవధిని లెక్కించినవారు శ్రీశ్యామలరావుగారి కుమారుడు శ్రీరామ్. చిన్నతనం నుండి శ్రీమాస్టారితో వారికి గల అనుబంధం వారినలా ఆలోచింపచేసి అంతగొప్ప రహస్యాన్ని వ్యక్తపరచడానికి దోహదం చేసింది.

పూజ్యగురుదేవులు గాయత్రీసాధన, యజ్ఞమయ జీవితాన్ని జీవించి, గాయత్రీజయంతి రోజునే వారు గాయత్రీలో లీనమైపోయినారు. శ్రీమాస్టారు కూడా గాయత్రీసాధనతో పాటుగా శ్రీమహాలక్ష్మీసాధనను సార్వజనీనం చేసి ప్రతి అమావాస్యకు ఐదు రోజుల పాటు శ్రీమహాలక్ష్మీ సాధనను చేయించి తదియ రోజున నెలవారీ పూర్ణాహుతిని చేయించేవారు.

శ్రీమాస్టారు కూడా తమ మహాప్రయాణానికి 24 వేల రోజులతో పాటు సరిగ్గా అమావాస్య వెళ్ళిన తదియ తిథినే సరైన తిథిగా నిర్ణయించుకోవడమనేది దైవీప్రణాళికగానే అనిపిస్తుంది. మహాత్ములు తమ మరణాన్ని కూడా ఒక ప్రణాళికాబద్ధంగా నిర్ణయించుకుంటారనేదానికి గురువుగారు, మాస్టరు గార్లే మనకు చక్కటి ఉదాహరణలు.

24000 రోజుల గురించిన సంఖ్యాశాస్త్రము: 2013 జన్మదినం అయిపోయిన దగ్గర నుంచి రోజుల లెక్క:

అక్టోబర్.....17, నవంబర్.....30, డిసెంబర్.....31, జనవరి.....31, ఫిబ్రవరి.....28,

మార్చి.....31, ఏప్రియల్.....30, మే.....31, జూన్.....30.

మొత్తం.....259 రోజులు,

259 అంటే 16, 16 = 1+6 = 7, చంద్రకళలు - 16, సూర్యకిరణాలు - 7, సూర్య, చంద్ర, అగ్నిలోచన సాధనతో మాస్టారు శ్వాసమహావిజ్ఞానాన్ని ఆచరించి నిరంతరం సుషుమ్న (అందమైనది) లో ఉంటూ అందమైన జీవితాన్ని ఆనందంగా జీవించారు. మాస్టారుగారి జీవిత అవధి సరిగ్గా 24000 రోజులు

నిర్యాణం..... 30-06-2014
జననం..... 14-10-1948

17-08-65

65 సంవత్సరాల 8 నెలల 17 రోజులు

65 సంవత్సరాలు × 365 ..... 23,725 రోజులు

1948 నుండి 2014 వరకు లీపు సంవత్సరాలు ..... 16 రోజులు

14-10-2013 నుండి 30-06-2014 వరకు ..... 259 రోజులు

24,000 రోజులు

పూజ్యశ్రీ మాస్టరుగారు తమ శరీరాన్ని వదిలివేయటానికి 24000 రోజులతో పాటుగా, తిథుల ప్రకారంగా సరిగ్గా అమావాస్య వెళ్ళిన తదియ అనగా, శ్రీ మహాలక్ష్మీ సాధన ఐదు రోజుల పాటు చేసిన తరువాత పూర్ణాహుతి పర్వదినాన దేహత్యాగం చేయడమనేది తమ ఇచ్ఛామరణంగా నిర్ణయించుకున్నారు అని అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

మీ రాజ్యలక్ష్మి

ఓం తత్సత్

పాఠకులకు విజ్ఞప్తి

మాస్టర్‌గారి జీవితచరిత్రను మూడుభాగాలుగా విడుదల చేయవలెనని ప్రేరణ పొందిననాటి నుండి దీనినెలా రూపొందించాలనే తపనతో పూజ్యశ్రీ మాస్టర్‌గారినే శరణు వేడుకున్నాను. వారి నుండి వచ్చిన సూచనల ప్రకారమే మూడు చరణాలుగా, మూడుసంపుటాలను రూపొందించడం జరిగింది.

మొదటిసంపుటంలో పూజ్యశ్రీ మాస్టర్‌గారు జన్మించినది మొదలు ఉద్యోగ విరమణ చేసేంత వరకు అంటే 1948 అక్టోబరు 14 నుండి 2002 ఆగస్టు వరకు చేయించిన సాధనలు, స్థాపించిన ఆశ్రమాలు, అనుగ్రహ పీఠాలు మొదలైనవాటి వివరణ ఇవ్వడం జరిగింది.

రెండవ సంపుటంలో 2002 నుండి వారు చేసిన వివిధ కార్యక్రమాలు ముఖ్యంగా విశ్వ ఏకీకరణయజ్ఞాలు, అఖండ భాగవతయజ్ఞాలు, శ్రీమహాలక్ష్మ్మి – గోమహాలక్ష్మ్మి మంత్రజపాలు మరియు యజ్ఞాలు, భాగవతసప్తాహాలు, కుండలినీసాధనా శిబిరాలు ఇంకా 2007లో శాంతికుంజ్‌కు వెళ్ళటం లాంటి ప్రధానాంశాలున్నవి.

మూడవ సంపుటంలో 2008 ఫిబ్రవరిలో శాంతికుంజ్‌కు వెళ్ళి యుగశిల్పి సాధనా శిబిరం చేసివచ్చిన దగ్గర నుండి పూజ్యగురుదేవుల జన్మశతాబ్ది కార్యక్రమాలకు శాంతికుంజ్ వారిచ్చిన నిర్దేశాల ప్రకారం అవిశ్రాంతంగా పనిచేసి వేలాదిమందికి ప్రేరణనిచ్చి, అందరినీ జన్మశతాబ్దికి శాంతికుంజ్‌కు తీసుకువెళ్ళి గురుదేవుల పట్ల తమకు గల శ్రద్ధా భక్తులను గురుదక్షిణగా సమర్పించుకున్నారు. ఆ తరువాత కూడా గురుసత్తా ప్రణాళికలో భాగంగా ఆశ్రమాలన్నింటినీ వ్యవస్థీకృతం చేసుకుంటూ, పూజ్యగురుదేవుల సూక్ష్మ నిర్దేశానుసారము తమ యొక్క వ్యక్తిగత సాధనలో అత్యున్నత శిఖరాలకు చేరుకుని, తమ ఇచ్ఛానుసారము 30 జూన్, 2014న అనగా సరిగ్గా 24000 రోజుల తమ భౌతిక జీవనయాత్రను మహాకాలునికి సమర్పించుకున్నారు.

ఓం శ్రీరామభగవతీ శరణం మమ॥

క్రమానుగత పట్టిక

క్రసం. అధ్యాయము ..... పేజీ నెం.

అధ్యాయం 1 : అమరత్వానికి మార్గదర్శనం (2008) 1

1. యుగశిల్పి సాధన - శాంతికుంజ్ 1
2. క్రాంతి ధర్మి సాహిత్యం - అనువాద కార్యక్రమం 3
3. క్లిష్టకాలము - సమాధానము 4
4. అమెరికా యాత్ర 9
5. షష్టిపూర్తి మహోత్సవాలు 17

అధ్యాయం 2 : క్రొత్త యుగానికి సాధనలు (2009) 24

6. సిద్ధాశ్రమము 24
7. చమత్కార సిద్ధి సాధనా శిబిరం 30
8. యుగచేతనా అవతరణ - శిరిడి 33
9. సాయి గాయత్రి 34
10. మహాసత్రయాగానికి బీజారోపణ 35
11. న్యూజిలాండ్‌లో అశ్వమేధం 36
12. శ్రీకృష్ణదివ్యజ్ఞాన సమాజంలో రెండవ లాడ్జి 38
13. సత్రయాగానికి ఏర్పాట్లు 39
14. మంత్రాలయంలో సత్రయాగం 40
15. సకల గ్రహ, వాస్తు, దృష్టి దోష నివారణ యజ్ఞము 42
16. అననుకూల పరిస్థితులు 43
17. నవసృజన సాధనా పుష్పాంజలి 44

18. గురు అనుగ్రహం - ప్రేరణ 46
19. జన్మశతాబ్ది సమారోహం 48

అధ్యాయం 3 : నూతన మానవకాయ నిర్మాణం (2010) 50

20. తిరుమలలో సాధన 50
21. జన్మశతాబ్ది సమారోహం - శక్తి కలశం 53
22. వాత్సల్యమూర్తి 55
23. దత్తస్థూప ప్రారంభోత్సవం 56
24. భద్రాచలంలో సందేశం 58
25. కలియుగంలోనే సత్యయుగం 60
26. నారాకోడూరు శక్తిపీఠములో పర్జన్యవర్షం 66
27. బ్రహ్మవర్చస్సు - చాంద్రాయణ సాధన 69
28. బలివైశ్వదేవ హవనం 70
29. ప్రాణాగ్నిహోత్ర విధి 71
30. బలివైశ్వదేవ ప్రాముఖ్యత 73
31. దక్షిణ శాంతికుంజ్-నారాకోడూరు గాయత్రిశక్తిపీఠం 74
32. పాదయాత్ర 75
33. ప్రపంచానికి మేలు జరుగుతుంది 76
34. శంబళ అభివృద్ధి కార్యక్రమాలు 78
35. నవ్య నవ గురు 'సం'-న్యాస దీక్ష 82
36. అమరావతి - నవ్యాంధ్ర రాజధాని 85
37. గురుదక్షిణ 87
38. గురుదేవుల దర్శనం 90
39. తులసీ యోగ సాధన 92
40. తులసీ యోగనిద్ర 94

41. తులసీ యోగసాధన - నడిస్తే సత్యయుగము 96
42. బల - అతి బల 97
43. వసంత పంచమి-సందేశం 99

అధ్యాయం 4 : అంతా గాయత్రీమయం (2011) 101

44. గాయత్రీశక్తిపీఠం... నారాకోడూరు 102
45. లక్ష్మీపురంలో శ్రీవేదమాతగాయత్రీ 105
46. కోటిలింగేశ్వర క్షేత్రము 106
47. ప్రకృతి నుంచే సమాధానం 108
48. జన్మ శతాబ్ది మహోత్సవములు 108
49. ఐతిహాసిక కలశయాత్ర - 06-11-2011 110
50. 2011లో జన్మశతాబ్ది అసమాన కార్యక్రమాలు 113
51. జన్మ శతాబ్ది అనుయాజ 115
52. కోణార్కయాత్ర 122
53. ఆదేశాలు 125
54. భారతీయ సంస్కృతి - యజ్ఞోపవీతము - పిలక 128
55. అడయార్‌లో మాస్టరుగారు 131

అధ్యాయం 5 : నూతన ఆదేశాలు (2012) 133

56. వేసవిలో చల్లదనం 133
57. మహామంత్రం 134
58. గురుపూర్ణిమకు గృహప్రవేశము 136
59. మౌంట్ శంబళ - ద గ్లోబల్ పవర్ సెంటర్ 142
60. పోల్‌షిఫ్ట్ 143
61. త్రివేణీ పర్వం 146

62. మీరూ సైంటిస్ట్‌లైపోతారు 150
63. నా గురుదేవులంత వాళ్ళు కావాలి 154
64. ఆదేశాలు 158

అధ్యాయం 6 : క్రొత్త ప్రపంచంలోకి (2013) 161

65. నేను పృథ్వీ గ్రహాన్ని వదిలేశాను 161
66. మహా కుంభమేళా యాత్ర 164
67. సూక్ష్మీకరణ సాధన 171
68. ఉగాది కానుక 179
69. సబ్‌కాన్షియస్ సెషన్స్ 181
70. కలర్ థెరపీ 184
71. "జోక్"తో రోగనివారణ 185
72. సాదా జీవనం - ఉచ్చవిచారణ 190
73. భోజనం 191
74. సుకృత పెండ్లి 192

అధ్యాయం 7: శంబళ – విశ్వశక్తి కేంద్రం (2014) 196

75. 2014 గాయత్రీ జయంతి సందేశం 196
76. శంబళ వ్యవస్థ 197
77. మౌంట్ శంబళ స్థాపన - పూర్వ భూమిక 201
78. శంబళ ఫీచర్స్ 202
79. కేరళ ఆనంద ఆశ్రమంలో 219

నిత్య పారాయణా విధానము

గణపతి ప్రార్థన

మూడుసార్లు ఓంకారము

ఏకదంతాయ విద్మహే వక్రతుండాయ ధీమహి తన్నోదంతి ప్రచోదయాత్ ॥

గురు ప్రార్థన

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః॥

ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురు దేవాయ నమః అను గురు మంత్రమును 108సార్లు చేసుకుని పారాయణను మొదలు పెట్టాలి. పారాయణానంతరం ఆరతి, శుభకామనలతో ముగించ వలెను.

ఆరతి

జయ జగదీశ హరే శ్రీరామకృష్ణ దేవహరే ।

సూర్యచేతన సాధక ।

శ్వేత ద్వీపవాసా ।

శ్రీరామకృష్ణ దేవహరే ।

ఓం జయ జగదీశహరే ॥

శ్రీవత్స గోత్రజా శ్రీ సక్కుబాయి పుత్రా ।

అమరత్వా అనంతా ॥2॥

ఆపద్బాంధవా ।

శ్రీరామకృష్ణ దేవహరే ॥

మాత పితా గురు దైవము స్వామి అంతయు నీవే

మరి అంతయు నీవే ॥

అనుగ్రహమాలామంత్రదాతా ॥2॥

ధరణీ దీక్షా ద్రష్టా ।

శ్రీరామకృష్ణ దేవహరే ॥

ఓంకార రూప ఓజస్వరూపా ।

రామకృష్ణ మహదేవా ।

శ్రీరామకృష్ణ మహాదేవా ।

మంగళ ఆరతి అందుకో ॥2॥

మహాకాల రూపా।

శ్రీరామకృష్ణ మహాదేవా ॥

మహాకాల మహాకాల ఓం జయ మహాకాల మహాకాల ఓం ।

మహాకాల మహాకాల ఓం జయ మహాకాల మహాకాల ఓం జయ ।

మహాకాల మహాకాల ఓం ।

మహాకాల మహాకాల ఓం ॥

రామ కృష్ణ రామ కృష్ణ ఓం శ్రీరామకృష్ణ రామ కృష్ణ ఓం ।

రామ కృష్ణ రామ కృష్ణ ఓం శ్రీరామకృష్ణ రామ కృష్ణ ఓం శ్రీ ।

రామ కృష్ణ రామ కృష్ణ ఓం ।

రామ కృష్ణ రామ కృష్ణ ఓం ॥3॥

ఓం జయ సద్గురు దేవా

ఓం శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురు దేవాయ నమః

మహా శుభ కామన

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం

న్యాయేన మార్గేణ మహీ మహీశాః

గోబ్రాహ్మణేభ్యో శుభమస్తు నిత్యం

లోకా సమస్తాః సుఖినో భవంతు

కాలేవర్షతు పర్జన్యః పృథ్వీ సస్యశాలినీ

దేశోయం క్షోభరహితో బ్రాహ్మణా సంతు నిర్భయాః

సర్వేభవంతు సుఖినః సర్వేసంతు నిరామయాః

సర్వేభద్రాణి పశ్యంతు మాకశ్చిత్ దుఃఖమాప్నుయాత్

అపుత్రాః పుత్రిణః సంతు పుత్రిణః సంతు పౌత్రిణః

నిర్ధనాః సధనాః సంతు జీవంతు శరదాం శతం

ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

అసతోమా సద్గమయా । తమసోమా జ్యోతిర్గమయా ॥


మృత్యోర్మా అమృతంగమయా । స్వార్థం మా పరమార్థంగమయా ॥


అవ్యవస్తాం మా సువ్యవస్థాంగమయా

ఓం శాంతిః శాంతిః శాంతిః శాంతిః శాంతిః

భావం: సకల ప్రాణికోటి క్షేమాన్ని కాంక్షిస్తూ సమస్త మానవజాతి శాంతి, సుఖము, సమృద్ధులతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ భావనాత్మకముగా ఉదయం 6 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 6 గంటలకు, రాత్రి 12 గంటలకు లేని యెడల పడుకునే ముందు ఈ మహా కామన చేసుకోవాలి. ఈ సాధన చేయడము వలన మనము కోరుకున్నప్పుడు మనకు మన కుటుంబానికి శాంతి, సుఖము, సమృద్ధి చేకూరుతుంది.

ఇంటింటా గాయత్రీ తీర్థ (శాంతికుంజ్) హరిద్వార్










వేయిరేగా, ఒక చోట అనేక మంది దేవతల స్థాపన కూడా కొన్ని చోట్ల ఉంది కానీ, సమస్త దేవతల, ఋషుల ప్రాణప్రతిష్ఠ ఒక పాట ఒక చోట ప్రపంచములో ఇంకెక్కడా లేదు. ఐదు ప్రయాగలు, ఐదు కాశీలు, ఐదు సరోవరాలు, ఋషుల దివ్య స్థానాలు సహితంగా హిమాలయాలను శాంతికుంజ్‌లో చూడవచ్చు శ్రీ రాముడు రాజ్యస్థాపనకు శివప్రతీకను స్థాపించారు, గురుపూగారు యుగనిర్మాణ కోరకు హిమాలయాల లఘు సంస్కరణను శాంతికుంజ్‌లో స్థాపించారు.

గాయత్రీ మాతా మందిరం



ఓం భూర్భువ: స్వ: తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి ధియో యోన: ప్రచోదయాత్ ॥
అష్టసిద్ధి నవనిధికే దాత సర్వసమర్థ గాయత్రీ మాతా



పరమ పూజ్య గురుదేవులు పండిత శ్రీరామ-శర్మ ఆచార్య - పరమ వందనీయ మాతా భగవతి దేవి శర్మ








దేవ దక్షిణగా సాధ్యమైనంత ఎక్కువ సమయ,
అంశ, ప్రతిభా దానాలను సమర్పించుకుందాము.

వ్యక్తిత్వముతో కుటుంబ జాగృతి - సమాజ జాగృతి - దేశ జాగృతి - విశ్వ జాగృతి

మిని శాంతికుంజ్ సమూహ





మాస్టర్ గారి షష్ఠిపూర్తి మహోత్సవం



అశ్వమేధ యజ్ఞంలో మాస్టర్ గారు



న్యూజిలాండ్‌లో మాస్టర్ గారు



తులసి యోగ సాధన



తులసి యోగ సాధన

అధ్యాయం-1

అమరత్వానికి మార్గదర్శనం (2008)

1. యుగశిల్పి సాధన - శాంతికుంజ్

మానవజాతి చరిత్రను పరిశీలించినట్లైతే ఒక కచ్చితమైన కాలగణన (పీరియడ్)లో అన్ని జాతుల యొక్క జీవన విధానం ఒక బిందువు (పాయింట్) వద్ద అత్యంత వైభవోపేతమైన దశకు చేరుకుంటుంది. పరిణామక్రమం దశలవారీగా ప్రగతి యొక్క, నాగరికత యొక్క ఉచ్ఛస్థాయికి చేరుకుంటున్నది. ఈ పరిణామక్రమం భౌతికమైన, మానసికమైన మరియు పదార్థజగత్తు (మెటీరియల్ ప్లేన్) మీద, ఇంకా వివిధ కక్ష్యలలో తన ప్రభావాన్ని చూపించినా కానీ, దాని యొక్క అతి ఉత్కృష్టమైన ప్రభావం ఆధ్యాత్మిక జగత్తులోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఎప్పటికైనా మానవజాతి తీసుకోవలసిన అతి పెద్ద (లీప్) గంతు ఇదే!

మానవజాతిని దాని యొక్క నిర్దిష్టమైన గమ్యం వైపుకు తిరిగి మళ్ళించాలంటే అనేక మంది ఆధ్యాత్మికవేత్తలు, వాళ్ళను మనం ఏ పేరుతో పిలిచినా సరే - అవతారపురుషులన్నా, రక్షకులని పిలిచినా, బాబాలని పిలిచినా ఏ పేరు పెట్టి పిలిచినా వారే ఈ మొత్తం మానవజాతిని నడిపించవలసి వుంటుంది. అలా మానవజాతికి మార్గదర్శనం చేసే మహనీయులకు కూడా దశల వారీగా వారి వారి పరిణామక్రమం వారికీ వుంటుంది. అలాంటి దివ్యాత్మలైన మాస్టర్‌గారి హృదయంలో గురుదేవులు ఒక చిన్న దివ్యమైన విత్తనాన్ని నాటారు. దానికి నీరు పోసి, ఎరువులు వేసి, పక్షపాతరహితంగా ఆత్మ విమర్శ చేసుకుంటూ ఆత్మ సాధన చేసుకుంటూ మెల్లమెల్లగా దానిని పెంచి పెద్దదాన్ని చేస్తే అది పుష్పించి, పల్లవించి, ఆంధ్రప్రదేశ్‌ను గాయత్రీప్రదేశ్‌గా చేయగల సమర్థులైన సాధకులను తయారుచేసింది. 'తమకు దిశానిర్దేశం' చేసిన మహాకాలునికి గుదిగుచ్చిన పూలహారంలాగా ఈ

పరివారాన్ని సమర్పించడానికి, శాంతికుంజ్ మార్గదర్శనంలో వీరిని నడిపించడానికి, మాస్టర్‌గారు 2008 ఫిబ్రవరిలో జరిగిన యుగశిల్పి సాధనా శిబిరానికి అందరినీ శాంతికుంజ్ హరిద్వార్‌కు తీసుకువెళ్ళారు. చిత్రమేమిటంటే ఈ సాధనా శిబిరంలో సాధకులందరూ తెలుగువారే. కొంతమంది కుటుంబాలతో సహా వచ్చి సాధనా శిబిరంలో పాల్గొన్నారు. 'యుగశిల్పి' అనే పేరులోనే ఒక పెన్నిధి ఉన్నది. నవయుగ నిర్మాణం గురుదేవుల లక్ష్యం. అందుకవసరమైన శిక్షణనివ్వడానికి ఈ యుగశిల్పిసాధనా శిబిరాలను నిర్వహించాలని వారు నిర్ణయించారు. అలా యుగశిల్పులను తయారుచేసి, వారి ద్వారా నవసమాజం నిర్మించాలనేదే ఈ శిక్షణా శిబిరముల యొక్క లక్ష్యం.

2008 ఫిబ్రవరి ఒకటవ తేదీ నుండి జరుగుతున్న ఈ సాధనా శిబిరములో మాస్టర్‌గారితోపాటు వారి శిష్యులు సుమారు 85 మంది పాల్గొన్నారు. ఆ సంవత్సరం చలి విపరీతంగా ఉండడంతో 'తొమ్మిదిరోజుల సాధన' అయిపోగానే కొంతమంది తిరిగి వెళ్ళిపోయారు, మాస్టర్‌గారు కూడా తిరిగి హైదరాబాదుకు వచ్చారు.

హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత దాదాపు 4,5 నెలలపాటు వారు అస్వస్థులైనారు, జీవితంలో అదొక పెద్ద మలుపు. శరీరం బాగా క్షీణించిపోయింది. **ఈ పరిస్థితిని కూడ ఆ జగన్మాత యొక్క లీలావిలాసంగానే భావించారు. దానిని ఒక సాధనగానే మలుచుకొని భారీ ప్రణాళికలు వేసుకున్నారు. జ్ఞానంతో, వివేకంతో సరైన పంథాలో ఆలోచించి జీవితాన్ని ఒక లీల(ఆట)గా జీవించడం నేర్చుకున్నప్పుడే చిత్తానికి అంటుకొనివున్న చిన్న చిన్న అహంకారపు కణాలు మొత్తం, ఆ శక్తివంతమైన దైవీహస్తాలతో తుడిచివేయబడతాయనేది మాస్టర్‌గారి జీవితం నుండి మనం నేర్చుకోవలసిన ఉదాత్తమైన పాఠం.**

వెళ్ళినవారు వెళ్ళగా మిగిలిన వాళ్ళు మాత్రం విరామమనేది లేకుండా సాధనాశిబిరంలో నేర్పిస్తున్న ప్రతి అంశాన్ని నిశితంగా నేర్చుకోవటానికి బహుధా కృషి చేశారు. అలా అక్కడున్న వారందరూ ఫిబ్రవరి నెలాఖరు వరకు వుండి తమ సాధనలు పూర్తి చేసుకొని ఆదరణీయ శైలాదీదీ, శ్రద్ధేయ డాక్టర్‌సాబ్‌గారి దివ్య ఆశీస్సులనందుకొని, **జన్మశతాబ్ది కార్యక్రమాలకు కావలసిన శక్తి, సామర్థ్యాలను పొంది తిరిగి వచ్చారు.** అందరిలో నూతన ఉత్తేజం వచ్చేసింది. తిరిగి వచ్చేటప్పుడు శాంతికుంజ్ కొన్ని ప్రణాళికలనిచ్చింది. ప్రాంతాలవారీగా వాటిని అమలు చేయడానికి కావలసిన సూచనలు మళ్ళీ మాస్టర్‌గారి నుండే వచ్చాయి.

2. క్రాంతిధర్మ్మ సాహిత్యం - అనువాద కార్యక్రమం

యుగయుగాల నుండి ఋషులు చెప్తున్నది, మహాత్ములు చెప్తున్నది, గురువులు చెప్తున్నది ఎవ్వరికీ ఏమీ అర్థం కావడం లేదు. ఈ గురువులలోనే శిరిడీసాయి, సత్యసాయి, రమణ మహర్షి, జిల్లెళ్ళమూడి అమ్మ ఇంకా మనం ఎవరిని గురుసత్తా అని అంటామో వారందరూ గురువులే! మరి వాళ్ళు ఏం చెప్పి వుంటారు? ఒక్కపూట భజన చేస్తే చాలు, నీకు పెళ్ళయిపోతుంది, ఉద్యోగం వస్తుంది, నీ కోరికలు తీరిపోతాయని చెప్పారా? ఎంత మూర్ఖత్వం అది. ఏదో పెద్ద పని మీద వాళ్ళు వచ్చారు. ఎందుకు వచ్చారో కూడా వాళ్ళు చెప్తూనే వున్నారు. కానీ మనుష్యులకి ఏమీ అర్థం కావడంలేదు. **దానిని చాలా స్పష్టంగా ఒక మహావ్యక్తి ప్రపంచంలోకి క్రాంతులను తీసుకువచ్చే విజ్ఞానాన్ని "క్రాంతిధర్మ్మ సాహిత్యం" పేరుతో మానవజాతికందజేశారు.** ఇక్కడ భగవంతుడిని గురించి మాట్లాడటంలేదు, యోగం గురించి మాట్లాడటం లేదు.

"How to bring revolution", మార్పు ఎలా తీసుకురావాలి అనే అంశం మీద సైంటిఫిక్‌గా 20 పుస్తకాలను వ్రాశారాయన. వారే పరమపూజ్య గురుదేవులు 'శ్రీ శ్రీరామశర్మ ఆచార్య'. ఆ 20 పుస్తకాలను క్రాంతిధర్మ్మ సాహిత్యం అంటారు "science of revolution". ఈ పరిణామక్రమము యొక్క విజ్ఞానము అర్థమైతే మీరు తక్షణమే పరిణామక్రమమును మొదలు పెట్టగలరని మాస్టర్‌గారు చెప్పారు. ఆ విజ్ఞానము యొక్క క్రాంతిని వివరించే 20 పుస్తకాలు ఒక్కొక్క పుస్తకము 50 పేజీలు వుంటుంది. మొత్తం 20 పుస్తకాలు కలిపి 1000 పేజీలుంటాయి. ఉగాది నాటికి ఆ 20 పుస్తకాలను తెలుగులోకి అనువదించటానికి మాస్టర్‌గారు, వారితో పాటు పరివార్ సభ్యులు ఒక 10 మంది దాకా రాత్రి, పగలు కృషిచేసి వాటిని తెలుగులోకి అనువదించి అచ్చువేయించారు.

తర్వాత చెప్పారు, ఈ 20 పుస్తకాల సెట్‌ని అధ్యయనం చెయ్యండి. You have to bring a revolution. ఆ పుస్తకాలు చదివి నేను మూడు ప్రయోగాలు చేశాను. అవి చదివిన 3,4 రోజుల్లోనే ప్రపంచంలో ఎక్కడ ఏ విప్లవం వచ్చినా దానిని నేను ఎక్కడ ఉన్నప్పటికీ నిశ్శబ్దంగా అణిచి వేయవచ్చుననే సత్యాన్ని (నెగిటివ్ అయితేనే) నిర్ధారించుకున్నాను. నా సలహా ఏమంటే ఈ క్రాంతిధర్మ్మ పుస్తకాలను రోజుకు ఒక గంట చదవండి. దాంతో పాటు ఒక గంట గాయత్రీజపం చెయ్యండి. అది కూడా సామూహికంగా చెయ్యండి. మానవజీవితానికి గాయత్రీ సాధన అతిపెద్ద

లక్ష్యం. సృష్టికి ప్రతిసృష్టి చేయగల సామర్థ్యం వస్తుంది. దానిని శ్రీరామశర్మ ఆచార్యగారు చేసి చూపించే గదా ఈ పుస్తకాలను ఇచ్చారు. అవి చదివితే మీరూ అలా చేయవచ్చు అనే ఒక పెద్ద ఆశ్వాసననిచ్చారు. మహాపూర్ణాహుతి పుస్తకమాలగా వాటిని ప్రతివారూ చదివితీరాలి. అవి సమస్త జ్ఞానవిజ్ఞానాల ఖనివంటివి. అటువంటి ఆ పుస్తకాలను తెలుగులో చదివే అదృష్టం కలిగించి, వాటిని ఎలా చదవాలో కూడా నేర్పించి మనలను ప్రోత్సహించిన మన మాస్టారికి మనం ధన్యవాదాలు తెలుపుకోవాలి!

3. క్లిష్టకాలము - సమాధానము

గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్‌లో యుగశిల్పి సాధన చేసి వచ్చాక, 2008 ఏప్రియల్ నెలలో అందరిని సమావేశపరచి మాస్టర్‌గారు చక్కటి దిశానిర్దేశాలను ఇచ్చారు. కాలము యొక్క అత్యవసర స్థితిని వివరిస్తూ, అతి ఉగ్రమానసికస్థితిలో కూడా శాంతంగానే ఇచ్చిన ప్రవచన సారాంశాన్ని ఇక్కడ పొందుపరచుచున్నాను.

"క్రూషియల్ పీరియడ్"లో ప్రస్తుతం అడుగుపెట్టాను. నేను నా శారీరిక పరిస్థితి గురించి మాట్లాడడం లేదు. మన అందరి పరిస్థితిని గురించి మాట్లాడుతున్నాను. గురుదేవులు ఎప్పుడూ ఒక ఉదాహరణనిస్తుండేవారు.

ఉదయం మూడు గంటలకే నిద్రలేచి సాధన చేసే అలవాటుంది నీకు. ఒక రోజున ఆ సమయంలో ప్రక్క వారి ఇంటికి నిప్పంటుకున్నది. ప్రక్క ఇంటివారు నిద్రపోతున్నారు. నీవు వారికి సహాయం చేస్తావా? లేక గురుద్రోహం అని జపం చేస్తావా? సహాయం చేయకపోతే నీవు మనిషివే కాదు. ఇప్పుడు సమాజం అలాంటి స్థితిలో వున్నది. వార్తాపత్రికలు చూస్తే మీకే తెలుస్తుంది, కొంపలంటుకుంటున్నాయి. చిన్నచిన్న పిల్లలు కాముకుల చేతిలో బలౌతున్నారు. రాజకీయ నాయకులు కొట్టుకోవడం చూస్తున్నాము. మందుల్లో కల్తీ చూస్తున్నాము. ఆహారపదార్థాలలో కల్తీలు చూస్తున్నాము. మానవత్వం ఉన్నవాడు ఎవ్వడూ అలాంటి పని చేయలేడు కదా! కానీ మీరు అదంతా చూస్తూ కూడా నిశ్చింతగా వున్నారు. మీరూ నిద్రపోతున్నారు పక్కింటివారిలాగా!

అందుచేత రాబోయే మూడు సంవత్సరాలు అలాంటి సంవత్సరాలు, నిప్పు అంటుకుంటున్నది. మానవీయ విలువలకు విలువనివ్వడంలేదు. మొట్టమొదట మీరు అర్థం చేసుకోవలసిందేమిటంటే

మీరు రాక్షసులు. మీరు ఏ దేవీ, దేవతలను పూజించినా రాక్షసులే. నేను చెప్తున్న ఈ మాటలు బాధాకరంగా వున్నా దీనిపై మీరు ఆత్మవిమర్శ చేసుకోండి. నేను చెప్తున్న మాటలు జరగడం లేదా? మనిషిగా పుట్టిన మనము మానవత్వపు విలువలను మర్చిపోయాము. ఒక ఉదాహరణ చెప్పారు. 'పౌర్ణమి' సినిమాలో ప్రేమించిన అమ్మాయి హీరోకి బుల్లెట్ తగలకుండా తన ప్రాణాన్ని త్యాగం చేస్తుంది. కానీ హీరోతో పెళ్ళి నిశ్చయమైన అమ్మాయి విలన్ వచ్చినప్పుడు హీరో వెనుక దాక్కుంటుంది. ప్రేమకి, మానవీయ విలువలకు ఇదొక ఉదాహరణ (మాస్టర్ గారు సినిమాలను అలాంటి విశ్లేషణాత్మక దృష్టికోణంతో చూడటం నేర్పారు).

రాబోయే మూడు సంవత్సరాల్లో కొంతమందైనా సరే 'ఈ దారిలో వెళతాము. ఎదుగుదాము' అని నిర్ణయించుకుంటే కనుక చాలా, చాలా త్యాగాలు చేయవలసిందే! కానీ ఏడుస్తూ కాదు, ఇష్టపడి చెయ్యాలి. అప్పుడు దానిని త్యాగం అనరు. మీరు అత్యంత ఉత్కృష్టమైన మానవీయ విలువలకు, ఆదర్శాలకు నిలబడగలగాలి. ఒకవేళ అన్నీ వదలుకోవలసి వస్తే 'త్యాగం చెయ్యండి'. దీనివల్ల అంతకన్నా గొప్ప లాభం వస్తుంది. ఈ రోజు నుండి నేను చేసుకున్న మార్పు ఏమిటి అంటే ఇది చెయ్యండి అని చెప్పను. నాకు ఇది కావాలి అని చెప్తాను. మీరేం చేస్తారో, ఎలా చేస్తారో నాకు తెలియదు కానీ మీరు ఏం చేశారో, ప్రతిరోజు నాకు చెప్పాలి.

ఈనాడు మానవజాతి ఉన్న ఈ స్థాయికి రావడానికి మనిషికి కోట్ల కోట్ల సంవత్సరాలు పట్టింది. కానీ గత 50 సంవత్సరాలలో వచ్చిన మార్పులు, గత కోటి సంవత్సరాలలో రాలేదు. వచ్చిన మార్పు ఏమిటీ అంటే మనిషి జ్ఞానము, విజ్ఞానపథంలో చాలా వేగంగా ముందుకు వెళ్తోంది. ఈనాటి మొబైల్స్, ఇంటర్‌నెట్‌లలో ఎవరితోనైనా, ఎప్పుడైనా, ఎక్కడనుండైనా మాట్లాడవచ్చు. మహాభారత కాలంలో ఒక్క సంజయుడికి మాత్రమే లభించిన వరదానము ఇప్పుడు అందరికీ వచ్చింది. అందుచేత ఈ మొబైల్స్‌ని వాటిని ఒక వరదానంగా వాడుకోవాలి తప్ప పిచ్చి, పిచ్చిగా వాటిని వాడకండి. ఈ మూడు సంవత్సరాలలో చాలా త్వరితగతిలో మార్పులు వస్తాయి. ఆ వేగమును అందుకోలేనివారు అవకాశాలను కోల్పోతారు.

గురుదేవులు ఏమి చెప్పారంటే మొత్తం ప్రపంచాన్ని మార్చివేసే ప్రణాళిక సిద్ధమైంది. ఇక్కడ ఒక లక్షా ఇరవైవేలమంది వ్యక్తులు గురువుగారికి కావాలి. వీరు సాధారణ మానవులను మార్చగలగాలి. లక్షమంది వ్యక్తులలో ఒక్కడు ఈ పని చేసినా చాలు.

'ప్రపంచాన్ని మార్చటానికి ఈ పనిని మేము చేస్తున్నాము' అని ఒక్కరూ అనటం లేదు. గుడికి ఎందుకు వెళుతున్నారు అని అడిగితే, 'కోరికలు తీర్చుకోవటానికి వెళ్తున్నాము' అనేవాళ్ళే కనిపిస్తున్నారు. అలాంటి వాళ్ళతో పనిలేదు నాకు. మీ సమయాన్ని గురుదేవులకివ్వండి. గురుదేవులు చెప్తున్నదేమిటి అంటే 'ఈ పనిని చేస్తాము' అన్నవాళ్ళు కొంత కాలం పాటు పెళ్ళిళ్ళు చేసుకోకండి. పిల్లల్ని కనకండి. కుటుంబాల నుంచి బయటకు వచ్చెయ్యండి. గురుదేవులు ఇంకా ఏం చెప్పారంటే:

(1) బాధ్యతలను తగ్గించుకోండి.

(2) పాత్రతను పెంచుకోండి.

గురుదేవుల పనిని ఈ మూడు సంవత్సరాలు మీరు చెయ్యగలిగితే మీ పేర్లు సువర్ణాక్షరాలతో లిఖించబడతాయి. నాతోపాటు ఇన్నేళ్ళుగా ఉన్నవారికి పెద్ద బాధ్యత ఇవ్వటం జరిగింది.

నేనేం చేశానో మీరు అలాగే చెయ్యండి! అని చెప్పటానికే **గురుదేవులు ఈ "మార్పు యొక్క మహత్తర క్షణాలు" అనే పుస్తకంలో చాలా చెప్పారు. దానిని మథించండి! 'మనఃస్థితి మారితే – పరిస్థితులు మారతాయి, సమయదానమే యుగధర్మం' అనే క్రాంతిధర్మీ పుస్తకాలు బాగా అధ్యయనం చెయ్యండి. అవే మీకు దారి చూపిస్తాయని చెప్తూ, ఇంకొక ముఖ్య విషయం చెప్పారు.** వచ్చే గాయత్రీ జయంతి వరకు నాకు మీ సమయం కావాలి. అలా సమయం ఇచ్చేవారు ప్రతిరోజూ సహస్రగాయత్రీ జపం చేయాలి. గాయత్రీజయంతి జ్యేష్ట శుద్ధ దశమి (జూన్)లో వస్తుంది.

మొదటగా సహస్రగాయత్రీ చేసేవాళ్ళను ఒక లక్షమందిని తెచ్చుకుంటే గాయత్రీజయంతి నాటికి వంద కోట్ల జపం పూర్తౌతుంది. అక్షర లక్షల సిద్ధి లభిస్తుంది. ఎంత శబ్దశక్తి ఆవిర్భవిస్తుందో తెలుసుగా! ఆ గాయత్రీ శక్తి ఆంధ్రప్రదేశ్‌లోకి అలా దిగిపోతుంది.

రెండవది అంశదానంగా నవరాత్రులలో ఇంటింటికీ క్రాంతిధర్మీ సాహిత్యం 20 పుస్తకాలు వెళ్ళిపోవాలి.

ఈ 20 పుస్తకాలలో ఒక పుస్తకం అయిన **'సమర్థ గాయత్రీ సాధన'లో గురువుగారేం చెప్పారు అంటే "మిమ్మల్ని దేవుళ్ళని చేసే శక్తి" గాయత్రీ మంత్రంలో వుంది. శ్రద్ధగా చెయ్యండి. గాయత్రీ మంత్రానికి, మతానికి సంబంధం లేదు.** రెండు నెలల నుంచి మూడు సంవత్సరముల లోపల మీ సామర్థ్యాన్ని బట్టి మీరు దేవతలుగా మారిపోతారు. గ్యారెంటీ అది. ఆరు నెలల్లో

ద్విజత్వాన్ని పొందుతారు. అంటే మళ్ళీ ఈ జన్మలోనే ఋషులుగా మారిపోతారు, చెప్పింది చేస్తే! రోజుకు మీరు రెండు గంటలు చేస్తే చాలు. మీకా రిద్ధి, సిద్ధులు వస్తాయి.

గణేశ నవరాత్రులను, గోఖలేగారు భారతదేశ స్వాతంత్ర్యానికి మాధ్యమంగా వాడారు. ప్రపంచంలో చేయబోయే గురువుగారి కార్యక్రమాలకి, నవయుగ నిర్మాణానికి మనం గాయత్రీని మాధ్యమంగా వాడుకుందాం. గాయత్రీజయంతి నవరాత్రులను మనం గణేశనవరాత్రుల్లాగా ప్రాచుర్యంలోకి తీసుకురావాలి. వాడవాడలా గాయత్రీ సాధన ఒక నిష్టతో జరగాలి. గొప్ప విప్లవం తీసుకురావాలి. సహస్ర గాయత్రీ చెయ్యండి. క్రాంతిధర్మీ సాహిత్యం 20 పుస్తకాలు బాగా చదవండి. గాయత్రీ రామాయణం అర్థం చేసుకోండి. గాయత్రీమాత ఫోటోలు ఇంటింటా స్థాపించండి. గురుదేవులను గురించి, గాయత్రీమంత్రాన్ని గురించి విరివిగా ప్రచారం చెయ్యండి. ఈ నవరాత్రులలో 'గాయత్రీమంత్రము ఒక జీవించే కళను నేర్పే మంత్రంగా' ఇంటింటికీ వెళ్ళిపోవాలి. అన్ని మతాల వారు, కులాలవారు నేర్చుకోవాలి. ఇదీ మంత్రం నేర్చుకోండి అంటే నేర్చుకోరు. దానిలోవున్న రహస్యాలను చెప్తే గ్యారెంటీగా అందరూ నేర్చుకుంటారు.

ముందు మీరందరూ ఈ విద్యలో పూర్తి నిష్ణాతులు కావాలి. సహస్ర గాయత్రీ చేసేవాళ్ళ పేర్లు కావాలి. శాస్త్రవేత్తల ప్రకారం ఈ ప్రపంచం అంతా శక్తితో నిండిపోయి వుంది. వాళ్ళ ప్రకారం 'పదార్థాన్ని శక్తిగా మార్చవచ్చు – శక్తిని పదార్థంగా మార్చవచ్చు'. అయితే మన ఋషులు ఏం చెప్పారంటే 'పదాన్ని పదార్థంగా అంటే మాటను పదార్థంగా మార్చవచ్చు అని'. అదే **మంత్రశక్తి అంటే. ఇక్కడ ఏమిటంటే, 'నీ మనస్సు నిన్ను ఏ విధంగా మలిస్తే, నీవు అలాగా అవుతావు.'** కానీ మనస్సును ఎలాగ మలుచుకోవాలి అనేది ఈనాటి విద్యావిధానంలో నేర్పబడడం లేదు.

సమాజములో ఈనాటి పరిస్థితులు అతి భయంకరముగా ఉన్నాయి. ఒకరిని ఒకరు చంపుకుంటున్నారు, ద్వేషించుకుంటున్నారు. బాధించుకుంటున్నారు. ఈ సమస్యల నివారణ కోసమే అందరినీ సహస్ర గాయత్రీ చెయ్యమంటున్నాను. కోట్ల కోట్ల మంత్రశక్తి వుంటే అది సద్బుద్ధిదాయక మౌతుంది. కనుక అది పరిస్థితులను కంట్రోల్ చేస్తుంది. తెలిసి చేసినా, తెలియక చేసినా అది శక్తియే కదా! **దానిని తెలిసి చేసినవాళ్ళు దిశానిర్దేశనం చేయగలుగుతున్నారు. ఆ శక్తిని తెలిసిన వ్యక్తి అంతరిక్షంలో ఆ శక్తిని పెట్టివుంచారు.** అందుకు తొందరపెడతున్నాను. ఇప్పుడు మనం మన మనస్సును ఉపయోగించుకోవాలి. మన ఋషులు 'మార్పు తెచ్చేశాము' అని మనకి గ్యారంటీ

ఎప్పుడో ఇచ్చేశారు కనుక మనం భయపడవలసిందేమీ లేదు. కానీ ధైర్యం ఎక్కడ తెచ్చుకోవాలంటే ఆ మార్గంలో కనుక వెళ్ళకపోతే మనం కోరుకున్న పరిస్థితులు రావు. గురుదేవులు 24 కోట్ల గాయత్రీ చేశారు. మనమూ చేశాము. కానీ ఆ లింక్ కుదరటం లేదు. ఎందుకంటే మన ఆలోచనలు, మన పాత సంస్కారాలే మనలను ముందుకు పోనీయకుండా అడ్డుకుంటున్నాయి. గురువుగారైతే ప్రతిరోజూ అదే సమయానికి ఎంత ఏకాగ్రతతో చేశారో, అలా కనుక మనమూ చేస్తే అడ్డంకులూ పోతాయి. ఫలితాలు వస్తాయి. అంటే–Mind is energy which is controlling the universe and what is mind? the ability to imagine.

మనస్సులో ఇది నేను చెయ్యగలను అని అనుకుంటే నీవు చెయ్యగలవు. ఆ ఆత్మవిశ్వాసం రావడానికి నీవు 20సార్లు, 30సార్లు ప్రయత్నించాలి. కానీ ఋషులకంత ప్రయత్నం అవసరం లేదు కదా! వాళ్ళనుకుంటే అది వెంటనే జరిగిపోతుంది. మనమైతే ఏ పనినైనా సరే చెయ్యగలమా, లేదా? అని సంకోచిస్తుంటాము. కనుకనే చెయ్యలేకపోతున్నాము.

వైజ్ఞానికంగా నిరూపింపబడిన మరొక విషయం ఏమిటంటే -

పాజిటివ్ (సకారాత్మక) ఆలోచనలకి, నెగటివ్ (నకారాత్మక) ఆలోచనలకీ చాలా తేడా వుంది. నెగటివ్ థాట్స్ కంటే పాజిటివ్ థాట్స్ 100 రెట్లు పవర్‌ఫుల్ (నకారాత్మక ఆలోచనల కంటే సకారాత్మక ఆలోచనలు వందరెట్లు శక్తివంతమైనవి). మన ఋషుల ఆలోచనలు వెయ్యి రెట్లు శక్తివంతమైనవి అని పెద్దలు చెప్తారు. **కనుక మనం మన పరిస్థితులను మంచి ఆలోచనా విధానాలతో మార్చుకోవాలి. అదే మనం ప్రధానంగా చేయాల్సిన పని.** సాధారణంగా కూడా మంచి ఆలోచనలు వెయ్యి రెట్లు ఎక్కువ శక్తివంతమై ఉంటాయి. దీనికి మాస్టర్‌గారు చక్కటి ఉదాహరణ చెప్పారు.

నేను ఇల్లు కట్టుకోవాలి అని ఎవరినైనా అడిగితే చందా ఇస్తారా? ఎవ్వరు ఇవ్వరు. కాని అదే నేను ఒక కళ్యాణ మంటపం కడుతున్నాను. మనందరికీ ఉపయోగపడుతుంది అంటే వాడికి ఎంతో డబ్బు వస్తుంది కదా! ఇదెందుకలా చెప్తున్నాను అంటే స్వార్థపూరిత ఆలోచనల కంటే నిస్వార్థపూరిత ఆలోచనలు చాలా శక్తివంతమైనవి అనేది అనేక సందర్భాలలో మనం చూస్తుంటాము.

ధ్యానము చేస్తున్నప్పుడు స్వార్థరహితంగా ధ్యానం చేస్తే ఆలోచనలు త్వరగా కార్యరూపం దాలుస్తాయి. స్వార్థరహిత ఆలోచనలు చాలా శక్తివంతమైవుంటాయి. సహజంగా నకారాత్మక

ఆలోచనలు వస్తాయి. తప్పులేదు. కానీ దాన్ని గురించే ఆలోచిస్తూ, బాధపడుతూ ఉంటే, అవే ఎక్కువ శక్తివంతమౌతాయి. వాటిని నిరోధించాలంటే పాజిటివ్ (సకారాత్మక) ఆలోచనలు చెయ్యాలి. అప్పుడే మీ జీవితాలు సరైన గాడిలో పడిపోతాయని చాలా చక్కటి మార్గదర్శక సూత్రాలను ఆనాడు చెప్పటం జరిగింది. ఇంత సరళమైన, అద్భుతమైన సాధన చేసుకోవడం అందరికీ సాధ్యమే! ఇలాంటి చిన్న చిన్న సాధనలను అభ్యసిస్తూ మనం మన సమస్యలను సులభంగా తీర్చుకోవచ్చు. **ఏదేమైనా సరే, ఇక్కడ మనం అర్థం చేసుకోవలసిందేమిటంటే సకారాత్మక ఆలోచనా విధానం అలవరచుకుంటే మనకంతా మంచే జరుగుతుంది** అని ఈ కార్యక్రమాల నిర్వహణార్థం కొన్నాళ్ళ పాటు హైదరాబాద్‌లో, బెంగుళూరులో వుంటూ చుట్టుప్రక్కల ఊళ్ళల్లో సాధనా శిబిరాలు నిర్వహించి ఒంగోలుకు వచ్చారు.

ఈ తిరుగుళ్ళల్లో వారికి చర్మంపై ఒకరకమైన పూతవంటిది వచ్చింది. మందులకు తగ్గక పోవడంతో దీనికి నివారణ మంత్రంవలన కలగచ్చని మా ఊళ్ళోనే ఉన్న శ్రీమతి రాజ్యలక్ష్మక్కయ్యను పిలిపించాను. ఆవిడ క్రమం తప్పకుండా వేసిన మంత్రం వలన చర్మం సాధారణ స్థితికి వచ్చింది. చెల్ది, సర్పి, నొప్పులు, దిష్టి, జ్వరాలకు సంబంధించిన ఆ మంత్రాల ప్రభావాన్ని గుర్తించి మాస్టర్ గారు 'ఇలాంటి మంత్రవిద్య లుప్తమై పోగూడదు. మీరందరూ మంత్రదీక్ష తీసుకోండి' అని చెప్పారు. అది కేవలం గ్రహణం రోజున మాత్రమే ఇస్తారు. దానిని స్వీకరించి బాగా అనుష్ఠానం చేస్తేనే ఫలిస్తుంది. ఆ సమయంలో మాణిక్యాంబగారు ఇక్కడే వున్నారు. మాస్టర్‌గారు ఆమెతో 'ఈసారి గ్రహణానికి మన పరివార్ సభ్యులందరూ ఈ మంత్రాన్ని తీసుకునే ఏర్పాటు చెయ్యండి' అని చెప్పారు. తర్వాత వచ్చిన చంద్రగ్రహణ సమయంలో గాయత్రీ అనుగ్రహపీఠం, ఒంగోల్లో దీక్షకు ఏర్పాట్లు చేశాము. ఆ రాత్రి 2:04 నిముషములకు అన్ని గ్రామాల నుంచీ సుమారు 90 మంది సాధకులు ఈ దీక్ష తీసుకోటానికి వచ్చారు. గాయత్రీ అనుగ్రహపీఠంలోను, ఆన్‌లైన్‌లో కూడా వందలమందితో ఈ దీక్షా కార్యక్రమం ఎంతో సజావుగా జరిగిపోయింది.

4. అమెరికా యాత్ర

మహాత్ముల జీవితాలు ఎప్పుడూ అన్వేషణతోనే ముందుకు సాగిపోతుంటాయి. నిరంతరం సంఘర్షణ, మానవజీవిత పరమార్థం ఏదో చెప్పి మానవాళిని ఉద్ధరించాలి అనే తపనతో కూడిన

వాళ్ళ ఆలోచనా పరిధి ఒక దేశ, ప్రాంతాలకి మాత్రమే పరిమితమై ఉండదు. ఎల్లలులేని నిష్కల్మషమైన ప్రేమ, అందరికీ శాంతి, ఆనందాలను పంచాలనే తీవ్రమైన తపన మాస్టారిలో నానాటికి అధికమవు తున్నది. అవకాశం దొరికినప్పుడల్లా వారు తమ జ్ఞానాన్ని తరతమ బేధాల్లేకుండా పంచుతునే వున్నారు. ఈ ప్రక్రియలో మాస్టారుగారి సంకల్పానికి, సక్రియమైన శిష్యుల కృషి ఎంతగానో దోహదపడింది.

పూజ్యశ్రీమాస్టర్‌గారి శిష్యులు శ్రీకరమూర్తి, రాంగోపాల్, తేజాజగన్నాధ్, శ్రీదేవి మొదలైనవాళ్ళు U.S.A.లో చాలా కాలం నుండి సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగం చేస్తున్నారు. అందులో శ్రీమతి తేజశ్రీకి మాస్టర్ గారిని యు.యస్. తీసుకువెళ్ళాలనే తపన. ఎన్నోసార్లు మాస్టర్‌గారిని యు.యస్‌కి రమ్మని కోరడం జరిగింది. సమయం వచ్చినప్పుడు తప్పకుండా వస్తానని మాస్టారుగారు మాట ఇవ్వడమూ జరిగింది. గురుదేవుల సంకల్పంతో ఆ అవకాశం తమాషాగా వచ్చింది. శాంతికుంజ్, హరిద్వార్ వారి ఆధ్వర్యంలో U.S.A.లో యూత్ క్యాంప్, 108 కుండీల యజ్ఞం నిర్వహించే నిమిత్తం ఆదరణీయ డాక్టర్‌సాబ్‌గారు, కొంతమంది శాంతికుంజ్ ప్రతినిధులతో యు.యస్. వెళ్ళేందుకు సిద్ధమయ్యారు. డాక్టర్‌సాబ్‌గారి నుండి తేజశ్రీ ద్వారా మాస్టర్‌గారికి కూడా యు.యస్.కు వెళ్ళటానికి ఆహ్వానం వచ్చింది.

అయితే ఈ మధ్యకాలంలో సాధనా శిబిరాలని, అనుష్టానాలని, ప్రజ్ఞామండలుల స్థాపనా నిమిత్తం గ్రామ, గ్రామాలలో విపరీతంగా తిరగటం వలన అనుకోని రీతిలో మాస్టర్‌గారి ఆరోగ్యం బాగా క్షీణించసాగింది. ఈ పరిస్థితులలో అమెరికాకు వెళ్ళడం ఎలా? జూన్ 25వ తేదీన మాస్టర్‌గారు హైదరాబాద్ నుండి ఒంగోలుకు వచ్చారు. మాస్టరుగారితో పాటు శ్రీమతి సుమ, చందన వాళ్ళు వచ్చారు. పూజ్యశ్రీ మాస్టర్‌గారు కారులో నుండి కూడా దిగలేనంత నీరసంగా ఉండడంతో కుర్చీలో కూర్చోబెట్టి ఇంట్లోకి తీసుకురావలసి వచ్చింది. షుగర్ లెవల్స్ చాలా పెరగడం వలన ఆహారం తీసుకోవడం పూర్తిగా మానేశారని, కేవలం పండ్లరసాలతోనే కాలం వెళ్ళబుచ్చుతున్నారని చెప్పారు. వారు ఎంత నీరసంగా వున్నారంటే మాట్లాడడం కూడా కష్టంగానే వుంది. ఎక్కడో నూతిలో నుండి మాట్లాడినట్లుగా వుంది వారి మాట. చాలా శ్రద్ధగా వింటే తప్ప మాట వినిపించని పరిస్థితి. "హే గురుదేవా! మీరే ఆయన ఆరోగ్యాన్ని కాపాడాలి. అమెరికా వెళ్ళాలి. దేశ, విదేశాలలో గురుదేవుల సందేశాలను, 'సైంటిఫిక్ రెలిజియన్' అనే ఆలోచనావిధానాన్ని అందరికీ చెప్పాలి.

పూజ్యగురుదేవుల వాణిని ఒక ఉత్తుంగ తరంగంలాగా అమెరికా ప్రజలకు వినిపించాలి. గురుదేవుల జ్ఞానగంగను అమెరికాలో ప్రవహింపచేయాలి. ఆయన త్వరత్వరగా కోలుకోవాలి. సత్వరం ఆయనను మామూలు మనిషిని చెయ్యమని" మాతాజీని, గురుదేవులను వేడుకోసాగాను. శ్రీరామ చరణం శరణం ప్రపద్యే అంటూ పదే పదే మౌనంగా నా ఆవేదనను గురుదేవులతో చెప్పుకునేదాన్ని.

రాత్రి పగలు శ్రీమాస్టర్‌గారిని కనిపెట్టుకొని వుంటూ వారికి ఎప్పుడు, ఏది కావాలంటే దానిని హితంగా, మితంగా పెడుతూ చాలా శ్రద్ధగా చూచుకున్నాము. ముఖ్యంగా సుమ, వల్లి, సీత, రంగనాథ్ వాళ్ళు ఆయనను కంటికి రెప్పలా చూసుకునేవారు. ఒక వారం లోపల కాస్త కోలుకున్నారు. కాస్త కాస్త నవ్వడం, మాట్లాడడం చేస్తున్నారు. వారిని చూడాలనే తపనతో చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు వస్తూనే ఉన్నారు. అయితే ఎవరితోనూ ఎక్కువ మాట్లాడలేకపోతున్నారు. అమెరికా వెళ్ళడానికి రోజులు దగ్గర పడుతున్నాయి. అందుకు అవసరమైనంత శక్తి ఇంకా రాలేదు. ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్ ఛీఫ్ సర్జన్ డా॥ రామచంద్రరావుగారు మాస్టర్‌గారికి అన్ని పరీక్షలు చేసి తగిన మందులు రాసిచ్చారు. మందుల ప్రభావమో ఏమో కాని ఆహారం కాస్త తీసుకోవడంతో ఆరోగ్యం కొంచెం మెరుగుపడింది. కానీ భరించలేనంత ఒళ్ళు మంటలు. ఆ మంటలు తగ్గటానికి **అథర్వణ వేదంలో చెప్పబడిన 'అపాంభేషజ సూక్తం'** నుండి ముఖ్యమైన నాలుగు సూక్తాలను తీసి స్నానం చేసేటప్పుడు వాటిని చదువుతూ స్నానం చేయడం జరిగింది. అదీ ఉదయం అల్పాహారానికి ముందు ఒక స్నానం, మధ్యాహ్న భోజనానికి ముందు ఒక స్నానం, సాయంత్రం ఒక స్నానం, మళ్ళీ రాత్రి భోజనానికి ముందు ఒక స్నానం. ఒకళ్ళు ఆ సూక్తాన్ని అలా చదువుతూ వుంటే 40 నిమిషాలపాటు ఒక్కొక్క స్నానం చేసేవారు. ఎంతో అద్భుతమైన మార్పు. నీళ్ళల్లో వుండే ఆ హవ్యవాహ, కవ్యవాహ అనబడే ఆ ప్రాణశక్తి, ఆ మంత్రాలశక్తి మాస్టర్ గారిని మళ్ళీ చిన్న చిన్నగా లేపసాగింది. నిజంగా అది మహాద్భుతమనే చెప్పాలి. నాటు-కోసుకో అనే ప్రమాణం ఆధారంగా మా అల్లుడు శ్రీనివాస్‌గారు ప్రతిరోజూ ఒక కొబ్బరికాయ తెచ్చి మాస్టారి చేతిలో పెట్టి దానిని తీసుకువెళ్ళి సాయిమందిరంలో వున్న ధునిలో వేసి అక్కడ వున్న నిత్యాన్నదాన పథకంలో ఒకరోజు మాస్టారి పేరుతో భోజన ప్రసాదాన్ని చేయించారు. అలా మాస్టారు తొందరగా కోలుకోవాలని ఎవరికి తోచిన ప్రక్రియలను వారు చేశారు.

ప్రయోగాత్మకంగా ఆ సూక్తాల ఫలితాలను అనుభూతి చెందిన మాస్టరుగారు తరువాతి కాలంలో ఆ సూక్తాలను స్నానం చేసేప్పుడు అందరూ చదవాలని, తద్వారా సంపూర్ణమైన ఆరోగ్యంతో పాటు మరెన్నో లాభాలను పొందవచ్చునని తమ ప్రవచనాలలో చెప్పడం జరిగింది. ఆ సూక్తాలను అచ్చువేయించి, అన్ని కేంద్రాలకు పంపడం జరిగింది.

ఏది ఏమైనా మాస్టరుగారు మెల్లమెల్లగా కోలుకుంటున్నారు. మాస్టర్‌గారి ముఖంలో మళ్ళీ కళ వచ్చింది. ఒక రోజున హైదరాబాద్ నుండి శ్రీ అశ్విని సుబ్బారావుగారు, హరిద్వార్ నుండి శ్రీగౌడ్‌గారు మాస్టరుగారిని చూడడానికి శ్వేతద్వీపానికి వచ్చారు. మాస్టరుగారి ఆరోగ్యంలో వచ్చిన మార్పును చూచి వారు చాలా ఆనందించారు. తర్వాత వారు 'అమెరికా ప్రయాణం' గురించి కాసేపు ముచ్చటించి వెళ్ళిపోయారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు, పరమపూజ్య గురుదేవులను గురించి, వారి వాఙ్మయాలను చదవడం ద్వారా ఇంకా ఇంకా వారిని గురించి తెలుసుకోవడానికి, వారు చెప్పిన వాటిని ఆచరించడానికి అనేక విధాలుగా ప్రయత్నిస్తుండేవారు. పూజ్యగురుదేవులు సూక్ష్మీకరణ సాధన పూర్తి చేసిన తరువాత 1987 గురుపూర్ణిమనాడు శాంతికుంజ్ ఆశ్రమ ప్రాంగణంలో ఇచ్చిన ప్రవచనాన్ని చక్కటి సాధనగా మలిచారు. దానిని "దేవత్వాన్ని వికసింపచేసుకోండి–కాలనేములు కాకండి" అనే వారి ప్రవచనాన్ని తెలుగు అనువాదం చేసి 'గురుదేవులకు సంపూర్ణసమర్పణ' అనే పేరుతో ఆవిష్కరించారు. సుమారుగా లక్ష పుస్తకాలను అచ్చువేయించి అందరికీ అందచేయడం జరిగింది. అందులో గురుదేవుల ఆవేదనను, హెచ్చరికను, సందేశాన్ని బాగా అధ్యయనం చెయ్యండి. "మీరు దేవతలు–కాలనేములు కాకండి" అనే విషయాన్ని హృదయానికి హత్తుకునేలా చెప్పేవారు. 'గురుసమర్పణ' పుస్తకాలనే కాక, ఫ్లెక్సీలను, ఫోల్డర్లను తయారుచేయించి గ్రామగ్రామాలలో "జన్మశతాబ్ది సమారోహానికి" వాటిని పంచిపెట్టి విస్తృతంగా ప్రచారం చేయించారు.

యు.యస్. వెళ్ళటానికి సమయం దగ్గర పడుతున్నది. మాస్టర్‌గారి యు.యస్. ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లను శ్రీమతి తేజశ్రీ, శ్రీకరమూర్తి ద్వారా చేస్తున్నది. అప్పుడు శ్రీకరమూర్తి ఒంగోలులోనే ఉన్నాడు. ఒకరోజు ఉదయాన్నే శ్రీమతి సౌజన్య, శ్రీకరమూర్తి మాస్టర్‌గారిని తీసుకొని వీసా స్టాంపింగ్‌కి చెన్నైకి వెళ్ళారు. వీసా స్టాంపింగ్ చేయించుకొని రాత్రికే ఒంగోలుకు వచ్చేశారు. చెన్నైకి వెళ్ళొచ్చారు కదా, అక్కడి విశేషాలేమిటని అడగ్గా "వీసా" స్టాంపింగ్ చేసే దగ్గర అక్కడున్న

ఉద్యోగి "మీరెందుకు అమెరికాకు" వెడుతున్నారని అడిగారుట. దానికి మాస్టారు 'TEA' (టీ) గురించి చెప్పడం కోసం వెళ్తున్నాను అన్నారుట. 'టీ' గురించి చెప్పడానికి అమెరికా వెళుతున్నారా అనే ప్రశ్న కలిగింది అతనికి. ఎదుటివారి మనసులో మాట మాస్టారికి తెలుస్తుంది గదా! తరువాత చెప్పారుట. 'T' అంటే Thoughts, E అంటే Emotions ఇంక A అంటే Actions– ఆలోచనలు, ఉద్వేగాలు మరియు కర్తవ్యాలను ఎలా సమన్వయపరచుకోవాలో చెప్పడం కోసం అమెరికా వెళ్తున్నాననే వివరణ చెప్పారు. ఆధ్యాత్మికపరంగా చెప్పాలంటే 'సమం కాయ, శిరో, గ్రీవం' అని గీతలో చెప్పిన విధంగా, అనుకున్నదే చెప్పాలి. చెప్పిందే చెయ్యాలి. దీనినే నేను 'TEA' (టీ) అని వాళ్ళకు చెప్పానని మాస్టర్‌గారు చెప్పగానే ఇక్కడున్న మాకు, ఎంతో అందంగా, చిత్రంగా, సున్నితంగా 'టీ' కి వివరణనిచ్చారో కదా! అని అనిపించింది.

ఇంతలో గురుపూర్ణిమ వచ్చింది. ఈసారి గురుపూర్ణిమ కార్యక్రమాలను నారాకోడూరు 'శక్తిపీఠం'లో జూలై 17న అద్భుతంగా జరిపించారు. 'సంపూర్ణ సమర్పణ' పుస్తకాన్ని అక్కడే ఆవిష్కరించారు. ఆ పుస్తకం క్షణాలలో వేలాదిమందికి వెళ్ళిపోయింది. తరువాత వీసా పనైపోయింది. డాక్టర్ సర్టిఫికెట్స్ వచ్చాయి. వారికి అవసరమైన బట్టలు, మందులు, ఇంకా ఇతరములనన్నింటినీ సర్దడం అయిపోయింది. 24వ తేది మధ్యాహ్నం మూడు గంటలకి శ్రీరంగనాథ్‌గారు తమ కార్లో మాస్టారిని, సౌజన్యను, శ్రీకరమూర్తిని హైదరాబాద్‌కు తీసుకువెళ్ళారు. 26వ తేది రాత్రి రెండు గంటలకు విమానంలో మాస్టరుగారు, శ్రీకరమూర్తి, యు.యస్.కి వెళ్ళారు. క్షేమంగా వెళ్ళినట్లు అందరికీ సమాచారం అందించారు.

అమెరికాలో శ్రీమతి తేజశ్రీ, జగన్నాథ్‌లు మాస్టర్‌గారికి చక్కటి వసతి, సౌకర్యాలను తమ ఇంట్లోనే ఏర్పాటు చేశారు. అమెరికాలో శాంతికుంజ్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలకు మాస్టరుగారిని తీసుకువెళ్ళడంతో పాటుగా ఇంకా వేరువేరు ప్రాంతాలలో మాస్టరుగారి ప్రవచనాలకు చక్కటి వేదికలను తయారుచేసి అక్కడికి కూడా మాస్టరుగారిని తీసుకువెళ్ళారు. మలసాని శ్రీదేవి, శ్రీకర్‌మూర్తి డ్రైవింగ్ బాధ్యత స్వీకరించారు. శ్రీమాస్టరుగారు ఏ లక్ష్యం కోసం వెళ్ళారో దానిని వారు క్షణం కూడా వృధా కానివ్వకుండా పూర్తిచేసుకున్నారు.

జూలై 30 నుండి 3 ఆగస్ట్ వరకు న్యూజెర్సీలో జరిగిన యూత్ క్యాంప్‌లో వేద విజ్ఞానాన్ని, గాయత్రీ విద్యను, సూర్యకిరణ విజ్ఞానాన్ని ఎంతో అద్భుతంగా వివరించారు. ఆట, పాటలతో

యూత్ క్యాంప్ చాలా ఉత్సాహంగా ముగిసింది. 3న జరిగిన 108 కుండాల యజ్ఞంలో పాల్గొని తరువాత తేజా జగన్నాధ్ ఇంట్లో జరిగిన పూర్ణమి ధ్యానం, యూకాన్ యూనివర్సిటీలో జరిగిన "ఇన్నర్ ఎవేకెనింగ్", రేడియో టాక్ షో, లోకవాణీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. లాంగ్ ఐల్యాండ్‌లో జరిగిన సైంటిఫిక్ స్పిరిట్యుయాలిటీ, స్టోనీబ్రూక్ యూనివర్సిటీలో సైంటిస్ట్ శ్రీమతి సునీతా ఏర్పాటు చేసిన ప్రజ్ఞామండలులు, సత్సంగాలు, ఏషియన్ అమెరికన్స్‌కు కూడా గాయత్రీమంత్రాన్ని, యోగవిద్యను బోధించారు. ప్రవీన్ కపాడియా, దత్తపాండ్యా, సునీతాగార్లు ఏర్పాటుచేసిన అనేక సెంటర్స్‌లో అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. అక్కడ చెప్పిన విషయాలలో ముఖ్యమైన విషయాలు:

సంస్కృతి–సభ్యతకు జనని. సంస్కృతిలోంచి సభ్యత ఉత్పన్నమవుతుంది. సంస్కృతి నాయకుడు, సభ్యత అనుయాయి. ఎక్కువమంది అనుసరించేది సభ్యత. వారికి మార్గదర్శనము చేసేవారు సంస్కృతిగల ప్రజ. అందుచేత సంస్కృతి సభ్యతకు మార్గదర్శనం చేస్తుంది. గనుక సంస్కృతి అభివృద్ధి చెందాలంటే అది గాయత్రీమంత్రమునే ఆలంబనగా చేసుకోవాలి. మన మస్తిష్కము అనే తంత్రములో దానిని నిక్షిప్తం చేసుకోవాలి. మనకు మన ఋషులు అందించిన అద్భుత విజ్ఞానము ఇది. దీనిని ఉపయోగించుకుంటే మానవులుగా మీరు అత్యున్నత స్థాయిలో జీవించగలుగుతారు అని చెప్పారు.

శివ తత్త్వాన్ని, సూర్యవిజ్ఞానాన్ని సైంటిఫిక్‌గా వివరించారు, అన్నింటి సారం "మానవ జీవితం దైవత్వంతో నిండిపోవాలి" అని. శివ తత్త్వాన్ని మనిషి తలలోని మొత్తము మస్తిష్క భాగమును సూచిస్తుంది. దీన్ని ఋషులు శివతత్త్వముగా సాక్షాత్కరింప చేసుకున్నారు. గాయత్రీమంత్రము ఈ మొత్తము విధానమును 8 అక్షరముల రూపములో "తత్సవితుర్వరేణ్యం" రూపంలో అందించినది. కనుక తత్సవితుర్వరేణ్యం అనగా మానవీయ మస్తిష్కం పనిచేసే విధానమును సూచిస్తుంది. ఇలా అన్ని అవతారములు మన శరీరంలోనే ఉన్నాయని, వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో వివరించారు.

మాస్టరుగారికి యు.యస్. వాతావరణం చక్కగా సూట్ అయింది. 'నయాగరా' జలపాతాన్ని చూస్తూ మాస్టరుగారు కొంతసేపు అలాగే నిలబడిపోయారుట. అందులో గల మహాత్మ్యాన్ని గురించి తరువాత వాళ్ళకు "అమెరికా అంత సంపన్నమైన దేశం కావటానికి నయాగరా జలపాతం పెద్ద కారణం" – అని చెప్పారట. ఆగస్టు 20వ తేదిన మళ్ళీ నయాగరా జలపాతాలను చూడాలని

అక్కడికి వెళ్ళారట. వాటి వంక అలా చూస్తూ నాకు ఫోన్ చేసి కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పారు. అక్టోబర్ 14 నాటికి తెలుగులోకి అనువదించవలసిన గురుదేవుల రచనలు: 1. సూక్ష్మీకరణ సాధన, 2. కుండలినీ మహావిజ్ఞాన్, 3. గురుసత్తా కుండలినీ సాధన. ఈ మూడు పుస్తకాలను ఒక్కొక్కటి 3000 కాపీల చొప్పున తయారుచేసి సిద్ధంగా వుంచమని చెప్పారు. నయాగారాకు వెళ్ళేదారిలో శిరిడీ సాయి వచ్చి ఆయనకు ఇచ్చిన సందేశాన్ని కూడా చెప్పారు.

మళ్ళీ మరునాడు ఇంకొక ఫోన్ చేసి కాకివాయి 'శ్రీహంసరామ ఆశ్రమాన్ని' రెండవ శాంతికుంజ్‌గా రూపొందించాలి 'శాంతికుంజ్' ఆశ్రమానికి నమూనాగా తయారుచేయటానికి ముందు కొన్ని శాంతికుంజ్ ఫ్లెక్సీలను తయారు చేయించి 10 రోజులలో వాటిని శ్రీహంస రామాశ్రమంలో కట్టించాలని చెప్పగా, శ్రీరంగనాయకులుగారు ఫ్లెక్సీల పనిని పూర్తిచేశారు. మాస్టరుగారు వచ్చే లోపల మూడు పుస్తకాల పనిని పూర్తి చెయ్యాల్సి వుంది. మాస్టర్‌గారి శ్రద్ధ ఎలాంటిదంటే వారు ఎక్కడవున్నా వారు చేయదల్చుకున్న పని పూర్తి అయిందాకా దాని మీద తమ బరువును అలా పెడుతూ, రోజూ ఫోను చేసి పని ఎంతవరకు వచ్చిందని తెలుసుకుంటూ ఇంకో క్రొత్త పనిని చెప్తుండేవారు. అలానే ఒకరోజు ఈసారి తమ జన్మదినం శ్రీహంసరామ ఆశ్రమంలో ఏర్పాటు చెయ్యాలని చెప్పారు.

అయితే అప్పటికే పరివార్ వాళ్ళందరూ 'రాబోయే మాస్టర్‌గారి జన్మదినం-షష్టి పూర్తి' కనుక దానిని చాలా భారీగా చెయ్యాలనే ప్రయత్నంలోనే ఉన్నారు. కానీ చెప్పలేదు. దాదాపు ఆగస్టు నెలంతా మాస్టర్‌గారు యు.యస్.లో తాము చేయదల్చుకున్న కార్యక్రమాలనన్నింటిని పూర్తి చేసుకొని సెప్టెంబరు 3వ తేదిన భారతదేశానికి వచ్చారు. మాస్టర్‌గారు ఒంగోలుకు వస్తూనే ఇంకొక నూతన ప్రణాళికను చెప్పారు. 'శాంతికుంజ్ నమూనా మొత్తం 8 ఫోటోలు' ప్రతి ఇంట్లో వుండాలి. దానిని సెట్ చెయ్యమన్నారు. ఒక రకంగా అది మినీ శాంతికుంజ్‌గా అభివర్ణించారు. దాని తర్వాత 'ప్రజ్ఞావతార మహాకాల శకం' డైరీని చాలా అద్భుతంగా తయారు చేశారు. దానిలో పూర్తిగా 'గురుదేవుల ఆత్మకథ, సంస్కృతీ పురుషులు-శ్రీరామశర్మ ఆచార్య' అనే పుస్తకాల ఆధారంగా మొత్తం 14 రకాల సాధనలతో కూడిన డైరీని అచ్చువేయించి, గురుదేవుల జన్మదినంనాడు ఆవిష్కరించాలని చెప్పారు. మినీ శాంతికుంజ్ నమూనా ఫోటోలను కూడా ఆ రోజుకు వచ్చెయ్యాలని చెప్పారు.

తిథుల ప్రకారం సెప్టెంబరు 27వ తేదీ గురుదేవుల జన్మదినం. ఆ రోజున గాయత్రీ అనుగ్రహపీఠంలో గురుదేవుల సాధనా విశేషాలను ఆమూలాగ్రం చెప్తూ, గురుదేవుల జన్మశతాబ్దికి ఏం చేయబోతున్నారనే విషయాన్ని కూడా సంక్షిప్తంగా వివరించారు. తరువాత ఆ డైరీని ఎలా వ్రాయాలి, దాని వలన మన జీవితంలో వచ్చే అపూర్వమైన లాభాలేమిటనే విషయాలపై చక్కటి వివరణనిస్తూ తప్పని సరిగా అందరూ డైరీ వ్రాయాలని చెప్పారు.

పూజ్యగురుదేవుల జన్మదిన కార్యక్రమాలు అఖండ భక్తి, శ్రద్ధలతో చేయించారు. అలాగే తమ తండ్రిగారైన శ్రీ కామరాజుగారి జన్మదినం సెప్టెంబరు 30వ తేదీ రోజున గాయత్రీ శక్తిపీఠం, నారాకోడూరులో ఎంతో ఘనంగా ఆయనకు 'జన్మదిన సంస్కారం' దగ్గరుండి మరీ జరిపించారు. ఆ రోజు తండ్రిగారి ఆనందాన్ని చూచి మాస్టారి అంతరంగం కూడా ఎంతో సంతృప్తిని చెందింది.

పూజ్యశ్రీ మాస్టరుగారు కేవలం గురుదేవుల పని పట్లనే కాదు, ప్రతి ఒక్కరి విషయంలోనూ శ్రద్ధ వహించి ఉండేవారు. ఇంకా చెప్పాలంటే తరతమ భేదాల్లేకుండా అందరి పట్ల సర్వకాల సర్వావస్థలలోనూ శ్రద్ధ వహిస్తూనే ఉండేవారు. వారికి నా, నీ అనే భేదాలు లేవు. సకల జీవరాశులలోనూ వున్న 'దివ్యచైతన్యం'తో నిరంతరం తాదాత్మ్యం చెందుతూనే వుండేవారు. సామాన్యంగా అందరికీ 'మాస్టర్‌గారు ప్రేమస్వరూపులు, కరుణామయులు, శాంతస్వరూపులు, మనం ఏదడిగితే దానిని కాదనకుండా ఇచ్చే వరప్రదాతగా' మాత్రమే మనకు తెలుసు. కానీ ఆయనలో మనకు తెలియని, తెలుసుకోవాలని ప్రయత్నించినా అందని అనేక ధర్మసూక్ష్మాలు చాలా వున్నాయి. వాటిని మనం తప్పకుండా తెలుసుకొని తీరాలి, ఆచరించాలి. అవే వారు మనకు చెప్పకనే చెప్పిన జీవిత సత్యాలు. మార్గదర్శక సూత్రాలు.

ముఖ్యంగా వారి శ్రద్ధ ఎలాంటిదో చూద్దాము. శ్రద్ధ అనేది మనిషికి చాలా అవసరం. అది అటు ఆధ్యాత్మిక ఉన్నతికి, ఇటు భౌతికశ్రేయస్సుకి ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. దానినే గీతలో 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' అని పరమాత్మ చెప్పాడు. అలాంటి శ్రద్ధ మాస్టర్‌గారి జీవితంలో అణువణువునా కనిపించేది. నిత్యజీవితంలో ఉదయం లేచిన దగ్గర నుండి చేసే ప్రతి పనిలోనూ ఆ 'శ్రద్ధ' ఒక మెరుపులాగా కనిపించేది. ఒక పుస్తకం తీసుకుని చదువుకున్నా, కంప్యూటర్‌లో పని చేసినా, ఆ పని అయిపోయాక ఎంతో శ్రద్ధగా, పొందిగ్గా దానిని యథాస్థానంలో అమర్చి వచ్చేవారు. భోజనం వడ్డించటానికి ముందే వచ్చి టేబుల్ ముందు కూర్చునేవారు. భోజనం చేసేప్పుడు కూడా

ఏ రకమైన కబుర్లు చెప్పేవారు కాదు. శ్రద్ధగా ఆ వండిన పదార్థం యొక్క రుచిని ఆస్వాదిస్తూ భుజించేవారు. ఒక టి.వి. చూసినా అంతే శ్రద్ధతో చూసేవారు. ఇంటికి వచ్చిన అతిథులకు ఎప్పుడేది ఇవ్వాలో చెప్తూ, అంతా వీళ్ళు సరిగ్గానే చేస్తున్నారా లేదా అని గమనించుకుంటూనే ఉండేవారు. ఒకవేళ ఎప్పుడైనా ఏదైనా తేడా కనిపిస్తే, వాళ్ళు వెళ్ళిపోయాక ఆ తప్పును నిర్మొహమాటంగా సరిదిద్దేవారు. ఆ తర్వాత ఇంకెప్పుడూ అలాంటి పొరపాటు రాకుండా జాగ్రత్త పడమనేవారు. అందరి అవసరాలను గమనిస్తూ వాళ్ళకి ఆ సమయానికి అవి అందేలా తమ సూచనల ద్వారా తెలియజేసేవారు. ప్రతి విషయంలోనూ ఎంతో గమనికతో వుండేవారు.

నేను గొప్ప ఆధ్యాత్మికవేత్తను, లౌకిక విషయాలతో నాకెలాంటి సంబంధమూ లేదు అనే వైరాగ్యాన్ని ఎప్పుడూ ప్రదర్శించలేదు. నిస్వార్థప్రేమ లేనిదే ఆధ్యాత్మికత లేదు. ఈనాడు వారితో పరిచయమున్నవారు ఎక్కడైనా కలిస్తే వెంటనే వారు చెప్పలేనంత ఆనందంతో 'మాస్టర్‌గారు మా పట్ల ఇలా వుండేవారు, మా పిల్లలకు అది నేర్పారు, ఇది నేర్పారు. వారు మా పట్ల ఎంత శ్రద్ధ వహించేవారో' అని చెప్పుకుంటుంటారు. దానికి కారణం ఒక్కటే! వారికి మన యందు గల ఎనలేని ప్రేమ, నిస్వార్థప్రేమ. **మానవ సహజమైన ప్రేమ, ఆత్మీయత, మమకారాలు ఎక్కడ వుంటాయో, అక్కడ తప్పనిసరిగా శ్రద్ధ ఉంటుందనేది స్పష్టమైన విషయం. పూజ్యశ్రీ మాస్టారుగారిని గురించి తెలుసుకోవలసిన ఒక చిన్న విషయం మాత్రమే ఇది. ఇలా తెలుసుకోవలసిన విషయాలు ఇంకా ఎన్ని వున్నాయో మరి! వారి సాన్నిధ్యంలో ఎంతమందికి ఎన్నెన్ని అద్భుతమైన అనుభవాలు, అనుభూతులు వున్నాయో చెప్పలేము గదా! ఎవరి అదృష్టం వారిది.**

5. షష్టిపూర్తి మహోత్సవాలు

పూజ్యశ్రీ మాస్టర్‌గారి జన్మదిన శుభసందర్భంగా ఈ సంవత్సరం ఆయనకు 60 వసంతాలు నిండుతున్నాయి కనుక 'షష్టి పూర్తి'కి చేసే వైదిక క్రతువు వేరుగా ఉంటుంది. దాని కోసం మాస్టర్‌గారి శిష్యులు శ్రీ జి.యస్. కృష్ణగారిని సంప్రదించటం జరిగింది. గురువుగారి షష్టిపూర్తి మహోత్సవాలు చేసే అవకాశం వచ్చినందుకు వారెంతో సంతోషించి మీరు దానిని గురించి నిశ్చింతగా వుండండి, అన్నీ నేను చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఎవరికి వారు ఇంత చక్కటి అవకాశం వచ్చింది, చాలా బాగా చెయ్యాలనే పెద్ద మనస్సుతో తాము ఎంత చేయగలరో అంతా చేస్తూ, ఆ వేడుక కోసం ఎదురుచూస్తున్నారు.

బీహార్ స్కూల్ ఆఫ్ యోగా శ్రీ భక్తిచైతన్యస్వామిగారికి మాస్టర్‌గారంటే విపరీతమైన అభిమానం. రాబోయే జన్మదినాన్ని పురస్కరించుకొని, మాస్టరుగారి పేరు మీద శ్రీస్వామివారు తమ ఆశ్రమంలో మృత్యుంజయ హోమాన్ని జరిపించి అనేకమంది సాధుసంతులతో ఆశీర్వచనాలనిప్పించారు. ఆ కార్యక్రమం అయిపోగానే మాస్టర్‌గారు 'గాయత్రీశక్తిపీఠం' నారాకోడూరులో జరుగుతున్న నవరాత్రి సాధనాశిబిరంకు వచ్చారు. అయితే మాలో కొంతమంది జన్మదిన వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చెయ్యాలని ముందుగానే శ్రీహంసరామ ఆశ్రమానికి వెళ్ళిపోయాము. మాస్టర్‌గారు వచ్చేలోపల ఆశ్రమ ప్రాంగణాన్ని అద్దంలా మెరిసిపోయేలాగా చెయ్యాలి. అందమైన మామిడి తోరణాలతో, బంగారంలాగా మెరిసిపోతున్న ముద్దబంతిపూల తోరణాలంకరణలతో ఆశ్రమం కళకళలాడి పోయేలా అలంకరించాలి. దేవతలు రావాలంటే పవిత్రమైన, అందమైన, ఆకర్షణీయమైన హంగులను ఏర్పాటు చెయ్యాలి. ప్రధానమైన విషయం శ్రీ హంస రామ ఆశ్రమాన్ని శాంతికుంజ్‌కు నమూనాగా తీర్చిదిద్దాలి. ఇలాంటి భావతరంగాలతో ప్రతి ఒక్కరూ ఒకరిని మించి ఒకరు పని చేయసాగారు. శాంతికుంజ్‌కు నమూనాలాగా తీర్చిదిద్దటానికి అందమైన 100 ఫ్లెక్సీలు మాస్టర్ గారిచ్చిన సూచనల ప్రకారం తయారై వచ్చాయి.

గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్ వ్యవస్థను గురించి తెలిసిన కొందరు కార్యకర్తలు ఈ ఫ్లెక్సీలను ఏ విభాగంలో ఏవి, ఎలా వుండాలో వాటిని అలా అందంగా, పద్ధతిగా, ఆశ్రమ ప్రాంగణంలో అలంకరించారు.

ఈ మూడు రోజులూ సాధనా శిబిరంలో శాంతికుంజ్‌లో జరిగే టైంటేబుల్ ప్రకారమే అన్ని సాధనలనూ యథావిధిగా జరిపించి శ్రీహంస రామ ఆశ్రమాన్ని శాంతికుంజ్‌కి నమూనాగా దించాలనేది మాస్టర్‌గారి ఆభిలాష. 10వ తేదీకల్లా సాధకులందరూ శ్రీహంసరామ ఆశ్రమానికి వచ్చేశారు. మాస్టర్‌గారి పర్యవేక్షణలో ఏర్పాట్లు ఇంకా చురుగ్గా ముందుకు సాగుతున్నాయి. కార్యకర్తలు, భక్తులు, సాధకులు ఇంకా గ్రామస్తులు అందరూ కలిసి రోజంతా ఆశ్రమాన్ని ఎంతో అందంగా మామిడాకుల తోరణాలతో, అరటి స్తంభాలతో, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆశ్రమం కళకళ్ళాడిపోతున్నది.

12వ తేదికి శ్రీ జి.యస్. కృష్ణగారు సతీసమేతంగా వారి శిష్యులతోపాటు తమ గురువుగారి, షష్టిపూర్తి మహోత్సవాన్ని చూడటానికి వచ్చారు. శ్రీ జి.యస్.గారు వచ్చిన రోజు నుండి ఏర్పాట్లుగాని,

కార్యక్రమాలుగాని వారు ఎలా చెబితే అలా జరుగుతున్నాయి. పూజలు, హోమాది కార్యక్రమాలన్ని వారి పర్యవేక్షణలో జరగడం మొదలయ్యాయి. ఈ షష్టిపూర్తి మహోత్సవానికి వేలాదిమంది భక్తులు వచ్చారు. ముఖ్యంగా శ్రీ అశ్వినీ సుబ్బారావుగారు, శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ పరమానంద ద్వివేదిగారు కూడా వచ్చేశారు.

గత కొద్ది మాసాలుగా మాస్టరుగారి ఆరోగ్య పరిస్థితి చాలా ఇబ్బందికరంగానే ఉన్నది. అయినా అలాంటి పరిస్థితిలో కూడా గురుదేవుల వాణిని వినిపించటానికి విదేశాలకు వెళ్ళిరావడం ఒక అద్భుతం. అన్నింటినీ మించి అంతరంగసాధన. రాబోయే ఈ మూడు సంవత్సరాలపాటు 'జన్మశతాబ్ది' కార్యక్రమాలను చేయాలనే తపన, ఆవేదనలతో, అనారోగ్యంగా వున్న వారి భౌతిక శరీరం తీవ్రమైన దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఎలాగైనా ఆశ్రమాలలో నూతన చైతన్యం తీసుకురావాలని, అవి భావితరాల వారికి ఆధ్యాత్మిక మార్గదర్శనం చెయ్యగల కేంద్రాలుగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో వారు తమ షష్టిపూర్తి మహోత్సవ కార్యక్రమాలను ఇక్కడ చేయడానికి అనుమతించారు. శ్రీకృష్ణగారు కూడ మాస్టర్‌గారి శారీరక పరిస్థితిని గమనించి అందుకు అవసరమైన రీతిలో 'షష్టిపూర్తిమహోత్సవ కార్యక్రమాల' రూపకల్పనను చేసి, ముందుగానే మాస్టర్‌గారికి నివేదించి, వారి అనుమతితోనే 'శ్రీహంసరామ ఆశ్రమం'లో జన్మదిన వేడుకలకు శ్రీకారం చుట్టారు.

2009 అక్టోబర్ 14వ తేదీ ఒక పండుగ. మూడు రోజులపాటు అత్యంత శాంతియుతమైన, ఆనందపూరితమైన, దివ్యధామంలో జన్మదిన వేడుకలు ప్రారంభమైనాయి. ఆశ్రమంలో ప్రవేశించిన నాటి నుంచే ఆ ప్రాంగణం మొత్తాన్ని మాస్టర్‌గారు తమ ఆధ్యాత్మిక వెలుగు కిరణాలతో ఆవరింపజేశారు. మాస్టర్‌గారి ఆధ్యాత్మిక కుటుంబాలవారు యావన్మందీ ఈ ఉత్సవంలో పాల్గొనటానికి ఎంతో ఉత్సాహంతో దూరదూర ప్రాంతాల నుండి రావడం, వారి సేవ కోసం సమయాన్ని కేటాయించడమనేది ఎంతో హర్షాన్ని కలుగచేసింది. ఇది వారి హృదయాలలో మాస్టర్‌గారి పట్ల గల ప్రేమానురాగాలను తెలుపుతున్నది.

జన్మదిన వేడుకలలో భాగంగా, మొదటిరోజున గ్రామగ్రామాలలో చక్కటి రోడ్ షో చేసి వచ్చారు. ఇంక రెండవ రోజున అంటే 12వ తేదీన శ్రీ జి.యస్. కృష్ణగారు ఉదయాన్నే మాస్టర్‌గారికి శాస్త్రీయంగా నూనెతో తలంటించి, ఆరతినిప్పించి అభ్యంగన స్నానం చేయించారు. అనంతరం పట్టువస్త్రాలను ధరింపచేసి తీపి తినిపించారు. మొదటి ఘట్టం పూర్తి అయింది.

అందరూ అల్పాహారం తీసుకున్నాక మాస్టర్‌గారి ప్రవచనం పూర్తి అయ్యాక శ్రీకృష్ణగారు 'షష్టిపూర్తి మహోత్సవం' యొక్క విశిష్టతను గురించి వివరించి, తదుపరి జరుగబోయే కార్యక్రమాల ప్రాముఖ్యతను పరిచయం చేశారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో జరిగిన హనుమాన్ చాలీసా పారాయణతో ఆశ్రమవాతావరణం అద్భుతమైన దైవీశక్తితో ప్రతిస్పందించింది. అలాగే మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేయించారు. అంతటితో ఆనాటి కార్యక్రమాలు పూర్తి అయినాయి. మధ్యాహ్నం నుండి గాయత్రీ పరివార్ కార్యకర్తల సమావేశం జరిగింది. శ్రీయుతులు శ్రీ అశ్వినీ సుబ్బారావుగారు మరియు శాంతికుంజ్ ప్రతినిధులు శ్రీపరమానంద ద్వివేదీగారు జన్మశతాబ్ది సమారోహానికి మనం చేయవలసిన విశేష కార్యక్రమాలను గురించి వివరించారు. సాయంత్రం శ్రీ భక్తిచైతన్యానందస్వామి గారు 'యోగనిద్ర' ప్రాశస్త్యాన్ని వివరించి ఆ సాధనను అందరితో అభ్యాసం చేయించారు.

13వ తేదీ అర్ధరాత్రి పన్నెండు గంటల వరకు అందరూ మేలుకొని మాస్టరుగారి చేత కేక్ కట్ చేయించి బర్త్‌డే విషెష్ చెప్పి అందరూ వెళ్ళి పడుకున్నారు. 14వతేదీ ఉదయం ఎనిమిది గంటల నుండి యజ్ఞ కార్యక్రమం ప్రారంభించారు శ్రీకృష్ణగారు. ఈ రోజు ప్రధానంగా మహాగణపతి హోమం, అనంతరం ఆయుష్య హోమం, పూర్ణాహుతి చేయించారు. మాస్టరుగారే కూర్చొని ఈ యజ్ఞాన్ని స్వయంగా చేసుకున్నారు.

వారికి సాయంగా శ్రీభక్తి చైతన్యస్వామిగారు, నేను యజ్ఞవేదిక దగ్గర కూర్చుని హోమంలో ఎప్పుడు ఏ హవన సామగ్రితో ఆహుతులనివ్వాలో వాటిని అందిస్తూ, అవసరమైన చోట ఆహుతులనిస్తూ యజ్ఞం పరిసమాప్తి వరకూ అక్కడే వున్నాం. యజ్ఞం అయిపోయిన వెంటనే శ్రీకృష్ణగారి సూచనల మేరకు 'గోమాత'ను తీసుకువచ్చి గోపూజ, ప్రదక్షిణలు చేయించి ఆ పూట కార్యక్రమాలు ముగించారు. తర్వాత విందుభోజనంతో అందరూ సంతృప్తులయ్యారు. ఇంక ఆ తర్వాత రకరకాలైన వినోదాలతో ఆ పూట కార్యక్రమం ముగిసింది.

మరునాడు పూజ్యశ్రీమాస్టరుగారు ఆశ్రమంలో తిరిగి కొన్ని మార్పులు చేర్పులూ, చెయ్యవలసిన నిర్మాణాలను మాతాజీకి, కన్వీనర్‌గారికి, కార్యకర్తలకు వివరించారు. వాటి పర్యవేక్షణ నిమిత్తం తరచుగా ఆశ్రమానికి వస్తుంటానని చెప్పారు. అప్పటికే బాగా అలిసిపోయి ఉండటంచేత రాత్రికి ఒంగోలుకు వచ్చేశారు.

షష్టిపూర్తి మహోత్సవం తరువాత మాస్టరుగారిలో మరల నూతన ఉత్తేజం వచ్చింది. జన్మ శతాబ్ది కార్యక్రమాలనెలా ప్రాచుర్యంలోకి తేవాలనే విషయమై రకరకాల ప్రణాళికలను తయారు చేశారు. విస్తృతంగా ప్రచారం చేయాలనే తపనతో శాంతికుంజ్ వారిచ్చిన నమూనా ప్రకారం జన్మశతాబ్ది ఫ్లెక్సీలను వందల సంఖ్యలో తయారుచేయించారు. ప్రధాన కేంద్రాలలో వాటిని అందరికీ కనపడేలా కట్టమన్నారు. అపూర్వంగా సాధనా శిబిరాలు నిర్వహించారు. చాలా చోట్లకు తిరిగి ప్రచారం చేయటం జరిగింది.

ఇంతలో ఒకసారి శ్రీభక్తిచైతన్యస్వామివారు ఒంగోలుకు వచ్చి మాస్టరుగారిని కలిసి కొన్ని విషయాలను ముచ్చటించి వెళుతూ, వెళుతూ 'మాస్టారూ! మీరు కాస్త నీరసంగా కనిపిస్తున్నారు. ఒకసారి మా ఆశ్రమానికి వచ్చి పది రోజులుండండి, మళ్ళీ మంచి ఆరోగ్యవంతులౌతారు' అని చెప్తూ, నాతో 'వీలైనంత తొందరలో మాస్టారిని తీసుకురామ్మా,' అని చెప్పి వెళ్ళారు.

పూజ్యశ్రీమాస్టర్‌గారి విషయంలో ఏదైనా తక్షణమే జరగాలి కదా! మాస్టారికి పదిరోజులకు సరిపడ బట్టలు, మందులు, అవసరమైన కొన్ని పుస్తకాలు, ల్యాప్‌టాప్ తీసుకొని కార్లో మరునాడు ఉదయం పది గంటలకు 'బీహార్ స్కూల్ ఆఫ్ యోగా' పేరుతో నడుస్తున్న శ్రీభక్తిచైతన్యస్వామిగారి ఆశ్రమానికి చేరడం జరిగింది. ఈ ఆశ్రమం విజయవాడకు ఇవతల తాడేపల్లి అనే ప్రాంతంలో వున్నది.

ఇక్కడ జరిగిన ఒక విచిత్రాన్ని చెప్పాలి. శ్రీ మాస్టర్‌గారి జన్మదిన వేడుకలలో వచ్చిన నూతన వస్త్రాలు, ఇంకా కొన్ని ముఖ్యమైన బహుమతులనన్నింటినీ ఒక జిప్ బ్యాగ్‌లో పెట్టి దానిని కారుపైన వుండే 'క్యారేజ్' మీద అందరి లగేజీలతోపాటు పైన పెట్టించి, వాటి పైన కవర్ వేసి తాళ్ళతో కట్టించాము. ఒంగోలు నుండి 40 కి.మీ. దాటిన తర్వాత ఏదో బ్యాగ్ పడిన శబ్దం వచ్చింది. వెంటనే కారు ఆపించి చూసినా ఎక్కడా ఏమీ కనిపించలేదు. కారు పైకెక్కి చూస్తే మాస్టరుగారి 'బ్యాగ్' కనిపించలేదు. కారు వెనక్కి తిప్పి కొంతదూరం వెళ్ళి చూద్దామనే ఉద్దేశ్యముతో డ్రైవర్‌తో, 'డ్రైవర్ గారూ కారుని కాస్త వెనక్కు తిప్పండని' చెప్తుండగా, పుస్తకం చదువుకుంటూ తల ఎత్తకుండానే మాస్టారు, 'దాని అవసరమున్న వాళ్ళకి అది వెళ్ళిపోయింది' కారును ముందుకు పోనివ్వండని చెప్పి మళ్ళీ చదువుకోవడంలో మునిగిపోయారు. కారులో ఉన్న వాళ్ళందరూ కాసేపు నిర్ఘాంతపోయారు.

ఆ క్షణంలో మరొక సంఘటన గుర్తుకు వచ్చింది. జిల్లెళ్ళమూడి అమ్మ విషయంలో కూడా ఒకసారి ఇలాగే జరిగింది. ఆశ్రమంలోకి కొందరు వ్యక్తులు ప్రవేశించి అమ్మ నగలను, విలువైన కొన్ని వస్తువులను పట్టుకెళ్ళిపోయారుట. విషయం తెలిసిన కొందరు పెద్దలు పోలీసు రిపోర్టు ఇవ్వాలని సమాలోచన చేస్తుండగా అమ్మ వచ్చి 'ఏ రిపోర్టులూ వద్దు, అవి వాడికి అవసరమైనాయి, తీసుకెళ్ళాడు, ఇక ఆ ప్రస్తావనేమీ వద్దు' అంటూ లోపలికి వెళ్ళిపోయారుట. అలా మహనీయుల మనస్సులు వస్తువులపట్ల కాక, వ్యక్తుల పరిస్థితులను గురించి, వాళ్ళ యోగక్షేమాల గురించి మాత్రమే ఆలోచిస్తుంటాయేమో!

'బీహార్ స్కూల్ ఆఫ్ యోగా' వారి ఆశ్రమంలో దాదాపు పదిరోజులుండడం జరిగింది. క్రమశిక్షణకు పెట్టింది పేరు ఈ ఆశ్రమం. శ్రీస్వామివారి ఆశ్రమంలో ప్రతిరోజూ ఉదయాన్నే ఐదు గంటలకు లేవాలి. నియమంగా ఆసనాలు, ప్రాణాయామాలు, యోగనిద్ర ఇంకా ఆహారపుటలవాట్లలో చిన్న చిన్న మార్పులు తెచ్చి, మళ్ళీ మాస్టారి ఆరోగ్యంలో మంచి మార్పులను తీసుకువచ్చారు. అన్నింటికంటే ముఖ్యం, ఆశ్రమం కృష్ణానది ఒడ్డున వుండటంతో ప్రశాంతమైన వాతావరణం, కాలుష్యరహితమైన దివ్యమైన పరిసరాల వలన త్వరలోనే కోలుకున్నారు.

అది కార్తీకమాసం. అక్కడికి దగ్గర్లోనే ఇస్కాన్‌వారి శ్రీకృష్ణమందిరం ఉన్నది. అక్కడ ప్రతిరోజు కార్తీక దామోదర పూజలు, భజనలూ, ప్రవచనాలు జరుగుతాయి. సాయంత్రం వేళల్లో చల్లగాలికి అలా నడుచుకుంటూ ఆ శ్రీకృష్ణమందిరానికి వెళ్ళడంతో మనసుకు చాలా హాయిగా ఉండేది. అలా నియమానుసారంగా రోజువారీ కార్యక్రమాలు జరిగేవి. దాంతో మాస్టర్‌గారి ఆరోగ్యం చాలా మెరుగైంది. మాస్టర్‌గారిలో యథాప్రకారంగా ఉత్సాహం వచ్చేసింది. మళ్ళీ గురుదేవుల జన్మశతాబ్ది కార్యక్రమాలు పునఃప్రారంభమయ్యాయి. అక్కడి నుండి వేరే పనిమీద హైద్రాబాదుకు వెళ్ళారు.

ఒకానొక ప్రవచనంలో మాస్టర్‌గారు నా జీవితంలో ఒక విచిత్రమైన సంఘటన జరిగింది అని ఇలా చెప్పారు: ఈ మధ్య ఒక వ్యక్తి ఫోన్ చేసి 'మాస్టారూ! కొంపలంటుకుపోయాయి. మనం ఒక ఇరవై ఏళ్ళుగా చేసిన వాటినన్నింటినీ వియ్ హావ్ లాస్ట్ అన్నాడు. దటీజ్ ది ఫోన్ కాల్. అది రాత్రి 10:30 గంటలకు వచ్చింది, ఆయన చెప్పింది విన్నాక 'పోయింది కదా, వదిలెయ్' అన్నాను.

ఇంకో గంటన్నర తరువాత మరల ఫోన్ వచ్చింది, 'లాయర్ నోటీస్ ఇప్పిద్దామా మాస్టారూ?' అని. 'నేనేమి చెప్పాను ? –వదిలేయమన్నాను కదా!' అని చెప్పి తరువాత హాయిగా పడుకున్నాను.

వాళ్ళు మళ్ళీ నన్ను నిద్రలేపి,'లాయర్ నోటీస్ ఇద్దామా?' అని మళ్ళీ అడిగారు. 'వద్దమ్మా చెప్పాను కదా! ఫర్‌గెట్ ఇట్' అని పడుకున్నాను. ఐదు గంటలకు మళ్ళీ ఫోను 'మాస్టారూ అందరినీ పిలిచాను. మన వాళ్ళందరూ వున్నారిక్కడ. 'వి విల్ నాట్ స్టాపిట్, ఇటీస్ అవర్స్' అన్నారు. నేను వదిలెయ్యమని చెప్పాను కదా అన్నాను.

'వాళ్ళేమనుకుంటారు మాస్టారూ! మనం చేతకాని వాళ్ళం అనుకుంటారేమో కదండీ' అంటే 'అవును చేతకానివాళ్ళమే, వాళ్ళు ఏమనుకుంటే నాకెందుకు?' అంటే మళ్ళీ ఆయన, '20 ఏళ్ళు కష్టపడి సంపాదించిన సంపద, అందులోను లక్షలాది రూపాయలతో పాటు ఎంతోమంది వ్యక్తుల శ్రమతో కూడినది. ఎలా వదిలెయ్యగలం మాస్టారు?' అన్నాడా వ్యక్తి.

ఇప్పుడు సందర్భం వచ్చింది కనుక చెప్తున్నాను. లేకపోతే నేను ఆ విషయం మర్చిపోయాను, నేను అప్పుడెలా నిర్ణయించగలిగాను? దీనికి మూలం ఏంటి? నేనేం త్యాగధనుణ్ణి మాత్రం కాదు. నాకే బాధా రాలేదని అబద్ధం చెప్పను. నాకూ సంతోషంగా ఏమీ లేదు.

ఆ సమయంలో నాకు వెంకయ్యస్వామి జీవితంలో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. స్వామి ఆశ్రమంలో జరిగిన కొన్ని గొడవల వల్ల కొందరు వ్యక్తులు వచ్చి 'ఇది మాది అన్నారు.' శిష్యులు మాత్రం ఒప్పుకోకుండా స్వామితో మొర పెట్టుకుంటే అప్పుడు వెంకయ్యస్వామి 'వాళ్ళతో గొడవెందుకయ్యా, మనమే పోతే పోలా!' అని అన్నారు. గాట్ ద పాయింట్. అందుకే వదిలివేయ గలిగాను. మీరు చేస్తే మీకూ కచ్చితంగా అలాంటి ఫలితాలే వస్తాయి. మీకు ఆ భావనాత్మక ఉత్కృష్టత లేదు. నాది అని పట్టుకూర్చుంటారు. దాంతోనేగా అన్ని బాధలూ వచ్చేది, వదిలేయగలిగితే గొడవ వదిలిపోతుంది' అని చెప్పారు.

మాస్టారు చెప్పిన ఆ సంఘటన మన జీవితాలకెంతోస్ఫూర్తి దాయకం. మనం కూడా మన మనస్సును అలా మలుచుకోగలిగితే జీవితాలలో ఎంతటి శాంతి వస్తుందో మాటలలో చెప్పలేం. ఇంక అప్పుడు ఎవరితోను స్పర్ధలూ, శతృత్వాలు, కోట్లాటలు అనే మాటలకు ఎక్కడా చోటుండదు గదా! మాస్టారి జీవితం నుండి నేర్చుకోవలసిన సిద్ధాంతాలు ఇవేగదా!

అధ్యాయం-2

క్రొత్త యుగానికి సాధనలు (2009)

6. సిద్ధాశ్రమము

2009 జనవరి మూడో తారీకున పూజ్యశ్రీమాస్టర్‌గారు శ్వేతద్వీపంలో రాత్రి 9:00 గంటలకు కొన్ని ముఖ్యమైన విషయాలను ఇలా చెప్పారు. 'నా స్థూల శరీరం పూర్తిగా చరమాంకానికి వచ్చేసింది. నేను దేశాల మధ్య, ప్రజల మనస్సులలోనూ ఉన్న ద్వేషాలను పోగొట్టి, దూరాలను తగ్గించే పని చెయ్యాలి. రాత్రిళ్ళు నేను ఆ పనిమీద వెళ్ళవలసి ఉంటుంది. పూజ్యగురుదేవుల శరీరాన్ని, మాతాజీ కాపాడినట్లు, మీరు, నా భౌతిక శరీరాన్ని కాపాడాలి. ఎవరో ఒకరు, ఎప్పుడూ నాతో ఉండాలి. అనేక జన్మల నుండి మీతో నాకు అనుబంధం ఉన్నది. అందుకే మీరీ బాధ్యత నిర్వర్తించాలి, అని చెప్పారు.

రెండవ ప్రపంచయుద్ధం చెయ్యటానికి ఒక ఉన్నత ఆధ్యాత్మిక శక్తిని శ్రీ అరవిందులవారు ఎలా ఉపయోగించారో, అదే పద్ధతిలో మాస్టర్‌గారు కూడా అనేక రకాలుగా తమ ఆధ్యాత్మిక శక్తిని ఉపయోగించారు. మానవజాతి ఆధ్యాత్మిక పరిణామానికి పెద్ద ఆటంకముగా వున్న విభజనరేఖలను తొలగించి అఖండభారత నిర్మాణం కావాలనేదే పరమగురువుల ఆకాంక్ష. దానికే వారు శ్రీమాతా మిర్రా, అఖండభారతదేశంతో కలసి ఉన్న చిత్రపటాన్ని ఉపాధిగా ఉంచుకొని తమ పనిని ప్రారంభించారు. ఈ చిత్రపటాన్ని ఇంటింటికీ పంపటం జరిగింది.

పూజ్యశ్రీమాస్టర్‌గారు ఎప్పుడూ ఒక మాట చెప్తుండేవారు. 'నేనెప్పుడూ నా బాధ్యతలను విస్మరించలేదు. నా కుటుంబం పట్ల, నా రక్తసంబంధీకులపట్ల, నా గురుదేవుల పని పట్ల, ఎప్పుడూ నిజాయితీతోనే పనిచేస్తుంటాను. బాధ్యతలను నిర్వహించడమనేది నాకు అన్నిటికన్నా ఎక్కువ సంతోషకరమైన విషయం'. ఈ విషయం వారి జీవితంలో ప్రతిక్షణం ప్రతిబింబిస్తూనే ఉండేది.

వారి నిజమైన తపస్సు అదే! అందుకే 'జన్మశతాబ్ది' సమయం దగ్గరపడుతున్న కొద్ది మాస్టర్‌గారిలో ఏదో చెయ్యాలనే తీవ్రమైన ఆరాటం, చెప్పాలనే తపన ఎక్కువైపోయింది. రోజు ఏదో ఒక నూతన ప్రణాళికను రూపొందిస్తూనే ఉండేవారు.

పూజ్యశ్రీమాస్టర్‌గారు సర్వకాల సర్వావస్థలలోను గురుదేవులతో అనుసంధానమై ఉండేవారు. వారి నుండి దిగుతున్న ఏ సందేశాన్నైనా అత్యంత సరళమైన భాషలో స్పష్టంగా వివరించడం జరిగేది. గురుదేవుల పని పట్ల వారికి గల ప్రేమ అచంచలమైనది, అఖండమైనది. భక్తి శ్రద్ధలతో వారు చేయు సేవ వర్ణనాతీతం. అందులో భాగంగానే వారు మరొక ప్రయోగాన్ని ప్రారంభించారు.

'శ్వేతద్వీపాన్ని'–'సిద్ధాశ్రమం'గా మార్చారు. 2009 జనవరి 8వతేదీ సాయంత్రం ఆరు గంటలకు 'శ్వేతద్వీపాన్ని సిద్ధాశ్రమంగా మారుస్తున్నాను' అని చెప్తూనే దానికి తగిన చిన్నచిన్న ఏర్పాట్లు ఎలా చెయ్యాలో చెప్పారు. తక్షణమే ఆ విషయాన్ని అందరికీ తెలియపరచడం, అందరూ రావడం జరిగిపోయింది. అందరి సమక్షంలో శ్వేతద్వీపాన్ని 'సిద్ధాశ్రమంగా' మార్చారు. 1926 సంవత్సరంలో గురుదేవులు వెలిగించిన అఖండజ్యోతిని మరియు గురుదేవులు ఉపాసించిన గాయత్రీ మాత చిత్రపటాన్ని ప్రతిష్టించారు. వచ్చిన సాధకులందరినీ క్రమశిక్షణతో 'సాధన' చేయడానికి వీలైన పద్ధతిలో కూర్చోమని చెప్పారు.

అందరినీ కళ్ళు మూసుకొని మూడుసార్లు ఓం కారం, గురుప్రార్థన, గాయత్రీమంత్రం మూడుసార్లు చెప్పమన్నారు. ఇంకా మాస్టరుగారు చెప్తున్నారు. '1926 సంవత్సరంలో గురుదేవులు వెలిగించిన అఖండజ్యోతి రాబోతోంది. స్వయంగా గురుదేవులే వెలిగిస్తున్నారు కళ్ళు తెరచిచూడండి' అన్నారు. నిజంగానే వెలిగించారు. ఇది మధురలో గురుదేవులు వెలిగించిన అఖండజ్యోతి. ఈ జ్యోతిని పదిలంగా వందనీయమాతాజీ, గురుదేవులు మధుర నుండి శాంతికుంజ్‌కి వెళ్ళేటప్పుడు కారులో తీసుకెళ్ళారు.

గాయత్రీమంత్రాన్ని మళ్ళీ మూడుసార్లు చెప్పమన్నారు. అసలు విషయం – గురుదేవులు ఉపాసించిన గాయత్రీమాతను, అఖండజ్యోతిని లాప్‌ట్యాప్‌లో చూపించి, ఆ ప్రక్రియ ఇక్కడ, ఇప్పుడు జరుగుతోంది అంటూ భౌతికంగా అఖండజ్యోతిని వెలిగించి, గురుదేవులు ఉపాసించిన గాయత్రీమాత చిత్రపటాన్ని ఆవిష్కరించారు. అదే అఖండజ్యోతిని, గాయత్రీమాతను, మీరిప్పుడు, ఇక్కడ ప్రత్యక్షంగా చూశారు. ఈ విశ్వాసంతోనే మనం సాధనలో ముందుకు వెళ్ళాలి.

మీకిక్కడ తెలియాల్సిన కొన్ని రహస్యాలున్నాయి. సూక్ష్మజగత్తులో కొన్నాళ్ళ నుంచి జరుగుతున్న రహస్య సమాలోచనల వివరాలను ఇవాళ ఇక్కడ చెప్పబోతున్నాను.

హిమాలయాల నుండి సత్యయుగం నాటి ఒక వ్యక్తి వచ్చాడు. ఆయన తల్లి పొడవు 9 అడుగులు ఉన్నది. ఆమె జుట్టు 12 అడుగుల పొడవు ఉన్నది. ఆమె కూడా ఆయనతోనే ఉన్నది. ఇంకా లాహిరీ మహాశయులు, గురువు బాబాజీ, హిమాలయన్ మాస్టర్స్‌వాళ్ళు వచ్చారు. ఆయన ఖేచరీ ముద్రలో నిష్ణాతుడు. ఆ ముద్రను ఆయన తన తల్లికి మాత్రమే చూపించారట. ఆ ఖేచరీముద్రను 2008 డిసెంబరు 31వ తేదీ రాత్రి నాకూ చూపించారు. ఖేచరీ ముద్రలోనే యోగులైన పిల్లలు పుడతారు.

ఒక మహానుభావుడు ఈ కుటుంబంలో పుట్టాడు. వ్యక్తులు నచ్చక వెళ్ళిపోతాను అని చెప్పి శరీరం వదిలేశాడు. (పాఠకులకు దీనిని గురించి కొంచెం వివరించాలి. పరివార్ కుటుంబంలోని అమ్మాయికి, మాస్టర్‌గారి సమక్షంలో ఒక మంచి సంస్కారం భక్తి భావాలు గల ఇంటి అబ్బాయితో వివాహం జరిగింది. వివాహం అయిన కొన్నాళ్ళకి అమ్మాయి గర్భవతి అయింది. మాస్టర్‌గారి నుంచి పుష్కలంగా ఆశీర్వాదాలు పొందారా దంపతులు. ఒక శుభముహూర్తంలో, అదీ ఒక మహనీయుడు జన్మించిన శుభలగ్నంలో చక్కటి మగశిశువుకు జన్మనిచ్చింది ఆ అమ్మాయి. పుట్టిన బిడ్డకి ఏడుపులేదు. పిల్లల డాక్టర్లకు చూపించారు. డాక్టర్లు ఎంతో ప్రయత్నించినా మూడు రోజులు మృత్యువుతో పోరాడి ఆ బిడ్డ ఈ భూమిని వదలి వెళ్ళిపోయాడు. బిడ్డ పుట్టిన క్షణం నుండి పరిస్థితిని తెలుసుకుంటున్న మాస్టర్‌గారు ఆ శిశువును, ఈ భూమ్మీద ఉంచటానికి విశ్వ ప్రయత్నం చేశారు. కానీ ఆ బిడ్డ 'ఆ కుటుంబంలోని వ్యక్తులు నాకు నచ్చలేదు. పరమగురువులు కొన్ని కుటుంబాలనుద్ధరించటానికి నన్ను పంపారు. కానీ నేను ఆ కుటుంబంలో జీవిస్తూ నేను వచ్చిన ఆ పనిచేయలేను. ఇంకో రూపంలోకి వచ్చి చేస్తాను. ఇప్పటికింక వెళ్ళిపోవాల్సిందే!' అని వెళ్ళిపోయాడు.) ఆ సంఘటనను ఒక్క వాక్యంలో చెప్పారు మాస్టర్‌గారు.

ముందురోజు రాత్రి రెండో ఆట 'కింగ్' సినిమా చూశారు మాస్టర్‌గారు. దానిని గురించి చక్కటి వివరణ చెప్పారు. ఇక్కడ 'సిద్ధాశ్రమాన్ని' వసంతపంచమికి పెడదాం అనుకున్నారు. కానీ రాత్రి కింగ్ సినిమా చూశాక లెంపలు వేసుకున్నాను. (ఆ సినిమా ద్వారా పరమగురువుల సందేశం ఏదో అంది వుంటుంది, అడిగినా చెప్పరు. వారు చెప్తున్న విషయాన్ని సందర్భాన్ని బట్టి మనం

సమన్వయం చేసుకోవాలి, మాస్టర్‌గారు ముందుగా ఏదైనా ఒక పనిని చేసినా, ఆ తరువాత సందర్భం వచ్చినప్పుడు దాని గురించి వివరిస్తారు.) సినిమా నాకు సందేశాన్ని చెప్పింది. తక్షణ కర్తవ్యమేమిటో నాకర్థమైంది అని చెప్తూ ఇంక ఆ ప్రస్తావనను అక్కడితో ఆపేసి మళ్ళీ పరమగురువుల ప్రణాళికల గురించి కొనసాగించారు.

సిద్ధాశ్రమాన్ని చూపించమని గురుదేవుల నడిగితే చూపించలేదు. మొన్నీమధ్యనే చూపించారు. అక్కడికి వెళ్ళినప్పుడు, వాళ్ళు నాకు చెప్పిన విషయాలను 'యాజ్‌ఇటీజ్‌గా(ఉన్నది ఉన్నట్లుగా)' మీకు చెప్తున్నాను. గురువుల పనులు చెయ్యండి. కుటుంబాలు, పిల్లలు, బాధ్యతలు అవి ఎన్నో జన్మల నుండి వుంటూనే వున్నాయి. కాలం యొక్క అవసరం గురించి చెప్తున్నాను. పన్లు చెయ్యండి. వాటి వల్ల వచ్చేలాభం ఇంత అని చెప్పలేం.

హిమాలయాల నుంచి వచ్చిన ఆ మహాత్ములు నాకు చక్కని ఆఫర్లు ఇచ్చారు. 1) సిద్ధాశ్రమాన్ని స్థాపించటం కోసం వారు హిమాలయాలలో నాకు ఐదువేల చదరపు గజాల స్థలాన్ని ఇచ్చారు. కాని నేను ఒంగోలుకు వెళ్తానని వచ్చేశాను. ఈ శరీరం పనిచేయాలంటే నాకు చాలా మంది సహాయం కావాలి. పడిపోయి వున్నాను, లిటరల్‌గా పడిపోయి వున్నాను. నన్ను సరిచేయటానికి బంధుత్వం అవసరం వుంది. మీకు తెలిసినా, తెలియకపోయినా నాకు తెలుసు. ఎవరికి, ఎవరితో ఎలాంటి సంబంధాలున్నాయో, గీతలో భగవాన్ చెప్పిన 'బహూనిమే వ్యతీతాని జన్మాని తవచార్జునా' అన్నది, నా వరకు అది అక్షర సత్యం. ఆ అనుబంధం వుండే దగ్గరే నేను ఉండాలి.

సిద్ధాశ్రమం - పరిచయం:

సిద్ధాశ్రమం హిమాలయాలలో రహస్యంగా ఉన్న ప్రదేశం. అక్కడ ఎందరో దీర్ఘకాల జీవులైన మహనీయులు వున్నారు. విశ్వామిత్రుడు తపస్సు చేసి గాయత్రీమంత్ర సిద్ధిని పొంది బ్రహ్మర్షి అయినది ఈ ఆశ్రమంలోనే! బాబాజీ ఇక్కడికి వచ్చి తన గురువు ఉపదేశించిన మార్గంలో పదునెనిమిది నెలలు ఏకాంతంగా కఠోరతపస్సు చేసి సంపూర్ణ సిద్ధత్వాన్ని పొందాడు. అప్పుడాయన శరీరం బంగారు రంగుతో ప్రకాశిస్తుండగా ఆయన నిత్యయవ్వనుడుగా, అమరుడుగా మారిపోయారు. ఈ సిద్ధాశ్రమంలో మహాపురుషులెందరో జపిస్తూ, లోకంలో అవసరమైన రీతిలో తమ శక్తిని ప్రసరింప చేస్తూ ఉంటారు. వారిలో కొందరు, యోగ్యులైన సాధకులకు మార్గదర్శనం చేస్తూ

ధ్యానాలలో, స్వప్నాలలో దర్శనమిస్తూ సాధనలో ముందుకు నడిపిస్తుంటారు. మరికొందరు ఉత్తమ సంస్కారములు కల కొందరు వ్యక్తులలో ప్రవేశించి, శరీరంలో ఉండి వారిచే మహత్కార్యాలను చేయించి తిరిగి వెళ్ళిపోతుంటారు. అబ్రహాంలింకన్, మహాత్మాగాంధీగార్లు ఈ కోవకు చెందిన వారని కొందరి అభిప్రాయం. భారతదేశ స్వాతంత్ర్యం కోసం దైవచైతన్యం కలిగించడం కోసం ఉదయించిన సిద్ధాశ్రమయోగులే మహాత్మాగాంధీ, రమణమహర్షి, అరవిందయోగి, మొదలైనవారు. దేవరహబాబా వారి కృప వలన ద్వాపరయుగం నాటి అనేకమంది మహాత్ముల దర్శన భాగ్యం కలిగిందని ఆనందమయీ మాత చెప్పారు. కావ్యకంఠగణపతి ముని కూడా అలాంటివారే! ఇటీవలి కాలంలో సిద్ధాశ్రమంతో అనుబంధం కలిగిన వ్యక్తులు స్వామివిశుద్ధానంద, నారాయణదత్త శ్రీమాలి, దివ్యజ్ఞానసమాజ స్థాపకురాలు మేడం బ్లావెట్‌స్కీ, శ్రీసిద్ధేశ్వరానందభారతీస్వామి మొదలైనవారు – హిమాలయాలలోని ఆ రహస్యప్రదేశానికి తామూ వెళ్ళి వచ్చామని ఉద్ఘాటించారు.

'సిద్ధాశ్రమం' రావడం చాలా విచిత్రం. అది చాలా సోలార్ సిస్టమ్స్ వెనుక వున్నది. దాని ప్రతిబింబం ఇక్కడ వున్నది. ఆ సిద్ధాశ్రమానికి కావలసిన శక్తిధారలు ఇక్కడికి వస్తున్నాయి. ఈ సి.డి.ని అందరికీ వినిపించండి. ఇక్కడి నుండి ఇక కదలను. అంతరాష్ట్రీయంగా మాత్రమే (ఇంటర్నేషనల్‌గా) వెళతాను. హిమాలయన్ మాస్టర్ చెప్పారు, ఇక్కడికి రోగాలతో వచ్చిన వారు ఆరోగ్యవంతులై వెళ్ళాలి. దానికి కొన్ని 'టెక్నిక్స్' చెప్పారు. అందుకోసం ఇక్కడ 'సిద్ధాశ్రమం' పెడుతున్నాను. నేను ఇదివరలో చెప్పిన '**ఓం సాయి వేంకటేశ శ్రీరాం ఓం**' అనే మంత్రం చాలా ముఖ్యం ఇక్కడ. చాలా చురుగ్గా, వేగంగా, పనిచేసే సాధకులకు మాత్రమే క్లాసులు పెడతాను. ఇప్పుడు నేను చెప్తున్నది 'మాకు తెలుసు' అనుకుంటారు. మాటల గురించి అందరికీ తెలుసు. అనేక రకాలుగా ఉంటుంది దాని పనితీరు. మీరూహించలేరు. అలానే నేను చెప్పే విధానం కూడా చాలా విశేషంగానే వుంటుంది.

'సిద్ధాశ్రమం' నుంచి వచ్చే సాధనలన్నీ ఇక్కడ నుండి ప్రారంభమౌతాయి. ప్రారంభం మాత్రం ఇక్కడ్నుంచే. (ఈ మాట రెండు సార్లు అన్నారు) కానీ ఇంటర్నేషనల్‌గా వెళ్ళిపోతుందీ విషయం. ఈ జన్మలో నా తల్లి ఇక్కడ వుంది. ఆమె ఎవరో మీకెందుకు? ఇక్కడ వుండే హక్కు నాకుంది. హిమాలయాల నుంచి, ధృవ నక్షత్రం నుంచి ఆ శక్తిధారలు వస్తున్నాయి. చాలా అద్భుతాలు, చమత్కారాలు జరుగుతాయి. దానికి మాస్టర్‌గారు ఇచ్చిన చిహ్నము 'శంఖం'. దీనికంతటికీ

శంఖనాదం ముఖ్యం అంటూ శంఖనాదాన్ని ప్లే చెయ్యమన్నారు. ఆ నాదం మొదలైపోయింది.

'సిద్ధాశ్రమం'లో మూడు రకాల వ్యక్తులుంటారు.

1) ఆకృతి – నిర్మాణాలన్నీ బ్రహ్మ చేస్తాడు

2) సాధన – విష్ణు–అందరికీ అందించేవాడు

3) శివసాధన – శివతాండవం

శివతత్త్వంలో ఉత్సాహవంతులైన సాధకులుంటారు. అందుకే శివతాండవం అందరూ నేర్చుకోవాలి. అందరికీ నేర్పించాలి కూడా. దీనితో అనేక విపత్తులను ఆపవచ్చు. ఇక్కడ మీకూ తెల్సిన విషయమే, కొందరు టెర్రరిస్టుల వలన బాంబే, తాజ్ ఒబేరాలో బాంబు పేలుళ్ళు, కాల్పులు జరిగాయి. **ఆ పేలుళ్ళను ఆపిన సంఘటన ఇక్కడే జరిగింది.** ఈ సందర్భాన్ని గురించి పాఠకులకు కొంత వివరణ ఇవ్వాలి. ఆ బాంబు దాడి జరిగిన రోజు రాత్రి శ్వేతద్వీపంలో తెల్లవార్లూ మాస్టర్‌గారు టి.వి.చూస్తూనే వున్నారు. చాలా నిశితంగా తదేక దీక్షతో చాలా మౌనంగా చూస్తూ కూర్చున్నారు. కొన్ని గంటల తర్వాత ఆ ఆపరేషన్ ఒక కొలిక్కి వచ్చింది. మాస్టర్‌గారు కూడా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. తరువాత దాని మీద ఏ విధమైన వివరణ చెప్పలేదు. కానీ ఏదో జరిగివుంటుందని మాత్రం అర్థమైంది. ఎందుకంటే విషమిస్తుందనుకున్న పరిస్థితి చాలా విచిత్రంగా అతి త్వరలోనే అదుపులోనికి వచ్చిందంటే అక్కడేదో చమత్కారం జరిగిందనేగా అర్థం. ప్రస్తుత పరిస్థితులలో మనం ఉన్న చోటనే ఉండి, ఎవరితో కావాలంటే వారితో ప్రపంచంలో ఎక్కడికైనా మాట్లాడవచ్చు. సంజయుడు ఉన్నచోటే ఉండి కురుక్షేత్రాన్ని చూడగలిగాడు. బాంబేలో జరిగిన టెర్రరిజం అక్కడున్న వాళ్ళకు కొంతే తెలుస్తుంది. కానీ సాంకేతికత అభివృద్ధి చెందడం వల్ల ఇంట్లో కూర్చుని టి.వీలలో దానిని దేశంలో అందరూ స్పష్టంగా చూడగలిగారు.

ఎలాంటి ఆపదలనైనా మహాత్ములు తాము ఉన్నచోట నుండే వాటిని ఆపగలరు. వాళ్ళకు ఎలాంటి ఎల్లలు వుండవు. సాయిబాబా చరిత్రలో చదువుతాం గదా ! అగ్నిలో పడుతున్న పాపను బాబా చెయ్యి అడ్డంపెట్టి ఆపారు గదా! ఇదీ అలాగే. మానవజీవితంలో వేగం పెరిగింది. కానీ చాలామంది దానిని అందుకునే స్థితిలో లేరు.

నేను నా పనిని ఆపను, ఎట్టి పరిస్థితులలోను నేను, నాపనిని ఆపను. ఇక్కడ నుంచి కదలను, కదలను. ఒకవేళ వెళ్ళవలసి వచ్చినా ఆపే ప్రయత్నం మీరు చెయ్యాలి. ఇంక ఎలా జరుగుతుందో చూడాలి. ఆ తరువాత నుంచి క్రాంతిధర్మీ సాహిత్యంలో 20వ పుస్తకం 'సమయదానమే యుగధర్మం' మీద క్లాసులు ప్రారంభించారు.

7. చమత్కారసిద్ధి సాధనా శిబిరం

'అష్టసిద్ధి నవనిధికే దాతా సబ్ సమర్థ గాయత్రీమాతా' అని చాలీసాలో ఉన్నది గదా! ప్రతివారి జీవితంలో అష్టసిద్ధి, నవనిధులనేవి రావాలనేది మాస్టర్‌గారి కోరిక. **అయితే ఇక్కడ నిధి అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు. నిధి అంటే జ్ఞానం – జ్ఞాన నిధి అనే మాట చాలా మంది విషయంలో వాడుతుంటాము. మానవుని మెదడులో వున్న ఆ జ్ఞానమే నిధి. దీనిని ఉపయోగించుకోవడాన్నే సిద్ధి అంటారు. అది సాధించిన వ్యక్తి ఈ సంపూర్ణ విశ్వాన్ని శాసించగలుగుతాడు. అలాంటి అష్టసిద్ధులు, నవనిధులు రావాలంటే ఆ జ్ఞానం మనకు రావాలి. అది రావాలంటే మనం ఆ విద్య వచ్చిన గురువుల దగ్గరే నేర్చుకోవాలి.**

దీనిని నేర్పించడానికి మాస్టర్‌గారు క్లాసులు పెడతానన్నారు. ఒక రోజున మాస్టర్‌గారు **ఈ జ్ఞానం ఈ మధ్యే నాకు అర్థమైంది, ఋషుల దర్శనం వలన' అన్నారు.** ఆ జ్ఞానాన్ని అందరికీ పంచేందుకే సంక్రాంతి పండుగకు మూడు రోజులు క్లాసులు ఏర్పాటు చెయ్యమన్నారు. ఎందుకంటే పండుగలకు ఆ సాధనా విశిష్టత వుంటుంది. ఈ మూడు రోజుల సాధనలో కనీసం మీకు ఒక్క సిద్ధి అయినా రావాలి. అలా ఒక్కొక్క సిద్ధిని మీరు నేర్చుకుంటూ మరొక పది మందికి నేర్పాలి. అష్టసిద్ధి సాధన మీకు వచ్చిందీ అంటే మీరు ఏది అనుకుంటే అది జరిగిపోతుంది.

పూజ్యమాస్టర్‌గారి ఆదేశాల ప్రకారం 'గోల్డు, సిల్వర్ మర్చంట్స్ అసోసియేషన్' వారి కళ్యాణ మంటపంలో జనవరి 13, 14, 15 తేదీలలో 'చమత్కార సిద్ధి సాధనాశిబిరం' ఏర్పాటు చేయబడింది. సంక్రాంతి రోజులైనప్పటికీ అన్ని ప్రాంతాల నుండి అత్యుత్సాహంతో దాదాపు 120 మంది సాధకులు వచ్చేశారు. ఈ శిబిరంలో పూజ్యగురుదేవులు ఉపాసించిన గాయత్రీ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత అఖండజ్యోతిని వెలిగించి, అఖండ జపాన్ని ప్రారంభించి శిబిరం ఉన్నన్ని రోజులు అక్కడ జపం జరిగే పద్ధతిని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ప్రధానంగా నాలుగు దిక్కుల

వివరాలు, ఆ దిక్కుల నుండి వచ్చే శక్తిధారలు, వాటి ప్రభావం మానవజాతిపైన ఎలా వుంటుందో చెప్తూ, ఆ శక్తిధారలను ఉపయోగించుకుంటే 1. సంపదలు ఎలా వస్తాయి 2. వాక్‌శక్తిని ఎలా ఉపయోగించుకోవాలి. 3. పంచతత్వాలు – వాటి నియమాలు. వాటినెలా ఉపయోగించుకోవాలి, దాని కోసం ఎటువంటి సాధనలు చెయ్యాలి అనేది నేర్పించారు. దీనితో పాటుగా క్రాంతిధర్మీ సాహిత్యంలోని 20వ పుస్తకం 'సమయదానమే యుగధర్మం' గురించి అద్భుతంగా వివరించారు. ఆచరణయోగ్యమైన కొన్ని అంశాలను ఇలా చెప్పారు.....

1. అందరూ కలిసి భోజనం చెయ్యాలి.
2. ఉత్తరపు దిక్కున తల పెట్టి నిద్రించరాదు. దీని వలన సంపదలను అడ్డగించినట్లే అవుతుంది.
3. నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని ఎవరికి వారే పెంచుకోవాలి. దీనికి ప్రాణాయామాలు ఎంతో ఉపకరిస్తాయి.
4. కాలాన్ని సద్వినియోగం చేసుకోండి అని చెప్తూ దానికి 8 పాయింట్లు చెప్పారు

   బ్రహ్మ – కమండలం మరియు వేదాలు.

   విష్ణువు – శంఖం, చక్రం, గద మరియు పద్మం.

   శివుడు – త్రిశూలం, డమరుకములను ఉపయోగించుకోవాలి.

కాలాన్ని సద్వినియోగం చేసుకోటానికి ఈ ఎనిమిది అద్భుతమైన ఆయుధాలుగా వివరించారు. ఈ ఎనిమిది ఆయుధాల ప్రయోగాలను అనేక ప్రవచనాలలో స్పష్టంగా చెప్పారు కనుక ఇక్కడ వాటి వివరణను ఇవ్వటం లేదు. ముఖ్యంగా సాధనంతా అయిపోయాక ప్రతిరోజూ చివరి ఘట్టంలో శివతాండవస్తోత్రం సి.డి.ని ప్లే చేసి అందరిచేతా నృత్యం చేయించేవారు. అమిత ఉత్సాహంతో అందరితో పాటుగా మాస్టరుగారు కూడా ఎంతో అందంగా, లయబద్ధంగా చక్కగా అడుగులు వేసేవారు. ఏది చేసినా 'యోగః కర్మసు కౌశలం' అన్నట్లుగా, ఆయనకు, ఆయనే సాటిగా పని చేసేవారు.

ఈ శివతాండవ స్తోత్రాన్ని రావణుడు రచించాడు. రావణుడే స్వయంగా రాముడికి వాగ్దానం చేశాడు. నేను తప్పుచేశాను, ఈసారి జన్మలో నీకు, నేను సహకరిస్తాను అని. అదీ ఈ

శివతాండవస్తోత్రం. ప్రతిరోజూ సాయంత్రం పూట లేదా నిద్రపోయే ముందు ఈ స్తోత్రాన్ని విని నిద్రపోతే చాలా మంచిది. దీనిని వినడం వలన అనేక ప్రారబ్ధకర్మలు తొలగిపోతాయి.

ఆ తరువాత ఇలాగే ఓడరేవులోను, గాయత్రీ శక్తిపీఠం, నారాకోడూరులోను మూడేసి రోజుల సాధనా శిబిరాలను పెట్టారు. **వీటన్నింటినీ పెట్టడంలో వారి ఏకైక లక్ష్యం గురుదేవుల జన్మశతాబ్ది నాటికి సమయదానం, అంశదానం, ప్రతిభాదానం ఇచ్చే కార్యకర్తలను లక్షల సంఖ్యలో సంఘటిత పరచాలి. సాధకులను తయారుచెయ్యాలి. గురుదేవుల క్రాంతిధర్మ సాహిత్యాన్ని** అధ్యయనం చెయ్యాలి. అందులోని సాధనలు అందరికీ నేర్పించి వారితో ఆచరింపచేయాలనే ధ్యేయంతో ఈ సాధనాశిబిరాలు పెట్టారు.

అంతేకాకుండా గాయత్రీతీర్థ్, శాంతికుంజ్‌వారు 2009 సంవత్సరాన్ని విద్యావిస్తార సంవత్సరంగా ప్రకటించారు. ఈ సంవత్సరం అంతా సంవేదనాశీలురైన కార్యకర్తలు యావన్మందీ గురుదేవుల జ్ఞానాన్ని ఇంటింటా సుప్రతిష్టితం చెయ్యాలి. అందరికీ అందుబాటులో వుండే ఆ జ్ఞానానికి నిధి 'యుగశక్తి గాయత్రి' మాసపత్రిక. అందులో ఏ నెలకానెల-వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన వ్యాసాలు, ఆర్థిక పరిస్థితుల వివరణ, ఇంకా గురుదేవులిచ్చిన సరళమైన సాధనలు విపులంగా, అందమైన తెలుగుభాషలో అందించటం జరుగుతున్నది. దానిని అందరూ చదవాలనేదే వారి కోరిక.

ఈ సంవత్సరం 'యుగశక్తి' చందాదారులు సంఖ్య 24000 పూర్తి కావాలి. 24000×5 మంది చదివితే గురుదేవుల లక్ష్యం - లక్ష పూర్తౌతుంది. లక్ష అంటే క్వాలిటీ. లక్ష్యానికి సంబంధించినది. ఆ మధ్య ఒకసారి రథసప్తమి నాడు ఇచ్చిన ప్రవచనంలో ఒక అస్త్ర ప్రయోగాన్ని గురించి వివరించారు. 'యుగశక్తి గాయత్రి మాసపత్రిక' చందాదారుల పాఠకుల సంఖ్య ఒక లక్షకు చేరుకుంటే అది అస్త్ర ప్రయోగమే. బ్రహ్మాస్త్ర ప్రయోగమౌతుంది. యుగశక్తి చదివినప్పుడు ఏ వ్యాసమును చదివినా అది అస్త్రప్రయోగమే అవుతుంది. ఈ పని చాలా చిన్నది. మనం సినిమాకు ఖర్చు పెట్టే మూడు గంటల సమయము దానికి అయ్యే ఖర్చు రు. 100/-లతో గురుదేవుల పనితో మనం లింకప్ అయిపోవచ్చు. ఈ సమయాన్ని కాలస్వరూపంగా గుర్తించి, మహాకాలుని పనికి తోడ్పడండి అని ప్రతి ప్రవచనంలోనూ చెప్పేవారు.

ఓడరేవులో ఆ వసంత పంచమికి నిర్వహించిన సాధనా శిబిరం గొప్ప ఆధ్యాత్మిక వారసత్వానికి కాంతి కిరణంగా నిలిచిపోయింది.

8. యుగచేతనా అవతరణ - శిరిడి

యుగచేతనా అవతరణ, గాయత్రీ సాధనా మహా అభియాన్ 2009 జనవరి 10వ తేదీ నుండి 18వ తేదీ వరకు శ్రీ గాయత్రీనగర్, సావళీవిహార్, శిరిడీలో జరిగింది. ఇందులో 2400 మంది నైష్టిక యుగసాధకులతో తొమ్మిది రోజులపాటు సామూహిక గాయత్రీ సాధనా మహా అభియాన్ అనే పేరుతో గాయత్రీ అనుష్ఠానం జరుగుతున్నది. 'యుగచేతనా అవతరణ'కు గాయత్రీ సాధనా మహాఅభియానాన్ని, గాయత్రీ సాధనా అనుష్ఠానమును మరియు చేతనా జాగరణ అనే శిబిరంతో పాటు, ప్రతిరోజూ 301 కుండీలతో గాయత్రీ మహాయజ్ఞం, విశేషాహుతులతో శిరిడీలో జరుగుతున్నది. జనవరి 18వ తేదీన పూర్ణాహుతి చేస్తారు. ఇదంతా గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్‌వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నది. ఈ మహాయజ్ఞానికి రమ్మని పూజ్యశ్రీ గౌడ్‌జీగారు మాస్టరుగారికి ఆహ్వానం చెప్పారు. ఆ మెసేజ్ చూసి, మాస్టరుగారు నేను వెళ్ళితీరాలి. టిక్కెట్లు బుక్ చెయ్యండని చెప్పారు.

ఈ మహాయజ్ఞానికి వెళ్ళాలనే సంకల్పంతో చమత్కారసిద్ధి సాధనా శిబిరాన్ని 15వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకే ముగించారు మాస్టర్‌గారు. భోజనాలు అయిపోగానే శ్రీరంగనాథ్‌గారు కారులో మాస్టరుగారిని, నన్ను, చందనను తీసుకొని శిరిడీకి బయల్దేరారు. రాత్రికల్లా శిరిడీ చేరాము. అప్పుడు కిశోర్ అక్కడ పని చేస్తుండేవారు. వారు కూడా వచ్చి కలిశారు.

మర్నాడు ఉదయమే యజ్ఞశాలకు చేరుకున్నాము. ఎటు చూచినా శాంతికుంజ్ వాతావరణం అనుభవమౌతున్నది. అద్భుతమైన శాంతికుంజ్ నిర్మాణం జరిగింది. వేలాదిమంది భక్తులు ఈ 'విరాట్ మహాపర్వంలో' పాల్గొనడానికి వచ్చారు. మాస్టర్‌గారిని దూరం నుండి చూస్తూనే శ్రీగౌడ్‌జీ గారు, శ్రీ వీరేశ్వరోపాధ్యాయగారు తమ హర్షాన్ని వ్యక్తపరచారు. ఆనందంతో అభిమానపూర్వకంగా ఆలింగనం చేసుకొని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. 18వ తేదీ పూర్ణాహుతి మహాయజ్ఞము.

వేదిక పైకి శ్రీగౌడ్‌జీ మరియు శ్రీ వీరేశ్వరోపాధ్యాయగారితో పాటు మాస్టర్‌గారిని కూడా సగౌరంగా ఆహ్వానించారు. మాస్టర్‌గారు కూడా హిందీలో చక్కటి ప్రేరణాత్మకమైన సందేశాన్ని,

ఆనాటి కార్యక్రమం యొక్క విశిష్టతను, ఈ సాధనాశిబిరం యొక్క ప్రత్యేకతను అర్థవంతంగా వివరించారు.

ఈ మహాయజ్ఞంలో వాతావరణ కాలుష్యనివారణతోపాటుగా పృథ్వి, అంతరిక్షం, సూర్య, చంద్ర, నక్షత్రములకు, ఓషధులకు, వృక్ష, వనస్పతులకు, పర్యావరణ పరిశోధనకు మరియు రాష్ట్ర సమృద్ధికి యజుర్వేద మంత్రాలు వైదిక, గాంధార విలంబిత్, స్వరంతో యజ్ఞభగవానునికి ఆహుతుల నిచ్చారు. సమర్థసద్గురు శ్రీ శిరిడీ సాయినాథునికి కూడా సాయి గాయత్రీ మంత్రంతో ఆహుతులు వేశారు.

9. సాయి గాయత్రి

ఓం శిరిడీ సాయి విద్మహే, సచ్చిదానందాయ ధీమహి, తన్నో సాయి ప్రచోదయాత్ –
స్వాహా, ఇదం సాయినాథాయ ఇదం నమమ ॥

అనంతరం 'అత్యంత శక్తివంతమైన మౌన తాంత్రిక ఆహుతులు' వేశారు. చివరగా పూర్ణాహుతి జరిగింది. ప్రసాదం స్వీకరించి యజ్ఞశాలను చూడటానికి వెళ్ళాము. యజ్ఞశాల నిర్మాణం మొత్తం పసుపురంగుతోనే ఏర్పాటు చేయబడింది. షామియానాలు పసుపురంగు, కలశాలు పసుపురంగు, కూర్చోటానికి వేసిన పీటలు, పరదా పట్టాల్లాంటి తివాచీలు పసుపురంగు, వేదిక మీద పరచిన ప్రతి అలంకరణ అంతా పవిత్రమైన పసుపురంగుతో నిండిపోయింది. ఎన్ని వేలమంది వచ్చినా నిశ్శబ్దం పాటించారు. దాంతో పాటు పరిశుభ్రతగా కూడా ఉంది. ఎక్కడా చిన్న ఆకు, కాయితం ముక్క కూడా కనిపించని స్వచ్ఛ వాతావరణం. నిజంగా ఈ శిబిరంలో 'పృథ్విపై స్వర్గావతరణ' జరిగిందనిపించింది. యజ్ఞపూర్ణాహుతి అయ్యాక శ్రీగౌడ్‌జీగారు, పూజ్యశ్రీ మాస్టారికి యజ్ఞ ప్రసాదంగా కలశంపై వుంచిన నారికేళాన్ని మరియు తులసి మొక్కను ఇచ్చి తమ స్నేహసమ్మానాలను ప్రకటించారు. మాస్టరుగారు ఆ కార్యక్రమానికి వచ్చినందుకు వారెంతో సంతోషించారు.

ఆ రోజు సాయంత్రం శిరిడీకి వెళ్ళి సాయినాథుని దర్శించుకొని, రాత్రి శిరిడీలోనే నిద్ర చేసి, ఉదయాన ఒంగోలుకు బయల్దేరాము. కారులో వస్తున్నప్పుడు శిరిడీలో తమకు అనుభవమైన కొన్ని విషయాలను ఇలా చెప్పారు. "ఈనాడు పుట్టిన ప్రతి మానవునికి – (1) తండ్రి – గురువు, తల్లి – గాయత్రీమాతయే. మనువు, శ్రద్ధలు మానవజాతికి ఆధారం. అక్కడి నుంచే నూతన

వ్యక్తిత్వాలు వస్తున్నాయి. కర్మసిద్ధాంతం ప్రకారం ప్రారబ్ధ, సంచిత, ఆగామి కర్మలను లయం చేశారు. 'కర్మ'లను తుడిచేశారు. శివతాండవ స్తోత్రం దీనికి చాలా బాగా ఉపకరిస్తుంది. ప్రతిరోజు సాయంత్రం కానీ లేదా పడుకున్నప్పుడు కానీ తప్పక విని తీరాలి.

ఈనాడు ఫలితాలు ఎప్పటికప్పుడే వస్తున్నాయి. 'నా' కర్మ అనేది పోయింది. దమ్ముంటే గురువుల పనికి ఎంత సమయం ఇవ్వగలిగితే అంత ఇచ్చేయండి. **ఇక్కడ గురువులు నాకు ఇంకా ఏం చెప్పారంటే ఇది చెయ్యి, అది చెయ్యి అని ఇతరులకి ఆర్డరు చెయ్యవద్దు. ఏది చెప్పినా సమూహంలోనే చెప్పాలని చెప్పారు.** చాలామంది **గురువులు ఈ భూమ్మీదనే, ఇక్కడనే ఉన్నారు. దేవర్షినారదుడు నూతన లోకాన్ని తయారుచేశారు. ఇలాంటివే ఇంకా ఎన్నో రహస్యాలు చెప్పారు పరమ గురువులు. అదంతా ఎలా చెయ్యాలని నేను వారిని అడిగితే 'గురువులకు సమర్పణ చేసుకొమ్మని' చెప్పారు. అందుకోసమై శిరిడీలో జరిగిన యజ్ఞంలో నేను ఒక విశేష దీక్ష తీసుకున్నాను.**

ఏ గురువుకైనా సర్వ సమర్పణ చెయ్యడం చాలా ముఖ్యం. సాధకుడు తన ఐదు శరీరాలను సమర్పణ చేసుకోవాలి. అయితే నాకు స్థూల, సూక్ష్మ, మనోమయ శరీరాలు తెలుసు. మిగిలిన రెండు శరీరాల విషయం నాకు తెలియవు అన్నాను. దానికి వారు సమయం వచ్చినప్పుడు అన్నీ, అవే తెలుస్తాయిలే అని అన్నారు. కానీ ఆ సాయంత్రమే శ్రీ అరవిందులవారి బుక్ చదువుతున్నాను. అందులో ఐదు శరీరాలు సమర్పణ ఎలా చెయ్యాలో దొరికింది. అంతే ఇంక పాత జీవితానికి తిలోదకాలు ఇచ్చేశాను. పూజ్యగురుదేవులకి నా ఐదు శరీరాలను తక్షణమే సమర్పణ చేసుకున్నాను" అని చెప్పారు. ఇదే సమర్పణ దీక్ష. దీనిని ఇంకొక ఐదు మందికి మాస్టరుగారు ఇచ్చారు. "ఇంకో విషయం – శిరిడీలో హనుమంతుడు – మనఃస్థితి మారిన వాళ్ళను పట్టుకోవాలే తప్ప, మనస్సును మార్చటానికి ప్రయత్నం చెయ్యవద్దు" అని నాకు చెప్పారు. నేను చెప్పినది మీకు అర్థమైతే నా స్పీడ్‌ను బట్టి మీరూ నాతో ప్రవర్తించాలి. పనిచెయ్యాలి. ఈ క్షణం నుండి నేను హిమాలయాలకు అంకితమయ్యాను. ఇక నా పనిని అటువైపు నుండే చేసుకుంటాను అని చెప్పారు.

10. మహాసత్రయాగానికి బీజారోపణ

అది 2009వ సంవత్సరం ఫిబ్రవరి 9వ తేదీ, మాఘ పూర్ణిమ పర్వదినము. ఈ పర్వమును పురస్కరించుకొని శ్రీరామ-హంస-సహ్యాద్రి ఆశ్రమము, ఓడరేవులో మాస్టర్‌గారు త్రిదివశీయ

సాధనాశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఆ రోజు ఉదయం గం. 7:30లకు మహబూబ్‌నగర్ జిల్లా, మిట్టదొడ్డి గ్రామము నుండి శ్రీమతి సుమాపటేల్‌గారికి పరిచయమున్న ఒక సాధకుడు శ్రీమాస్టర్ గారిని కలవాలని వచ్చారు. మిట్టదొడ్డి ప్రాంతంలో వారిని 'మిట్టదొడ్డి స్వామి' అని పిలుస్తారు. మిట్టదొడ్డిలో వారికి ఆశ్రమము, అనేకమంది అనుయాయులూ వున్నారు. వారి జీవితలక్ష్యం విశ్వ కళ్యాణం. విశ్వశాంతికై మానవుల మధ్య ప్రేమానురాగాలను పెంపొందించడం. ఇంకా విశ్వప్రగతి సాధించడమనే ధ్యేయం కొరకు వారు 'మహాసత్రయాగము'ను నిర్వహించాలని సంకల్పించానని, దానికి మాస్టర్‌గారి సహకారము, మార్గదర్శనము కూడా కావాలని అర్థించారు. ఈ మహాయాగము 30 రోజులపాటు 508 కుండీలలో జరగాలనేది స్వామివారి ధ్యేయము. ఇంతటి మహాయాగ నిర్వహణ జరగాలంటే దానికి తగిన జనశక్తి, ధనశక్తి, జపశక్తి ఇంకా ఇతర వనరుల సమీకరణ మొదలైనవాటి గురించి చర్చించడం జరిగింది. తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారు శాంతికుంజ్ ప్రముఖులు శ్రీ గౌడ్‌జీగారితో ఈ విషయమై ఫోన్‌లో సంభాషించారు. ఆ తర్వాత కొన్ని రోజులకు వారి నుండి అనుమతి పొందటంలాంటివన్నీ లాంఛనప్రాయంగా జరిగిపోయాయి. అయితే మాస్టర్ గారు ఈ మహాసత్రయాగాన్ని 21 రోజులపాటు మాత్రమే చేయాలని నిర్ణయించారు. దానికి ముందు వారు 'న్యూజిలాండ్‌లో' జరిగే అశ్వమేధ యజ్ఞానికి వెళ్ళడం జరిగింది.

11. న్యూజిలాండ్‌లో అశ్వమేధం

గాయత్రీతీర్థ్, శాంతికుంజ్‌వారి ఆధ్వర్యంలో న్యూజిలాండ్‌లో గల ఆక్లాండ్‌లో 2009 ఫిబ్రవరి 27, 28 మరియు మార్చి 1వ తేదీలలో నిర్వహించబడుతున్న అశ్వమేధ మహాయజ్ఞానికి రావలసిందిగా గాయత్రీ పరివార్‌వారి దగ్గర నుండి మాస్టర్‌గారికి ఆహ్వానం వచ్చింది. విదేశాలలో జరుగుతున్న అశ్వమేధానికి మాస్టర్‌గారు వెళ్ళటం ఇది రెండవసారి. విదేశాలకు వెళ్ళాలి అంటే అదో పెద్ద తతంగం. వీసాలు, పాస్‌పోర్టులు అన్నీ సిద్ధం చేసుకోవాలి. ఆ పనులను శ్రీసదానందమూర్తి, భానుమతిగార్లు చూసుకున్నారు. అక్కడ శ్రీమాస్టరుగారికి కావలసిన వసతి సదుపాయాలను వారి కొడుకు, కోడలు, శ్రీవేంకట్, ఉష దంపతులు ఏర్పాటు చేస్తున్నారు. న్యూజిలాండ్‌లో జరుగబోతున్న అశ్వమేధయజ్ఞానికి అవసరమైన ఉపన్యాసాలను పూజ్యశ్రీమాస్టర్‌గారి వాణితో రికార్డు చేసి, దానిని ఉషా వెంకట్ వాళ్ళకు ముందుగానే పంపడం జరిగింది. మాస్టర్‌గారు విదేశాలకు వెళ్తున్నారు అన్న విషయం తెలియగానే అనేక ఊళ్ళ నుండి కార్యకర్తలు మాస్టరుగారిని కలవటానికి ఒంగోలుకు

వచ్చారు. అందులో ముఖ్యంగా అగస్త్యాశ్రమం నుండి, శ్రీహంసరామాశ్రమం నుండి, నారాకోడూరు గాయత్రీ శక్తిపీఠం నుండి కూడా ప్రధాన కార్యకర్తలు వచ్చారు.

తాము న్యూజిలాండ్ నుండి వచ్చేసరికి అన్ని ఆశ్రమాలలో ఎలాంటి వ్యవస్థను క్రమబద్ధీకరణ చేయాలో చాలా స్పష్టంగా వివరిస్తూ, ప్రత్యేకించి నారాకోడూరు, కాకివాయి ఆశ్రమాలను శాంతికుంజ్ నమూనాలుగా తీర్చిదిద్దాలి. ఈ రెండు ఆశ్రమాలు దక్షిణ భారతదేశపు గాయత్రీ తీర్థాలుగా తీర్చిదిద్దబడాలి. శాంతికుంజ్‌లో జరిగే మాదిరి కార్యక్రమాలు జరగాలి. శాంతికుంజ్ నమూనాలుగా మారేందులకై శాంతికుంజ్‌కి సంబంధించిన ఏడు ఫ్లెక్సీలను తయారుచేయించి వాటిని ఆశ్రమాలలో అందంగా అలంకరించి, సాధనలు యథావిధిగా ప్రారంభించాలి. మహాశివరాత్రి నాటికి ఈ పనులన్నీ జరిగిపోవాలని నిర్దేశించారు. ఈ మధ్యకాలంలో మాస్టర్‌గారి ఆలోచనలన్నీ శాంతికుంజ్ చుట్టూనే అల్లుకుపోవడంతో తత్సంబంధమైన ప్రణాళికలనే అన్ని ఆశ్రమాలకు అందిస్తున్నారు.

న్యూజిలాండ్ వెళ్ళడానికి మాస్టరుగారు హైద్రాబాద్‌కు వెళ్ళారు. శ్రీమతి భానుమతిగారు అక్కడ నుండి మాస్టర్‌గారిని న్యూజిలాండ్‌లో వారి కుమారుడు వేంకట్‌గారింటికి తీసుకెళ్ళారు. అదే సమయానికి తేజశ్రీ కూడా మాస్టార్ని చూస్కునేందుకు అక్కడకు చేరుకుంది. న్యూజిలాండ్ వాతావరణం మాస్టర్‌గారికి ఎంతో బాగా నచ్చింది. పచ్చదనంతో నిండిన చల్లని వాతావరణం వల్ల మాస్టర్‌గారు శారీరకంగా, మానసికంగా కూడా ఎంతో హాయిని అనుభూతి చెందారు. శ్రీమాస్టర్‌గారు న్యూజిలాండ్ వెళ్ళడానికి ముందుగానే మాస్టర్‌గారిచ్చిన కొన్ని ప్రేరణాత్మక ప్రవచనాలను అక్కడ ప్రజలకు ఉషావేంకట్ వాళ్ళు వినిపించారు. ఆ ప్రవచనాల ప్రభావంతో స్ఫూర్తి పొందిన సోదర బృందంవారు మాస్టర్‌గారికి తమతమ ప్రాంతాలలో వసతి సదుపాయాలను ఏర్పాటుచేయడమే కాకుండా చక్కటి ప్రవచనాలను చెప్పించుకొనేందుకై వేదికలను కూడా ఏర్పాటు చేశారు. ఆ విధంగా వారి దివ్యసాన్నిధ్యానుభూతిని అందరికీ అందచేశారు.

పూజ్యశ్రీమాస్టర్‌గారు ఒక దివ్యచైతన్యం, ఒక దివ్యాత్మ. ఆ దివ్యాత్మ ప్రశాంతతకు, సామరస్యతకు, ప్రేమకు ఉత్పత్తి స్థానం. ఒక్కసారి వారి సాన్నిధ్యానుభూతిని రుచిగ్రోలితే, ఇంకవారిని ఎవ్వరూ విడిచిపెట్టలేరు సరికదా, తమ సర్వస్వాన్ని అర్పణ చేయటానికి సన్నద్ధులౌతారు. అది దేశకాలాతీతమైన చైతన్యధార, చైతన్యఝరి. ఒక్కసారి ఆ చైతన్య పురుషుని సంపర్కంలోకి వెళ్ళామా, ఇంక వారితోనే శాశ్వతముగా ఉండిపోవాలనే గాఢమైన కోరిక కలుగక మానదు. అయస్కాంత క్షేత్రంలోకి వచ్చిన

ఇనుము తన ఉనికిని కోల్పోయి ఆ శక్తి ధారల్లో లయమైపోయినట్లుగా, మాస్టర్‌గారి ఉపస్థితిలోకి వచ్చినవారు అలాంటి అనుభూతులను పొందారనడంలో ఎక్కడా, ఎలాంటి, అతిశయోక్తి ఉండదు.

ఫిబ్రవరి 27న న్యూజిలాండ్ అశ్వమేధ మహాయజ్ఞం ప్రారంభమైంది. మొదటిరోజు 'దేవ పూజనం' చేస్తారు. వేదిక మీద ఆదరణీయ శైలాదీదీ, ప్రణవ్‌పాండ్యాగార్లు దేవపూజనం అంతా చేసి అగ్నిస్థాపన సమయంలో మాస్టర్‌గారిని కూడా వేదిక మీదికి ఆహ్వానించారు. మరురోజు 'సంగతీకరణ' కూడా యథావిధిగా జరిగిపోయింది. మార్చి ఒకటవ తేదిన జరిగిన పూర్ణాహుతి, నభూతో నభవిష్యతి అన్న రీతిలో సుసంపన్నమైంది. అశ్వమేధయజ్ఞం అయిపోయాక ఉషావేంకట్ వాళ్ళు ఏర్పాటు చేసిన ఇతర కార్యక్రమాలలో కూడా శ్రీమాస్టర్‌గారు పాలుపంచుకున్న తర్వాత 16వ తేదీకి గుంటూరు వచ్చేశారు.

మాస్టర్‌గారి ఆగమనానికి ముందే నేను సప్తర్షి ఆశ్రమంలో సత్రయాగ నిర్వహణార్థం కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశాను. అనుకోకుండా ఆ సమయానికి మాస్టర్‌గారు రావడం, కార్యకర్తలను ఉద్దేశించి ప్రబోధాత్మక సందేశము, సూచనలతో పాటు, ప్రచారం, అంశదాన, సమయదానముల సమీకరణకు తగిన ప్రణాళికలనివ్వడం జరిగింది.

12. శ్రీకృష్ణదివ్యజ్ఞాన సమాజంలో రెండవ లాడ్జి

పూజ్యశ్రీమాస్టర్‌గారు థియోసాఫికల్ సొసైటీలో సభ్యులు అని ఇంతకుముందే తెలుసు కున్నాము కదా! వారి ప్రేరణతో, మాస్టర్‌గారి శిష్యబృందం చాలామంది థియోసాఫికల్ సొసైటీలో సభ్యులుగా చేరారు. అప్పుడప్పుడు లాడ్జివారి కోరిక మేరకు మేడం బ్లావెట్‌స్కీ వ్రాసిన 'సీక్రెట్ డాక్ట్రిన్' మీద, 'ది వాయిస్ ఆఫ్ సైలెన్స్' మీద ప్రవచనాలు చెప్తూ 'దివ్యజ్ఞాన సమాజం'తో అపురూపమైన అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. అందరికీ మాస్టర్‌గారంటే ప్రేమతో కూడిన గౌరవం. గుంటూరు థియోసాఫికల్ సొసైటీ వేగవంతంగా అభివృద్ధి చెందుతూ, రెండవ లాడ్జిని కూడా ఏర్పాటుచేసే స్థాయిలో చురుగ్గా ముందుకు సాగింది. ఆ సందర్భంగా మార్చి 19, 20 తేదీలలో రెండవ లాడ్జిని ఆవిష్కరణ కార్యక్రమానికి, లాడ్జి యాజమాన్యంవారు మాస్టర్ గారిని ఆహ్వానించారు. రెండవ లాడ్జి రావటం అనేది యావద్భారత దేశంలో ఎక్కడా లేదు. అలాంటి అద్భుతమైన, అపురూపమైన కార్యక్రమానికి మాస్టరుగారు హాజరుకావటమనేది నిజంగా విశేషం.

13. సత్రయాగానికి ఏర్పాట్లు

సత్రయాగానికి ముందు నుండే మాస్టర్‌గారు కొన్ని కొన్ని విచిత్రమైన నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారు. పూజ్యశ్రీమాస్టర్‌గారి శిష్యులు కొందరు ఆయన ఎక్కడ వుంటే అక్కడ వారి సౌకర్యార్థం 'ఎల్.సి.డి' టి.విలను, డి.వి.డి. ప్లేయర్లు, వారు నిరంతరం ఉపయోగించుకునేందుకు వీలుగా వుండే కొన్ని వస్తువులను తెచ్చి శ్వేతద్వీపంలో పెట్టారు. మాస్టారు సత్రయాగ నిర్వహణార్థం మంత్రాలయానికి వెళ్ళడానికి ముందు నుండే ఎవరి వస్తువులను వారికి తిరిగి ఇచ్చెయ్యడం మొదలుపెట్టారు. ఇతరులు వారికోసం తెచ్చిన ప్రతి వస్తువును ఎవరిది వారికి ఇచ్చేశారు. మనమెంతో ప్రేమతో మాస్టారి కోసం తెచ్చిస్తే వాటిని ఎందుకు తిరిగి ఇచ్చేస్తున్నారని కొంతమంది నా దగ్గర బాధపడ్డారు. కారణార్థం లేకుండా వారు ఏ పని చెయ్యరు. దానికి సంబంధించిన ఏదో ఒక ధర్మసూక్ష్మం మాస్టారి దగ్గర ఉండి వుంటుంది. కానీ అది అర్థం కావడానికి కొంత సమయమైతే పడుతుంది. ఇకపోతే శ్వేతద్వీపంలో వారి 'గ్రంథాలయం' వుంది. అదంటే మాస్టర్‌గారికి ప్రాణంతో సమానం. బహుశ్రద్ధగా, ప్రేమగా చూచుకునేవారు. గ్రంథాలయమును వల్లీ, నేను చాలా శ్రద్ధతో, ఇష్టంతో జాగ్రత్తగా చూచుకునేవాళ్ళం. దానిని గురించి కూడా ఒక స్పష్టమైన నిర్ణయాన్ని చెప్పారు.

ఒకరోజు రాత్రి 8:00 గంటలకు మంత్రాలయం నుండి మాస్టర్‌గారు ఫోన్‌చేసి శ్వేతద్వీపంలో మేడపై నా నివాసాన్ని పూర్తిగా లైబ్రరీగా మార్చివేయాలని, దానికి 'శ్రీమతి మారెళ్ళ సక్కుబాయి మెమోరియల్ గ్రంథాలయం' అని బోర్డు వ్రాయించి పెట్టమని, వీలైనంత త్వరలో ఆ పనిని పూర్తి చేయాలని చెప్పారు. పుస్తకములనన్నింటినీ జిల్లా గ్రంథాలయంలో లాగా ఒక పద్ధతిలో ఏర్చికూర్చి పెట్టమని, నిర్ణీత సమయాలలో ఎవరైనా చదువుకోడానికి వస్తే ఆ లైబ్రరీలో వారికి సౌకర్యంగా వుండేలాగా కుర్చీలు, బల్లలు ఏర్పాటు చెయ్యమని చెప్పారు.

పూజ్యశ్రీమాస్టర్‌గారు చెప్పినట్లుగా లైబ్రరీలోని పుస్తకాలన్నిటినీ ఒక వరుస క్రమంలో విషయాల వారీగా క్రమంలో ఉన్నవాటిని ఒక ప్రక్కన, రచయితల పేర్ల మీద ఉన్న వాటిని వేరొక ప్రక్కన, అలాగే సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలలో ఉన్న పుస్తకాలన్నింటిని, వేటికి వాటిని వర్గీకరించి, చక్కటి కాటలాగ్‌ను తయారుచేసింది వల్లి. మాస్టర్‌గారు చెప్పినట్లుగా లైబ్రరీ బోర్డు కూడా తయారైవచ్చింది.

ఆ రోజు గాయత్రీజయంతి, సాయంత్రం లైబ్రరీ ఆవిష్కరణకు పరివార్ సభ్యులందరినీ పిలిచాము. పూజ్యశ్రీ మాస్టర్‌గారి ప్రియశిష్యురాలు కుమారి శ్రీదేవి ఆప్పుడే యు.యస్. నుండి వచ్చింది. ఆమెతో లైబ్రరీని ఆవిష్కరింప చేసి అందరికీ మిఠాయిలు పంచి 'శ్రీమతి మారెళ్ళ సక్కుబాయి మెమోరియల్ లైబ్రరీ' బోర్డును కట్టించి దానికి హారతినిచ్చి, ఇంక రేపటి నుండి చదువుకోటానికి రావచ్చునని అందరికీ ఆహ్వానం చెప్పాము. వీలున్న సమయాలలో ఎవరైనా వచ్చి చదువుకోవచ్చని అనుమతినిస్తూ పూజ్యులు డాక్టరు శ్రీరామకృష్ణగారు తాము చదువుకున్న పుస్తకాలను 'లైబ్రరీ' రూపంలో సమాజానికి అంకితం చేశారు. దానిని సద్వినియోగము చేసుకోవడమనేది శిష్యుల బాధ్యత.

14. మంత్రాలయంలో సత్రయాగం

భక్త ప్రహ్లాదుని అంశావతారము, పరమ పవిత్ర పావన పుణ్యమూర్తి శ్రీ రాఘవేంద్రస్వామివారి సమాధితో మంత్రసిద్ధిని పొంది మంత్రాలయముగా ప్రసిద్ధి చెందిన తీర్థస్థలిని మహాసత్రయాగ స్థలముగా ఎంపిక చేశారు పూజ్యశ్రీ మాస్టర్‌గారు. మాస్టర్‌గారు ఇచ్చిన సూచనల ప్రకారం గాయత్రీ పరివార్ సభ్యులందరూ తమకు కేటాయించిన సమయాలలో మంత్రాలయానికి వెళ్ళి శ్రీ మిట్టదొడ్డి స్వామివారు సూచించిన గ్రామములో ప్రచార కార్యక్రమములను కొనసాగిస్తున్నారు. సత్రయాగమునకు వివిధ సంస్థల వారిని ఆహ్వానించే విషయాలను గురించి సంప్రదించటానికి శ్రీ వేణుగోపాలరెడ్డి, శ్రీ యుగంధర్‌గార్లు 22వ తేదీన శ్వేతద్వీపంలో వున్న మాస్టర్‌గారిని కలవటానికి వచ్చారు. మాస్టర్‌గారు చెప్తున్న విషయాలు వ్రాసుకోవడానికి, వేణుగోపాలరెడ్డిగారికి మాస్టారు తాము వాడుకునే పెన్నును వారికిస్తూ 'ఇంక ఇది మీదే' అన్నారు. ఆ యజ్ఞానికి అవసరమైన ఆర్థిక లావాదేవీలన్నీ ఆ పెన్నుతోనే చేశానని తర్వాత రెడ్డిగారు చెప్పారు. తర్వాత న్యూజిలాండ్‌వారు అచ్చు వేసిన అశ్వమేధ యజ్ఞ సావనీర్‌ను యుగంధర్‌గారికిచ్చి ఈ విధంగా సత్రయాగ సావనీర్‌ను మీరు తయారుచేయమని వారికి చెప్పారు. మాస్టర్‌గారిచ్చిన ఆదేశానుసారం శ్రీయుగంధర్, విజయశ్రీ వాళ్ళు చక్కటి సావనీర్‌ను తయారుచేసి అచ్చువేయించి దానిని సత్రయాగ మహాయజ్ఞములో ఆవిష్కరించారు.

ఏప్రియల్ 4వ తేది నుండి మాస్టర్‌గారు మంత్రాలయంలోనే వున్నారు. మంత్రాలయంలో ఉంటూ కార్యక్రమాలను సమీక్షించడంతో పనులన్నీ ఒక దారిలోకి వచ్చేశాయి. అనుకున్న తేదీకి

అంటే 19వ తేదీ సాయంత్రం వేలాదిమంది భక్తులతో కలశయాత్ర కన్నుల పండువగా జరిగింది. 21వ తేదీ నుండి యజ్ఞము ప్రారంభమైంది. 21 రోజులపాటు జరిగిన ఆ యాగానికి ఒక్కొక్క రోజు ఒక్కొక్క సంస్థ నుండి పీఠాధిపతులు వచ్చి తమ అమూల్యమైన, అనుభవసారమైన సాధనలపై ప్రవచనాలను ఎంతో విశేషంగా చెప్పటం జరిగింది.

ఒకనాటి ప్రవచనంలో పూజ్యశ్రీ మాస్టరుగారు ఈ మహాయజ్ఞము యొక్క విశిష్టతను గురించి "పూర్వజన్మ సంస్కార ఫల విశేషంతో మీరిక్కడకు లాక్కొని రాబడ్డారు. 'పృథ్విపై స్వర్గావతరణ' కొరకు జరుగుతున్న ఈ మహత్కార్యంలో భాగస్వాములైన మీ పేర్లు కూడా భవిష్యత్తులో చెప్పబడతాయి. ఒక పూర్ణిమనాడు స్వామీజీ (మిట్టదొడ్డిస్వామి) నా దగ్గరకు వచ్చారు. వారు సత్రయాగాన్ని సంకల్పించానని చెప్పారు. ఋషులందరూ కలిసి చేసేది సత్రయాగము. ఒక్కొక్క ఋషి చేసే సాధన ఒక్కొక్కరకం. స్వామివారి సంకల్పబలంతో గురువుల నుండి మీ ద్వారా ప్రపంచానికి సత్రయాగం అందించబడుతున్నది. అందరూ కళ్ళు మూసుకుని ఈ సంకల్పమును మనకు అందచేసిన ఋషులకు మనస్ఫూర్తిగా సంపూర్ణ సమర్పణను చేసుకుందాము. మీకు నచ్చిన గురుచరిత్ర పారాయణ, సాయి, దత్తచరిత్రల పారాయణలు, సుందరాకాండ పారాయణలు, శ్రీమహాలక్ష్మీ సాధనలు, గాయత్రీ అనుష్టానాలు మొదలైనవన్నీ మీరు యథేచ్ఛగా చేసుకోవడానికి తగిన ఏర్పాట్లు ఇక్కడ చేయబడతాయి. ఇందులో నాతో సహకరించి పాలుపంచుకునే వారందరికీ స్వామిజీ, నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా"మని సభాముఖంగా, సవినయంగా తమ భావాలను ప్రకటించిన మాస్టర్‌గారు సాక్షాత్ జగద్గురువులైన శ్రీకృష్ణపరమాత్మకాక మరెవరై వుంటారు? చేస్తున్నది, చేయిస్తున్నదీ అంతా వారే అయినా కీర్తిని అందరికీ ఇవ్వడం అందరికీ సాధ్యమేనా!

సత్రయాగంలో ఉన్న అనేక అవరోధాలను మాస్టర్‌గారే తొలగించేశారు. అంత ఎండాకాలంలో కూడా కార్యకర్తలందరూ శ్రమకోర్చి కార్యక్రమాన్ని విజయవంతంగా 21 రోజులు నడిపించారు. శ్రీశ్రీమాస్టర్‌గారికి అండదండలుగా శ్రీవేంకటేశులు గారి కుటుంబం, సుమ, చందనలు నిలబడ్డారు. శ్రీ వేణుగోపాలరెడ్డి, శ్రీసురేష్‌గార్లు ఆర్థిక లావాదేవీలు, జమా, ఖర్చుల బాధ్యతను స్వీకరించగా, శ్రీమతి తేజశ్రీ అమెరికాలో ఉండి కూడా ఇక్కడ జరుగుతున్న మొత్తం కార్యక్రమాలను వీడియో కవరేజ్‌లు చేయించారు. ఇలా ఎంతమంది పేర్లను వ్రాయగలం? అలా అనేకమంది కార్యకర్తల సహాయముతో ఈ సత్రయాగ మహోత్సవం ఎంతో వైభవంగా, నిర్విఘ్నంగా జరిగింది. ఇదే కార్యక్రమము

ప్రాంతాలవారీగా ప్రతి ఊరివారిని చేయమని మాస్టర్‌గారు నిర్దేశించారు. అయితే ఈ సత్రయాగాలను శ్రీమతి నాగమణి గారు, శ్రీరామానందస్వామిగారి ఆధ్వర్యంలో $1^{1}/_{2}$ సంవత్సరం పాటు వేర్వేరు గ్రామాలలో నిష్టగా కొనసాగించారు.

15. సకల గ్రహ, వాస్తు, దృష్టి దోష నివారణ యజ్ఞము

ఈ సత్రయాగ మహాయజ్ఞంలో మాస్టరుగారు, ఇంతవరకు ప్రపంచంలో ఎవ్వరూ ఇవ్వని ఒక విశేషమైన సాధన నిచ్చారు. దానిపేరు సకల గ్రహ, సకల వాస్తు, సకల దృష్టి దోష నివారణ యజ్ఞము. 10 నిమిషాల్లో చేసుకునే చిన్నపాటి యజ్ఞము. అలా చేసుకుంటే ఆ రోజు ఉన్న గ్రహ, వాస్తు, దృష్టి దోషాలు పోతాయి. ఇక ఇంటి వాస్తు, అదీ ఏమీ చూసుకోనవసరంలేదు. ఆ యజ్ఞము మొదలు పెట్టే ముందు దాని వివరణ ఇలా చెప్పారు.

గత మూడు లక్షల సంవత్సరాల బట్టి హిమాలయములలో సజీవంగా ఉన్నటువంటి ఒక వ్యక్తి అందచేసినటువంటిదీ కొత్తయజ్ఞము. ఆయన అలహాబాదులో జరిగే కుంభమేళాకు సశరీరంగా వస్తుంటారు. ఆయన వయస్సు మూడు లక్షల సంవత్సరాలని చెపుతారు. కానీ ఆయన వయస్సు నా దృష్టిలో 12 కోట్ల సంవత్సరాలు. కానీ 12 కోట్ల సంవత్సరాలు అయితే ఏముందీ? మూడు లక్షల సంవత్సరాలు అయితే ఏముంది? భావము ఏమిటంటే అంత వయస్సు నుండి భారతదేశాన్ని కాపాడుకుంటూ వస్తున్నటువంటి ఆ మహనీయుణ్ణి అనేక సంస్థలు అనేక పేర్లతో పిలుస్తూ వుంటాయి. గాయత్రీ పరివార్ సంస్థ వారు, ఆయనను 'శ్రీ సర్వేశ్వరానందజీ' అని పిలుస్తుంటారు. పరమహంస యోగానంద సంస్థ 'సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్' అని అమెరికాలో, "యోగదా సత్సంగ సొసైటీ" అని భారతదేశంలో వుంది. వారు ఆయనను 'బాబాజీ' అని పిలుస్తుంటారు. ఒకే వ్యక్తికి అనేక పేర్లు. ఒక వ్యక్తి తండ్రిగా వుంటే, వాడే ఇంకొకరికి తమ్ముడు, ఇంకొకరికి భర్త కదా! అలాగే ఈ మహాత్ముడూను.

ఆ వ్యక్తి అందచేసినటువంటి ఈ యజ్ఞాన్ని చెప్తున్నాను. జాగ్రత్తగా అర్థం చేసుకోండి అని చెప్తూ వివరణతో యజ్ఞము చేయించారు. సకల గ్రహ, వాస్తు, దృష్టి దోష నివారణకు చేయవలసిన **అంతర్యాగము** – ప్రతిరోజు ఈ సాధన చేసుకోటానికి 10నిమిషాలు పడుతుంది. 12 ఇటుకలతో యజ్ఞకుండాన్ని స్థాపించుకొని ఈ సాధన రోజూ చేసుకుంటే, కుటుంబాలలో శాంతి, ఆనందాలు వెల్లివిరుస్తాయని చెప్పగా, ఈ యజ్ఞాన్ని ఈనాటికీ చాలామంది చేసుకుంటున్నారు.

16. అననుకూల పరిస్థితులు

ఒంగోలు నుంచి సత్రయాగ నిర్వహణార్థం వెళ్ళిన మాస్టర్‌గారు తిరిగి ఆగస్ట్‌లో ఒంగోలుకు వచ్చారు. ఆయనను చూస్తే చాలా నీరసంగా ఉండడమే కాక ఏదో తెలియని అనారోగ్యం ఉందని అర్థమౌతున్నది. మాస్టర్‌గారికి డా॥రామచంద్రరావుగారి మీద నమ్మకం, ఆయన 'స్వైన్ ఫ్లూ జ్వరమని' ముఖ్యంగా అది బ్రెయిన్‌కు అటాక్ అయిందని, చాలా జాగ్రత్తగా ఉండాలని, వెంటనే హాస్పిటల్‌లో చేర్పించమని చాలా కచ్చితంగా చెప్పారు. హాస్పిటల్‌లో చేరడానికి మాస్టర్‌గారు ఒప్పుకోలేదు. మాస్టర్‌గారి సంగతి తెలిసినవారు కనుక డాక్టర్‌గారు దానిని గురించి ఇంకేమీ తర్కించకుండా మందులు వ్రాసి ఇచ్చారు. డాక్టర్‌గారి సూచనల మేరకు మందులు వాడడం వల్లనైతేనేమి, కాస్త ఆహారం తీసుకోవటం వల్లనైతేనేమి రోజురోజుకూ మాస్టర్‌గారి ఆరోగ్యపరిస్థితి మెరుగుపడసాగింది. ఏది ఏమైనా జ్ఞాపకశక్తి బాగా తగ్గి మనుషులను గుర్తుపట్టడం కూడా చాలా వరకు తగ్గిపోయింది. మాట్లాడాలంటే ఒక్కొక్క మాటను కూడబలుక్కుంటూ మాట్లాడుతున్నారు. ఒక 15రోజుల వైద్యం జరిగాక, కాస్త మనుషుల్లో పడ్డారు. కాని జ్ఞాపకశక్తి ఇంకా మెరుగుపడలేదు.

రోజువారీ కార్యక్రమాలు ఒక పద్ధతిలో పడిపోయాయి. ఉదయం ఆరు గంటలకు కాఫీ త్రాగి మేడమీదికి వెళ్ళడం – ఆయిల్ మసాజ్ చేయించుకుని నలభై నిమిషాలపాటు నాని స్నానం చెయ్యడం తరువాత టిఫిను, మందులు – కాసేపు చదువుకోవడం, మధ్యాహ్న భోజనం అంతా ఒక పద్ధతిలోకి వచ్చింది. ముఖంలో మంచి తేజస్సు వచ్చింది. అయితే ఎవ్వరితో మాట్లాడడం లేదు. కఠోపనిషత్తులో చెప్పిన 'ప్రేయోసాధన' పగలు–'శ్రేయోసాధన' రాత్రిళ్ళు చేయడం దాకా వచ్చింది. సత్యమార్గంవైపు ప్రయాణించడానికి ప్రపంచంలో రెండు మార్గాలు ఉన్నాయి. 1. శ్రేయో మార్గము – శ్రేయమైనది అనగా ఉత్కృష్టమైనది. ఇది మనకు మానసిక ఆనందమును, తృప్తిని చేకూరుస్తుంది. ఇదే శ్రేష్ఠమైన మార్గము. 2. ప్రేయోమార్గము – ఇది ఇంద్రియముల ద్వారా సుఖమును మాత్రమే అందించగలుగుతుంది.

చిత్రమేమిటంటే సెప్టెంబరు 11 నుండి సెప్టెంబరు 20వ తేదీల మధ్యలో ఉన్న తొమ్మిది రోజులు మాతాజీ, గురుదేవుల జన్మదినోత్సవాలతో వచ్చిన నవరాత్రి సాధనా కాలము, అద్భుతంగా సాధన చేస్తున్నారు. మాతాజీ, గురుదేవులు తమ బిడ్డను కంటికి రెప్పలా కాపాడుతూ సంపూర్ణ సంరక్షణ చేస్తూ వారికి ఆరోగ్యాన్నిచ్చి త్వరగా కోలుకునేలా చేశారు. అలా వారి అనుగ్రహంతో

ఆధ్యాత్మిక భవిష్యత్‌కు ఉత్తరాధికారియైన మన మాస్టారి ఆరోగ్యం మెరుగుపడి ముఖంలో మంచి కళ వచ్చేసింది.

ఆ రోజు ఉదయం యథాప్రకారంగా కాఫీ, టిఫిన్, భోజనాల దాకా టైంటేబుల్ మామూలుగా జరిగిపోయింది. నాతో ఉన్నట్లుండి 'నాకు షుగరు లెవల్స్ పెరిగిపోతున్నాయి. వెంటనే హైదరాబాద్‌కు వెళ్ళాలి. కారు ఏర్పాటు చెయ్యి' అన్నారు. 'ఎందుకు మాస్టారూ?' అనే మాటకు కూడా తావివ్వలేదు. ఉన్నట్లుండి మాస్టారి ప్రవర్తనలో విచిత్రమైన మార్పు వచ్చేసింది. నాకు ఒక్కసారిగా శరీరంలో నిస్సత్తువ వచ్చేసింది. ఏమి చేయాలో పాలుపోలేదు. కాని చెప్పింది చేయవలసిందేగా! సరే మాస్టరు గారి ప్రయాణానికి తగిన ఏర్పాట్లు చేశాను. తోడుగా కిశోర్, సీత వెళ్ళటానికి సిద్ధపడి వచ్చారు.

ఇంతలో హైదరాబాద్ నుంచి విజయవిశ్వనాధ్‌గారు ఫోన్ చేసి 'ఆర్. లక్ష్మిగారింట్లోకి ఎవరో దుండగులు ప్రవేశించి ఆమె గొంతు కోశారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. మాస్టర్‌గారితో చెప్పండి' అని నాకు ఫోను చేసి చెప్పారు. మాస్టర్‌గారి షుగర్ లెవల్స్ ఎందుకు పెరిగాయో అర్థమైంది. ఆత్మబంధువు అయిన లక్ష్మిగారికి వచ్చిన ఆపద ఆయనగారి అనుభూతిలోకి వచ్చింది. ఈ హఠాత్ ప్రయాణానికి గల కారణం ఏమిటో ఇప్పుడు అర్థమైంది. కానీ దురదృష్టవశాత్తు ఆవిడ వెళ్ళిపోయారు. పరివార్‌లో ఉన్నంతకాలం ఆవిడ డి.యస్.వి.వి. – డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరక్టర్‌గా మంచి సేవలనందించారు. పరివార్ కార్యక్రమాలను ఎంతో నిష్టగా త్రికరణశుద్ధిగా చేసేవారు, గురుదేవుల సాహిత్యాన్ని ఆంగ్ల భాషలోకి అనువదించటం, పుస్తకాలను ముద్రించటంలో ఎంతో కృషి చేశారు. గురుదేవుల వైజ్ఞానిక ఆధ్యాత్మికత ప్రతి స్కూలులోను, కాలేజీలలోను, కార్పోరేట్ సంస్థలలోను అందించటానికి సెమినార్స్‌ను ఏర్పాటుచేసేవారు, ఆవిడలాంటి వ్యక్తిని పోగొట్టుకోవడ మనేది తీర్చలేని లోటు. శ్వేతద్వీపం నుండి కదలను అన్న మాస్టర్‌గారు ఇలా ఒక నెపంతో వెళ్ళిపోవలసి వచ్చింది. మళ్ళా పది రోజులకల్లా తిరిగి వచ్చారు. మాస్టర్‌గారితోపాటు చందన, సుమ వచ్చారు. ఆరోగ్యం కాస్త కుదుటపడింది. కొంచెం కొంచెం మాట్లాడడం, చదవడం కూడా చేస్తున్నారు.

17. నవసృజన సాధనా పుష్పాంజలి

'నవసృజన సాధనా పుష్పాంజలి' అనే పేరుతో వసంతపంచమికి 'గాయత్రీ శక్తి పీఠం'

నారాకోడూరులో గురుదేవుల జన్మశతాబ్ది సమారోహాన్ని పురస్కరించుకొని గురుదేవుల సాహిత్యంలో మణిమకుటంలాంటి 'ప్రజ్ఞావతార కథామృతము, క్రాంతిధర్మీ సాహిత్యము' లపై విశేషమైన ప్రవచనాలతోపాటుగా వాటి అధ్యయన విధానాన్ని కూడా సూచనప్రాయంగా చెప్పారు. క్రాంతిధర్మీ సాహిత్యాన్ని అత్యంత ప్రాచుర్యంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు.

అక్టోబరు 12, 13, 14 తేదీలలో హైదరాబాద్‌లో త్రిదివసీయ సాధనా శిబిరాన్ని శ్రీవేణుగోపాల్‌గారి మేడ మీద చేయటం జరిగింది. ఈ సాధనాశిబిరంలో 'ప్రజ్ఞావతారకథామృతము' దానికి అనుబంధంగా గురుదేవులిచ్చిన సాధనలనన్నింటిని ప్రతిరోజు చేయటానికి వీలైన రీతిలో తయారుచేసి దానిని "ప్రజ్ఞావతార మహాకాల శకం" డైరీగా ఆవిష్కరించారు మాస్టరుగారు.

ఆ డైరీపేరును ఎంత గొప్పగా ప్రతిపాదించారంటే విక్రమశకం, శాలివాహనశకం ఎలా ప్రాచుర్యం పొందాయో అలా గురుదేవులను మహాకాలునిగా ప్రకటీకరిస్తూ, వారి పేరుతో ఒక మహాకాలశకాన్ని నిత్యసాధనలో భాగంగా తీసుకురావాలనే ఆకాంక్షతో ఆ డైరీని రూపొందించారు. అక్టోబర్ 14వ తేదీన మాస్టర్‌గారి జన్మదిన సందర్భంగా 'ఈ మహాకాల శకం డైరీ'లో మనం రోజువారీ సాధనలనెలా చెయ్యాలనేది అతి సరళంగా బోధించారు. ఎటు నుండి ఎటు త్రిప్పినా మాస్టర్‌గారి లక్ష్యం ఎప్పుడూ 'గురుదేవుల జన్మశతాబ్ది' చుట్టూనే పరిభ్రమిస్తుండేది. ఆయన నిరంతరం దాని గురించే మాట్లాడుతుండేవారు.

పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది దగ్గర పడుతున్నది. ఈ ఉత్సవం కేవలం జనాన్ని ప్రోగు చెయ్యడానికి కాదు. గురుదేవులు తలపెట్టిన యుగనిర్మాణ యోజనను సాకారం చేసి తీరాలనే ఆశయంతో, తపనతో చేస్తున్నది. ఆ సవితా ప్రకాశంలో మన ప్రజ్ఞాపాటవాలు ప్రకాశించాలనేదే వారి ధ్యేయం. యజ్ఞీయ భావనకు ప్రేరణ లభించాలి. జ్ఞానగంగ గాయత్రీ రూపంలో ప్రవహించాలి. తద్వారా మానవునిలో దైవత్వం మేలుకోవాలి. అందుకొరకు నిర్దేశించబడిన విశేష సాధనే 'నవసృజన సాధనా మహాపురశ్చరణ.' వారు ఎక్కడ సాధనాశిబిరం పెట్టినా ఎక్కువసార్లు ఈ పదాన్నే వాడుతుండే వారు. శతజయంతి నాటికి పరిజనులందరూ సాధనాకౌశలాన్ని పెంచుకోవాలనేదే వారి లక్ష్యం. సాధన ద్వారా లభించిన శక్తిని 'నవసృజన' కోసం వినియోగించాలి. జపం సాధనలో ఒక భాగం. **జపం ఎప్పుడూ భావ ప్రధానంగా చేస్తేనే లాభదాయకమౌతుంది. జపసాధన వలన సూక్ష్మ జగత్తులో స్పందన రావాలి. నవయుగ స్థాపనకు శక్తిని సమకూర్చుకోవాలి.**

శ్వేతద్వీపంలో కొన్నాళ్ళున్నాక మళ్ళీ హైదరాబాద్‌కు బయల్దేరారు. కొన్ని పుస్తకాలను ప్యాకింగ్ చేయించుకొని తీసుకువెళ్ళాలని చెప్పారు. సరే ప్యాకింగ్ జరుగుతున్నది. అప్పుడు చెప్పారు. కొన్ని కుటుంబ పరిస్థితులకోసమైతేనేం, ఆరోగ్యరీత్యా అయితేనేం నేను కొన్నాళ్ళు హైదరాబాద్‌లోనే ఉండాల్సి వస్తుంది. నేను ఎక్కడున్నా నా శాశ్వత చిరునామా పర్మినెంట్ అడ్రస్ ఎప్పటికీ శ్వేతద్వీపమనే గదా చెప్తాను. అదే సత్యం (ఇప్పటికీ మాస్టారి ఆధార్ శ్వేతద్వీపం పేరు మీదనే ఉంటుంది). ఇప్పుడు తీసుకువెళ్తున్న బుక్స్ కంప్యూటరైజ్ కాగానే మళ్ళీ పంపుతాను అంటూ మా ఇద్దరికీ కొన్ని జాగ్రత్తలు చెప్పారు. పూజ్యశ్రీ మాస్టారు హైదరాబాద్‌లోనే ఉంటూ మరొక క్రొత్త సాధనకు శ్రీకారం చుట్టారు. అది ఈసారి తండ్రిగారైన శ్రీకామరాజుగారి ద్వారా అందించబడుతున్న సాధన.

18. గురు అనుగ్రహం - ప్రేరణ

అఖండజ్యోతి, జనవరి 2009లో 'గాయత్రీ సాధనా కే సాథ్, సప్తశతీ కీ మంత్రసాధన'-అనే ఒక అద్భుతమైన వ్యాసం వచ్చింది. అది ఆదిశక్తి లీలాగాథ అనే ధారావాహికలో ఇవ్వబడిన వ్యాసం. దాని ప్రేరణతో మాస్టర్‌గారు సాధకులకు ఒక చక్కటి నూతన సాధనా విధానాన్ని 'పూజ్యశ్రీ మారెళ్ళ కామరాజు' గారి ద్వారా అందించారు. శ్రీకామరాజుగారు అఖండ తపఃశక్తి సంపన్నులు. వారు అఖండ గాయత్రీ ఉపాసకులు. నిరంతరం వారు గాయత్రీ సాధన చేస్తూనే వుంటారు. దాంతోపాటు దుర్గా ఉపాసకులు కూడా. 'ఓం ఐం హ్రీం క్లీం చాముండాయై విచ్చే' అనే మంత్రాన్ని లక్షల సంఖ్యలో ఉపాసన చేశారు. అందుచేత తండ్రిగారి సాధనను 'అనుసంధానం' చేస్తూ ఈ గురుఅనుగ్రహమంత్రాన్ని యావద్భారత దేశంలో 'దీక్ష'గా ఇవ్వమని తండ్రిగారిని కోరారు. కుమారుని కోరిక ప్రకారం వారు వయస్సులో చాలా పెద్దవారైనప్పటికీ, ఎంతో ఉత్సాహంతో ఆ దీక్షా కార్యక్రమాన్ని కొనసాగించారు. వారికి తోడుగ ఈ కార్యక్రమం యొక్క నిర్వహణ బాధ్యతను శ్రీయుగంధర్, విజయశ్రీ గార్లకు ఇవ్వడం జరిగింది. వారు ఎంతో బాధ్యతతో, జాగ్రత్తగా నాన్నగారిని చూసుకుంటూ గ్రామగ్రామాలలోఈ 'దీక్షా' ప్రణాళికను కొనసాగించారు. ఈ సాధన యొక్క ఫలశృతి ఏంటంటే ఆధ్యాత్మికంగా-నూతన జన్మ లభించే అద్భుతమైన శక్తి వస్తుంది. భౌతికంగా-సంతాన ప్రాప్తిని పొందుతారు. ఈ సాధనను 2009 నవంబర్ నుండి ప్రారంభించారు.

ఈ సాధనలో - (1) వినియోగము (2) న్యాసము (3) ధ్యానము. ఈ మూడు చరణాలు అయ్యాక దుర్గా సప్తశతిలోని మొదటి అధ్యాయంలోని మొదటి శ్లోకం.

మంత్రము

ఓం ఐం హ్రీం నమః సావర్ణిః సూర్యతనయో యోమనుః కథ్యతేఽష్టమః ।
నిశామయ తదుత్పత్తిం విస్తరాద్ గదితో మమ నమో హ్రీం ఐం ఓం ॥

ఈ మన్వంతర దీక్షను తన్మయత్వంతో చెయ్యాలి. మూడుమాలలు గాయత్రీ చేసి+పైన చెప్పిన మంత్రాన్ని 36 సార్లు చేస్తే చాలు. దీక్ష తీసుకున్న రోజు నుండి డిసెంబరు 10వతేదీ దాకా చేస్తే చాలని చెప్పారు. దేవదక్షిణ, పూర్ణాహుతి తర్వాత చెప్తానన్నారు. దీక్షాకాలంలో సాధన పూర్తి అయ్యాక నిర్ణీత సమయానికి దాని పూర్ణాహుతిని చెయ్యడం జరిగింది. ఇక అప్పటి నుండి మాస్టారు మరల పూజ్యగురుదేవుల జన్మశతాబ్ది కార్యక్రమాల కొరకు పని ప్రారంభించారు.

వరుణ మంత్రం

ఆ మధ్య కొన్ని సంవత్సరాలుగా వర్షాలు లేక దేశం మలమల మాడిపోతున్నది. త్రాగడానికి కూడా నీరు లేక కొన్ని ప్రాంతాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయి. ఎటుచూచినా కరువుతో ప్రజలు చాలా ఇక్కట్లు పడుతున్నారు. అందరూ కూర్చుని మాస్టర్‌గారితో మాట్లాడుతున్న సమయంలో నీటిఎద్దడిని గురించిన చర్చ వచ్చింది. మాస్టర్‌గారు వెంటనే 'రాజ్యలక్ష్మిగారూ! రామాయణం యుద్ధకాండలో దీనికి సంబంధించిన సత్వర నివారణోపాయం ఏదో ఉన్నది. అది చూసి చెప్పండి' అన్నారు. యుద్ధకాండ మొదటిభాగంలో ద్వావింశతి సర్గలోవున్న 16వ శ్లోకం నుంచి 47వ శ్లోకం వరకు, నీటి వనరులను కల్పించే శ్లోకాలను తీసి మాస్టర్‌గారికి చూపించాను. 'అద్భుతమైన శ్లోకాలు' అవి, వెంటనే డి.టి.పి. చేయించి అన్ని గ్రామాలకు పంపండి. నెట్‌లో పెట్టండి. ప్రతిరోజు వాటిని భక్తి, శ్రద్ధలతో చదవాలి.

సస్యశ్యామలమైన ఆంధ్రప్రదేశ్

'నీటిఎద్దడి' నివారణకు పూజ్యశ్రీ మాస్టరుగారు 09.08.2009న ఇచ్చిన సందేశములో ఒక చక్కటి సాధన

పశవ్యశ్చాల్పరోగశ్చ ఫలమూల రసాయుతః ।
బహుస్నేహో బహుక్షీరః సుగంధిర్విఔషదః ॥

ఏవమేతైర్గుణై ర్యుక్తో బహుభిః సతతం మరుః ।
రామస్య వరదానాచ్చ శివః పంథా బభూవహ ॥

అర్థం: 'ఈ ప్రదేశమున పశువులకు ఇష్టమైన పచ్చిక బయళ్ళు సమృద్ధిగా ఉండును. రోగబాధలుండవు. కందమూల ఫలములు, తేనె మొదలైన రసపదార్థములు కోకొల్లలుగా దొరకును. నెయ్యి, పాలు విరివిగా లభించును. సుగంధ ద్రవ్యములకును, వివిధములగు ఓషధులకును ఇచ్చట కొదువ వుండదు' అని శ్రీరాముడిచ్చిన వరప్రభావమున ఆ మరుభూమి పెక్కు శుభ లక్షణములతో వర్ధిల్లు చుండెను. (వాల్మీకి రామాయణం యుద్ధకాండ - 22వ వరుసలో 42, 43శ్లో)

దాంతో పాటు ప్రతిరోజు యజ్ఞంలో

ఓం భూర్భువః స్వః ఛం ఛం ఛం తత్సవితుర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి, ధియో యోనః ప్రచోదయాత్ ఛం ఛం ఛం ఓం... స్వాహా

ఇదం వరుణ దేవాయ ఇదం న మమ - అంటూ 24 సార్లు ఆహుతులు వెయ్యండి. వీలైతే 108 ఆహుతులు వెయ్యండి. దాంతో మంచి వర్షాలు కురుస్తాయనే ఆశ్వాసనను ఇచ్చారు. ఋషి నోటి నుంచి వచ్చిన వాక్కు వృధాపోదు గదా! మాస్టర్‌గారు చెప్పినట్లు అన్ని ఊళ్ళలో సాధన మొదలైంది. యజ్ఞంలో ఆహుతులను సమర్పిస్తూనే వున్నారు. ఇంక వానలు అందుకున్నాయి. నీటి ఎద్దడి తీరిపోయింది. ఇక ఆ తర్వాత ఎప్పుడు ఇలా కరువు వచ్చినా ఇదే సాధన చెయ్యడం పరివార్‌కు అలవాటైంది. దాంతో నీటి సమస్య తీరిందనే చెప్పాలి. అలా మాస్టర్‌గారు 'ప్రకృతి విపత్తులకు' సైతం చక్కటి సాధనా విధానాలను దేశ, కాలాలకు అతీతంగా అందచేశారు.

19. జన్మశతాబ్ది సమారోహం

పూజ్యగురుదేవుల జన్మశతాబ్ది దగ్గర పడుతున్నది. రాష్ట్రంలో ఉన్న గాయత్రీపరివార్‌నంతటినీ ఏకత్రితం చేసి చక్కటి దిశానిర్దేశాలనిచ్చి ఆ మహత్వపూర్ణ కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేయాలనే సంకల్పంతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ క్రింది విధంగా కొన్ని సూచనలనిచ్చారు.

పూజ్యగురుదేవుల జన్మశతాబ్ది సమారోహానికి మీ నుండి సమయదానాన్ని, అంశదానాన్ని, ప్రతిభాదానాన్ని అడుగుతున్నాను. మీరివ్వదలుచుకున్న దానిని చాలా స్పష్టంగా వ్రాసి ఇవ్వండి అంటూ ప్రవచనం మొదలెట్టారు.

ఓం భూర్భువ:స్వ: ఛం ఛం ఛం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోన: ప్రచోదయాత్ ఛం ఛం ఛం ఓం



శ్రీరాముని ఆగ్రహము - సముద్రుని వినతి

పశవ్య శ్చాల్పరోగశ్చ ఫలమూలరసాయుత:
బహున్నోదో బహుక్షీర: సుగంధిర్వివిధౌషధ: - 42

ఏవమేతైర్గుణైర్యుక్తో బహుధ: సతతం మరు:
రామస్య వరదానాచ్చ శివ: పంథా బభూవ హ - 43


భావము : "ఈ ప్రదేశమున పశువులకు ఇష్టమైన పచ్చికబయళ్ళ సమృద్ధిగా ఉండును, రోగబాధలు ఉండవు, కందమూల ఫలములను, తేనె మొదలగు రసవదార్థములను కొల్లలుగా దొరుకును, నేయి, పాలు విరివిగా లభించును. సుగంధద్రవ్య ములకును, వివిధములగు ఔషధములకును ఇచట కొదువయుండదు." అని శ్రీరాముడిచ్చిన వరప్రభావమున ఆ మరుభూమి పెక్కు శుభలక్షణములతో నిరంతరము వర్ధిల్లెను. **(వాల్మీకి రామాయణం – యుద్ధకాండ –22 వ వర్గ – 42, 43 శ్లోకాలు)**

ఓం భూర్భువ:స్వ: ఛం ఛం ఛం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోన: ప్రచోదయాత్ ఛం ఛం ఛం ఓం

శ్రీరాముని ఆగ్రహము – సముద్రుని వినతి



ఇంటింటా సూర్యుడు



ప్రజ్ఞావతార మహాకాల శకం డైరీ



క్రాంతిధర్మీ సాహిత్యం



ఒంగోలు శ్వేతదీపం



క్రాంతిధర్మీ సాహిత్యం



లక్ష్మీపురం శక్తిపీఠం ప్రాణ ప్రతిష్ఠ




సజల శ్రద్ధ – ప్రఖర ప్రజ్ఞ శాంతికుంజ్ చివరి దర్శనం



ఒంగోలు శ్వేత దీపంలో



కేరళ ఆశ్రమంలో




మాస్టారు గారికి కుంభమేళాలో దొరికిన ప్రసాదం



అడయారు కల్నల్ ఆల్కట్ దర్శనం




విశ్వ శాంతి ముద్ర





నారాకోడూరులో మాస్టర్ గారు



మాస్టర్ గారి అమెరికా యాత్ర



మాస్టర్ గారి అమెరికా యాత్ర



మాస్టర్ గారి న్యూజిలాండ్ యాత్ర



మాస్టర్ గారి న్యూజిలాండ్ యాత్ర

1. సమయదానం:

మీరిచ్చిన సమయంలో గురుదేవుల పనినే చెయ్యండి. రోజుకు ఒక గంట సమయదానం ఇస్తే అంతే చెయ్యండి. ఒక్క క్షణం కూడా ఎక్కువ చెయ్యవద్దు. ఒక్క గంట అయితే అది మీ కుటుంబసభ్యులకు కూడా తెలియదు. మీరిచ్చే సమయదానం వలన మీ కుటుంబసభ్యుల పనికి ఎలాంటి ఇబ్బంది రాకూడదు. మీరు ఇవ్వదలుచుకున్న సమయదానం ఈ మూడు సంవత్సరాలు ఇస్తే చాలు.

2. అంశదానం:

గురుదేవులు ఏం చెప్పారంటే మీ జీతంలో లేక మీ ఆదాయంలో పదవవంతు ఇమ్మన్నారు. కానీ పరిస్థితులను బట్టి మీకెంత వీలైతే అంతే ఇవ్వండి. అలా ఇచ్చేశాక నేను గురుదేవులకింత ఇచ్చాను, నాకేం వచ్చింది అని మాత్రం ఆలోచించకండి. మీరు ఇవ్వదలుచుకున్నది సంపూర్ణంగా ఇవ్వండి. ప్రతినెలా మీరనుకున్న అంశదానాన్ని తీసి వుంచండి.

3. ప్రతిభాదానం:

నాకీ ప్రతిభ వున్నది. దీనితో నేనేం చేయగలను, అని ఆలోచించుకొని దానిని భగవంతుని పనికి ఉపయోగించండి. మీకున్న ప్రతిభ ఎలాంటిదైనా దానిని ఈ మూడు సంవత్సరాలు గురువుగారి పనికి ఇచ్చెయ్యండి.

శబరి కొన్ని ఏళ్ళపాటు రాముడు వస్తాడనే ప్రేమతో ఆ ప్రాంతాన్నంతా చిమ్మి శుభ్రం చేసింది. వచ్చాడు కదా మరి. అలా ఎవరికి ఏ ప్రతిభ వున్నదో దానిని అభివృద్ధి పరచుకోండి. ముఖ్యంగా క్రాంతిధర్మ సాహిత్యం 20 పుస్తకాలు బాగా చదవండి. అవి చదివేటప్పుడు ఎంత గొప్ప వ్యక్తి వాటిని వ్రాశారో గుర్తుపెట్టుకొని మరీ చదవండి. అది కోట్ల సంవత్సరాల ప్రణాళిక. **నేను వెబ్‌సైట్ ద్వారా ప్లాన్ ఆఫ్ యాక్షన్ (కార్యాచరణ ప్రణాళిక) అంతా ఇచ్చేశాను.**

4. ఏది చేసినా భౌతికంగా ఎదగాలని పనిచెయ్యండి. మనకున్న రకరకాలైన సబ్జెక్ట్ అంతటిని 108 విభాగాలుగా (గ్రూప్స్) ఏర్చికూర్చి పెట్టారు మన పిల్లలు. అందులో ఎవరికి నచ్చినదాంట్లో వాళ్ళు చేరి, చేసిన ప్రాజెక్టు వర్కు పూర్తిచేసి నాకివ్వండి.

అధ్యాయం-3

నూతన మానవకాయ నిర్మాణం (2010)

20. తిరుమలలో సాధన

గత రెండు సంవత్సరాల నుండి పూజ్యశ్రీమాస్టారు ఆరోగ్యపరంగా చాలా నలిగారు. ముఖ్యంగా స్పైన్‌ఫ్లూ రావడంతో జ్ఞాపక శక్తి క్షీణించడం, మాట రాకపోవడంతో మాస్టరుగారికి ఏదో చెయ్యాలనే తపన, కాని చెప్పలేక, గుర్తురాక చాలా చాలా బాధపడుతుండేవారు. కుమారుని పరిస్థితి చూచి తండ్రిగారైన శ్రీకామరాజుగారు శ్రీవేంకటరమణమూర్తికి మ్రొక్కుకున్నారు. 'మా రామకృష్ణ ఆరోగ్యం కుదుటపడితే నీ దర్శనానికి వస్తాను, మ్రొక్కులు చెల్లిస్తాను స్వామి త్వరగా నా బిడ్డ కోలుకునేట్లు చెయ్యి' అంటూ శ్రీకామరాజుగారు, కుమారుని ఆరోగ్యం కోసం ఆవేదన పడేవారు. కుమారుని కోసం తండ్రి పడే ఆవేదనంతా శ్రీస్వామివారికి అర్థమైంది, స్వామివారి అనుగ్రహం వల్ల మాస్టర్‌గారు కొంత కోలుకున్నారు.

తండ్రిగారు అనుకున్న మ్రొక్కుబడి తీర్చటానికి మాస్టర్‌గారు ఒక్క చక్కటి 'సాధనా క్యాంప్'ను తిరుమలలో పెట్టించమని శ్రీయుగంధర్, విజయశ్రీ వాళ్ళకి చెప్పారు. తిరుమలలో చాలా కాలం తర్వాత చేస్తున్న సాధనా శిబిరం, భక్తులందరికీ అమితానందం కలిగింది. తిరుమలకి వెళ్ళి అటు 'శ్రీనివాస దర్శనం' ఇటు 'శ్రీరామకృష్ణగారిచ్చే ప్రవచనాలను' వినే భాగ్యం కలుగుతుందన్న ఉత్సాహంలో దాదాపు 200 మంది ఈ శిబిరానికి ప్రయాణమైనారు. కాలినడకనే కొండ ఎక్కుతున్నాను. నాతో వచ్చేవాళ్ళు రావచ్చునని ముందుగానే మాస్టర్‌గారు సెలవిచ్చియున్నారు. అసలే నీరసంగా వున్నారు. ఏడుకొండలు ఎక్కటం అంటే మాటలా? ఎలా? ఇంతలో శ్రీ భక్తిచైతన్య స్వామివారికి సమాచారం అందింది. వారు, తాము కూడా వస్తున్న విషయాన్ని తెలియపరిచారు. కొంత ఊరట కలిగింది. మాస్టరుగారికి ఎలాంటి అలసట తెలియకుండా తీసుకువెళ్ళే ఉపాయం ఆయనగారికి

తెలుసు. శ్రీభక్తిచైతన్య స్వామివారు వస్తున్నారనేసరికి మాస్టర్‌గారు కూడా చాలా ఆనందించారు.

అది 2010 ఫిబ్రవరి 26వ తేదీ. ముందుగా చెప్పుకున్న విధంగా అందరూ అలిపిరి దగ్గర కలుసుకున్నాము. మాస్టర్‌గారికి దారిలో ఏదైనా అవసరమౌతుందనే ఉద్దేశ్యంతో ముందు జాగ్రత్తలతో వారికి కావలసిన కొన్ని పానీయాలు తీసుకొని మాస్టర్‌గారితో నడవటానికి అందరూ సిద్ధపడ్డారు. పూజ్యశ్రీమాస్టర్‌గారు నడక ప్రారంభించగానే అందరూ కదిలారు. 'ఏడు కొండలవాడా, వేంకట రమణా గోవిందా! గోవింద...' అంటూ అందరూ ఒక్క ఊపున లేచారు. మంచి ఉత్సాహముతో, పరవశించిపోతూ నడకను ప్రారంభించారు. పూజ్యశ్రీమాస్టారి ప్రక్కన శ్రీచైతన్యస్వామి వారు ఉండటం ఎంతో మేలైంది. చిన్నచిన్న మెళుకువులనుపయోగించి వారు, మాస్టర్‌గారు సునాయాసంగా కొండ ఎక్కటానికి సహకరించారు. మధ్యాహ్నానికందరూ తిరుమల చేరుకున్నారు. కొండ ఎక్కుతూనే మాస్టర్‌గారు ఏడుకొండలవాడికి తల నీలాలు ఇచ్చి స్నానాలు చేసేశారు. సరే ఆ సాయంత్రానికి అందరూ విశ్రమించాలని, మరునాడు దర్శనాలకి ఏర్పాట్లు జరిగాయని శ్రీమతి విజయశ్రీగారు ప్రకటించడంతో అందరూ ఎవరి విడిదికి వాళ్ళు వెళ్ళిపోయారు.

28వ తేదీ ఉదయం 5:00 గంటలకు పూజ్యశ్రీమాస్టర్‌గారికి, వాళ్ళ నాన్నగారికి ఇంకా కొంతమందికి ప్రత్యేక దర్శనాలకు టిక్కెట్లు తీసుకొన్నారు. ఈ నలుగురు దర్శనానికి బయలుదేరారు. దర్శనం దివ్యంగా జరిగింది. శ్రీ కామరాజుగారు అనుకున్న మ్రొక్కుబడి ప్రకారం శ్రీవేంకట రమణమూర్తికి మ్రొక్కు చెల్లింపుగా 50వేల రూపాయలను ఒక నూతన వస్త్రంలో కట్టి వేంకటేశ్వర స్వామివారి హుండీలో వేసి, స్వామివారికి నమస్కరించి ఆశీస్సులనందుకున్నారు మాస్టర్‌గారు. ఆ రోజంతా అలా గడిచిపోయింది.

తరువాత అనుకున్న ప్రకారంగా శ్రీమతి విజయశ్రీగారు సాధనా శిబిరాన్ని చక్కగా నిర్వహించారు. ఇక్కడ మాస్టర్‌గారు క్రాంతిధర్మ సాహిత్యం మీదనే క్లాసులు చెప్పారు. ఆ పుస్తకాలపట్ల అందరికీ అవగాహన రావాలని, వాటిలో వున్న జ్ఞానం సాధకుల సొంతం కావాలనే ఉద్దేశ్యంతోనే మాస్టర్‌గారు క్రాంతిధర్మ పుస్తకాన్ని చక్కగా వివరించారు. అలా మూడు రోజులపాటు సాధనా శిబిరం ఎంతో సరదాగా, సందడి సందడిగా, ఆహ్లాదకరంగా జరిగింది. చల్లటి వాతావరణం దైవసన్నిధిలో, మాస్టర్‌గారి ఆరాలో, వారు చెప్పే మధురమైన మాటలను వింటూ అందరూ పరవశించిపోయారు. తిరుగు ప్రయాణంలో మాస్టారు శ్వేతద్వీపానికి వచ్చారు.

ఇక్కడ ఒక విచిత్రం జరిగింది. ఇంటికి వచ్చాక కాస్త సేదతీరగానే మాస్టర్‌గారు, 'నా లాప్‌టాప్ తెచ్చివ్వమ్మా అన్నారు'. ఎక్కడ చూసినా లేదు. ఇంట్లో అందరం వెతికి వెతికి వేసారిపోయాం. ఎక్కడా లేదు. అందరికీ ఫోన్లు చేశాను. జాడలేదు. మనస్సులో చాలా బాధ. అది లేనిదే మాస్టారి పని జరగదు. ఇంత అజాగ్రత్తగా ఎప్పుడూ జరగలేదు. ఎలారా భగవంతుడా! అనుకుంటూ ఏడు కొండల వాడిని తలుచుకున్నాను. అంతే, తిరుమల వసతిగృహంలోనే ఉండిపోయిందేమోనన్న చిన్న ఆశాకిరణం మదిలో మెదిలింది. శిబిరం అయిపోయినా ఇంకా శ్రీమతి గౌతమి, భవానీగార్లు అక్కడే ఉన్నారని తెలిసింది. వెంటనే వారికి ఫోన్‌చేసి వసతిగృహం వివరాలన్నీ చెప్పి ఎలాగైనా లాప్‌టాప్ తీసుకురమ్మని వాళ్ళకు చెప్పాను.

అప్పటివరకు ఇంట్లో ఎవ్వరికీ ప్రాణంలో ప్రాణం లేదు. మాస్టర్‌గారు ఏమి అనలేదు కానీ, వారి పని అంతా లాప్‌టాప్ మీదనే గదా జరుగుతుంది. అది లేకపోతే ఇంక వారి పని నడిచేదెలా? హే ఈశ్వరా! అది దొరికేలా చెయ్యి స్వామి అంటూ ఆ ఏడుకొండలవాడిని, ఇటు మాస్టర్‌గారిని వేడుకొంటూ ఆ రాత్రి గడిపాను. నా ప్రార్థన విన్నారు అటు ఆ స్వామివారు, ఇటు ఈ స్వామి. అందుకే ఆ నిధి దొరికింది.

మరి అది శ్రీనివాసుని కృపో, మాస్టర్‌గారి అనుగ్రహమో తెలియదుగానీ మొత్తంమీద లాప్‌టాప్ దొరికింది. మర్నాడు మధ్యాహ్నానికల్లా వాళ్ళు ఆ వస్తువును తెచ్చి మాస్టర్‌గారి చేతిలో పెట్టారు. దానిని చూసేసరికి ఎంత ఆనందం కలిగిందో చెప్పలేను. ఏమో, తప్పు ఎటు జరిగిందీ, ఎలా జరిగిందీ తెలియదు. కానీ దానిని గురించి తర్కించే బదులు ఆ పని అయ్యే మార్గం ఎలాగా అనేది ఆలోచించి దానికి మానవ ప్రయత్నం మూడు వంతులు చేస్తే దైవ అనుగ్రహం 20% వుంటుందనే శాస్త్రం. సరే, తప్పుకు పరిహారంగా స్వామివారికి రు. 1116/-లు మరునాడే శ్రీవారికి పంపించాను. నిజంగానే ఆయన ఆపదమొక్కులవాడు. ఆపదను దాటించాడు. ధన్యవాదాలు ప్రభూ అనుకున్నాను.

తిరుమల నుంచి వచ్చిన తర్వాత మెల్లమెల్లగా మళ్ళీ 'జన్మశతాబ్ది' పనిని వేటపాలెం దత్తక్షేత్రంలో, తరువాత నారాకోడూరులో ఒక్కరోజు జరిగిన సాధనా శిబిరాలలో ముఖ్యంగా క్రాంతిధర్మ సాహిత్యమును గురించి, సంపూర్ణ సమర్పణ మరియు జన్మశతాబ్ది సమారోహమును గురించిన వివరణనే చెప్పడం జరిగింది. అందరినీ జన్మశతాబ్ది సమారోహానికి శాంతికుంజ్ వెళ్ళమని చెప్పారు. కార్యకర్తలుగా సేవ చేయదలుచుకున్నవారిని మాత్రం ముందే వెళ్ళమని సూచనచేశారు.

ఇంతలో శ్రీ జి.యస్. కృష్ణగారు ఫోన్‌చేసి తేలప్రోలులో 'యోగ సిద్ధ ఆశ్రమాన్ని' నిర్మించామని దానిని ఆవిష్కరించేందుకు రమ్మని మాస్టర్‌గారిని ఆహ్వానించారు. మార్చి 17, 18 తేదీలలో తేలప్రోలులో జరిగిన 'యోగ సిద్ధి ఆశ్రమ' ఆవిష్కరణకు వెళ్ళడం–అందులో వారు ఏర్పాటు చేసిన 14 విభాగాల ఆవిష్కరణలు, వాటి ప్రాముఖ్యతలను వివరించారు. అంతా అయ్యాక శ్రీ జి.యస్. కృష్ణగారు వచ్చి సభాముఖంగా మాస్టర్‌గారికి ఎంతో శ్రద్ధాభక్తులతో సన్మానం చేసి గురుదక్షిణ సమర్పించుకొని మాస్టర్‌గారికి వీడ్కోలు పలికారు. అలా ఆ కార్యక్రమం అపూర్వంగా పూర్తి అయినాక తిరిగి ఒంగోలుకు వచ్చారు.

21. జన్మశతాబ్ది సమారోహం - శక్తి కలశం

నారాకోడూరులో జరిగిన సాధనా శిబిరంలో మాస్టారు, జన్మశతాబ్ది సమారోహాన్ని పురస్కరించుకొని ప్రజ్ఞా పరిజనులు 'ఒక శక్తి కలశాన్ని' గ్రామ గ్రామాలలో త్రిప్పి గురుదేవుల గురించి, జన్మశతాబ్ది గురించి విస్తృతంగా ప్రచారం చెయ్యాలనే ఒక ఆలోచనను సభాముఖంగా ప్రతిపాదించారు. పూజ్యమాస్టర్‌గారి నోటి వెంట ఒక మాట వచ్చిందంటే, ఇంక అది జరిగి తీరాల్సిందే! కానీ దానికి కాస్త సమయం కావాలి, అవసరమైన వనరులను, మనుషులను సమీకరించు కోవాలి. కాని మాస్టర్‌గారు ఎప్పుడూ 'మీరే పని చెయ్యాలన్నా ముందుగా దక్షిణ భారతదేశపు కన్వీనర్‌గారైన శ్రీ అశ్వినీ సుబ్బారావుగారికి చెప్పి వారి అనుమతితోనే పనులు చెయ్యండి' అని చెప్పేవారు. సరే జ్ఞానరథం యావదాంధ్రప్రదేశ్ త్రిప్పాలంటే ముందుగా వారి సలహాలను కూడా తీసుకోవటం మంచిదనే ఉద్దేశ్యంతో నేను, తేజశ్రీ, శ్రీలక్ష్మి, మణికుమార్ ఇంకా కొంతమంది కార్యకర్తలం వెళ్ళి శ్రీ అశ్వినీ సుబ్బారావుగారిని కలసి విషయం వివరించాం. వారు కూడా ఈ ఆలోచనలకు చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, జ్ఞానరథాన్ని, శక్తి కలశాన్ని కూడా తీసుకెళ్ళమని చెప్పారు. వారి వైపు నుండి వారు అన్ని రకాల సహకారాలను అందచేశారు. ఒక దివ్యమైన సూక్ష్మశక్తి మార్గదర్శనంలో 'జ్ఞానరథం' త్రిప్పటానికి సకల ఏర్పాట్లు జరిగిపోయాయి. యుగపరివర్తన పావన శుభవేళలో ఒక అదృశ్యమైన, పరమశక్తివంతమైన శక్తితో కలిసి పనిచేయటానికి 'జన్మశతాబ్ది సమారోహ' పర్వాన్ని గురించి జనంలో జాగృతి తీసుకురావడానికి ముందు పరిజనులు నడుస్తూ వారితోపాటు లక్షలాదిమందిని గురుదేవుల దగ్గరికి తీసుకువెళ్ళాలి. దాని కోసమే ఈ ప్రచార కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం జరిగింది. ఇక్కడ వున్న ధర్మసూక్ష్మం ఒక్కటే.

భగవంతుడు మనకేదైతే ఇచ్చాడో దానిని తిరిగి భగవంతుడికే ఇవ్వాలి. ప్రేమనిస్తే ప్రేమనే ఇవ్వాలి. సంపదలిస్తే సంపదలనే ఇవ్వాలి. ప్రసన్నతనిస్తే, ప్రసన్నతనే ఇవ్వాలి. జ్ఞానాన్నిస్తే జ్ఞానాన్నే పంచిపెట్టాలి. గురుదేవుల గురించి ఇంత జ్ఞానాన్ని పంచిపెట్టిన మన ప్రియాతి ప్రియమైన ఆత్మ బంధువు పూజ్యశ్రీశ్రీరామకృష్ణగారు అనంతమైన ప్రేమను మన అందరికి పంచిపెట్టారు. అనంతమైన జ్ఞానాన్ని ప్రవహింపజేశారు. ఈ జన్మశతాబ్దికి 'గురుదేవుల సేవ' చెయ్యండి అన్నారు. గురుదేవుల సేవ అంటే వారందించిన 'జ్ఞాన గంగను పంచటమే'. దానికోసమని ఈ జ్ఞానరథం నిండా గురుదేవుల సాహిత్యాన్ని నింపుకొన్నారు.

పూజ్యగురుదేవుల శతజయంతి మహోత్సవాలను పురస్కరించుకొని గ్రామ గ్రామాలలో గురుదేవుల సందేశాన్ని సాహిత్యాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికై 'గాయత్రీ చేతనా కేంద్రం' హైద్రాబాద్‌లో ఏప్రియల్ 24వ తేదీ ఉదయం 10 గంటలకు 'శక్తి కలశానికి' శ్రీయుతులు పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారు, శ్రీ అశ్వనీ సుబ్బారావుగారు శాస్త్రోక్తంగా పూజలు చేసి – పూజ్య గురుదేవుల గురించి, జన్మశతాబ్ది సమారోహం గురించి ఈ సంవత్సరమంతా విస్తృతంగా ప్రచారం చెయ్యాలనే ప్రేరణాత్మకమైన ప్రవచనాలనిచ్చారు. పూజ్య గురుదేవుల, వందనీయ మాతాజీల సూక్ష్మసంరక్షణలో ఈ జ్ఞానరథాన్ని నడిపించే బాధ్యతను శ్రీ జి.మణికుమార్‌గారు స్వీకరించారు. 24వ తేదీ సాయంత్రం సర్వాంగ సుందరంగా అలంకరించబడి ప్రచారానికి సమాయత్తమైన జ్ఞానరథానికి పూజ్యశ్రీ శ్రీరామకృష్ణగారు, శ్రీ సుబ్బారావుగార్లు కొబ్బరికాయలు కొట్టి, హారతులిచ్చి జ్ఞానరథాన్ని ముందుకు నడిపించారు.

అలా బయలుదేరిన జ్ఞానరథం హైద్రాబాద్, కొండమల్లేపల్లి, నాగార్జునసాగర్, మాచర్ల, పిడుగురాళ్ళ మీదుగా మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో తిరుగుతూ–దేవస్థాపనలు చేస్తూ, సత్సంగాలను చెబుతూ, సాహిత్యాన్ని విక్రయిస్తూ, యుగశక్తి మాసపత్రికకు చందాదారులను చేర్పిస్తూ సుమారు పదినెలల పాటు ప్రచార కార్యక్రమాన్ని సాగించి జనంలో కొంత చైతన్యాన్ని తీసుకువచ్చింది. ఈ కార్యక్రమాన్ని 'జిల్లాలవారీగా' సమయాభావం లేకుండా అందరికీ సంతృప్తి కలిగేలాగా నేను రూట్‌మ్యాప్‌ను తయారుచేశాను. ఎప్పటికప్పుడు గ్రామాలవారికి శక్తికలశం ఆ వూరుకు ఎప్పుడు వెళుతుంది, ఏం చెయ్యాలనే దాని గురించి కచ్చితమైన కార్యక్రమాల వివరాలు చెప్తూ, జ్ఞానరథ బాధ్యతను స్వీకరించిన మణికుమార్‌గారికి కూడా సమాచారం అందించేదాన్ని. మంచి ఎండాకాలం,

వడగాలులు వీస్తుండేవి. అయినా గురుదేవులపై గల భక్తితో, మాస్టర్‌గారి పట్ల గల ప్రేమతో మణికుమార్‌తోపాటు రఘు, రంగనాయకులు, గొల్లపూడి సుబ్బయ్యగార్లు ఈ బాధ్యతను చాలా చక్కగా నిర్వహించి, జీవితాన్ని ధన్యం చేసుకున్నారు. అలానే వారితో కలసి పనిచేసిన వారందరి జీవితాలు ధన్యమైనాయి. జన్మశతాబ్దికి శక్తికలశాన్ని అలా తిప్పాలనే మాస్టారి సంకల్పం అంత ఘనంగా రూపుదాల్చింది.

22. వాత్సల్యమూర్తి

నారాకోడూరులో సాధనా శిబిరం జరుగుతున్నది. జన్మశతాబ్ది కార్యకలాపాలను గురించిన ప్రత్యేక వివరణ చెప్తున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారి కార్యదీక్ష అసామాన్యమైనది. వారు తలపెట్టిన పనిని పూర్తిచేసేంతవరకూ వారి కృషి అలాగా సాగిపోతూనే ఉండేది. 'ప్రారంభించిన తర్వాత పూర్తి చేయాలి. అప్పుడే తలపెట్టిన పనికి సార్థకత' అని అంటుండేవారు. ఈ సాధనాశిబిరం జరుగుతున్న సమయంలో ఒకసారి తెనాలికి దగ్గరగా వున్న ఈమని గ్రామం నుంచి శ్రీవేంకటేశ్వర రావుగారు అనే హోమియో డాక్టరుగారు మాస్టర్‌గారిని చూడాలని వచ్చారు, వారు మాస్టర్‌గారిని కలిసి 'తమను పరిచయం చేసుకొని' ఆశీర్వాదాలు పొంది వెళ్ళిపోయారు. అలా ఎప్పుడు నారాకోడూరు, గుంటూరు ఆశ్రమాలలో సాధనా శిబిరాలు పెట్టినా వారు రావడం, మాస్టర్‌గారితో కాసేపు ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడి వెళ్ళడం జరుగుతుండేది.

శ్రీ వేంకటేశ్వరరావుగారు హోమియో మందులివ్వటంలో అఖండ ప్రజ్ఞాశాలి. అందుచేత వారు రిటైర్ అయ్యాక తమ విరామ సమయంలో, శారీరక రుగ్మతలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు ఇచ్చేవారు. ప్రేమతో వారిచ్చే మందులతో రోగులు త్వరగా కోలుకొనేవారు. అలా వారి పేరు గ్రామ, గ్రామాలలో సుపరిచితమై, వారికి కాస్త విరామం కూడా దొరకని రీతిలో వైద్యసేవ చేయడం వారి నిత్యకృత్యమైంది. అంతేకాక వారు శిరిడీ సాయినాథుని భక్తులు. బాబా సేవలో నిమగ్నమైనవారు. చక్కటి బాబామందిరాన్ని కూడా నిర్మించారు. అర్చనలు, పూజలు, ఆరతులతో మందిరం సర్వవేళలా కళకళలాడుతుంటుంది.

ఒకసారి వారు మాస్టరుగారిని ఈమని తీసుకెళ్ళి బాబాగారి మందిరాన్నీ, ఉచిత హోమియో వైద్యశాలను చూపించి 'మాస్టారూ, నాదొక మనవి. మా మనుమడికి మీరు ఉపనయనం చెయ్యాలి.

మీకెప్పుడు వీలైతే అప్పుడు' అన్నారు. 'ముహూర్తం పెట్టించుకోండి. ఆ సమయానికి వస్తాను' అని చెప్పారు ఆ వాత్సల్యమూర్తి. అడిగినవారికి అన్నీ వరదానాలే ఇచ్చేవారు. 2010 జూన్ 6వ తేదీన ఉపనయనానికి ముహూర్తం పెట్టించారు డాక్టర్‌గారు. అనుకున్న సమయానికి శ్రీ బాబాగారి మందిరంలో డాక్టర్‌గారి మనుమడికి, వారి తమ్ముని కుమారునికీ ఉపనయన సంస్కారం చేయించి, గాయత్రీమంత్ర దీక్షనిచ్చి వారిని ఆశీర్వదించారు. ఒక సద్గురువు సమక్షంలో దీక్షాసంస్కారం చేయించుకుని, మంత్రదీక్ష తీసుకున్న ఆ పిల్లల భవిష్యత్తు కచ్చితంగా ఉజ్జ్వలమై తీరుతుంది గదా! వెంకటేశ్వరరావుగారు మాస్టరుగారికి ఎంతో ఆత్మీయులైనారు, మాస్టర్‌గారికి ఏదైనా బాగాలేకపోతే వారికి ఒక్క ఫోను చేస్తే చాలు 'చక్కటి మందులను' పంపించేవారు. అలా వారితో ఎంతో అనుబంధం పెరిగిపోయింది.

గుంటూరులో 2010 జూన్ 8, 9, 10 తారీఖులలో డా॥ శ్రీరామ్‌గారిచే ఏర్పాటు చేయబడిన 108 కుండీయ యజ్ఞ కార్యక్రమాల నిమిత్తం జ్ఞానరథం గుంటూరు చుట్టప్రక్కలగ్రామాలలో విశేషంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించింది. అలానే నర్సరావుపేటలో శ్రీనివాసరావుగారు ఏర్పాటుచేసిన 24 కుండీల యజ్ఞాల కోసం, గాయత్రీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీ పేరిశాస్త్రిగారు, గోళ్ళపాడులో ఏర్పాటుచేసిన 54 కుండీల యజ్ఞాల కొరకు జ్ఞానరథం అద్భుతంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించింది. అంతేకాకుండా జులై 9 నుండి 16 వరకు భద్రాచలంలో మాస్టర్‌గారితో 'ప్రాణ సముపార్జనా' సాధనాశిబిరం జరిగినప్పుడు కూడా పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు మొదలైన ప్రాంతాలలో కూడా జన్మశతాబ్ది ప్రాముఖ్యతను ప్రచారం చేయటానికి 'జ్ఞానరథాన్ని' అలుపెరగని రీతిలో కార్యకర్తలు తిప్పడమనేది ఎంతో ప్రశంసించదగిన విషయం. ఈ ఒక్క జ్ఞానరథంతో అన్ని ప్రాంతాలలో ప్రచారం చెయ్యటానికి సమయం చాలనందున కుమారి రమణకుమారి, శాంతారావు, వెంకటేశ్వర్లు మొదలైనవాళ్ళ బాధ్యత మీద తూర్పు గోదావరి జిల్లాలో ప్రచారం చేసేందుకు మరొక జ్ఞానరథం కూడా ఏర్పాటు చేసి దానిని ప్రచార నిమిత్తం పంపడం జరిగింది.

23. దత్తస్థూప ప్రారంభోత్సవం

చిలకలూరిపేటకు రెండు కి.మీ. దూరంలో గల పురుషోత్తమపట్నంలో శ్రీనారాయణస్వామి అనే భక్తుడు 'శ్రీశిరిడిసాయి' మందిరాన్ని నిర్మించి అఖండమైన భక్తిశ్రద్ధలతో బాబావారిని సేవిస్తుండే

వారు. వారికి మాస్టారంటే ప్రాణం. ఆ దేవాలయ ప్రాంగణంలోనే పంచదత్తులకు, నవనాథులకు కూడా మందిర నిర్మాణాలు చేశారు. అదే ప్రాంగణంలో 153 అడుగుల ఎత్తు గల దత్త స్థూపాన్ని కూడా నిర్మించారు. ఆలయంలో దేవతామూర్తుల ప్రాణప్రతిష్ఠతో పాటుగా దత్తస్థూప ప్రారంభోత్సవాది కార్యక్రమాలను మాస్టర్‌గారి సారధ్యంలో నిర్వహించాలనే కోరికతో శ్రీ నారాయణస్వామిగారు మాస్టర్‌గారిని కలిసి 'స్థూప ఆవిష్కరణకు' రావాలని, ఐదు రోజులపాటు సాధనాశిబిరాలను గూడా పెట్టించమని ఎంతో ప్రేమతో అడిగారు. అంతే ప్రేమతో ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తానని మాస్టరుగారు మాటిచ్చారు.

2010 జులై ఒకటవ తేదీ నుండి 5వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో ఐదు రోజుల సాధనను నిర్దేశించారు. ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల దాకా అఖండదీప సమ్ముఖంలో గాయత్రీ, దత్త మంత్రాలను జపం చేయించాలి. **అప్పుడే ఆ ప్రాంగణంలో ఉండే దైవీశక్తుల జాగరణ జరుగుతుంది.** మంత్ర జపాలు చేయించే బాధ్యతను నేను స్వీకరించాను. సాయంత్రం 6:30 నుండి మాస్టర్‌గారి ప్రవచనాలు జరిగేవి. ఐదు రోజుల సాధన పూర్తయిన తర్వాత ఆరవ తేదీ ఉదయం నుండి పంచదత్తుల ప్రతిష్ట, నవనాథుల ప్రతిష్ట, దత్త స్థూప ఆవిష్కరణతో సహా అన్ని కార్యక్రమాలు, బాజా భజంత్రీల మధ్య, వేదమంత్రాలతో ఎంతో వైభవోపేతంగా మాస్టర్‌గారి సువర్ణ హస్తాల మీదుగా జరిగిపోయాయి.

నవనాథ పీఠాన్ని పెట్టాలనే మాస్టర్‌గారి సంకల్పం ఇలా ఇక్కడ ఈ మందిరంలో రూపుదాల్చింది. ఇక్కడ వున్న ధర్మసూక్ష్మాన్ని గమనించినట్లయితే **'తలచిన ప్రతి ఆలోచన, కోరిన ప్రతి కోరిక రూపుదాల్చు జగతిలోన నియమమిదే తప్పదిక'** అని మాస్టర్‌గారు వ్రాసిన పాటకు ప్రాణం పోసింది ఈ సంఘటన. ఈ ధర్మం ఒక్క మాస్టర్‌గారి విషయంలోనే కాదు. ఎవరైనా ఈ కాలంలో ఒక సంకల్పాన్ని దృఢంగా తీసుకుంటే ఎప్పటికైనా సరే అది జరిగితీరుతుంది. ఈ మధ్యకాలంలో ఎక్కడ యజ్ఞం జరిగి మాస్టర్‌గారు వచ్చేవారు. ఎక్కడ చెప్పినా వారి ఏకైక లక్ష్యం జన్మశతాబ్ది. దాన్ని గురించే విశేషంగా ప్రస్తావించేవారు. ఎంతసేపు చెప్పినా ఒక్కటే.

(1) ఈ ప్రపంచంలోని అందరితో కలసిమెలసి పనిచెయ్యాలి.

(2) ఈ ప్రపంచానికి గాయత్రీ మంత్రాన్ని అందించాలి, యజ్ఞ విద్యను వివరించాలి.

(3) ఈ ప్రపంచానికి అతి ప్రధానమైనది సూర్యశక్తి. ఈ జ్ఞానం గురించి అందరికీ అవగాహన వచ్చేలా వివరించాలి. ఈనాడు ప్రపంచంలో ఉన్న అన్ని సంపదలు లుప్తమైపోతున్నాయి. మిగిలింది ఒకే ఒక్క శక్తి – అది సూర్యశక్తి అంటే గాయత్రీ జపం, అది ఈనాడు చాలా అవసరం. జపం కోట్ల సంఖ్యలో జరగాలి. సూర్యశక్తి ఈ పృథ్వికి చాలా అవసరం. గాయత్రీ జపంతో సూర్యశక్తిని వినియోగించుకోవచ్చు.

ఆ శక్తిని ఋషులు ఉపయోగించుకునేవారు. రామ, రావణ యుద్ధంలో కూడా శ్రీరాముడు 'ఆదిత్య హృదయం' ముమ్మారు పారాయణ చేసి, ఆ శక్తితోనే రావణసంహారం చేశాడు. తరువాత శ్రీరామరాజ్య నిర్మాణం చేయగలిగాడు. అదంతా సూర్య ఉపాసన యొక్క గొప్పతనమే అని వాల్మీకి రామాయణంలో మనం చదువుతాం.

24. భద్రాచలంలో సందేశం

గోదావరి నది ఒడ్డున గల దండకారణ్యంలో భద్రమహర్షి చేసిన కఠోర తపస్సుకు ఫలితంగా ఆయన భద్రాద్రి కొండగా మారి, శ్రీరాముడు తనపై నివాసముండే వరాన్ని పొందాడు. 17వ శతాబ్దంలో ఆ రోజుల్లో ఆ ప్రాంత తహసిల్దార్‌గా వెళ్ళిన గోపన్నగారు (శ్రీరామదాసు), శ్రీరామ చంద్రుని తొడపై సీతాదేవి కూర్చున్న విచిత్రమైన విగ్రహాన్ని దర్శించాడు. అయితే ఈ విగ్రహాన్ని శ్రీరామదాసు దర్శించటానికి వెయ్యి సంవత్సరాల క్రితమే ఆదిశంకరులు

వామాంకస్థిత జానకీ పరిలసత్ కోదండదండం కరే
చక్రంచోర్ధ్వకరేణ బాహుయుగళే శంఖం శరం దక్షిణే ।
బిభ్రాణం జలజాతపత్ర నయనం భద్రాద్రిమూర్ధ్ని స్థితం
కేయూరాది విభూషితం రఘుపతిం సౌమిత్రియుక్తం భజే ॥

అంటూ ఆ విగ్రహ స్వరూపాన్ని స్తుతించటం జరిగింది. తక్షణమే శ్రీరామదాసుగారు అపారమైన భక్తి, శ్రద్ధలతో ఆ విగ్రహాలకు భద్రాద్రి పైన చక్కటి దేవాలయాన్ని నిర్మించారు. అయితే ఆ ఆలయ నిర్మాణానికి సహాయపడ్డదీ, రామదాసుగారికి తారక మంత్రోపదేశాన్ని ఇచ్చింది సంత్ కబీర్‌దాస్‌గారే!!

పూజ్యగురుదేవులే పూర్వజన్మలో కబీర్‌గా జన్మించారు. కాబట్టి గాయత్రీ పరివార్, పరిజనులకు, గురువుగారి జన్మ శతాబ్ది ఉత్సవాల కార్యప్రణాళికలను చర్చించటానికి సరైన క్షేత్రం భద్రాచలంగా భావించి మాస్టర్‌గారు 2010 జూలై 9వ తేదీ నుండి 16వ తేదీ వరకు చక్కటి సాధనా శిబిరాన్ని నిర్వహించారు. పర్ణశాల దగ్గర శ్రీరామదాసు చేసిన అనేక సాధనల అంతరార్థాలని వివరించటంతో పాటు సాధన కూడా చేయించారు. సరిగ్గా అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో జ్ఞానరథం ద్వారా జన్మశతాబ్ది ఉత్సవాల గురించి ప్రచారం జరుగుతున్నది. ఈ జ్ఞానరథాన్ని సరిగ్గా అదే తేదీలలో భద్రాచల ప్రాంతానికి తీసుకువచ్చి ఇంటింటికీ గురుదేవుల శతాబ్ది ఉత్సవాల గురించి పరిచయం చేయటానికి, పాదయాత్ర చేస్తూ గ్రామాలలో తిరగటానికి పరివార్ సభ్యులు సమాయత్తమైనారు. సతీష్‌ఖండేల్‌వాల్‌గారు ఆ ప్రాంతంలో గురుదేవుల కార్యక్రమాలను విస్తృతంగా చేశారు. అందుచేత వారు కూడా ఈ ప్రచారకార్యక్రమాలకు విలువైన సూచనలనందచేస్తూ 'పరిజనులందరిని జన్మశతాబ్ది కార్యక్రమాలలో పాల్గొనాలని తమ విలువైన అంశ, సమయ దానాలను శ్రద్ధతో ఇవ్వాలని ప్రోత్సహించారు.' ఆంధ్రప్రదేశ్‌ను గాయత్రీప్రదేశ్‌గా మార్చటానికి స్టిక్కర్లు, పాంప్లెట్లతో, దీప యజ్ఞాలతో జ్ఞానరథం అప్పటికే గ్రామగ్రామాలలో తన దిగ్విజయయాత్ర ప్రారంభించింది.

జన్మశతాబ్ది ప్రచార కార్యక్రమాలలో భాగంగా ఏడురోజుల పాటు భద్రాచలంలో సాధనాశిబిరం జరిగింది. విశేషమైన సాధనలు, సందేశాలను ఇచ్చారు. వారి ప్రవచనాలు మొత్తం గురుదేవుల 'లక్ష్యం' చుట్టూనే అల్లుకుపోయి వుండేవి. ఒక రోజున వారిచ్చిన ప్రవచనంలో త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడినాటి కాలంలో జరిగిన కొన్ని సంఘటనలను పూజ్యశ్రీ శ్రీరామశర్మ ఆచార్యగారి జీవితంలో సరిగ్గా ఎలా సమన్వయమయ్యాయో అద్భుతంగా చెప్పారు. పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యజీ స్వయంగా వ్రాసిన అఖండజ్యోతి మాసపత్రిక మొదటి ప్రతులలో గాయత్రీ చిత్రపటము క్రింద ఇలా వ్రాసి వుండేది.

సందేశ్ స్వర్గ్‌కా నహీ ధరాపర్ లాయా – ఇస్ ధరతి కోహీ స్వర్గ్ బనానే ఆయా

అంటే 'స్వర్గము యొక్క సందేశమును భూమి మీదకు తీసుకురాలేదు– పృథ్వినే స్వర్గంగా మార్చడానికి వచ్చాము' అని గురుదేవులు వ్రాశారు. పూజ్య గురుదేవులు జీవించి వున్నంతకాలము ఒక్క విషయాన్నే పదే పదే చెప్తుండేవారు. 1) సంఘర్షణ 2) సృజన. ఈ రెండు కార్యక్రమాల ద్వారా

మాత్రమే 'నవయుగావతరణ' జరుగుతుందని, 'రామరాజ్యం' వచ్చి తీరుతుందని చెప్తుండేవారు. 'సంఘర్షణ' కార్యక్రమాలన్నింటిని వారు ఒక్కరే 'ఏక్ లా చలోరే' అనే సాధనతో జీవితాంతం పోరాటయోధునివలె నిర్వహించారు.

వారి లక్ష్యం 'కలియుగంలోనే సత్యయుగం వచ్చి తీరుతుంది' అని. అసలైన పనికి తరుణం వచ్చింది. మనమందరమూ ఈ రెండు, మూడు సంవత్సరాలపాటు విశిష్టమైన కార్యక్రమమును చేసి చూపితే–శతాబ్ది పురుషుని అసంఖ్యాక అనుదానాలకు మనం అర్హులమౌతాము. 'యుగ పరివర్తనా' ప్రక్రియలో ఒక మహత్తరమైన పాత్రను నిర్వహించి బాధ్యతాయుతమైన సాధకులుగా, యుగశిల్పులుగా పిలువబడే గౌరవాన్ని మనం పొందుతాము. దీనికోసం ఏది, ఎలా చెయ్యాలనేదానికి పూజ్య గురుదేవులే సూచనలనిస్తూ మార్గదర్శనం చేస్తారు.

25. కలియుగంలోనే సత్యయుగం

1911–2011 కాలఖండంలో రెండు శతాబ్దులు కలసివున్నాయి. యుగాన్ని కుదిపివేసిన స్వామి వివేకానందుల వాణి, శ్రీ అరవిందుల తపోమయ జీవనం, మౌనంలో సాగిన వారి లేఖినీ, గోఖలేగారి ప్రేరణతో ఒక బారిష్టరు మహాత్మాగాంధీగా మారడం, వినోబా, అమరవీరుడు భగత్‌సింగ్, సుభాస్‌చంద్రబోస్, శ్రీ రవీంద్రకవి, శ్రీరమణమహర్షి మొదలైన వారందరికీ సాక్షిగా నిలిచింది ఈ కాలఖండం. ఈ కాలంలోనే స్వాతంత్ర్య సమర పోరాటం జరిగింది. రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. ప్రకృతి ప్రకోపాలు సంభవించాయి. అయితే 1911 నుండి 2011 వరకు గల కాలఖండం నిర్మాణాత్మక ఉద్యమాలకు, వైజ్ఞానిక ఆవిష్కరణలకు ఇంకెందరెందరో మహాత్ముల, మహనీయుల అవతరణకు సృజనను ప్రతిబింబించే సంస్థల ఆవిర్భావానికి నెలవైన సమయమిది.

ఈ కాలఖండంలో మొత్తం ఎంతటి సృజన జరిగిందో, ఇప్పుడు ఈ 2011–2012 సంవత్సరంలో కలియుగంలో సత్యయుగావతరణకు అవసరమైన అనేక అవకాశాలు సాకారమై ఎదుట నిలిచివున్నాయి. రాబోయే ప్రజ్ఞాయుగం ఎలా వుంటుందనే విషయం గురించి తెలుసుకోవాలంటే గురుదేవుల సాహిత్యం చదవవచ్చును. ఈ ప్రజ్ఞాయుగాన్ని సాకారం చేయటానికి గురుదేవులు ఒక విశిష్టమైన పంచవీరభద్ర సాధన చేసి, త్రేతాయుగంలో శ్రీరాముని తో కలసి పనిచేసి 'రావణ వధకు', ఆ తరువాత రామరాజ్య స్థాపనకు సహకరించిన ఐదుమంది ప్రముఖ దేవపుత్రులను,

పంచవీరభద్రులుగా ఈ భూమ్మీదకు దించి, వారి ద్వారా 'నవయుగ నిర్మాణం' కార్యక్రమానికి నాందీ ప్రస్థావన చేశారు.

త్రేతాయుగంలో రఘురాముడు 10 వేల సంవత్సరాలపాటు రాజ్యపాలన గావించాడు. బంగారు సీతాదేవి మూర్తిని ప్రక్కనుంచుకొని పెక్కు అశ్వమేధాలు, వాజపేయాలు, అగ్నిష్టోమ, గోసేవ మొదలైన యాగాలు చేశాడు. అందుచేత ఆనాడు కోసల రాజ్యము సుభిక్షంగా ఉండేది. సకాలములో వర్షాలు కురుస్తుండేవి. ప్రజలు సుఖశాంతులతో హాయిగా, ఆనందంగా వుండేవారు. వ్యాధులు, బాధలు, అకాల మరణాలనేవి లేకుండా, అనర్ధాలు కలుగకుండా ప్రజలు శాంతితో జీవించేవారు.

అలా శ్రీరామరాజ్యం శోభాయమానంగా ఉన్న కాలంలో కాలపురుషులు శ్రీరాముని వద్దకు వచ్చి 'బ్రహ్మదేవుడు పంపిన సందేశాన్ని' వినిపించారు. దానికి శ్రీరాముడు సమ్మతించాడు. అనంతరం లవ, కుశులకు, తన సోదర కుమారులకు వేర్వేరు రాజ్యాలను కేటాయించి, వారందరినీ ఆయా రాజ్యాలకు ప్రభువులుగా పట్టాభిషేకం చేశాడు. అనంతరం శ్రీరామచంద్రుడు పరమధామానికి చేరేందుకు నిశ్చయించుకొని, 'విభీషణుడు, హనుమంతుడు, జాంబవంతుడు, మైందుడు, ద్వివిదులను పిలిచి వారితో 'వారు భూలోకమునందే ఉండుటకు ప్రభువు ఆదేశించారు'. ఇది వాల్మీకిమహర్షి వ్రాసిన వాల్మీకి రామాయణ ఉత్తరకాండ 108 సర్గలో ఉన్న సమాచారం.

జాంబవంతం తధోక్తాతు వృద్ధం బ్రహ్మసుతం తధా,
మైందంచ ద్వివిందంచైవ పంచ జాంబవతా సహా।
యావత్ కలిశ్చ సంప్రాప్తః తావజ్జీవత సర్వదా ॥ (37)

తానేవ ముక్త్వా కాకుస్థః సర్వాంస్తాన్ ఋక్ష వానరాన్
ఉవాచ బాదం గచ్ఛంధ్వం మయా సార్ధం యధేప్సితమ్ ॥

అనంతరము బ్రహ్మదేవుని సుతుడు, వృద్ధుడు అయిన జాంబవంతునితో మైంద, ద్వివిదుల తోనూ, శ్రీరాముడు ఈ విధముగా పలికెను. 'మీరు ఐదుగురు అంటే జాంబవంతుడు, విభీషణుడు, హనుమంతుడు, మైందుడు, ద్వివిదుడు కలి పురుషుడు భూమండలమున అడుగిడునంత వరకు జీవించియుందురు. అనగా కృష్ణావతారము ముగియు వరకు జీవింతురు' అని చెప్పి శ్రీరాముడు పరమధామానికి వెళ్ళిపోయాడు.

ఈ ఐదుగురు అంటే విభీషణ, హనుమ, జాంబవంత, మైంద, ద్వివిదులు ఈ భూమ్మీదనే ఉంటారు. శ్రీరామునికి వాళ్ళెంత సమర్పణ చేసుకుంటే వారికి శ్రీరాముడు అంతటి వరదానాలను ప్రసాదించారు. అలాంటి మహనీయులను గురించి ఈ భద్రాచలం క్యాంపులో శ్రీశ్రీ మాస్టారు చక్కటి వివరణ ఇచ్చారు.

ఇక్కడ మాస్టరుగారు గురువుల గురించి, దేవతల గురించి అనేక విషయాలు చెప్తూ సంపూర్ణ సమర్పణ చేసుకున్న సాధకులకు వారిచ్చే ఐశ్వర్యాలు అనుదానాలు ఎలా ఉంటాయో మీకు తెలియదు. అడుక్కోనక్కరలేదు. పుష్కలంగా వరాలను కురిపిస్తారు. 'పూజ్యగురుదేవులు 1986లో చెప్పారు. నేను తిన్నదే నీవు తిను – నేను కట్టుకున్నదే నీవు కట్టుకో – నా తర్వాత అంతా నీదే' అని. నిజంగా అది ఎంతటి మహద్భాగ్యం. అంతటి వరాన్ని గురువుగారి నుండి పొందిన మాస్టర్‌గారి సమర్పణ ఏ స్థాయిదో మనకు తెలియదు గదా!

శ్రీరాముడు 10 వేల సంవత్సరాలు పరిపాలన చేసి మహాప్రస్థానానికి వెళుతూ, ఈ ఐదుగురిని భూమ్మీదనే ఉండమన్నాడు. అందులో విభీషణుడు, హనుమంతుడు, చిరంజీవులు. వీళ్ళ ఐదుగురిని గురుదేవులు చేసిన పంచవీరభద్ర సాధనకు సమతౌల్యం చేస్తున్నాడు.

(1) విభీషణుడు-రాజనీతిజ్ఞుడు

అన్న రావణుని అరాచకాలని ఓర్చుకోలేక శ్రీరాముని దగ్గర చేరాడు. ఇలా యుద్ధం చేస్తే రావణుడు చావడు. వాడి బొడ్డును కొట్టు అని అతని జీవితమర్మాన్ని చెప్పి రాముడికి సహాయం చేశాడు. తరువాత విభీషణుడు లంకా రాజ్యానికి ప్రభువయ్యాడు. ఇంకా చిరంజీవిగా భూమ్మీదనే ఉన్నాడు. యుగయుగాలు నుండి, ఇది రామాజ్ఞ.

(2) హనుమంతుడు-వ్యాపారవేత్త

హిమాలయాల నుండి సంజీవనిని తెచ్చి లక్ష్మణునికి ప్రాణం పోశాడు. హనుమంతుడికి పని, పని, పనే! ఇంకా ఆయన 'రామ కాజ కరివేకో ఆతుర'. ఎప్పుడూ ఆయన రామకార్యమనే ఒకే ఒక్క లక్ష్యం మీద వుంటాడు. అందుకే రాజమార్గం మీద పెద్ద పెద్ద హనుమాన్ విగ్రహాలు వెలిశాయి. అంతేకాదు ఆయన భవిష్యబ్రహ్మ కూడా! దారిన వెళ్తున్న వారి కర్మలను సమీక్షిస్తుంటాడు. ప్రమాదాల నుండి తప్పిస్తుంటాడు. ఎక్కడెక్కడ హనుమాన్ మూర్తి కనిపించినా నమస్కరించి

వెళ్ళడం అలవాటు చేసుకోండి. ఆనాటి హనుమంతుడు ఈనాటికీ రాముని పనే చేస్తుంటే, మరి మీకు ఈనాడు ఎవరి పనిచెయ్యాలో అర్థమౌతోంది కదా!

(3) జాంబవంతుడు-శాస్త్రవేత్త

సముద్రానికి వారధి నిర్మించటానికి తగిన ప్రణాళికలనిచ్చాడు. ద్వాపరయుగంలో సూర్యశక్తిని మొత్తాన్ని (శ్యమంతకమణిని) శ్రీకృష్ణునికివ్వటానికి యుద్ధం చేసి, అవతార విశేషాన్ని అర్థం చేసుకున్నాడు. సూర్యునితో లింక్ పెట్టుకోగలిగితే ఎవ్వరికీ ఏ కొరతా వుండదు. పాండవులకు అక్షయపాత్రను ఎవరిచ్చారు? వాళ్ళ తరువాత మైందుడు, ద్వివిదుడు కూడా ఆంధ్రప్రదేశ్‌లోనే వున్నారు. చాలా స్పష్టంగా శ్రీరాముడు ఈ ఐదుమందిని కలియుగ ప్రారంభం వరకు ఈ భూమ్మీదనే ఉండమన్నారు. వీళ్ళంతా శ్రీరామరాజ్యాన్ని నిర్మించటానికి ఆనాడు కృషి చేసారు. ఈనాడు ఈ కలియుగంలోనే సత్యయుగ పునరాగమనానికి గురుదేవులు చేస్తున్న ప్రయత్నానికి సహాయం చేసేందుకు పంచవీరభద్రులుగా వీరు మరల భూమ్మీదకు వచ్చారు అని మాస్టరుగారు చెప్పారు.

ఇదంతా జరగాలంటే ఆవులు, తులసి చాలా అవసరం. పండిత శ్రీరామశర్మ ఆచార్య పంచవీరభద్ర సాధన ద్వారా వారిని పృథ్వి మీదకు తీసుకువచ్చారు. వీరు రాజనీతిజ్ఞులను, వ్యాపార వేత్తలను, శాస్త్రవేత్తలను, కళాకారులను, సాహితీవేత్తలను ప్రభావితం చేసి సమాజ ఉన్నతికి కృషి చేస్తున్నారని వివరణను ఇచ్చారు. ఇంకా ఈ శిబిరంలో

(1) తులసీగాయత్రీ చెయ్యాలని, తులసి చెట్లను పెంచమని చెప్పారు. తులసి ప్రాణశక్తికి ప్రతీక. అన్ని చెట్ల కంటే తులసిలో 33% అధికంగా ప్రాణశక్తి ఉంది. తులసీ గాయత్రీ చెయ్యడం వల్ల కుటుంబాలలో సయోధ్యత ఏర్పడుతుంది.

(2) ఎవరెవరు ఎంత సమయదానం, అంశదానము, ప్రతిభాదానాలను ఇస్తారో వివరాలు వ్రాసి ఇవ్వమన్నారు.

(3) మాల పట్టుకొని గాయత్రీ మంత్రజపం ఎలా చెయ్యాలో నేర్పించారు.

(4) మానవునికి సంచిత, ఆగామి, ప్రారబ్ద అని మూడు రకాల కర్మలున్నాయి. విద్య, శిక్ష అనే పదాలు విన్నారు కదా! శిక్ష అనుభవిస్తే విద్య వస్తుంది. ఏదైనా బాధవస్తే దానిని శిక్షగా మలుచుకొని దాని నుండి పాఠాలు నేర్చుకోవచ్చు. ప్రారబ్ద కర్మతో ఏవో ఇబ్బందులు

పడుతుంటారు. అది బాధ కాదు. అది ఒక శిక్షణగా భావించి దానికి సంబంధించిన దానిని ఏదో ఒకటి నేర్చుకోవాలి. అది ఇతరులను చూచి కూడా నేర్చుకోవచ్చు.

ఈనాటి సినిమాలు మీ ప్రారబ్ధ కర్మలను తొలగించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడు అన్ని పనులు మీరే చెయ్యనక్కరలేదు. మీరీనాడు అనుభవిస్తున్న కర్మే బయట ఎవరికో జరిగింది. మీలో ఉన్న చిత్రగుప్తుడికి తెలుసు. దాన్ని ఎలా దాటాలో. ఇది అర్థమైపోతే కర్మ తొలగిపోతుంది. **సినిమాలు కర్మను ఎలా సరిచేస్తాయో చూసి నేర్చుకోండి. ప్రారబ్ధకర్మలను సినిమాలతో తొలగించుకోవచ్చు. శృతి లయలు చిత్రంలో 'తక తికు తోం తక' అనే పాట అద్భుతంగా ప్రారబ్ధ కర్మలను పోగొడుతుంది. ఎప్పుడంటే దానిని జీవితాలకి సరిగా సమన్వయం చేసుకోగలిగినప్పుడు. అలానే మొబైల్స్‌లో మాట్లాడేటప్పుడు కూడా ప్రారబ్ధకర్మను తొలగించుకోవచ్చు. సినిమాను కాని, సీరియల్స్‌ను కాని ఏదో విధంగా చూస్తారే గాని, దానిని ఒక సాధనగా చూస్తూ ఆ పరిస్థితులను కనుక విశ్లేషించు కోగలిగితే, మీ ప్రారబ్ధ కర్మలను మీరు సులువుగా దాటవచ్చు.**

(5) మీ ప్రారబ్ధ కర్మను సరిచేసుకోవడానికి మీకు మొబైల్ ఫోన్ చాలా బాగా ఉపయోగపడుతుంది. మొబైల్‌లో మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా మాట్లాడండి.

(6) కరపత్రాలు వేయిస్తారు. అందరి చేతిలో పెట్టి వస్తారు. వాళ్ళు చదువుతారనా! ఏమో ఎవరికి తెలుసు. అందుకే కరపత్రాలు ఇచ్చేటప్పుడు అందులో ఉన్న విషయం వాళ్ళ బుఱ్ఱకెక్కేలా మీరే చెప్పాలి.

(7) ప్రదక్షిణలు–గుడికి వెళ్ళి మీరు ప్రదక్షిణలు చేస్తే మీ ప్రారబ్ధ కర్మలన్నీ తొలగిపోతాయి.

(8) ఇంకా సూపర్‌బ్రైన్ యోగా గురించి.

(9) సోఽహం సాధన గురించి. చాలా బాగా చెప్పారు.

సోఽహం అంటే అప్రమత్తంగా (ఎవేర్‌నెస్‌లో) ఉండడం. మేలుకుని ఉన్నా, నిద్రించినా ఈ సాధన జరుగుతూనే ఉంటుంది. దానిని గమనించుకుంటూ ఉండాలి. ప్రతిరోజు పదినిమిషాల పాటు అంతరంగంలో సోఽహం వినండి. ఇంకా విశ్వామిత్రమహర్షి రామలక్ష్మణులకు నేర్పించిన బల, అతిబల అనే విద్యలను శ్వాస, ప్రశ్వాసల ద్వారా ఎలా నియంత్రణ చేసుకోవచ్చునో కూడా నేర్పించారు.

భద్రాచలంలో సాధనా శిబిరం ముగించుకొని వచ్చిన తర్వాత వెంకట్రాజుపాలెం కార్యకర్తలు వచ్చి 'మాస్టర్‌గారు! మేము రామాలయాన్ని నిర్మించుకున్నాము. తమరు వచ్చి పావనం చెయ్యండని' అడిగారు. సరే, ఒకరోజు సాయంత్రం వెంకట్రాజుపాలెంలో కట్టిన రామాలయానికి వెళ్ళారు. ఎంత విచిత్రమంటే 'భద్రాద్రి రామచంద్రులవారి విగ్రహాన్నే తెచ్చి ఈ దేవాలయంలో ప్రతిష్టించారా' అన్నట్లుగా ఉంది, ఆ దేవాలయంలో ఉన్న విగ్రహం!

ఆలయంలో ప్రవేశించగానే మాస్టర్‌గారి చేతనత్వం శ్రీరాములవారి చేతనత్వంలో మమేకమై పోయింది. కర్పూర ఆరతి సమయంలో లోపలవున్న ఆ దేవదేవుడు మధుర మందహాసాలు చిందిస్తున్నాడు, మన బంగారు శ్రీరామకృష్ణగారిని చూచి! ఆ రామయ్యతోపాటు మాస్టర్‌గారు కూడా వెయ్యికాంతులతో వెలిగిపోతున్నారు. ఆ రామయ్య తండ్రిని తనివి తీరా చూశాక అందరూ మామూలు స్థితికి వచ్చాక ప్రవచనం మొదలుపెట్టారు.

భద్రాద్రి శ్రీ సీతారామస్వామి దేవాలయానికి ప్రతిరూపాన్ని ఇక్కడ నేను దర్శించాను. ఈ ఆలయంతో పాటు భద్రాచలంలో ఉన్న పర్ణశాలను ఇక్కడ వేయబోతున్నాను. పర్ణశాలలో ఎవరుంటారు? సీతా, రామ, లక్ష్మణులు ఇంక ఇక్కడే వుంటారు. ఈ స్థలం గొప్పతనాన్ని అర్థం చేసుకోండి అని చెప్తూ కొన్ని వీడియోలు చూపించి – 'హిమాలయాలలో జరిగిన సాధనా రహస్యాలను ఇక్కడ నేర్పించబోతున్నాను.' చాలా అద్భుతమైన ఆశ్రమం హిమాలయాలలో 6500 సంవత్సరాల నుండి అంటే శ్రీకృష్ణుని కంటే కూడా 1500 సంవత్సరాల ముందు నుండే వున్నది. అదియే థియోసాఫికల్ సొసైటీ. మిమ్మల్ని ఆ ఆశ్రమంతో లింక్ చేస్తున్నాను. మీరు అనేక జన్మల సాధనా ఫలితంగా – ఈ 6500 సంవత్సరములు గల ఆశ్రమంతో లింక్‌అప్ అవుతున్నారు. ఒక ఇంజనీరింగ్ విద్యార్థి తన చదువు తాను చదువుతూనే ఆడుతూ, పాడుతూ అన్ని పనులు చేస్తుంటాడు. మీరు గురుదేవుల శిష్యులే అయినా మీ పనులు మీరు చేసుకుంటూనే, ఆయన పనిని ఆయన చెయ్యమన్నప్పుడు చెయ్యవలసి వుంటుంది. గురువుగారి పనిచేస్తున్నప్పుడు మాత్రమే ఆ పని చెయ్యాలి. మిగతా సమయంలో మామూలుగా మీ పనులు మీరు చేసుకోవచ్చు.

థియోసాఫికల్ సొసైటీ వుంది. అందులో చేరిన వాళ్ళకు మాత్రమే ఆ విద్యను నేర్పుతారు. అందులో ఇచ్చిన ఆ రహస్యమయ విద్య అంతా గాయత్రీ మంత్రంలో ఉన్నది. **ఎవరికి ఏ సమస్య వున్నా నా దగ్గర కొస్తే అది తగ్గిపోతుంది. అదీ ఆ పవర్! అదంతా గురుదేవులదే.**

ఈనాడిక్కడ నేను చెప్తున్న ఈ విద్య పెద్ద పెద్ద గురువుల ద్వారా చాలా రహస్యంగా చెప్పబడేది. కానీ సమయం వచ్చేసింది. అందరికీ, అంటే వినేవాళ్ళందరికీ చెప్పేయవచ్చు. ఈ విద్య మాటలతో వచ్చేది కాదు. దీని కోసం చాలా సాధన చెయ్యాలి. ఏ సాధన అయినా ఈ దేవాలయాలలో మాత్రమే చెయ్యండి కాని ఇళ్ళ దగ్గర చెయ్యవద్దు. అనేకమంది పోటీపడి ఈ విద్యను నేర్చుకోవాలి. పరమపూజ్య గురుదేవులు ఇచ్చిన వైజ్ఞానిక ఆధ్యాత్మికతను నేర్పబోతున్నాను. ముఖ్యంగా భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన, అనేక రహస్యమయ సాధనలను ప్రయోగాత్మకంగా ఈ క్లాసులలో నేర్పించబోతున్నాను.

ధనాన్ని కురిపించే శక్తి పర్జన్యము

భారతదేశం రత్నగర్భ, ఒకానొకప్పుడు అపారమైన ధనరాసులు ఉండేవి. ఏ విధమైన రహదారి సౌకర్యాలు లేని రోజులలో మన సంపదలను తీసుకుపోవడానికి హిమాలయాలను దాటి వచ్చేవారు. ఆ కాలములో అంత అనంతమైన ధనరాసులు ఉన్నాయన్న సత్యాన్నే మనమీనాడు మరచిపోయాము. శ్రీకృష్ణదేవరాయలు కాలంలో వీధులలో రత్నాల రాసులు పెట్టుకొని అమ్ముకునే వారని చరిత్ర చెప్తున్నది. డబ్బు ఎప్పుడూ అడుక్కుంటే రాదు. ఉత్పన్నం చేస్తే వస్తుంది. ఈ విషయమై మాస్టర్‌గారు మన పూర్వీకులు పాటించిన కొన్ని నియమాలను వివరించారు. **ధనాన్ని ఉత్పన్నం చేయడం మనం మరచిపోయాం.** చేసుకోగలిగితే గ్యారంటీగా వస్తుంది. అనంత ధనరాసులు వస్తాయి. పర్జన్య వర్షము (ధనము) కురుస్తుంది.

ధనాన్ని కురిపించే శక్తినే పర్జన్యమంటారు

"ఇడ్లీ-వడ-ఆకాశం' అనే నవలలో కామత్ అనే వ్యక్తి హోటల్ పెట్టుకొని కోటీశ్వరుడయ్యాడు. మీరేం చెయ్యనక్కరలేదు. ఇడ్లీలు అమ్ముకొని అంతరాష్ట్రీయంగా, కాలుష్యరహితంగా ఆహారాన్ని తయారుచేసి ఇచ్చి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవచ్చు. నా గురించి, నా దగ్గర వుండే కొంతమందికే తెలుసు. నా మీద ఎంత డబ్బు వర్షం కురుస్తుందో, 'కావాలంటే క్షణకాలంలో లక్షలు కురుస్తాయి' అదీ భారతీయ సౌభాగ్యం.

26. నారాకోడూరు శక్తిపీఠములో పర్జన్యవర్షం

ఆ విద్యను పరమపూజ్య గురుదేవులు నారాకోడూరులో మొదలు పెట్టమన్నారు. డబ్బుల

వర్షం రెండు రోజుల్లో కురుస్తుందా? కురవదు కదా! దానికీ సాధన కావాలి. ఒక ఇంజనీరై డబ్బు సంపాదించాలంటే ఎంతకాలం పడుతుందో ఇదీ అలానే.

పూజ్య గురుదేవులు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ పర్జన్యవర్షము కురిపించే రహస్యాన్ని ఇవ్వమని చెప్పారు. నేను మొదలుపెట్టేశాను. ఏ విద్య నేర్చుకోవాలన్నా దానికి కొంత సమయాన్ని ఇవ్వాలి. అలాగే డబ్బును ఖర్చుపెట్టాలి. వీటిని మించి ప్రతిభ వుండాలి. ఈ విద్యను పూజ్య గురుదేవులు నాకు చేసి చూపించారు. చాలా ఏకాగ్రతతో వినాలి మరి. దీని కోసం కచ్చితంగా భోజనానికి ముందు పది లేక పదిహేను నిమిషాల సమయాన్ని కేటాయించాలి. ఈ సాధన భోజనానికి ముందు చేస్తే మీకేవి కావాలో అవి వస్తాయి. ఇది పది రోజులపాటు నియమం తప్పకుండా చేస్తే మీ జీవితాలలో వచ్చే మార్పు మీకు అర్థమౌతుంది. మళ్ళీ మళ్ళీ చెప్తున్నాను, భోజనానికి ముందు ఎంతో ఏకాగ్రతతో దీనిని చేస్తే మీకు, మీ కుటుంబానికి చాలానే వస్తుంది.

దీని తర్వాత రెండో నియమం మీరు కనీసం నాలుగు రోజులపాటు ఒక తీర్థస్థలానికి వెళ్ళాలి. అయితే ఈనాటి తీర్థస్థలాల్లో ఆ శక్తి ఏమీ లేదు. అవి కేవలం పర్యాటక ప్రదేశాలుగా మారిపోయాయి. ఆ తీర్థం గురించి చెప్పేవారు లేరు. కానీ గాయత్రీతీర్థంలో ఆ శక్తి వుంది. నా సంగతే చెప్తాను. 2007లో ఋషికేష్‌కు వెళ్ళాం. కొంతమంది గంగోత్రి, యమునోత్రికి వెళ్దామని ఉబలాటపడ్డారు. నేను సరే అంటే **'గురుదేవులు వెనక్కిరా' అన్నారు. అంతే నేను అటు వెళ్ళలేదు. ఆ రోజున నేను గాయత్రీ తీర్థానికి వెళ్ళినందుకు చాలా మారాను. గురుదేవులు చెప్పిన రీతిలో మారాను.** 'ఈ గాయత్రీ శక్తి పీఠానికి, ఆ గాయత్రీ తీర్థానికి సంబంధం ఉంది కనుకనే గురుదేవులు ఆ విద్యను ముందుగా ఇక్కడ మొదలుపెట్టమని' చెప్పారు.

"నేను ఈ విద్యను గురువుగారు చెప్పగానే మొదలెట్టేశాను. అప్పుడు ఒంగోలులో ఉన్నాను. లిటరల్‌గా చాలా ఏకాగ్రతతో చేశాను. మొదలుపెట్టిన కొద్దిరోజులకే ఒక అమ్మాయి వచ్చి మూడులక్షల రూపాయలు ఇచ్చి వెళ్ళింది (శ్వేతద్వీపంలో ఉండగా పద్మజ అనే అమ్మాయి ఇచ్చి వెళ్ళింది). అది ఆ సాధనలో ఉన్న గొప్పదనం. అందుకు చెప్తున్నాను.

దానికి సంబంధించిన పుస్తకాలను కూడా అచ్చు వేయించి తీసుకువచ్చాము. దాని పేరు బ్రహ్మవర్చస్ చాంద్రాయణ వ్రతం. గురుదేవులు వ్రాసిన వాఙ్మయాలలో వాల్యూం నెంబరు 7 లో

ఈ సాధన వున్నది. సంక్షిప్తం చేసి తెలుగులో మీకు ఇస్తున్నాము. దీని వివరణతో పాటుగా సాధనకు ఇక్కడున్న నాలుగు రోజులు, ఉదయం 4:30 గం॥ల నుండి సాధన మొదలౌతుంది. నా వాళ్ళకు ఈ విద్యను ఇవ్వమని గురువుగారు చెప్తున్నారు. నాదేముంది? ఇక్కడ సీరియస్‌గా నేర్చుకోండి. రోజూ కేవలం 10 నుండి 15 నిమిషాల పాటు చెయ్యండి. హరిద్వార్‌కు వెళ్ళి అఖండజ్యోతికి నమస్కారం పెట్టుకొని శక్తిని తీసుకొని రండి. ఈ క్లాసుల తరువాత నేను మీకు దొరకను. నాకు వెబ్‌లో చాలా పని ఉంది. గురుదేవుల వాఙ్మయములను చదువుతున్నాను. 'లక్ష్మీ, కాళీ, సరస్వతి' ఈ పని చేస్తున్నారు నా కోసం. నా బిడ్డలే వాళ్ళు. కంప్యూటర్ వర్కులలో వాళ్ళు ఎక్స్‌పర్ట్స్. వల్లీ, తేజశ్రీ, చందన, వాళ్ళు. గత ఎన్నో జన్మల నుండి వాళ్ళు నా పని చేస్తున్నారు. అందుకే నాకు వాళ్ళతో అంత లింకు" అని అన్నారు మాస్టారు.

హరిద్వార్‌లో ఉన్న గాయత్రీ తీర్థంలాంటి తీర్థం, మీకు ఇక్కడ ఈ నారాకోడూరులో మాత్రమే దొరుకుతుంది. నా గురుదేవుల శతాబ్ది సమారోహానికి నేను చాలా పని చెయ్యాలి. పడిపోతూ చెప్తున్నాను. ఆంధ్రప్రదేశ్‌ను లేపడానికి నేను ఈ స్థితిలో కూడా సిద్ధమేనని చెప్తున్నాను. మీరు కూడా సిద్ధమేనా? ఈ విషయాలన్నీ ప్రపంచ వ్యాప్తంగా వెళ్ళిపోవాలి. తిరిగి భారతదేశం స్వర్ణ భారతదేశంగా మారాలి.

ఇది యుగసంధికాలం. మళ్ళీ 17 లక్షల సంవత్సరాలు అయ్యాకే ఇలాంటి యుగసంధి వస్తుంది. రాబోయే రెండు సంవత్సరాలను సమయదానంగా పూజ్య గురుదేవులకిచ్చేద్దాం. యుద్ధం ఎక్కడ జరుగుతుంటే సైనికుడు అక్కడ ఉండి యుద్ధం చేస్తాడు. మనందరం పూజ్యగురుదేవుల యుగ సైనికులం. **పూజ్య గురుదేవులు మనల్ని ఆంధ్రప్రదేశ్ కోసం పని చెయ్యమన్నారు. మనం ఏ.పి. కోసమే పనిచేద్దాం. ఏ.పి.లో అందరికీ చెప్పాలంటే ఒకరి వల్లనే సాధ్యం కాదు కాబట్టి, ఇప్పుడు నేను చెప్తున్న ఈ విద్య ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి వ్యక్తికీ వెళ్ళిపోవాలి. జాగ్రత్తగా నేర్చుకోండి. మీరే చెప్పాలి. మనం యుగ సైనికులం. అందులో ఎలాంటి అనుమానం లేదు. మరి యుగసంధి కాలంలో వున్న జీవితాలు సత్యయుగ జీవిత విధానంలోని రీతిగా పరివర్తన చెందాలి. దానికి ఇచ్చే మొట్టమొదటి సాధన ఆహారంలో మార్పు రావాలి. ఎందుకంటే ఆహారం మనస్సును తయారు చేస్తుంది. కాబట్టి ఆహారం మారాలి.**

27. బ్రహ్మవర్చస్సు - చాంద్రాయణ సాధన

ఈ విద్యనే గురుదేవులు బ్రహ్మవర్చస్-చాంద్రాయణ వ్రతంలో చెప్పారు. దానిని మీకు నేర్పిస్తున్నాను. మొట్టమొదట ఆహారాన్ని మీరు పంచప్రాణాలకు ఇవ్వాలి. ఐదు ప్రాణాలూ గాయత్రివి. **ఐదు ప్రాణాలకి ఆహారం ఇస్తే ఇంక అవి చావవు.** గాయత్రీ చేసేవాళ్ళకి ఒక ఫార్ములా ఉన్నది. "ఇతి ముద్రా న జానాతి గాయత్రీ నిష్ఫలా భవేత్" అని. ముద్రలు వేయకపోతే గాయత్రీజపం నిష్ఫలం అని దాని అర్థం. ఇది యుగసంధి కాలం కనుక అందరికీ ఈ ముద్రా విజ్ఞానాన్ని కూడా ఇస్తున్నాను. ప్రాణాలను రక్షించేది గాయత్రి. ఆహారాన్ని తీసుకుంటున్నప్పుడు ముందుగా ఐదు ప్రాణాలకు ఆహారాన్ని 'ఆహుతి'గా ఇవ్వండి. అలా ఆహారం తినే వాళ్ళకి కచ్చితంగా 'గాయత్రీశక్తి' వస్తుంది. పరమపూజ్యగురుదేవులు నేరుగా మీకో మంత్రాన్నిచ్చారు. పూర్వకాలంలో ఋషులు ఆహారం తీసుకునే విధానాన్ని ఇక్కడ చెప్తున్నారు.

ఇది చాంద్రాయణ వ్రతం. దీనిని బ్రహ్మవర్చస్ చాంద్రాయణ వ్రతం అంటారు.

దీనిని నేను ఒక నెల పాటు పూజ్యగురుదేవుల దగ్గర ఉండి నేర్చుకున్నాను. మొట్టికాయలు వేసి మరీ నేర్పించారు. ప్రాణ ప్రత్యావర్తన శిబిరంలో నేర్పించారు. ఆ రోజులలో వెయ్యిమందికి ఈ సాధనను ఇస్తానన్నారు గురువుగారు. సుమారు 500 మంది వరకు చెప్పారు. అందులో నేనున్నాను. అది నా అదృష్టము. తరువాత బ్యాచ్ వాళ్ళకు ఆయన చెప్పలేదు. నేను సంపూర్ణ ఆరోగ్యంతో ఉండి కాదు చెప్తున్నాను. ఈ పరిస్థితులలో కూడా ప్రాక్టికల్‌గా ఈ సాధన చేయించగలుగుతున్నాను అంటే అది గురుదేవుల సంకల్పము కాబట్టే చెప్పగలుగుతున్నాను !

ఇదే అన్నింటికన్నా ఎక్కువ గొప్ప సాధన. ఋషులు చేసిన బ్రహ్మవర్చస్ చాంద్రాయణ సాధన. అందరూ ఈ ప్రాణ విజ్ఞానాన్ని నేర్చుకోండి. ఐదురోజుల శిబిరం ప్రతి నెలా పెడతాను. నా పద్ధతిలో నేను చెప్తాను. ఈ క్లాసులు ఇక్కడే చెప్తాను. వేరేచోట చెప్పలేను. ఇక్కడ నేర్చుకుని వెళ్ళి మీమీ ఊళ్ళల్లో మీరు నేర్పండి. మొత్తం ఆంధ్రప్రదేశ్‌కి ఇది కేంద్రం కావాలి. ఈ బ్రహ్మవర్చస్ సాధనతోపాటు వీరవెంకటసత్యనారాయణస్వామి వ్రతాలు చేద్దాం. (పంచముఖీ గాయత్రికి వీర వెంకట సత్యనారాయణస్వామి వ్రతాలకి లింకు ఉంది). అన్నింటికీ లింక్ శాంతికుంజ్. ఇక్కడ నేర్చుకుని వెళ్ళి ఒక నెలపాటు ఇంటి దగ్గర సాధన చేసుకున్న వాళ్ళు ఇక్కడకి పూర్ణాహుతికి రావాలి.

ఒంగోలులో కూర్చుని వెబ్‌వర్క్ చేసుకుంటాను. నారాకోడూరు శక్తి పీఠంలో సాధనా శిబిరాలు పెడుతుంటాను. 2010 డిసెంబరు 18వ తేదిన మాస్టరుగారు బ్రహ్మవర్చస్ చాంద్రాయణ విధివిధానాన్ని చెప్పారు. ఆ రోజు అన్నం తినేటప్పుడు ఆ విధానాన్ని శ్రీసత్యనారాయణమాస్టారు ఆందరికీ నేర్పించారు.

28. బలివైశ్వదేవ హవనం

యజ్ఞప్రక్రియలు ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు బలివైశ్వదేవము ప్రాముఖ్యతను సంతరించుకొన్నది. పూజ్య గురుదేవులు యజ్ఞకార్యక్రమాలతో పాటు బలివైశ్వదేవ విధానము వెలుగులోకి తీసుకొని రావడం జరిగింది. సులభతరమైన ఈ విధానము అనంతమైన లాభములను అందివ్వగలదు. ఈ విధానము తెలియని రోజులలో ఇళ్ళల్లో వంట చేయు గృహిణి వండుటకు కావలసిన బియ్యములో కొంత తడిసిన బియ్యమును చేత తీసుకొని 'ఓం కృష్ణా అక్షయమస్తు' అని పలుకుచూ మండుచున్న అగ్నిలో వేయడం జరిగేది. తద్వారా ఆ కుటుంబ సభ్యులందరికి అన్న సమృద్ధి కలిగేది. కొందరి ఇళ్ళలో నేటికీ ఈ విధానము కొనసాగుతున్నది. **'వైశ్వదేవము చేయక తిను మూఢుడు కాలసూత్ర నరకమందు కూలును'** అని దేవీభాగవతము 11వ స్కందములో స్పష్టముగా వ్రాయబడి వున్నది. మనం చేసే బలివైశ్వము వల్ల నేటితరము వారికేగాక రాబోవు తరముల వారికిని అన్నసమృద్ధి కలిగి సుఖంగా జీవిస్తారు.

వండిన అన్నములోని కొంత అన్నం తీసుకొని నెయ్యి, బెల్లము వేసి ఈ క్రింది ఐదు మంత్రములతో, ఐదు ఆహుతులను అగ్నిలో భావనాపూర్వకముగా సమర్పించాలి.

1. **ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యమ్ భర్గోదేవస్యధీమహి ధియోయోనః ప్రచోదయాత్।**
స్వాహా ఇదం బ్రహ్మణేభ్యో ఇదం నమమ ॥

2. **ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యమ్ భర్గోదేవస్యధీమహి ధియోయోనః ప్రచోదయాత్।**
స్వాహా ఇదం దేవేభ్యో ఇదం నమమ ॥

3. **ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యమ్ భర్గోదేవస్యధీమహి ధియోయోనః ప్రచోదయాత్।**
స్వాహా ఇదం ఋషిభ్యో ఇదం నమమ ॥

4. **ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యమ్ భర్గోదేవస్యధీమహి ధియోయోనః ప్రచోదయాత్।**
స్వాహా ఇదం నరేభ్యో ఇదం నమమ ॥

5. ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యమ్ భర్గోదేవస్యధీమహి ధియోయోనః ప్రచోదయాత్।
స్వాహా ఇదం భూతేభ్యో ఇదం నమమ ॥

29. ప్రాణాగ్నిహోత్ర విధి

భోజనానికి ముందు ప్రతి అన్నముపైన నేతిని అభికరించి తత్ సంబంధిత ముద్రలో ఆ అన్నమును కొద్దిగా తీసుకొని పంచ ప్రాణాహుతులు ఈ క్రింది విధమైన భావనతో తమ నోటిలో వేసుకోవాలి.

1. ప్రాణ ఆహుతి :

ముద్ర: బొటన వేలు, తర్జనీ (చూపుడు వేలు) మరియు మధ్యమ వేలును కలపాలి. ఈ ముద్రలో నేతితో కలిపిన అన్నమును తీసుకుని

ధ్యాన భావన: రంగు – బంగారువర్ణము, ఋషి – క్షుదాగ్ని, దేవత – సూర్యుడు, ఛందము – గాయత్రి,

ఓం ప్రాణాయస్వాహా – 'ఇదమాది దేవాయ ఇదం న మమ' అని పలుకుతూ ఆహారం నోట్లో వేసుకోవాలి.

ఈ ఆహుతిని స్వీకరించు దేవత సవిత. తద్వారా మంచి వర్చస్సు ఏర్పడును. గాయత్రీమంత్ర జపమునకు శరీరము అనుకూలించును. మంచి ఆకలి కలుగును, అనాహత చక్రము ప్రభావితమగును.

2. అపాన ఆహుతి :

ముద్ర: మధ్య వేలు, ఉంగరపు వేలు, బ్రొటనవేళ్ళను కలపాలి.

ధ్యాన భావన: ఆవుపాల రంగు, ఋషి – శ్రాద్ధాగ్ని, దేవత – సోముడు, ఛందము – ఉష్ణిక్

ఓం అపానాయస్వాహా – ఇదం సోమాయ ఇదం న మమ అని ఆహారం నోట్లో వేసుకోవాలి.

ఈ ఆహుతిని స్వీకరించు దేవత చంద్రుడు. ప్రాణశక్తి సోమునితో కలిసినప్పుడు శాంతిని, పుష్టిని కలిగించే శక్తిగా మారుతున్నట్లు భావించాలి. మూలాధార చక్రమును ప్రభావితము చేయును.

3. వ్యాన ఆహుతి :

ముద్ర: ఉంగరపు వేలు, చిటికినవేలు, బ్రొటనవేళ్ళను కలపాలి.

ధ్యాన భావన: రంగు – పద్మము, ఋషి – హుతాశనాగ్ని, దేవత – అగ్ని, ఛందము – అనుష్టుప్

ఓం వ్యానాయస్వాహా – ఇదమగ్నయే న ఇదం మమ అని ఆహారం నోట్లో వేసుకోవాలి.

ఈ వ్యాన ముద్ర ద్వారా స్వీకరించిన ఆహారము స్వాధిష్ఠానమును ప్రభావితము చేయగలదు. బొడ్డు నుండి కాలి బ్రొటనవేలు వరకు ఈ అన్నాహుతీ శక్తి ప్రవహించి మనకు కలిగే వ్యాధుల నుండి రక్షించగలదు.

4. ఉదాన ఆహుతి :

ముద్ర: చూపుడు వేలు, చిటికిన వేలు మరియు బొటన వ్రేళ్ళను కలపాలి.

ధ్యాన భావన: రంగు – ఆరుద్రము, ఋషి – అగ్ని, దేవత – వాయువు, ఛందము – బృహతి

ఓం ఉదానాయస్వాహా – ఇదం వాయవే ఇదం న మమ అని ఆహారం నోట్లో వేసుకోవాలి.

ఈ ముద్ర విశుద్ధి చక్రమును ప్రభావితము చేయును. గొంతు నుండి తల వరకు ఈ మంత్రపూరిత ఆహారము పని చేసి మంచి శ్రావ్యమైన కంఠమును ప్రసాదించును.

5. సమాన ఆహుతి :

ముద్ర: ఐదు వేళ్ళతో అన్నమును తీసుకొని

ధ్యాన భావన: రంగు – ఎరుపు, ఋషి – అగ్ని, దేవత – పర్జన్యుడు, ఛందము – పంక్తి

ఓం సమానాయస్వాహా – ఇదం పర్జన్యాయ ఇదం న మమ అంటూ ఆహారం నోట్లో వేసుకోవాలి.

ఈ మంత్రాహుతి ముద్ర మన మణిపూరక చక్రమును ప్రభావితము చేయును. తద్వారా హృదయము నుండి నాభి వరకు గల ప్రదేశమంతయు రోగరహితమై ఉండగలదు. మంచి శ్వాస ప్రక్రియ జరగగలదు.

సాధన చిన్నదే కానీ అత్యంత ప్రభావవంతమైంది కూడా! ఇలా మాస్టారు అతిసరళంగా ప్రతిరోజు చేసుకోగలిగే అనుకూలమైన సాధనలను ఇస్తుండేవారు.

30. బలివైశ్వదేవ ప్రాముఖ్యత

ఈ విద్యను నేర్చుకుంటే అందరూ దేవతలైపోవచ్చు. అప్పుడు పృథ్వి స్వర్గంగా మారుతుంది. ముందుగా బలివైశ్వదేవ హవనం. ఈ ప్రక్రియలో వంట చేసిన తర్వాత గృహిణులు ముందుగా కాస్త అన్నం తీసి దానికి బెల్లం, నెయ్యి కలిపి ఐదు ఆహుతులను బ్రహ్మకు, దేవతలకు, ఋషులకు, నరులకు చివరగా పంచభూతాలకు ఇవ్వాలి. దీనిని బలివైశ్వదేవ హవనం అంటారు. ఇది బాహ్య యజ్ఞము.

దీని తరువాత మనం అన్నం తినే ముందుగా ప్రాణాగ్నిహోత్ర విధితో అంతర్యాగంగా మనలో వున్న ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన అనే పంచప్రాణాలకు ఐదు ఆహుతులనివ్వాలి. 'బ్రహ్మ వర్చస్-చాంద్రాయణ వ్రతం' అనే పుస్తకంలో దీని విధివిధానం చాలా వివరంగా దొరుకుతుంది. ఈ సాధన వల్ల మార్పు వస్తుంది. కనుక ఆచరించి అందరికీ నేర్పించండని ఆ రోజు క్లాసులో చెప్పారు. వేలసంఖ్యలో ఈ పుస్తకాలను అచ్చువేయించి ఆనాటి శిక్షణా తరగతులకు వచ్చిన సాధకులకేకాక ఈ సాధనను చాలా మందికి నేర్పించేందుకై పుస్తకాలనివ్వడం జరిగింది. వీరవెంకట సత్యనారాయణస్వామి వ్రతాలు, చాంద్రాయణ వ్రతవిధానం, ప్రాయశ్చిత్త విధానాలను మెల్లమెల్లగా ఒకదాని తర్వాత ఒకటి ఈ క్లాసులలో చెప్పడం జరిగింది. ఇంకా నారాకోడూరు గాయత్రీశక్తి పీఠంలో ప్రతిరోజూ గాయత్రీ మహావిజ్ఞానం చదవాలని చెప్పారు.

సాధన

1. ఆహారం తీసుకునేటప్పుడు పైన చెప్పినట్లుగా ధ్యానం చేసి ఆహారం తింటే మానవ జీవితంలో మార్పు వస్తుంది.
2. అతిథికి పెట్టి ఆహారం తినడం మన ఆచారం. దానికే బలివైశ్వదేవంలో పంచ ఆహుతులు వేస్తే, అన్ని వర్గాల వారికి ఆహారం పెట్టిన పుణ్యం వస్తుంది. ఇది బాహ్యయజ్ఞము.
3. బలివైశ్వదేవం చేశాక మనం ప్రాణాగ్ని హోత్రంలో ఐదు ఆహుతులను వ్రేళ్ళముద్రతో

మెతుకులను తీసుకొని నోట్లో వేసుకుని తింటే పంచ ప్రాణాలకూ వేసే ఆహుతులతో అంతర్యాగం పూర్తౌతుంది. ఈ సాధన వలన మనుష్యులు దేవతలుగా మారుతారు.

31. దక్షిణ శాంతికుంజ్ - నారాకోడూరు గాయత్రిశక్తిపీఠం

పూజ్యగురుదేవుల ఏకైక లక్ష్యం - 'పృథ్విపై స్వర్గావతరణ'

పృథ్విపై స్వర్గావతరణ జరగాలంటే మానవులందరూ దేవతలుగా మారాలి. దాని కోసం మాస్టరుగారు గురుదేవులు ఏడవ వాఙ్మయం 'ప్రసుప్తి సే జాగృతీకీ ఓర్' లో ఇచ్చిన సాధనలను నారాకోడూరు "గాయత్రీశక్తిపీఠంలో" ప్రారంభించారు. దాంతోపాటుగా గురుదేవుల సూచనల ప్రకారం దానిని "దక్షిణ శాంతికుంజ్"గా రూపొందించాలని 2011 జనవరి 15వ తేది నుంచీ ఆ క్షేత్రాన్ని శాంతికుంజ్‌కి నమూనాగా తయారుచేయడానికి కొన్ని ప్రధాన నిర్మాణ కార్యక్రమాలను చేపట్టారు.

శాంతికుంజ్‌లో ప్రధానమైన శక్తిస్థలము ప్రఖర ప్రజ్ఞ, సజల శ్రద్ధ. వీటిని స్థాపించటానికి విశాలమైన వేదికను చలువరాతితో కట్టించారు. సప్తఋషులను స్థాపించారు. 'భట్‌కా హువా దేవతా'కి సంబంధించి నిలువుటద్దాలను ఏర్పాటు చేయించారు. గాయత్రీమాత, అఖండజ్యోతి ఉండనే వున్నది. ఇకపోతే ఆశ్రమంలో సులువుగా నడవడానికి వీలుగా నాపరాతి బండలతో బాటలు వేయించారు. పూలమొక్కలను నాటించారు. యజ్ఞశాలలో చిన్నచిన్న మార్పులు చేయించారు. ఈ పనులనన్నింటిని శ్రీమణికుమార్, రంగనాయకులు, నాగమల్లేశ్వరరావు అకుంఠిత దీక్షతో రాత్రి, పగలు చేశారు. ఇంకా రాత్రిళ్ళు పనిచేసేందుకై వెన్నాదేవి, నర్సరావుపేటల నుండి కూడా పరివార్ సభ్యులు వచ్చి శ్రద్ధతో పనులు చేసి మాస్టర్‌గారు నిర్ణయించిన తేదీకి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి గాయత్రీ శక్తి పీఠాన్ని శాంతికుంజ్‌కి నమూనాగా తయారుచేశారు.

ఋషి అంటే ఋజుప్రవర్తన గలిగినవాడు. 'స్ట్రయిట్ అండ్ ఫార్‌వర్డ్' అనగా నిబద్ధతతో జీవించేవాడు. మనలను కూడా ఋషులుగా తయారు చేయడానికే మాస్టర్‌గారి ఈ ప్రయత్నమంతా! ఒక ప్రక్కన సాధనాశిబిరాలను నిర్వహిస్తూనే ఇంకో వైపున నిర్మాణ కార్యక్రమాలను కొనసాగిస్తూ తాము చేయదలచుకున్న పనులను పూర్తి ఏకాగ్రతతో చేస్తున్నారు.

సాధనలో భాగంగా బ్రహ్మవర్చస్ చాంద్రాయణ వ్రతంలో ఇవ్వబడిన రెండు రకాల సాధనలలో మొదటిది బలివైశ్వదేవ హవనం. ఇది చేశాక మనం భోజనం చేసే ముందు పదిసార్లు మూలబంధం వేసుకుని తరువాత ప్రాణాగ్నిహోత్ర ఆహుతులను వేసుకోవాలి. **దీని వలన మనుషులు, దేవతలుగా మారుతారు.**

రెండవసాధన **చాంద్రాయణవ్రతం:** భారతీయ సంస్కృతిలో 'ఋషులు' చేసే మొదటిసాధన చాంద్రాయణవ్రతంలో పూర్ణిమనాడు 16 ముద్దల అన్నాన్ని తింటూ, రోజుకో ముద్ద తగ్గిస్తూ అమావాస్యకు పూర్తి ఉపవాసం చేసే విధానం, మళ్ళీ అలానే పెంచుకుంటూ పోయి పూర్ణిమకు 16 ముద్దలు తినాలి.

ఈ సాధన ముందుగా మాస్టరుగారే శ్వేతద్వీపంలో ప్రారంభించారు. తరువాతనే అందరికీ చెప్పారు. దాంతోపాటుగా మాస్టర్‌గారు 27 నక్షత్రాలకు సంబంధించిన ఒక సాధనావిధానాన్ని శ్రీసూక్తంతో జోడించి – ఎవరు పుట్టిన తిథినాడు వారు తమ జన్మదిన సంస్కారాన్ని ప్రతి నెలా చేసుకొనే మరొక నూతన సాధనను కూడా అందులో జోడించి తప్పనిసరిగా అందరూ పుట్టినరోజు సంస్కారాన్ని చేసుకోవాలనే నియమాన్నిచ్చారు. మాస్టర్‌గారు స్వయంగా తన పుట్టిన రోజును ప్రతి నెల 14వ తేదీన సంస్కారపద్ధతిలో చేసుకునేవారు.

ఇక్కడ చాంద్రాయణవ్రత విధి అనేది మనిషిని, ఋషిగా మార్చే సాధన. ప్రాణాగ్నిహోత్ర ఆహుతుల వలన మనుష్యులు, దేవతలుగా మారుతారు. అలా మాస్టరుగారు గురుదేవుల వాఙ్మయాలను పరిశోధించి మనిషిని దేవతగా, ఋషిగా మార్చే అనేక సాధనలను చేయించటానికి ఎన్నో రకాలుగా కృషి చేశారు. ఈ సాధనలవలన పర్జన్యవర్షం ఫలితాలను పొందటం జరిగింది.

32. పాదయాత్ర

27.12.2010వ తేదీన పాదయాత్రగా పూజ్యశ్రీ మాస్టరుగారు, శ్వేతద్వీపం ఒంగోలులో మధ్యాహ్నం మూడు గంటలకు నడక ప్రారంభించారు. ఈ విషయం తెలిసి అనేక మంది పరివార్ సభ్యులు మాస్టర్‌గారితోపాటుగా నడవడం మొదలుపెట్టారు. ఈ పాదయాత్ర మాస్టరుగారు ఎందుకు మొదలుపెట్టారు? అంటే, పరివ్రాజకులుగా తిరుగుతూ 'జన్మశతాబ్ది గురించి, బలివైశ్వదేవ యజ్ఞాలు,

ప్రాణాగ్నిహోత్ర విధిని' గురించి మనుషులకు చెప్పాలి. జన్మశతాబ్ది నాటికి గురుదేవులు కోరుకున్న దేవమానవులు తయారు కావాలనేదే ఇందులోని పరమార్థం.

ఒంగోలులో బయలుదేరి ముందుగా వెంకటరాజుపాలెంలో కాసేపు ఆగి అక్కడ ఈ విద్యను చెప్పారు. అక్కడి నుండి నడుచుకుంటూ 8:30 గంటలకు మేదరమెట్ల, పురుషోత్తమపట్నం, గుంటూరు, తర్వాత నారాకోడూరు, ఇలా గ్రామగ్రామాలలో పాదయాత్రలు చేసుకుంటూ ప్రజలందరికీ ఈ సాధనలు నేర్పాలని పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక ప్రణాళిక వేసుకున్నారు. అలా నడుచుకుంటూ ఏడుగుండ్లపాడు దాకా నడిచేసరికి వారి కాళ్ళల్లో బొబ్బలు వచ్చేసి అడుగు తీసి అడుగుపెట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితిని ఊహించిన శ్రీ రంగనాథ్‌గారు మాస్టర్‌గారికి సమీపంలో ఉండేలాగా తమ కారును ఏర్పాటు చేసి వుంచారు. ఇంక ఆ కారులో మాస్టరుగారిని ఎక్కించుకొని గుంటూరు, నారాకోడూరుదాకా అనుకున్న రీతిలో యాత్ర చేసి తిరిగి మరునాడు ఒంగోలుకు వచ్చేశారు.

విషయం విన్న ఈమని డాక్టర్‌గారు ఆఘమేఘాలమీద వచ్చి, అరిపాదాలలో వచ్చిన ఆ బొబ్బలను చూచి, మాస్టర్‌గారికి మందులు, బొబ్బలకి పైపూతకి మందులు ఇచ్చి విశ్రాంతిగా ఉండమని చెప్పారు. సాధ్యమైనంత వరకు నేల మీద పాదం పెట్టకుండా వుంటే చాలు. బొబ్బలు చితక్కుండా వాటంతట అవే అణిగిపోతాయని సూచనలనిచ్చారు. అమ్మయ్య, భగవంతుడు ఏదో రూపంలో తన ఉనికినలా ప్రకటించుకుంటాడని మనస్సులో అనుకొని వారికి ధన్యవాదాలు తెలుపుకున్నాను. అలా వెంకటేశ్వర్లుగారు మాస్టర్‌గారికి సేవలనందించి కృతార్థులైనారు. అయితే పాదాలలో వచ్చిన ఆ బొబ్బలు పూర్తిగా తగ్గటానికి నెలలు పట్టింది.

33. ప్రపంచానికి మేలు జరుగుతుంది

ఈనాడు మానవజాతి మారిపోయే సమయం ఆసన్నమైంది. మొదటిసారిగా భూమ్మీద ఒక విచిత్రమైన యుద్ధం జరుగబోతోంది. (దానినే గురుదేవులు సంఘర్షణ అన్నారు) మహాకాల స్వరూపులైన గురుదేవులతో మనం లింక్‌అప్ అయ్యే వున్నాము. యుద్ధాలు జరుగుతున్నప్పుడు సాధారణ జనులు ఏమీ చెయ్యరు. యుద్ధభూమిలో మిలటరీ వాళ్ళు మాత్రమే వుంటారు. అలానే ఇప్పుడు పరమపూజ్యగురుదేవులకు మిలటరీ వాళ్ళు కావాలి. నాకు అక్కడ చాలా పనులున్నాయి. ప్రస్తుతం

నేనున్న ఈ శారీరక స్థితిలో నేనేం చెయ్యగలనో నాకే తెలియదు. మిలటరీ వాళ్ళు చచ్చిపోతున్నా యుద్ధం చేస్తారు. మీరందరూ నావాళ్ళే. కానీ నేను యుద్ధానికి వెళుతున్నాను. ఇష్టమున్నవారు రావచ్చు. రాలేనివాళ్ళందరూ నాకు దూరంగా వుండండి.

మీ మీద ప్రేమతోనే చెప్తున్నాను. మీరు నన్ను ఎట్టి పరిస్థితులలోనూ డిస్టర్బ్ చెయ్యవద్దు. నెలంతా ఒకటవ తేదీ నుండి 27వ తేదీ వరకు మీరు మీమీ ప్రాంతంలోనే వుంటూ నేను చెప్పిన సాధనలు చెయ్యండి. నేను 28,29,30 తేదీలలో నారాకోడూరు శక్తిపీఠంలో వుంటాను. **ఒకటవ తేదీ నుండి 27 వరకు మీరు చేసే సాధన వలన మీ కుటుంబానికీ లాభం చాలా వుంటుంది, ఇంకా అది కవచంలాగా కూడా పనిచేస్తుంది.** మీ నక్షత్రం వచ్చిన తారీఖున జన్మదినం చేసుకోండి. అది చాలా చాలా ముఖ్యం. పెండ్లి అయిన వారైతే వివాహదినోత్సవం కూడా చేసుకోండి. మీకు తెలియదు. దీని ప్రభావము ఎలాంటిదో? ఇంకా ప్రతి రోజూ శ్రీసూక్త పారాయణ చెయ్యండి.

మీరు ఇంట్లో వుంటూ ఈ సాధనలు చేస్తూ గాయత్రీమంత్రం రోజుకు మూడు మాలలు చెయ్యండి. అది చాలు గాయత్రీమంత్రం చేశాక ధ్యానంలో వేరుగా 'సవితా శ్రీరామచంద్ర' సాధన చేస్తే చాలా మంచి లాభాలు వస్తాయి. దీనిని ముఖ్యంగా వర్ణధ్యానంగా చేస్తే ఫలితాలు అపూర్వంగా ఉంటాయనేది పరమసత్యం. దీనికి తోడు మరో ముఖ్యమైన ధ్యానవిధానం **పూజ్యగురుదేవుల అఖండజ్యోతిని చూస్తూ, దాని దగ్గర కూర్చుని సాధన చేస్తే నిజంగానే మీక్కావలసినవన్నీ వస్తాయి. దానికా శక్తి వుంది. మీరు దానిని కచ్చితంగా అభ్యాసం చేసితీరాలి అని చెప్పారు.**

ఇలా అనేక సాధనలు గాయత్రీశక్తి పీఠంలో 2010 నుండి 2011 మార్చి, ఏప్రియల్ వరకు నెలకు 3,4 రోజులుండి చెప్తుండేవారు. మిగతా సమయాలలో వెబ్‌వర్క్ చేసుకుంటూండేవారు. కంప్యూటర్ వర్క్‌ను మూడు విభాగాలుగా వర్గీకరించి ఎవరి పనిని వారికి కేటాయించి, తమకు కావలసిన రీతిలో ఆ పనిని చేయించుకునేవారు.

నెలలో ఒకటవ తేదీ నుండి 27వ తేదీవరకు శ్వేతద్వీపంలో రాత్రిపూట ఆన్‌లైన్ క్లాసులు పెట్టేవారు. ఈ క్లాసులను చందన ఏర్పాటు చేసేది. ఆన్‌లైన్ క్లాసులలో: 1) జ్వాలాకూల్‌గారి 'గ్లామర్ ది వరల్డ్ ప్రాబ్లం' అనే పుస్తకం 2) గహనాకర్మణోగతిః 3) సాధన ఎందుకు 4) ఆదిశక్తి గాయత్రీ ధ్యానమెలా చెయ్యాలి? 5) ది సైన్స్ ఆఫ్ గెట్టింగ్ రిచ్-ఇలా అనేక అంశాల మీద

ఇంగ్లీషులో క్లాసులు చెప్పేవారు. ఇవే కాకుండా తులసీ యోగసాధన ఎలా చెయ్యాలి, తులసీ యోగనిద్రను అభ్యసిస్తే ఎలాంటి లాభాలు వస్తాయి. ఇదంతా కూడా ఆ తరగతులలో బోధిస్తుండే వారు.

జనవరి 8వ తేదీ నుండి 'గాయత్రీ శ్రీరాం' అనే పంచాక్షరీ మంత్ర జపాన్ని ప్రారంభించారు. అక్షరలక్షలు చెయ్యాలని సంకల్పించారు. ప్రతిరోజు రెండు పూటలా 'శ్వేతద్వీపం' మేడ మీద నడుస్తూ ఈ మంత్రజపాన్ని చేస్తుండేవారు. ఈ మంత్రం ప్రారంభించిన తర్వాత 'సూక్ష్మీకరణ సాధన' చెయ్యాలనే తలంపుతో మాస్టర్‌గారు తమ పడగ్గదిని సాధనకు అనుకూలంగా మార్చుకోవటం మొదలెట్టారు. ఇంక ఆ రోజు నుంచి వారి సాధన అంతా ఆ గదిలోనే జరిగిపోతుండేది. ఆధ్యాత్మికతను, వైజ్ఞానికపరంగా రూపొందించేందుకై వారు ఒక శాస్త్రవేత్తగా సాధనలో భాగంగా కొన్ని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలను, ఆడియో, వీడియోలను ఉపయోగించుకొని కొన్ని వైజ్ఞానిక ప్రయోగాలను తమ ఏకాంతసాధనలో జరిపేవారు.

ఆ రోజు భోగిపండుగ. భోగిమంటలు వేసే సమయంలో భోగిమంటలను ఒక యజ్ఞప్రక్రియగా ఎలా రూపొందించుకోవాలో చెప్పారు. అభ్యంగన స్నానము అయ్యాక నూతన వస్త్రాలు ధరించి, దైనందిన కార్యక్రమములకు సమాయత్తమవుతూ 'ఈ రోజు నుండి నా జీవితంలో ఒక నూతన మలుపు రాబోతోంది' అని చెప్పారు. గురుదేవుల వాఙ్మయాలను అధ్యయనం చేయడం, అందులో ఇవ్వబడిన అనేక రకాల ప్రయోగాలను చేయడంతో వారి దైనందిన కార్యక్రమాలు జరుగుతున్నాయి. మధ్యమధ్యలో 'గాయత్రీ శక్తిపీఠం' నారాకోడూరు వెళ్ళి 'సాధనా శిబిరాలు' నిర్వహిస్తూ గురుదేవుల జన్మశతాబ్దికి సాధనలతో సాధకులను సమాయత్తం చేస్తున్నారు.

34. శంబళ అభివృద్ధి కార్యక్రమాలు

పూజ్యశ్రీ మాస్టర్‌గారు, పూజ్య గురుదేవుల వాఙ్మయం 'ప్రసుప్తి సే జాగృతీ కీ ఓర్' చదువుతున్నారు. దానిలో ఇచ్చిన 'బ్రహ్మవర్చస్-చాంద్రాయణ' సాధన తర్వాత ఇంకా ఇవ్వబడిన అనేక సాధనల గురించి చెప్తున్నారు. అందులో **'ప్రసుప్తి'కి వెళ్ళినపుడు మన బ్రెయిన్ (మస్తిష్కము) సూపర్ ఆక్టివ్ అవుతుంది. బ్రెయిన్ నేర్చుకునే విద్య యొక్క డైమన్షన్స్ (ఆయామం) కూడా మారిపోతాయి అని చెప్పారు.**

(అప్పుడనిపించింది. గుంటూరు సప్తర్షి ఆశ్రమంలో 'మిల్లేనియం'ను పురస్కరించుకొని మాస్టర్‌గారు క్లాసులు చెప్పేవారు. ఒక్కొక్క రోజు అర్ధరాత్రి, ఒక్కొక్క రోజు నిద్రలేస్తూనే నేను క్లాసుకు వస్తున్నాను, అందరిని రమ్మని చెప్పడం జరిగేది. తక్షణమే అందరూ ఎలా ఉన్నవాళ్ళు అలాగే క్లాసులకు వచ్చేసేవారు. మాస్టర్‌గారు ఏదైనా పుస్తకం చదవడం కానీ, ప్రిపేర్ కావడం కానీ లేకుండానే అఖండమైన జ్ఞానాన్ని తమ ప్రవచనాల ద్వారా వినిపించేవారు. వారికి అంతలాగా చెప్పగల సామర్థ్యం ఎలా వచ్చిందో ఈ ఒక్క వాక్యం నుండి అర్థమైంది. కాబట్టి ఎవరైనా సరే ప్రసుప్తికి వెళ్ళగలిగితే వారి మస్తిష్కం చైతన్యవంతమవుతుంది అనే దానికి మనకిది ప్రమాణం.)

గురుదేవులు తమ అఖండ తపఃసాధన, సమర్పణలతో హిమాలయాలను హరిద్వార్‌కు (అంటే శాంతికుంజ్ ఆశ్రమానికి) తీసుకువచ్చేశారు. ఈనాడు వేలాదిమంది లక్షలాది రూపాయలను ఖర్చు చేసుకొని వీసాలు, పాస్‌పోర్టులను తెచ్చుకొని 'మానస సరోవర్' యాత్రలకు వెళ్ళుతున్నారు. కైలాస మానస సరోవరాన్ని మనం ఇప్పుడు శాంతికుంజ్ ఆశ్రమంలో చూడవచ్చు. పూజ్యగురుదేవులు హిమాలయాలను పూర్తిగా హరిద్వార్‌లో దింపేశారు. ఆయన వ్రాసిన **"ప్రసుప్తి సే జాగృతి కీ ఓర్' అనే పుస్తకంలో పదవ అధ్యాయాన్ని మొత్తం జాగ్రత్తగా చదివితే అది అంతా 'శంబళ సంపర్క క్షేత్రము' గురించే ఉంటుంది.** అందుకే మాస్టరుగారు శంబళ సంపర్క కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించారు.

9 రోజుల సంజీవినీ సాధనా విధానాన్ని ఈ విధంగా అందించారు. 1. ప్రతిరోజూ ఎవరికెంత వీలైతే అంత జపము చేశాక సూర్యునికి అర్ఘ్యం ఇవ్వాలి, 2. తులసి కోట పెట్టాలి, దాని మీద అష్ట సిద్ధులు వ్రాసి పెట్టుకోవాలి. 3. చాంద్రాయణ వ్రత సాధన పాటించాలి. ఈ సూత్రాలు క్రమం తప్పకుండా చేసిన సాధకుడు 'ఋషి' అవుతాడు. జపం చేసేశాక గురుదేవుల ధ్యానం చెయ్యాలి. అది వేరుగా **'సవితా శ్రీరామ చంద్ర' ధ్యానం చెయ్యాలి.** ఈ అంశాలతో శంబళను పైకి లేపుతాను అని అన్నారు.

నారాకోడూరు సాధనాశిబిరం నడుపుతూ కూడా మధ్యమధ్యన 'శంబళ'కు వెళ్ళి అక్కడ ఏమేమి చెయ్యాలో శ్రీయుగంధర్‌గారికి చెప్పి వస్తుండేవారు. శంబళలో కట్టిన నూతన భవనానికి **'శ్రీ గురుప్రియ'** అని పేరు పెట్టారు. దానిని కేంద్రంగా చేసుకుని తదుపరి కార్యక్రమాలను చేస్తానని ఒక సందర్భంలో ప్రకటించారు.

'ఓం మహాకాల గురుదేవాయ శరణం ఓం' అనే ద్వాదశాక్షరీ మంత్రమును అక్కడ చేయాలన్నారు.

2011: ఒక మధ్యాహ్నం మాస్టర్‌గారు స్వాధ్యాయం చేసుకుంటున్నారు. కొంచెం టీ ఇవ్వమన్నారు. చేస్తున్న పనికి కాస్త విరామం ఇచ్చి టీ త్రాగాలని, వంట ఇంట్లోకి వచ్చి కూర్చున్నారు. ఇంతలో శంబళ ఆశ్రమం నుండి మాస్టర్‌గారికి ఫోన్ వచ్చింది. అప్పుడే 'శివలింగం' స్థాపిస్తున్నామని ఫోన్ చేశారు. దానికి మాస్టర్‌గారు ఇక నుండి అక్కడ చేయవలసిన ఒక మంత్రాన్ని – అదీ ద్వాదశాక్షరీ మంత్రమును వాళ్ళకు ఆ క్షణంలో ఉపదేశంగా ఇచ్చారు.

'ఓం మహాకాల గురుదేవాయ శరణం ఓం' ఈ మంత్రానికి చిహ్నం 'లాల్ మషాల్' అని చెప్పారు.

ఈ ద్వాదశాక్షరీ మంత్రాన్ని ఉపాసించినట్లయితే సాధకుడు 5వ డైమన్షన్‌లోకి వెళ్తాడని చెప్పారు. ఇంకా ఈ మంత్రాన్ని 12 రోజులపాటు, 12మందితో, 12వేల మంత్ర జపాన్ని లఘు అనుష్టానముగా చేయించమని, మిక్కిలి నిష్టతో అనుష్టాన నియమములను యథావిధిగా పాటిస్తూ అనుష్టానం చేసి, అందరూ కలిసి పూర్ణాహుతి చేయాలని, ముఖ్యంగా ప్రతి రోజు సామూహికంగా చంద్రశేఖర అష్టకాన్ని పాడాలి. మహాకాల మంత్ర అనుష్టానానికి ముందు, వెనుక తప్పనిసరిగా ఒక మాల గాయత్రీ మంత్ర జపం చేసి, చివరగా శుభకామన తప్పని సరిగా చెప్పాలి. ఇవీ అక్కడ పాటించాల్సిన నియమాలు. అలాగే **శంబళలో షట్చక్ర స్థూపం ప్రారంభించారు.** ఆ స్థూపానికి ముందు 'శ్రీమాతా శ్రీ మహారాజ్ఞి' అని, చివర 'శ్రీ శివా శివశక్త్యైక్య రూపిణి' అని పెట్టాలని శ్రీయుగంధర్‌గారికి పక్కా ప్రణాళికనిచ్చారు.

అనుగ్రహం - ప్రాయశ్చిత్తం

మాస్టర్‌గారికి వారు పనిచేసిన టి.జె.పి.యస్ కాలేజీ నుండి కొన్ని ఏరియర్స్ రావలసి ఉంది. ఒకరోజున ఆ పని మీద శ్రీసత్యనారాయణగారు, మాస్టర్‌గారు గుంటూరుకు వెళ్ళారు. శ్యామల వాళ్ళింట్లో వున్నారు. సర్వ సాధారణంగా మాస్టరుగారు, ఎక్కడుంటే అక్కడికి భక్తులు రావడం, వారి దర్శనం చేసుకోవడం మామూలే. అదే సమయంలో హృద్రోగంతో బాధపడుతున్న ఒక అమ్మాయి మాస్టర్‌గారిని దర్శించుకోవటానికి వచ్చింది. తన ఆరోగ్యపరిస్థితిని గురించి ఎంతో

బాధతో 'గుండె ఆపరేషన్' చెయ్యాలని డాక్టరుగారు చెప్పారనీ, తన దగ్గర అంత సొమ్ము లేదని మాస్టారికి చెప్పుకొని బాధపడుతున్నది. సరిగ్గా అదే సమయంలో శ్రీమతి శర్వాణిగారు, వాళ్ళమ్మాయితో అక్కడే వున్నారు. ఈ అమ్మాయి బాధనంతా వింటున్న వాళ్ళు వెంటనే స్పందించి – ఆపరేషన్ ఖర్చులు తాము భరిస్తామనీ, వెంటనే ఆమెను తత్సంబంధమైన డాక్టరుతో మాట్లాడుకోమని చెప్పారు. అంతవరకు అందరికీ బరువుగా అనిపించిన వాతావరణం ఒక్క క్షణంలోనే ఎంతో తేలిక అయిపోయింది. అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. ఆ తల్లీ, కూతుళ్ళ సహృదయతకు మాస్టర్‌గారు ఎంతో ఆనందించి, అంతటి సహాయం చేసిన వారికి అంతరంగంలోనే అపూర్వమైన ఆశీర్వాదాలను ప్రసాదించారు. అలా మాస్టర్‌గారి సమక్షంలో సమస్యలు సరళంగా వీడిపోయేవి.

ఇంతలో శ్రీవేణుగోపాలరెడ్డిగారు, మాస్టారి దర్శనార్థం వచ్చారు. జన్మశతాబ్ది జ్ఞానరథం ప్రచారనిమిత్తం తిరుగుతుండగా పొన్నూరు దగ్గర అది ప్రమాదానికి గురైంది. కార్యకర్తలందరికీ గట్టిగా దెబ్బలు తగిలి ఆసుపత్రి పాలైనారు. దాంతో పాటు కోర్టులో ఆ విషయమై కేసు దాఖలు చేశారు. ఈ రోజు విచారణ కాబట్టి దానికి శ్రీ వేణుగోపాలరెడ్డిగారు హాజరు కావటానికి వెళ్తూ 'మాస్టారూ! ఈ సమస్యను తమరే పరిష్కరించాలి' అని వేడుకున్నారు. అందుకు మాస్టారు 'ఈ క్షణంలోనే అన్నీ పరిష్కారమైపోయాయి. మన కార్యకర్తలందరూ క్షేమంగా వుంటారు. మీ కేసు కొట్టేస్తారు. అయితే ఇందుకు కృతజ్ఞతగా 'భద్రాచలానికి కొంతమంది సాధకులు వెళ్ళి పదివేలు గాయత్రీ జపం చేసి పూర్ణాహుతి చేసిరండి' అని చెప్పారు. మాస్టారి ఆశీర్వాద బలంతో కోర్టు కేసు కొట్టివేయబడింది.

కాలక్రమంలో పని ఒత్తిడుల వలన ఇక ఆ విషయం మర్చిపోయాం. శ్రీశ్రీమాస్టారికి ఎందుకు గుర్తుకు వచ్చిందో ఏమో మరి, కొన్ని నెలల తర్వాత ఈ విషయాన్ని నాతో ప్రస్తావిస్తూ 'అనుష్టాన పూర్ణాహుతి పూర్తి చేశారేమో కనుక్కో' అన్నారు. ఆ పని పూర్తిచేయలేకపోయామని జవాబు వచ్చింది. దానికి మాస్టర్‌గారు ఏమీ అనలేదు కానీ, 'వెంటనే 20, 25 మంది భద్రాచలం వెళ్ళి ఒక లక్షా 25 వేలు గాయత్రి జపంచేసి పూర్ణాహుతి పూర్తి చేసేలా చూడు' అని నాతో చెప్పారు.

పూజ్యశ్రీమాస్టర్‌గారి మాట రామబాణంతో సమానం. చెప్పిందే తడవుగా శ్రీమణికుమార్, రంగనాయకులగార్లతో ఈ విషయం చెప్పి భద్రాచలం వెళ్ళి మొక్కు తీర్చండని చెప్పాను. మహాత్ములైన

మాస్టర్‌గారి మీద గల ప్రేమ, అభిమానంతో వారు తక్షణమే స్పందించారు. ఇంకా కొంతమంది పరివార్ సభ్యులను తీసుకుని భద్రాచలం వెళ్ళి మాస్టర్‌గారిచ్చిన లెక్కప్రకారం సాధన అయ్యాక పూర్ణాహుతి పూర్తిచేసి భద్రాచలం నుండి మాస్టర్‌గారికి ఫోన్ చేశారు. సమాచారం విన్న మాస్టర్‌గారు ఎంతో సంతోషించారు.

35. నవ్య నవ గురు 'సం'-న్యాస దీక్ష

పూజ్యశ్రీ మాస్టర్‌గారు చిన్నతనం నుంచి అన్ని ఆధ్యాత్మిక సాంప్రదాయాల సాధనలనూ ఔపోసన పట్టారు. అందుచేత ఏ గురు సాంప్రదాయానికి చెందిన సాధన గురించైనా వారికి క్షుణ్ణంగా తెలుసు. ఒక రసాయన శాస్త్రవేత్తగా వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనలను పరిశీలించారు. అలాగే అన్ని రకాల ఆధ్యాత్మిక పరిశోధనలనూ నిర్విరామంగా చేస్తూనే ఉన్నారు. అంతటితో ఆగకుండా ఆధ్యాత్మికతకూ, ఆధునిక విజ్ఞానానికి గల సారూప్యత గురించి కూడా అనేక కోణాలలో అధ్యయన పరిశోధనలతో పాటు ప్రయోగాత్మక వివరాలను సప్రమాణంగా వివరించారు.

ఈనాడు చెప్తున్న ఈ 'నవ్య నవ గురు సన్యాస దీక్ష'కు జగద్గురువు శ్రీకృష్ణుడు ఆధారం. ఈ సాధనలో రంగుల ప్రామాణికతకు ప్రాధాన్యత ఎక్కువ. **శ్రీ కృష్ణుని రంగు – నీలం – అంటే ఈథరిక్ బాడీ, మన మాస్టార్ గారిది వైలెట్ – అంటే దాని నెక్స్ట్ కలర్.**

ఇవల్యూషన్ సహస్రార చక్రానికి సంబంధించినదా లేదా ఆజ్ఞా చక్రంలో ఉన్నదా అనేది ముఖ్యం గానీ, ఇక్కడ అది ఏ రంగులో ఉంటుందనేది మనకు ముఖ్యం కాదు. మనకిష్టమున్నా లేకపోయినా అది ఆ రంగులో ఉంటుంది. బంగారము మట్టిలో పెట్టినా అది బంగారమే! మన దగ్గరున్నా అది బంగారమే!! మన దగ్గర నుంచీ దానినెవరూ తీసుకోలేరు. అదే నవనిధి అంటే – ఎవరిది వాళ్ళదే! దీని గురించి పరిపూర్ణ జ్ఞానం కావాలంటే సైన్స్ ఆఫ్ రూల్స్ బుక్ చదువుకోమని చెప్పారు. అది చదివితేనే మిగిలిన తరగతులు నిర్వహిస్తానని కూడా చెప్పారు. అమెరికా ప్రెసిడెంట్ లింకన్ అందులో ప్రవీణుడు. తరువాత దానిని అందరూ వదిలివేశారు. మళ్ళీ దానిని నేను ఆక్టీవ్ చేస్తానని చెప్పటం జరిగింది.

ఈ క్లాసులో ఈ దీక్షకు సంబంధించిన కొన్ని ముఖ్యాంశాలను ఇలా వివరించారు. నేను చెప్పే ఈ సాధనలు చేసేవాళ్ళు ఎక్కడున్నా సాధనా సమయంలో పసుపు / వైలెట్ కలరు దుస్తులు

ధరించి రావాలని చెప్పారు. మాస్టర్‌గారి సాధనా స్థలికి కేవలం ఈ నవ్య – నవ – గురు – సం – న్యాస దీక్ష తీసుకున్న వాళ్ళని మాత్రమే రానిస్తానని , 'మ్యాన్ వెన్స్, వేర్, విథర్' ఆ పుస్తకాన్ని ఇప్పటి నుంచి మొదలు పెట్టి చెప్తాను. దానిని కనుక మీరు బాగా అర్థం చేసుకుంటే పరిణామక్రమంలో చాలా ముందుకు అంటే పరమగురువుల స్థాయికి వెళ్ళిపోగలుగుతారు.

థియోసఫీలో "ఫ్రీ మాసొన్రీ (Free Masonry)" అంటే స్వచ్ఛంగా చేసే తాపీపని, దీనినే గురుదేవులు యుగశిల్పి అన్నారు. రెండూ ఒక్కటే. పదాలు తేడా అంతే కానీ చేసే పని ఒక్కటే! రాజాజీని థియోసఫీలోకి రానివ్వలేదు. కానీ, నెహ్రూను రానిచ్చారు. 6000 సంవత్సరాల నుంచీ వున్న సంస్థ ఇది. ఎక్కడా దీనికి రెండవ లాడ్జి రాలేదింతవరకు. కానీ, గుంటూరులో వచ్చింది. శ్రీమాస్టర్‌గారు కూడా అనేక మందిని థియోసఫీలో చేరమని ప్రోత్సాహించటం జరిగింది. అలా చాలా మంది సభ్యులుగా చేరారు. శ్రీమాస్టర్‌గారికి థియోసఫీ అంటే ఎనలేని అభిమానం. వారు ఎక్కడ, ఏ వూరులో వున్నా వీలైనంత వరకు క్లాసులకు అటెండ్ అయ్యేవారు. ఏమాత్రం సమయమున్నా అక్కడ క్లాసులు చెప్పేవారు. గుంటూరు, మాస్టర్‌గారు ఉద్యోగం చేసిన ఊరు గదా! అందుకే వారికి గుంటూరు అన్నా అక్కడ థియోసాఫికల్ సొసైటీ అన్నా అభిమానం చాలా ఎక్కువ.

2009 మార్చి 19వ తేదీన తమ యొక్క జీవిత రహస్యాన్ని ఒక దానిని ఇలా చెప్పారు. మరుసటి జన్మ వరకు ఆగకుండా గురుదేవులు నాకు ఈ జన్మలోనే విశిష్టమైన నవ్య – నవ – గురు – సం – న్యాస దీక్షను ఇచ్చేసారు. **నవ్య అనగా నిత్య నూతన, శాశ్వత, సనాతన సత్యము.**

ఉదాహరణ: రమణ మహర్షి, అమ్మ(జిల్లెళ్ళమూడి) వాళ్ళ జీవితాలు తెల్సుకోవాలి. ఊరికే చదివానండీ అంటే ఊరుకోను. వాళ్ళ జీవితాలను అధ్యయనం చేయాలి. ఈ విషయంపై అవగాహన కొరకు కొన్ని ప్రశ్నలు వేశారు.

నవ్య అనే పదం ఎందుకు అంటే ఆ సాధన చేసిన వాళ్ళకింక తర్వాత జన్మ ఉండదు. శిరిడీ సాయి ఆ మాటే చెప్పాడు. ఆ సాధన మూడురోజులలో అయిపోతుంది.

'నవ' అంటే రెండర్థాలున్నాయి. నవ అంటే 9 అనీ, ఇంకో అర్థంలో 'కొత్తది' అనీ అంటారు. 'అష్ట సిద్ధి'లు వచ్చేసిన తర్వాత నీ యొక్క క్రొత్త జీవితం ఏదైతే ఉంటుందో దానిని – 'నవ నిధి' అంటారు. అది ఎవరిది వాళ్ళదే! దీనిని గురువు కూడా ఇవ్వలేడు. దీనినే 'లైఫ్ డివైన్', 'సింథసిస్

ఆఫ్ యోగా' అని అరవిందులవారు చెప్పారు. థియోసఫీలో – ఫిజికల్, ఎమోషనల్, మెంటల్, కాజల్ బాడీ అనీ, ఇంకా సోలార్ సిస్టమ్ అనీ వున్నాయి. వీటిని ఎ.ఇ.పోవెల్ వ్రాశారు. ఇక్కడ శ్రీ అరవిందో – మాతామిర్రాలు, బ్లావెట్స్కీ – సి.వి.వి లు వీటికి పరమగురువులు. శిరిడీ సాయి – సత్యసాయిగార్లు శ్రద్ధా, విశ్వాసాల రూపంలో మనకు మార్గదర్శనం చేస్తారు. వీటి ద్వారా మనం ఏం తెల్సుకోవాలీ అంటే 'దేవతా శక్తి' వుంటేనే కానీ ఏ పనీ జరుగదు. (కరెంట్ వుంటేనే కదా ఏ పరికరమైనా పనిచేస్తుంది.) ఇది తెల్సుకోవాలంటే రామకృష్ణ పరమహంస – శారదా మాత జీవితాలలో వాళ్ళేం చేశారో తెల్సుకోవాలి.

ఇవంతా మీరు చేస్తేనే గానీ, నా కుటుంబంలోకి రారు. దానికోసం మీరు చాలా త్వరగా అభివృద్ధి అవ్వాలి. దానికి శ్వాస మెళుకువ తెలుసుకోవాలి. ఒక్క శ్వాసతో ఒక్క జన్మ అయిపోతుంది. ఇది తెలియాలి అంటే లాహిరీ మహాశయా – యోగానందల గురించి తెలుసుకోవాలి.

ఇవన్నీ చదువుతుంటే ఏం లాభం? ఇవల్యూషన్‌లో ఎంత ముందుకు వెళ్ళాలో తెలియాలి కదా! ఇవన్నీ శరీరములోని షట్చక్రాలు, ఆ తరువాత సహస్రారము అంటే గురుదేవులు, మాతాజీల గురించి అధ్యయనం చెయ్యాలి. అప్పుడూ మీకు యుగశిల్పి అంటే ఏమిటో, సంజీవనీ సాధన అంటే ఏమిటో తెలుస్తుంది. ఇదంతా 'నవ' అనే పదానికి వివరణగా చెప్పారు. ఇలా అభివృద్ధి అయిన వ్యక్తి ఏం చెయ్యాలి?

నవ్య – నవ – గురు – 'సం' – న్యాస దీక్ష తీసుకోవాలి. అప్పుడు ఆ వ్యక్తికి 'గురువు' అంటే ఏమిటో అర్థమౌతుంది. విజ్ఞాన భైరవ తంత్రలో శివుడు, పార్వతికి ఉపదేశించిన 112 దీక్షలు వున్నాయి. అందుకే 112 మంది కుటుంబ సభ్యులు నాక్కావాలని చెప్తున్నాను. అందుకే 'సత్యనారాయణ' మాస్టారు గారు నా జీవితంలోకి వచ్చారు. **ఆయనకు ఎంత తెలుసో, ఆయనకే తెలియదు, తల్లి – తండ్రి ఎఫెక్ట్ వాళ్ళు అక్కడ నాకు ఇస్తారు.**

"విజ్ఞాన భైరవతంత్ర" తరువాత శివుడు పార్వతికి చెప్పినది "గురుగీత". ఇదీ మనం బాగా చదవాలి. భగవద్గీతలో 9వ అధ్యాయంలో 32వ శ్లోకమును లలితా సహస్రనామంతో అనుసంధానం చేసి 5రోజుల క్రితము మీకు ఉపన్యాసం ఇచ్చాను. 32, 33 శ్లోకాల వివరణ చదువుతే అర్థమౌతుంది.

గురువు తర్వాత 'సం' న్యాసము

గురువు అయిన తర్వాత సంన్యాసము అంటే సంన్యాసములో ఏం చేస్తాడు – జపము చేస్తాడు. అంటే జపములో ఆయా దేవతాశక్తిని శరీరములోకి ఆవాహన చేసుకుంటూ అందులో లీనమైపోతాడు. అదే తానైపోతాడు. అప్పుడు ఆ వ్యక్తి ఆ దేవతా శక్తి పనినే చేస్తాడు. ఇప్పుడు గురుదేవులకు 2 కోట్ల మంది ఈ దీక్ష తీసుకున్నవాళ్ళు కావాలి. ఈ జన్మశతాబ్ది ఉత్సవాలకు ముందే ఒక కోటి మందిని ఇస్తానని గురువుగారికి మాట ఇచ్చాను.

నాకు గురుదేవులు శ్రీరామశర్మఆచార్య ఈ నవ్య – నవ – గురు – సంన్యాస దీక్ష ఇచ్చినప్పుడు – నేను కూడా మీకు ఆ దీక్ష ఇచ్చి మిమ్మల్ని అలా తయారుచెయ్యాలిగదా! దీనికి సిద్ధంగా వున్నారా?

అందుకని నేను కోటి తీర్థానికి వెళ్తాను. శ్వేతవరాహానికి వెళ్తాను, రమణ మహర్షి దగ్గరకు వెళ్తాను. అక్కడ కూడా ఈ దీక్షాకార్యక్రమాలను, అదీ పూర్ణిమలకే ఇవ్వాలని వెళ్ళాలన్నాను గదా! అందుకే నేను దానిని నిత్య గురుపూర్ణిమలని చెప్పాను.

నేను రాబోయే జన్మలో చెయ్యాలనుకున్న 112 సభ్యులను కలుపుకొని చేయవలసిన తాపీపనిని ఈ జన్మలోనే లాగించెయ్యమని గురువుగారు చెప్పారు. దాని కొరకే సప్త ఋషులతో సహా అందరూ మనలో వున్నారు. ఇంత చెప్తున్నా చెయ్యకపోతే మీరు ఎప్పుడు అభివృద్ధి అవుతారు? కానీ మిమ్మల్ని వదలను అని చెప్పారు.

36. అమరావతి – నవ్యాంధ్ర రాజధాని

కృష్ణవేణి నది ఒడ్డున ఉన్న ఈ నగరం ఈనాటిది కాదు. ఆదిమానవుడు ఇక్కడ సంచరించాడన్న దానికి ఆధారాలున్నాయని చరిత్ర చెబుతున్నది. భారతదేశాన్ని ప్రపంచానికి మరింత గొప్పగా పరిచయం చేసిన మహా బౌద్ధమత ఆధ్యాత్మిక సుగంధాలు ఈ నేల నుంచి గుబాళించినవే. 'అమరావతి' ని నగరంగా రూపకల్పన చేసింది జపాన్. అమరావతి అభివృద్ధిలో పాలుపంచుకోవటానికి చైనా కూడా కృషిచేసింది. దీన్ని గురించి మనం ఇప్పుడు చాలా గొప్పగా చెప్పుకుంటున్నాము. కానీ క్రీ.పూ. రెండు, మూడు శతాబ్దాలలో ఈ దేశాలకు దిశా, నిర్దేశం చేసిన ఘనత అమరావతిదే!

ఆచార్య నాగార్జునుడి దగ్గర విద్యాభ్యాసం చేసేటందుకై చైనా, జపాన్, శ్రీలంక... మొదలగు ఎన్నో దేశాల నుంచీ విద్యార్థులు చదువుకోవటానికి ఇక్కడికి వచ్చేవారు. ఆయా దేశాలలో అంతలా

బౌద్ధం వ్యాప్తి చెంది వేళ్ళూనుకోవటానికి ఓ ప్రధాన కారణమిది. అమరావతి అంటే చరిత్రకాదు. దేశ కీర్తి, ప్రతిష్ఠలను ఇనుమడింపచేసిన ఒకనాటి వైభవం. ఆ చరిత్రను పునరావృతం చేసేందుకు గుంటూరు జిల్లాలోని కృష్ణా తీరంలో 'అమరావతి' పేరుతో 'నవ్యాంధ్ర రాజధానిని' నిర్మిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. మొట్టమొదట ఇది దమ్మకడ, ధనకటక, ధాన్యకటకంగా ఆ తరువాత ధరణికోట అంటే ఈ మొత్తం ధరణికే కోటగా చివరకు అమరావతిగా స్థిరపడింది.

శాతవాహనుల కాలంలో ధాన్యకటకం ఆంధ్రులకు తొలి రాజధాని అయింది. క్రీ.శ.60 నుంచీ గౌతమీపుత్ర శాతకర్ణి ధాన్యకటకాన్ని రాజధానిగా చేసుకొని పరిపాలించాడు. దిగ్విజయ యాత్రలు చేసి రాజస్థాన్ వరకు జయించాడు. ఆ తరువాత పల్లవులూ, కోట కేతరాజులూ ధరణి కోటను రాజధానిగా చేసికొని పరిపాలించారు. ఇంక నాలుగోసారి చింతపల్లి జమీందారు రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 1780లలో ధరణికోట నుంచీ కాస్త ముందుకు వచ్చి, 'నగరాన్ని' నిర్మించాడు. ఇంద్రుడి రాజధానిలా అందంగా, ఐశ్వర్యవంతంగా ఉన్న తన రాజధానికి "అమరావతి" అని పేరు పెట్టుకున్నాడు. ఈ అమరావతి 1700 సంవత్సరాలకు పైగా ప్రఖ్యాత బౌద్ధ క్షేత్రంగా వర్ధిల్లింది. క్రీ.పూ. మూడవ శతాబ్దంలో అశోకుడు ధాన్యకటకాన్ని స్వాధీనం చేసుకునే సమయానికే ఇక్కడ మహాచైత్యం (మహాచైత్యం అనేది ఒక స్థూపం. అయితే దానిని ఆ రోజులలో కోలిన్‌మెకెంజీగారి సర్వేలో దీపలదిమ్మ స్థూపంగా వ్యవహరించేవారని తేలింది) ఉండేది. కారణం బుద్ధుడి అవశేషాలను నిక్షిప్తం చేయటంతో దీనిని బౌద్ధులు అత్యంత పవిత్రమైన ప్రాంతంగా భావించేవారు.

అందుకే 2006 జనవరి 3 నుండి 14 వరకు టిబెట్ నుంచి దలైలామా వచ్చి "కాలచక్ర యజ్ఞాన్ని" నిర్వహించి అమరావతి రూపురేఖలను మరింత శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆ సమయంలో ఆవిర్భవించిన దైవీశక్తి పూజ్యశ్రీ మాస్టరుగారి అంతర్దృష్టికి గోచరమైంది కాబోలు, వెంటనే అక్కడ 108కుండీల గాయత్రీ మహాయజ్ఞాన్ని ఏర్పాటుచేయాలని నాతో చెప్పారు. ఆ ప్రాంతానికి దగ్గరగావున్న వరిష్ఠ కార్యకర్త డా॥ శ్రీరాంగారికి సమాచారాన్ని చెప్పి "అతి త్వరలో ఆ మహాయజ్ఞాన్ని ఏర్పాటుచేయమని" కోరాము. మాస్టరుగారి లక్ష్యాలను ఆకళింపు చేసుకొన్న శ్రీరాంగారు స్థానిక కార్యకర్తల సహాయంతో యజ్ఞానికి అన్ని ఏర్పాట్లు చేశారు. **శ్రీశ్రీమాస్టర్‌గారు వెళ్ళి ఆ మహాయజ్ఞాన్ని నిర్వహించి అక్కడ ఏకత్రితమైన దైవశక్తిని ఆ ప్రాంతంలో నిక్షిప్తం చేశారు. ఇంకా ఆనాటి ప్రవచనంలో వారు రాబోయే రోజులలో ఈ క్షేత్రం ప్రపంచానికే అత్యుత్తమమైన**

నగరంగా, విద్యా, వైజ్ఞానిక రంగాలలోనే కాక ఆధ్యాత్మిక శక్తి కేంద్రంగా విరాజిల్లగలదనే భవిష్యవాణిని ఆనాడు ప్రకటించారు. ఇంకా ఈ ప్రాంతంలో ధన, ధాన్య సమృద్ధి కలిగి ప్రజలు శాంతి, సౌఖ్యాలతో జీవిస్తారనే ఆశ్వాసనను కూడా ఇచ్చారు. అయితే ఆ దైవ శక్తి ఇలా స్థిరపడాలంటే ఇంకా కొన్ని ఇలాంటి కార్యక్రమాలను ముందు కూడా చేస్తే మంచిదని సూచించారు. వారి సూచనలను సుగ్రీవాజ్ఞగా శిరసావహించి, ఇంకా కొందరు కార్యకర్తలు తరచుగా గాయత్రీ యజ్ఞాలను, శ్రీ మహాలక్ష్మి సాధనలను చేయించారు. ఇంకా **చిత్రమేమిటంటే గురుదేవుల అనుగ్రహంతో 2018లో జనవరి 5 నుండీ 8వ తేదీ వరకు శ్రద్ధేయ డాక్టర్ ప్రణవపాండియా, శైలదీదీగార్ల పర్యవేక్షణలో 42వ అశ్వమేధ మహాయజ్ఞం మంగళగిరిలో అపూర్వంగా జరగటమనేది పరమగురువుల ప్రేరణగా భావించాలి.**

ఒకప్పుడు ధాన్యకటకం పేరుతో విద్య, వ్యాపారాలతోపాటు ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లినట్టే, క్రొత్త అమరావతి కూడా అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించి "పూజ్యశ్రీ మాస్టరుగారి ఆకాంక్షను" తప్పక నెరవేరుస్తుందనేది పరమసత్యం. నాటి ఘనచరిత్రకు, రేపటి ఉజ్వల భవిష్యత్తుకు సాక్షి కృష్ణమ్మతల్లి ఉండనే ఉందిగా! అతి సామాన్యంగా కన్పించే మాస్టారు అనేక భవిష్యవాణులను చెప్పారు. అందులో ముఖ్యంగా – దత్త క్షేత్రం గురించి వారిచ్చిన దర్శనాలను యదార్థంగా మనం కళ్ళతో చూశాము. అలానే అకుంఠిత దీక్షతో అమరావతి కిచ్చిన "ధరణి దీక్ష" కూడా కచ్చితంగా 10 సంవత్సరాల్లోనే ఎంతో వైభవంగా సాకారంగా మన ఎదుట నిలిచిన ఇలాంటి లీలలు ఎన్నో – ఎన్నెన్నో!!!

37. గురుదక్షిణ

2010వ సంవత్సర ప్రారంభం నుంచే జన్మశతాబ్దికి చేయవలసిన పనుల గురించి అనేక సాధనాత్మక, ఆచరణయోగ్యమైన సూచనలందించారు. మనమెవ్వరం కనీసం ఊహించనైనా, ఊహించలేని రీతిలో వారి ప్రణాళికలు చాలా విలక్షణంగాను, స్పష్టంగానూ ఉంటాయి. ప్రత్యేకించి గురుదేవుల కొరకు చేసే ప్రతీ పనీలోనూ ఆ శ్రద్ధ అణువణువులోనూ చాలా స్పష్టంగా కనిపించేది. గురుదేవుల జన్మశతాబ్దికి గురుదక్షిణగా మనం ఏమి ఇవ్వాలి?

పూజ్యగురువులతో జన్మ జన్మల సంబంధం ఉన్న మనలనందరినీ పూజ్యశ్రీ మాస్టర్‌గారు విశేషమైన జ్ఞాన మార్గంలో నడిపిస్తున్నారనేది అందరికీ తెలిసిన విషయమే! అంతటి జ్ఞానాన్ని వారు ప్రసాదించినా దానిని పొందటమనేది వ్యక్తిలో వున్న సామర్థ్యాలను బట్టి ఉంటుంది. అయితే ఇప్పుడు సమయం వచ్చింది. ఈ సమయాన్ని కొంగ్రొత్త విధానంలో గురుదేవుల సేవకు వినియోగించాలి. దానికి ఇంకాస్త బాధ్యతతో, మరికొంత సామర్థ్యంతో వివిధ ప్రణాళికల ద్వారా వినియోగించటానికి అనువైన రీతిలో ఆ రోజున మాస్టర్‌గారు ప్రవచనంలో కొన్ని మార్గాలను సూచించారు.

20.01.2010 వసంత పంచమి పర్వదిన సందర్భంగా తీసుకున్న సంకల్పం ఏమిటంటే యుగశక్తి గాయత్రి మాసపత్రిక చందాదారుల సంఖ్య 24000 పూర్తి కావాలి. జన్మశతాబ్ది సమారోహానికి ఇంక ఒక సంవత్సరం మాత్రమే ఉన్నది. ఈ సంవత్సరం లోపల శ్రీరామశర్మ ఆచార్యజీ ఎవరు? ఆయన ప్రపంచానికిచ్చిన వైజ్ఞానిక ఆధ్యాత్మికత ఏమిటీ అనే విషయం గురించి అందరికీ తెలియ జేయాలి. అది అందరికీ తెలియాలంటే మన దగ్గరున్న ఏకైక మాధ్యమం "యుగశక్తి గాయత్రి" మాసపత్రిక.

గురుదేవుల జ్ఞానగంగ శక్తి ధారలు "యుగశక్తి గాయత్రి" మాసపత్రిక రూపంలో ప్రవహిస్తున్నాయి. 24000 అనేది ఒక మ్యాజిక్ ఫిగర్. ఈ సంఖ్యకు చేరితేనే గానీ గురుదేవులు చెయ్యాలనుకున్నది చేయలేరు. 24000 సంఖ్యకు చేరితే ఏమౌతుందంటే దానిని అస్త్రంగా ప్రయోగించవచ్చు. అప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చాలా చమత్కారాలు జరుగుతాయి. కాబట్టి శ్రద్ధావంతులైన కార్యకర్తలందరూ దీనిని వ్యక్తిగత బాధ్యతగా గుర్తించి వచ్చే వసంతపంచమి నాటికి 24000 మందిని యుగశక్తి గాయత్రీ మాసపత్రికకు చందాదారులను చేర్పించాలని ఆనాటి ప్రవచన సారాంశం.

ఈసారి నా జన్మదినాన్ని పురస్కరించుకొని ఎవ్వరూ నా దగ్గరకు రావద్దు. ఆ ఫంక్షన్‌కు పెట్టే ఖర్చుతో 'యుగశక్తి గాయత్రీ' మాసపత్రికకు క్రొత్త చందాదారులను చేర్పించండి.

రెండో విషయం ఏమిటంటే గురుదేవుల జన్మశతాబ్దికి గురుదక్షిణగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక లక్షమంది కార్యకర్తలను హరిద్వార్‌కు పంపించాలి. ఇంత మందిని తయారుచేయటానికి

కొన్ని మౌలికమైన సూచనలను చెప్పారు. మొదటిగా 24000 యుగశక్తి చందాదారులలో కనీసం వెయ్యిమంది కాస్త ఉత్సాహం తెచ్చుకొని వారి బంధు, మిత్రులను, ఈ మహోత్సవంలో పాలు పంచుకొనేలాగా చేస్తే 1000 × 100 = 1 లక్ష మంది సులువుగా తయారౌతారు. దాంతోపాటుగా మాస్టర్‌గారికి వెబ్‌సైట్ పని చేస్తున్న ముగ్గురిని, గురువుగారి గురించి, శాంతికుంజ్‌లో జరిగే కార్యక్రమాల గురించి, జనంలో బాగా స్పందన వచ్చే విధంగా కొత్త కొత్త విశేషాలను ప్రతీరోజు వెబ్‌సైట్‌లో పెట్టమని చెప్పారు.

మూడవ విషయం: గురుదేవుల సాహిత్యాన్ని మొత్తం 108 భాగాలుగా వర్గీకరించి ఒక్కొక్కరు ఒక్కొక్క విషయమును బాగా అధ్యయనం చేసి ఇంక దానిని సామాన్యజనులకర్థమయ్యేలా ప్రచారం చెయ్యాలి.

4వ విషయం: ప్రతీరోజు ప్రతి ఒక్కరు అరగంటసేపు ఆసన, ప్రాణాయామాలను చెయ్యాలి.

5వ విషయం: రోజువారి సాధనలో భాగంగా ఒక మాల గాయత్రీ, 3 తులసీ గాయత్రీ చెయ్యాలి. తులసీ గాయత్రీ చేస్తున్నంతసేపు తులసి లక్ష్యాలు (1) సేవాశక్తి (2) దేశ సేవా ప్రవృత్తి (3) సత్య ప్రాధాన్యత (4) పతీవ్రతము (5) పత్నీ వ్రతము (6) ఆత్మ శాంతి (7) పరదుఃఖ నివారణల నిమిత్తమై ఈ తులసీ గాయత్రీ చేస్తున్నాననే భావంతో జపం చేయాలి.

చివరగా గాయత్రీ మంత్రం ఒకవైపు, మాతాజీ గురుదేవులు ఒకవైపు గల ఒక దర్శన్ కార్డ్ వేయించి – గాయత్రీ మంత్రాన్ని ప్రతీ గంటకు 5 సార్లు ఎక్కడవున్నా చెయ్యాలనీ, ఆ కార్డు ఎప్పుడూ జేబులో పెట్టుకోవాలనీ చెప్పారు. వీటన్నింటితోపాటు అతి ప్రధానమైన "గాయత్రీ శ్రీరాం" అనే మంత్రాన్ని మాస్టారు చేసారు.

గాయత్రీ శ్రీరాం

ఇది గురుదేవులందించిన అమృతవిద్య. "గాయత్రీ శ్రీరాం"లో గాయత్రి అంటే వెలుగు, శ్రీరాం అంటే అనంత శక్తికి ప్రతీక, అనాది నుంచీ భారతీయ సంస్కృతిలో సీతారాములు, పార్వతీపరమేశ్వరులు, 'రాధేశ్యాం' వంటి మంత్రాలు ఎంతో ప్రాచుర్యాన్ని సంతరించుకున్నాయి. అలాగే ఈ 'గాయత్రీశ్రీరాం' మంత్రాన్ని కూడా మీ నిత్యసాధనలో చేసుకోవచ్చును. ఈ మంత్రంతో పాటుగా "గాయత్రీ సహస్రనామావాళి" చదవడం శ్రేయస్కరం అని మాస్టరుగారు చెప్పారు.

దీనిని **భీష్మామృత సాధనగా అభివర్ణించారు.** పూజ్యశ్రీ మాస్టరుగారు ఈ మహామంత్రాన్ని మొట్టమొదటగా శ్వేతద్వీపంలో ప్రారంభించారు. రోజుకు 49 మాలల చొప్పున 24 రోజులపాటు చేస్తే అదొక విశిష్టసాధనగా పూర్తి అవుతుంది. 49 అనే సంఖ్య 49 మరుద్గణాలను సూచిస్తుంది. మరుద్గణాలు వాయుదేవతలు. వాయుపుత్రుడైన హనుమంతుని అవతరణ (చైతన్యవంతునిగా చేయటం) కోసం ఈ సాధనను చేస్తున్నానని చెప్పారు. పృథ్విపై రామరాజ్య స్థాపన చేయవలసిన మన బాధ్యతకు హనుమంతుని అసాధారణ అండదండలు లభించాలని మాస్టరుగారు ఈ సాధన చేస్తున్నారు. తరువాత కాలంలో ఈ సాధన పూర్ణాహుతి చేయటం జరిగింది. ఈ మంత్ర జపాన్ని మీరు నిరంతరం చెయ్యాలి అని ఎంతో భావభరితమైన ప్రేరణాత్మక సందేశాన్ని చెప్పారు. ఈ పంచాక్షరీమంత్రము తక్షణమే ఫలితాలనిస్తుందనీ అక్షర లక్షలు చేయమన్నారు.

38. గురుదేవుల దర్శనం

నవంబర్ నెలంతా మాస్టర్‌గారు గురుదేవుల వాఙ్మయాలను చదువుతూ ప్రధాన విషయాలను క్రింద అండర్‌లైన్ చేస్తున్నారు. గత కొన్ని రోజుల నుంచీ గురుదేవుల వాఙ్మయాలు "సాధనా సే సిద్ధి" మొదటి భాగం మరియు రెండవ భాగములను చదువుతున్నారు. పది రోజులలో ఆ పని పూర్తి అయిపోయింది. బాగా అలసిపోయారు. రేపటి నుంచీ ఇంక ఒక్క వారంరోజులపాటు విశ్రాంతి తీసుకుంటాను. ఇంక పనినంతా వెబ్‌సైట్ ద్వారా మాత్రమే చేస్తాను.

పూజ్యగురుదేవుల జన్మశతాబ్దినాటికి గురుదేవుల వాఙ్మయాలను పూర్తిగా బయటకు తీసుకొచ్చి వ్యాసుడు ఏ విధంగానైతే వేదాలను, ఉపనిషత్తులను, పురాణాలను తన శిష్యులైన సూత, శౌనక, వైశంపాయనాది ఋషులకప్పజెప్పి ప్రపంచ వ్యాప్తము చెయ్యమని చెప్పారో అలానే నేను కూడా పూజ్యగురుదేవుల

వాఙ్మయాలు = 70

క్రాంతిధర్మీసాహిత్యం = 20 పుస్తకాలను, వీటితోపాటు గాయత్రీ సహస్ర నామావళి, మాతాజీ జీవిత చరిత్ర, గురుదేవుల ఆత్మకథను, "గాయత్రీ శ్రీరాం" – నామ జపమును – ఇలా మొత్తం విషయాన్ని 108 గ్రూపులుగా చేసి ఎవరికి దేని మీద అభిరుచి వుంటుందో, వారికి ఒక్కొక్క సబ్జెక్టుకు ఒక్కొక్క విభాగానికి అప్పజెప్పటం జరుగుతుంది. కాబట్టి ముందు ఈ విషయాన్ని

పదిమందికీ తెలియజెయ్యండి. అప్పుడు ఎవరికే విషయం కావాలో దాన్ని ఎన్నుకుంటారు అని చెప్పగా తక్షణమే ఈ విషయాన్ని ఫోనులద్వారా, వెబ్ ద్వారా అందరికీ తెలియపరచటం జరిగింది.

ప్రతీ రోజూ ఆ సమయంలో ఎంతో ప్రశాంతంగా "గాయత్రీ శ్రీరాం" నామ జపం చేస్తూ నడుస్తుంటారు. ఆ రోజు నడుస్తూ, నడుస్తూనే చాలా విసుగ్గా, కోపంగా "ఎవ్వరూ ఏ పనీ చెయ్యటంలేదు. ఎవ్వరికీ ఏమీ పట్టటంలేదు." అనుకుంటూ నడుస్తున్నారు. రోజువారీ కార్యక్రమంలో ఆ సమయంలో మాస్టర్‌గార్కి ఏదో ఒక పండ్లరసం ఇవ్వటం అవసరం. ఆ రోజు కూడా కమలాపండ్ల రసం తయారుచేసి పైకి తీసుకెళ్ళి ఇవ్వాలి. కానీ, వారి 'మూడ్' ఎలావుందో. మూడ్ బాగుంటే తాగుతారు. లేకపోతే ఎలాగా చాలా భయంగా వుంది అనుకుంటూ పైకి వెళదామా, వద్దా అని సంశయిస్తున్న సమయంలో గురుదేవులు పంపిన మాదిరి సరిగ్గా అదే సమయానికి వల్లీ, కార్తీక్ వాళ్ళు ఇంట్లోకి వచ్చారు. 'ఈ పండ్ల రసం' పైకి తీసుకువెళ్ళి "మాస్టరుగారికివ్వమని" చెప్పేలోపలనే మాస్టర్‌గారే గబగబ మేడ దిగి క్రిందికి వచ్చేశారు. వస్తూనే కార్తీక్ ఇచ్చిన పండ్లరసం తీసుకుంటూ నా ఆహారంలో మార్పు అర్ధమైంది. ఇప్పుడు ఈ పండ్ల రసం ఇచ్చి నా దీక్షను విరమింపజేశావురా! అని ఎంతో ఉత్సాహంగా పండ్లరసం తాగారు. కొద్దిక్షణాల క్రిందట ఎంతో విసుగ్గా, కోపంగా పైకి వెళ్ళిన మాస్టరుగారేనా? ఈ కాస్తసేపట్లో ఏమి జరిగి వుంటుంది, ఇంత ఉత్సాహం ఎందుకు వచ్చిందీ అని అనిపించింది. పండ్లరసం త్రాగటమైపోయాక ఇంక చెప్పటం మొదలెట్టారు.

ఇప్పుడే మేడమీదికి వెళ్ళాను గదా ! చాలా చిరాగ్గా వుంది, విసుగ్గా వుంది. నీకు తెల్సుగదా, అన్నారు నా వంకచూస్తూ. ఇంతలో మాతాజీ, గురుదేవులు వచ్చారు. దగ్గరగా వచ్చారు. గురుదేవులు విపరీతంగా తిట్టారు, కోప్పడ్డారుకూడా! ప్రహ్లాద బాబా ఆశ్రమానికి వెళ్తావా? వెళ్ళు – 'నా వాళ్ళందరినీ శాంతికుంజ్‌కి ఇచ్చేశానంటావా? నువ్వేందిరా నాకిచ్చింది. నా వాళ్ళను నా దగ్గరకు తీసుకురావటానికి నిన్ను ఆంధ్రప్రదేశ్‌కు నేనే పంపాను, అది గుర్తుంచుకో!' ఎన్నోజన్మల నుంచీ ఇలాగే జరుగుతున్నది. ఇంకనుంచైనా "ఎక్కడ వుండాలీ, ఏమి చెయ్యాలీ – అంతా తను చెప్తుంది. అలాచేస్తూ వుండు". నేను శాంతికుంజ్‌లో ఉంటూనేగా అంతా చేశాను. నీవూ అలాగే చెయ్యి. ఇప్పటి వరకు ఎలా చేశావో అలాగే చెయ్యి. ఇంక ఆహారం విషయం అంటావా తనుందిగా. చూసుకుంటుంది. నీకేం కావాలో చెప్పు." అంటూ ఇంకా చెప్పబోతుంటే ప్రక్కన్నే ఉన్న మాతాజీ గురుదేవులను ఆపుతూ, మాస్టర్‌గారినే సమర్ధిస్తూ, ఎంతో అనునయంతో, అనంతమైన ప్రేమను

నా మీద కురిపించింది. ఇప్పుడెంత హాయిగా వుందో అంటూ ఎంతో ఉద్వేగంతో, ఉత్సాహంతో, ఆనందభాష్పాలతో ఆ సాయంత్రం జరిగిన విషయాలను చెప్పారు. ఇంక ఆనాటి నుంచీ మాస్టారిలో నూతన ఉత్సాహం వచ్చింది. మళ్ళీ క్రొత్త సాధనలు మొదలు పెట్టారు. ఆహార, విహారాది విషయాలలో చక్కటి క్రమపద్ధతి వచ్చేసింది. ఎంతో ఆనందంతో పనులు ముందుకు సాగుతున్నాయి. ఇది నిజంగా జరిగిన విషయం.

39. తులసీ యోగ సాధన

గురుదేవుల దర్శనంతో నూతన ఉత్సాహం వచ్చేసింది. పనిలో వరవడి పెరిగింది. కొత్త, కొత్త సాధనలు మొదలుపెట్టారు. ప్రతీరోజూ ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. కిశోర్ వాళ్ళింట్లో 'థియోసఫీ' క్లాసులు ప్రారంభించారు. ప్రతీరోజు అక్కడకు వెళ్ళి క్లాసులు చెప్పటం, రాత్రి పూట వెబ్‌సైట్‌లో క్లాసులు చెప్పటం మళ్ళీ అంతా మామూలైంది. ఆరోగ్య పరిస్థితీ మెల్లగా దోవలో పడింది. ఇంక ఇక్కడ నుంచీ గురుదేవుల వాఙ్మయంలో ఇచ్చిన తులసీ యోగసాధన మొదలు పెట్టారు. ఈ సాధన పేరు చాలా క్రొత్తది. ఎప్పుడూ, ఎవ్వరూ విని వుండరు. గురుదేవుల వాఙ్మయంలో "ప్రసుప్తి సే జాగృతీకీ ఓర్" అనే పుస్తకంలో ఇచ్చిన అనేక సాధనలలో చాంద్రాయణ వ్రతంలాగే ఇదీ ఒక సాధన.

చాంద్రాయణ వ్రతంలో ఇవ్వబడిన అనేక సాధనలలో "గోదానం" ఒకటి. ఇక్కడ గోదానము అనగానే మనం 'గోవును తెచ్చి ఒక బ్రాహ్మణునికి' సమంత్రపూర్వకంగా దానం చేయటమనే భావనలో ఉంటాం. కానీ, మాస్టరుగారు దాని అర్థాన్ని అత్యంత ఉన్నత స్థాయిలో ప్రతీ ఒక్కరూ, ప్రతీరోజు ఎలా చెయ్యాలో చాలా సరళంగా అందించారు.

గోదానం ఎలా చెయ్యాలీ ?

ప్రతిరోజు నియమిత గాయత్రీ సాధన, ఉపాసన, జపం పూర్తి చేసిన తరువాత సూర్య అర్ఘ్యదానం చేస్తుంటాముకదా! ఆ నీటిని తులసి చెట్టులోనే అర్ఘ్యం ఇవ్వటం ఆచారం. **గాయత్రీ మంత్రం చేశాక సూర్యునికి అర్ఘ్యం ఇస్తున్నప్పుడు, చేతిలోని నీటిలోకి సూర్యకిరణాలు పడినప్పుడు ఆ నీటిని తులసిలో పోస్తే అదీ, అసలైన 'గోదానం' అవుతుంది. ఎందుకంటే 'గో' అనే పదానికి సూర్య కిరణాలు అనే అర్థం వుంది. గో అంటే ఆవు అనే అర్థమూ వుంది. కాబట్టి తులసీకి 'సూర్య**

కిరణాలు' పడిన జలాన్ని అర్ఘ్యంగా ఇస్తే గోదానం చేసిన ఫలితం వస్తుంది. బ్రహ్మవర్చస్ చాంద్రాయణ వ్రతంలో 'గోదానం' ఇవ్వటంలో గల ఆ అర్థం, పరమార్థం, అంతరార్థం అంతే.

ఇక్కడ గాయత్రీ మంత్రంలో 'సవిత' అనే పదం ఉన్నది. మొదటి పాదంలో 'తత్ సవితుర్వరేణ్యం' అని వున్నది గదా, సవితుః అనే పదాన్ని కాస్త గమనిస్తే విత్ అంటే సంపద. స అంటే కూడిన అని అర్థం. 'సవిత' అంటే సంపదతో కూడిన వాడని అర్థం. సంపద అంటే మనం రోజు వారీగా ఉపయోగించుకునే కాయితాలు సంపదలు కావు. ఇక్కడ విత్ అంటే సూర్య కిరణాలని అర్థం. 'సవిత' యే దేవమాత. **అసలైన సంపద ఏమిటంటే ఈ సూర్య కిరణాలు. సూర్యకిరణాలు నీటితో కలిసి తులసిలోకి అర్ఘ్యప్రదానం చేస్తే మనం మహావిష్ణువును చేరుతాం. అదే తులాభారం.** శ్రీ కృష్ణ తులాభారంలో సత్య భామ – సంపద అయితే రుక్మిణీ దేవి – తులసి అంటే భక్తి. ఈ రెండూ కలుపుతేనే శ్రీకృష్ణుని, అంటే భగవంతుణ్ణి చేరుతాం. అందుకే శ్రీకృష్ణుడు అష్టమహిషులను వివాహమాడాడు. వారే అష్టసిద్ధులు.

సత్యభామ – సంపద, రుక్మిణి – భక్తి మరి, జాంబవతి – మణి. అదే శ్యమంతకమణి. సూర్యకిరణాలను అత్యంత భక్తి, శ్రద్ధలతో సత్రాజిత్తు ఆరాధించినందువలన ఆయనకు ఆ శ్యమంతకమణి లభించింది. సత్యభామ సంపద అంతా ఆ మణి ఉపాసన వలన వచ్చినదే. బంగారం, తులసి, మణి ఈ మూడింటికి ప్రతీకలుగా సత్యభామ, రుక్మిణి మరియు జాంబవతిని వర్ణిస్తారు. ఈ ముగ్గురితో పాటు ఇంకో ఐదుమందినీ పొందటానికి శ్రీకృష్ణుడు వేర్వేరు సందర్భాలలో యుద్ధం చేయవలసి వచ్చింది. ఇవన్నీ భౌతిక ప్రమాణాలుగానే మనం గుర్తిస్తాం కానీ, నిజంగా అష్టసిద్ధులను పొందాలంటే మనం అంతర్యుద్ధం, అంతర్మథనం చెయ్యాల్సిందే.

సవిత – సంపద అంటే సూర్య కిరణాలను తులసితో కలిపితేనే మనం భగవంతుణ్ణి చేరతాం. అదీ

'అష్ట సిద్ధి నవ నిధికే దాతా సబ సమర్థ గాయత్రీ మాతా' అష్టసిద్ధి, నవనిధులలో అష్టసిద్ధులను తెల్సుకున్నాం.

నవ నిధులు అంటే – నవ ధాన్యాలు. ఏ ధాన్యం పండి పైకి రావాలన్నా సూర్యకిరణాల స్పర్శ చాలా అవసరం. సూర్యకిరణాల వల్లనే పంటలు పండుతాయి. పూలు పూస్తాయి. పండ్లు ఆ వేడికి

సహజంగానే పండుతాయి. ఈ అనంతమైన విజ్ఞానం ఇంకా బాగా బాగా తెలియాలంటే, గాయత్రీ సహస్రనామ పారాయణలు కోట్లు కోట్లు జరగాలి. ఇక్కడ మరొక అద్భుతమైన సాధనను మాస్టారు చేశారు. ఒక రోజున చాంద్రాయణ వ్రతంలో భాగంగా చేస్తున్న 'యోగనిద్ర' సాధనలో మాస్టరుగారికి ఒక సందేశం వచ్చింది.

40. తులసీ యోగనిద్ర

శ్వేతద్వీపంలో ప్రతీరోజూ సాయంత్రం స్నానం చేసిన తరువాత ఈ సాధనను ప్రారంభించే వారు. విశ్రాంతిగా పడక్కుర్చీలో కూర్చుని సి.డి.ని వింటూ ధ్యానంలోకి వెళ్ళిపోయేవారు.

తులసీ యోగసాధన అంటే ఏమిటి? దీనిని ఎందుకు చేస్తున్నారు?

తులసీ యోగనిద్ర అనేది అష్టసిద్ధులను ఇచ్చే ఒక సాధన. అష్టసిద్ధులు వచ్చినటువంటి వ్యక్తికి నెమలిపింఛము స్థాయి వస్తుంది. శ్రీకృష్ణుడికి నెమలిపింఛము ఉంది. ఇంకెవడికి ఎందుకు లేదో మనకి తెలియదు. నెమలి పింఛమును మనం కూడా తెచ్చుకోవచ్చు. నాకు ఆ స్థాయి ఉందో లేదో తెలియదు కానీ నాకు తెలుసు దాన్ని ఎలా వాడాలో?

తులసీ యోగనిద్ర సాధనను యజ్ఞమయ్యాక చెయ్యాలి. దీనిని కరెక్ట్‌గా చేయగలిగితే రోజుకు 15నిమిషాల పాటు చేస్తే చాలు. ఏమీ తెలియకుండా ఎన్ని యజ్ఞాలు చేస్తే ఏమి లాభము? అసలు అష్టసిద్ధుల రహస్యం నెమలిపింఛంలోనే వుంది. నెమలి పింఛాన్ని కనుక జాగ్రత్తగా గమనిస్తే "ఇది ఆజ్ఞా చక్రమే" అని అర్థమైపోతుంది.

అందుచేత మీరిప్పుడు 'ఆజ్ఞాచక్రాన్ని' జాగృతం చెయ్యాలి. శ్రీకృష్ణతులాభారం సినిమా చూశారు గద! అందులో సత్యభామాదేవి ఎంత బంగారం తెచ్చిపెట్టినా త్రాసు కదల్లేదు. కానీ రుక్మిణీదేవి రెండు తులసిదళాలు తెచ్చి త్రాసులో వేసింది. అంతే, శ్రీకృష్ణుడు కూర్చున్న త్రాసు కదిలింది. "అదే తులసీ యోగనిద్ర". మీరు కూడా అలా సాధన చేసి లేవవచ్చు. కానీ దాని కంటే ముందు ప్రతీరోజూ యుగనిర్మాణ యోజనా సత్సంకల్పాలను చదివి వాటిని మన జీవితంలో ధారణ చేసుకోవాలి.

ఈ 18 సత్సంకల్పాలు, గీతలోని 18 అధ్యాయాలను 18 సత్సంకల్పాలుగా గురుదేవులు ఇచ్చారు. వీటిని రోజూ చదివితే గీతను చదివినట్లే!

యజ్ఞము చేయటము కాదు. యజ్ఞమయ జీవితాన్ని జీవించాలి. తులసీ యోగనిద్ర తరువాత కళ్ళు మూసుకొని రిలాక్సు అయిపోండి. ఏ రోగమూ రాదు. నేను ఈ చిన్న టెక్నిక్‌ను వాడే నవంబర్ 8వ తారీకున హరిద్వార్‌లోని మన తెలుగువారు బస చేసిన బైరాగీ ద్వీపము దగ్గరకి సుమారు 8 కి.మీ. వరకు నడుచుకుంటూ వెళ్ళగలిగాను. నాకు అలసట రాలేదు. కానీ ఈ టెక్నిక్ గురువుగారి పనికి మాత్రమే వాడతాను.

సాధన

కళ్ళు మూసుకోండి. మీరు రిలాక్స్ అయిపోతే ఇంక ఏ రోగమూ ఉండదు. మీకు సమాధి స్థితి ఎలా ఉంటుందో తెలియదు. మీరు సమాధి స్థితికి వెళితే బరువు వుండరు. మీరు కరెక్ట్‌గా చేస్తే మీరు భూమి మీద 2 అంగుళాలు పైకి లేవగలుగుతారు. అలాంటి అనుభవం వచ్చినప్పుడు మీకు యోగనిద్ర వచ్చిందని అర్థము. బంగారము కంటే కూడా తులసి చాలా విలువైనది అని తెలియచేసింది రుక్మిణీదేవి. అవతార్ అనే ఇంగ్లీష్ సినిమా చూస్తే మీకు తులసీతులాభారం అర్థమౌతుంది. తులసి వుంటే భారము వుండదనీ, భారము అనేది లేకపోతే మీ జీవితం ఎలా వుంటుందీ? భూమ్యాకర్షణ పని చేస్తున్నంతసేపూ బరువు వుంటుంది. భారమూ వుంటుంది. గ్రావిటేషనల్ పుల్ వున్నంతవరకూ శ్రీకృష్ణుడు వున్నా ఒకటే, బంగారమున్నా ఒక్కటే! లేపలేము. రుక్మిణీదేవి తులసిని ఉపయోగించి ఎలా ఎత్తగలిగిందీ? అది నేర్చుకోవాలి. అప్పుడు మనం శ్రీకృష్ణుణ్ణే కాదు మొత్తం ప్రపంచాన్నే ఎత్తేయగలం. గురువుగారు దీనిని నేర్చుకోమంటే మనం కోరికల చిట్టాతో గురువుల దగ్గరికి వెళతాము. మీరు ఎలా జీవిస్తున్నారో అర్థం చేసుకోండి. మీరు ఎదగాలీ అనుకుంటే గురువులనేమీ అడగవద్దు. గురువులను అడగాల్సిన వాటిని అడగండి. ఇస్తారు. లేదని చెప్పటానికి నేనెవరు?

ఈ సందర్భంలోనే ఈ తులసీ యోగసాధన జనసామాన్యంలోకి తీసుకురావటానికి కార్డుసైజులో చక్కటి ఫోటోలను తయారుచేయించి ప్రతీ ఇంటిలో టేబిల్ మీద పెట్టుకోమని చెప్పారు. అలాంటిదే దర్శన్ పాకెట్ సైజు ఫోటోలను చేయించి ప్రతీ వారికీ ఇప్పించారు.

శ్రీరామశర్మ ఆచార్య గురుదేవులే ఈ తులసీ సాధనను ఇచ్చారు. ఈ గురుత్వాకర్షణ నుంచీ బయటకు రావాలని అనుకుంటున్న వారికి ఈ తులసి చెట్టు తప్పితే మరో మార్గంలేదు. ప్రతీవారు

తమతమ ఇళ్ళల్లో తులసిని పెట్టుకొని ఉదయం / సాయంత్రం గానీ అర్ఘ్యం ఇవ్వండి. అనేక సమస్యలు తీరుతాయి.

41. తులసీ యోగసాధన - నడిస్తే సత్యయుగము

ప్రాణశక్తి కోసం

తులసీ యోగసాధన – నడిస్తే సత్యయుగము అనే ఒక అద్భుతమైన ఫార్ములాను మాస్టరుగారు ఇచ్చారు. ఇక్కడ ఒక చిన్న సాధన ఉన్నది. 'అ'కార, 'ఉ'కార, 'మ'కార ములతో కూడిన 'ఓం'కార సాధన చేస్తే ఎవ్వరికైనా 'ప్రాణశక్తి' వచ్చేస్తుంది. 'ఓం' అనేది ఒక మానసిక స్థితి. శ్రీకృష్ణుడి దగ్గర మనకు నెమలి పించము కనిపిస్తుంది. ఆ నెమలి పింఛము యొక్క సంకేతమే 'ఓం'కారస్థితి. దేవతలకి భౌతిక శరీరం ఉండదు. కనుక వాళ్ళకు నెమలి పింఛము ఉండదు. శ్రీకృష్ణుడికి ఒక్కడికే భౌతిక శరీరం ఉంది. ఆయన ఎప్పుడూ 'ఓం' కారస్థితిలో ఉంటారు. మాస్టారిని ఒక సందర్భంలో నేను, మాస్టారూ ఓంకారం వినిపించింది ఇందాక, మీరు **'ఓం' కార సాధన చేస్తున్నారా? అని అడిగాను, దానికి వారు నేను ఎప్పుడూ ఆ స్థితిలోనే కదా ఉంటాను అని అన్నారు.**

తులాభారములో ఎంత బంగారము వేసినా శ్రీకృష్ణుడు తూగలేదు. తులసి వేస్తేనే తులాభారము కదిలింది. రుక్మిణి తులసితో శ్రీకృష్ణుణ్ణి సాధించగలిగింది. త్రాసులో ఎడమ (ఇడా) కాదు, కుడి (పింగళ) కాదు, త్రాసుముల్లు సున్నాలో ఉన్నప్పుడది సుషుమ్నలో ఉన్నది అని అర్థం. తులాభారం అంటే సమానత్వం.

త్రాసులో బంగారం వేసినప్పుడు ఒక ప్రక్కకి ఒరిగిపోయింది. కానీ తులసి దళం వేయగానే త్రాసు సమానస్థితికి వచ్చింది. అంటే తులసి దళంతో యోగస్థితి వచ్చేసింది. సాధకునికి 'యోగస్థితి' వచ్చింది. అంటే అతని మనస్సు సమానత్వములో ఉన్నదీ అని అర్థం. అప్పుడతని శ్వాస 'సుషుమ్న'లో ఉంటుంది. యోగిస్థితి రావటానికి 'శ్వాస' ఇడలో ఉండకూడదు. పింగళలో ఉండకూడదు. సుషుమ్న లోనే ఉండాలి. అదీ తులసీ యోగసాధన.

ఇది తెలియాలంటే శరీరంలో ఉండే 5 తత్త్వాలు తెలియాలి. మొదట అగ్నితత్త్వము గురించి తెలియాలి. శరీరంలో అగ్ని "ఉష్ణోగ్రతరూపంలో" శరీరమంతా వ్యాపించి ఉంటుంది. అగ్ని అర్థమయ్యాక శరీరంలో ఉండే 'జ్యోతి' అర్థమౌతుంది. అంటే అగ్ని – జ్యోతిగా మారుతుంది.

దీనినే గురుదేవులు అఖండజ్యోతి అన్నారు. మీలోని ఆ జ్యోతి తేజోవలయంగా మారాలి. దీనికి ప్రతీరోజూ 'శ్వాస'ను గమనిస్తూ వుంటే సుషుమ్నలో ఉంటారు. ఇలా శరీరంలో ఉండే ఐదు తత్వాలు తెలుసుకోవటమే తులసీయోగ సాధన. అప్పుడే ఐదు తత్వాలు సమత్వంలో ఉంటాయి.

శ్రీకృష్ణుడు నెమలి పింఛాన్ని ధరిస్తాడు కదా ! ఆ శ్రీకృష్ణుని యోగవిద్యాశక్తి అంతా ఆ నెమలి పింఛంలోనే వున్నది. అది కేవలం అందం కోసం ధరించలేదు. సాధనకోసం ధరించాడు. నెమలి పింఛం తర్వాత రుక్మిణి 'తులసి'ని ఉపయోగించుకొని యోగీశ్వరుని చేరింది. తులసి, జలంధరుని భార్య. విష్ణుమూర్తికి పరమ భక్తురాలు. మహాపతివ్రత. తులసి మూలాధారానికి సంకేతం. రుక్మిణి భక్తికి ప్రతీక – భక్తి అనేది ఆజ్ఞా చక్రానికి సంబంధించిన విశేషమైన గుణం. ఈ రెండింటి తరువాత ఇంక మూడవది ఏమిటీ అంటే యోగీశ్వరుడైన శ్రీకృష్ణుని నెమలిపింఛం. ఇది సహస్రారచక్రానికి సంబంధించిన సాధన.

అలా తులసీ యోగనిద్రను మాస్టరుగారు మూలాధారం (తులసి) – ఆజ్ఞ (రుక్మిణి) – సహస్రారం (నెమలి పింఛము) దగ్గర యోగీశ్వరుడైన శ్రీకృష్ణుణ్ణి (ఓం) ఎలా చేరుకోవాలీ అనేదానికి అంత అందమైన అర్థం అలా చెప్పారు. దీనికి సంకేతంగా సాధనాత్మకమైన 'కార్డ్స్' – వేయించి వాటిని అందరికీ ఇవ్వాలని చెప్పారు. వారు చెప్పటమే ఆలశ్యం, తులసీ యోగనిద్రకు సంబంధించిన ఈ 'కార్డ్స్' 30వేలు వేయించి పరివారానికి పంచిపెట్టటం జరిగింది. ఈ సాధన ఇంత వరకూ చెప్పి, పైన చెప్పిన సందేశాన్ని ఇంక మీరే అభివృద్ధి చేసుకోండి. నేను ఇంట్లోనే ఉంటాను. శిరిడీ సాయి తన గురువు దగ్గరే ఉన్నట్లుగా, నేను నా గురువుకు దగ్గరగా వుంటూ నా పనిని నేను చేసుకుంటాను. మీరు నన్ను ఏరకంగానూ ఆటంకపరచవద్దని (డిస్టర్బ్ చెయ్యవద్దని) ఆ రోజు సాధనలో చెప్పారు. దీంతోపాటుగా జన్మశతాబ్ది కార్యక్రమాల గురించి కొన్ని సాధనలు చెప్పారు.

42. బల – అతి బల

పూజ్య గురుదేవుల శతాబ్ది సమారోహానికి అనేక మంది మహాత్ములు వచ్చారు. ఆ పనులు చెయ్యటానికి కొంతమంది ఆంధ్రప్రదేశ్‌లో కూడా దిగారు. పృథ్వీగ్రహం మీద మొట్టమొదటిసారిగా జరుగుతున్న ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక ఉన్నతస్థాయి ఉత్సవం అనేకంటే ఆధ్యాత్మిక ప్రయోగంగా దీనిని అభివర్ణించాలి. దీనికి సాధారణ శక్తి, సామర్థ్యాలు చాలవు. అతి ఉచ్ఛస్థాయీ ఆధ్యాత్మిక

బలం ఎంతో అవసరం, దాని కోసమే మాస్టర్‌గారు అనేక రకాల సాధనలు మనిషి – దేవతగా, ఋషిగా మారే అనేక ప్రక్రియలను గత కొన్ని మాసాలుగా నేర్పిస్తున్నారు.

ఈసారి మరొక నూతన ఆధ్యాత్మిక ప్రయోగం. అదీ రామాయణకాలంలో శ్రీ విశ్వామిత్ర మహర్షి, శ్రీరామ – లక్ష్మణులకు నేర్పించిన బల, అతిబల విద్యలు గురించి చెప్పారు. మనం కూడా ఈనాడు వశిష్టుడి చేతిలో నుంచీ విశ్వామిత్రుడి చేతిలోకి వెళ్ళిపోతున్నాం. ఆనాడు రామ లక్ష్మణులు చేసిన పనులనే మనమీనాడు చెయ్యాలి.

యాగసంరక్షణార్థం రామలక్ష్మణులను తీసుకుని అయోధ్య నుంచీ విశ్వామిత్రుడు వెళ్తున్నాడు. ఆ రాత్రి వారు ఒక నది ఒడ్డున పడుకున్నారు. మరునాడు ఉదయాన్నే విశ్వామిత్రుడు వాళ్ళను లేపి బల, అతిబల అనే రెండు విద్యలను నేర్పించాడు. ఆ బలంతోనే వాళ్ళు తరువాత అనేకమంది రాక్షసులను చంపుకుంటూ పోయారు. ఇంతకు విశ్వామిత్రుడు వాళ్ళకు ఆ విద్యలు ఎలా నేర్పాడూ అంటే నది ఒడ్డున 'బల, అతిబల' అనే రెండు పదాలను పరావాణిలో అన్నాడు. అంతే వాళ్ళు నేర్చేసుకున్నారు. **ఆ బల, అతిబల అనే విద్యలనే గాయత్రి, సావిత్రీ మహావిద్యలంటారు. ఆ మాట అన్నవాడు విశ్వామిత్ర మహర్షి. అది గుర్తుంచుకోవాలి. గురువు దగ్గర వుండేవాళ్ళకు తెలుస్తుంది.** వాళ్ళు ఒక్కమాట అన్నారు అంటే అది ఎలా జరిగిపోతుందో! దణ్ణం ఎవరికైనా పెట్టండి కానీ, "గురువు" అని ఎవ్వరినీ అనవద్దు. శ్రీరామాయణ కాలంలో విశ్వామిత్ర మహర్షి సూర్యోదయ సమయంలో బల, అతిబల విద్యలు నేర్పించారు. అది ప్రతీరోజూ వస్తుంది. ఆ సైన్సును గురించే ఇక్కడ మాస్టరుగారు మనకు ఇప్పుడు చెప్తున్నారు.

కానీ, ఈనాడు ఆ సాధనలు లేవు. చెప్పేవాళ్ళు లేరు. ఇవి నేర్చుకోవాలంటే ముందు రామ, లక్షణ, భరత, శత్రుఘ్నులనబడే నాలుగు వర్చస్సులు, ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులసహదేవు లనబడే పంచశీలాలను సాధకుడు ఆచరించాలి. మాస్టర్‌గారు మనకా తొమ్మిది సాధనలను నేర్పించారు. (వీటిని గురించి మహాకాలశకం డైరీలో వివరించారు.)

ఇది అర్థంచేసుకొని ప్రతీరోజు ఉదయాన సూర్యఉపాసన చేస్తే ప్రతీఒక్కరికి ఆ రెండు బలాలు వస్తాయి. **ఈ క్లాసులు విన్న మీరందరూ ఈ ఋషి స్థాయికి వెళ్ళినవాళ్ళే. పరమపూజ్య గురుదేవులతో లింక్‌లో ఉన్న అందరూ ఆ స్థాయికి కచ్చితంగా వెళతారు. కానీ ప్రతీరోజూ సూర్య**

ఉపాసన చెయ్యాలి. ప్రతీరోజూ ఆ బంగారు రంగు సూర్యోదయాన్ని చూడాలి. ఆ సూర్యుణ్ణి ఎలా చూడాలీ! ఈ సాధనను క్రాంతిధర్మీ సాహిత్యం రెండవ పుస్తకంలో 42 పేజీలో ఈ సూర్యధ్యానాన్ని గురుదేవులు ఇచ్చారు. కళ్ళుమూసుకొని సూర్యబింబాన్ని దర్శించండి. అది మీలోను ఉన్నది కనుక చూడగలుగుతారు. బయటవున్న సూర్యుణ్ణి కాదు. మీలోపల వున్న సూర్యుణ్ణి చూడాలి "రాబోయే శతాబ్దికి అధిష్టాత – సూర్యుడు". కనుక ప్రతివారూ ఈ సవితా ధాన్యాన్ని చెయ్యాలి. శ్రీరామాయణంలో ఒక నది ఒడ్డున జరిగిన ఈ చిన్న బల–అతిబల సాధన వల్లనే రామ, లక్ష్మణులకు అంత అపారమైన శక్తి వచ్చింది.

మీరు బయట సూర్యుణ్ణి చూసినా – అంతరంగంలో సూర్యుణ్ణి చూడాలి.

పైన చెప్పిన **సవితా ధ్యానమే బల – అతిబల విద్యలు. ప్రతీరోజూ నిద్రలేస్తూనే 15 నిమిషముల పాటు ఈ సాధన చేస్తేచాలు. ఎవ్వరికైనా అనంతమైన శక్తి, సామర్థ్యాలు వస్తాయి. ఈ ధ్యానాన్ని మీరు చేస్తూ అద్భుతమైన ఈ విద్యను అందరికీ తెలియచెప్పాలి.** అప్పుడే ఈ సాధనకు ధన్యత చేకూరుతుంది. దీనినే మాస్టర్‌గారు "వైజ్ఞానిక సౌర శక్తి సాధన" అనే పేరుతో ప్రతీ పూర్ణిమకు పూర్ణిమా ధ్యానముగా (మెడిటేషన్) చేయించేవారు.

43. వసంత పంచమి-సందేశం

నారాకోడూరులో వసంత పంచమికి ఐదు రోజుల సాధనా క్యాంప్ ప్రారంభమయింది. జన్మశతాబ్ది సమారోహానికి ముందర వచ్చిన వసంత పంచమి కనుక దీనికి అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. మాస్టర్‌గారి పర్యవేక్షణలో వేలాదిమందికి ఏర్పాట్లు ఎంతో సాదాసీదాగా జరిగిపోతున్నాయి. ఈ శిబిరంలో దాదాపు అన్నీ వూళ్ళనుంచీ సాధకులు వచ్చి పాల్గొన్నారు. ఈ శిబిరంలో ముఖ్యంగా మనిషిని దేవతగా మార్చే ముద్రా విజ్ఞానం గురించిన తరగతులు నిర్వహించారు. దాని తరువాత మాండుక్యోపనిషత్తులో 12శ్లోకాలను వివరించారు. అది మొత్తం 'ఓం' కారమును గురించిన వివరణ. అసలు ఆ ఓం కారమే మన జీవిత లక్ష్యం. దానిని చేరుకోవటానికి అ – ఉ – మ సాధనలు చెయ్యాలి. దాని తరువాత సమాధి స్థితి అంటే ఏమిటి? మెల్లి, మెల్లిగా నేర్చుకుందాం.

శ్వాసను మార్చుకోగలిగితే మీలో ప్రజ్ఞ మేలుకుంటుంది. దానికి సంబంధించిన విలువైన సాధనలు అందులో ప్రధానంగా వాయువిద్యను అభివృద్ధి చేస్తే అది ప్రాణవిద్యగా ఎలా

రూపొందుతుంది, ఆ ప్రాణవిద్యను పట్టుకోవాలంటే ముందుగా మనం శరీరాన్ని పరిశుద్ధం చేసుకోవాలి. దానిని ఎలా చేసుకోవాలి?

'సోఽ_హం' సాధన యొక్క ప్రాముఖ్యత

ఈ రోజులలో పిల్లలకు దృష్టి దోషములు ఎందుకు వస్తున్నాయి, ఆ దృష్టి దోషాలను దూరం చేసుకోవాలంటే ఎలాంటి చిట్కాలు ఉన్నాయి అనే విషయముల మీద హిమాలయాల నుండీ గంగామాత పరవళ్ళు తొక్కుతూ భూమ్మీద అడుగుపెడితే ఎలా ఉంటుందో అలాంటి చల్లని, ప్రశాంతమైన ప్రవచనాలను ఆ సాధనా క్యాంపులో మాస్టారుగారు ఇచ్చారు.

ఈనాడు ప్రజలలో 80% మంది శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రతీవారికి శ్వాసకోస సమస్య. మందులతో అది కాస్త ఉపశమనాన్ని ఇస్తుందే గానీ, సంపూర్ణంగా సమస్యలను అది తొలగించలేదు. ఈ సమస్యకు నివారణ పరిశుద్ధమైన వాయువును మనం పీల్చాలి. అప్పుడే ఊపిరితత్తుల సమస్యలు తొలగిపోతాయి.

పరిశుద్ధమైన వాయువు ఎలా వస్తుందీ?

పరిశుద్ధమైన వాయువు కావాలంటే 33 వనమూలికలతో తయారుచేసిన హోమద్రవ్యంతో ఒక గంటసేపు హవనం చేస్తే వాతావరణం పరిశుద్ధమౌతుంది. అప్పుడు శ్వాస ద్వారా శుద్ధమైన వాయువు లోపలికి వెళ్తుంది. అప్పుడు మనిషిలో 'ప్రాణశక్తి' అభివృద్ధి చెందుతుంది. అందుకూ గురుదేవులు ప్రతీరోజూ యజ్ఞం చేయమని చెప్పారు. సామూహిక యజ్ఞం చేసుకోవటం వలన అనేక లాభాలు అటు వ్యక్తికీ, ఇటు ప్రకృతికీ కూడా చేకూరుతాయి. ఆశ్రమాలున్న చోట తప్పని సరిగా ప్రతీరోజూ యజ్ఞాలను 2 గంటల పాటు చెయ్యాలి. శాస్త్రీయపరంగా **"ప్రాణం అంటే యజ్ఞము"** అనే చెప్పాలి. దీని వలననే మనిషి ఆయుర్దాయం పెరిగిందీనాడు. దానితోపాటు ప్రపంచశాంతి వస్తుంది. కనీసం పది ఇళ్ళవాళ్ళు కలిసి యజ్ఞం చేసుకోండి. అందరికీ సమానంగా ఫలితాలు వస్తాయి. మనం గాయత్రీ యజ్ఞాలను చేస్తే అవి మనుష్యులను బ్రతికిస్తాయి.

అధ్యాయం-4

అంతా గాయత్రీమయం (2011)

2011 జనవరి 8వ తేదీ చెప్పిన ముఖ్యమైన సంగతులు

2011 వ సంవత్సరంలో ప్రవేశించాము. గురుదేవుల జన్మశతాబ్ది ఇంక పదినెలల్లోకి వచ్చింది. జనవరి ఒకటవ తేదీన శ్వేతద్వీపంలో నూతన సంవత్సర శుభారంభంగా ఒక చక్కటి సమావేశం ఏర్పాటు చేయబడింది. చుట్టుప్రక్కల గ్రామాల నుంచీ పూజ్యశ్రీమాస్టర్‌గారిని దర్శించుకోవాలనీ, వారిచ్చిన అమూల్యమైన జన్మశతాబ్ది సందేశాలను విని భవిష్యత్ కార్యక్రమాలకు తగిన ప్రణాళికలను తయారుచేసుకుందామని అనేకమంది పరివార్ సభ్యులు వచ్చారు. ఆనాటి ప్రవచనంలో జన్మశతాబ్ది కొరకు అనేక నూతన ప్రణాళికలనివ్వటంతోపాటు అందరి గుండెల నిండా నూతన ఉత్తేజాన్ని నింపి పంపారు.

ఎక్కడున్నా మాస్టర్‌గారి సాధన, స్వాధ్యాయం నిరంతరం కొనసాగుతూనే ఉండేది. 8వ తేదీ ఉదయం మాస్టర్‌గారు నిద్రలేచి క్రిందకి వచ్చారు. కాఫీ త్రాగుతూ ఇవాళ రాత్రి గురుదేవుల దగ్గర నుంచి కొన్ని సందేశాలు వచ్చాయి. మూడవ ప్రపంచయుద్ధం రాబోతుంది. దీనిపై నియంత్రణ తీసుకురావాలనేది గురుదేవుల ఆదేశం. దానికి నేను చేయవలసిన సాధన గురుదేవుల ద్వారా అందింది. శ్వేతద్వీపం మేడ మీదనే 30 రోజుల పాటు సాధన చేసుకుంటాను. ఒకరకంగా ఇది సూక్ష్మీకరణ సాధన అనే చెప్పాలి. నేను ఒంటరిగానే యుద్ధం ప్రారంభించాలి. 'ఏక్ లా చలోరే' దానికి ఎవరి నిర్ణయం లేదు. పరమపూజ్య గురుదేవులు ఏం చెప్తే అదే నేను చేస్తాను. అదే మీకూ చెప్తాను. దానిని తు.చ. తప్పకుండా చెప్పింది చెప్పినట్లుగా చేయండి. (చాలా కోపంగా ఉన్నారు) ఈ శ్వేతద్వీపంలోనే మొట్టమొదటి ఆవృత్తాన్ని తులసిమంత్ర జపంతోనే ఆరంభిస్తాను. మహాభారత యుద్ధంలో ఎలాగైతే పగలంతా యుద్ధం చేసి సాయంత్రానికి యుద్ధం ఆపేసి ఎవరి శిబిరాలకు

వాళ్ళు వెళ్ళినట్లే నేను కూడా పగలంతా శ్వేతద్వీపంలో తలుపులు తీసేవుంచుతాను. చేసేదేదో వాతావరణం అదే చేస్తుంది. మాస్టర్‌గారి ఆదేశం ప్రకారం అందంగా అలంకరించిన ఒక చక్కటి తులసికోటను శ్వేతద్వీపంలో ఉంచమన్నారు. ప్రతీరోజూ ఉదయం-సాయంత్రం అక్కడ దీపం పెట్టి అగరుబత్తీలు వెల్గించి - ఆరతి నిమ్మన్నారు. ఆ తర్వాత వారు అక్కడే కూర్చుని తులసీ గాయత్రీ సాధన చేసేవారు.

దాంతోపాటుగా శబ్దతరంగాల కొరకు సి.డి.లు పెట్టి నిరంతరం 'క్యాసెట్లు ప్లే' చేయమన్నారు. ఆపకుండా ఆ ధ్వని తరంగాలు అలా రాత్రీ, పగలు పెట్టి ఉంచమన్నారు. దానికి కారణం యుద్ధంలో ఆపకుండా భేరీ, పటాహ, కాహళ నినాదాలు మ్రోగూతూనే వుంటాయి కదా! అలాగే ఇదీను. పరమపూజ్య గురుదేవులు చెప్పిన సాధనను శబ్దతరంగాల మాధ్యమంతో యుద్ధం చేస్తున్నాను. నా సాధన అంతా "ఏక్ లా చలోరే" అంటే నేను ఒంటరిగానే ప్రయాణిస్తాను. కానీ నాతో ఉన్న వాళ్ళు నాతో కల్సి సాధన చేస్తారు. దానికి నాకు యోగమాయ కావాలి. ఈ సాధనా కాలంలో నా ఆహారం - దాని క్వాలిటీ అంతా మార్చేసుకుంటాను. ఉదయం 9.00 గంటలకు ఫలహారం, మధ్యాహ్నం 2.30కు నేను చెప్పినట్లు తయారుచేసిన భోజనం, మళ్ళీ రాత్రి 8-00 కి నా ఆహార సమయాలుంటాయి. ఈ ప్రకారంగా నేను ఎంత చెప్తే అంతే చెయ్యండి. ఇక్కడ మీరూ సాధన చేయాల్సి వుంటుంది. మీరు దేవతలుగా మారాలంటే ప్రాణాగ్నిహోత్రవిద్యను అందరూ ఆచరించాలి.

ఇంక ఆ రోజు నుంచి ఉదయం పూట - 3 గంటల పాటు తులసీ యోగసాధన చేసేవారు. తులసి అనేది స్థూల, సూక్ష్మ, కారణ జగత్తులలోనే కాకుండా, ఆ సాధన మానవశరీరాలలో కూడా అద్భుతమైన చైతన్యం తీసుకువస్తుంది. ఈ సాధన ద్వారా మాస్టర్‌గారు సూక్ష్మలోకాలలో తీసుకువచ్చిన మార్పుల వలన భౌతికజగత్తులో రాబోయే కొన్ని ప్రమాదాలను నివారించానని చెప్పటం జరిగింది.

44. గాయత్రీశక్తిపీఠం...నారాకోడూరు

హఠాత్తుగా ఒకరోజు నారాకోడూరు "గాయత్రీశక్తి పీఠానికి" వెళ్ళాలన్నారు. మాస్టర్‌గారు అన్నారూ అంటే అది "కారును" సిద్ధపరిచేటంత వ్యవధి మాత్రమే వుంటుంది. జనవరి 17వ తేది నుంచీ నారాకోడూరు శక్తిపీఠంలో యుద్ధప్రాతిపదిక మీద పనులు ప్రారంభించారు. శ్రీమాస్టరుగారు ఈ పీఠాన్ని 'అత్యంతశక్తివంతమైన' ఆధ్యాత్మిక కేంద్రంగా రూపొందించటానికి విశేషమైన కృషిని చేశారు.

ఒకనాటి ప్రవచనంలో మాస్టరుగారు చెప్పారు, "గురుదేవులు నాకు ఆశ్రమం కావాలని అడిగారు". అందుచేత నేను "శాంతికుంజ్"ని ఇక్కడ పెట్టేశాను. నా మీద ప్రేమతో మీరు ఇదంతా చేస్తున్నారు. మీరిప్పుడు చేస్తున్నది చాలదు. ఈ సంవత్సరమంతా మీరు నాతో పాటు వుంటూ గురుదేవుల పనులు చేయటానికి సహకరించండి. మీరందరూ గురుదేవులను పట్టుకోండి. మొదట నేనడిగేది, "శాంతికుంజ్" గురించి. ఇది ఇక్కడి శాంతికుంజ్, గురుదేవుల శాంతికుంజ్‌లాగా ఇక్కడ అన్నీ రావాలి. అక్కడ జరుగుతున్న కార్యక్రమాలన్నీ ఇక్కడ జరిగేలాగా ఒక వ్యవస్థను ఏర్పాటు చెయ్యాలి. గురుదేవులు హిందిలో చెప్పిందానినే నేను ఇక్కడ తెలుగులో చెప్తాను. మీరు ఇంకా చురుగ్గా పనిచేసేలా తయారు కావాలి. వ్యవస్థను ఇంకా బాగా తీర్చిదిద్దాలి. మీ క్యారెక్టర్‌కి ఆధారం 'ప్రాణాగ్నిహోత్ర విద్య'.

శాంతికుంజ్‌లో మాస్టరుగారు ప్రాణప్రత్యావర్తన శిబిరంలో ఉన్నప్పుడు మాస్టర్‌గారికి ఒకానొక సందర్భంలో గురుదేవులు, తాము సంతకం చేసి "దాదా గురుదేవుల ఫోటోను" బహుకరించారు. అప్పటికి మాస్టరుగారు ఇంకా ఎక్కడా స్థిరపడనందున ఆ ఫోటోను అమలాపురంలో శ్రీ శ్యామలరావు గారి దేవతామందిరంలో ప్రతిష్టించారు. శ్రీమతి సూర్యంగారు చాలా భక్తిశ్రద్ధలతో "దాదా గురుదేవుల" ఫోటోను ఉపాసన చేసేది. దాదాపు 30 సంవత్సరాల తరువాత ఆ ఫోటోను ఫిబ్రవరి 12వ తేదీన ఒంగోలుకు తెప్పించుకున్నారు. శ్వేతద్వీపంలో తన గదిలో పెట్టుకుని సాధన చేయటం ప్రారంభించారు. ఆ ఫోటో వచ్చినప్పటి నుంచీ "మాస్టరుగారి మొత్తం పని దాదా గురుదేవులవారి మార్గదర్శనంలోనే ముందుకు సాగింది. అనంతమైన శక్తి వారికి అండగా నిలిచింది. పని వేగం పెరిగింది. చెప్పలేనంత ఉత్సాహంతో పని చేయటం మొదలెట్టారు.

(1) జనవరి 28, 29, 30 తేదీలలో కొలకలూరులో శ్రీరాంగారి ఆధ్వర్యంలో జరిగిన 108 కుండీల యజ్ఞముల పూర్తి నిర్వహణ మాస్టర్‌గారి మార్గదర్శనంలో జరిగిపోయింది. ఇంక అలా, అలా మాస్టర్‌గారు గ్రామగామాలలో పర్యటిస్తూ జన్మ శతాబ్ది ప్రాచుర్యాన్ని వివరిస్తూ లక్షమంది పరిజనులను గురుదేవుల జన్మశతాబ్దికి తయారుకావాలని చెప్పటం జరిగింది.

(2) అలాగే ఫిబ్రవరి 17, 18 తేదీలలో "లలితాశ్రమం"లో జరిగిన 108 కుండీల యజ్ఞానికి వెళ్ళారు. ఆ సందర్భంలో చెప్పిన ప్రవచనంలో "**నేను మీకు కొన్ని రహస్యాలను చెప్పబోతున్నాను.**

వాటి గురించి పృథ్వీ మీద ఇంత పబ్లిగ్గా ఎవ్వరూ చెప్పలేదు. మీరు చేసిన సాధనా ఫలితం నన్ను ఇక్కడికి తీసుకువచ్చి ఆ రహస్యాలను చెప్పేలా చేశాయంటూ" అందులో-

మొదటి రహస్యం:

2012 నాటికి పృథ్వి మీద ఉన్న మానవజాతిలో 100 మందికి 90 మంది పోతారని సైంటిస్టులు చెప్తున్నారు. ఎందుకంటే సూర్యుని నుంచీ ఒక చిన్న ఉల్క (శకలం) భూమ్మీదకు దూసుకు వస్తున్నది. దానికి దూరంగా ఉన్నాం కాబట్టి దాని తీవ్రత మీకర్థం కావటం లేదు. అందుచేతనే ఇంత వేడి. ఈ ఎండ వేడి, సెగలు ఇదంతా దాని ప్రభావమే. ఆ ఉల్క వలన మనకు ప్రళయం తప్పదని, ఈ పృథ్వీగ్రహం 2012 డిసెంబరు నాటికి ఉండదనీ చాలామంది సైంటిస్టులు చెప్తున్నారు. కొందమంది మాత్రం మీరేం కంగారు పడవద్దని చెప్తున్నారు. ఎవరేం చెప్పినా జరిగేదేదో జరిగి తీరుతుంది.

రెండవ రహస్యం:

ఆధ్యాత్మిక జగత్తుకు సంబంధించిన అనేక మంది మహనీయులు హిమాలయాలలో చేసిన అఖండ సాధనలతో ఆ ఉల్క యొక్క దారిని మళ్ళించటంలో కృతకృత్యులయ్యారు. వారిని నేను ప్రత్యక్షంగా చూడటమే కాదు. కలిశానుకూడా! వారు చెప్పిన దాన్ని బట్టి మనకాముప్పు తప్పిపోయిందని అర్థమైంది. వాస్తవానికి ప్రమాదం ఉన్నది. కానీ దానిని దాటించేశారు. ఇంత వరకు మీరు చేసిన లలితాసహస్రనామాల ఫలితంగా మీరు ఈ రహస్యాలను వినగల్గుతున్నారని సభాముఖంగా చెప్పారు. ఆ తర్వాత జన్మశతాబ్ది ప్రాచుర్యాన్ని వివరించి అందరినీ శాంతికుంజ్‌కు వచ్చేవిధంగా ప్రేరణనిచ్చి వచ్చారు.

(3) పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మశతాబ్ది మహోత్సవాలలో భాగంగా 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞము మరియు సంస్కార మహోత్సవములు 2011 ఏప్రియల్ 29 నుంచీ మే 1 వరకు పి.యన్.యం.హైస్కూల్, హైదరాబాద్‌లో శ్రీ అశ్విని సుబ్బారావు గారి ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. ఆ మహాయజ్ఞానికి శ్రీ ప్రణవ పండ్యాగారు కూడా విచ్చేసి తమ అమూల్యమైన సందేశాన్నివ్వటం జరిగింది. ఈ మూడు రోజుల కార్యక్రమాలలో కూడా మాస్టర్‌గారు గురుదేవుల

జీవిత లక్ష్యాలను గురించి ప్రవచనాలనివ్వటమే కాకుండా "జన్మశతాబ్దిసమారోహానికి" అందరూ సమాయత్తం కావాలనే ప్రేరణనిచ్చారు.

45. లక్ష్మీపురంలో శ్రీవేదమాతగాయత్రీ

"అష్టసిద్ధి నవనిధికే దాతా సబ్ సమర్థగాయత్రీమాత" విగ్రహ ప్రతిష్ట మహోత్సవము

గుంటూరు జిల్లా, నర్సరావుపేట మండలంలో గల లక్ష్మీపురంలో "శ్రీవేదమాతగాయత్రీ" దేవాలయాన్ని నిర్మించాలని శ్రీమతి అనితా వాళ్ళకుటుంబం మాస్టరుగారి దగ్గరికి వచ్చినప్పుడు అడిగారు. గోళ్ళపాడులో "గాయత్రీ జయంతి" కార్యక్రమానికి వెళ్ళి వస్తున్న మాస్టరుగారు మార్గ మధ్యంలోనే వున్న లక్ష్మీపురానికి వెళ్ళారు. వారాస్థల వైభవాన్ని చూచి వెంటనే 'దేవాలయం' కట్టుకోమనీ, అక్కడ ప్రతిష్టించబోయే విగ్రహం "శ్రీవేదమాతగాయత్రీ" అనీ, ఆ దేవాలయం పేరు "అష్టసిద్ధి నవనిధికే దాతా సబ్ సమర్థగాయత్రీ మాతా" మందిరంగా విలసిల్లుతుందనీ చెప్పారు. **ఋషి వాక్యంతు కర్తవ్యం** అన్న విధంగా పూజ్యులు మాస్టరుగారు ఈ మాట చెప్పిన సంవత్సరానికల్లా లక్ష్మీపురంలో శ్రీ వేదమాత గాయత్రీ దేవాలయాన్ని శ్రీమతి అనితా వాళ్ళు, గ్రామస్తుల సహకారంతో నిర్మించారు.

2011 మార్చి 19వ తేది ఉదయం 7:48 ని॥ లక్ష్మీపురములో "అష్టసిద్ధి నవనిధి కే దాత సబ్‌సమర్థ గాయత్రీ మాతా" విగ్రహప్రతిష్ట మహోత్సవాన్ని, వినాయకుడి విగ్రహప్రతిష్టను మాస్టరు గారు మరియు శాంతికుంజ్ ప్రముఖ కార్యకర్తలు శ్రీపరమానంద ద్వివేదీగార్లు ఎంతో వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ అశ్వినీ సుబ్బారావుగారు ఇంకా అనేకమంది పెద్దలు ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆనాటి ప్రవచనంలో మాస్టారు ఆ మందిరాన్ని గురించి "రాబోయే రోజులలో ఒక తీర్థరాజంగా విరాజిల్లుతూ అందరి కోరికలు తీర్చే దేవమాతగా ప్రసిద్ధి చెందుతుందని" చెప్పారు.

తరువాత కాలంలో ఒకసారి లక్ష్మీపురం గాయత్రీ మందిరానికి వెళ్ళి 2011 డిసెంబరు 8వ తేదీన "శ్రీచక్రాన్ని" మాస్టరుగారే స్వహస్తాలతో స్థాపన చేసి శ్రద్ధగా ఉపాసన చేసుకోమని చెప్పారు. అలనాడు శ్రీశైలంలో భ్రమరాంబ ఆలయంలో ఆదిశంకరులు శ్రీ చక్రాన్ని స్థాపించి ఆ ఆలయవైభవాన్ని ఎలా పెంచారో అలానే పూజ్యశ్రీ మాస్టారు కూడా శ్రీ చక్రాన్ని స్థాపించి ఇది రాబోయే రోజులలో "దక్షిణ శాంతికుంజ్"గా విలసిల్లుతుందని ఆశీస్సులు ఇచ్చారు.

46. కోటిలింగేశ్వర క్షేత్రము

2011 ఏప్రిల్‌లో మాస్టారుగారు వేసవిలో బెంగళూరులో ఉన్నారు. ఒకనాడు శ్రీవెంకటేశులు వారి కుటుంబ సభ్యులు, మరికొందరు పరివార్ సభ్యులతో కలిసి కోలార్ దగ్గర ఉన్న కోటి లింగేశ్వర క్షేత్రానికి వెళ్ళడము జరిగింది. ఈ క్షేత్రము మనకు 'శ్రీ మంజునాథ' సినిమాలో చూపించబడినది. కనుచూపు మేర, ఎటు చూసినా అంతా శివమయం. కోటి లింగముల దర్శన భాగ్యము అంటే మాటలలో చెప్పనలవికాని దృశ్యము. అటువంటి పుణ్యక్షేత్ర దర్శనం మాస్టారు గారితో పాటూ అంటే ఇక ఆనందానికి అంతు ఏముంది. శివలింగం అన్నా శివాలయం అన్నా మన శరీరమే అని కోటిలింగేశ్వర క్షేత్రాన్ని నిర్మింప సంకల్పించిన శ్రీ సాంబశివమూర్తి స్వామి 1980లో ఈ క్షేత్ర నిర్మాణం మొదలు పెట్టినారు. ఇప్పటికి 90 లక్షలకు పైగా లింగాల ప్రతిష్ఠ జరిగినది. శ్రీ రామకృష్ణ పరమహంస చేతనత్వానికి సంబంధించినవారు అయి ఉంటారని మాస్టారు అక్కడ అడుగిడగానే చెప్పారు. Idea - Ideal - Idol అంటే ఒక ఆలోచనతో మనము ఒక ఆదర్శం వైపు నిరంతరం పనిచెయ్యగలిగితే దాని బాహ్యప్రకటీకరణ ఐడల్ అవుతుంది. అలాంటిది ఇక్కడ ఒకే సారి కోటి లింగాలు ఆలోచన, ఆదర్శం తలాలు దాటి మూర్తి రూపములో ఉన్నాయని మాస్టారుగారు మహదానందం చెంది, 'నాకు కోటి మందిని వెదికే పని లేకుండా ఈ క్షేత్రము ద్వారా నేను కోటి మందిని పండిత శ్రీరామశర్మ ఆచార్య గురువుగారితో లింకప్ చేయడానికి వీలుకలిగింది' అని ఆనందించారు.

ఆ క్షేత్రములోని ఇంకొక అరుదైన విషయమేమిటంటే అక్కడ ఒకేచోట బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఆలయాలు ఉన్నవి. మాస్టారుగారు త్రిమూర్తులను దర్శించి ఆలయ ప్రాంగణములోనే చాలాసేపు ధ్యానములో లీనమయ్యారు.

మహాత్ముల సాన్నిధ్యం వలన ఎంతటి లాభం ఉంటుందో తెలియటానికి మనము అక్కడ జరిగిన ఒక విచిత్ర సంఘటనను తప్పక స్మరించాలి. మాస్టారుగారు ధ్యానములో కూర్చోగానే ఆయనతో పాటు వచ్చిన వారు కూడా ఆలయ ప్రాంగణములో కూర్చుండిపోయారు. మాస్టారుగారికి అతి దగ్గరగా కూర్చున్న కుమారి శివచందనకు ఒక విచిత్ర అనుభూతి కలిగినది. కళ్ళుమూసుకుని ఉన్న తనకు ఎడమ చెవిలో ఎంతో గట్టిగా తేనటీగల భ్రమరనాదము వినపడ సాగింది. వెంటనే తన మనస్సులో అయ్యో మాస్టారుగారు ధ్యానములో ఉన్నారే, తేనటీగలు వచ్చాయని ఆందోళన

చెంది కళ్ళుతెరిచి చూడగా, అక్కడ ఒక్క తేనటీగ కూడా లేదు కదా, మాస్టారుగారు ప్రశాంతవదనులై దివ్యకాంతితో ప్రకాశిస్తూ ధ్యానమగ్నులై ఉన్నారు. అప్పుడు తనకి మాస్టారుగారు వివరించిన ధ్యానస్థితిలోని వివిధ స్థాయిలు, వాటిలో సాధకునికి వినిపించే అనాహత నాదము లేక సూక్ష్మ దశనాదాల వివరణ (గంటల శబ్దము, చిని శబ్దము, శంఖనాదము, వేణుగానము, భేరి మరియు మృదంగ నాదము, సముద్రపు హోరు, భ్రమర నాదము, వీణా నాదము, మేఘధ్వని) జ్ఞాపకము వచ్చి తను విన్నది స్థూల జగత్తులోని శబ్దము కాదని అర్థమైనది. సద్గురువుల సాన్నిధ్యము వలన, వారి ప్రక్కన ఉన్నా చాలు, మనలను సాధనలో ఎంతటి ఎత్తులకైనా తీసుకెళ్ళగలరన్నదానికి ఈ సంఘటనే నిదర్శనము కదా!

సర్వం శివమయమైన ఆ క్షేత్రములోనే మాస్టారుగారు శ్రీ శిరిడీ సాయిబాబా వారిని సశరీరముగా దర్శించారు. ఒక బిచ్చగాడి రూపములో ఉన్న బాబాని మాస్టారుగారు గుర్తించి వారిరువురూ సూక్ష్మలోకాలలో ఏమి సంభాషించుకున్నారో మనకు తెలియదు కానీ, 'శిరిడీ సాయికి ఇక్కడ పని ఉంది, అందుకే స్థూల శరీరంతో ఇక్కడే ఉన్నాడు' అని చెప్పారు. కొందరికి ఆయన స్వరూపాన్ని చూపించారు కూడా. కానీ మాస్టారుతో వచ్చిన మరికొంతమందికి ఈ విషయము తెలిసి ఆయన్ని వెదుకగా, కొన్ని క్షణాల క్రితం ఉన్న ఆ బిచ్చగాడి వేషధారి అయిన ఆ సచ్చిదానంద సద్గురు సాయినాథుని జాడ కూడా లేదు. ఆ రోజు ఆ దివ్యమంగళ ప్రేమ స్వరూపుడిని దర్శించిన వారు ఎంత భాగ్యవంతులో కదా!

మరుసటి సంవత్సరం, 2012 జూన్ 3వ తారీఖున మాస్టారుగారు బెంగుళూరులో ఉన్నప్పుడు మళ్ళీ ఈ దివ్య క్షేత్ర దర్శనార్థం వెళ్ళారు. ఈసారి మాస్టారుగారు అక్కడ సహస్ర లింగములను కూడా ప్రతిష్ఠించారు. మాస్టారు కోరుకున్నట్టుగానే ఈశాన్య దిశలో 'మహా దుర్గ' అన్ననామంతో 'గాయత్రీ పరివార్' పేరుమీద ప్రత్యేకంగా 501వ లింగమును ప్రతిష్ఠ చేయించినారు. దీనిని మాస్టారుగారు తమ సూక్ష్మ జగత్తులోని పనులకు గాను ప్రతిష్ఠించానని, రెండవదానిని పరివారముకోసమని చెప్పినారు. అంతే కాక మన పరివార్ వారినందరినీ ఇక్కడ లింగములను ప్రతిష్ఠించి ఈ కోటిలింగాలలో భాగస్వాములు అవ్వాలని చెప్పారు. ఆ క్షేత్రము నుండి తిరిగి వస్తున్నప్పుడు మాస్టారుగారు, ముందుసారి శిరిడీ సాయిని దర్శించిన విధంగానే ఈ సారి కూడా చూసానని చెప్పారు. అయితే ఏ రూపంలో అన్నది చెప్పలేదు కానీ, ఆయన ఈ క్షేత్రంలోనే

ఉంటున్నారు అని చెప్పారు. ఆ రోజులలో మాస్టారు గారు 'దేవోంకే దేవ్ మహాదేవ్' అనే శివుని చరిత్ర మీద తీసిన హిందీ సీరియల్‌ను క్రమము తప్పకుండా చూసేవారు. అందులో చూపించిన సతీ దేవి యొక్క 51 శక్తిపీఠాలలో, 5 బంగ్లాదేశ్‌లో ఉన్నాయనీ, వాటికీ గురువుగారి పంచవీరభద్రుల పనికి, మాస్టారుగారు ఆ రోజు స్థాపించిన 'మహా దుర్గ' లింగమునకూ సంబంధమున్నదని చెప్పారు.

47. ప్రకృతి నుంచే సమాధానం

జన్మశతాబ్ది దగ్గర పడుతున్నది, మాస్టరుగారిలో చెప్పలేనంత ఆదుర్దా – పని విపరీతంగా వున్నది. సాధనా క్యాంపులు పెడుతున్నారు. పెద్ద పెద్ద యజ్ఞకార్యక్రమాలకు వెళ్ళి చెప్తున్నారు. వెబ్‌లో క్లాసులు చెప్తున్నారు. క్షణం తీరిక లేకుండా పనిచేయటంతో ఆరోగ్యంలో మళ్ళీ కాస్త తేడా వస్తున్నది. అందులోనూ బయట కార్యక్రమాలకు వెళ్ళినప్పుడు ఎక్కడ ఏ కొంచెం తిన్నా షుగరు పెరిగిపోయేది. కాళ్ళు మంటలు, నిద్రపట్టకపోవటం, చిరాకుతో చాలా విసుగ్గా వుండేవారు. అయినా పని విషయంలో ఏమాత్రం అలసత్వాన్ని చూపేవారు కాదు. **నా లైఫ్ షిఫ్ట్ అయిపోతోంది. ఏం జరుగుతుందో నాకూ తెలియదు. ప్రయోగశాలలో ఒక క్రొత్త ప్రయోగాన్ని చేయబోతున్నాను. రిజల్ట్ ఏమి వస్తుందో తెలియదు. సాక్షిగా వుంటాను. ప్రకృతి నుంచే నాకు సమాధానం రావాలి. ఎటు పోతానో, ఏం చేస్తానో తెలీదు. గురుదేవులు ఎటు నడిపిస్తే అటు వెళ్ళాల్సిందే కదా! అంటూ కొన్ని సత్యాలను అంటీ అంటనట్లు చెప్పీ చెప్పనట్లు చెప్పారు.**

48. జన్మ శతాబ్ది మహోత్సవములు

మానవ జీవితంలో సమయం చాలా విలువైనదనే విషయం అందరికీ తెలిసినదే! ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోగలగితే ప్రపంచంలో అన్ని రకాల సాఫల్యాలను పొందవచ్చును. పగలు, రాత్రీ, నెలలు, సంవత్సరాలు గడిచిపోతున్నాయి. అశ్వగతితో సమయం పరుగెత్తుతోంది. ప్రపంచం లోని అన్ని కార్యక్రమములు కాలము యొక్క పరిధిలోనే బంధించబడి వున్నాయి. చూస్తూ, చూస్తూ వుండగానే శతాబ్దీ సమారోహం మహోత్సవాలు రోజులలోకి వచ్చేశాయి. జన్మశతాబ్దికి ముందర వచ్చిన ఈ నవరాత్రులు అత్యంత శ్రేష్ఠతను సంతరించుకొని వుంటాయి. ఈ సమయంలో చేసే నవరాత్రి సాధన వలన సాధకునిలో వివేకం జాగృతమౌతుంది. ఆధ్యాత్మిక సాధనలో అఖండ ఆత్మదర్శన ప్రాప్తి – కలుగుతుంది.

2011 సెప్టెంబరు 27వ తేదీ నుంచీ దేవీనవరాత్రులు ప్రారంభమైనాయి. అత్యంత దీక్షతో నవరాత్రి సాధనను శ్రీమాస్టర్‌గారు ప్రారంభించారు. ఎంతో దీక్షగా చేస్తున్న సాధన, ఉపాసనలశక్తి వలన మాస్టర్‌గారిలో తేజస్సు రోజు, రోజుకూ ద్విగుణీకృతమవుతున్నది. ప్రతీ రోజు సాయంత్రపు వేళల్లో గాయత్రీ అనుగ్రహ పీఠంలో సామూహిక అనుష్ఠానము చేస్తున్నారు.

30వ తేదీ ఉదయం సాధన అయిపోయి భోజనం చేస్తుండగానే "నేను తక్షణమే హైద్రాబాద్ వెళ్ళాలి 'శంబళ'లో కొన్ని మార్పులు చెయ్యాలని" చెప్పారు. వెంటనే కారు సిద్ధం చేశాము. సరే, మాస్టర్‌గారు మొదలు పెట్టిన సాధనా పూర్ణాహుతిని మిగిలిన వాళ్ళందరమూ కల్సి గాయత్రీ పీఠంలో మాస్టరుగారు చెప్పినట్లుగా పూర్తిచేశాము. తరువాత ఒక రోజున మాస్టరుగారు శంబళ నుంచీ ఫోనుచేసి "అవల్ ఖేడాలో సూర్యదేవాలయాన్ని నిర్మిస్తున్నారు. శాంతికుంజ్‌కు వెళ్ళివచ్చాక 60 చోట్ల మనమూ సూర్యదేవాలయాలను స్థాపించాలి. అందరికీ విషయాన్ని చెప్పమని" చెప్పారు. శ్రీమాస్టర్‌గారు ఎక్కడవున్నా వారి మనస్సు అన్నీ కోణాలను దర్శిస్తూ గురువుగారి పనితో ఓతప్రోతమై వుంటుందనటానికి ఇది మరొక నిదర్శనం.

జన్మశతాబ్ది మహోత్సవాల ఏర్పాట్లు

శాంతికుంజ్‌కు వెళ్ళటానికి అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. అనుకున్న సమయానికి పూజ్యశ్రీ మాస్టరుగారు, చందనా హరిద్వార్‌కు బయల్దేరారు. యుగఋషి, వేదమూర్తి, పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మశతాబ్ది మహోత్సవములకు అన్ని రకాల వ్యవస్థలను అన్ని సదుపాయాలతో పూర్తి చేసారు. జన్మశతాబ్ది వేడుకలకై విచ్చేయుచున్న లక్షలాది జనవాహిని ప్రశాంతంగా కదిలిపోవటానికి వీలుగా గంగానదిలోని ద్వీపాలను, ప్రధానరహదారులను కలుపుతూ నాలుగు తాత్కాలిక సేతువులను నిర్మించారు. వీనిలో యజ్ఞశాలను చేరుకొనుటకు ఏర్పాటుచేసిన వంతెనకు "రామసేతువు" అని నామకరణం చేశారు.

ఆసేతుహిమాచలం నుండి, కన్యాకుమారి వరకు గల, అలానే విదేశాలనుండి వచ్చిన గురుదేవుల శిష్యులు, అభిమానులు, ఆరాధకులు నివాసం ఉండటానికి దాదాపు 5 వేల గుడారాలు నిర్మించారు. చలికి తట్టుకొని వుండటానికి, విశ్రమించటానికి అనువుగా గుడారాల లోపల తివాచీలు పరిచి, చుట్టూ గుడ్డలతో డేరాలను మూసివేశారు. వేలసంఖ్యలో జనం వచ్చినా స్నాన, పానాదులకు,

కాలకృత్యము తీర్చుకొనటానికి కావలసిన అన్ని ఏర్పాట్లను చక్కగా అమర్చిపెట్టారు శాంతికుంజ్ నిర్వాహకులు.

"మేరా భారత్ మహాన్" అని ఒకనాడు దూరదర్శన్‌లో చూపించిన విశిష్ట ప్రదర్శన యొక్క వాస్తవిక రూపం ఈనాడు 'శాంతికుంజ్'కి వచ్చిన వారందరికీ అనుభవంలోకి వచ్చి "ఇంత గొప్పది గదా, మన మహోన్నత భారతదేశం" అని అనిపించింది. భారతదేశంలోని విభిన్న సంస్కృతులు, జాతులు, వేషభాషలు కలగలసి గురుదేవులు చెప్పిన ఒకే భాష (గాయత్రీ భాష), ఒకే మతం (సూర్యుడు), ఒకే కరెన్సీ (వినిమయం) ఈ జన్మశతాబ్ది వేడుకలలో కన్నుల పండువగా దర్శనమిచ్చింది.

49. ఐతిహాసిక కలశయాత్ర - 06-11-2011

భగీరథుడు, విశ్వామిత్రుడు, యాజ్ఞవల్క్యుని స్థాయి గల ఈ యుగఋషి పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య జన్మశతాబ్ది మహోత్సవం ఐతిహాసిక కలశయాత్రతో శుభారంభం జరిగింది. యజ్ఞశాలలో వైదిక విధి విధానంలో దివ్యకలశములలో దైవీ శక్తుల ఆహ్వానాన్ని 24 మంది కన్యలతో జరుపబడింది. తరువాత 24 వేల కలశములతో ఐతిహాసిక కలశయాత్ర హరిద్వార్ ప్రధాన వీధుల్లో, ఎంతో శోభాయమానంగా జరిగింది. ఈ అద్భుత కలశ యాత్రలో ఫ్రాన్సు, టాంజేనియా, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, రష్యా మొదలైన దేశాల ప్రజలు తమ, తమ దేశ పతాకాలతో, బ్యానర్లతో అత్యంత ఉత్సాహంతో కదిలివచ్చారు.

యుగఋషి, యాజ్ఞవల్క్యుడు, అయిన పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది మహోత్సవంలో 1551 కుండముల గాయత్రీ మహాయజ్ఞము యొక్క శుభారంభము **07-11-2011**న దేవ పూజనముతో ప్రారంభించబడినది. సుమారు 5 వేల మంది దంపతులీ దేవపూజనంలో పాల్గొన్నారు. తరువాత పూజ్యగురుదేవుల, పరమవందనీయ మాతాజీల పాదుకలకు ఆదరణీయ శైలాదీదీ, డా॥ ప్రణవపాండ్యా గారు పాదుకా పూజను చేశారు. తరువాత కౌస్తుభమణి సహాయంతో సూర్యరశ్మి ద్వారా అగ్ని ప్రజ్వలన చేసి యజ్ఞాశ్వమును యజ్ఞశాలలోకి ప్రవేశపెట్టారు. ఈ అగ్నియే అన్ని కుండములలో స్థాపించబడినది.

ఈ మహాయజ్ఞములో దేశశక్తి సంవర్ధన కొరకు, విశ్వకళ్యాణం కొరకు, విశిష్ట ఆహుతులు సమర్పించబడ్డాయి. గాయత్రీ మహామంత్రము, మహామృత్యుంజయ మంత్రముతోపాటు దేవసంస్కృతి

దిగ్విజయ యాత్ర కొరకు, ఋషి పరంపర సంవర్ధన కొరకు, సమస్త మానవుల శ్రేయస్సు కొరకు ప్రదూషణ నివారణ కొరకు పర్యావరణ సంరక్షణకి, సృజనశక్తి సంవర్ధన కొరకు, సమృద్ధి కొరకు ప్రత్యేక ఆహుతులు సమర్పించబడ్డాయి.

గాయత్రీ మంత్రాన్ని, యజ్ఞాన్ని, పూజ్యగురుదేవుల గురించి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారిగా పరిచయం చేసిన ప్రజ్ఞాపుత్రులు పూజ్యశ్రీ డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణగారు, నవంబర్ 8వ తేది సాయంత్రానికి హరిద్వార్‌కు చేరుకున్నారు. అక్కడ రహదారి మార్గంలో జనం తాకిడికి వాహన మార్గం మూతపడగా, మాస్టారు కాలినడకన కొంతదూరం, ఆటోలో కొంత దూరము ప్రయాణించి, మెల్లగా ఆదిశంకరాచార్య నగరంలోని బాలాజీ భోజనాలయానికి వచ్చేసి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తించారు. వారిని చూస్తునే ఆంధ్రప్రదేశ్ పరివారమంతా ఆనందంతో పులకించి పోయారు. భోజనాలైపోతూనే అందరూ మాస్టర్‌గారి ప్రవచనం వినటానికి భోజనశాలలోనే సమావేశమైనారు. ఆనాటి వారి ప్రసంగంలో అద్భుతమైన అనేక రహస్యాలు బయటకు వచ్చాయి.

"అతి భయంకర విస్ఫోటన పరిస్థితులయందు మానవాళి నేడు పయనిస్తున్నది. దీనిని చెప్పవచ్చో, చెప్పకూడదో కానీ నాకు చెప్పాలనిపిస్తున్నది. 1970 ప్రాంతంలో ఇద్దరు మహాపురుషులు ఒకరు పండిత శ్రీరామశర్మ ఆచార్య మరొకరు శ్రీ పుట్టపర్తి సత్యసాయిబాబా గార్లు దక్షిణాఫ్రికా దేశాన్ని సందర్శించుట జరిగింది. అక్కడ రాజ్యమేలుతున్న దుష్టశక్తులను సంస్కరించి వారిని మంచి వారిగా చేయాలనేది వారి సంకల్పం. ఈ ప్రక్రియలో భాగంగా వారు కొన్ని తాంత్రిక కార్యక్రమాలను చేపట్టారు. అక్కడికి వెళ్ళటానికి గురుదేవులు ఓడలోనే ప్రయాణించారు.

ఆ ప్రయాణం చేసే సమయంలోనే వారు ఓడ సారధి వద్ద ఆఫ్రికన్ భాషను నేర్చుకొని, దానిలో ప్రావీణ్యతను సంపాదించారు. సరే, ఆఫ్రికాకు చేరిన తరువాత, ఒక రోజున వీరు ప్రయాణిస్తున్న బస్సును, మానవులను చంపి వారి మెదడు తినే సమూహము అడ్డగించింది. వెంటనే గురుదేవులు బస్సుదిగి ఆ పాశవిక మనుషులతో వారి భాషలోనే మాట్లాడి, వారు చేస్తున్న ఆ పని మానవజాతికి ఎంతటి కళంకము నాపాదించుచున్నదో వారికి తెలియజెప్పి, వారిని ఒప్పించి, వారికి కనువిప్పు కలిగేలా చేశారు. ఇంక ఆనాటి నుండి ఆ సమూహము సన్మార్గములో నడిచేలా ప్రేరణనిచ్చారు. వారిలో దైవీ గుణాలు వికసితమయ్యాయి. ఆనాటి కాలంలో అక్కడ వ్యాపించి ఉన్న దుష్ట తాంత్రిక విద్యలకు పరిసమాప్తి పలికించారు.

పై ఘటనలో భాగంగా ఈ రోజు జరిగిన సంఘటనను విశ్లేషించి చూడాలి. (ఆ రోజు ఉదయం యజ్ఞశాల ఆవరణలో ఆసురీశక్తులు విజృంభించి స్త్రీల మెడలలో గల మంగళసూత్రాలు, హారాలను తస్కరించి వారి గొంతులు నులిమి వారిని అంతమొందించారు.) దేవాసురశక్తుల మధ్య సమరం సూక్ష్మ జగత్తులో జరుగుతున్నది. ఈ వేళ ఆసురీశక్తులు విజృంభించి, కొంత నష్టాన్ని కలిగించాయి. కానీ అంతిమ విజయం ఎప్పుడూ దేవతలదే అవుతుంది అనేది అందరికీ తెలిసిన విషయమే. ప్రకృతిలో సంభవించబోయే అనేక సమస్యల నుండీ మానవజాతిని గురుదేవులు రక్షిస్తూనే వున్నారు. స్కైలాబ్ భూమి మీద పడి జన నష్టం జరుగకుండా చూచి దానిని సముద్రపు నీటిలో పడేలా చేశారు. అట్లే భారత్, పాక్ యుద్ధసమయంలో 1971లో అమెరికా సప్తమ నౌకాదళమును భారత సరిహద్దులను చేరుకోకుండా మార్గంలో దానిని అడ్డుకొని వెనుక్కువెళ్ళేలా చేశారు. అలాంటి ఎన్నో ప్రమాదాల నుండీ గురుదేవులు కాపాడుతూనే ఉన్నారు. గాయత్రీ హవనంతో మీ మేరుదండాన్ని వజ్ర సమానంగా తయారుచేసుకోండి. **యజ్ఞం చేసే సమయంలో మీ 33 ఎముకలు యజ్ఞసమిధలుగా మారుతున్నట్లుగా భావన చేసుకోండి. జ్ఞానయజ్ఞం చేస్తే కల్కి అవతారం ప్రకటీకృత మౌతుంది. ఇక్కడ జరిగిన యజ్ఞం ప్రపంచ పరిస్థితిని మార్చి వేసే యజ్ఞముగా జ్ఞాపకముంచుకోండి** అని చాలా ప్రశస్తమైన గుర్తుంచుకోవలసిన మరియు నికట భవిష్యత్తులో ఆచరణ యోగ్యమైన మూలభూత సూత్రాలను వివరించారు. అలా మాస్టర్‌గారు గురుదేవుల జన్మశతాబ్ది మహోత్సవాలలో తాము చేయబోయే ప్రణాళికల గురించి ఎంతో స్పష్టంగా సభాముఖంగా అందరికీ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన తర్వాత నవంబర్ 21వ తేదీన శ్వేతద్వీపంలో కూర్చొని మాస్టరుగారు జన్మశతాబ్ది మహోత్సవముల గురించి ఎంతో ఆనందంతో, అక్కడ జరిగిన మరికొన్ని సందర్భాల గురించి ఇలా చెప్పారు.

8వ తేదీకి శాంతికుంజ్‌కి చేరిన తర్వాత పరివార్ సభ్యులను కలిసి వారితో కాసేపు ముచ్చటించాక శాంతికుంజ్ ఆశ్రమానికి వచ్చారు. అక్కడ వేలాది మంది జనం ఉన్నారు, దూరంగానే వుండి ప్రఖర ప్రజ్ఞ, సజలశ్రద్ధలకు నమస్కరించుకొని తిరిగి వద్దామనుకుంటుంటే, నవరత్నమాలతో జపం చేస్తున్న ఒక స్త్రీ మాస్టరుగార్ని రమ్మని పిలిచి "కూర్చో" అందిట. మాస్టారు కూర్చున్నారు. అక్కడ వీడియోలో "అఖండ జ్యోతి" దర్శనం చూపిస్తున్నారు. కూర్చొని అఖండజ్యోతిని దర్శిస్తూ గురుదేవులకు చెప్పవలసినదంతా చెప్పుకున్నారు. తిరిగి వస్తుంటే ఆ స్త్రీ మళ్ళీ "ప్రఖరప్రజ్ఞ -

సజల శ్రద్ధల" దగ్గరకు వెళ్ళి నమస్కరించుకో అందిట. మాస్టారు ప్రఖరప్రజ్ఞ – సజల శ్రద్ధల దగ్గరకు వెళుతుంటే ఎవ్వరూ అడ్డుచెప్పలేదుట. సరే, ప్రశాంతంగా వెళ్ళి గురుదేవులకు, మాతాజీల చరణాలకు నమస్కరించుకొని తిరిగి వచ్చేశారు. కార్యక్రమం అంతా చాలా ప్రశాంతంగా జరిగి పోయిందనీ, అంత వేలాది మంది జనం వున్నా ఆ స్త్రీ మూర్తి ఎవరో గానీ మన శ్రీరామకృష్ణ గారినే పిలిచి అదంతా చెప్పటం గురించి రవ్వంత ఇష్టంగా చెప్పుకున్న మాస్టరుగారిలో కొండంత ఆనందం కనిపించిందా క్షణంలో. నిజంగానే మధురమైన క్షణాలవి. జన్మశతాబ్ది అయిపోయింది గదా! అమ్మయ్య ఇంక పడుకొని నిద్రపోవచ్చును గదా అనుకుంటారేమో. లేదు, అసలైన పని ఇంక ప్రారంభం కాబోతోంది.

50. 2011లో జన్మశతాబ్ది అసమాన కార్యక్రమాలు

క్రొత్తయుగం రాబోతోంది. నూతన సమాజం రాబోతున్నది. అప్పుడు మనుష్యులూ, మనస్సులూ మారుతాయి వారిలో దేవత్వం ఉదయిస్తుంది. భూమి మీద స్వర్గం వెల్లివిరుస్తుంది. ఇలా జరగటానికి విశ్వమంతా గాయత్రీ వెలుగులు, సవితాకాంతి ఒక ప్రభంజనములాగా ప్రపంచాన్ని ముంచెత్తాలి. గాయత్రి పట్ల నిష్ట కలిగిన వారి సంఖ్య పెరగాలి. వాతావరణాన్ని వేడెక్కించాలి. గాయత్రీ యజ్ఞముల ద్వారా లోక శిక్షణా కార్యక్రమాలు ప్రాచుర్యంలోకి తీసుకురావాలి. దాని వలన జనులకు సవ్యమైన ఆలోచనలందించబడతాయి. ఆలోచనలలో మార్పును తెచ్చే శక్తి గాయత్రిలో నిబిడీకృతమై ఉన్నది. లోకశిక్షణకై గురుదేవులిచ్చిన రెండు ఆధారాలున్నాయి.

(1) ఆలోచనలలో ఉన్న కాలుష్యమును నివారించుట అనగా మానసిక పవిత్రత.

(2) ఆచరణలో మర్యాద, జీవితమును శ్రేష్టముగా గడుపుట, గాయత్రీ జపము, యజ్ఞముల ద్వారా ఈ ఉన్నతమైన లక్ష్యాలను సాధించి తీరాలి అనేది గురుదేవుల లక్ష్యం.

జన్మశతాబ్ది మహోత్సవాల నుంచీ నవంబరు 13వ తేదీకి మాస్టారు ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి వచ్చారు. అంతటి విరాట్ కార్యక్రమములో పాల్గొనటంతో పాటు మాస్టారు 'అఖండ జ్యోతి దర్శనం' కూడా చేసుకున్నారు. అఖండజ్యోతి దర్శనం చేసుకునే సమయంలో మాస్టారికి విశాలమైన కార్య ప్రణాళికనే గురుదేవులిచ్చి పంపించి ఉంటారు. జన్మశతాబ్ది మహోత్సవాలు, శాంతికుంజ్‌లో పరమ అద్భుతముగా జరిగాయి. ఆ మహత్తరమైన కార్యక్రమంలో పాల్గొన్నవారి ఆత్మలు దివ్యత్వాన్ని

పొందివుంటాయి. కానీ 8వ తేదీ మధ్యాహ్నం జరిగిన తోపులాటలో ఒక చిన్న దుర్ఘటన వలన కార్యక్రమాలు మొత్తం రద్దు చేయబడినాయి. వేరొక ప్రత్యామ్నాయముతో దానిని సంపూర్ణము గావించాలనే అభిప్రాయాన్ని మాస్టరుగారు వెలిబుచ్చారు. మరునాడే ఒక చిన్న సమావేశాన్ని ఏర్పాటు చేసి ఒక చక్కటి సందేశాన్నిచ్చారు. పాయింట్‌వైజ్‌గా ఇలాచెప్పారు.

(1) ఈ నవంబరు నెలాఖరు లోపల 100 చోట్ల 15కుండాల యజ్ఞములు జరగాలి. యజ్ఞ కుండము మూడు స్టెప్‌లుగా కట్టాలి. క్రింద నలుపు, తరువాత ఎరుపు, పైన తెలుపు రంగులు వెయ్యాలి.

(2) యజ్ఞకుండీల మీద 5 దీపాలు, 15 అగరుబత్తీలు వెలిగించి పెట్టాలి.

(3) యజ్ఞకుండం చుట్టూ కందకం వేసి దానిలోపల ఒక అంగుళంలోతుగా నీరు పొయ్యాలి.

(4) యజ్ఞాన్ని సమిధలతో కాకుండా దీపాలతోనే చెయ్యాలి.

(5) మొత్తం అన్నిచోట్ల ఒకేసారి యజ్ఞం జరగాలి 24 లక్షల ఆహుతులు పడాలీ. అదీ ప్లాన్. చివరగా ప్రదక్షిణలు చెయ్యాలి. ఇంకో ముఖ్యమైన విషయాన్ని చెప్పారు.

గురుదేవుల జన్మస్థలమైన అవల్‌ఖేడాలో పెట్టిన సూర్యుని ఫోటోను ఇంటర్‌నెట్ నుంచీ తీసి ఆ ఫోటోలు కట్టించి రాత్రికల్లా అందరిళ్ళలో పెట్టుకోవాలి. ప్రస్తుతానికీ కార్యక్రమాలు జరిగేలా చూడమని చెప్పారు. దీంతోపాటు శతాబ్దీ మహోత్సవాలకు అనుయాజగా చేయబోయే కార్యక్రమాల పరంపరకు ఇంటర్‌నెట్ ద్వారా చేయవలసిన పనులను చెప్పారు. జన్మశతాబ్దిమహోత్సవాల సమయంలో శాంతికుంజ్‌లో వున్నప్పుడు బాంబేలో వుండే మన కార్యకర్తలు శ్రీ జి.వి.యస్. గారు, శ్రీమతి సులోచనా మొదలైనవాళ్ళు మాస్టరుగారిని కలిసి బాంబేలో 9వేల చదరపు అడుగుల స్థలాన్ని గాయత్రీ మందిరానికి కేటాయించటం జరిగిందనీ, పూజ్యశ్రీమాస్టరుగారు వచ్చి ఆ స్థలాన్ని చూచి మందిరం నిర్మాణం ఎలా చెయ్యాలో చెప్తే వెంటనే పనిని ప్రారంభిస్తామని అడగటం జరిగింది. దానికి మాస్టరుగారు సమ్మతించి నవంబర్ 25వ తేదీ బాంబేకి వెళ్ళి జన్మశతాబ్ది అనుయాజలో భాగంగా అక్కడ 3 రోజుల సాధనా శిబిరాన్ని నిర్వహించి 'గాయత్రీ మందిర' నిర్మాణానికి తగిన ప్లాను ఇచ్చి వచ్చారు. అసలు అనుయాజ అంటే ఏమిటి? అనే దానికి ఒక

మహాయజ్ఞము జరిగిన తరువాత ఆ యజ్ఞములో ఆవిర్భవించిన అనంతమైన దైవశక్తిని సమాజ హితానికి వినియోగించటానికి చేసే విశాలకార్యక్రమాల ప్రణాళికను అనుయాజ అంటారు.

తరువాత మళ్ళీ ఒకసారి ఒంగోలులో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చెయ్యమన్నారు. అనుగ్రహపీఠంలో జరిగిన ఈ సమావేశానికి అన్ని వూళ్ళ నుంచీ సుమారు 50 మంది ముఖ్య కార్యకర్తలు వచ్చారు. ఆనాటి వారి సందేశంలో జన్మశతాబ్ది అనుయాజగా చేయవలసిన పనులు:

(1) వృక్షాలు నాటటం.

(2) శ్రీరాం స్మృతి ఉపవనాలను గ్రామగ్రామాలలో పెట్టాలి.

(3) వ్యసనముక్తి.

(4) నీటిసాగుబడి ద్వారా పొలాలను పండించటం.

(5) లక్ష ప్రదేశాలలో ఒక కుండీ యజ్ఞాలు చేయటం. అదీ కేవలం దీపాలతోనే చేయటం.

(6) సూర్య స్టిక్కర్లు ఒక లక్ష ఇళ్ళలో స్థాపించటం.

(7) రోజుకు 2 కోట్ల మంది 1 మాల గాయత్రి జపంచేసి సూర్య అర్ఘ్యదానం చెయ్యాలనీ, వారానికోసారి యజ్ఞం చేసుకోవాలనే నిర్దేశాలను ఇచ్చారు.

ఈ సమావేశంలోనే మరొక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'వెన్నాదేవి' గ్రామంలో క్రొత్తగా ప్రజ్ఞాపీఠం పెట్టాలని కుమారిలలిత, పేరిశాస్త్రి వాళ్ళు అడుగగా దత్త జయంతికి అంటే డిసెంబరు 9, 10, 11 తేదీలలో "పంచవీరభద్ర సాధన" పేరుతో మూడురోజుల సాధనాక్యాంప్ పెడతానని చెప్పారు. (1) గహనా కర్మణోగతిః (2) అమనస్కయోగం, (3) లా ఆఫ్ కర్మ అనే పుస్తకాల మీద క్లాసులు జరుగుతాయని అలా ప్లాను చేసుకోమని చెప్పారు.

51. జన్మ శతాబ్ది అనుయాజ

2011 డిసెంబరు నెలలో 'జన్మ శతాబ్ది అనుయాజ' కార్యక్రమాలు నిర్వహించటానికి తగిన టైం-టేబుల్ తయారుచేయమన్నారు. వారు అన్నదే తడవుగా ఏ గ్రామానికి, ఏ రోజు, ఎప్పుడు వెళ్ళాలనేది కూడా సూచిస్తూ టైం-టేబుల్ తయారైపోయింది. దానిని చూచి మాస్టర్‌గారు తమ

అనుమతినిచ్చారు. వెంటనే ఆయా గ్రామ కార్యకర్తలకు సమాచారం అందించటం – ఎక్కడ ఎప్పుడు ఏమి చెయ్యాలో కూడా వివరించటం జరిగిపోయింది.

డిసెంబరు 7వ తేదీ నుంచి "అనుయాజ శృంఖల" ప్రారంభమైంది. అందుచేత ముందుగా 'శ్రీ వేదమాత గాయత్రీ శక్తి' పీఠానికి వెళ్ళి అక్కడ 'శ్రీచక్రాన్ని' ప్రతిష్ఠించి ఇంక అక్కడ నుంచీ – అమరావతికి వెళ్ళటం జరిగింది. అక్కడ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రవచనం చెప్పి మరునాడు '75 తాళ్ళూరుకు' వెళ్ళాం. అక్కడ శ్రీ అంకారావుగారి ఆధ్వర్యంలో 'శ్రీ అయోధ్య రామస్వామి' వారి ఆశ్రమంలో అద్భుతమైన సందేశాన్ని ఇచ్చారు. తరువాత గుంటూరులో శ్రీ రంగనాయకులు గారు ఏర్పాటు చేసిన వేదిక మీద ప్రవచనాలనిచ్చి ఆ రాత్రి గుంటూరులోనే ఉన్నారు.

మరునాడు ఉదయం సప్తర్షి ఆశ్రమంలోనూ, ఇంకా అనేక చోట్ల ప్రవచనాలనిస్తూ సాయంత్రానికి వెన్నాదేవికి చేరుకున్నారు. వెన్నాదేవి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయ ఆవరణలో మాస్టర్‌గారి రాకకై వేలాది మంది భక్తులు ఎదురుచూస్తున్నారు. అప్పటికే ఉదయం నుంచీ ప్రయాణాలు చేసి, ప్రవచనాలు చెప్పటంతో మాస్టర్‌గారు బాగా అలసిపోయివున్నారు. అయినా అంతమంది భక్తుల నిరీక్షణను చూచే సరికి వారిలో ఎక్కడ లేని ఉత్సాహం వచ్చేసింది. వెన్నాదేవి గ్రామంలో లలిత అనే అమ్మాయి గ్రామస్తుల సహకారంతో శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలో చక్కటి ప్రజ్ఞాపీఠాన్ని కట్టించారు. ఆ పీఠ ఆవిష్కరణ పూజ్యశ్రీ మాస్టర్‌గారి అమృత హస్తాల మీదుగా జరగాలనేది వారందరీ ఆశ! వారి 'ఆశ' తీరే అద్భుతమైన అమృత ఘడియల రూపంలో ఫలించే సమయం రానే వచ్చింది. సాక్షాత్ పరమాత్మ మా దగ్గర కొస్తున్నారన్న అఖండ ఆనందంతో భారీగా ఏర్పాట్లు చేశారు.

ఆ రోజున శ్రీమతి సుమా, పటేల్ వాళ్ళబ్బాయి చి॥ సర్వేష్ జన్మదిన సందర్భం వలన వాళ్ళు కుటుంబ సమేతంగా శ్రీశ్రీమాస్టర్‌గారి దివ్య సమక్షంలో జన్మదిన సంస్కారం చేయించుకోవటానికి వచ్చారు. అంత ఒత్తిడిలో కూడా అన్ని ఏర్పాట్లు చేయించి యథావిధిగా 'జన్మదిన సంస్కారం' అన్ని వేలమంది ఆశీర్వాదాలతో చేయించారు. ఇంకో మాట చెప్పారు. ఇది 'సర్వేష్' జన్మదినం అంటే మనందరి జన్మదినం. కాబట్టి అందరికీ ఇవాళ ఈ సంస్కార మహోత్సవం ఇంత వైభవంగా జరిగింది, అదీ వాయుపుత్రుడు శ్రీహనుమాన్ ఆలయంలో. అనేక విషయాలు ఎంతో ఓపికతో అందరికీ ఆశీర్వాదాలనందించారు.

రేపు 'ప్రజ్ఞాపీఠం' పెట్టాలి కాబట్టి ఇవాళ రాత్రంతా అఖండ జపం చెయ్యండని చెప్పారు. రాత్రంతా జపం జరుగుతూనే వున్నది. అక్కడ పీఠంలో పెట్టించాలని, 'రామ పాదుకలు' చేయించారు. ఉదయాన్నే 'శ్రీరామ పాదుకలను' ఒక్కొక్కరూ శిరస్సుమీద ధరించుకుంటూ ఊరేగింపుగా గ్రామంలో తిరిగి చివరకు 'ప్రజ్ఞాపీఠం' దగ్గరకు రాగా పూజ్యశ్రీ మాస్టర్ గారు వాటిని అందుకొని పీఠంలో స్థాపించారు.

అనంతరం ఎనిమిది కుండీలలో యజ్ఞం ప్రారంభించి ఇవాళ మనం సూక్ష్మ అశ్వమేధయజ్ఞాన్ని చేయబోతున్నాము. శ్రీరామ పాదుకలు స్థాపించినచోట శ్రీరామరాజ్యం వస్తుంది. అశ్వమేధం జరుగుతుంది. అలానే ఇక్కడ చేస్తున్న ఈ యజ్ఞాశ్వము వాడవాడలా తిరిగి రామరాజ్యస్థాపనకి శంఖారావం పూరించాలి అంటూ ఎంతో తాదాత్మ్యతతో చెప్పారు. యజ్ఞ సమయంలో చెప్పిన ప్రవచనంలో "ఈ రోజు ఈ వెన్నాదేవిగ్రామంలో గాయత్రీ ప్రజ్ఞాపీఠాన్ని స్థాపించాం" కదా !! ఎందుకు స్థాపించాము?

అసలు ప్రజ్ఞ అంటే ఏమిటి?

ప్రజ్ఞ అంటే ఏమిటో ముందు మీకు తెలియాలి. ప్రజ్ఞ అంటే మనిషిలో ఆవరించి వున్న చెడు పోయి మంచి రావటమే ప్రజ్ఞ. మన శరీరంలో 40 సంవత్సరాలు వచ్చేవరకు అన్ని అవయవాలు 100 శాతం పనిచేస్తాయి. శరీరంలో ఏర్పడే మాలిన్యాలను ఎప్పటికప్పుడు ఆయా అవయవాలు శుద్ధి చేస్తాయి. శరీరం ఆరోగ్యంగా వుంటుంది. అదీ స్వచ్ఛమైన గాలిని మనం పీల్చినప్పుడు, శరీరంలో ఏర్పడిన మాలిన్యాలన్నీ కడిగివేయబడి, స్వచ్ఛమైన మనస్సు, దాంతోపాటు బుద్ధి ఏర్పడతాయి. ఎక్కడైతే మంచి వుంటుందో దానిని ప్రజ్ఞ అంటారు.ఆ ప్రజ్ఞ రావటానికి గాయత్రీ మంత్రాన్ని లక్షల సంఖ్యలో జపం చెయ్యాలి. అది శరీరంలోని, మనస్సులోని మాలిన్యాలను పోగొట్టి మంచి, మంచి లక్ష్యాలనిస్తుంది.

దాని తరువాత ప్రజ్ఞామండలి లక్ష్యం ఏమిటీ?

గురుదేవుల 'యుగశక్తి గాయత్రి' మాసపత్రికని అందరూ చదవండి. దానిని చదవటం, వినటం ద్వారా ఆటోమాటిక్‌గా మీలో 'ప్రజ్ఞ' అభివృద్ధి చెందుతుంది. ఆ బుక్ చదివి అందులో ఇచ్చిన సాధనలు గాని, ప్రణాళికలు గానీ చెయ్యగలిగినంత చెయ్యండి. దానిని మీరు చదువుతూ

అనేకమందిచేత చదివించండి. యుగశక్తి మీరు చదవటంతో పాటు ఇంకా ఆ విషయాలను అందరికీ ప్రజ్ఞాపీఠంలో చెప్పటం వలన అందరిలోనూ ఆ గాయత్రీమాత ప్రజ్ఞ ఆవిర్భవిస్తుంది.

(1) మంచి శ్వాస తీసుకోవటం. దాని వలన మన శరీరంలోని మాలిన్యాలు క్లీన్ అయినట్లే మన ఆలోచనలు అంటే మస్తిష్కము పరిశుద్ధమౌతుంది.

(2) ఈ మ్యాగజైన్ చదివితే మెల్లమెల్లగా ప్రజ్ఞ డెవలప్ అవుతుంది. శరీరం లోపల వున్న 'నేను' అర్థమౌతుంది.

(3) ఈ మ్యాగజైన్ చదివి దానిని అందరికీ చెప్తే అప్పుడు మనం గురుదేవుల అంగ అవయవాలం అవుతాము. గురుదేవుల్లాగే మనమూ కష్టపడి పని చేస్తే సత్యయుగం వచ్చి తీరుతుంది. దీపం నుంచీ వెలుగు వచ్చినట్లు ఈ ప్రజ్ఞామండలి నుంచీ జ్ఞానం వెలువడాలి.

ఇది హనుమాన్ దేవాలయం గదా! హనుమంతుని వాహనం ఒంటె – దానిని చూపిస్తూ మాస్టరుగారు హనుమాన్ గురించీ, ఒంటె గురించి చక్కటి నిర్వచనాన్ని చెప్పారు.

ప్రతీ దేవతకు ఒక వాహనం వుంటుంది. ఇక్కడ హనుమంతుడి వాహనం ఒంటె. వాహనం ఎప్పుడూ పని ఉన్నచోటనే పని చేస్తుంటుంది. హనుమాన్ అంటే వాయుపుత్రుడు – శ్వాస. అది హార్ట్ (హృదయం)లో ఉంటుంది. ఆయనతో పాటు ఉండేది ఆయన వాహనం ఒంటె. ఒంటెలో నీరు లోపలే వుంటుంది. నీరును గాయత్రీ మాత చిత్రంలో కమండల రూపంలో చూస్తాం. అలాగే జ్ఞానమనేది మన లోపలనుంచీ, హృదయాల లోతులలో నుంచీ రావాలి. ఒంటె అడుగులు మెత్తగా వుంటాయి. అలాగే మనం ఇతరులకి చెప్పే మాటలు సున్నితంగా వుండాలి. ఒంటె ఎడారిలో ఒంటరిగానే ప్రయాణిస్తుంది. ఎడారిలో ఒంటె లాగా మనమూ 'జగమంత కుటుంబం నాదీ – ఏకాకి జీవితం నాదీ' – అనే పాటలో మాదిరి (చక్రం సినిమాలోది ఈ పాట) మనం జీవితంలో జీవించాలి. చనిపోతాను అని తెలిసినా 'హీరో' పనులనేమీ ఆపలేదు. ఇంకా అందరికీ ఎక్కువగా సహాయం చేస్తాడు. అలానే మనము ఇచ్చే ఈ జ్ఞానం పదిమందికీ ఉపయోగపడాలనేదే మన లక్ష్యం. ఒంటెలో జీవించే ప్రజ్ఞ వున్నది. ఒంటరిగా 'ఏక్ లా చలోరే' అంటారు గురుదేవులు. సాధనా పథంలో వున్న ధర్మసూక్ష్మము అంతా అదే!!

శ్రీరామాయణంలో భరతుడు శ్రీరాముని పాదుకలు తెచ్చి నంది గ్రామంలో పెట్టి రామరాజ్య స్థాపన చేస్తారు. అలానే ఇక్కడా శ్రీరామశర్మ ఆచార్య పాదుకలను గుడి చుట్టూ తిప్పి భరతుడు "రామపాదుకలను" నంది గ్రామంలో పెట్టినట్లుగా, మనం శ్రీరామశర్మ ఆచార్య పాదుకలను హనుమాన్ ఆలయంలో స్థాపించిన ఈ ప్రజ్ఞాపీఠంలోకి ప్రవేశింపచేస్తున్నాము. సుస్థిరమైన శ్రీరామరాజ్యం వస్తుంది. వచ్చి తీరుతుంది.

అందుకే 'సూక్ష్మ అశ్వమేధ ప్రక్రియ'గా ఇవాళ ఈ యజ్ఞాన్ని మనం చేస్తున్నాము. 2013 నుంచీ ఈ రకమైన యజ్ఞాలను చేస్తూ ఆంధ్రప్రదేశ్‌ని గాయత్రీ ప్రదేశ్‌గా మార్చేద్దాం. సూర్యుని 7 గుఱ్ఱాలను ముందు రోజులలో జరగబోయే అశ్వమేధయజ్ఞానికి నాందిగా ఈ 7 గుఱ్ఱాలను ఇంటింటికీ మీరే తీసుకువెళ్ళాలి. అశ్వ + మేధలో, అశ్వమేధం మీకేం ఇస్తుంది? మేధస్సునిస్తుంది. జ్ఞాన విజ్ఞానాలను ఇస్తుంది. సమస్త జ్ఞానానికి సూర్యుడే ప్రతీక. ప్రతీ ఇంట్లోనూ 7 గుఱ్ఱాలున్న ఈ సూర్యుడి ఫోటోలను పెట్టుకోండి. రోజూ కనీసం ఆ 7 గుఱ్ఱాలున్న సూర్యుణ్ణి చూస్తే చాలు.మీకు చాలా మేలు కలుగుతుంది. అశ్వమేధం చేసిన మాదిరి ఇంటింటికీ ఈ సూర్యుని ఫోటోలు వెళ్ళిపోవాలి అని ప్రవచనంలో చెప్పటమేగాదు చేయించారు కూడా!

2013 తరువాత జరుగబోయే మహాయజ్ఞాలకి నాందిగా ఈ సూక్ష్మ అశ్వమేధయజ్ఞాన్ని ఒక పండుగలాగా మనం చేసుకోవాలి. ఏ.పి.లో జరుగబోయే అశ్వమేధం విశ్వమహాభారతంగా మారాలి. దీనికి మనం ఎనిమిది దిక్కులకు వెళ్ళి ప్రచారం చెయ్యాలి. అందుకే ఇవాళ ఎనిమిది దిక్కులలో ఎనిమిది యజ్ఞకుండాలను పెట్టించాను. ఈ యజ్ఞం చేయబోయేముందు గురుదేవుల జన్మస్థలంలో పెట్టిన '7 గుఱ్ఱాల సూర్యుణ్ణి' మనం ఇంటింటికీ పంపుదాం. ఈ ఒక చిన్న ప్రక్రియను ఆ రోజు కార్యక్రమంలో చేయబడింది.

ఇంటింటా సూర్యుడి ఫోటోలు పెట్టండి

ఈ సృష్టిలో వున్న సమస్త విద్యలనూ 'సూర్య విద్య' అనే అంటాము. సమస్త వేదవిజ్ఞానమూ సూర్యుడికి సంబంధించిన విద్యే. ఏ దేవతను మనం కొలిచినా సంవత్సరాలపాటు తపస్సు చేస్తే తప్ప, ఆ దేవత ప్రత్యక్షం కాదు. సూర్యోపాసనలో ఉన్న గొప్పదనమేమిటంటే ఆ దేవుడు ముందే మనకు ప్రత్యక్షమై ఉంటాడు. మనమే జపాలు చేసినా చేయకపోయినా ఆయన దర్శన భాగ్యం

మనకు రోజూ ఉంటుంది. ఋతువుల ప్రభావం అంటే ఎండాకాలం, వానాకాలం, శీతాకాలం ఈ రొటీన్ లేకపోతే జీవితమే లేదు. అందుచేత మనం జీవించి ఉన్నాము అంటే దానికి ఏకైక కారణం సూర్యుడు.

సూర్యుణ్ణి పూజించటం చాలా ముఖ్యమంటాడు శ్రీకృష్ణుడు.

యే ప్యన్య దేవతా భక్త్యాయజన్తే శ్రద్ధ యాన్వితాః ।
తేపి మా మేవకౌంతేయ యజన్త్యవిధి పూర్వకమ్ ॥

ఆ సూర్యుడి శక్తే అన్ని దేవతలలోనూ ఉన్నది. సర్వవ్యాపకమైన ఆ సూర్యుని యొక్క శక్తిని మనం ఉపయోగించుకునేటట్లు చేసే దేవాలయాలు విస్తృతంగా రావాలి. ఈనాడు మనమా విద్యను మరిచిపోయాము.

సూర్యోపాసన అంటే మనలో ఉన్న సూర్యుని ఉపాసన. బైట ఉన్న సూర్యుడు కాదు. లోపల వున్న వెలుగు. ఆ వెలుగు లోపల ఎప్పుడైతే వెలుగుతుందో అప్పుడు "చేతనత్వం" మనలో ఆవిర్భవిస్తుంది. దానినే 'గురుచేతనత్వం' అంటాము. ప్రపంచంలో ఆ విద్య తప్ప ఇంకే విద్య లేదు. సూర్యుడు తప్ప ఇంకో దేవుడూ లేడు, దేవతా లేదు. ఇంకో శక్తీ లేదు. ప్రపంచంలో ఏ గురువు ఏ చమత్కారాలు చేసినా అదంతా సూర్యుని వల్లనే! అందుకే శ్రీకృష్ణుడు అంటాడు. 'ఇమం వివస్వతేయోగం – (గీత4-1) ఈ యోగ విద్యను నేను మొట్టమొదట సూర్యునికి చెప్పాను అని. **కాల ప్రవాహంలో ఆ యోగం పోయింది. సూర్యశక్తిని గుర్తించటం మానేశాం. సూర్యుడు దేవతా స్వరూపం కాదు, సకల దేవతలకు వెనకాతల వున్న శక్తి.**

సూర్యుడు లేనిదే భూప్రపంచము లేదు. అందుచేత మాస్టరుగారు ఏమి చెయ్యమన్నారో చూద్దాం.

వసంత పంచమికి అవల్‌ఖేడాలో సూర్యదేవాలయాన్ని ప్రారంభిస్తున్నారు. దానికి అనుబంధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఒక లక్ష సూర్యుడి ఫోటోలను తయారు చేయించమనీ "దానిని మీరందరూ మీమీ ఇళ్ళల్లో ఆ ఫోటోలు పెట్టుకోండని" చెప్పారు. ప్రతీరోజు ఆ ఫోటోను చూస్తే చాలు. ముఖ్యంగా ఆ 7 గుఱ్ఱాలను చూడటం చాలా అవసరం అని చెప్పారు.

వెంటనే 7 గుఱ్ఱాలు + సూర్యుడు ఉన్న ఫోటోలను వేయించి లక్షల సంఖ్యలో దానిని ప్రతీ ఇంటికీ పంపటం జరిగిపోయింది.

ఈ యజ్ఞ ప్రక్రియలో భాగంగానే 3' × 2' సైజులో చేయబడిన 240 'సూర్యఫ్లెక్సీలకు' యధావిధిగా కర్మకాండ భాస్కర్‌లో ఇచ్చిన విధంగా ప్రాణప్రతిష్ఠ చేయించారు. ఉత్సాహవంతులైన 240 మంది తమ ఇళ్ళల్లో దానిని స్థాపించుకోవటానికి దీక్ష తీసుకున్నారు. అలా ముందుకొచ్చిన వారికి మాస్టరుగారే స్వయంగా ఆ ఫ్లెక్సీలను వారి చేతిలో పెట్టారు. అనంతరం వేలకువేల స్టిక్కర్లను గ్రామగ్రామాలలో స్థాపించటానికి ముందుకు వచ్చిన వారికీ తమ అమృత హస్తాలతోనే అందించారు. ఆ రోజు జరిగిన ఆ ఉత్సవాన్ని చూచినవాళ్ళు జన్మలో ఆ దృశ్యాన్ని మరిచిపోలేరు. ఫ్లెక్సీలను దీక్షగా అందరికీ ఇచ్చాక ఇవాళ నుంచీ ఈ సూర్యదేవాలయాన్ని మీ ఇంట్లో ప్రతిష్ఠించుకోండి. దానికి ఒక తెర ఏర్పాటు చేయండి. ఉదయం తెర తీసి ఆరతివ్వండి. రాత్రి మళ్ళీ తెరవేయండి.

"ఓం ఘృణిః సూర్యాయ నమః" అనే మంత్రాన్ని రోజుకు 108సార్లు చెయ్యమని దీక్షనిచ్చారు. తరువాత యజ్ఞాన్ని సూక్ష్మీకృత రూపంలో చేసి పూర్ణాహుతి చేశారు.

పూర్ణాహుతికి ముందు కొన్ని కార్యక్రమాలను వివరించారు.

(1) ఒక లక్ష 'యుగశక్తి గాయత్రీ' మాసపత్రికకు చందాదారులను చేర్చాలి.

(2) ఒక లక్ష సూర్య స్టిక్కర్లు ఇంటింటికీ వెళ్ళిపోవాలి.

(3) గ్రామాలలో లక్షల సంఖ్యలో మొక్కలు నాటాలి.

(4) 'శ్రీరాం' స్మృతి ఉపవనాలను – శాంతికుంజ్ వారిచ్చిన నమూనా ప్రకారం వీలైనన్నిచోట్ల ఏర్పాటు చెయ్యాలి. ఈ సాధనా శిబిరం పూర్ణిమ రోజులలో గదా జరిగినది ! ఈ పూర్ణిమనాడు చంద్రగ్రహణం వచ్చింది.

చంద్రగ్రహణం

చంద్రగ్రహణం సమయంలో అద్భుతమైన ఆధ్యాత్మిక సాధననిచ్చారు.

ఉదయం కార్యక్రమములో – సూర్యస్టిక్కర్ల వితరణ అయిపోయింది. సూక్ష్మీకృత అశ్వమేధ యజ్ఞము అయిపోయింది. సంపూర్ణ చంద్రగ్రహణం రాత్రి 12 గంటల వరకు. ఆ రోజు రాత్రి

కార్యక్రమాలు అలా జరుగుతూనే ఉన్నాయి. ఆ రోజు సాయంత్రం 1984 సంవత్సరంలో గురుదేవులు చేసిన పంచవీరభద్ర సాధనలో గల పంచప్రణాళికలను గురించి చాలా చక్కటి వివరణ చెప్పారు.

ఈ పంచవీరభద్ర సాధనాపరంగా ముఖ్యంగా ఇచ్చిన ఐదు ప్రధాన విషయాలు: (1) బయో – ఎలక్ట్రిసిటి, (2) బయో–మాగ్నటిజమ్, (3) రేడియేషన్, (4) క్రియేషన్ అండ్ ప్రొడక్షన్, (5) ఇమ్యూనిటీ.

ఈ ఐదింటికి మన శరీరంలో గల భాగాలు ఎలా స్పందిస్తాయి, ఎలా పనిచేస్తాయి? దానికి మనం చేయవలసిన సాధనలు ఏమిటీ అనే దానిపై చర్చించారు. ఆ తరువాత 'గాయత్రీ–కుండలినీ–సావిత్రి' పుస్తకాన్ని గురించి చెప్తూ నిజజీవితంలో సరళంగా దానిని ఎలా మనం ఆచరించాలనేదానికి–

1. **సావిత్రి అంటే గురుదేవులు వ్రాసిన 18 సత్సంకల్పాలను ప్రతీరోజూ చదవాలనీ,**
2. **కుండలినీ అంటే యుగశక్తి గాయత్రీ పత్రిక యొక్క చందాదారులను ఒక లక్షకు పెంచాలనీ,**
3. **గాయత్రీ అంటే సవితా ధ్యానముతో పాటు నిత్యమూ గాయత్రీ జపం చెయ్యాలనీ చెప్పారు.** ముఖ్యంగా ఈ శిబిరంలో 'గాయత్రీ–కుండలినీ– సావిత్రి' పుస్తకంలో ఇచ్చిన కొన్ని సాధనలు వివరించారు.

మరునాడు ఉదయం సాధనా శిబిరం చివరిరోజు అందరినీ సమావేశపరచి వెన్నాదేవి గ్రామంలో ఇంత చక్కటి కార్యక్రమం చేసిన శ్రీ పేరిశాస్త్రి, లలితలతోపాటు గ్రామస్తులనందరినీ అభినందించి తిరుగు ప్రయాణమయ్యారు. మాస్టారు 'శంబళ' పనులు చూడాలని హైదరాబాద్‌కి వెళ్ళిపోయారు.

52. కోణార్కయాత్ర

ఈ ప్రక్రియ జరగటానికి ముందు జరిగిన ఒక విషయం ఇక్కడ పాఠకులకు తెలియాలి. కోణార్కయాత్ర నుంచీ నేరుగా మాస్టరుగారు వాళ్ళ తమ్ముడుగారింటికి వెళ్లారు. రెండురోజుల తర్వాత శ్రీమతి తేజశ్రీ, శ్రీశ్రీమాస్టరుగారిని చూడాలని వెళ్ళారు. అక్కడ ఇంకా కొంత మంది వున్నారు. వాళ్ళందరికీ తమ కోణార్క్ యాత్ర విశేషాలన్నీ ఎంతో చక్కగా వర్ణిస్తూ సూర్యవిగ్రహం గురించి చెప్తున్నారు. ఆ మాటలు వింటూనే తేజశ్రీ, లాప్‌టాప్ తెరచి ఎంతో అందంగా వున్న 7

గుళ్ళాలతో కూడిన సూర్యవిగ్రహం ఫోటోను చూపిస్తూ, "చూడండి మాస్టారు ఈ సూర్యవిగ్రహాన్ని. గురుదేవుల జన్మస్థలి అవల్‌ఖేడాలో ప్రతిష్టించబోతున్నారు. దేవాలయ నిర్మాణం పూర్తైపోయింది. అతి త్వరలోనే ప్రతిష్టించబోతున్నారు" అని చెప్పింది. ఆ ఫోటోను చూస్తూ 'నాకీ ఫోటో కావాలి ' అన్నారు. తక్షణమే దానిని డౌన్‌లోడ్ చేసి ప్రింటౌట్ తీసి అందమైన ఫ్రేమ్‌లో కట్టించి తెచ్చి మాస్టరు గారికిచ్చారు. 'నాకీ సూర్యుడు కావాలి' అన్న మాట సాకారమై తక్షణమే వారి దగ్గరకు వచ్చింది. మహాత్ముల సంకల్పశక్తి అంత తీవ్రంగా రూపుదాలుస్తుందనటానికి ఇదే ప్రమాణం గదా!!

తరువాత కాలంలో ఇదే సూర్యుని ఫోటోని ఫ్లెక్సీలుగా, స్టిక్కర్లుగా తయారుచేయించి ఒక లక్ష ఇళ్ళల్లో స్థాపించటం జరిగింది. **అలానే భువనేశ్వర్‌లో చూసిన బౌద్ధస్థూపాల్లాంటి వాటినే గాయత్రీ స్థూపాలుగా 49 అగ్నులకు ప్రతీకలుగా 49 చోట్ల స్థాపించాలని చెప్పారు.** ఆ పని మాత్రం కొంతవరకు పూర్తైంది.

పూజ్యశ్రీమాస్టరుగారు ఒకసారి కోణార్క్, భువనేశ్వర్ మరియు పూరీజగన్నాధ్‌లాంటి కొన్ని దివ్యక్షేత్రాలను దర్శించటం జరిగింది. శ్రీయుగంధర్, మెంటా నారాయణరావు, చందన వీళ్ళందరూ కలిసి ఈ క్షేత్రాలను చూడాలని వెళ్ళారు. మాస్టరుగారు ప్రత్యేకించి చూడాలని ఎక్కడికైనా బయలుదేరారు అంటే అందులో మన ఊహకందని ఎన్నో దైవరహస్యాలు దాగి వుంటాయి. ఫలానా చోటుకు వెళ్ళాలి అంటే వెంటనే బయల్దేరాల్సిందే ! అక్కడ సమయము యొక్క ప్రాధాన్యతను మనం గుర్తించగలగాలి. సరే ఎంతో ఉత్సాహంగా క్షేత్రాలను చూట్టానికని బయల్దేరారు, ముందుగా భువనేశ్వర్‌కు వెళ్ళారు. ఎంతో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమది. 1993 మే 3,4,5,6 తేదీలలో మాతాజీ ఇక్కడ అశ్వమేధం కూడా చేశారు. భువనేశ్వర్‌లో మాస్టరుగారిని ఎక్కువగా ఆకర్షించినవి బౌద్ధస్థూపాలు. ఇక్కడ బౌద్ధులు అత్యంత భక్తి, శ్రద్ధలతో బుద్ధభగవానుని స్మృతిచిహ్నాలుగా బౌద్ధ స్థూపాలను నిర్మించారు. అద్భుతమైన చరిత్ర గల్గిన ఈ స్థూపాలు ఇంకా ఇక్కడ నిర్మించబడిన బౌద్ధారామాలు, అశోకుడి స్థూపం కూడా చరిత్ర ప్రసిద్ధములు. అన్నింటినీ ఎంతో శ్రద్ధతో అతి సునిశితంగా పరిశీలిస్తూ తిరిగి చూశారు.

ఈ ప్రదేశంలో ఒక ప్రత్యేకమైన ముద్రలో ఉన్న బుద్ధభగవానుని మూర్తిని చూశారు. బాగా పరికించి చూచి దానిని విశ్వశాంతిముద్ర అని చెప్పి అక్కడికక్కడే దానిని ప్రాక్టీస్ చేశారు. ఆ

తరువాత దానిని అందరికీ నేర్పించారు. ఇక్కడ మరొక చోట బుద్ధభగవానుడు పడుకుని వున్నమూర్తిని కూడా చూశారు.

అక్కడ ఉన్నవాటినన్నింటినీ చూశాక కోణార్క్‌లో వున్న సూర్యదేవాలయం చూడాలని అక్కడకు బయల్దేరి వెళ్ళారు. అక్కడున్న సూర్యవిగ్రహాన్ని చూశారు కానీ ఆ విగ్రహంలో ఎక్కడో తెలియని వెలితి వారికి కనిపించింది. ఎందుకో అసంతృప్తిగా ఉన్నారా అని అనిపించింది. చివరగా పూరీ జగన్నాధ్ దేవాలయానికి వెళ్ళారు. ఈ ఆలయంలోనే ఇంద్రదేవాలయం ఉన్నది. సాధాణంగా దానినే సూర్యదేవాలయం అనుకుంటారు. ఇంతలో అక్కడున్న అర్చకస్వామి వచ్చి ఒక తెరను తొలగించి లోపలున్న అందమైన సూర్యవిగ్రహాన్ని చూపించారు. దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఆ సూర్యవిగ్రహాన్ని చూస్తూ మాస్టారు ఒక దివ్యానుభూతికి లోనైయ్యారు. ఎంత చూసినా తనివితీరని ఆ విగ్రహాన్ని చూస్తూ మాస్టారు, 'నాకీ విగ్రహం కావాలి. తీసుకొచ్చెయ్యండని' యుగంధర్‌వాళ్ళతో అన్నారుట. సరే మిగతా ట్రిప్పంతా అనుకున్న ప్రకారం పూర్తి చేసుకొని హైద్రాబాద్‌కు వచ్చేశారు.

ఇదే విషయం గురించి మాస్టరుగారు ఒకసారి నాతో ఇలా చెప్పారు. 400 సంవత్సరాల క్రితం కోణార్క్‌లో సూర్యదేవాలయంలో సూర్యవిగ్రహం ఉండేది. ఆ సూర్యవిగ్రహం అక్కడ లేదిప్పుడు. ఎక్కడో వుంది. మేము ఈ మధ్యనే ఆ సూర్యుణ్ణి చూట్టానికని వెళ్ళాము. ఎక్కడో పూరిలో వున్నదన్నారు. సరే పూరికి వెళ్ళాము. అక్కడే వేరొక ప్రక్కన తెర వెనుక సూర్య విగ్రహం ఉన్నది. ఆ సూర్యవిగ్రహం చూశాను. అది ఓకె. కానీ ఇవంతా భౌతిక ఉపాధులు మాత్రమే. పూరీలో 'శ్రీకృష్ణుడు, సుభద్ర, బలరాముల' దేవాలయం ఉన్నది. అక్కడ నుండీ రాగానే శంబళాలో ప్రకృతి సహజంతో ఉన్న మూడు శిలలను చూస్తూ వాటిని శ్రీకృష్ణుడు, సుభద్ర, బలరాములుగా గుర్తించారు. దగ్గరలో సూర్యదేవాలయం స్థాపించటానికి అనువుగా వున్న ఒక కొండ ప్రదేశాన్ని చూపించి అక్కడ సూర్య విగ్రహాన్ని పెట్టాలన్నారు. కానీ అది అక్కడున్న సూర్యుడు కాదు. కానీ కోణార్క దేవాలయంలోని సూర్యుడిలాగే వున్నది కానీ ఒక అంగం లేదు. మీలో వున్న అసలైన సూర్యుణ్ణి పట్టుకోవాలి. **దేవారాహ్ బాబాలాంటివారు పరమపూజ్య గురుదేవులను సాక్షాత్తు సూర్యునిగా అభివర్ణించి ఆయన ఉన్నవేపుకు తిరిగి సూర్యార్ఘదానం చేసేవారు.**

ఈనాడు గురుదేవులు "నేను మహాకాలుణ్ణి" అన్నారు. మహాకాలుడుగా "మహాజ్ఞానాన్ని

భగీరథుని వలె జ్ఞానగంగను ప్రవహింపచేసారు. ఆయన వచ్చేశాడు. యుద్ధం జరుపుతున్నారు. అదొక రివల్యూషన్."

"విచార క్రాంతి అభియాన్" అంటే ఆలోచనలలో విప్లవం. జనమానస పరిష్కారం, ఆలోచనలలో క్రాంతి తేవటానికే గురువులు రకరకాల ప్రయోగాలు చేశారు. ఈ మహాజ్ఞానాన్ని మనిషి, మనిషికీ అందించటానికే గురువులు, మొబైల్ ఫోన్‌లు, ఇంటర్‌నెట్‌లు, టి.విలను ప్రాచుర్యంలోకి తీసుకు వచ్చారు. **ఈ కొన్ని రకాల ప్రచార సాధనాలను జ్ఞాన వితరణకు మీరు ఉపయోగించుకున్నట్లయితే మీరు గురుదేవుల అంగ అవయవాలౌతారు. మళ్ళీమళ్ళీ చెప్తున్నా, ఆ జ్ఞానం ఉన్న ప్రతీ ఒక్కరు ఆయన పనులు చేయవచ్చు. ఈనాటి సాంకేతిక పరిజ్ఞానాన్ని గురువుల పనులకు బహుముఖీ ప్రజ్ఞతో ఉపయోగించుకోవాలని అనర్గళంగా చెప్పారానాటి ప్రవచనం.**

53. ఆదేశాలు

వెన్నాదేవి నుంచీ హైదరాబాద్‌కు వెళ్ళిన మాస్టరుగారు వారి తమ్ముడిగారి ఇంట్లో వున్నారు. మెల్లమెల్లగా శంబళలో నూతన నిర్మాణ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఎక్కడ ఉన్నా ప్రతీక్షణం గురుదేవుల కార్యక్రమాలను చేస్తూ సమాజ శ్రేయస్సు కోసం పాటుపడటమే తమ ధర్మంగా భావిస్తుండేవారు. 2012 సంక్రాంతి పండుగలైపోయిన తరువాత మళ్ళీ శ్వేతద్వీపానికి వచ్చేశారు.

జన్మశతాబ్ది అయిపోయింది. ఇంక పనేమీ లేదనుకుంటారు. కానీ అసలు పని ఇప్పుడే మొదలైంది. గురుదేవులు ఏపని మొదలుపెట్టినా వసంత పంచమి నుంచే ప్రారంభించేవారు. అలానే పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా జన్మశతాబ్ది కొనసాగింపు కార్యక్రమాలను తిరిగి 'ఓం'గోలు నుంచే మొదలుపెట్టారు. శ్రీరామచంద్రుని ధర్మబాణంలాగా శ్రీరామశర్మఆచార్య గురుదేవుల కార్యక్రమాలను శ్రీరామకృష్ణగారు పునఃప్రారంభించారు.

జన్మశతాబ్ది తరువాత చేయవలసిన పనులను గురించి చెప్పటానికి మళ్ళీ ఒక వరుస క్రమములో రోజుకు ఒకటి, రెండు గ్రామాలలో ప్రవచన కార్యక్రమాలను ఏర్పాటు చేయటం జరిగింది. ముందుగా 'సిద్ధిరాజు పీఠం' మేదరమెట్ల నుంచీ ప్రణాళిక ప్రారంభమైంది. అలా మెల్ల మెల్లగా ఒక రూటు మాప్ వేసుకొని వేటపాలెం, నందిరాజుతోట, రేపల్లె, ఉండవల్లి, సప్తర్షి ఆశ్రమం గుంటూరు, విజయవాడ, మొదలైన చోట్ల భవిష్యత్తులో చేయవలసిన కార్యక్రమాల

స్వరూప, స్వభావాలను నిర్దిష్టముగా చెప్పారు. విషయం ఒకటే అయినా మాస్టరుగారు ఒక్కొక్క చోట ఒక్కొక్క విధానంలో జనానికి అర్థమయ్యేలాగా చెప్పేవారు. మొత్తం విషయ సారాంశాన్ని ఆచరణ యోగ్యంగా పాయింట్ వైజ్‌గా ఇలా చెప్పారు. జన్మశతాబ్ది పనులు చాలా చెయ్యాలి.

(1) యజ్ఞాలు అవీ జన్మశతాబ్ది వరకు చాలానే చేశారు. తర్వాత కూడా వాటిని చేస్తూనే వుండండి. ఇంకా ఎక్కువ మంది యజ్ఞాలలో పాల్గొనేలా చెయ్యండి. 5 కుండీలు పెట్టమని నా సలహా. దానివలన చాలా లాభాలున్నాయి. ఎలాంటివారితో నైనా ఆహుతులు వేయించండి. బలవంతంగానైనా తీసుకువచ్చి ఆహుతులు వేయించండి. మీకు తెలియదు ఎందుకిలా చెప్తున్నానో. ఏ వూరి వాళ్ళు ఆ వూళ్ళలోనే ఒకటి, లేదా ఐదు ఇంకా కావాలంటే తొమ్మిది వరకు పెట్టుకొని యజ్ఞాలు చేసుకోండి. అంతకు మించి పెట్టవద్దు. యజ్ఞాలను ఆపవద్దు. వేర్వేరు ప్రదేశాలలో ఒక్క కుండీ అయినా పెట్టి యజ్ఞం చేసుకోండి.

(2) ఎంతో పెద్ద విద్య నేర్చుకోవాలన్నా కలము, కాయితం కావాలి గద. అలానే ఆధ్యాత్మిక విద్యకు – కలము – గాయత్రీ మంత్రము, కాయితం – యజ్ఞము.

ఇదంతా చెప్పటానికి సాందీపని ఆశ్రమం కావాలి. అవతారపురుషుడైన శ్రీకృష్ణుడు, బలరాముడులాంటివారు కూడా సాందీపని మహర్షివారి వద్ద విద్య నేర్చుకున్నారు. 64 రోజులలో 64 విద్యలు నేర్చుకున్నారు.

శ్రీరాముడు అస్త్రశస్త్ర విద్యలు విశ్వామిత్రుడి దగ్గర, యోగవాశిష్టములాంటి జ్ఞానాన్ని వశిష్టుడి దగ్గర నేర్చుకున్నాడు. ప్రస్తుతం నేను హైదరాబాద్‌లో సంజీవనీ విద్యను ప్రారంభించబోతున్నాను. శ్రీకృష్ణుడిలాంటి శిష్యులు లేకపోయినా సుధాముడిలాంటి శిష్యులున్నా చాలు. దానికి నాకు భవనాలేం అక్కర్లేదు. ఒక చిన్న గది ఉన్నా చాలు. ఆశ్రమాలలో కుటీరాలేగా ఉంటాయి. మాతాజీ శాంతికుంజ్‌లో ఒంటరిగా ఎలాంటి సాధన చేయించిందో, ఎలాంటి యజ్ఞశాల పెట్టిందో చూశారు గదా. అలానే నేను చేస్తాను.

సాందీపని ఆశ్రమంలో విద్యాభ్యాసం అంతా అయిపోయాక శ్రీకృష్ణుడు గురుదక్షిణగా చనిపోయిన గురుపుత్రుణ్ణి బ్రతికించి తెచ్చి ఇచ్చాడు. చనిపోయి తిరిగి వచ్చాడు, కనుకనే అతనిని 'పునర్దత్తుడు' అని పిలిచారు.

సాందీపని ఆశ్రమంలో చనిపోయినవాళ్ళను బ్రతికించే విద్యను నేర్పించాలి. మళ్ళీ ఇక్కడ కూడా గయ అంటే ప్రాణాలను 'త్రాయతే' అంటే రక్షించేది అనేగా. గాయత్రిని ఆ లెవల్‌లో చెయ్యాలి. ప్రస్తుతం 'నేను' ఈ సాందీపని ఆశ్రమాన్ని "వెబ్" ద్వారా ప్రారంభించబోతున్నాను. దానికి నా పిల్లలు నాకు సహాయం చేస్తారు. శ్రీమతి తేజశ్రీ ఈ వెబ్‌సైటును www.awgpsouth.org తయారుచేసింది. దానిలో ఈనాటికి గురుదేవుల సాహిత్యం, జ్వాలాకూల్‌మహర్షి సాహిత్యం, శ్రీఅరవిందులవారి సాహిత్యం మొదలైన వాటిపైన క్లాసులు జరుగుతున్నాయి.

(4) హైదరాబాద్‌లో 'శంబళా తీర్థం' అని పెట్టాను. భారతదేశంలో సాధారణంగా వీలైనంత మంది తీర్థయాత్రలకు వెళతారు గదా. తిరుమలలో ఎన్ని తీర్థాలున్నాయి. 360 తీర్థాలున్నాయి. అందుకే శంబళలో ఆశ్రమం కాకుండా తీర్థాన్ని పెట్టాను. దశావతార ప్రక్రియకు సంబంధించిన పరిక్రమాపథాన్ని ఏర్పాటు చేసాను. ఈ తీర్థానికి విశేషమైన శక్తి ఉన్నది. సెంటినరీ తరువాత చేస్తున్న దానినంతా 'వెబ్' లో పెట్టేస్తున్నాను. దానికి మీరు రాలేదు. అందుకే ఇలా కొంచెం, కొంచెంగా చెప్తున్నాను.

నాకు ఆరోగ్యం ఏమీ బాగోలేదు. అయినా పని చెయ్యాలి. సెంటినరీ అయిపోయింది. అమ్మయ్య అనుకోవద్దు. సెంటినరీ తరువాతనే చాలా చాలా పని వుంది. 'వసంత పంచమికి' మీరు ఇంకా ఏమి, ఏమి చెయ్యాలో చెప్తాను. ఈ యజ్ఞాలలో వచ్చి ఆహుతులు వేసుకున్నవాళ్ళే డి.యస్.వి.వి.తో అనుసంధానం అవగలుగుతారు. దానికోసం మీరు తప్పకుండా యజ్ఞాలలో పాలుపంచుకోండి.

(5) ఇంకో ముఖ్యమైన అంశం ఏమిటంటే 'పంచవీరభద్రా యూనివర్శిటీ' అనే పేరుతో ఒక యూనివర్శిటీని పెట్టాలి అని 27-01-2012న విజయవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో మాస్టర్‌గారు చెప్పారు. అక్కడ స్వర్ణయుగం సీతారాముడుకు నవయుగాన్ని నిర్మించేందుకు గురువుగారు తమ పంచవీరభద్ర సాధనతో సమాజానికి నేతృత్వం వహిస్తున్న 5 వర్గాల ప్రజల్ని మార్చడం ద్వారా (రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు, శాస్త్రవేత్తలు, కళాకారులు, సాహిత్యవేత్తలు) నవ యుగాన్ని నిర్మిస్తాను అని తెలిపారు. అందుచేత ఈ 5 వర్గాల నేతలను తీర్చిదిద్దటానికి 5 కోర్సులను ఈ యూనివర్సిటీ ద్వారా మనం అందజేద్దాం. స్వర్ణయుగ మాసపత్రికను నువ్వు ఈ

యూనివర్సిటీ మాగజైన్‌గా నడుపు. మాస్టారిగారి చెప్పిందేతడవుగా వారి అనుమతితో భీమవరంలో ఆ కోర్సును సీతారాముడుగారు ప్రారంభించారు.

54. భారతీయసంస్కృతి - యజ్ఞోపవీతము - పిలక

ఆధ్యాత్మిక జీవితానికి, భౌతిక జీవితానికి ఎలాంటి (లింక్) అనుబంధం లేదు. భారతీయ జీవిత విధానం గురించి ఈనాడు ఎంత మందికి తెలుసు. భారతీయత అనే విషయాన్నే మరిచి పోయాం. భారతీయ వేషధారణను పూర్తిగా మరచిపోయాము. పూర్తిగా యూరోపియన్ డ్రెస్స్ వేసుకుంటున్నాము. అందుకే మన జీవితం ఇలా వుంది. రోజూ వారి విధుల నిర్వహణలో ఆ వస్త్రధారణ చేసినా, కనీసం పూజా, యజ్ఞములు చేసే సమయంలోనైనా ధోవతీ, కుర్తాను ధరించండి.

భారతీయతకు, పిలకకు చాలా దగ్గర సంబంధమున్నది. అది భారతీయ సంస్కృతికి ధ్వజం. అలానే భారతీయ సంస్కృతికి యజ్ఞోపవీతానికి చాలా ప్రాముఖ్యత ఉన్నది. శిఖ, యజ్ఞోపవీతమూ లేకపోతే మీరు భారతీయులే కారు. చాణిక్యుడు 'శిఖ' అంటే పిలక ఉన్న వాడి దమ్మును చూపించాడు. ఒక సాధారణ బాలుడిని "చంద్రగుప్త మౌర్యుని"గా రూపొందించి సామ్రాట్‌గా చేసి తనకు కావలసిన దానిని సాధించాడు. మాస్టరుగారు పిలక గురించి కేవలం చెప్పటం మాత్రమే చెయ్యలేదు. చాలా రోజులపాటు పిలకను ధరించారు. ఆ శక్తితో వారు కొన్ని అసంభవాలను సంభవాలు చేయటం జరిగింది.

గురుదేవుల మీద మాకు ప్రేమ ఉన్నది అనే వాళ్ళందరూ ముందర పిలక పెట్టుకోండి. ఒక్క పిలక (చాణిక్యుడు) ఎందుకూ పనికిరాని చంద్రగుప్తుణ్ణి రాజును చేసింది. అదీ పిలక గొప్పదనం. పిలక రాజ్యాలను లేపుతుంది. అందుకే నేనూ పిలక పెట్టుకున్నాను. సవరణ-మాస్టారు ఎలాంటి పనులు చెయ్యాలన్నా సింబాలిక్‌గా దాని నమూనాను ముందర అక్కడ పెట్టి పనులు ప్రారంభిస్తారు. తర్వాత అవి చాలా వేగంగా ముందుకు వెళ్ళిపోతాయి. అందుకే 'పిలక'ను ప్రత్యామ్నాయ పద్ధతిలో ధరించారు. ఎలాంటి పనులు చేయాలనుకుంటే అలాంటి ఆయుధాలనే కదా వాడతారు.

ఒక్కొక్క పని నెరవేరాలంటే ఒక్కొక్క రకం వస్తువులను వాడతారు. శంఖం, చక్రం, గద, పద్మం వీటిని వాక్ సంయమనం, సమయ సంయమనం, ఇంద్రియ సంయమనం, అర్థ సంయమనాలకి

ప్రతీకలుగా వారు ధరించే చొక్కాల మీద ప్రింట్ వేయించమనేవారు. ఈ నాలుగు ఆయుధాలను ధరించటం వలన స్వసంరక్షణతోపాటు ఇతరులను రక్షించటానికి క్కూడా ఆయుధాల్లాగా వాడేవారు.

ఇంకొక్కప్పుడు వెండి కంచంలో అన్నం, వెండి గ్లాసుల్లో మంచినీళ్ళు తాగేవారు, అలానే కాఫీ, టీలు త్రాగేవారు. ఒక్కొక్కప్పుడు ప్లాస్టిక్ కంచాలు, గ్లాసులనూ అవే వాడేవారు. ఇదంతా ప్రకృతికి అనుసంధానంగా చేసే ఒక విచిత్రమైన ప్రక్రియ. ఇలా చెప్పాలంటే ఎన్నో సందర్భాలున్నాయి. సరే మళ్ళీ పిలక విషయానికి వద్దాము. ఆ రోజులలో చాణిక్యుడు పిలకను ఒక మహాసామ్రాజ్య నిర్మాణం కోసం ఉపయోగించుకున్నారు. మరి మాస్టరుగారు దేనికోసం పెట్టుకున్నారో మనకు తెలియదు గదా! దీనిని గురించి కాస్త వివేచన చేసినట్లైతే మనకు దొరికే సమాధానం గాయత్రీ హవనవిధిలో

'శిఖావందనం' అనే పేరుతో

చిద్రూపిణీ మహామాయే దివ్యతేజః సమన్వితే ।
తిష్ఠ దేవి శిఖామధ్యే తేజో వృద్ధిం కురుష్వమే ॥

అని మనకు జవాబు దొరుకుతుంది. దివ్యతేజో సంపన్నురాలైన ఆ మహాశక్తి "శిఖమధ్యలో" ఉండి మనకు జ్ఞానాన్ని, తేజస్సును వృద్ధి చేస్తుంది అని గదా అర్థం. అయితే మాస్టారు వర్తమాన కాలంలో జన్మశతాబ్దికి సంబంధించి చేయవలసిన అనేక పనులలో "వైజ్ఞానిక ఆధ్యాత్మికత" చాలా ముఖ్యమైన పని. ఆ విద్యను, ఆ జ్ఞానాన్ని సార్వజనీనం చేయటానికి మాస్టరుగారు ఈ పిలకను ఉపయోగించుకున్నారు. ఎందుకంటే ఒకానొక ప్రవచనంలో 'అందరినీ పిలకలు పెట్టుకోమని చెప్తూ' ఒక్కమాట అన్నారు. పిలకను మీరు కరెక్ట్‌గా పెట్టుకోగలిగితే మీరు గ్యారంటీగా నిజమైన సైంటిస్ట్‌లు అవుతారని చెప్పారు. ఈ నేపథ్యంలో వారీనాడు చేస్తున్న ప్రయోగం 'వైజ్ఞానిక ఆధ్యాత్మికత'. దాని మీద రకరకాల ప్రయోగాలు చేయటానికి వారు పిలకనుపయోగించుకుని ఉండి ఉండవచ్చు.

ఐన్‌స్టీన్ గొప్ప సైంటిస్ట్. అలాగే పూజ్యగురుదేవులు చాలా గొప్ప సైంటిస్ట్. దానికి మాస్టరు గారిచ్చిన చిన్న టెక్నిక్ ఏమిటంటే – రాత్రి నిద్రపోవటం ఎలాగో ఆలోచిస్తూ పడుకోండి. నిద్రలోకి వెళ్తున్నామా! పడుకొని నిద్రపోండి. నిద్రలోకి వెళ్ళకుండా ఒకే విషయం గురించి ఆలోచిస్తూ, ఆలోచిస్తూ సాధనా పథంలో పైకి వెళ్తే దానిని సమాధి అంటారు. అలాంటి వాళ్ళు సైంటిస్టు

లౌతారు. దీనికి అచంచలమైన ఇంటరెస్ట్, కుతూహలము, చెయ్యాలనే దీక్షతోపాటు క్వాలిటీ కూడా ఉండాలి.

సమయానికి విలువ డబ్బు:

ఈనాడు ఎవరి సామర్థ్యాన్ని బట్టి వారు ఉద్యోగాలు చేస్తున్నారు. ఉద్యోగాల బట్టి జీతాలు వస్తున్నాయి. అంటే ఇక్కడ టైం – సమయం – ప్రాణం అంటే డబ్బుగా చెప్పవచ్చు. బంగారానికి ఏ కాలంలో కూడా విలువ ఉన్నది. తులాభారంలో తులసి గొప్పా – బంగారం గొప్పా అంటే? నిజంగా తులసి గొప్పది అని తెలిసీ కూడా అసలు మీ ఇళ్ళల్లో తులసి చెట్టు పెట్టుకుంటున్నారా? నిజంగా మీరు తులసిని ఉపయోగించుకోగలిగితే చాలు గొప్పవాళ్ళైపోతారు. దీన్ని గురించి గురుదేవులు 'క్రాంతిధర్మ సాహిత్యం' 20వ పుస్తకంలో చాలా అద్భుతమైన సమాచారాన్ని అందించారు. సమయాన్ని మనం బంగారంగా మార్చుకుంటున్నాము. ఆ 24 గంటల కాలంలోనే. సమయం – బంగారం – తులసి. వీటిలో వున్న విలువలను అర్థం చేసుకోవాలి. ప్రాణాలు అంటే గయాన్ త్రాయతి ఇతి – గాయత్రీ అంటే ప్రాణాలను రక్షించేదేగా! నా జీవితంలో ఆశ్రమాల నిర్మాణం కోసం ఎన్ని లక్షలు వెచ్చించానో ! అదంతా తులసిని ఉపయోగించుకునే చేశాను. మీరూ తులసిని ఉపయోగించుకోవటం నేర్చుకోండి. గురుదేవులు తులసి గురించి చాలా విషయాలు చెప్పారు.

జన్మ శతాబ్దీ వారోత్సవాలను జనవరి 27 నుండి జరుపుకోవాలి. ఎక్కడి వాళ్ళనక్కడే జరుపుకోండి. ఆ సంవత్సరం వసంత పంచమి జనవరి 28న వచ్చింది. చీరాలలో శ్రీ డి.వి.ఆర్. మూర్తిగారు చేసిన 24 కుండీల యజ్ఞానికి మాస్టరుగారు వెళ్ళి, రాబోయే రోజులలో చేయవలసిన కార్యాచరణలను వివరించారు. అలానే రథసప్తమికి 108 సార్లు ఆదిత్యహృదయ పారాయణ చేసి, ఆవుపాలు పొంగలి మహాప్రసాదాన్ని చేయించి, మాస్టర్‌గారి ప్రవచనం అయ్యాక ఆ ప్రసాద వితరణ ఒక ఆనవాయితీగా నర్సింగపాడులో చేస్తారు. ఆనాటి ప్రవచనంలో మాస్టారు ఒక విషయాన్ని చెప్పారు.

2012 సంవత్సరాన్ని "సౌర సంవత్సరంగా" శాంతికుంజ్ ప్రకటించింది. రాబోయే రోజులలో సూర్యునిలో వచ్చే అతి తీవ్రమైన మార్పులకు, ప్రతీవారు తప్పనిసరిగా 11 మాలలు గాయత్రీ, ఒక్కమాల 'ఓం ఘృణిః సూర్యాయనమః' అనే సూర్యమంత్రాన్ని చెయ్యమని చెప్పారు.

ఉపాసన, సాధన, ఆరాధనలనబడే త్రిపుటిలో ఆరాధనలో భాగంగా వసంతపంచమి వరకు ఒక చక్రీయక్రమంలో అన్ని గ్రామాలలో సందేశాలనిస్తూనే, వ్యక్తిగత సాధనలో భాగంగా శ్రీ అరవిందులవారు వ్రాసిన "సావిత్రి" మీద రీసెర్చ్ వర్క్ ఒక నూతన వరవడిలో స్వాధ్యాయాన్ని ప్రారంభించారు. చాలా వేగంగా సావిత్రి తయారౌతున్నది.

ల్యాప్‌టాప్‌లో ఆ పుస్తకాన్ని చదువుతూ దానికి అనుసంధానమైన విషయాలు మరి ఏ ఇతర గ్రంథాలలో వున్నా వాటిని కూడా దానికి జతపరుస్తూ అందరికీ అది అర్థమయ్యేరీతిలో దానిని తయారుచేస్తున్నారు. ఈ పుస్తకాన్ని చేస్తున్న రోజులలో ఒక విషయాన్ని చెప్పారు. పరిణామక్రమంలో మత్స్యావతారం నుంచీ కల్క్యావతారం వరకు అందరికీ దశావతారాలు తెల్సు కానీ, ఇంకా రెండు అవతారాలున్నాయని చెప్తున్నారు.

"నేను ఇవ్వాళ 'సావిత్రి' బుక్ చదువుతున్నాను. ఒక స్టాంజాలో 'సోఽహం' గురించి అద్భుతమైన వివరణ చెప్పారు. అది పరిణామక్రమంలో ఖనిజ, వృక్ష, జంతు, మానవ శరీరాల దాకా వదలకుండా తన పనిని తాను చేస్తూనే వస్తున్నది. దానిని మనం పట్టించుకోవటం లేదు కానీ, అది మనలను పట్టించుకుంటూనే ఉన్నది. ఇవాళ నుంచీ నేను ఆ సాధన మొదలుపెడతానని" చెప్పారు. 'సావిత్రి' బుక్ మంచి వేగంతో ముందుకు నడుస్తున్నది. ఇంక బయట క్యాంపులకెళ్ళటం మానేశారు.

55. అడయార్‌లో మాస్టరుగారు

థియోసాఫికల్ సొసైటికి సంబంధించి 2011 డిసెంబర్ 29, 30, 31 తేదీలలో అడయార్‌లో అంతర్జాతీయ సమావేశాలున్నాయి. ఆ సమావేశాలకు వెళ్ళాలని మాస్టరుగారు చెప్పగానే వారితోపాటుగా శ్రీమతి శ్రీలక్ష్మి, చందన, మాణిక్యాంబగార్లు కూడా వెళ్ళటానికి సిద్ధపడ్డారు. అప్పుడు మూడు రోజుల నుంచీ విపరీతమైన వర్షం. ముఖ్యంగా చెన్నైలో 'సునామీ' రాబోతోందనే హెచ్చరికను కూడా చేసారు. వేటినీ ఖాతరు చేయకుండా మాస్టారు చెన్నైకి బయల్దేరారూ అంటే ఆ ప్రోగ్రాము ఎంత ముఖ్యమైందో మనకు అర్థమైపోతుంది. ప్రపంచం నలుమూలల నుంచీ 31వ తేదీ సాయంత్రం జరిగే మీటింగ్‌కు 27వ తేదీ నుంచీ అర్హులైన వారందరూ అడయార్‌కి చేరుతున్నారు. 30వ తేది ఉదయం 9 గంటలకు ప్రశ్నలు – జవాబుల కార్యక్రమము జరుగుతుంది.

తరువాత మేడమ్ రాధా బర్నియర్ గారి ప్రసంగం ఉంటుంది. అందరూ ఆ సమావేశానికి హాజరైనారు. టైం–టేబుల్ ప్రకారం కార్యక్రమాలన్నీ యథావిధిగా జరిగిపోయాయి. ఈ సమావేశం లోనే అగ్ని, ఆజ్ఞ, హీలింగ్, 9 నెలలు, సృష్టి అనే ఐదు పుస్తకాలను శ్రీమతి మాణిక్యాంబగారు, శ్రీ శ్రీమాస్టరుగారితో ఆవిష్కరించారు.

తదుపరి మాస్టరుగారు పుస్తకాల షాపుకు వెళ్ళి తమక్కావలసిన పుస్తకాలను కొనుక్కున్నారు. ఒక గంటసేపు సరస్వతీ దేవి మందిరంలాగా విరాజిల్లుతున్న థియోసాఫికల్ బుక్ షాపులో గడిపారు. తరువాత తప:స్థలిని చూడాలని బయల్దేరారు. తుఫాను జోరుగా కురుస్తున్నది. అయినా వాతావరణం చాలా ప్రశాంతంగా ఉన్నది. ప్రయాణంలో ఒంగోలు నుంచీ చెన్నైకి వచ్చే దారిలో ఆస్ట్రేలియా రెస్పాండ్ అవుతున్నది అన్నారు. 6వ రూట్ రేస్‌కి స్పందన. ఇక బీజము మొలకెత్తాలంటే దానికి తగినంత నీరు కావాలి గద. అలాగే చాలా మొక్కలు మొలకెత్తాలంటే చాలా నీరు అవసరం. అందుకే ఈ తుఫాన్ అన్నారు. ఈ పరిస్థితి ఒక్క ఇండియాకే పరిమితం కాలేదు. ప్రపంచం మొత్తం ఆ అనుభవాన్ని చవి చూచింది అన్నారు. (ఏ సందర్భాన్ని దర్శిస్తూ ఆ మాటలు అన్నారో అర్థం కాలేదు).

అంతటి తుఫాన్ కారణంగా థియోసాఫికల్ సొసైటీలో కార్యక్రమం రెండవరోజు క్యాన్సిల్ అయింది. అందుచేత ఫ్రీ మేసనరీ ఆలయాన్ని మూసివేశారు. కాని మాస్టారిని మాత్రం ఆలయంలోకి వెళ్ళనిచ్చారు. సాధారణంగా కొన్ని కొన్ని సమయాలలో మాత్రమే ప్రవేశం ఉంటుంది. అంతటి అననుకూల వాతావరణంలో కూడా అలాంటి పవిత్రమైన ఆలయంలోకి మాస్టారిని అనుమతించటం అనేది సాధారణమైన విషయంకాదు గదా. మాస్టారితోపాటు వెళ్ళిన శ్రీమతిమణి, శ్రీలక్ష్మి, చందనా వాళ్ళు కూడా ఆ ఆలయంలోకి వెళ్ళగలిగారు. అది నిజంగా వారి పూర్వజన్మల పుణ్యఫలం! ఇలాంటి చిత్రమైన సంఘటనే కాశీకి వెళ్ళినప్పుడు కూడా జరిగింది.

అధ్యాయం-5

నూతన ఆదేశాలు (2012)

56. వేసవిలో చల్లదనం

మహాత్ముల జీవితాలు ఎప్పుడూ మన ఆలోచనా పరిధికి ఆవలి ఒడ్డునే ఉంటాయి. సామాన్య మానవుడికి వారి జీవితాలు సుందరస్వప్నాల్లాగా కనిపిస్తాయి, వారిలో జరిగే నిరంతర సంఘర్షణను ఎవ్వరూ వూహించలేరు. కానీ వారి సన్నిధిలో అంతులేని శాంతి, నిష్కల్మషమైన వారి ప్రేమ అందరికీ చందనవృక్షంలాంటి చల్లదనాన్ని ప్రసాదిస్తుంటుంది. మహాత్ముల సన్నిధిలో పొందిన ఆ శాంతి, ఆనందాల కోసం, నిష్కల్మషమైన ఆ ప్రేమ కోసం మానవుడు అనేకవిధాలుగా జీవితమంతా అన్వేషిస్తూనే ఉంటాడు. అసలు అలాంటి శాంతి, ఆనందాలతో కూడిన జీవితం మనకు సాధ్యమేనా? అనేది అందరి మనస్సులను నిరంతరం వేధించే ఒక ప్రశ్న.

మహాత్ముల జీవితాలను చూస్తే అది సాధ్యమేననిపిస్తుంది. అలాంటి మహనీయుల సాన్నిధ్యాన్ని పొందగలిగిన వారి జీవితాలు ధన్యమనే చెప్పాలి. మహాత్ములకు మాత్రమే అలాంటి జీవితం ఎలా సాధ్యమైందీ అనే దానికి ఒక్కటే జవాబు. మహాత్ములందరి జీవితాలు చదివినప్పుడు ఒక్క విషయం మనకు అర్థమౌతుంది. భౌతిక జీవితంలో ఎటువంటి బాధలు వచ్చినా, కష్టాలు వచ్చినా వారు వాటిని తప్పించుకొని ప్రక్కకి పోవాలనుకోరు. ధైర్యంతో ఎదురీదుతూనే తమ లక్ష్యానికి చేరుకుంటారు. ఎలాంటి కష్టసమయంలో ఉన్నప్పటికీ ఎప్పుడూ వారు పరమాత్మతత్త్వంతో మమేకమై భాసిల్లుతూనే వుంటారు. ఇతరుల బాధలను తమవిగానే భావించి తగిన సహాయాలనందిస్తారు. అన్నీ, అంతా తానే అయి వుంటారు. కాబట్టే అందరినీ, అన్నింటినీ తమలా ప్రేమించగలగుతారు.

పూజ్యశ్రీమాస్టరుగారు ఎక్కడ వున్నా వారున్న చోటకు వారికోసం, ఎవరో ఒకరు వస్తూనే ఉండేవారు. వారి ప్రేమను చవిచూసిన వారందరికీ అంతకు మించిన ప్రేమ ఈ ప్రపంచంలో

అసాధ్యమనే విషయం ఎంతో స్పష్టంగా తెలిసేది. ఎంతో దూరాల నుంచీ తమను దర్శించటానికి వచ్చిన వారిని అంతులేని ప్రేమలో ముంచెత్తేవారు. అంతులేని ప్రేమ, సాక్షీభూతమైన పరమాత్మతత్త్వం రెండూ వారిలో కలగలసిపోయివుండేవి. ఎంతటి కొత్తవారినైనా ఆప్యాయంగా పలకరించేవారు. ఒక ఆప్తుడిగా అతి దగ్గర వ్యక్తిలాగా వ్యవహరించేవారు. ఇలా ఉండగలగటం అనేది ఒక్క పరమాత్మకు మాత్రమే చెల్లుతుందనేది నిర్వివాదాంశము. అలాంటి పరమాత్మ కూడా శరీరధారి అయినప్పుడు దాని ధర్మము ప్రకారం నడుచుకొని తీరాల్సిందే గదా! అలానే పూజ్యశ్రీ మాస్టరుగారు సాధనకు అనువుగా, వేసవిలో చల్లగా వుండే బెంగుళూరు వెళ్ళేవారు. అలా బెంగుళూరు వెళ్ళినప్పుడు అక్కడున్న అరవింద్ సొసైటీలో, అరవిందుల సాహిత్యంమీద ప్రవచనాలు చెప్తుండేవారు.

అలానే ఇంకా వేర్వేరు ప్రదేశాలలో వేరు, వేరు విషయాల మీద తమ అఖండ జ్ఞానామృతాన్ని అందరికీ పంచేవారు. మాధురీ వాళ్ళ కుటుంబంతో కలసి వారానికి, 10 రోజులకు ఆ చుట్టు ప్రక్కల వున్న మంచి, మంచి ప్రదేశాలకు చూట్టానికి వెళ్తుండేవారు. శ్రీశ్రీమాస్టరుగారు బెంగుళూరులో ఉన్న సమయంలో 1940వ సంవత్సరం నుంచీ ఉన్న అఖండజ్యోతి మాసపత్రికలను చదవటం మొదలుపెట్టారు. అందులో వారికి నచ్చిన విషయం "మెస్మరిజం". గురుదేవులు మెస్మరిజం గురించి చాలా ప్రాక్టికల్‌గా వ్రాశారు. దానిని నేను ముందు అర్థం చేసుకోవాలి కదా! తరువాత స్టెప్ బై స్టెప్ అందులో రాసినవి రాసినట్లు ప్రాక్టీసు చేస్తే రిజల్ట్ తప్పకుండా వస్తాయని చెప్తుండేవారు.

57. మహామంత్రం

పూజ్యగురుదేవులు 'మెస్మరిజం'లో చెప్పిన మహామంత్రం – Under grace of Param Pujya Gurudev in perfect ways - నా భౌతిక, ప్రాణమయ, మనోమయ శరీరాలన్నీ పర్‌ఫెక్ట్ ఆరోగ్యాన్ని కలిగి వున్నాయి. ఈ మంత్రాన్ని రోజుకు మూడుసార్లు చెప్పుకుంటే చాలు. కేవలం ఇది నీ కోసమే కాదు. ఇతరుల ఆరోగ్యము కోసము కూడా ఈ మహామంత్రాన్ని వాడుకోవచ్చు. కచ్చితంగా రిజల్ట్ వస్తుంది.

ఇంకా ఏం చెప్పారంటే 1971వ సంవత్సరం నుంచీ ఆయన చెప్పిన సాధనలన్నింటినీ నేను ఆ రోజులలో చేసేశాను. **సైన్సులో ఐన్‌స్టీన్ చెప్పిన ఎనర్జీ ధియరీ ఎలానో, పూజ్యగురుదేవులు**

ఆధ్యాత్మిక జగత్తులో చెప్పిన గాయత్రీ విద్య అలాంటిది. ఆయన చెప్పిన ప్రకారం రోజుకు 24 నిమిషాల సాధన చాలు. అయితే మనకేంటంటే 40 నిమిషాలు చెయ్యాలి. అదీ మీకు బాగా అలవాటుంది కాబట్టి అంత టైము చెప్తున్నాను. అంతకంటే మించి చెయ్యవద్దు. అప్పుడప్పుడు నేను, మీకు శ్రీఅరవింద్ ఇంకా కొంతమందిని పరమగురువుల గురించి చెప్తుంటాను గదా! వాటినన్నింటినీ ఇంక వదిలెయ్యండి. పరమపూజ్య గురుదేవుల తరువాత ఇంకో గురువురాడు.

గురుదేవుల అఖండజ్యోతి మాసపత్రికలలో ఇచ్చిన విషయాలన్నింటినీ చెప్పాలంటే నేను 720 క్లాసులు తీసుకోవాలి. ముఖ్యంగా ఒక వ్యాసంలోనైతే మొత్తం సైంటిఫిక్ స్పిరిట్యువలిజమ్ గురించి చాలా వివరంగా వ్రాశారు. అందరూ చదవండి, బాగా చదవండి. లక్షలాది మంది పాఠకులు ఈ విజ్ఞానాన్ని చదవాలి. దాని వలన మీకెంత జ్ఞానం వస్తుందో మాటలలో చెప్పలేను అంటూ ఒక చిన్న ఉదాహరణ చెప్పారు. కోపం వస్తే ఏమౌతుందీ, దాని వలన ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయనే దాని మీద ఇచ్చిన కొన్ని అంశాలను ఇలా చెప్పారు.

1940 ఫిబ్రవరి అఖండజ్యోతి, పేజీ 10లో ఇచ్చిన విషయాన్ని ప్రత్యేకంగా చెప్పారు. "కోపం" గురించి చెప్పిన విషయమది. విపరీతమైన కోపం వస్తే "ఏమౌతుంది" అనే దానిని గురించి డాక్టర్లు చెప్పిన సమాచారం –

బాగా కోపం వచ్చిన వాడి బ్లడ్ వెజల్స్ నుంచీ రక్తం తీసి ఒక కుందేలుకు ఎక్కిస్తే అది 10, 20 నిమిషాల పాటు అటు ఇటూ పరుగెత్తుకుంటూ వెళ్ళి ఒక కుక్కను తరిమింది. తర్వాత 35 నిమిషాల్లో తనను తానే కరుచుకుంది. ఒక గంటలో గిలగిలా కొట్టుకుని చనిపోయింది. కోపం అంత ప్రమాదకరమనటానికిది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే!

'కోపం' వచ్చినా నిగ్రహంతో ఎవరికి వారే శాంతపరచుకోవాలి. కోపం తగ్గాక హార్ట్ ఆ బ్లడ్‌ను శుభ్రపరస్తుంది. కానీ అది తర్వాత సంగతి. ముందు కోపాన్ని నిగ్రహించుకోవటం నేర్చుకోవాలి. కోపం గురించి బుద్ధ భగవానుణ్ణి ఎవరో అడిగితే "నన్నెవరైనా తిడితే వాటిని నేనుపట్టించుకోను. అవి నాకేమైనా అంటితే గదా! అలా ఎవరైనా తిట్టినా నాకే సంబంధమూ ఉండదు" అన్నారు. అలా చెప్పగలగాలి. అలాంటి వారిని కోపం ఏమీ చేయ్యలేదు. బాగా కోపంగా వున్నప్పుడు ఏమీ తినకూడదు. కోపంగా వున్నవారు వండకూడదు.

కోపంగా వున్న తల్లి, బిడ్డకి పాలు ఇస్తే ఒకానొక చోట బిడ్డ చనిపోయింది. ఇలాంటివి ఎన్నో

వుంటాయి. మీరు చదివితే మీకే అర్థమౌతుంది తప్ప నేను ఎంతని చెప్పేది. చదవండి మీకెంతో తెలుస్తుంది. చదవండి, బాగా బాగా చదవండి.

గురుపూర్ణిమకు బెంగుళూరు నుంచీ నేరుగా సప్తర్షి ఆశ్రమం గుంటూరుకు వచ్చేశారు. గురుపూర్ణిమకు గృహప్రవేశం. అప్పటికే మాస్టరుగారి కోసం శ్రీవిశ్వనాథ్‌గారు కట్టించిన ఆ ఇల్లు సకల సౌకర్యాలతో ఎంతో అందంగా తయారై ఉన్నది. ముఖ్యంగా లైబ్రరీ కోసం విజయావిశ్వనాథ్ కట్టించిన ఆ గది చాలా అద్భుతంగా వున్నది. గురుపూర్ణిమ ఇంకో 10 రోజులుంది అనగా బెంగుళూరు నుంచీ చందన, రాజీవ్‌గార్లు మాస్టర్‌గారిని తీసుకొని గుంటూరుకు వచ్చారు.

58. గురుపూర్ణిమకు గృహప్రవేశము

ఈ వసంత పంచమినాడు సూర్యదేవాలయముతోపాటుగా సప్తర్షి ఆశ్రమంలో మాస్టరు గారు ఉండటానికి ఒక చక్కటి ఇంటిని నిర్మించాలని విజయా, విశ్వనాథ్‌గార్లు సంకల్పం తీసుకొని ఇంక ఆనాటి నుంచీ ఆ పనిలోనే నిమగ్నమయ్యారు. 2012 గురుపూర్ణిమనాటికి అన్నిసౌకర్యాలతో అందమైన భవన నిర్మాణం చేశారు. ఆ ఇంటిలో 116 అరలు గల ఒక లైబ్రరీని కూడా ఏర్పాటు చేశారు.

సుమారు 12 సంవత్సరాల తరువాత సప్తర్షి ఆశ్రమంలో పూజ్యశ్రీ మాస్టరుగారి ఆధ్వర్యంలో గురుపూర్ణిమ వేడుకలు ప్రారంభమయ్యాయి. పూజ్యశ్రీ మాస్టరుగారు జూన్ 23వ తేది బెంగుళూరు నుంచీ సప్తర్షి ఆశ్రమానికి వచ్చారు. వారు తమతోపాటు కొత్తగా కొన్న పుస్తకాలు, స్ఫటిక లింగము మరియు చరఖాతో ఆశ్రమంలో వారి కోసం నిర్మించిన నూతన గృహములోకి ప్రవేశించారు. తరువాత సప్తర్షి ఆశ్రమంలో ఉన్న పంచలింగాల ధునిని అఖండజ్యోతిగా మార్చేశారు. రెండురోజుల పాటు ఆశ్రమాన్ని కలియ తిరిగి చేయవలసిన మార్పు చేర్పులను వాళ్ళ తమ్ముడి గారికి చెప్పి మళ్ళీ శ్వేతద్వీపానికి వచ్చేశారు.

2012 జూలై 1వ తేదికి మళ్ళీ గుంటూరుకు వచ్చారు. 2వ తారీఖున యుగంధర్‌గారు మౌంట్ శంబళ నుంచీ మాస్టరుగారి 14000 పుస్తకాలను తీసుకువచ్చారు. కొత్తగా కట్టిన లైబ్రరీలో మాస్టర్‌గారే స్వయంగా దగ్గరుండి వాటిని అరలలో సర్దించసాగారు. ఆ రోజు రాత్రి 10 గంటలకు మొదలు పెడితే ఆ పని మర్నాడు తెల్లవారుఝామున 5 గంటలకి పూర్తి అయింది. అంత పనిని

శ్రద్ధాభక్తులతో చేసిన వారికి మాస్టరు గారు ఎన్ని వరదానాల నిచ్చారో ఎవరికి తెలుసు. ఆ రోజు రాత్రంతా మాస్టరుగారు పడుకోకుండా వాళ్ళతోనే కూర్చొని కబుర్లు చెప్పుతూ ఆ పనిని పూర్తిచేయించారు.

పుస్తకాలు సర్దటం అయిపోగానే మాస్టారు, శ్రీ విశ్వనాథ్‌గారి కుటుంబం మిగతా పరివార్ సభ్యులతో గృహప్రవేశము చేసి, గాయత్రీ హవనం, సత్యనారాయణవ్రతం చేయించారు. ఈ రోజున ఆశ్రమంలో జరిగే కార్యక్రమాలన్నింటిని సుకృత, రమ్య, సమీర, తన్వీ, లావణ్య మొదలగు వాళ్ళు ఎంతో సమర్థవంతంగా చేసి మాస్టరుగారి మన్ననలను అపారంగా పొందారు.

ఉదయం 10 గంటల నుంచీ సాధనా శిబిరం ప్రారంభమైంది. ప్రవచనం ప్రారంభంలోనే మాస్టరుగారు క్రొత్తగా నిర్మించిన "సుకృత విల్లా" గృహప్రవేశ సందర్భంగా రెండు విషయాలను చెప్పారు. గృహప్రవేశసమయంలో ప్రతీవారు చేయాల్సినవి 2 పనులు.

(1) రాత్రి పడుకోబోయేముందు పడక గదిలో ఆగ్నేయ దిశలో కర్పూరం వెలిగించి ఆ అగ్నిని చూస్తూ పడుకుంటే ఆ అగ్నిలాగే మనమూ ఊర్ధ్వముఖులమౌతాము.

(2) గృహప్రవేశ సందర్భంలో "బాత్‌రూం" తలుపులు దగ్గరకూడా తప్పనిసరిగా నిమ్మకాయలను కొయ్యాలి. శరీరంలో ఉండే మాలిన్యాలను తీసివేసే బాత్‌రూం క్కూడ ఇంటిలో విశేషస్థానమున్నది.

గురుపూర్ణిమను పురస్కరించుకుని గురువుగారి జన్మశతాబ్దిని గూర్చి చెప్పారు.

ప్రతీ గురువుకూ ఒక పుట్టినరోజు ఉంటుంది. కానీ ఈ సంవత్సరం మన గురువుగారి శతాబ్ది ఉత్సవాలు పూర్తి అయ్యాయి. శతాబ్ది అనేది ఒక విలక్షణమైన, విశిష్టమైన జన్మదినము. ఇది గొప్పగొప్ప వ్యక్తులకు, విశిష్టమైన కార్యాలను చేపట్టిన వ్యక్తులకు మాత్రమే చేయబడుతుంది. ప్రతీ వారికి జీవితంలో ఒక్కసారి మాత్రమే శతాబ్ది జన్మదినం వస్తుంది. పూజ్యగురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య, తాను రెండు లక్షల మందిని, శతాబ్ది జన్మ దినోత్సవమును చేసుకునే వాళ్ళుగా తయారుచేసాను అని చెప్పారు. (జన్మ శతాబ్దికి హరిద్వారం వెళ్ళినప్పుడు)

అందులో లక్షమందిని నేను (మాస్టారు) ఆంధ్రప్రదేశ్‌లో తయారు చేస్తాను. అందులో మీరూ ఉంటారా? లేదా అనేది మీరు చూసుకోండి. గురుదేవుల స్థాయికి ఎదగటానికి అందరమూ ప్రయత్నం చెయ్యాలి. గురువుగారు ఎలాంటి దిశా, నిర్దేశాలనిచ్చారో అర్థం చేసుకొని దాని ప్రకారం పనిచేస్తే, ఆ లక్షమందిలో మీరూ ఒకరు అవుతారు.

ఇందుకు ముఖ్యంగా (1) సంజీవనీ సాధన ద్వారా మనం ఆ దిశా నిర్దేశాన్ని పొందగలము. ఇందుకోసం మనం గాయత్రీ జపము తప్పనిసరిగా చెయ్యాలి. శంబళలో "శ్రీరాజ్యలక్ష్మీ సావిత్రీ" స్థూపానికి శంఖుస్థాపన జరిగింది. అందరూ వ్రాసిన ఆ మంత్ర లేఖనాలను 'శంబళ'కు పంపాలి. ఒక లక్ష మందితో 10 కోట్ల మంత్ర లేఖనం 10 రోజుల్లో పూర్తి అయిపోవాలి.

లలితా సహస్రనామాలలో ఉన్న 'గాయత్రి నామాన్ని గురుదేవులు పట్టుకొని ఆ సాధనలు చేసి ఆ రహస్యాలనన్నింటినీ మనకందించారు. అలానే శ్రీ అరవింద్ 'సావిత్రి' నామాన్ని పట్టుకొని అనేక సాధనలు చేసి ఆ రహస్యాలను 'సావిత్రి' పుస్తకం ద్వారా మనకందించారు. వీరు ఇరువురు భారతదేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొని దేశమాతను దాస్య శృంఖలాల నుంచి విడిపించటానికి బహుధా కృషిచేశారు.

పూజ్యశ్రీమాస్టరుగారు బెంగుళూరు నుంచీ చరఖాను తెచ్చారు గద. ఇక్కడ దాని ప్రాశస్త్యాన్ని ఇలా వివరించారు. చరఖాను రాట్నం అని కూడా అంటారు. 'రాట్నం – చక్రం' ఈ పదాన్ని ఒకప్పుడు ఉపనిషత్తులో ఉపయోగించారు. దీనినే స్వస్తిక్ అని కూడా అంటారు. గాంధీగారు రాట్నాన్ని ఉపయోగించి మనకు స్వరాజ్యాన్ని తెచ్చారు. చక్రం ద్వారా ఇద్దరు విభిన్న భావాలున్న వ్యక్తులను మనం కలుపవచ్చు. అందుకని వీలైతే అందరూ రాట్నాన్ని ఇంట్లో పెట్టుకోండి. దీనిని ఎలా వాడుకోవాలో తెలియాలంటే గురుదేవుల వాఙ్మయం 'జీవనదేవతాసాధన' (హిందీ)లో ఉన్నది. దీనినే హిట్లర్ స్వస్తిక్ లాగా పట్టుకున్నాడు. మనం కూడా జీవన దేవతా ఆధారముతో లక్షలాది మందిని పట్టుకోవాలి. జీవనదేవతా సాధనలో గురుదేవులు స్వస్తిక్‌ను ఎలా వాడుకోవాలో చెప్పారు. స్వస్తిక్ వాడడం నేర్చుకుంటే అసాధ్యాలను సుసాధ్యాలుగా మార్చుకోవచ్చును. మన మీ స్వస్తిక్‌నుపయోగించుకొని లక్షలాది మందిని పట్టుకోవాలి.

దీని తరువాత రమణ మహర్షి సాధనలో భాగంగా 'నేనెవరిని', గురుదేవుల మొదటి పుస్తకం కూడా 'నేను ఏమిటి?' అనేదే. కారునడపటానికి పెట్రోలు అవసరం అయినట్లే మన జీవితానికి 'ప్రాణశక్తి' అవసరం. ప్రాణాయామం వలన ప్రాణశక్తి రాదు. శ్వాసను గమనించాలి. **ఎప్పుడూ ఏ పని చేస్తున్నా శ్వాసను గమనిస్తూ ఉండాలి. అలా గమనిస్తూ ఉండటం వలన సాధకులు 'సుషుమ్న' స్థితికి వెళతారు.** రమణమహర్షి, జిల్లెళ్ళమూడి అమ్మ ఎప్పుడూ వారీ స్థితిలోనే ఉండేవారు. భౌతిక శరీరానికి ప్రాణానికి సంబంధం లేదు.

పంచముఖ ముద్ర వేస్తే మృత్యువుని జయించవచ్చు

ఇంకా ఈ సాధనా శిబిరంలో "మెస్మరిజం" గురించి అద్భుతంగా చెప్పి వివరించారు. 1940వ సంవత్సరంలో అఖండజ్యోతి మొదటి సంచికలో గురుదేవులు 'మెస్మరిజం' గురించి వ్రాశారు. 14 వ్యాసాలను 14 సంచికలలో, దానికి సంబంధించిన సాధనలలో ఇచ్చారు. దానిని నేర్చుకోవాలంటే అసూయ, ఈర్ష్య, ద్వేషాలుండకూడదు. శ్రీకృష్ణుడు చెప్పిన గీతలో కూడ మెస్మరిజం వున్నది.

'భూర్భువః స్వః' అంటే జాగృతి, స్వప్న, సుషుప్తికి సంబంధించిన ఈ మూడు స్థితులలోనూ ఒకేసారి ఉండగలిగే జీవిత విధానమే 'ఓం' – ఈ స్థితిలో ఎల్లప్పుడూ ఉండటానికి సాధకులుగా ప్రయత్నించాలి మీరు. మనకి దేవతలలో కుమారస్వామి దగ్గర, శ్రీకృష్ణుడి దగ్గర మాత్రమే నెమలి, నెమలి పింఛము కనిపిస్తుంది. 'నెమలి' వుంటే 'ఓం'లో ఉన్నట్టు.

అలాగే ఆ క్యాంపులో గురుదేవుల వాఙ్మయాలు **1.చిరకాల యవ్వనము – శాశ్వత సౌందర్యము.**

2. సూర్యచికిత్సా విజ్ఞానము – రోగరహిత జీవనము అనే రెండు పుస్తకాలను తెలుగులోకి అనువదించి అచ్చువేయించి శ్రీమతి శ్రీలక్ష్మిగారు, తేజశ్రీ ఈ శిబిరంలో వాటిని మాస్టరుగారిచేత ఆవిష్కరింప చేశారు. వాటిలో అద్భుతమైన సాధనలు చాలా సులభంగా చేసుకునే విధానాలు ఇవ్వబడ్డాయి. ఇంకా సూర్యనమస్కారాల గురించి ఋషి అంటే ఎవరు అనే విషయాల మీద కూడా చక్కటి ప్రవచనాలను చెప్పారు.

పంచప్రాణాల మీద అత్యున్నత స్థాయీ ఆధిపత్యాన్ని సాధించినది వీరభద్రుడు. గురువుగారు అలాంటి పంచ వీరభద్ర సాధన చేసారు. ఈనాడు ఆ పంచవీరభద్రులు సమాజంలోగల ఐదు రకాల వ్యక్తులను సక్రమంగా పని చేసేలా చేస్తున్నారు.

గుంటూరు, సప్తర్షి ఆశ్రమంలో పంచవీరభద్ర విశ్వవిద్యాలయం పెట్టాననీ దానికి శ్రీ విశ్వనాథ్ గారు వైస్ ఛాన్సలర్‌గా వ్యవహరిస్తారనీ చెప్పారు. ప్రతీ రోజూ ఉదయం 10 గంటల నుంచీ సాయంత్రం 5 గంటల వరకు క్లాసులు జరుగుతాయి. **"వీర వెంకటసత్యనారాయణస్వామి" వ్రతాలు విరివిగా చెయ్యండి. ఈ వ్రతాల వల్ల సత్యయుగం వస్తుందని చెప్పారు.**

గురుపూర్ణిమ నాటి అర్ధరాత్రి పంచప్రాణాలను దీప్తివంతము చేసి, గురుశక్తిని మనకు ప్రసాదించే కొత్త మంత్రాన్ని దీక్షగా ఇచ్చారు. ఈ మంత్రము రోజుకు 5సార్లకి మించి చేయవద్దని, ఐదుసార్లు చేయటం వలన సాధకుని పంచప్రాణాలు యాక్టివేట్ అవుతాయి. ఈ సాధనలో అనుభూతిని ఎంత బలంగా ఉంటే గురుశక్తిని అంతగా ఆకర్షించుకోవచ్చు. సప్తఋషుల స్థాయికి తీసుకువెళ్ళే అద్భుతమైన శక్తిని ఈ మంత్రము ద్వారా గురుపూర్ణిమ ఆశీస్సులుగా గురుదేవులు మనకిచ్చారంటూ ప్రారంభించారు.

గురుపూర్ణిమనాడు చెప్పిన 32 అక్షరాల గాయత్రీ మంత్రాన్ని రోజూ చెయ్యాలి

ఈ గురుపూర్ణిమ పర్వదినాన ఒక విశేషమైన విలక్షణమైన మంత్రాన్నివ్వబోతున్నాను. 32 అక్షరాల గాయత్రీ మంత్రాన్నివ్వబోతున్నాను. ఒక లక్షమందిని శతాబ్ది పురుషులుగా తయారు చేసి గురుదేవులకి సమర్పించాలనేది నా లక్ష్యం. మీ జీవితాలు ఆ విధంగా మారాలి. దానికి ఈ గురుపూర్ణిమ కంటే మించిన తిథి లేదు. ఇప్పుడు మీకు 32 అక్షరాల రహస్యనామము ఇస్తున్నాను. ఈ మంత్రము మిమ్మల్ని "శతాబ్దీ పురుషులుగా" మార్చే రహస్యనామము. ఇరవై ఏళ్ళు కష్టపడి ఐన్‌స్టీన్ కనిపెట్టిన సిద్ధాంతాన్ని ఇప్పుడు అందరూ 20 నిమిషాల్లో నేర్చేసుకుంటున్నారు. అలాగే పూజ్యగురుదేవుల తపస్సు ఈ మంత్రములో ఇమిడి ఉంది అంటూ సప్తర్షి ఆశ్రమంలో ఈ మహామంత్రాన్ని దీక్షగా ఇచ్చారు.

ఓం భూర్భువః స్వః
తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి
ధియో యోనః ప్రచోదయాత్
ఆపోజ్యోతి రసోమృతం
గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।
గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః
భూర్భువః స్వః ఓం ॥

ప్రతీరోజూ ఐదుసార్లు ఈ మంత్రాన్ని చదవమన్నారు. తరువాత మౌనంగా కూర్చొని "గురువు గారు విశేషమైన శక్తిని ఇస్తున్నారు. గురుదేవుల శక్తి మీలోకి దిగుతున్నది" అని భావించుకోండి. సహస్రారం నుంచీ మీలోకి ఆ శక్తి ప్రవేశిస్తున్నదని దర్శించండి. గురువుగారి శక్తి, ప్రేమ, తపస్సు మీలోకి దిగుతున్నాయి. బాగా లాక్కోండి. ఒక స్పాంజ్ నీటిని పీల్చుకున్నట్లుగా పీల్చుకోండి. శక్తి వచ్చేస్తుంది. గురువుగారి శక్తి మీ శరీరం మొత్తంలోకి వెళుతోంది. ప్రతీ కణం ప్రకాశవంతమౌతుంది. మీరొక తేజోవలయంగా మారిపోయారు. శరీరానికి ఆ బరువు, ఆ ఒత్తిడి తెలియాలి. మీ శరీరం చుట్టూ ఆ తెల్లని తేజోవలయం ఆవరించి ఉన్నది. ఒత్తిడి వుంటేనే తపస్సు అంటాము. దానిని అనుభూతి చెందుతూ గురుదేవులకి భక్తితో నమస్కరించండి.

గురుర్బ్రహ్మా, గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః అనుకుంటూ ఈ తేజోవలయాన్ని ఊహించుకోండి. ఇలా చేస్తే కొన్నిరోజుల్లో మీరు తేజోవంతులుగా మారుతారు. ఈ గురువుగారి శక్తి లక్షమందిని తయారు చేస్తుంది. మొత్తము రహస్యము మీరు ఈ శక్తిని లాక్కోవటంలోనే వుంటుందని చెప్తూ అందరికీ మంత్రదీక్షను ఇచ్చారు. ఆ మరునాడు కూడా ఇదే మంత్రాన్ని ఐదు, ఐదు మంది చేత ఐదు, ఐదుసార్లు చెప్పించి అందరికీ నోటికి వచ్చేలా చేశారు. లక్షమంది సాధకులను తయారు చేయటానికి సరళమైన ఈ మంత్రాన్ని ఆ గురుపూర్ణిమ రోజునందించారు మన పరంధాముడు. అలా అనేక రకాల సాధనల ద్వారా గురుదేవులు కోరుకున్న లక్షమంది సాధకులను తయారుచేసి గురుదక్షిణగా ఇవ్వాలనే వారి సంకల్పం వీలైనంత త్వరలో పూర్తి చెయ్యాలనేది వారి ఆకాంక్ష.

మీ బాధలు నేను తీరుస్తాను

మీ ప్రతీ కోరిక తీరుతుంది. మీ బాధలు నాకు చెప్పకండి. కానీ బాధలు కచ్చితంగా తీరుతాయి. నన్ను తలుచుకొని మీ బాధను మనస్సులో అనుకుంటే చాలు. నా మీద నమ్మకముంటే సెట్ అయిపోతుంది. నాతో మీ బాధలు, కష్టాలు మాట్లాడకండి. దూరం నుంచే నమస్కారం చేసుకోండి. అనేక జన్మల నుంచీ మీరు నాతోనే ఉన్నారు. మీ బాధలు తీరుతాయి. కానీ నాకు చెప్పకండి. ఇంకా కావాలి అనుకుంటే శాంతికుంజ్‌కి వ్రాయండి. గురువుగారి దీవెనలతో నా దీవెనలు కూడా కలుస్తాయి. అడుక్కునే వారెవరూ నా దగ్గరకి రావద్దు. అంటూ ఆ రోజుప్రవచనాన్ని అంత ఘాటుగా చెప్పారు శ్రీరామకృష్ణగారు.

59. మౌంట్ శంబళ - ద గ్లోబల్ పవర్ సెంటర్

24 కోట్ల గాయత్రీ మంత్ర లేఖన మహాయజ్ఞము

గురుపూర్ణిమకు గుంటూరులో జరిగిన సాధనాశిబిరంలో 24 కోట్ల గాయత్రీ మహామంత్ర లేఖన మహాయజ్ఞమును గురించి మాస్టరుగారు వివరించారు. విశ్వశాంతి కోసము, విశ్వకుండలినీ జాగరణకై పూజ్యశ్రీ మాస్టరుగారు 24 కోట్ల గాయత్రీ మహామంత్ర లేఖన మహాయజ్ఞాన్ని సంకల్పించారు. దీనికి సంబంధించి 1008 మంత్ర లేఖనాన్ని పొందుపరచే మంత్రలేఖన పుస్తకాలను శ్రీ యుగంధర్ గారు సాధకులకు అందజేశారు.

శ్రీ రాజ్యలక్ష్మీ సావిత్రీ స్థూప శంఖుస్థాపన:

పరమ గురువుల మహాప్రేరణతో పూజ్యశ్రీ మాస్టరుగారి మహాసంకల్పముతో 24కోట్ల గాయత్రీ మహామంత్ర లేఖన మహాయజ్ఞానికి పూర్ణాహుతిగా, ఆ మంత్రలేఖన ప్రాణధారలు యుగ యుగాలకు అందించాలనే ఆలోచనతో "శ్రీరాజ్యలక్ష్మీ సావిత్రీ మహాస్థూప" స్థాపనకు శంబళ తీర్థమును మలిచారు.

మౌంట్‌శంబళ - ది గ్లోబల్ పవర్ సెంటర్, హైదరాబాదు నందు 2012 జూలై 1వ తేది ఆదివారము ఉదయం 10.45 నిమిషాలకు సుపర్ణ హాలు ప్రక్కనున్నటువంటి మహాయోగేశ్వరీదేవి శక్తి స్థలమునకు ఆగ్నేయమూల వేదమంత్రోచ్ఛారణలతో శంఖుస్థాపన జరిగింది. పూజ్యశ్రీమాస్టరు గారు లలితాసహస్రనామాలలోని 134, 135, 136 శ్లోకాలు ఈ స్థూపస్థాపన సంకల్పమైన విశ్వ కుండలినీ జాగరణకు, ఆత్మరాజ్యస్థాపనకు సమన్వయాన్ని కలిగిస్తాయనీ, ఈ శ్లోకాల సంఖ్యలో గల మహిమ 1+3+4 = 8 అష్టసిద్ధులకు, 1+3+5 = 9 నవ విధులకు, 1+3+6 = 10 దశావతారాలకూ ప్రతీకలుగా వివరించారు. తరువాత కాలంలో ఈ స్థూపం **విశ్వకుండలినీ గాయత్రీ మహాస్థూపముగా** రూపాంతరం చెందింది.

మేధాప్రదక్షిణ:

గాయత్రీ మంత్రముతో ఈ మూడు శ్లోకాలను సంపుటీకరణ చేసి జపం చెయ్యాలనీ, దీంతోపాటు శ్రీమహాయోగేశ్వరీదేవి శక్తిస్థలము చుట్టూ సాధకులు, పంచముఖ నమస్కార ముద్రలో అడుగులో అడుగు వేస్తూ ఒక కాలి బ్రొటనవేలు, ఇంకొక కాలి మడిమకు తగిలేటట్లు ప్రదక్షిణ చెయ్యాలని

చెప్పారు. దీనినే మేధాప్రదక్షిణ అంటారు. బొటన వ్రేళ్ళు ఆజ్ఞాచక్రంతో లింకప్పయి వుంటాయి. కనుక వాటి మీద ఒత్తిడి పెడుతూ ప్రదక్షిణ చేయటం వలన ఆజ్ఞాచక్ర జాగరణ జరుగుతుందనీ వివరించారు.

60. పోల్‌షిఫ్ట్

అది కార్తీక మాసం. ప్రకృతి ప్రసాదించిన వరంగా భావించి ఈ కార్తీక మాసంలో శివాభిషేకాలు, పూజలు విశేషంగా చేస్తుంటారు భక్తులు. గ్రామాలలోనైతే మన పరివార్ సభ్యులు సాధనలు, యజ్ఞాలు, దీపయజ్ఞాలు విశేషంగా చేస్తుంటారు. అప్పుడు మాస్టర్‌గారు హైదరాబాద్‌లో వున్నారు. ఆ రోజు కార్తీక పూర్ణిమ. ఒంగోలు గాయత్రీ మందిరంలో స్త్రీ, పురుషులందరూ సహస్ర దీపాలతో అలంకరణ చేస్తున్నారు. దీపాలు వెలిగిస్తున్న సమయంలో శ్రీమాస్టర్‌గారి నుంచీ ఫోను వచ్చింది. వెంటనే చేస్తున్న పని ఆపి ఫోను తీసుకుని "నమస్తే మాస్టారు" అన్నాను. వేరే ఏమీ మాట్లాడకుండా నేరుగా "నా గురించి నీకంతా తెలుసుగదా. ఇంక ఎక్కువ రోజులు ఉండను. నేను వెళ్ళే పరిస్థితులన్నీ నీకు తెల్సు గద. ఎలాంటి ఆర్భాటాలూ చేయకండి. అందరిలాగా అంతా మామూలు గానే వెళ్ళబుచ్చండి. మా తమ్ముడు విశ్వనాథ్‌కీ చెప్పాను. సైనిక్ పూరీలో వున్న వాడి ఇంటి దగ్గర అంతా అలానే వుంటుందన్నాడు. ఈ విషయం అందరికీ చెప్పవచ్చు. నా తరువాత విగ్రహాలు పెట్టండి. ఎలాగైనా పెట్టవచ్చు. మీకెలా పెట్టాలనిపిస్తే అలానే!" అంటూ అందీ, అందని విధంగా ఇంకా ఏదో కొన్ని విషయాలనలా చెప్తున్నారు. నాకు ఒక్కసారి వెన్నులోనుంచీ భయం వచ్చేసింది. కాళ్ళ క్రింద భూమి కదిలిపోతున్నదేమో అన్నంత వణుకు వచ్చేసింది. ఎలాగో సంబాళించుకొని గాయత్రీ మందిరం నుంచీ ఇంటికి వచ్చేశాను. ఎవరితో ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఎందుకైనా మంచిది, మాస్టారు అప్పుడు హైద్రాబాద్‌లో శ్రీవిశ్వనాథ్‌గారింట్లోనే వున్నారు. అందుచేత విశ్వనాథ్‌తో మాట్లాడితే విషయం అర్థమౌతుంది గదా అని వారికి ఫోన్ చేసి, మాస్టర్‌గారు ఎందుకిలా మాట్లాడుతున్నారూ విశ్వనాథ్, నాకు చాలా భయంగా వుంది, ఏమైంది, ఎందుకిలా మాట్లాడుతున్నారు, అని అడిగాను. దానికి వారు 'నీవేం కంగారు పడకు అక్కా – అన్నతో నేను మాట్లాడతాను. నేనున్నా గదా – ఎవ్వరికీ ఏమీ చెప్పవద్దు. నేను అన్నతో మాట్లాడిన తరువాత మళ్ళీ చెప్తాను' అని ఫోన్ పెట్టేశారు. ఈ సంఘటనకు సంబంధించి, కొన్నేళ్ళ క్రిందట జరిగిన ఒక విషయం చెప్తేనే గాని పైన చెప్పిన విషయాలు అర్థంకావు.

ఒకసారి మాస్టారికి అత్యంత సన్నిహితులైనవారు కొందరు, నాడీ గ్రంథాల జ్యోతిష్యాలయాలకి తాము వెళుతూ మాస్టారినీ తీసుకువెళ్లారు. అక్కడ అందరూ తమను గురించి జ్యోతిషం చెప్పించుకున్నాక మాస్టరుగారి జీవిత విశేషాలను తెలుసుకోవాలనే ఆసక్తితో వారు మాస్టరుగారికి సంబంధించిన గ్రంథాలను పరిశీలించమని నాడీ జ్యోతిషం వారిని కోరగా, వారు మాస్టరుగారికి సంబంధించిన గ్రంథాలను పరిశీలించి జరిగిన, జరుగుతున్న అనేక విషయాలను 'మాస్టారికి' చెప్పారు. అవన్నీ యదార్థాలే. అలానే నిర్యాణ విషయం గూడా చాలా విశేషంగానే చెప్పారు. అక్కడి నుంచీ వస్తూనే శ్రీరామసుబ్బయ్యగారు నాతో అక్కడ జరిగిన అన్నీ విషయాలను పూసగుచ్చినట్లు చెప్పారు. శ్రీమాస్టరుగారు దాన్ని గురించి ఫోనులో 'ఆ రోజు జరుగబోయేవి అన్నీ నీకు తెల్సు గద! అలా జరిపించు' అని చెప్పటం వినేసరికి నాకు మతి పోయింది. శ్రీవిశ్వనాథ్ విషయాన్ని కాస్త తేలిక పరిచేసరికి పరిస్థితి మామూలైపోయింది. కాని వారు చెప్పిన 'నా తదనంతరం నా విగ్రహాలు' పెట్టండీ అన్న విషయం నాతో తప్ప మరింకెవరికీ ఆ తరువాత చెప్పలేదేమో.

మళ్ళీ మరోసారి పూజ్యమాస్టారు ఫోన్ చేసి మరో ముఖ్యమైన విషయాన్ని చెప్పారు. 'ఈ సారి నా బర్త్‌డేని అక్టోబర్ 14వ తేదీన కాకుండా వినాయక చవితికి చేసుకోండి అన్నారు. ఎందుకు అని అడగటానికి ధైర్యం చాల లేదు.' ఎందుకలా చెప్పారని కాస్త బాధ పడ్డాను. అయినా మనస్సులో ఏదో చిన్న కినుక. ఇందులో ఏదైన లోతైన సత్యం ఉండే వుండి వుంటుంది. ఏమిటది? అని ఆలోచించి పూజ్యశ్రీమాస్టారి తమ్ముడు విశ్వనాథ్‌గారికి మళ్ళీ ఫోన్ చేశాను. వారు ఒక ప్రకృతి రహస్యాన్ని ఇలా చెప్పారు. శ్రీమాస్టరుగారు, విశ్వనాథ్‌తో చెప్పిన మాటలను ఇక్కడ పొందుపరుస్తున్నాము.

(1) పృథ్వీ గ్రహం యొక్క యాక్సిస్ మారిందిట. ఈనాడు మనం చూస్తున్న ఈ ఉత్పాతాలన్నింటికీ కారణం అదే. మహావతార్ శ్రీ మెహర్‌బాబావారు కూడా మౌనంలోకి వెళ్ళిపోయి, పృథ్వీగ్రహ గమనంలో ఒక విలక్షణమైన మార్పును తెచ్చారుట. అదే పనిని మాస్టరుగారు ఇప్పుడు చేస్తున్నారు. ఆనాడు ఆయన మౌనంతో ప్రకృతిని సరిచేస్తే, పూజ్యశ్రీ మాస్టారు పృథ్వీ తత్వానికి ప్రతీకయైన వినాయక చతుర్థిని, తమ జన్మదినంతో లింక్ చేసి ప్రకృతిలో అనుకూలమైన మార్పును దేనినో తెచ్చివుంటారు.

(2) పూజ్యశ్రీమాస్టరుగారి నివాసాన్ని బి.డి.ఆర్.కి మారుస్తున్నారుట.

(3) ఈసారి బర్త్‌డేను పి.1లో వినాయకచవితితోపాటు గురుదేవులసంస్కార పద్ధతిలో చేస్తారనీ విశ్వనాథ్‌గారు చెప్పారు.

ఈ పోల్‌షిఫ్ట్ గురించిన ఒక పరమసత్యాన్ని ఇక్కడ చెప్పాలి. మాస్టారప్పుడు సప్తర్షి ఆశ్రమాన్ని వ్యవస్థీకృతం చేస్తున్నారు. ప్రతీరోజూ విశేషమైన సాధనలు, ప్రవచనాలు విధిగా జరుగుతుండేవి. ఆ రోజు చెప్పిన ప్రవచనంలో మహర్లోక విజ్ఞానం, అర్థం కావాలంటే గాయత్రీ మంత్రమునెలా చెయ్యాలో చెప్పారు.

గాయత్రీ మంత్రాన్ని "భూః, భువః, స్వః" లోకంలోనే చేస్తున్నాం. మహర్లోకంలో గాయత్రీ మంత్రం చెయ్యటం రావాలి. అది ఎలా వస్తుందంటే గాయత్రీ చేసేవాళ్ళ సంఖ్య పెరిగితేనే వస్తుంది. స్పందనలు పెరుగుతున్న కొద్దీ మనం ఉచ్చలోకాలకి వెళ్ళ గలుగుతాం. అందుచేత మనం గాయత్రీమంత్రాన్ని ఒక విశాలమైన వర్గంగా తయారై కోట్ల, కోట్ల జపం చేసే వాళ్ళను తయారుచెయ్యగల్గాలి. ఆ విషయంలో మనమిక్కడ అగస్త్యమహర్షివారిని ప్రమాణంగా తీసుకోవాలి. వారు ఉత్తరభారత దేశంలో కోట్లసంఖ్యలో మంత్రజపం పూర్తిచేశారు. పృథ్వీగ్రహ సంతులనం కోసం వింధ్యపర్వతాలను ఉపాధిగా చేసుకొని ఇటు దక్షిణ భారతదేశానికి వచ్చారు.

పోల్‌షిఫ్ట్ మెడిటేషన్ :

కోట్ల, కోట్ల మంత్రజపంతో పృథ్వీ యొక్క సంతులనము మారుతూ ఉంటుంది. దానినే సైంటిస్టులు "పోల్‌షిఫ్ట్" అంటారు. అసలు పోల్‌షిఫ్ట్ అర్థమేమిటంటే ఉత్తరధృవం దక్షిణధృవంగానూ, దక్షిణధృవం ఉత్తరధృవంగానూ మారుతుంది. దానికి కావలసిన మెడిటేషన్ బ్లాక్‌ను ఒక దానిని మాస్టరుగారు తయారు చేయించి గుంటూరు, సప్తర్షి ఆశ్రమంలో దక్షిణం గోడ వైపున చాలా అందంగా వేయించారు. అందులో ఒక వైపున హిమాలయ పర్వతాలు, మరోవైపున వింధ్య పర్వతాలు, చివరిభాగంలో శ్రీశైలంవైపు నుంచీ తిరుమలవైపుకు హిమాలయాలు వెళుతున్న దృశ్యం, దాని మధ్యన నిలువెత్తు శ్రీవేంకటేశ్వరస్వామి. అలానే మరో వైపున దాదాగురుదేవుల దివ్య స్వరూపాన్ని, లాహిరీ మహీశయుల గుహను ఎంతో లైవ్‌లీగా వుండేలా పెట్టించారు. ఆ రోజులలో ఆ ధ్యానాన్ని చేయించేవారు. ఒకసారి అన్నారు, "అంత చేసినా ఎవరి బుద్ధి పలకలేదు. మామూలు బుద్ధే

లేకపోతే ఇంక మహాబుద్ధి ఎక్కడి నుంచీ వస్తుందీ? అయితే ఆ బొమ్మ వృధా అయిందనుకుంటారేమో, ఏమీ వృధా కాలేదు. ఎవరు ఎలా ఉపయోగించుకోవాలనుకుంటే దానిని అలా ఉపయోగించుకోగల్గుతారు. **నేను పెట్టినవన్నీ ఒక మహాబుద్ధితో పెట్టినవే గానీ, మామూలు తలంలో పెట్టినవి కావు. అవి ఎప్పటికీ నాశనంకావు. మహర్లోకంలో వున్నవి ఎప్పటికీ నాశనం కావు. కానీ మీరు వాటిని ఉపయోగించుకోలేకపోతున్నారని ఒకానొక ప్రవచనంలో చెప్పారు.**

61. త్రివేణీ పర్వం

ప్రతీ సంవత్సరం భాద్రపద శుక్ల చతుర్దశినాడు మూడు పర్వాలు కలిసి వస్తాయి. 2002వ సంవత్సరంలో మొట్టమొదటిసారిగా ఎఱ్ఱబాలెంలో గణేశ నవరాత్రులు అయిపోయాక

(1) అనంతపద్మనాభ వ్రతాన్ని అందరిచేతా మాస్టారు చేయించారు.

(2) సరిగ్గా అదే రోజున వారి తల్లిగారి శ్రద్ధాంజలి.

(3) అలానే భాద్రపద పౌర్ణమినాడు మాతాజీ నిర్యాణం చెందిన రోజు. ఆ తిథి కూడా కాస్త అటూ, ఇటూగా అదే రోజున వస్తుంది. అలా ఈ మూడు పర్వాలు ఒకే రోజున వస్తాయి. అందుచేత ప్రతీ సంవత్సరం మాస్టరుగారి సమక్షంలో 'ఈ త్రివేణీ సంగమ పర్వాన్ని' శ్రద్ధతో అందరూ చేసుకుంటారు. సామూహికంగా అందరూ అనంతవ్రతం చేసుకున్నాక, శ్రద్ధాంజలీ కార్యక్రమాన్ని శ్రీశ్రీ మాస్టరుగారిచేత శ్రీ సత్యనారాయణ మాస్టారు 'గురుదేవుల సంస్కార ప్రకరణ' పద్ధతి ప్రకారం చేయిస్తారు. ఆ కార్యక్రమం అయిపోగానే అందర్నీ లలితాపారాయణ చేయమనేవారు. అనంతరం ముత్తయిదువులకి పసుపు కుంకుమలిచ్చి, ఎంతో భక్తిశ్రద్ధలతో భోజన ప్రసాద వితరణతో ఆ కార్యక్రమమును ముగించేవారు. ఇలా ప్రతీ సంవత్సరం జరుగుతుంది.

పూజ్యశ్రీమాస్టరుగారు ఎక్కడ వున్నా తప్పనిసరిగా ఈ కార్యక్రమాన్ని 'శ్వేతద్వీపం' లో చేసుకునే వారు. ఆ సంవత్సరం కూడా తల్లిగారి తిథి రోజున తర్పణ చేయటం కోసం 2012వ సంవత్సరం సెప్టెంబర్ 8వ తేదీ సాయంత్రానికి గుంటూరు నుంచీ ఒంగోలుకు వచ్చారు. తెల్లారితే తల్లిగారి ఆబ్దికం. ఆ రోజు రాత్రి తెల్లవార్లూ పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యగురుదేవుల సంకల్పమైన సత్య యుగ స్థాపనకు చేయవలసిన వివిధ ప్రణాళికలను చాలా స్పష్టంగా వివరించారు. అన్నీ చేయవలసినవే, అతి తక్కువ సమయంలో చేయగల సాధనలు. సంక్షిప్తంగా వాటి సారాంశము ఇలా వున్నది.

(1) ప్రతీ ఇంటిలోనూ తులసి కోట పెట్టుకోవాలి. ఒక రాజ్యాన్ని కోట ఎలా రక్షణ చేస్తుందో, తులసికోట ఇంటికి అలాంటి సంరక్షణ చేస్తుంది. ఎలాంటి దుష్టశక్తులు ఇంటి లోపలికి రాకుండా ఆపగలిగే శక్తి తులసికి ఉన్నది. "అవతార్" సినిమాలో దీని గురించి 'కొన్ని ముఖ్యాంశాలు' సూత్రప్రాయంగా ఇవ్వబడ్డాయి, చూడండీ అర్థమౌతాయి అని చెప్పారు.

(2) ప్రపంచంలో బంగారంతో సమానంగా తూచగలిగే శక్తి ఒక్క తులసికి మాత్రమే వున్నది. దానికి ప్రత్యక్ష సాక్ష్యం శ్రీకృష్ణ తులాభారం. భక్తి అనే తులసి దళంతో యోగీశ్వరుడైన శ్రీకృష్ణ పరమాత్మను పట్టుకోగలిగింది రుక్మిణి. అది అందరికీ సాధ్యమే! అఖండ ఐశ్వరాలను, ఒక్క తులసి దళాన్ని భగవంతుడికి సమర్పించి పొందవచ్చు. గుంటూరు ఆశ్రమంలో తులసి కోట ఉండేది. ఆ ప్రదేశంలో ఒక నూతన నిర్మాణం చెయ్యాలని, ఆ కోటను తీసెయ్యమని చెప్పాను. ఎంత ప్రయత్నించినా దానిని ఎవ్వరూ ఎత్తలేకపోయారు. నేను వెళ్ళి 'లేపరా' అన్నాను. 10 సెకండ్లలో అది లేచిపోయింది. అందులో నేను ఉపయోగించిన టెక్నిక్కుని కాస్త మనస్సు పెడితే మీరూ చేయగలరు.

(3) ఇంక మూడో పాయింటు బుద్ధునికాలంలో బౌద్ధారామాలతో పాటుగా బౌద్ధ స్థూపాలను ఎలా స్థాపించారో, అలాగే "గాయత్రీ స్థూపాలను" మొత్తం ఏ.పి.లో 49 వేయిస్తాను. 49 అగ్నులకు ప్రతీకలుగా 49 స్థూపాలను కట్టించాలి. దీనికి "రాం రమా పతీ బ్యాంక్"లో మాదిరి ముందుగా 'గాయత్రీ మంత్రానికి" డ్రాఫ్ట్ ఇస్తాను. ప్రతీ స్థూపం క్రింద 24 లక్షల గాయత్రీ మంత్ర లేఖనాలు పెట్టాలి గద. దానికి ఇన్ అడ్వాన్స్‌గా ఈ డ్రాఫ్ట్ ఇస్తాను.

రాం రమాపతి బ్యాంక్ పరిచయం:

'రాం రమాపతి బ్యాంక్' గురించి ఇక్కడ పాఠకులకు కాస్త వివరణనివ్వాలి. వారణాసిలో దశాశ్వమేధ్‌ఘాట్‌లో రాం రమాపతి అనే పేరుతో ఒక విశేషమైన బ్యాంక్ గత 91సంవత్సరాలుగా పని చేస్తున్నది. మహత్తరమైన చరిత్ర గల ఈ బ్యాంక్‌లో డబ్బు కాకుండా భక్తులు వ్రాసిన రామకోటినే కరెన్సీగా ఇక్కడ డిపాజిట్ చేస్తుంటారు. భక్తి మూలధనం కాగా, మనశ్శాంతి వడ్డీ. ఊర్ధ్వగతులకు ఇదే పెట్టుబడి. ఇక్కడ డబ్బుకు బదులు రామనామం లోన్‌గా లభిస్తుంది. భక్తులు తమ అవసరాన్ని బట్టి, వాళ్ళ కష్టాలను తీర్చుకోటానికి అవసరమైనంత రామనామాన్ని ఋణంగా తీసుకొని మళ్ళీ వచ్చే రామనవమికి తాము తీసుకున్న రామనామాన్ని వ్రాసి ఈ బ్యాంక్‌లో జమ చేస్తారు.

ప్రతీ శ్రీరామనవమికి భక్తులిక్కడికి వచ్చి తాము వ్రాసిన రామనామ లిఖితపత్రాలను డిపాజిట్ చేస్తారు. ఇక్కడ డిపాజిట్ చేయబడిన లిఖిత రామ నామ సంఖ్య ఎంతో తెల్సా – 19, 18, 87, 75000 కోట్లు. అలాగే 19 బిలియన్ల పంచాక్షరీ లిఖిత పత్రాలు ఇక్కడ భద్రపరచబడి వున్నాయి. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఈ బ్యాంకు నుండీ రామనామాన్ని ఓవర్‌డ్రాఫ్ట్ ఇస్తారు. వారి కష్టాలు తీరాక 8 నెలల్లో 1లక్షా, 50వేల మంత్రం వ్రాసి శ్రీరామనవమికి ఇక్కడ దానిని డిపాజిట్ చేస్తారు. అలాంటి సంస్థతో మాస్టారికి ఎంతో దగ్గరి అనుబంధం వుండేది. ఆ అనుభవంతోనే మాస్టారిక్కడ గాయత్రీ మంత్రానికి నేను ఓవర్‌డ్రాఫ్ట్‌గా ఇస్తానన్నారు. అదీ అసలు కథ.

పూజ్యగురుదేవులు సంవత్సరానికి 24 లక్షల జపం చేశారు. ఆ లెక్క ప్రకారం ఈ స్థూపాల క్రిందన ఒక్కొక్క దాంట్లో 24 లక్షల జపం భూగర్భంలో పెట్టాలి. దాని మీద గాయత్రీ స్థూపాలను కట్టించాలనేది మాస్టరుగారి సంకల్పము. హిమాలయాలలో 10 వేల అడుగులు, 12 వేల అడుగులు గల స్థూపాలున్న ఆశ్రమాలున్నాయిట. వాటి సూక్ష్మశక్తిని గురుదేవులు శాంతికుంజ్‌లో స్థాపించిన "దేవాత్మ హిమాలయాల"లో ప్రతిష్ఠించి ఉంటారు. ఇంకా ఇలా చెప్పారు.

24 కోట్ల మంత్ర లేఖనాలను భూగర్భంలో స్థాపించి శంబళలో గాయత్రీ స్థూపాన్ని పెట్టాలను కున్నాను. అది అయ్యాక అక్కడ ఒక హుండీని పెట్టిస్తాను. తిరుమలలో హుండీలో డబ్బు వేసినట్లుగా, ఈ హుండీలో మంత్ర లేఖనాలు వేయ్యాలి. ఏ ఊరి వాళ్ళు స్థూపాలు పెట్టాలనుకుంటున్నారో వాళ్ళు, వాళ్ళు వ్రాసిన మంత్ర లేఖనాలు తెచ్చి ఇక్కడ హుండీలో వేసి, మళ్ళీ వాటిని తీసుకువెళ్ళి, వారి వారి వూళ్ళల్లో భూగర్భంలో వాటిని స్థాపించి దాని మీద స్థూపాలు కట్టుకుంటారు. ఈ విధంగా శ్రీవేంకటేశ్వరస్వామిని – గాయత్రీగా మారుస్తున్నాను అని చెప్పారు.

శ్రీవేంకటేశ్వరస్వామిని, గాయత్రిగా మార్చటం అంటే ఏమిటి? అనే ప్రశ్న రావచ్చు. వేంకటేశ్వరస్వామి కలియుగ దైవం. ఎవరికి ఏ ఆపద వచ్చినా తక్షణమే 'ఏడుకొండలవాడా, వేంకటరమణ, ఆపదమొక్కుల వాడా, వడ్డీకాసులవాడా, ఆదుకోవయ్యా' అంటూ ముడుపులు కట్టటమనేది మన సాంప్రదాయం. కష్టాలు తీరిన వెంటనే తిరుపతికి వెళ్ళి వీలైతే తలనీలాలు ఇచ్చి, ఆ ముడుపులను హుండీలో వేసి స్వామివారికి తమ అనంతకోటి కృతజ్ఞతలను తెలుపుకొని వస్తారు. ఇంక ఇక్కడ విషయానికి వద్దాము.

గాయత్రీ అంటే ప్రాణవిద్య. ఈ సమస్త విశ్వంలోని ప్రాణకోటి అంతా ఆ ప్రాణశక్తి ప్రభావంతోనే జీవిస్తోంది. ఆ ప్రాణశక్తి ప్రభావమనేది దశదిశలా ప్రఖరంగా ఉండి అందరికీ ఆ జీవనీశక్తిని, ఆ అంతర్ఊర్జాను, ప్రాణవిద్యుత్తునూ, యోగాగ్నినీ, బ్రహ్మజ్యోతినీ ప్రాణులందరికీ సమానంగా పంచిపెట్టేస్తుంది. వీటితో పాటు ప్రముఖంగా కుండలినీశక్తిని సాధనాత్మకంగా అందించే ఒక అద్భుత ప్రయోగంగా లక్షలాది మందిచేత మంత్రలేఖనాలు వ్రాయించి వాటిని శంబళలో ఏర్పాటు చేసిన హుండీలో వేసి తిరిగి వాటిని తీసుకువచ్చి ఆయా గ్రామాలలో భూమిలో నిక్షిప్తం చేసి దాని మీద స్థూపం కట్టాలనేది మాస్టరుగారి ప్రణాళిక. ఏదైనా ఒక ఊరివారు ఒకవేళ అనుకున్న సమయానికి మంత్రలేఖనం సంఖ్య వ్రాయించటం పూర్తికాకపోతే, కొరతపడ్డ గాయత్రీమంత్ర లేఖనానికి 'గాయత్రీడ్రాఫ్ట్' తీసుకొని (అంటే కొరతపడ్డ మంత్రలేఖనాలను శంబళ హుండీ నుండీ తీసుకొని) వీలైనంత త్వరలో ఆ మంత్రలేఖనాలు వ్రాయించి వాటిని శంబళలో పెట్టిన హుండీకి జమ చేయించటం జరగాలి. దానినే ఇక్కడ మాస్టరుగారు 'శ్రీవేంకటేశ్వరస్వామిని గాయత్రిగా మారుస్తున్నాను' అనే మాటలోని అంతరార్థం. ఈ మంత్ర లేఖనాలను వ్రాయటం వల్ల అనేక ప్రారబ్ధకర్మలు తొలగిపోయి పనులు సానుకూలమవుతాయి. ఈ కార్యక్రమం శంబళలో ఇప్పటికీ కొనసాగుతున్నది. అక్కడ ఒక అందమైన పద్మాన్ని, గాయత్రీ మంత్రలేఖనాలను పొందుపరచేందుకు ఒక అందమైన గదిలా కట్టించారు.

ఈ స్థూపాలకు ప్రతీరోజు ప్రదక్షిణలు చేస్తే సమస్యలు తీరిపోవటంతో పాటు కోరికలూ తీరుతాయి. ముఖ్యంగా ఈ స్థూపాలు కుండలినీశక్తి జాగరణకు శక్తికేంద్రాలుగా ఉపయోగపడతాయి. దానికి మీరు కోట్లు ఖర్చు చెయ్యక్కర్లేదు. అతి తేలిక ఖర్చుతో వాటిని కట్టించుకోవచ్చు.అలా 49 స్థూపాలు అందంగా కట్టాలి. చాలా అందంగా అంటే స్థూపాన్ని చూడగానే ప్రదక్షిణలు చేస్తే బావుండన్న భావన వచ్చేటంత అందంగా కట్టించాలి. మళ్ళీ, మళ్ళీ చెప్తున్నాను అవి కుండలినీ సాధనకు కేంద్రాలుగా ప్రాచుర్యంలోకి రావాలి. అన్నీ పెట్టటం అయిపోయింది.(ఇక్కడ మాస్టర్‌గారు వాటిని మనోమయతలంలో పూర్తి చేశారు) ఇంక వాటిని మీరే ప్రాచుర్యంలోకి తేవాలి. దానికి మీరు కాస్త కష్టపడితే చాలు. అనుకున్న వాటిని చాలా సులభంగా పెట్టేయవచ్చు.

"శ్రీ మహాకాల గురుదేవాయ శరణం మమ" ఇది శంబళ ఆశ్రమానికిచ్చిన మంత్రం. ఆ రోజు అలా చెప్పారు. తరువాత అనేక మార్పులు జరిగాయి. వైజ్ఞానిక, ఆధ్యాత్మిక సాధనలో భాగంగా అన్నమయ శరీరానికి సంబంధించిన (స్థూల శరీరపరంగా) సాధనగా దీనిని చేస్తారు.

దీని తరువాత ప్రాణమయ, మనోమయ కోశాల (ఏంజిల్స్) పరంగా సప్తఋషులతో సప్తర్షి ఆశ్రమంలో సాధన ప్రారంభిస్తాను. **ఋషి అంటే ఏమిటి? ప్రాణాలు అని కదా అర్థం. సప్త ఋషులు 7 ప్రాణాలు.** అయితే ఈ సప్తఋషులు యుగయుగానికి మారిపోతుంటారు. ఇంక ఆ సాధనలకు సప్తర్షి ఆశ్రమంలో మూడు రోజులలో బీజారోపణ చేసేస్తాను.

(4) తులసి పెట్టి దానిని ఉపయోగించుకోవటం వస్తే బంగారాన్ని తూచవచ్చు. నేను గుంటూరు ఆశ్రమంలో శిరిడీసాయిని ఆ మానసిక స్థితిలో (మూడ్) పెట్టాను. ఒకప్పుడు గుంటూరులో త్రాగటానిక్కూడా నీళ్ళుండేవి కావు. ఇప్పుడు పుష్కలంగా నీరు వచ్చేసింది. నేనున్నంత వరకూ ప్రాణశక్తి అలా వుంటూనే వుంటుంది. నేను చేయటం అయిపోయింది. మీరు దానిని డెవలప్ చేసుకోవాలి.

ప్రాణశక్తి మీద సాధనను పెంచుకోవాలి. రేపు నేను గుంటూరుకు వెళతాను. వెళ్ళిన వెంటనే 16 వ తేదీన గాయత్రీ స్థూపాన్ని వేసేస్తాను. 'మణిపూరక – అనాహత' ఈ రెండింటినీ కలుపుతూ నల్గురు, నల్గురుతో దీనిని ఏర్పాటు చేస్తాను. ఇంక మీరు దానిని ఉపయోగించుకోవటమే!

(5) గురుదేవుల జన్మశతాబ్ధి సమారోహంతో 'సత్యయుగం' పని ప్రారంభమైంది.

గురువు అంటే మహః స్థాయీ – మన గురువుగారు మహాకాలుడు.

ప్రస్తుతం – ఓం భూర్భువఃస్వః – జరుగుతున్నది. ఇంక 'మహః' స్థాయి రావాలి. దానిని తీసుకువచ్చేశామంటే ఇంక అప్పుడు అంత హెవీవర్క్ వుండదు. దాని తరువాత ఏమిటి? పంచ వీరభద్ర యూనివర్శిటీ పని చూడాలి. క్లాసులు పెట్టాలి. సత్యయుగం వరకూ ఈ బ్రెయిన్‌తోనే పని చేశాను. (స్ట్రోక్ వచ్చాక మాస్టరుగారు జ్ఞాపకశక్తిని చాలా కోల్పోయారు. అయినా ఎంతో కష్టపడి జన్మశతాబ్ధి కోసం పనిచేశారు.) తరువాత ఏం చేస్తానో తెలియదు అన్నారు. ఇలా ఆ రోజు రాత్రి తెల్లవార్లూ అనేక కార్యాచరణ విధానాలను చెప్తూనే ఉన్నారు.

62. మీరూ సైంటిస్ట్‌లైపోతారు

"గురుదేవుల జన్మ శతాబ్ధి" అనుయాజ కార్యక్రమాలనన్నింటినీ హిమాలయాల మాదిరి ఉన్నతంగానూ, గంగానదిలా పవిత్రంగానూ, సముద్రంలాగా ఎంతో అగాధంగానూ ఉండేలా

చెయ్యటమనేది ఒక్క మాస్టరు గారికే చెల్లింది. ఆయన ఒక సైంటిస్ట్‌గా, ఒక ఆధ్యాత్మికవేత్తగా చేసే ప్రతీ పనినీ ఎంతో నిశితంగా, సూక్ష్మంగా చేసేవారు. ఎంత దాచుకుందామనుకున్నా దాగని దివ్యత్వం ఆయన అణువణువలోనూ స్పష్టంగా దర్శనమిస్తుండేది. అలలుప్పొంగే సముద్రంలాగ ఒక్క క్షణమైనా తీరిక లేకుండా బహుముఖీ పనులను చేపట్టేవారు. గురుపరంపరలోని పరమ గురువులందరి సాధనలను ఏదోవిధంగా గురుదేవుల వాఙ్మయంతో అనుసంధానం చేసి కొత్త సాధనలను చెప్పేవారు. నదులన్నీ వచ్చి సముద్రంలో కలిసినా సముద్రం ఎప్పుడూ గంభీరంగా తొణక్కుండా వున్నట్లే, శ్రీశ్రీమాస్టరుగారు కూడా అంతమంది గురువులందించిన విశిష్టసాధనలను అంతరంగంలో ఆచరిస్తూ, అణువంతకూడా బయటకు కనిపించకుండా పరమశాంతిని ప్రదర్శించే వారు.

ఎటు నుంచీ చూసినా వారొక నిర్వికల్ప సమాధిస్థితిలో వుండే యోగి. సాక్షాత్ అవతార పురుషులు. ఎఱ్ఱని దీపంలో నీలరంగు దీపం దాగున్న మాదిరి ఆ పరమాత్మ యొక్క భగవచ్చేతనత్వంతో అంతర్లీనంగా వుంటూ బయటకు సాధారణ వ్యక్తిలాగా కనిపించేవారు. ప్రవర్తించేవారు. అందరితో మమేకమై పోయి ఉండేవారు. కబుర్లు చెప్తూ అందరినీ మాయలో పడవేస్తుండేవారు. అయితే ఒక్కొక్క సందర్భంలో సాక్షాత్ భగవంతుని యొక్క ఆ పరమశాంతి, పవిత్రశక్తి, తేజస్సు, ఆనందమంతా రాశి పోసిన సగుణ చేతనత్వంగా దర్శనమిస్తుండేవారు. సహస్రశీర్షా పురుషః - అయిన ఆ పరమాత్మ యొక్క దివ్యదర్శనం రకరకాల భంగిమల్లో వారిలో దర్శనమిస్తూండేది. ఇది ఒక అక్షర సత్యం. అందరికీ అనుభవమైన పరమసత్యం. అమందానందమైన నిత్యసత్యమిది.

అయినా ఎంతటి మహాత్ములైనా మహానుభావులైనా శరీరంతో భూమ్మీదకు వచ్చాక వారికీ శరీరపరమైన అనారోగ్యం ఏదో ఒక రూపంలో వారిని బాధిస్తూనే ఉంటుంది. ఆదిశంకరులు భగంధర వ్యాధితో ఎంతలాగా బాధపడ్డారో వర్ణించలేము. అయినా వారు తమ దిగ్విజయయాత్రలను ఆపలేదు. శ్రీరామకృష్ణపరమహంస రాచపుండుతో బాధపడుతూనే, వివేకానందుల వారికి చెప్పాల్సిందంతా శక్తిపాతంలో ఇచ్చేసి శరీరాన్ని వదిలివేశారు. అలానే స్వామీ వివేకానంద, రమణ మహర్షి, జిల్లెళ్ళమూడి అమ్మ వీరంతా భౌతిక శరీరం ఏదైతే ఉందో దాని నియతిని తప్పకుండా అనుభవించేశారు.

అలానే పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా, మనం కారణాలు ఎన్ని చెప్పినా, వారూ శారీరకంగా అనేక రకాలుగా బాధలను అనుభవిస్తుండేవారు. చూసేవాళ్ళకు అది ఎంతటి దుర్భరపరిస్థితో వర్ణించలేము. 2012లో శతాబ్దీ పనులు చాలావరకు పూర్తిచేశారు. మళ్ళీ పడిపోయారు. ఈసారి జిందల్‌లో ఏ విధమైన ప్రకృతి వైద్యం చేశారో దానిని పునఃప్రారంభించటం, అలానే ఆహార నియమాలను తు.చ. తప్పకుండా పాటించటంతో మళ్ళీ వారి ఆరోగ్యం కాస్త మెరుగుపడింది.

శ్వేత దీపంలోనే ఉంటున్నారు. కార్యకర్తలు వస్తుండేవారు. వాళ్ళకు చెప్పవలసిన పనులను వారికి యథాతథంగా చెప్పి పంపుతుండేవాళ్ళు. బయటఊళ్ళకు వెళ్ళటం మానేశారు. కానీ ఒంగోల్లో కిశోర్ వాళ్ళింట్లో నూతనంగా ప్రారంభించిన థియోసఫీ క్లాసులకు వెళ్ళి చెప్తుండేవాళ్ళు. ఇంతలో దత్త జయంతి వచ్చింది. క్రిందటి సంవత్సరంలాగే వెన్నాదేవి కార్యకర్తలు వచ్చి "ప్రథమ వార్షికోత్సవానికి మీరు రావాలని" మాస్టారిని ఆహ్వానించారు. 2012 డిసెంబర్ 27వ తేదీ 'రాత్రి గల పూర్ణిమ' – దత్త జయంతికి మాత్రం వెన్నాదేవికి వెళ్ళారు. అక్కడ లలిత అనే అమ్మాయి ప్రజ్ఞామండలి స్థాపించి చాలా చురుగ్గా కార్యక్రమాలు చేస్తున్నది. ఈ మధ్య శ్రీశ్రీమాస్టరుగారు ఎక్కడికి వెళ్ళినా ఒక్కటే సాధనను రకరకాలుగా చెప్తుండేవారు.

సాధన

(1) "ఉదయాన్నే లేచి గురుదేవుల వాణితో 24 సార్లు గాయత్రీమంత్రాన్ని ఉచ్చరించాలి. తరువాత 'తీన్ శరీర్‌కా ధ్యాన్' (3 శరీరాల ధ్యానం) తప్పకుండా చెయ్యాలని చెప్తున్నారు. **ప్రతీవాళ్ళూ దానిని చెయ్యాలి. అది సాధకుని భౌతిక, ప్రాణమయ, మనోమయ శరీరాలను ఫర్‌ఫెక్ట్ చేస్తుంది. స్థిరమైన ఆరోగ్యానిస్తుంది. ఈ సాధనను చేస్తే మీరు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కంటే పెద్దవాళ్ళైపోతారు. త్రిమూర్తులైనా సరే వాళ్ళు వాళ్ళ పనులను మాత్రమే చేస్తారు.** కానీ పంచేంద్రియాలతో సృష్టించబడిన మనిషి ఈ ఐదు ఇంద్రియాలను ఎంత ఉన్నతస్థాయిలోనైనా ఉపయోగించుకోవచ్చు. పంచేంద్రియాల జ్ఞానంతోనే గదా సైంటిష్టులు ఈ స్థాయికి ఎదిగారు. **ఈ మూడూ శరీరాల ధ్యానాన్ని క్రమం తప్పకుండా చేస్తే ఎవ్వరైనా సైంటిస్టులైపోతారు. ఆధ్యాత్మిక వైజ్ఞానిక శాస్త్రవేత్తలై పోతారు. ఈ శత జయంతి ఉత్సవాలకు గురుదేవులు ఇచ్చిన బహుమతి అది!!** గురుదేవులు మిమ్మల్ని హైలెవల్‌లో పెట్టేశారు. సాధారణంగా భౌతిక జగత్తులో శాస్త్రవేత్తలందరూ కలసి ఒక విషయం మీద రకరకాల ప్రయోగాలు చేసి ఆశించిన ఫలితాన్ని పొందాక దానిని ఒక ఫార్ములా(సూత్ర) రూపంలో ఇస్తారు.

అలానే గురుదేవులు ఆధ్యాత్మిక జగత్తులో ప్రతిపాదించిన అద్భుతమైన ఫార్ములా,

1. తీన్ శరీర్ కా ధ్యాన్. దీంతోపాటు మీరు చేయవలసిన రెండవ సాధన –
2. మాతాజీ వాణితో గాయత్రీ మంత్రాన్ని జ్యోతి సమైక్యతతో ఉచ్చరించాలి. దీనిని జ్యోతి అవతరణ సాధన అంటారు.
3. "నాదయోగ సాధన" – సాయంత్రం 6 గం॥లకు తప్పనిసరిగా ఈ నాదయోగము వినాలి. ఇలా మీరందరూ కలిసి ఈ 3 రకాల సాధనలను చేస్తే కొద్దిరోజులలోనే మీరూ 'ఆధ్యాత్మిక వైజ్ఞానికత' ను పట్టుకోగలుగుతారు. ఆధ్యాత్మికతలో సైంటిస్ట్‌లు లేరు. ఋషులు మాత్రమే వున్నారు.

గురుదేవులు 'ఆధ్యాత్మిక వైజ్ఞానిక శాస్త్రవేత్త', ఈ యుగఋషి. ఈ వర్క్‌ను గురుదేవులు నాకు హరిద్వార్‌కు వెళ్ళినప్పుడు చెప్పారు. నీవు తప్ప ఈ పనిని ఇంకెవ్వరూ చేయలేరు. ఈ ఆధ్యాత్మిక వైజ్ఞానిక విజ్ఞానాన్ని నీవే చెప్పాలి అన్నారు. ఆయన చెప్పారు అంటే అది జరిగి తీరాల్సిందే కదా!

మానవజాతిని సరిచెయ్యటానికి ఈనాడు ఋషులందరూ బయటకు వస్తున్నారు. అందుకే ఈనాడు సైన్సు అనేక రకాలుగా అభివృద్ధిలోకి వస్తున్నది. గమనించగలిగితే అది మీకూ అర్థమౌతుంది అంటూ ఆ పూర్ణిమనాటి చల్లని వాతావరణంలో ఇంత చక్కటి ప్రవచనాన్ని చెప్పారు.

క్లాసు అయిపోయాక శివతాండవ స్తోత్రం సి.డి. పెట్టమన్నారు. ఆ స్తోత్రాన్నివింటూ అందరినీ డాన్సు చెయ్యమన్నారు. డాన్సు చెయ్యటానికి కొందరు మోహమాటపడుతున్నారు. వారిని ఉద్దేశించి శివతాండవస్తోత్రం ఒక్కటి చాలు. ఆ డాన్సు మిమ్మల్ని దాటించేస్తుంది. అనేక ప్రారబ్ధ కర్మల నుంచీ దాటించేస్తుంది. చచ్చిపోతున్నాను అనే పరిస్థితిలో కూడా నేను చేస్తాను. ఆ డాన్సును రేపు చేస్తాంలే అంటారు మీరు. రేపు ఉన్నదా అసలు? జంప్ చెయ్యాల్సిందే! ఈ క్షణంలోనే జంప్ చెయ్యండి.

ఇంటరు చదివేవాడికి బి.యస్.సి. క్లాసులను ఎలా చెప్పగలను? రెండు క్లాసులూ నేను చెప్పాలంటే చెప్పలేనుగదా! (పాఠకులు అర్థం చేసుకోవాలి దయచేసి) మీకు తెలియదు. ఈ శివతాండవ స్తోత్రం పూజ్య గురుదేవులతోపాటే వచ్చింది. ప్రతీరోజూ నాదయోగ సాధన అయ్యాక

ఈ సి.డి.ని పెట్టుకొని మీరు డాన్సు చెయ్యండి అని చెప్తూ మాస్టారు అందరి చేత శివతాండవ స్తోత్రంతో డాన్సు చేయించారు. ఆ రాత్రికి అక్కడ వుండి మరునాడు ఉదయానికి ఒంగోలుకు వచ్చేశారు.

63. నా గురుదేవులంత వాళ్ళు కావాలి

పూజ్యశ్రీ మాస్టరుగారి పుట్టినరోజు వస్తూందీ అంటేనే అది అందరికీ ఆనందదాయకమైన విషయం. ఆ వేడుక ఎక్కడ ఏ వూరిలో జరిగినా, అది ఎంత దూరమైనా సరే, అనంతమైన భక్తిశ్రద్ధలతో భక్తులు వస్తారు. ఆయన జన్మదినం ఎంతో ప్రియమైనది, ప్రత్యేకమైనదీ ఇంకా ఎంతో పవిత్రమైనదీ కూడా! కారణం వారే, మన దైవం, తల్లి, తండ్రి, గురువు ఇంకా ఆత్మీయుడూ కూడా! వారిని మించిన అండ మనకు ఇంక ఎక్కడ నుంచి వస్తుందీ! అందుకనే వారి జన్మదినం ఎప్పుడు వస్తుందా అని భక్తులు ఎదురుతెన్నులు చూస్తుంటారు. ఆ శుభ సమయం వచ్చేసరికి అందరి హృదయాలు ఆనందంతో పొంగిపోతాయి. ఆ రోజున వారిచ్చే లీలాశ్రవణంలో లీనమై మనలను, మనమే మరచిపోతాము. అలాంటి సమయంలో మనం వారికి సర్వసమర్పణా భావంతో "స్వామీ మీరే నా సర్వస్వం" – అని మనసారా అనుకోగలిగితే జీవితం ధన్యమైపోతుంది. ఇదే మనం వారికి ఇవ్వగలిగిన నిజమైన పుట్టినరోజు కానుక.

అసలు వారి దివ్యసన్నిధిలో ఉండటమనేది ఎన్నోజన్మల పుణ్యఫలం. ఇంక వారికి 'సేవ' చేయగలిగే భాగ్యం దొరికితే మాటల్లో వివరించలేని మధురానుభూతి అది. అంతటి అదృష్టం మనకు కలుగటానికి కారణం కూడా వారి అనుగ్రహంగా మాత్రమే గుర్తుంచుకోవాలి. ఆ అనుగ్రహాన్ని నిరంతరం మనస్సులో నింపుకుంటూ వారి సన్నిధిలో కానీ వారి ఆదేశానుసారంగా గానీ, ఎక్కడ ఎప్పుడు ఏపని చేయగలిగినా, అది వారి జీవితాలను ధన్యం చేస్తుంది. అహంకార, మమకారాలను కనీసం ఆ క్షణంలోనైనా విడిచిపెట్టి దొరికిన సువర్ణ అవకాశాన్ని ఉపయోగించుకొని సేవ చేయటం నా అదృష్టం అని మురిసిపోతూ ఆ పనిని చేసినట్లైతే ఎవ్వరైనా సరే పవిత్రులైపోతారు. అలాంటి దివ్యమానసికస్థితిలో, ఏదో ఒక సేవ చెయ్యాలనే తపనతోనే అనేకమంది పవిత్రాత్మలు ఆ క్షణంలో అక్కడకు వచ్చి అనంతమైన సేవ చేస్తుంటారు. 'సేవ' అనేదానికి ప్రత్యేకమైన నిర్వచనం చెప్పలేం. ఏ పనినైనా సరే, అది మాస్టరుగారి పట్ల ప్రేమతో చేస్తే అది సేవే అవుతుంది. అలాంటి భావనతో సేవ చేసిన వారు నిజంగా అదృష్టవంతులు.

ఈసారి పూజ్యశ్రీ మాస్టరుగారి జన్మదిన వేడుకలు సప్తర్షి ఆశ్రమం గుంటూరులో మహోత్సాహంతో ఏర్పాటు చేశారు శ్రీవిశ్వనాథ్‌గారు. జన్మశతాబ్ది సమారోహం తరువాత వచ్చిన జన్మదినం కాబట్టి వారి సందేశాన్ని వినాలనే అపేక్షతో అన్ని వూళ్ళ నుంచీ భక్తులు ఎంతో ఉత్సాహంతో వచ్చారు. విజయా, విశ్వనాథ్‌గార్లు కూడా ఎంతో భారీగానే ఏర్పాట్లు చేశారు. **ఉదయం 10 గం.లకు మాస్టర్‌గారి జన్మదిన వేడుకలు ముందుగా జన్మదిన సంస్కారంతో ప్రారంభమైంది. సంస్కార మహోత్సవం ఎంతో పద్ధతిగా జరిగిపోయింది.**

జన్మదిన సంస్కారానికి రావటానికి ముందుగానే మాస్టరుగారు 'ఇవాళ వచ్చిన వారి అందరి చేతికి తలా ఒక కొవ్వొత్తినివ్వండి' అని చెప్పారు. సరే ఆ ఏర్పాట్లను చేస్తూవున్న ఆ కాస్త సమయం లోనే అందరినీ సమావేశపరచి అనంతపద్మనాభవ్రతానికి ఒంగోలుకు వచ్చినప్పుడు మాస్టరుగారు చెప్పిన విషయాలన్నింటినీ కూలంకషంగా ఇలా చెప్పాను.

(1) ప్రతీ ఇంటిలో తప్పనిసరిగా తులసికోటను పెట్టుకోవాలి.

(2) 49 అగ్నులకు ప్రతీకగా ఆంధ్రప్రదేశలో 49 గాయత్రీ స్థూపాలను కట్టించాలి.

(3) "భటకా హువా దేవతా" అంటే దారి తప్పిన దేవత అని అర్థం. దీనికి సంబంధించిన సాధనను గురుదేవులు శాంతికుంజ్‌లో సవితాదేవి మందిరంలో ఒక గోడకు 5 నిలువుటద్దాలను పెట్టించి ఒక్కొక్క దాని మీద ఒక్కొక్క వేదమంత్రాన్ని 1) సోఽహం, 2) శివోఽహం, 3) సచ్చిదానందోహం, 4) అయమాత్మా బ్రహ్మ, 5) తత్త్వమసి. ఈ సూత్రాలను చిన్న స్టిక్కరు మీద వ్రాసి వాటిని ఇంట్లో అద్దాలమీద అంటించుకొని ప్రతీరోజూ ఈ మంత్రాలను మననం చెయ్యాలి.

(4) దీని తరువాత సత్యం, ప్రేమ, న్యాయం అని వ్రాయబడిన జెండాలను ప్రతి ఇంటి మీద ఎగరాలని చెప్పారు. దీనిలోని పరమార్థం ఏమిటంటే గురుదేవులు వ్రాసిన 18 సత్సంకల్పాలను

మొదటి 6 – సత్యం

రెండవ 6 – ప్రేమ

మూడవ 6 – న్యాయం

ప్రతీరోజూ సత్సంకల్పాలను చదవాలనీ చెప్పారు. వీటిని శ్రీరంగనాయకులు గారే తయారు చేయించి ఆ రోజునందరికీ ఇచ్చారు. చివరగా పంచవీరభద్రా యూనివర్శిటికీ సంబంధించిన సమాచారాన్ని అందరికీ అర్థమయ్యేలా వివరించాను. ఇలా అంతా చెప్పటం అయిపోగానే పూజ్యశ్రీ మాస్టరుగారు వేదిక మీదికి వచ్చేసారు.

పుట్టినరోజు సందర్భంగా వేసుకున్న నూతన వస్త్రాలలో, ఎంతో హుందాగా వేదిక మీదికి వచ్చారు. వారి చిరునవ్వులు చూస్తూనే అందరూ మైమరిచిపోతారు. వెన్నెలు కురిపించే ఆ దివ్య మంగళవిగ్రహాన్ని అలా కన్నార్పకుండా తదేక ధ్యానంతో చూస్తునే ఉంటారు. పూజ్యశ్రీ మాస్టరు గారిలో ఏదో తెలియని దివ్య ఆకర్షణ అందరినీ సమ్మోహితులను చేస్తుంది. ఆయన చెప్పే ప్రవచనం ఎంత మంది మనసుల్లోకి వెళుతుందో తెలియదు కానీ, వారి దివ్యదర్శనం మాత్రం అందరి హృదయాలలోకీ వెళుతుంది.

వేదిక మీదికి వస్తూనే అందరినీ దీపాలు వెలిగించమని చెప్పారు. అందరికీ దీపాలకు బదులు అగరుబత్తీలు ఇవ్వగా వాటిని వెలిగించి చేతులో పట్టుకొని కూర్చున్నారు. ఇంక ఆనాటి సందేశాన్ని ప్రారంభించారు. **మీరంతా నావాళ్ళే. అలా దీపాలు వెలిగించిన మీరందరూ నా గురుదేవులంత వాళ్ళు కావాలి.** గీతలో శ్రీకృష్ణుడు "కాలోస్మి" అన్నాడు, అంటే 'కాలాన్ని నేనే' నని అన్నాడు. పూజ్యగురుదేవులు "నేను మహాకాలుణ్ణి" అన్నారు. అంటే అర్థం భూర్భువః స్వ ఃతలాలను దాటి 4వ తలం 'మహః' – ఆ తలానికి సంబంధించిన మహాపురుషుడు గురువుగారు. దానికి సాధనలను ఇస్తాను ఇవాళ.

భూర్భువః స్వఃఈ మూడు కలిపితేనే 'ఓం' –

జాగృత్, స్వప్న, సుషుప్తావస్థలను (దాటిన తరువాత) కలిపితేనే తురీయస్థితి. ఇందులో

జాగృత్ – అందరికీ తెలిసినదే

స్వప్న స్థితిలో ఎవరి కలలను వారే చూస్తారు.

నిద్రలో ఏం తెలియదు. అంతా బ్లాంక్.

వీటిని భూః, భువః, స్వః అని సంకేతాత్మకంగా చెప్తారు. ఈ మూడు కలిసిన 'ఓం' ఒక మహామంత్రము. ఈ మూడు కలిస్తేనే ఎవ్వరైనా 'ఓం'కు వెళ్ళగలుగుతారు. ఇప్పుడు నేను చెప్పబోయే మూడు సాధనలు చేసిన వాళ్ళు తప్పకుండా ఆ తురీయ స్థితికి వెళతారు. ఇదంతా పూజ్యగురుదేవులు ఇచ్చినవే. దీనినే పూజ్యగురుదేవులు 'తీన్ శరీర్ కా ధ్యాన్' అనేవారు. అంటే మూడు శరీరాల ధ్యానం. మిమ్మల్ని ఆ తురీయాస్థితికి తీసుకువెళుతుంది.

(1) తప్పనిసరిగా ప్రతీరోజూ మూడు శరీరాల ధ్యానాన్ని కనీసం 5 నిమిషాల పాటైనా చెయ్యండి. (ఈ మాటను పదే పదే చెప్పారు) దీని తరువాత మాతాజీ చెప్పిన జ్యోతి అవతరణ సాధన, దీపం వెలిగించి ఏకాగ్రతతో కాసేపు దానిని చూచి కళ్ళుమూసుకొని 'మాతాజీ' వాణితో గొంతు కలిపి గాయత్రీ మంత్రం చెయ్యాలి. ఈ అగ్ని అఖండజ్యోతి నుంచి వచ్చిన అగ్ని. **సుషుమ్నలో ఉండే ఈ అగ్నిని చూస్తూ దానితో లింక్‌అప్ అయిపోతే చాలు. గురుదేవుల అఖండజ్యోతి సాధన ఇది.**

ఉదయం 5 నిమిషాల పాటు గురుదేవులతో 24సార్లు గాయత్రీ మంత్రం + 3 శరీరాల ధ్యానం 5 నిమిషాల పాటు చెయ్యాలి. ఈ రెండూ సాధనలతోపాటు సాయంత్రం 6.00 గంటలకు నాదయోగ సాధన వినాలి. ప్రకృతిలో ఉండే దివ్యశక్తులు కచ్చితంగా ఈ సమయంలో మనతో ఎలైన్ (మమేకము)అవుతాయి. అందుకు ఆ సాధన ఆ సమయంలోనే వినాలి. మొత్తం మీద 16 నిమిషాలపాటు ఈ సాధనలు చేస్తే చాలు. అంత కంటే ఎక్కువేం వద్దు. దీంతో తురీయస్థితికి వెళ్ళిపోతారు. అగ్ని ఉపాసన - అఖండజ్యోతి సాధన చేస్తే మీరూ గురుదేవులంతవారైపోతారు.

ఈ మూడు రకాల సాధనలు మొత్తం మిమ్మల్ని ఈ కాలంలో నుంచీ మహాకాలంలోకి జంప్ చేయిస్తాయి. కానీ ఇదంతా చెయ్యాలంటే మీలో నిజమైన సత్యం ఉండాలి. సత్యం అన్నా సత్యయుగం అన్నా ఒక్కటే. దీని తరువాత నాకు లక్షల సంవత్సరాల పని వున్నది.

సత్యం తరువాత ప్రేమ. సత్యయుగంలో అందరూ ప్రేమతో జీవించాలి. న్యాయం - ఈ రెండింటితోపాటు మీరు చేసే పనులు న్యాయబద్ధంగా వుండాలి. సత్యం, ప్రేమ, న్యాయం ఈ 3 సత్యయుగపు లక్షణాలు. ఈ 18 సత్సంకల్పాలు చదువుతూ వాటిని ఆచరణలో పెట్టగలిగితే మీలోకి ఈ 3 శక్తులను దింపుకోగలరు. ఈ 18 సత్సంకల్పాలు తెలుగులో అనువదించి వున్నాయి చదువుకోండి.

64. ఆదేశాలు

ఆ సత్సంకల్పాల అనువాద పుస్తకం పేరు "21వ శతాబ్దపు శాసన తంత్రము." ఈ కాలానికి అవి నవయుగ నిర్మాణ యోజనా సత్సంకల్పాలు. గీతలోని 18 అధ్యాయములను "18 సూత్రాల రూపంలో" ప్రతీ రోజూ చదువుకోటానికి వీలుగా గురుదేవులందించిన "నవయుగ గీత". రోజూ సత్సంకల్పాలు చదవాలి. ఆ జెండాలు అందరి ఇళ్ళపైన ఎగురుతూ ఉండాలి. 'దారి తప్పిన దేవత' అనే స్టిక్కర్‌లను నిలువుటద్దాల మీద అంటించుకొని, చదువుకోవాలి. ఇక్కడ ప్రతీ నెలా సాధనలు చెప్తాను. ఒక నెలలో చెప్పే సాధనలు, 12 నెలల సాధనలతో సమానమైన స్పీడ్‌తో చెప్తుంటాను. ప్రతీ రోజూ వెబ్‌లో కూడా క్లాస్ చెప్తుంటాను. అందుకే అంతా ఇప్పుడే చెప్పేస్తున్నాను. నేను నా సాధనలోకి వెళ్ళిపోతున్నాను.

సప్తర్షి ఆశ్రమంలోనే వుంటాను. ఆధ్యాత్మిక విద్యలో రెండు రహస్యాలున్నాయి. ఒకటి లలితాసహస్రనామాలైతే రెండవది గీతలో 'రాజవిద్యా రాజగుహ్య' యోగము. గుహ్యం – అంటే అదీ రహస్యవిద్యనేగా చెప్తారు. వీటన్నింటి గురించి చెబుతాను. కుండలినీ సాధనను డెవలప్ చేస్తాను. విష్ణుసహస్రనామాలలో కూడా చాలా రహస్యాలున్నాయి. వాటన్నింటినీ బయటకు తీసుకు రావాలి. వీటన్నింటితోపాటు పంచవీరభద్ర ఆవరణ కేంద్రముగా శంబళను లేపుతాను. 'భటకాహువా దేవతా'లో ఇచ్చిన ఐదు వేదమంత్రాలు, పంచకోశ సాధనను అత్యంత సరళంగా నేర్పుతాను. అలా ఇంకా ఎన్నో విషయాలను వరదానాలుగా ఆ రోజు అందరిమీద కురిపించారు. ఫంక్షన్ అయిపోగానే చక్కటి విందు భోజనాలను ఏర్పాటు చేసారు శ్రీమతి విజయా, శ్రీవిశ్వనాథ్‌గార్లు. శ్రీశ్రీమాస్టరుగారు భోజనం చేసి లైబ్రరీకి వెళ్ళి నన్ను రమ్మని కబురు చేసారు. వెంటనే వెళ్ళాను.

ఇందాక నేను చెప్పిన ప్రవచనం ఎంతమందికి అర్థమైందో నాకు తెలియదు కానీ, మళ్ళీ చెప్తున్నాను జాగ్రత్తగా వినమ్మా అంటూ మొదలుపెట్టారు.

(1) ఈ దేవీ నవరాత్రులలో అంటే ఈ తొమ్మిది రోజులు గురుదేవులు చెప్పిన 3 శరీరాల ధ్యానం చేస్తే చాలు. మీరూ గురుదేవులంతటి వారైపోతారు. పరమపూజ్య గురుదేవులు ఇవాళ ఆ వరాన్ని ఇచ్చేశారు.

(2) లక్షరూపాయలు పెట్టి శివలింగాన్ని తెచ్చి పెట్టాను. దానికి నీరూ, దీపం ఏమీ లేవు. అది అలా పడి వున్నది. కానీ దాని చైతన్యం దానికి వున్నది. అది నా పవర్.

(3) ఇక నుంచీ అందరూ దీపయజ్ఞాలే చెయ్యండి. యజ్ఞాలు వద్దు. ఇది నా ఆర్డరు.

(4) శాంతికుంజ్‌తో లింక్ పెట్టుకోండి. లేకపోతే భీష్ముడిలాగా అయిపోతుంది మీపని.

(5) పూజ్య గురుదేవులు చెప్పింది 9 రోజుల సాధన మాత్రమే. అదీ చేయలేకపోతే మీ ఖర్మ.

(6) ఈ ఖర్మలన్నింటికీ కారణం మీరు థియోసఫీలో చేరకపోవటం.

ఈ డిసెంబర్ నెలతో నా పని అయిపోతుంది. ఇంక మీరే చేసుకోవాలి.

"ఇదంతా నీకెందుకు చెప్తున్నానంటే నీవు మళ్ళీ అందరికీ వివరంగా చెప్తావని" అని ఒకరకమైన నిర్వేదంతో చెప్పారు. ఈ విషయాలను వెంటనే అందరికీ చెప్దామని ఆశ్రమంలోకి వెళ్ళాను. అప్పటికే అందరూ భోజనాలు చేసి వెళ్ళిపోయారు. ఉన్న కొద్దిమందికీ శ్రీశ్రీమాస్టరుగారు చెప్పిన విషయాలను తు.చ తప్పకుండా వివరంగా చెప్పాను.

ఇంక ఆనాటి నుంచీ మాస్టారు గుంటూరు ఆశ్రమంలోనే ఉంటున్నారు. సప్తర్షి ఆశ్రమంలో మళ్ళీ కొన్ని నూతన అంశాలను ప్రవేశపెడుతున్నారు. సాధనలు చేయిస్తున్నారు. పని చాలా ఎక్కువైపోయింది.

మనిషి బాగా నలిగారు. ఒక రోజు స్నానానికని బాత్‌రూంలోకి వెళ్ళిన మనిషి ఎంతకీ రాకపోయేసరికి శ్రీవిశ్వనాథ్ లోపలికి వెళ్ళిచూడగా, నీరసంతో అలా పడిపోయివున్నారుట. ఇంక విశ్వనాథ్‌కు బాగా కంగారు వచ్చేసింది. ఇక్కడ లాభంలేదు. మంచి డాక్టరుకు చూపించాలనే ఉద్దేశ్యంతో మాస్టరుగారిని హైదరాబాద్‌కు తీసుకొని వెళ్ళిపోయారు. మాస్టరుగారికి ఎప్పుడూ ట్రీట్‌మెంటు ఇస్తున్న డాక్టర్లకి చూపించగా, మళ్ళీ కొత్త మందులు ఇచ్చారు. శ్రీమాస్టరుగారికి సమయానికి మందులు, ఆహారం అన్నీ చూసుకోటానికి శ్రీమతి విజయగారికి సాయంగా శ్రీమతి శ్రీలక్ష్మీ, అమ్మాజీ, సమీర, రమ్య, సుకృతవాళ్ళు ఎవరికి వీలైన సమయంలో వారు నిరంతరం జాగరూకతతో మాస్టరుగారిని చూచుకుంటున్నారు. కానీ ఈసారి బాగా నలిగారు. ఓపికలేదు. కోలుకోవటానికి సమయం పడుతున్నది. కొంచెం బాగైన తరువాత మళ్ళీ శ్వేతద్వీపానికి వచ్చేశారు. అవే మందులు వాడుతూ, చెల్దికి మంత్రాలు పెడుతున్నారు. చెల్ది లేదు కానీ ఆ మంత్రం పడితే మాస్టరుగారికి ఏదో కాస్త హాయిగా ఉంటుందని, ఉదయం స్నానం అవగానే మంత్రం వేయించుకునే వారు. ఇలాంటి పరిస్థితులలో మాతాజీ, గురుదేవుల అండ, అనుగ్రహం ఉంటేనే తప్ప కోలుకోవటం

చాలా కష్టం అనిపించింది. ఒక రోజున యుగశక్తి గాయత్రి చదువుతుంటే ఒక అద్భుతమైన సాధన కనిపించింది. ఆరోగ్యం కావాలంటే "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" అని ఈ శ్లోకం చెబుతోంది.

ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ ధనమిచ్ఛేత్ హుతాశనాత్ ।
జ్ఞానం చ శంకరా దిచ్ఛేత్ మోక్ష మిచ్ఛేత్ జనార్ధనాత్ ॥

అంటే ఆరోగ్యం కావాలంటే సూర్య ఉపాసనను చెయ్యాలి. సూర్య ఉపాసన అనగానే మనకు గుర్తుకు వచ్చేది ఆదిత్య హృదయం. ఆదిత్యహృదయ పారాయణ అనేది మన సంస్కృతిలో అనూచానంగా వస్తున్న ఆచారం. అలాగే ధనం కావాలీ అంటే అగ్నిని ఉపాసన చెయ్యాలి. (అంటే యజ్ఞాలు చెయ్యాలి) జ్ఞానం కావాలంటే శంకరుణ్ణీ, మోక్షం కావాలంటే జనార్ధనుణ్ణీ ఆరాధించాలి అని కదా దాని అర్థం. అందుచేత మాస్టరుగారికి ఆరోగ్యం చేకూరాలంటే మన దగ్గరున్న ఏకైక సాధన – ఆదిత్యపారాయణ. దాని తరువాత రామరక్షాస్తోత్రం. దీనిని రోజుకు 7 లేక 11 సార్లు చదువుతే షుగర్‌వ్యాధి నయమౌతుందని మహానుభావులు అనుభవంతో రాశారు. ఇకపోతే మాస్టరుగారు కొన్ని విశేష ప్రయోజనాలను పొందటానికి గీతలోని 9 వ అధ్యాయం – 'రాజవిద్యా రాజగుహ్యం' అనే అధ్యాయాన్ని ప్రతీరోజూ చదవమన్నారు. అందుచేత ఈ మూడు పారాయణలను ప్రతీరోజు శ్వేతద్వీపంలో ఉండే ఐదు, ఆరు మంది వ్యక్తులు ఎంతో శ్రద్ధతో మాస్టారు కోలుకోవాలనే సంకల్పం పెట్టుకొని చదివేవారు. అదీ ఎలాగంటే మాస్టారికి స్నానం అదీ అయి ఇంక టిఫిను తినాలనుకున్న సమయంలో అంతా సిద్ధంగా పెట్టుకొని అందరూ ఒక క్రమంలో కూర్చొని మాస్టారితో సహా ఆదిత్యహృదయం 3 సార్లు, రామరక్షాస్తోత్రం, రాజవిద్యా రాజగుహ్యం ఒక్కసారి చొప్పున ఈ మూడు పారాయణలను చేసేవారు. అనంతరం అచ్యుతానంద గోవింద..., బ్రహ్మార్పణం బ్రహ్మహవిః... మొ॥ శ్లోకాలు భక్తితో చదివిన తరువాతనే 'టిఫిన్ పెట్టటం' చేసేవారు. మాస్టారు ఎప్పుడూ ఒకటి చెప్పేవారు. 'అందరం కలిసి' తినాలి. అందుచేత అక్కడున్న అందరూ ఒకేసారి టిఫిన్ తినటం అలవాటు చేసుకున్నారు. ఈ సాధనకు మాస్టారు బాగా సహకరించారు. అలా రెండు నెలలపాటు సాధన జరిగింది. మిగతా వాళ్ళ గురించి చెప్పలేము కానీ, శ్రీశ్రీమాస్టారు ప్రతీ చిన్న సాధనకు అద్భుతంగా స్పందిస్తారు. దాని శక్తిని అనంతంగా గ్రహిస్తారు. అలా ఆ సాధన చేయటంలో కంటే ఆ శక్తిని స్వీకరించిన శ్రీమాస్టరుగారు, తమ సంకల్పశక్తి వలన చాలా శీఘ్రంగా కోలుకున్నారు. ఆహారంతోపాటు తైల మర్థనలు, అభ్యంగస్నానం మొదలగు విశేష ప్రక్రియలను చేయటం వలన చక్కగా కోలుకున్నారు. కానీ సాధన, స్వాధ్యాయాలు మాత్రం ఆపటంలేదు.

అధ్యాయం-6

కొత్త ప్రపంచంలోకి (2013)

65. నేను పృథ్వీ గ్రహాన్ని వదిలేశాను

2013 జనవరి 2వ తేదిన మామూలుగా కాస్త విరామ సమయంలో ఏదో కబుర్లు చెప్తుంటారు. సాధనాపరమైన సంభాషణ వచ్చింది. ఆ సందర్భంలో కొన్ని సాధనారహస్యాలను తమాషాగా బయట పెట్టారు.

నేను పృథ్వీగ్రహాన్ని వదిలేశాను. (అంటే భౌతిక శరీర పరంగా కాదు. సాధనామార్గంలో వారు చేస్తున్న సాధనలు ఈ Earth Planet కు అవలున్న సాధనలు చేస్తున్నారు.) ప్రస్తుతం నేను గాయత్రీ మంత్ర అక్షరన్యాసం చేస్తున్నాను. తల, నడుములు, పాదాలు ముఖ్యంగా అక్షరన్యాసంలో Interpenetrate అయిపోవాలి. అక్షరన్యాసం సాధారణంగా అందరూ చేస్తుంటారు. ఒక మనిషి బొమ్మలో ఏ ఏ అక్షరాలు, మనిషి శరీరంలో ఏ ఏ భాగాల్లో న్యాసం చేసుకోవాలో అందులో విభజింపబడి వుంటుంది. దానిని చూచి శరీరంలోని ఆయా భాగాలలో ఆయా అక్షరాలను న్యాసం చేసుకుంటూ గాయత్రీ మంత్రాన్ని జపిస్తుంటారు. సాధారణంగా అందరికీ తెలిసిన న్యాసం అదే! కానీ ఇక్కడ మాస్టరుగారు చెప్పిన దాన్ని బట్టి చాలా లోతైన అంతరంగ సాధనగా ఈ అక్షరన్యాసాన్ని చేస్తున్నట్లు అనిపించింది. సరే వారి మాటలను ఇక్కడ యధాతథంగా పొందుపరుస్తున్నాను.

"గాయత్రీ మంత్ర అక్షరన్యాసం చేస్తున్నాను. తల, నడుములు, పాదాల వరకు అక్షరన్యాసం చేస్తున్నాను. పృథ్వీగ్రహంతో (లింకు) సంబంధాన్ని వదిలేశాను. గునపంలాగా కాకుండా సూదిని దింపిన మాదిరిగా అక్షరన్యాసం లోపలికి దింపుతున్నాను. ఈ శరీర అణువులు, ఈ పృథ్వీగ్రహానికి సంబంధించిన అణువులు పడిపోవాలి. అప్పుడే కదా నూతన అణువులు వస్తాయి. దానికి గునపం

లోపలికి దిగదు. సూదిలోపలికి దిగిపోతుంది. అంటే అది మామూలు విషయమా? సూది లోపలికి దిగిపోవటంతో Cell Transition జరుగుతోంది. దాంతో పృథ్వీగ్రహాన్ని లేపుతాను. ప్రతీ జీవిని పైకి లేపుతాను. అక్షరన్యాసం యొక్క లోతులకు సంబంధించిన సాధన చాలానే వున్నది. పూజ్యగురుదేవుల పుస్తకాలు చదవండి అర్థమౌతాయి." అంటూ అందీ అందకుండా వారు చేస్తున్న సాధనా రహస్యాన్ని కొంచెం, కొంచెంగా బయటపెట్టారు.

ఇంకా ఏం చెప్పారంటే పరిణామక్రమంలో ఖనిజ జగత్తు, వృక్ష జగత్తు, జంతు జగత్తులన్నీ ఒక క్రమ పద్ధతిలో Evolutionలో పైకి వస్తున్నాయి. ప్రస్తుతం గురుదేవులు ఖనిజ జగత్తును లేపటానికి ప్రయత్నిస్తున్నారు. **ఈ పనిలో నేను, గురుదేవులకు సహాయం చేయ్యాలి. దానికోసమే ఈ సాధనంతా అని ఇంకొంచెం విషయాన్ని బయటపెట్టారు. కాశీ నుంచీ బెంగుళూర్‌కు వెళుతూ, "ఇంక నేను గురుదేవులతో పాటు ఖనిజ జగత్తును పరిణామక్రమంలో ముందుకు తీసుకుపోవటానికి పని చేస్తాను.** ప్రస్తుతం నా పని అంతా ఇంక ఖనిజ జగత్తు మీదనే" అని అన్నారని శ్రీలక్ష్మీ, తేజశ్రీ వాళ్ళు చెప్పారు. ఈ మాటలు విన్న తరువాత మాతామిత్రా జీవితంలో చదివిన ఒక సంఘటన గుర్తుకువచ్చింది.

శ్రీఅరవిందుల వారి నిర్యాణం తరువాత ఆవిడ సాధన ఇంకా కొనసాగించారుట. పృథ్వీ గ్రహానికి పవిత్రతను చేకూర్చటం కోసం ఆవిడ రాత్రి పూట ఏకాంత సాధన చేస్తుండేవారు. ఆ సాధన జరుగుతున్నప్పుడు పెద్ద పెద్దగా మూలుగూ వినిపించేదట. అతి సన్నిహితులు అడిగినప్పుడు నేను Cell Transition చేస్తున్నాను. అది భరించలేని బాధ. ఆ బాధకో ఏమో నాకే తెలియకుండా మూలుగుతుంటానని చెప్పారుట. అప్పుడర్థమైంది. మాస్టరుగారి శరీరం ఎందుకిలా సున్నితమై పోయింది. ఈ మంటలు, ఓర్చుకోలేని ఈ బాధ – ఈ నొప్పులు ఇదంతా వారు చేస్తున్న ఈ సాధనా ప్రభావం కాబోలు అని అనిపించేది. రాత్రిళ్ళు నిద్ర వుండేదికాదు. నిద్రపోయారంటే అది గాఢ నిద్రే. **ఈ శరీరాన్ని మీరు జాగ్రత్తగా చూసుకుంటే వుంటుంది. దీన్ని గురించి నేనేమీ ఆలోచించను. నాకేది కావాలో దానిని ఆలోచించుకుని మీరే దానిని కాపాడండి అని చెప్పేవారు. శ్రీశ్రీమాస్టరుగారిని అనుక్షణం కాపాడాలి. ఏ క్షణాన ఏది అవసరమో చూసుకోవటానికి అందరూ జాగ్రత్తపడేవారు.**

మనం గురుచరిత్రల్లో చదువుతూ ఉంటాము. గురుచరిత్ర పారాయణ సాధకుడికి భౌతిక సద్గురువును చూపిస్తుందీ అని. నిజమైన గురువు సాధారణంగా స్వప్నంలో దర్శనమిస్తుంటారు.

సద్గురువు లభించినా తగురీతిలో అంటే వారికి కావలసిన రీతిలో వారిని సేవించగల పరిపాకం రావాలంటే అది ఎన్నో జన్మల సాధనా పరిపూర్ణత ఉండి వుండాలి అంటారు. చిత్తశుద్ధితో గురువుల సేవ చేసిన వారికి కర్మపరిపాకము క్షయమైపోయి, సాధనలో ఉన్నతస్థాయి చేరుకోగలుగుతారు. ఏ గురువుల చరిత్రలలోనైనా దాదాపుగా ఇదే సమాచారం ఇలాగే ఉంటుంది. దాదాపు రెండు, మూడు నెలలలో మాస్టరుగారు మళ్ళీ కాస్త మామూలు స్థితికి వచ్చారు. యథాప్రకారంగా సాధన, స్వాధ్యాయం టైం ప్రకారం చేసుకుంటున్నారు. ఆహార, విహారాదులలో కూడా ఒక మంచి సమన్వయం వచ్చేసింది.

నేను చెప్పాల్సిందంతా చెప్పేశాను

2012 డిసెంబరు 20వ తేదీన ఒకానొక సందర్భంలో అన్నారు "నేను చెప్పాల్సిందంతా చెప్పేశాను. ఆశ్రమాలు పెట్టేశాను. అనుగ్రహపీఠాలు పెట్టేశాను. జన్మశతాబ్దికి చెయ్యాల్సిందంతా చేసేశాను. ఇంక వాటినన్నింటినీ డెవలప్ చేసుకోవటం మీ వంతు."

గహనా కర్మణోగతిః ఈ మాట ప్రతీ సందర్భంలోనూ అనేవారు. ఇంక సాందీపని ఆశ్రమం అంటే అదీ గాయత్రీయే। అక్కడేగా శ్రీకృష్ణుడు చనిపోయిన గురుపుత్రుణ్ణి తెచ్చిస్తాడు. ప్రాణాలను రక్షించే విద్య "గాయత్రి" యేగా!! దానికింక సాధనలేం చెయ్యాలి. చెప్పింది చేసుకుంటూ పోవటమే!! నేను సాధనలు చేస్తాను అంటే హరిద్వార్ వెళ్ళినప్పుడు గురుదేవులు కొడతాననేవారు (సరదాగా అన్నమాటలు).

ఇంకా నాకు చాలా పని ఉన్నది. పూజ్యగురుదేవులదే 10 సంవత్సరాల పని ఉన్నది. అది జన్మశతాబ్ది లోపల అయిపోయివుండాల్సింది, కాలేదు. గురుదేవుల కోరిక ప్రకారం దాని కోసం నేను నిలబడ్డాను. అందుకే బెంగుళూరులో ఆశ్రమం పెట్టమన్నాను. అక్కడ సాందీపని ఆశ్రమం రెడీ అయిపోతున్నది. ఇంక అక్కడ నుంచీ పనిచేస్తానని అన్నారు.

ఆ రోజు వైకుంఠ ఏకాదశి. అఖండజ్యోతిలో ఒక వ్యాసం చదువుతూ మధ్యలో ఇలా చెప్పారు. పూజ్యగురుదేవుల ఆత్మకథలో చెప్పినవన్నీ అక్షర సత్యాలే!! ముఖ్యంగా గురుదేవులు, "బ్లావెట్స్కీ చెప్పినవన్నీ అక్షర సత్యాలేనని" అన్నారు. ఇంక ఇప్పుడు మనం ఏంచెయ్యాలీ! అంటే అందుకేగా మిమ్మల్ని అందరినీ థియోసఫీలో చేరమని చెప్పాను. అందులో చేరకపోతే గురుదేవులు చెప్పిన 'గాయత్రి' మీకేం అర్థం కాదు.

యుద్ధం జరుగుతున్నది. అందుకే అందరికీ గాయత్రీ ఇస్తున్నానంటారు గురువుగారు. యుద్ధరంగంలో ఉంటే అందరూ శ్రీకృష్ణుని ప్రక్కన్నే ఉంటారు. అదే ఇంట్లో ఉండేవారికి ఆ అవకాశం ఉండదుగదా! అందుచేత గాయత్రీ చేసే అవకాశం అంటే అర్థం, మనం నిరంతరం గురుదేవులతో ఉండే అదృష్టాన్ని కల్గి వుండటం. ఇలా ఒక్కొక్క సందర్భంలో మహత్తరమైన సత్యాలు అలా దొర్లివస్తుండేవి. ఇంకో పరమసత్యం చెప్పారు.

జ్యోతి ఎక్కడ వెలిగించినా అది పూజ్య గురుదేవుల అఖండజ్యోతితో లింక్‌అప్ అయిపోతుంది. దానిని చూస్తూ కళ్ళు మూసుకొని అంతరంగంలో దానిని దర్శిస్తూ గురుదేవుల వాణితో గాయత్రీమంత్రం పెదాలు, నాలుక కదుపుతూ మంత్రాన్ని చేస్తే అది సాక్షాత్ అగ్ని అయిపోతుంది. "బ్రహ్మాస్త్రం ప్రయోగంగా" మారుతుందని పూజ్యగురుదేవులు చెప్పేవారని మాస్టారు చెప్పారు.

66. మహా కుంభమేళా యాత్ర

2013వ సంవత్సరంలో మహాకుంభమేళా వచ్చింది. 144 సంవత్సరాల తరువాత వచ్చిన ఈ మహాకుంభమేళా ప్రకృతిలో అద్భుతమైన విశిష్ఠతను కలిగివున్నది. 2012వ సంవత్సరము పూజ్యగురుదేవుల జన్మశతాబ్ది సమారోహ పర్వంతో విశేషతను సంతరించుకుంటే, 2013వ సంవత్సరము మహాకుంభమేళా పర్వంతో మానవజాతికి మరింత శ్రేయస్సును వెంటపెట్టుకుని వచ్చింది. ఈ మహాకుంభమేళా అనేది ప్రతీ మానవుడి జీవితంలో ఒకే ఒక్కసారి మాత్రమే వచ్చే అపురూపమైన అవకాశం. కుంభమేళా విశిష్టతను గురించి "ఒక యోగి ఆత్మకథ" లో చాలా మంచి వివరణ ఇవ్వబడింది. ఈ మహామేళాకి మారుమూల ప్రాంతాలలో తపోసాధనలలో లీనమై ఉన్న అనేకమంది నాగసాధువులు, సంతులు, సాధువులు రావటం జరుగుతుంది. గంగా, యమునా, సరస్వతీ సంగమ తీర్థమైన ఈ త్రివేణీ సంగమములో ఈ పుణ్యపర్వదినాలలో స్నానం చెయ్యటం, తమ పితరులకు శ్రాద్ధతర్పణాలు సమర్పించుకోవటం అనేది మన సాంప్రదాయంలో అనూచానంగా వస్తున్న ఆచారం. ఈ గంగా స్నానం వలన మహాపాపాలు పటాపంచలైపోతాయనేది భారతీయుల విశ్వాసం. అందులోనూ త్రివేణీ సంగమంలో వచ్చిన ఈ మహాకుంభమేళాకి ఎంతటి విశిష్ఠత వున్నదో తలచుకుంటేనే ఒళ్ళు పులకరించిపోతుంది. ఇలాంటి అద్భుతమైన అవకాశం మళ్ళీ మన జీవితంలో వస్తుందా? అసంభవం. ఏది ఏమైనా కానీ ఈ దివ్యమైన తీర్థస్థలికి వెళ్ళిరావటం అనేది పూర్వజన్మ సుకృతంగా భావిద్దాం.

కుంభమేళా

పన్నెండు సంవత్సరాలకు ఒక పర్యాయం 1. హరిద్వార్ (గంగానది), 2. అలహాబాద్ (త్రివేణీ సంగమం) 3. ఉజ్జయిని (చిప్రానది) 4. నాసిక్ (గోదావరినది) లలో జరిగే పవిత్రనదీ పర్వదినాలు. వీటిని కుంభమేళాలని చెప్తారు. ఈ సందర్భంగా సాంప్రదాయాలకు అతీతంగా అనేక మంది పీఠాధిపతులు, పండితులు, యోగులు ఈ ప్రదేశంలో సమావేశమై శాస్త్రచర్చలు జరిపి, ఆ జ్ఞానాన్ని ప్రపంచానికి బోధించి ధర్మసంరక్షణకు కృషిచేస్తారు. ఈ కుంభమేళా సందర్భంగా రెండవది తీర్థవిధులు అనగా పవిత్రస్నానాలను ఆచరించటం, పితృదేవతలకు పిండప్రదానాలను, దానధర్మాదులను చేయటం ఎంతో ఫలప్రదం.

అసలీ కుంభమేళా అంటే ఏమిటి?

క్షీరసాగర మధనంలో ముందుగా హాలాహలం ఆవిర్భవిస్తుంది. లోకాలను అతలాకుతలం చేస్తున్న ఆ హాలాహలాన్ని విశ్వశ్రేయస్సు కోసం పరమేశ్వరుడు దానిని తాగి కంఠమునందే ధరించటం వలన ఆయనను నీలకంఠుడని పిలవటం అందరికీ తెలిసినదే! తరువాత మొత్తం పదునాలుగు రత్నాలు బయటకు వస్తాయి. చివరగా ధన్వంతరి భగవానులవారు అమృతకలశంతో క్షీరసాగరం నుండీ ప్రకటితమౌతారు. ఈ అమృతకలశాన్ని దేవతలకందకుండా అసురులు దానిని తీసుకొని పరుగిడుతుండగా, దానిని తాము కూడా పొందాలనే ఆకాంక్షతో దేవతలు వారి వెంట పడతారు. ఈ లాక్కోటం, పీక్కోటంలో వారు ఆ పూర్ణకలశాన్ని నాలుగు ప్రదేశాలలో దింపి పెడుతుండగా, ఆ కలశం నుండీ నాలుగుప్రదేశాలలోనూ కొన్ని, కొన్ని అమృతబిందువులు నేల మీద పడ్డాయి. ఆ బిందువులు నేలమీద పడినప్పుడు ఏ గ్రహ, నక్షత్రాల సంగమం ఉన్నదో ఆ కలయిక మానవ కాలమానంలో ప్రతీ 12సంవత్సరాలకొక మారు వస్తుంది. **అందువలన 12 సంవత్సరాలకొక మారు, ఆయా స్థానాలలో కుంభమేళా జరుగుతుంది. ఆ గ్రహ, నక్షత్రాల కలయిక వచ్చిన పర్వంలో, ఆ ప్రదేశాలకు వెళ్ళి, ఆ సమయంలో అక్కడ తీసుకున్న ఆహారంగానీ, మందులుగానీ, చేసిన పుణ్యం ఏదైతే వుంటుందో అదంతా అమృతం వలె సిద్ధిస్థాయనేది ప్రజల నమ్మకం. కుంభమేళాలో ఆ పవిత్రనదిలో చేసిన పవిత్రస్నానం, చేసిన దాన, ధర్మాలు ఎంతో ఫలప్రదములని శాస్త్రాలు చెప్తున్నాయి. ఇది కుంభమేళా.** మహాకుంభమేళా అనేది 144 (12x12) సంవత్సరాలకు ఒక్కసారే వస్తుంది.

పూజ్యశ్రీమాస్టరుగారు మెల్లమెల్లగా కోలుకుంటున్నారు. మామూలు నిత్యజీవితంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా సుఖంగానే ఉంటున్నారు. ఒక రోజున అంటే 2013 జనవరి 29వ తారీఖున మధ్యాహ్నం శ్రీ రంగనాథ్‌గారు శ్వేతద్వీపానికి వచ్చారు మాస్టరుగారిని కలవాలని. అప్పుడే నిద్ర లేచి కాఫీ తాగుతున్నారు, రంగనాథ్‌గారు అలా కాస్త దూరంగా వుండి "మాస్టరుగారు, మేము రేపు కుంభమేళాకి బయల్దేరుతున్నాము. మీకు చెప్పి మీ ఆశీస్సులను పొందాలని వచ్చాను " అంటూ నమస్కారం చేసారు. శ్రీమాస్టరుగారు కూడా తీరిగ్గా కూర్చుని యాత్ర వివరాలన్నీ అడిగారు. రంగనాధంగారు ఈ కుంభమేళా ప్రాశస్త్యం గురించి చాలా చక్కగా వివరించారు. అప్పుడు మాస్టరు గారు "144 సంవత్సరాల తరువాత వస్తున్న కుంభమేళా అంటున్నావ్. జీవితంలో మళ్ళీ ఇలాంటి అవకాశం రాదుగదా! కాబట్టి నేను మీతో వస్తాను. మీతో పాటుగా నాకు మరో వెహికల్ ఏర్పాటు చెయ్యి" అన్నారు. అంతే ఇంక సమయంలేదు. రేపు మధ్యాహ్నం రెండు గంటలకల్లా బయల్దేరాలి. అందులోనూ మాస్టరుగారి పరిస్థితి తెలిసి ఎలా తీసుకువెళ్ళాలి అంత దూరం అనుకొని రంగనాథ్ మాస్టారితో, 'మాస్టారూ, మీరు ఇప్పుడిప్పుడేగా కాస్త కోలుకుంటున్నారు. అంత దూరం ఒక వెహికిల్‌లో ప్రయాణం చెయ్యగలరా?' అని కాస్త సంశయిస్తూనే అడిగాడు. దానికి మాస్టారు, 'మరేం ఫరవాలేదు. మీరందరూ నాతోపాటే ఉంటారు గదా. నాకేం కాదు. ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు నీవు చూడు' అన్నారు. దాంతో అందరికీ కాస్త ధైర్యం వచ్చింది. సరే రంగనాథ్‌గారు అన్నీ ఏర్పాట్లు చేసారు. 30వ తేది మధ్యాహ్నం 2 గంటలకు రంగనాథ్‌గారి వెహికల్‌లో ఏడు మంది, మాస్టారుగారి కార్లో ఏడు మందితో శ్వేతద్వీపం నుంచీ రెండు వెహికల్స్ బయల్దేరాయి.

ఆరోగ్యరీత్యా ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న మాస్టారిని అలా వెహికల్‌లో ఇన్ని వేల కిలోమీటర్లు తీసుకువెళ్ళటమనేది ఎంతో సాహసంతో కూడిన విషయం. వారిని ఎలాగైనా విమానంలో పంపాలని ప్రయత్నించినప్పటికీ, అలా కాదు, ఇలా కారులో అయితేనే అన్ని ప్రదేశాలలో "నా పనిని నేను చేసుకుంటాను" (నాటే కార్యక్రమం) అన్నారు. కారులోనే వస్తానని దృఢంగా చెప్పారు. అయితే ఈ ప్రయాణంలో వారిలో చాలా రోజుల తరువాత పూర్వపు ఉత్సాహం, ఉల్లాసాన్ని చూడగలిగాము. ఆ రాత్రికి వరంగల్‌లో ఆగి 'గాయత్రి శక్తి పీఠానికి' వెళ్ళి గాయత్రీమాత దర్శనం, ఆశీస్సులు తీసుకొని ఆ రాత్రికి పరివార్ కార్యకర్త శ్రీసురేష్ గారింట్లో విశ్రాంతి తీసుకున్నాము. మరునాడు ఉదయం మాస్టర్‌గారికి అత్యంత ఆత్మీయులైన డా॥ వేంకటేశ్వరరావు గారు మాస్టారిని తాము

పనిచేస్తున్న మెడికల్ కాలేజీకి తీసుకువెళ్ళి కాలేజీ అంతా చూపించి, అనేక విషయాలు మాస్టరుగారికి చెప్పుకున్నారు. అక్కడి నుంచీ నాగపూర్‌కు బయలుదేరాము.

31వ తేదీ రాత్రికి నాగపూర్‌లో ఉన్న "అందమైన గాయత్రీ శక్తి పీఠము"లో అక్కడి పరివార్ వారు ఆతిథ్యాన్నిచ్చారు. ఎంతో ప్రేమ, ఆదరణలతో వారిచ్చిన ఆతిథ్యాన్ని మరచిపోలేము. అక్కడ గాయత్రీమాత 'సజీవశక్తి' రూపిణిగా ఆశీర్వాదాలు కురిపించింది. విచిత్రమేమిటంటే అలహాబాదుకు చేరుకునే మధ్య మార్గంలో "ఎక్కడ చూచినా గాయత్రీ పరివార్ వారిచ్చిన ఆత్మీయ ఆతిథ్యాలతో "అందరి హృదయాలు" ఆనందంతో నిండిపోయాయి. రాత్రి 8.00 గంటలకు అలహాబాదు చేరుకున్నాము. అక్కడ నుంచీ నేరుగా త్రివేణీ సంగమానికి చేరుకునేసరికి రాత్రి దాదాపుగా 9.00 గంటలైంది. జనవరి నెల అవటం వలన విపరీతమైన చలి. గంగాతీరమంతా నిర్మానుష్యంగా ఉన్నది. మా కారు దాదాపుగా గంగా ప్రవాహానికి చేరువ వరకు వెళ్ళగలిగింది. అందరం గంగమ్మతల్లి సన్నిధికి చేరుకున్నాం. ఎంతో ప్రశాంతమైన, అందమైన వాతావరణం. చలి, చలిగా హాయిగా వున్నది.

అలాంటి ప్రశాంత వాతావరణాన్ని ఏర్పాటు చేసి గంగామాత తన వేయి చేతులు చాచి తన బిడ్డ రాకకై ఎదురుతెన్నులు చూస్తున్నదా? అన్నట్లు ఎంతో నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా కేవలం "తన ప్రియమైన రామకృష్ణ కోసమే" ఎదురుచూస్తున్నదా అన్నట్లు వున్నదా వాతావరణం ఆ రోజున. వెళ్ళిన వారిలో పురుషులు దాదాపు 7,8 మంది వున్నారు. శ్రీనివాస్, రంగనాథ్, విజయ కుమార్, శివ వాళ్ళు మాస్టరుగారిని తీసుకొని 'గంగా' మాత స్నానానికి లోపలి దాకా వెళ్ళారు. అంత చలిలోనూ మాస్టారూ హాయిహాయిగా ఆనందంగా గంగామాత నమో నమః అనుకుంటూ, మనస్సులోనే గంగమ్మకు ధన్యవాదాలు చెప్పుకుంటూ స్నానం చేసారు. తృప్తిగా స్నానం అయిపోయాక బట్టలు వేసుకునే లోపలే అక్కడికి ఒక చాయ్‌వాలా వచ్చి వేడి వేడి టీ అందరికీ ఇచ్చాడు. ఆ చలిలో, అంత రాత్రివేళ అక్కడికి చాయ్‌వాలా రావటంతో అందరికీ ప్రాణాలు లేచివచ్చాయి. ఆ సమయంలో అది అమృతంగా అనిపించింది. అంతే హాయిగా, తృప్తిగా ఎవరికి కావలసినంత వాళ్ళు తాగారు. టీ త్రాగటం అయిపోయాక మాస్టరుగారు మంచి దళసరిగావున్న స్వెట్టరు వేసుకొని దాని మీద షాల్‌కప్పుకొని ప్రశాంతంగా ధ్యానానికి కూర్చున్నారు. మిగిలిన వాళ్ళందరూ గంగానదిలో స్నానానికి వెళ్ళారు.

సరిగ్గా అదే సమయానికి హైదరాబాద్ నుంచీ శ్రీమతి శ్రీలక్ష్మీ, తేజశ్రీ, ఒ.వి. కిశోర్ వాళ్ళు వచ్చారు. వాళ్ళను చూస్తూనే మాస్టరుగారు తెగ సంబరపడిపోయారు. ఆనందంతో, ఆదరంగా అందరినీ దగ్గరకు తీసుకొని తమ సంతోషాన్ని వ్యక్తపరచారు. అందరూ స్నానాలకు వెళ్ళి పోయారు. 144 సంవత్సరాల తరువాత వచ్చిన పుష్కరాలు. ఎంతటి అపురూమైన అవకాశం అది. తమ జీవితాలు ధన్యమయ్యాయనే దివ్యభావనతో ఆ పవిత్ర గంగాజలాలలో పుష్కరస్నానం చేయటమంటే అది మామూలు విషయం కాదు, కదా! అహా ఎంతటి మహద్భాగ్యం. ఈ దివ్యనదీ జలాలలో స్నానం చేస్తున్నామంటే అది మాస్టరుగారి అనుగ్రహమే గదా! అనే దివ్యానుభూతితో మంగళకరమైన గంగాస్నానాలు చేశారు. అందరి స్నానాలు, అవీ అంతా అయ్యాక గంగామాతకు నమస్కరించి పసుపు, కుంకుమ, పూలు సమర్పించి, గంగా హారతిచ్చి, దండ ప్రణామాలాచరించారు. త్రివేణీ సంగమంలో గంగామాత ఒడిలో, మాస్టరుగారి దివ్యసాన్నిధ్యంలో, ఆ చల్లటి రాత్రివేళ అంతటి మహాకుంభమేళాలో, ఆ పుణ్యతీర్థంలో కలిసి ఉండగలగటం, ఇంతటి అదృష్టానికి నోచుకోవటానికి 'మాస్టర్‌గారిచ్చిన' ఈ అపూర్వ అవకాశానికి అందరూ మనస్సులోనే కృతజ్ఞతాభివందనాలు సమర్పించారు. అందరూ ఎంతో ఆనందాన్ని పొందారు.

అయితే సత్యనారాయణ మాస్టారూ, రంగనాథ్‌గార్లు వాళ్ళ పితరులకు శ్రాద్ధ తర్పణాదులు ఇవ్వటానికి గంగాతీరం దగ్గరకు వెళ్ళారు. దాదాపు 9:30 గంటలైంది. ఆ నిశీధివేళలో విద్యుద్దీపాల వెలుగులో గంగమ్మతల్లి నీటి ప్రవాహంనిండా ముత్యాలు పరుచుకొన్నవా అన్నట్లుగా సన్నని చిరు మువ్వల సవ్వడిని చేస్తూ నిదానంగా ప్రవహిస్తున్నది. ఎంతో శాంతంగా ప్రవహిస్తున్న త్రివేణీ, చలిచలిగా ఇంకా ఎంతో హాయిగా వున్న ఆ వాతావరణంలో ఆనందంతో పరవశించిపోతూ, మాస్టరుగారు చెప్తున్న మధురమైన మాటలను మైమరచిపోయి వింటూ కూర్చున్నారు.

తర్పణాదుల పని అయిపోయింది. అందరూ వచ్చేశారు. ఇంక బయల్దేరటానికి లేచారు అందరూ. ఇంతలో విజయకుమార్ అక్కడికి వస్తూ 'ఇదిగో మాస్టారూ, ఈ పుస్తకం నీళ్ళల్లో దొరికింది. గాయత్రీమాత బొమ్మ ఉంది అంటూ మాస్టారిచేతికిచ్చారు. అది గురువుగారు వ్రాసిన "గాయత్రీ కా అనుష్టాన్ ఏవం పురశ్చరణ సాధనాయేం" అన్న పుస్తకం అది. దానిని చూస్తూ అందరూ ఆశ్చర్యపోయారు. ఈ సమయంలో గంగ ఒడ్డుకు ఆ పుస్తకం ఎలా వచ్చిందీ అని అనుకునే లోపల, ఆ పుస్తకాన్ని చూస్తూనే మాస్టారు ఏ సాధన చెయ్యాలా అని మధన పడుతున్న

నాకు గురుదేవులే స్వయంగా ఈ పుస్తకం తెచ్చివ్వగా దానిని "గురుదేవులిచ్చిన మహాప్రసాదంగా భావిస్తూ కనుల కద్దుకుని" తీసుకున్నారు. ఇంక ఆ క్షణం నుంచీ నాగపూర్ గాయత్రీ శక్తి పీఠంలో తెచ్చుకున్న గోముఖ మాలతో జపం చేయటం మొదలుపెట్టారు. త్రివేణిలో మహాకుంభమేళా స్నానంతోపాటుగా గురుదేవుల ప్రసాదం కూడా దొరికింది.

అక్కడ నుంచీ కాశీకి బయల్దేరాము. కారు కాశీలోకి ప్రవేశించగానే మాష్టరుగారికి చిన్నప్పటి జీవితం అంతా గుర్తుకు రావటం మొదలైంది. కారు వెళుతున్న మార్గంలో వచ్చిన ప్రదేశాలను చూపిస్తూ వాటి విశిష్టతను చెప్పసాగారు. అదే మార్గంలో వచ్చిన థియోసాఫికల్ సొసైటీని చూపించి ఆ సొసైటీతో తమకు గల అనుభవాలను, అనుబంధాలను ఆ సొసైటీలో ఆ రోజులలో జరిగిన కార్యక్రమాల విశిష్టతలను గురించి చెప్తూ అలౌకికమైన పారవశ్యంలో మునిగిపోయారు. అలా అనేక ప్రదేశాలను చూపిస్తూ గత జీవితాన్ని గుర్తుకు చేసుకున్నారు. అప్పటికే మధ్యాహ్నం రెండు గంటలైంది. మంచి హోటల్లో దిగి భోజనాలు చేసి కాస్త విశ్రాంతి తీసుకున్నాక సాయంత్రం గంగా నదీ తీరానికి బయల్దేరాము.

గంగానది దగ్గరకు వెళ్ళి అన్ని ఘాట్‌లను చూసుకుంటూ చివరగా గంగాహారతీ చూడాలి అనే నియమంతో ఒక పడవను మాట్లాడుకొని అందరం అందులో ఎక్కి కూర్చున్నాము. నావలో ఎక్కిన దగ్గరి నుంచీ మాస్టారు, గంగామాతతో తమకున్న అనుబంధాన్ని అక్కడ చేసిన సాధనలను పదే, పదే గుర్తు చేసుకుంటూ అనేక విశేషాలను చెప్పటం జరిగింది. అన్ని ఘాట్లు చూస్తూ వాటి ప్రాశస్త్యాన్ని గురించి మాస్టరుగారు చెప్తున్న విషయాలను వింటూ, ఆ ఘాట్లలో ఒక్కో సమయంలో మాస్టరుగారు అక్కడ ఏ ఏ సాధనలను చేశారో చెప్తున్నారు. ఇంతలో మణికర్ణికాఘాట్ వచ్చింది. లెక్కపెట్టలేనన్ని శవాలను అక్కడ తగలపెడుతున్నారు. మాస్టారు తదేకంగా కాసేపు ఆ దృశ్యాలను చూస్తూ అలాగే వుండిపోయారు. ఇంతలో చీకట్లు కమ్ముకు వచ్చాయి.

ఆరతి సమయం అయింది. గంగా ఆరతిని చాలా ప్రత్యేకంగా, చాలా ఉత్సాహంగా చేస్తారు. ఈ ఆరతి కార్యక్రమం అన్ని ఘాట్లలోనూ ఒకేసారి జరుగుతుంది. అందరూ మైమరచిపోయి శివతాండవ స్తోత్రం చేస్తూ ఆరతి ఇస్తుంటే ఒక్కసారిగా ఒళ్ళు గగుర్పాటు చెందినట్లైంది. అదంతా చూస్తూ గంగ దగ్గరే చాలా గంటలు గడిచిపోయాయి. ఆ తరువాత అందరూ విశ్వనాథుడి దర్శనానికి వెళ్ళారు. పూజ్యశ్రీమాస్టారు దర్శనానికి రాలేదు. నావలోనే కూర్చుని తదేకంగా ఆ ఘాట్‌ల వంక

చూస్తూ ఏదో ఆలోచనలలో మునిగి పోసాగారు. శ్రీమాస్టారితో పాటుగా ఇంకా కొంత మంది నావలోనే ఉండిపోయారు. ఆ సమయంలో వారు ఆ రోజుల్లో తాము ఉన్న ఇల్లు, అక్కడ విశ్వనాథ్ పుట్టటం, ఆ ఒడ్డుననే వారు చేసిన సాధనలు అదే సమయంలో త్రైలింగస్వామి వారితో పరిచయం అలా అన్నీ చెప్తూ గతస్మృతులను నెమరువేసుకున్నారు. దర్శనం అయిపోతూనే అందరూ పడవ దగ్గరకు వచ్చారు. 'ఇప్పుడు మనం త్రైలింగస్వామివారి సమాధిని చూసిరావాలి.' అంటూ లేచి నిలబడి పడవ దిగటానికి ఉద్యుక్తులౌతున్నారు. శ్రీశ్రీమాస్టారితోపాటు మరికొందరు లేచి వారి ననుసరించారు.

పూజ్యశ్రీ మాస్టారుగారికి ఆ ప్రదేశాలన్నీ సుపరిచితాలే కాబట్టి వడి, వడిగా ఆ ప్రదేశం దిశగా అడుగులు వేయసాగారు. మాస్టారితోపాటు కొంతమంది త్రైలింగస్వామి వారి సమాధి దగ్గరకు వెళ్ళారు. రాత్రి 10:00 గంటల సమయం. సమాధి తలుపులు వేసి వున్నాయి. స్వామి అనుగ్రహం. మాస్టారి కోసమే అన్నట్లుగా సమాధి తలుపులు తీశారు. ఆ సమాధి దగ్గరకు మాస్టారిని మాత్రమే వెళ్ళనిచ్చారు. నిశ్చలమైన చిత్తంతో ఈ సమాధి దగ్గర కూర్చొని ధ్యానమగ్నులైపోయారు. ఆ ధ్యానంలో స్వామి వారు చాలా విషయాలు చెప్పారుట. (అప్పుడేమీ చెప్పలేదు). మౌనంగా తిరిగి వచ్చారు. బసకు వెళ్ళిపడుకొని నిద్రపోయారందరూ.

మరునాడు విశాలాక్షి అమ్మవారి ఆలయానికి వెళ్ళామందరమూ. మాస్టారు అమ్మవారికి దగ్గరగా వెళ్ళి నిలబడే, ధ్యానంలోకి వెళ్ళిపోయారు. కాసేపయ్యాక అందరూ బయటకు వచ్చేశారు. నేను, కిశోర్ మెల్లగా వస్తున్నాము. అర్చకస్వామి వెనక్కి పిలచి 'అమ్మవారి పట్టుచీర, పసుపు, కుంకుమ, గాజులు' ఇచ్చారు. ప్రక్కనే కిశోర్ వున్నాడు. అప్పటికే మాస్టారు గుడి బయట వున్న అరుగు మీద కూర్చొని వుండగా మిగిలిన అందరూ కూడా వారితోపాటే కూర్చొని మాస్టారు చెప్పే మాటలు వింటూ వున్నారు. చీర తెచ్చి మాస్టారి చేతిలో పెట్టాను. దానిని చూస్తూనే మాస్టారు ఎంతో సంబరపడిపోతూ "చూశావా, ఇది నీది కాదు. నాకు అమ్మ ఇచ్చింది. ఈ రూపంలో అమ్మ దగ్గర్నించి నాకు ఆదేశం వచ్చింది. నన్ను కర్ణాటకకు వెళ్ళమని, ఏ.పి.లో నీ పని అయిపోయింది. ఇంక కర్ణాటకకు వెళ్ళి సైంటిఫిక్ స్పిరిచ్యువలిజం ప్రారంభించు అని ఆదేశించింది'. ఇంక నుంచీ దాని మీదే స్పీచెస్ రావాలి. దాని కోసం నేను బెంగుళూరుకు వెళ్ళాలనీ చెప్పారు. సరే అందరూ హోటల్ రూముకు వచ్చేశారు.

ఆ రోజు 6వ తేదీ, భోజనాలవీ అయిపోయాక మాస్టారు, తేజశ్రీ, శ్రీలక్ష్మి, కిశోర్ వాళ్ళు లక్నోకి బయల్దేరారు. శ్రీపటేల్‌గారు లక్నోకి వచ్చి మాస్టార్ని తీసుకొని బెంగుళూరుకు వెళ్ళారు. మిగిలిన వాళ్ళందరం యధాప్రకారంగా ఒంగోలుకు వచ్చేశాము. పూజ్యశ్రీమాస్టారు బెంగుళూరులో 7వ తేదీన వున్నారు. మళ్ళీ 8వ తేది రాత్రికి శ్రీశివగారు మాస్టరుగారిని తీసుకొని ఒంగోలుకు వచ్చేశారు.

రాత్రింబవళ్ళు "ఆధ్యాత్మికతను వైజ్ఞానిక పంథాలో ప్రజలకు ఎలా చెప్పాలనేదే వారి తాపత్రయం" ఇదే ఆలోచనలతో సతమతమౌతుండేవారు. ఒకరోజు రాత్రి అలా పడుకునే వున్నారు. వున్నట్లుండి లేచి కూర్చొని సూక్ష్మశరీరంతో ప్రయాగ తీర్థానికి వెళ్ళివస్తున్నాను. ఎంత తమాషా అయిన విచిత్రమైన సందేశాలను ఇచ్చారో?' అని అన్నారే గానీ వాటి వివరాలను ఏ మాత్రం చెప్పలేదు. ఇంతలో ఏమి గుర్తుకు వచ్చిందో, 'సరేగానీ, గురుదేవులు వ్రాసిన సూక్ష్మీకరణసాధన పుస్తకం ఇలా ఇవ్వు' అన్నారు. ఆ పుస్తకాన్ని రాత్రికి రాత్రి అంతా చదివి అండర్‌లైన్ చేసి వెంటనే వాటిని వెబ్‌లో పెట్టమని చెప్పారు. అదంతా అయ్యాక ఉదయాన్నే ఒక సాధనను అందరికీ అందజేసారు.

ప్రతీరోజు ఆదిత్య హృదయం - 3 సార్లు

రామరక్షా స్తోత్రం - 1 సారి

శ్రీరామ రామ రామేతి రమేరామే మనోరమే
సహస్ర నామతత్తుల్యం రామనామ వరాననే ॥ ----- అనేశ్లోకాన్ని 16 సార్లు.

చివరగా భగవద్గీతలోని 9వ అధ్యాయం ఒక్కసారి చదవాలి. వైజ్ఞానిక ఆధ్యాత్మికతకు బేసిక్ సాధనగా అందరూ దీనిని చెయ్యాలని చెప్పగా తక్షణమే ఫోన్ల ద్వారా, వెబ్‌ద్వారా అందరికీ సమాచారం అందింది.

67. సూక్ష్మీకరణ సాధన

అది 2013 జనవరి నెలలో ఒక రోజున మాస్టర్‌గారు, పూజ్య గురుదేవుల సూక్ష్మీకరణ సాధన పుస్తకం చదువుతున్నారు. దాని తెలుగు అనువాదం కావాలన్నారు. తీసుకువచ్చి ఇచ్చారు.

పేజీలు తిప్పి చదువుతూ కొన్ని ముఖ్యాంశాల దగ్గర అండర్‌లైన్ చేశారు. కాసేపు మౌనంగా కూర్చున్నాక అన్నారు. "ఇప్పటి నుంచీ నేను సూక్ష్మీకరణ సాధన మీదనే పనిచేస్తాను. చాలా సీరియస్‌గా చేస్తాను అని తిరిగి పుస్తకం చదవటంలో మునిగిపోయారు. మధ్యలో ఆపి సూక్ష్మీకరణ సాధనలో ప్రధాన భాగాలైన ఐదు విషయాలను ఇలా వివరించారు.

(1) అన్నమయకోశం: అన్నమే ప్రాణంగా మారుతుంది. అన్నం తినేటప్పుడు దానిని "ప్రాణము" అనుకొని తినాలి. అన్నం మానేస్తే నీ మాట పని చెయ్యదు. (ఛాందోగ్యోపనిషత్తు)

(2) ప్రాణమయకోశం: గాయత్రీ మహావిజ్ఞాన్‌లో చెప్పిన ప్రాణాకర్షణ ప్రాణాయామం మరియు లోమ, విలోమ ప్రాణాయామాలలోను నిష్ణాతులైతే చాలు.

(3) మనోమయకోశం: "మనస్సు". దీనిని "ఇంటిగ్రెల్ యోగా" గా అరవిందో డెవలప్ చేశాడు. "గ్లామర్ ద వరల్డ్ ప్రాబ్లమ్" అని జ్వాలాకూల్ మహర్షి రాశాడు. మూడు శరీరాల ధ్యానంలో పూజ్యగురుదేవులు, దానిని డెవలప్ చేసే విధానాన్ని చెప్పారు. ఈ సమన్వయాన్ని మనోమయ కోశ సాధనతో సాధించాలి.

(4) విజ్ఞానమయకోశం: ఇప్పుడు నేను చేస్తున్నది. సాధన లోతులలోకి వెళ్ళి దానిలో వున్న సైన్సును పట్టుకోవాలి. దానికి మళ్ళీ ఆసన ప్రాణాయామాలు చెయ్యాలి. ఇవి కరెక్టుగా చేస్తేనే విజ్ఞాన మయకోశంలోకి వెళ్ళగలుగుతాము. ఇంక అక్కడ నుంచీ "అస్త్రప్రయోగము" చేసే సామర్థ్యము వస్తుంది. ఈ విజ్ఞానమునుపయోగించే, "శాంతి అస్త్రప్రయోగము, వజ్రాయుధ ప్రయోగములు" నేను చేశాను.

(5) ఆనందమయకోశము: ఆనందమయకోశములోకి సావిత్రీ సాధనను ఎక్కించాలి. సైంటిస్ట్ ఒక ప్రయోగం చేస్తే అది ఫెయిల్ అయితే దానిని మళ్ళీ మళ్ళీ చేసి, చేసి కచ్చితమైన ఫలితాలను పొందుతున్నాడు. సైన్సులో ఈనాటికి అదే పద్ధతి కొనసాగుతున్నది. సైంటిఫిక్ స్పిరిచ్యువలిజంలో ఒకే ఒక్క దెబ్బ కొట్టాలి. అదీ పద్ధతిగా కొట్టాలి. పట్టు చూచుకొని కొట్టాలి. అప్పుడే ఆ సాధనా ఫలితాన్ని పొందగలుగుతాము.

ఈనాడు చాలా మంది ఆసనాలు వేస్తుంటారు. దాని వలన వాళ్ళకు ఆరోగ్యం వస్తుంది సరే! కానీ వాళ్ళకు ఆత్మను పట్టుకోవటం చేతకావటం లేదు. అఖండజ్యోతి పత్రికలు వరసగా చదివితే

గురుదేవులు ఇచ్చిన ఆ సైన్సు అర్థమైపోతుంది. చదవండి. అంతకంటే నేనేం చెప్పగలను. చదివి ఆ సైన్సును పట్టుకోవటం నేర్చుకోండని చెప్పారు.

పూజ్యగురుదేవుల వాఙ్మయాలను చదువుతున్నారు. 'గాయత్రీశ్రీరాం' జపం జరుగుతూనే ఉన్నది. ఇంతకు ముందు నుంచీ ఉన్న ఆలోచనే. కానీ ఒక రోజు జపం చేస్తూనే మధ్యలో వచ్చి చెప్పారు. "నేను సూక్ష్మీకరణ సాధన చెయ్యాలి – నా బెడ్‌రూమ్‌ను సాధనకు అనుకూలంగా మార్చుకుంటాను. ఇంక పైన నేను మాత్రమే ఉంటాను" అని చెప్పి శ్వేతద్వీపంలో వారుండే ఇంటిని సాధనకు వీలుగా చిన్న, చిన్న మార్పులు చేసుకున్నారు. ఇంక ఆ రోజు నుంచీ వారి సాధన అంతా మేడమీదనే సాగిపోతున్నది. శ్వేతద్వీపం మేడ పై భాగాన్ని సాధనకు వీలుగా తయారుచేసుకున్నారు.

మళ్ళీ శ్రీశ్రీమాస్టరుగారిలో మునుపటి చురుకుదనం వచ్చేసింది. సాధనకు ముందునుంచే ఎంతో ప్రశాంతంగా వున్నారు. ఆధ్యాత్మికతను, వైజ్ఞానికపరంగా రూపొందించటానికి ఒక సైంటిస్ట్‌గా తాము చేస్తున్న విధానం ఆ రోజు నుంచి మరో మలుపుకు తిరిగింది.

రెండు బోర్డులు – (1) 'సూక్ష్మీకరణ సాధన ప్రయోగాలు" అనే బోర్డును వ్రాయించి మేడ మీద గోడకు పెట్టించారు. (2) "వైజ్ఞానిక ఆధ్యాత్మికత – సూక్ష్మీకరణ సాధన" (పండిత శ్రీరామశర్మ ఆచార్య వాఙ్మయాలు 28, 29) అనే పెద్ద ఫ్లెక్సీని చేయించి బయట గ్రిల్ వరండాకు పెట్టించారు. మేడమీద తామండే ఇంటిని ఒక లేబోరేటరీలాగా తయారు చేసుకున్నారు. తాము ఏర్పాటు చేసుకున్న ఆధ్యాత్మిక ప్రయోగశాల చాలా అద్భుతంగా కుదిరిందనీ దానిని చూసి "నిజంగా సైంటిఫిక్ స్పిరిచ్యువలిజం లేబోరేటరీ' లాగానే ఉందని పూజ్యగురుదేవులు చాలా అభినందించారని, 'దీనిని చాలా అద్భుతంగా డెవలప్ చేశావ్. నిజంగా ల్యాబ్ లాగానే వుంది రామకృష్ణ' అన్నారనీ చాలా చాలా ఉత్సాహంగా చెప్పారు. 'బయట వాళ్ళకు మాత్రం అక్కడ ఏమీ అర్థం కాదు. అందులోకి ఎవ్వరికీ ప్రవేశము లేదు. పైన ఉన్నంతసేపూ నా పనులు నేనే చేసుకుంటాను. ఇది చాలా పెద్ద ప్రయోగం. ఎవ్వరూ రావద్దు' అంటూ దానిని గురించిన వివరాలు చెప్పారు.

పగలంతా మామూలుగానే ఉండేవారు. రాత్రిళ్ళు ఏకాంతసాధన చేసుకునేవారు. భోజన విషయానికి వస్తే "ఒంటరిగా నేను ఒక్కణ్ణే కూర్చొని భోజనం చేస్తాను. సాధనా సమయంలో

బయట వూళ్ళకి వెళ్ళే కార్యక్రమాల జోలికి వెళ్ళటం మానేస్తా"నని సూక్ష్మీకరణ సాధన మొదలుపెట్టే ముందు చెప్పారు. "ఇది నా క్రొత్త జీవితం. నాకు అన్నీ క్రొత్త వస్తువులే కావాలి. పూజ్య గురుదేవులు ధరించే ఖద్దరు బట్టలు లాంటివి 7 జతలు తయారు చేయించమని" చెప్పారు. కొత్త వాచీ, కొత్త బట్టలు, అన్నీ కొత్తవే తెప్పించమన్నారు. "అఖండ గురుసత్తా, జగజ్జనని మహాయోగీశ్వరీదేవి" ఫోటోలను అందంగా ఫ్రేములు కట్టించి తమ గదిలో పెట్టించుకున్నారు. కావలసిన పుస్తకాలను, లాప్‌టాప్‌ను, చక్కగా అమర్చిపెట్టుకున్నారు. అంతా సర్దిపెట్టుకున్నాక శ్రీ త్రైలింగస్వామివారి ప్రార్థన శ్లోకాన్ని వ్రాయించి, కనిపించే విధంగా పెట్టుకున్నారు.

వసంత పంచమి నుంచీ సాధనను ప్రారంభించారు. శ్రీరంగనాథ్‌గారితో నగల కొట్టుకు వెళ్ళి వ్రేలికి ఉంగరం, బ్రాస్‌లెట్ కొని వేసుకున్నారు. వీటిని సైంటిఫిక్ స్పిరిచ్యువలిజంకు ఆయుధాలుగా ఉపయోగించుకుంటానని చెప్పారు.

తెల్లవారుఝామున 3 గంటలకే నిద్రలేవటం కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ త్రాగి లాబ్‌లోకి వెళ్ళిపోయేవారు, ఉదయం 6 గంటలదాకా సాధన, గురుదేవుల వాఙ్మయాలను అధ్యయనం చెయ్యటం, ప్రజ్ఞాగీతాలను వినటం చేస్తుండేవారు. మూడు రోజులకొక వాఙ్మయాన్ని పూర్తిచేయటంతో పాటు అందులో ఇవ్వబడిన సాధనలను పూర్తి చేస్తుండేవారు. ఇన్సులిన్ తీసుకోవటం మానేశారు. ఆహారంలో చిన్నచిన్న మార్పులు చేసుకుంటూ రోజూవారీ మందులను జాగ్రత్తగా వాడుకుంటూ ఆరోగ్యాన్ని సరిచేసుకోవటం మొదలుపెట్టారు. రథసప్తమిరోజున శ్రీమతి తేజశ్రీ, జగన్నాథ్ వాళ్ళు వచ్చారు. గత కొన్ని రోజులుగా చదువుతున్న గురుదేవుల వాఙ్మయాలనన్నింటినీ "వైజ్ఞానిక – ఆధ్యాత్మిక" కోణంలో ఎక్కడెక్కడ అండర్‌లైన్ చేశారో వాటన్నింటినీ ఒక్క ఫైల్‌గా తయారు చేసిపెట్టమని చెప్పారు. అందులో వున్న కొన్ని ముఖ్యాంశాలను అటు తెలుగు, ఇటు ఇంగ్లీషు భాషలలోకి అనువదించి "రేపు జరుగబోయే పూర్ణాహుతికి" వాటిని తయారుచేసి తెచ్చి ఇవ్వమని చెప్పారు. సమయం దగ్గరపడుతున్నది. అందుచేత ఆ పనిని తేజ, చందన, వల్లీ వాళ్ళు త్వరితగతిన తయారుచేసి మాస్టరుగారికి కావలసిన రీతిలో తయారుచేసి ఇచ్చారు.

సూక్ష్మీకరణ సాధన మొదలుపెట్టాక మాస్టారిలో ఉత్సాహం, చురుకుదనం వచ్చేశాయి. పగలంతా పని, రాత్రంతా సాధనా, అయినా అలసటగా లేదనేవారు. అదంతా గురుదేవుల చలువ

కాక మరేమౌతుంది. ఆయన తన పనిని చేయించుకోవటానికి తమ అండదండలను అనేక విధాలుగా అందిస్తూనే వున్నారు.

ఫిబ్రవరి 15వ తేది నుంచి 23వ తేదీ వరకు అందరినీ నవరాత్రి సాధనగా రోజుకు 27 మాలలు గాయత్రీజపం చెయ్యమని చెప్పారు. దీనిని **మహాకుంభమేళా విశిష్ట సాధన** అని ప్రకటించారు. త్రివేణికి వెళ్ళిసాధన చేస్తున్నామనే భావనతో జపం చెయ్యమని సూచించారు. పూర్ణాహుతి మాత్రం గుంటూరు 'సప్తర్షి ఆశ్రమం'లో 2013 ఫిబ్రవరి 22, 23, 24వ తేదీలు ఎంతో ప్రయోగాత్మకంగా జరుగుతుందని చెప్పారు.

అందులో కృష్ణద్వైపాయన వ్యాసులవారు ఇచ్చిన విధంగా "యజ్ఞపూర్ణాహుతి" అయ్యాక మాస్టర్‌గారే స్వయంగా 'ఔషధీ' రూపంలో యజ్ఞభస్మాన్నిస్తాననీ, అది సకల రోగనివారిణిగా పని చేస్తుందనీ చెప్పటంతో, అందరికీ చెప్పలేని ఆనందం కలిగింది. సరే, శ్రీ విశ్వనాథ్‌గారి ఆధ్వర్యంలో సప్తర్షి ఆశ్రమంలో ఫిబ్రవరి 22, 23, 24న "మహాకుంభమేళా విశిష్ట సాధనా పూర్ణాహుతి"కి అన్ని ఏర్పాట్లు చక్కగా జరిగాయి. సాధనలో భాగంగా ఒక రోజు మాస్టారు ఇలా చెప్పారు. ప్రతీరోజూ విధిగా

(1) ఆదిత్య హృదయం – 3 సార్లు

(2) రామరక్షా స్తోత్రం – 1 సారి

(3) గీత 9వ అధ్యాయం – 1 సారి చదవండి.

3 + 1 + 1 = 5 ఇలా చేస్తే మనకు పంచముఖీ గాయత్రీ అంటే ఏమిటో అర్థమౌతుంది. అప్పుడు శ్రీ అరవిందోగారి ఇంటిగ్రెల్ యోగా అర్థమౌతుంది. మహాకుంభమేళాకు వెళ్ళినప్పుడు కాశీలో "పడవ"లో అంటే నీళ్ళలో ఉన్నప్పుడు త్రైలింగస్వామి నాకు ఈ మూడు పారాయణాల ప్రాశస్త్యాలను వివరించారు.

ఆదిత్య హృదయం అంటే గాయత్రియేగదా!

రామరక్షాస్తోత్రాన్ని శ్రీ బుధకౌశిక ఋషి నిద్రలో ఉండగా దర్శించిన స్తోత్ర రాజమది. ఇక్కడ బుధ కౌశిక అంటే 'బుధ' అనే పదం కౌశికకు అడ్జెక్టివ్. కౌశికుడు అంటే విశ్వామిత్ర ఋషి.

వారు నిద్రలో ఉన్నప్పుడు రామరక్షా స్తోత్రాన్ని దర్శించినందువలన బుధకౌశిక ఋషి అయ్యారు. నిద్రలో బుద్ధి లేచింది. ఇంక నిద్ర అనేది ఉండదు. 'తురియ' స్థితికి వెళతారు.

'రామరక్షాస్తోత్రం'లో – 'రామ' అనేది ఫార్ములా. 'రామ' అనే మాటలో మహాదేవుడు వస్తాడు. ఎందుకంటే శివుడు నిరంతరం చేసే మహామంత్రం 'రామ' మంత్రమే గద. ఆ 'రామ'యే శ్రీరామశర్మ ఆచార్య. ఆయనే 'మహా' కాలుడు. ఆ మహాకాలుడే మనకు గాయత్రీ మంత్రానిచ్చారు. ఇంక గీతలో శ్రీకృష్ణుడు ఏం చెప్పాడంటే "గాయత్రీ ఛందసామహం" అన్నాడు. ఆయన చెప్పిన "విభూతి యోగం"లో అనేక యోగరహస్యాలున్నాయి. అందుకే ఈ మూడు పారాయణలు ఆధ్యాత్మిక జగత్తుకు బేసిస్. ఈ మూడు సాధనా పరంగా గాయత్రికి అనుసంధానమైనవే. అందుకే వీటిని పంచముఖీ గాయత్రీ అన్నారు.

పడిపోయి లేవలేని స్థితిలో ఉన్న నేను ఈ పారాయణాల వలననే శక్తివంతుణ్ణి అయ్యాను. ఈ ఒక్కసాధన చాలు మిమ్మల్ని సరైన మార్గంలోకి తీసుకువెళ్ళటానికి. దీనితోపాటు నిరంతరం 'శ్వాస'ను గమనించు. దీనినే గీతలో 'సహజం కర్మ కౌంతేయ' అన్నాడు జగద్గురువు. (1) అలా ఉండగలిగితే ఇంక ప్రాణాయామాలు ఏవీ అక్కర లేదు. (2) **నిరంతరం ఆజ్ఞలో ఉంటూ 'ఒబేయింగ్ ద డివైన్ కమాండ్.' ఆ ఆజ్ఞను పాటిస్తూ ఉండాలి. అప్పుడే ఆ ఆనందం కలుగుతుంది. ఆ కమాండ్ ఆఫ్ జాయ్ ఎక్కడ నుంచీ వస్తుంది అంటే ఆజ్ఞలో నుంచీ వస్తుంది. అందుకే నిరంతరం ఆజ్ఞలో ఉండగలగాలి. అప్పుడు నాకు ఆ బాధ వుందీ. ఈ బాధ వుందీ అని ఎవరైనా అంటారా? అనరు. అలాంటి తురీయ స్థితిలో ఉండే దానినే "సాక్షి" అంటారు. ఈ సాధనలు చేస్తే ఆ స్థితికెళ్ళిపోతాం.**

రెండవరోజు సాధనకు అన్నీ గ్రామాల నుంచీ సాధకులు అత్యధిక సంఖ్యలో వచ్చారు. ఆ రోజు మాస్టారు సాధన యొక్క అసలు ఉద్దేశ్యాలను ఇలా చెప్పారు.

అసలు సాధన చెయ్యటం ఎందుకూ అంటే 'జీవాత్మ'ను పట్టుకోవటానికి.

(1) **దానికి గురుదేవులు ఇచ్చిన చక్కటి మార్గం 'సంజీవనీ సాధన'. ఆయన చెప్పిన విధంగా 9 రోజులు సాధన చేస్తే మీరు జీవాత్మను పట్టుకోగలుగుతారు.**

(2) 'కర్మ'ను చాలా స్పష్టంగా చెయ్యాలి. కర్మ ఎవరికైనా ఒక్కటే. మీరెక్కడికీ పోనవసరంలేదు. మీరు ఏ కుటుంబంలో ఉన్నారో, మీ కర్మ అక్కడే వున్నది. అక్కడ 'జీవాత్మ'లాగా జీవించటం

నేర్చుకోండి. మీరందరూ జీవాత్మలే. మీరు 2 పనులు చెయ్యాలి. (1) మీ కుటుంబం పని, (2) గురుదేవుల పని. మీరు, మీ కుటుంబాలను చూసుకుంటూ గురుదేవుల పనిని రోజుకు 2 గంటలు గానీ లేక వారానికి 6 గంటలు గానీ చెయ్యండి. అలా చేస్తే చాలు మీరు మీ జీవితాలను, కుటుంబాన్ని, సమాజాన్ని స్వర్గంగా మార్చగలుగుతారు. **ముఖ్యంగా మీరు మీ జీవాత్మను పట్టుకోండి. 9 రోజుల్లో అది అయిపోతుంది. (ఈ మాటను పదేపదే చెప్పారు)**

(3) పూజ్య గురుదేవులు వ్రాసిన 'ఆహారము – ప్రాణశక్తి' అనే పుస్తకంలోని వంటల ఫార్ములా ప్రకారంగా రోజుకో వంట చెయ్యండి. దాని వలన మీ అన్నమయకోశంలో అద్భుతమైన మార్పులు వస్తాయి. (దీనిని తెలుగులో శ్రీలక్ష్మి గారు ప్రచురించారు).

(4) తీర్థయాత్రలు చేయటం నేర్చుకోండి. ఇప్పుడున్న తీర్థయాత్రలు దేనికీ పనికిరావు. 'గాయత్రీ తీర్థ'మొక్కటే తీర్థంగా ఉన్నదీనాటికి. అందుకే అందరూ అక్కడికి వెళ్ళండి. అక్కడ అఖండజ్యోతి దర్శనం చాలా అవసరం.

దీపం ఆయనదే. ఆ సాధన చేసిన నేనూ అంతవాణ్ణే.

(5) చాలా ముఖ్యమైన పనులు చెయ్యాలి మీరు. అవేమిటంటే ముఖ్యంగా 'యుగశక్తి గాయత్రి'ని లక్ష ఇళ్ళకు తీసుకువెళ్ళాలి. దానిని చదువుతే చాలు. అంతకంటే గొప్ప స్వాధ్యాయం మీకు ఎక్కడా దొరకదు. 'నేనెవరని' తెలుసుకోవటానికి స్వాధ్యాయం చాలా అవసరం. 10 రోజులలో 1 లక్ష పత్రిక చందాదారులను చేర్పించే పనిని మొదలుపెట్టండి. ఇది చాలా అవసరం.

(6) ఆంధ్రప్రదేశ్‌లో చేయవలసిన పనులు చాలా ఉన్నాయి. ప్రతీ ఇంటిలో 108 ఆహుతులతో దీపయజ్ఞం చెయ్యాలి. అదీ మన లక్ష్యం. అది చాలా త్వరగా పూర్తి చెయ్యాలి.

(7) మీ జీవితాలలో నిజాయితీ, బాధ్యత, వివేకము, సాహసములు ప్రతీక్షణం నాకు కనిపించాలి. 'మహాకాలశకం' డైరీలు వ్రాయండి. అందులో ఇచ్చిన 14 పనులలో ఏ ఒక్కటి చేయలేకపోయినా ప్రాయశ్చిత్తం ఉంది. అది చేసుకోకుండా ఆధ్యాత్మిక జగత్తులో మీరు ఒక్క అడుగైనా ముందుకు వెయ్యలేరు. ప్రాయశ్చిత్తంలో పాటించాల్సిన నియమాలు:

1. నేనీ తప్పు చేశాను. 2. నా వలన ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని మీకు, మీరుగా గుర్తించుకోగలగాలి. దానిని గురుదేవుల పటం ముందు కూర్చొని ఆ తప్పును స్పష్టంగా చెప్పుకోగలగాలి.

దానికి ప్రాయశ్చిత్తం ఆయనే చేస్తారు. మీరు చేసిన తప్పును ఒక పేపరు మీద వ్రాసుకొని దానికే రకమైన ప్రాయశ్చిత్తం చేసుకోవాలో కూడా వ్రాసుకొని గురుదేవుల పోటో ముందు పెట్టండి. క్షమాప్రార్థన చేసుకోండి. గురుదేవులే దానికి తగిన ప్రాయశ్చిత్తం అప్పుడు చేస్తారు. అదీ మీ సాధన.

ఆ రోజు సాయంత్రం క్లాసులో ఇంకాస్త సరళమైన సాధన చెప్పారు. పరమ పూజ్యగురుదేవులు రావలసిన దాని కంటే 200సంవత్సరాల ముందే వచ్చేసారు. ఆయన ఎందుకు వచ్చారూ అన్నది ఆయన పుస్తకాలు చదువుతే అర్థమౌతుంది. చదవండి ముఖ్యంగా 'జీవాత్మ'ను పట్టుకోటానికే ఆయన 'సంజీవనీ' సాధన నిచ్చారు. 9రోజులలో అయిపోతుంది. నేనెవరనేది తెలిశాక మీరిలాగా వుండరు. ఇంకోలాగా వుంటారు. మీరు నా దగ్గరకి వస్తారని నాకు ముందే తెలుసు. వెతుకుతున్నాను. వేమన శతకంలో చెప్పిన 'వినురవేమా' లో రావాల్సిన వాడు రాలేదు. కానీ జరగాల్సిందంతా జరిగిపోయింది.

సత్యయుగం రావటానికి గురుదేవులు 2 విషయాలు చెప్పారు.

(1) గాయత్రీ మంత్రం చెయ్యాలి. (2) దీప యజ్ఞాలు చెయ్యాలి. యజ్ఞాలను ఆపవద్దు. మీరు చాలా గొప్పవాళ్ళు. ఆత్మ, జీవాత్మలను పట్టుకోండి.

24వ తేదీ మహాకుంభమేళా విశిష్ట సాధనా పూర్ణాహుతి. ఈ 9రోజులు సాధన చేసిన వాళ్ళేకాక, గ్రామాల నుంచీ భక్తులు వచ్చారు. సప్తర్షి ఆశ్రమం నిండిపోయింది. యజ్ఞము అనేది భౌతికంగా చేసే ఒక విశిష్టమైన క్రతువు. ఆ రోజు పూర్ణాహుతి సమయంలో ఇలా చెప్పారు."24వ తేదీ పూర్ణాహుతి. యజ్ఞపూర్ణాహుతి రోజున యజ్ఞప్రసాదం ఇస్తాను. అది మీ రోగాలను నయం చేస్తుందని" చెప్పటం వలన ఆ రోజు చాలామంది భక్తులు వచ్చారు. ఇవాళ నేను మీకు ఈ యజ్ఞ ప్రసాదాన్ని ఇస్తున్నాను. రోగాలతో బాధపడుతున్న వారందరికీ రోగ నివారణ జరుగుతుంది. అది చెయ్యటం మీకూ వస్తుంది. త్రికరణశుద్ధిగా చెయ్యటం చాలా ముఖ్యం. **యజ్ఞము అయిపోయాక "చరూ-నీరూ" ఇస్తే ఎవ్వరికైనా, ఏ రోగమైనా తగ్గిపోతుంది. దీంతో అనేక మంది రోగాలు నయంచేశాను. గాయత్రీ యజ్ఞం చేసిన తరువాత ఆ నీళ్ళను త్రాగటానికి ఇస్తే వాళ్ళ రోగాలు పోతాయి.** ఇలా చేస్తే రోగాలు తగ్గుతాయి. అది మా వల్లనే జరిగింది, అని అహంకరించకండి.

హాయిగా జీవించండి. ఇంతటి గురువు దొరకటం మీ అదృష్టం అని ఎప్పుడూ గుర్తుంచుకొండి అంటూ ఆ రోజు ప్రవచనం ముగించారు.

ఇలా అనంతమైన జ్ఞానాన్ని తమ సాధనా ప్రసాదంగా అందరికీ ఆనాడు వితరణ చేశారు. జ్ఞానమనేది ఎప్పుడూ జ్యోతిలా వెలుగుతూ మనకు అన్నింటినీ గురించిన అవగాహన కలిగేలా చేస్తుంది. ఇంకా అనుభవాన్ని ప్రసాదిస్తుంది. అయితే మనం చేయవలసినదేమిటంటే పరిపూర్ణుడైన ఆ గురువుచెంత అచంచలమైన భక్తీ, విశ్వాసాలతో ఆయనను విడువకుండా సేవించటం, వారు చెప్పిన వాటిని ఆచరణతో నిలుపుకోగలగటమే మన కర్తవ్యం. 24వ తేదీ రాత్రికి బెంగుళూరు వెళ్ళిపోయారు.

సాధారణంగా ఎండాకాలం రెండు మూడు నెలలపాటు మాస్టారు బెంగుళూరులోనే వుంటారు. అక్కడి వాతావరణం వారికి కొంత సౌకర్యంగా వుంటుంది. ఎక్కడ వున్నా వారి సాధన, స్వాధ్యాయము, సత్సంగాలు అవి జరిగిపోతూనే వుంటాయి. ఈసారి బెంగుళూరులో మే 21వ తేదీ నుంచీ "ఉపాసనీబాబావారు" చేసిన సాధనను ప్రారంభిస్తున్నారని చందన చెప్పింది. ఆ రోజు ఉదయాన్నే లేచి పంచముఖీ గాయత్రీ సాధనతోపాటు ఉపాసనీ బాబాగారు చేసిన సాధనలన్నింటినీ కూడా ఎంతో నియమనిష్టలతో చేస్తున్నారనీ, ఎందుకు చేస్తున్నారనేది మాత్రం ఎవ్వరికీ చెప్పలేదనీ చెప్పింది. ఏదో కారణార్థం లేకుండా మహాత్ములు ఏ ఒక్క చిన్న పనిని కూడా చేయరనేది అందరికీ తెలిసిన విషయమే గదా.

68. ఉగాది కానుక

ఆ రోజు ఏప్రియల్ 11వ తేదీ ఉగాది పండుగ "శ్రీవిజయనామసంవత్సరం" రాబోతుంది. తెలుగువారికి అత్యంత ప్రధానమైన, షడ్రోసోపేతమైన పండుగ. ఉదయాన్నే బెంగుళూరు నుంచీ మాస్టరుగారు ఫోను చేసి, "ఉగాది శుభాకాంక్షలు చెప్తూ – మీ అందరికీ ఇవాళ నూతన సంవత్సరపు బహుమతిగా ఒక కొత్త మంత్రాన్ని చెప్తాను. దీనిని అందరికీ ఇవాళే అందేలా చూడాలి మరి. ఈ మంత్రం అత్యంత సరళమైంది. గాయత్రీ 10 మాలలు చేస్తే ఇది ఒక్క మాల చెయ్యాలి. ఆ నిష్పత్తిలో మీరు ఎంత గాయత్రీ చేస్తే అంత సంఖ్య ఈ క్రొత్త మంత్రం చెయ్యండి. గుర్వనుగ్రహాన్ని పుష్కలంగా కురిపించే దీప్తివంతమైన మంత్రమిది అంటూ ఆ దీక్షను ఇలా చెప్పారు.

"ఓం ఐం శ్రీరామ ఆనందనాథాయ గురవే నమః ఓం" అని క్రొత్త మంత్రాన్నిచ్చారు. తక్షణమే ఆ మంత్రం ఫోన్ల ద్వారా ఒకరి నుంచీ ఒకరికి అలా వెళ్ళిపోయింది. ఈనాటికీ ఆ మంత్రాన్ని కొందరు చేస్తూనే వున్నారు.

నీ కోరిక తీరాలంటే?

మంచి ఎండాకాలం అది. శ్రీశ్రీమాస్టరుగారు బెంగుళూరులోనే వున్నారు. వారు ఎక్కడ వున్నా ఏం సాధనలు చేస్తున్నా అది అంతా విశ్వ మానవుని సుఖశాంతుల కోసమేననేది అందరికీ తెలిసిన విషయమే. మే నెల 29వ తేదీ మధ్యాహ్నం ఫోను చేసి చెప్పారు.

కాకివాయి శ్రీ-హంస-రామ ఆశ్రమాన్ని లేపాలి. అక్కడ వున్న శక్తి అందరికీ ఉపయోగపడాలి. కల్పవృక్షం లాంటి శక్తి కేంద్రమది. దానిని మరికాస్త జాగృతం చేయటానికి కొన్ని సూచనలను ఇలా చెప్పారు. మొట్టమొదటగా:-

(1) ఆశ్రమానికి కాస్త దగ్గరలో శ్రీ వెంకయ్యస్వామివారు పడుకున్న బండరాయికి దగ్గర 54 అడుగులు ఎత్తుగల హనుమంతులవారు, వారి హృదయంలో సీతారాములు దర్శనం ఇస్తున్న నిలువెత్తు ఫ్లెక్సీని అక్కడ స్థాపించాలి. దాని తరువాత

(2) పంచముఖ శివలింగం చుట్టూ వచ్చిన ప్రతీవాళ్ళూ ప్రదక్షిణలు చెయ్యాలి. అదీ శివతాండవస్తోత్రం సి.డి. పెట్టుకొని దానికి అనుగుణంగా అడుగులు వేస్తూ ప్రదక్షిణ చెయ్యాలి.

(3) స్మర్తుగామి సిద్ధక్షేత్రంతోపాటు ధునికి చుట్టూ 11 సార్లు ప్రదక్షిణలు చేస్తే మీరేం కోరుకుంటారో అది జరిగిపోతుంది. ఆరోగ్యం బాగైపోతుంది.

(4) మాతా అన్నపూర్ణేశ్వరి ఫోటో దగ్గర మనస్సులో ఒక కోరిక చెప్పుకొని, 5 దీపాలు వెల్గించి, దీపయజ్ఞం చేసి, పంచదేవతా ఆహుతులు ఇవ్వాలి. ఇలా చేస్తే సమస్త కోరికలు తీరుతాయి. అనారోగ్యం నయమైపోతుంది.

ఈ నాలుగు అంశాలను శ్రీహంసరామ ఆశ్రమంలో వారు పాటిస్తూ అక్కడికి వచ్చిన వారిచేత చేయించాలి.

దీని తరువాత సహ్యాద్రి ఆశ్రమంలో గల ప్రఖరప్రజ్ఞ, సజలశ్రద్ధల వద్ద 5 దీపాలు వెలిగించి - 108 ప్రదక్షిణలు చేస్తే సకలరోగాలు పోతాయి. కోరికలూ తీరుతాయి అని చెప్పారు.

ప్రేమ స్వరూపులైన పూజ్యశ్రీమాస్టరుగారు తమ ఆశ్రమాలన్నింటినీ ఉన్నతాశయాలతోనే స్థాపించారు. యోగసాధనాకేంద్రాలుగా కొన్ని, శక్తి సముపార్జనాకేంద్రాలుగా కొన్ని, ఈప్సిత ఫలప్రదములైన దేవాలయాలుగా కొన్నింటినీ స్థాపించారు. ఒక విశిష్టమైన సాంప్రదాయములను పునరుజ్జీవింప చేయటానికే ఆశ్రమాలను స్థాపించారు.

సామాన్యముగా మానవులు పూర్వజన్మ ఫలములననుసరించి జీవితమును గడుపుతుంటారు. ఆ కర్మ కూడా వాసనారూపమై ఉండి వారి మనస్సును, వాక్కును, పనులను అంటి వుండటం చేత వారు దాని వలన బంధింపబడి పలురకాలైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. సాధారణంగా అందరూ చెప్పేదేమిటంటే ఆ పూర్వ కర్మఫలముననుభవించి తీరవలయుననీ, అప్పుడు కానీ వాటి నుండి విముక్తిని పొందలేమని విశ్వసిస్తుంటారు.

కానీ పూజ్యశ్రీమాస్టరుగారు అలాంటి ప్రారబ్ధ కర్మలనన్నింటినీ దాటటానికి ఏదో ఒక రకమైన ప్రత్యామ్నాయ మార్గమును సూచించి – తద్వారా వారి యొక్క కర్మలను క్షయము చేయటానికి మార్గాలను సూచించేవారు. అలాంటి సరళమైన సాధనా విధానమే ఈ ప్రదక్షిణలను చేయటం మరియు దీపయజ్ఞాలను చేయటమని మనం గమనించాలి.

69. సబ్‌కాన్షియస్ సెషన్స్

పూజ్యశ్రీ మాస్టరు గారు టి.జె.పి.యస్. కాలేజీలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా చేరిన తరువాత మెల్లమెల్లగా వారి చుట్టూ ఒక చక్కటి ఆధ్యాత్మిక బృందం ఏర్పడింది. అలా ఏర్పడిన వారిలో శ్రీ రత్నాకర్‌గారి కుటుంబం ఒకటి. శ్రీశ్రీమాస్టరుగారితో పరిచయం అయిన రోజు నుంచీ ఈనాటి వరకు వారు, వారి కుటుంబసభ్యులు అందరూ మాస్టరుగారి పట్ల అవ్యాజమైన ప్రేమతో వారి సేవలో పునీతులైనారని చెప్పవచ్చు. వారి పెద్దమ్మాయి పద్మజా, అల్లుడు సురేష్‌గార్లు శ్రీమాస్టరుగారిని సాధనా క్యాంప్‌లకి తీసుకువెళుతుండేవాళ్ళు. శ్రీమతి పద్మజగారు శ్రీమాస్టరుగారి ప్రవచనాలను చక్కటి సి.డి.లుగా తయారుచేయటానికి ఎంతో కృషి చేసింది. వారి చిన్నమ్మాయి అరుణ, చిన్నల్లుడు సీతారాంగార్లు మాస్టరుగారికి కంప్యూటర్ వర్క్‌లో సహాయపడుతుండేవారు.

శ్రీశ్రీ మాస్టర్‌గారితో పరిచయం అయిన నాటి నుంచీ శ్రీరత్నాకర్‌గారు మాస్టర్‌గారింటికి వీలైనప్పుడల్లా వెళుతుండేవారు. ఒక రోజున మాస్టరుగారు రత్నాకర్‌గారికి "యువర్ వర్డ్ ఈజ్

యువర్ వాండ్" అనే పుస్తకాన్నిచ్చి చదవమన్నారు. వాక్కుకి అత్యంతశక్తి ఉన్నదనీ, వాక్ శక్తిని ఉపయోగించుకొని అనేక పనులు సాధించుకోవచ్చుననేది ఆ పుస్తక సారాంశము.

పూజ్యశ్రీమాస్టర్‌గారు వాటిని థాట్ ఫారమ్స్ అనేవారు. ఆ థాట్ ఫారమ్స్‌ని సవ్యంగా తయారు చేసుకొని ఒక సాధనగా ప్రతీ నిత్యం చేస్తుంటే, ప్రయోగిస్తే ఆ పని జరిగిపోతుంది. ఈ పద్ధతిని ఉపయోగించుకొనే నేను యు.పి.యస్.సి.లో ఒక గెజిటెడ్ పోస్టును సంపాదించుకున్నానని చెప్తుంటారు శ్రీ రత్నాకర్‌గారు.

శ్రీరత్నాకర్‌గారు ఇంకా ఇలా చెప్పారు... ఆ రోజులలో మాస్టరుగారి కుటుంబం జానకీభవన్‌లో ఉండేది. శ్రీశ్రీమాస్టర్‌గారి సోదరుడు **'శ్రీవిశ్వనాథప్రసాదు'. వారిని గురించి చెప్పాలంటే ఒక రకంగా వారు 'ఎడ్గర్‌కేసీ' లాంటి వారు. ఉన్నట్లుండి వారికి ఒకరోజున "సబ్ కాన్షియస్ సెషన్సు" మొదలయ్యాయి. ఎడ్గర్‌కేసీ యోగనిద్రలోకి వెళ్ళి అనేక విషయాలను చెప్పేవారట. అలాగే శ్రీ విశ్వనాథ్‌గారు కూడా యోగనిద్రలోకి వెళ్ళి వారి జీవితాలలో జరిగిన యదార్థాలను తు.చ. తప్పకుండా చెప్పేవారు.**

ప్రతీరోజూ పూజ్యశ్రీ మాస్టరుగారితో మాట్లాడుతూ, వారి అపారమైన జ్ఞానం వినటంతో మాస్టర్‌గారిపట్ల రత్నాకర్‌గారికి విపరీతమైన భక్తి, గౌరవం ఏర్పడ్డాయి. ఒకానొకసారి వీరే శ్రీకృష్ణుడేమోననే సందేహం వచ్చింది. ఒకరోజు ఆ ప్రశ్న అడిగారు. దానికి సమాధానంగా "ఈయన శ్రీకృష్ణుడుకాదు" అన్నారు. "మరైతే ఎవరు" అన్న ప్రశ్నకు అలా అన్నీ చెప్పకూడదు అంటూ మహాభారతయుద్ధంలో ఈయన పాల్గొనలేదు అనే హింటు ఇస్తూ ఈయన స్వామీ శివానంద అని మాత్రం చెప్పాడు. సరే ఒకరోజు స్వామీ శివానంద పుస్తకాన్ని తీసుకొని చదువుదామని మాస్టారి దగ్గరకి వెళ్ళి ఈ విషయాలన్నీ మాస్టారికి చెప్పారు శ్రీరత్నాకర్‌గారు. దానికి మాస్టారు "హీ ఈజ్ నాట్ ఏ రియలైజ్‌డ్ సోల్" అని అంటూ వేరే టాపిక్‌లోకి వెళ్ళి మాట్లాటం మొదలుపెట్టారుట.

ఇంకో సందర్భంలో శ్రీశ్రీమాస్టారిని, "ఎందుకు పరివార్ సభ్యుల్లో రకరకాలగొడవలున్నాయి" అని అడిగితే దానికి మాస్టారు "పోయిన జన్మలో కొట్టుకున్నారు. కనీసం ఈ జన్మలోనైనా కొట్టుకోకుండా వుంటారని ప్రకృతి వీళ్ళందరినీ ఒక చోట చేర్పించింది. హిస్టరీ రిపీట్స్ ఇట్సెల్ఫ్, మనుషులు మారాలి" అన్నారు. అయినా ఆ రోజులు ఎంతో బావుండేవని చెప్తుండేవారు.

తరువాత శ్రీ రత్నాకర్‌గారికి బొంబాయి, ఆ తరువాత కుప్పంకు బదిలీ అయింది. కుప్పములో నీటి సమస్య. **1983లో వర్షాలు లేవు. నీటి ఎద్దడి బాగా ఉండేది. వర్షాలు కురవటానికి శ్రీశ్రీమాస్టారు చక్కటి సొల్యూషన్ చెప్పారు. అదేమిటంటే తెల్లవారుఝామున బాగా చీకటిగా ఉన్నప్పుడు మార్నింగ్ వాక్ చెయ్యాలి. గడియారం ముల్లు తిరిగినట్లు అంటే క్లాక్‌వైజ్. ఈ నడకలో మొదటి భాగము గాయత్రీ మంత్రము మనస్సులో చెప్పుకుంటూ నడవాలి.**

రెండవ భాగంలో "కాలేవర్షతు పర్జన్యః పృథ్వీ సస్యశాలినీ, దేశోయం క్షోభరహితో బ్రాహ్మణా సంతు నిర్భయః – భావనా పూర్వకంగా మనస్సులో చెప్పుకుంటూ నడవాలి.

మూడవ భాగంలో "స్వస్తి ప్రజాభ్యః – లోకాస్సమస్తా స్సుఖినోభవంతు" ఇలా చెప్తూ నడవమని చెప్పారుట. ఈ విధంగా శ్రీ రత్నాకర్‌గారు కొన్నాళ్ళపాటు చేశారు. ఈ సాధనను కేవలం 'కుప్పములోనే' చెయ్యనక్కరలేదు. ఎక్కడ వుంటే అక్కడే కుప్పములో ఉన్నట్లు భావించుకుంటూ చేసినా ఫలితం వస్తుంది. ఈ భావనలో చెయ్యగా అక్కడ మంచి వర్షాలు కురిశాయి అని ఒక సందర్భములో చెప్పారు. ఈ సాధన సార్వజనీనమైంది. ఎవ్వరైనా చెయ్యవచ్చు.

శ్రీశ్రీమాస్టారింట్లో మేడ మీద పావురాలకని గింజలు చల్లి నీళ్ళు పెడుతుండేవారట. దానిని చూసిన శ్రీ రత్నాకర్‌గారు కూడా ఈ పద్ధతిని వాళ్ళింట్లో మొదలుపెట్టారుట. వీళ్ళింట్లో పిచ్చుకలు వచ్చి ఆరగించిపోయేవిట. **పక్షులకు సహాయం చేస్తే దేవతలకు సహాయం చేసినట్లే. పక్షులే తరువాత పరిణామక్రమంలో దేవతలుగా మారుతాయిట. చేస్తేమంచిదే గదా!**

70. కలర్ థెరపీ

తిరుపూర్‌లో ఉండగా రంగుల గురించి చెప్పారుట మాస్టారు. **ముఖ్యంగా బంగారు రంగు అన్ని రకాల నెగటివ్ వైబ్రేషన్సు (నకారాత్మకశక్తిని) తీసేస్తుంది. దీనిని వ్యక్తిగతంగా వాడవచ్చు. సామూహికంగానూ ఉపయోగించుకోవచ్చును. వ్యక్తిగతంగా ఉపయోగించినప్పుడు మనక్కావలిసిన వ్యక్తిని ఈ రంగులో వూహించుకొని వారి పైకి ఆ రంగును ఊదాలి. వెంటనే దాని ప్రభావం కనిపిస్తుంది. దాంతో కోపాలు, చిరాకులు, అసహనాలను తీసెయ్యవచ్చు. ప్రతీ క్షణం అవసరమయ్యే రంగు ఇది. సామూహికంగా కావాలంటే ఈ రంగును ఊహించుకొని ఎక్కడ కావాలో అక్కడ ఊదాలి. అక్కడ మంచి పరిస్థితులు ఏర్పడుతాయి.**

ఈ సాధన వలన మంచి పరిస్థితులు, అనుకూల వాతావరణం ఏర్పడుతాయి. దోమలు పోతాయి. పండ్లు, కూరలు సమృద్ధిగా దొరుకుతాయి. ఇంకా చౌకగానూ ఉంటాయి. ఈ రకమైన సాధనలో మొత్తం ఇండియానే కవర్ చేయవచ్చు. శ్రీశ్రీమాస్టరుగారు ఈ ప్రయోగం మొదలు పెట్టినప్పుడు 1989లో భారతదేశపరిస్థితులలో చాలా మంచి మార్పులు వచ్చాయి. అది మన మాస్టరుగారు భారతదేశానికి అందించిన గొప్ప బహుమతి. ఈ ప్రయోగంలో శ్రీరత్నాకర్ కూడా వున్నారుట.

ఒకసారి రత్నాకర్‌గారి తండ్రిగారికి హార్ట్‌ఎటాక్ వచ్చిందట. మాస్టరుగారిని సలహా అడిగితే ఇదే ప్రయోగాన్ని చెయ్యమని చెప్పారుట. "నిద్రపోతున్నప్పుడు ఈ సజెషన్ ఇవ్వాలా" అని అడిగితే దానికి మాస్టారు "ఆస్ట్రల్ బాడీ నిద్రపోతుందా? అందువల్ల ఎప్పుడైనా ఈ సంకేతాలను పంపవచ్చు" నని సలహా ఇచ్చారుట. సరే వెంటనే వారి నాన్నగారిని ఎదురుగా ఊహించుకొని ఇలా సజెషన్స్ ఇచ్చారుట.

Your heart is healthy and strong

Your heart is functioning excellently

Blood is flowing smoothly through all arteries of your body

Your physical body is healthy and strong

Your heart is healthy and strong

ఇలా 2,3 గంటలపాటు చేస్తే మనిషికి స్వస్థత చేకూరుతుంది. ఈ సాధనతో ఎలాంటి రోగాలనైనా నయం చేయవచ్చు. ఎవరికోసమైనా చెయ్యవచ్చు. ఎంతదూరంలో ఉన్నా చెయ్యవచ్చు. వాక్‌శక్తిని ఉపయోగించుకొని ఆరోగ్యమును బాగు చేసే అద్భుతమైన ప్రక్రియ ఇది. దీనిని అందరూ ఉపయోగించుకోవాలనేది పూజ్యమాస్టరుగారి ఆశయం.

మాస్టరుగారికి మనందరమూ ఎదగాలనేది కోరిక. ఏదైనా అనుకోని పరిస్థితి వచ్చినప్పుడు మీరు చెప్పండి మాస్టారూ, మేము చేస్తాము అంటుంటాము. కానీ అలాంటి పరిస్థితి సాధారణంగా ఉండేదికాదు. ఒకసారి చెప్పారు మాస్టారు, "నేను చెప్పినట్లు చేస్తే ఆ పేరు, ఫలితం నాకే వస్తుంది. **మీకేదో కొంచెం వస్తుంది. అదే మీరు స్వంతంగా ప్లాన్ చేసి చేస్తే ఆ కర్మ ఫలితాలంతా మీకే వస్తాయి.**

అప్పుడు మీరు ఎదుగుతారని" అనేవారు. వారి ఉపన్యాసాలలో ఏం చెయ్యాలో అనేది కేవలం సూచనలాగా మాత్రమే ఉంటుంది. అదీ ఆ ప్రవచనాన్ని మనం పదేపదే వింటేనే అది పూర్తిగా అర్థమౌతుంది తప్ప ఒక్కసారి విని వూరుకుంటే అది మనకు ఎక్కదు.

2004లో మహాలక్ష్మీ సాధన, దాంతోపాటు కుబేర ముద్రను గురించి చెప్పారు. ఎలాంటి పరిస్థితులనైనా ఈ కుబేర ముద్రనుపయోగించుకొని మన సమస్యలను తీసెయ్యవచ్చు. మనక్కావలసిన దానిని పొందవచ్చు.

ఇలాంటి చిన్న చిన్న సాధనలనుపయోగించుకొని మనం అనేక సమస్యల నుంచీ బయట పడవచ్చును అనే సద్భావంతో పూజ్యశ్రీ శ్రీరామకృష్ణ మాస్టరుగారు మనకిన్ని సాధనలను ప్రసాదించారు, ఉపయోగించుకుంటే మనం ధన్యులమే!!

71. "జోక్"తో రోగనివారణ

ఎవరికైనా క్లిష్టపరిస్థితులు వచ్చినప్పుడు, ఆ పరిస్థితి దాటించటానికి శ్రీశ్రీమాస్టరుగారిచ్చే ట్రీట్‌మెంటు రకరకాలుగా వుంటుంది. కొంతమందికి హోమియో మందులతో, కొంతమందికి జపాలతో, కొంతమందికి ప్రదక్షిణాలతో, కొంతమందికి ప్రాయశ్చిత్తముతో వారి సమస్యలకు నివారణోపాయాన్ని ఇచ్చేవారు.

కొన్నికొన్ని సందర్భాలలో వారిచ్చే ట్రీట్‌మెంట్ చాలా చిత్రంగా వుండేది. మన పరివార్‌లో అత్యంత సక్రియ కార్యకర్త శ్రీమతి శ్రీలక్ష్మిగారి తమ్ముడి కుమారుడు రోహిత్ వెల్లూరులో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ప్రమాదవశాత్తు రెండవ అంతస్తు నుంచీ క్రిందపడిపోగా కడుపులో పేగులు దెబ్బతిన్నాయి. స్నేహితులు హాస్పిటల్‌లో చేర్పించారు. వాళ్ళమ్మా నాన్నగార్లు వెళ్ళేసరికే ఆపరేషన్ చేశారు డాక్టర్లు. ఎక్కువగా రక్తం పోయినందున కిడ్నీలకు వెళ్ళే రక్తప్రసరణ ఆగిపోయి కిడ్నీలు పనిచెయ్యటం ఆగిపోయింది. రోహిత్ పరిస్థితి రోజుకోరకంగా ఉంటుండేది. చాలా కష్టమని డాక్టర్లు చెప్పారు. వెంటనే మాస్టారికి ఫోను చేసి చెప్పారు. మీరేం గాభరాపడకండి. రేపటికంతా నార్మల్ అయిపోతుందని చెప్పారు. వారి ఆశీర్వాదంతో మరునాటికి అలాగే జరిగింది.

కొంచెం నెమ్మదించాక రోహిత్ కూడా మాస్టారితో మాట్లాడేవాడు. "ప్రతీరోజు నీవు నాకొక మంచి జోక్ చెప్పాలి" అని మాస్టారు ఆ పిల్లవాడికొక టెస్ట్ పెట్టారు. ప్రతీరోజూ రాత్రి 8:30

నుండి 9:00 గంటల మధ్యలో ఆ అబ్బాయి మాస్టారికి ఒక జోక్ చెప్పాలి. అదీ నియమం. ఇది వినటానికి 'ఏముందిలే' అని అనిపిస్తుంది. కానీ మాస్టర్‌గారు రోహిత్‌కి అదొక ట్రీట్‌మెంట్‌లాగా ఇచ్చారు. ఎందుకంటే తనకు జరిగిన ఆపరేషన్ అయితేనేమీ, కిడ్నీ ప్రాబ్లమ్ అయితేనేమి, చదువు ఆగిపోయిన విషయమైతేనేమి, భవిష్యత్ ఏమిటీ అనే, అనేక సమస్యలతో ఆ అబ్బాయి మనస్సు నిస్పృహకులోను కాకుండా, ప్రతీరోజూ మాస్టారికి జోక్ చెప్పాలనే తాపత్రయంతో ఎన్నో పుస్తకాలను చదివి కష్టపడి వెతికి ఆ జోక్‌ను పట్టుకొనే వాడో మనం ఊహించగలం. ఆ జోక్ విని మాస్టారు అహహ్హా.... అని నవ్వాలి. అప్పుడు ఆ అబ్బాయికి ఆనందం కలిగేది. దాంతో ఆ పిల్లవాడి మనోమయ శరీరానికి పూర్తి స్వస్థత చేకూరేది.

పూజ్యశ్రీమాస్టర్‌గారిచ్చిన ఆ భిన్న ప్రక్రియవలన రోహిత్‌కు కావలసిన మానసిక స్థైర్యము వచ్చేది. మాకు మాస్టారున్నారు. నాకు త్వరగా నయమౌతుంది అనే ప్రశాంతత మనస్సును ఆవరించేది. దాంతో ఎక్కడ లేని ధైర్యం వచ్చేది. తరువాత తల్లిగారైన శ్రీమతి శైలజ ఇచ్చిన ఒక కిడ్నితో ట్రాన్సప్లాంటేషన్ అయిపోయింది. తరువాత తల్లీ, కుమారులు పూర్తి ఆరోగ్యంతో ఇప్పుడెంతో హాయిగా, ఆనందంగా వున్నారు. అలా మాస్టారు ఎవరికేదివ్వాలో దానిని ఇచ్చి వారి భౌతిక, మానసిక రోగాలకు స్వస్థతను చేకూర్చేవారు.

ఇలాంటి రోగనివారణోపాయాలు ఎన్ని ఉన్నాయో చెప్పలేం. ఎవరెవరికి ఎన్నెన్ని అనుభవాలున్నాయో చెప్పాలంటే, ఇది ఇంకెంత పెద్ద పుస్తకం అవుతుందో, అదో మహా తపస్సులాగా చెయ్యాలి.

మాస్టారిచ్చిన అపురూపమైన, ఆచరించ తగిన సూక్ష్మాలు - చేసి చూడండి.....

రంగులతో రోగనివారణ అనే అద్భుతమైన సాధనావిధానాలను పూజ్యశ్రీ మాస్టారు, శ్రీరత్నాకర్ గారికి ప్రత్యేకంగా చెప్పి, వారి చేత చేయించారు కూడా. వాటిలోని కొన్ని సాధనలను ఇక్కడ పొందుపరచుచున్నాను.

రంగులలో అతి ముఖ్యమైనది నీలిరంగు – నీలి రంగు ప్రశాంతతను, చల్లదనాన్ని, శాంతిని ప్రసాదిస్తుంది. ముఖ్యంగా నీలిరంగనేది భగవంతుని రంగు. భగవంతుణ్ణి నీలమేఘశ్యాముడని కదా అంటాము. అలాంటి నీలిరంగు మానవజీవితంలో రకరకాల ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది.

1. ఇంట్లో ఎవరికైనా జ్వరాలు వస్తుంటే మందులతో పాటు, భావనాత్మకంగా నీలిరంగు కాంతిని రోగి శరీరంలోకి పంపితే జ్వరం త్వరగా నయమౌతుంది. దీనితోపాటు ఇంకో చిన్న చిట్కాను కూడా పాటించాలి. గ్యాస్ పొయ్యిమీద చిల్లుల గరిటె పెట్టి దానిమీద కాస్త పంచదార వేసినట్లైతే ఆ ధూమము కూడా జ్వరాన్ని తగ్గిస్తుంది. అలాగే ఇంకో చిన్న చిట్కా ఏమిటంటే కాసిని నీళ్ళు తీసుకొని భావనాత్మకంగా అందులోనికి నీలి రంగుకాంతిని పంపి ఆ నీటిని రోగికి త్రాగించినా అద్భుతమైన ఫలితం వస్తుంది.

2. ఉష్ణం, ఉష్ణేన శీతలం అంటారు పెద్దవాళ్ళు. ఎదురు దెబ్బతగిలితే, ఆ బాధ నుండీ నివారణ పొందాలంటే అదే కాలుకు (దెబ్బ తగిలిన కాలుకే) మళ్ళీ అదే చోట దెబ్బ తగులుతున్నదన్న గాఢమైన ఫీలింగ్‌ను తెచ్చుకుంటే నొప్పి తగ్గిపోతుంది. ప్రాక్టికల్‌గా ఒకసారి ఒక చిన్నబాబుకు చేతివేళ్ళు కారు డోర్‌లో పడి నలిగిపోయాయి. అక్కడ ఎలాంటి వైద్యసౌకర్యం దొరకలేదు. ఆ బాధనివారణకు 'అదే వేళ్ళు డోర్‌లో పడి నలిగి మళ్ళీ నలిగిపోతున్నాయనే తీవ్రభావన'ను ఆ బిడ్డతల్లి చెయ్యగా వెంటనే బిడ్డ ఏడుపు ఆపటం జరిగింది.

3. చెయ్యి కాలింది. వెంటనే హోమియోమందు కాంథారీస్ వేస్తే పని చేస్తుంది. ఇంట్లో ఆ సమయంలో ఆ మందు లేదు. దానికి సంబంధించిన మరే మందు లేదు. అప్పుడేం చేస్తారంటే కాస్తంత పంచదారను తీసుకొని అదే కాంథారీస్ అనే భావనతో, 'నమస్కారమ్స్ మాస్టారు' అనుకొని నోట్లో వేసుకుంటే కచ్చితంగా ఆ బాధ నివారణ అవుతుంది. తర్వాత కాంథారీస్ తెచ్చి తొక్కని చోట పారబొయ్యాలి. ఇలాంటి చిన్న చిన్న టెక్నిక్‌లను "ఒక యోగి ఆత్మకథ" లో లాహిరి మహాశయుల, శ్రీ యుక్తేశ్వర్‌గిరి మొదలైనవారి జీవిత చరిత్రలో చూస్తాము.

4. మెంటల్లీ రిటార్డెడ్ పిల్లలకు – బెరైటాకార్బ్ మందు వేస్తే పని చేస్తుంది. ముఖ్యంగా బిడ్డ నెత్తిన నీళ్ళు చల్లి 7 వ్యాహృతులతో గాయత్రీ మంత్రం ఒక పదినిమిషాలపాటు ప్రతీ రోజూ చెయ్యాలి. మంచి ఫలితం ఉంటుంది.

అలాగే బంగారు రంగునెలా ఉపయోగించుకోవాలో చూద్దాం...

గోల్డెన్ ఎల్లో: బంగారు రంగు. ఇది అన్నింటి కన్నా చాలా విలువైన రంగు. **సు-వర్ణము** అంటే బంగారు రంగు అనీ, మంచి రంగు అనీ రెండు అర్థాలున్నాయి. ఈ బంగారు రంగు కాంతి

ప్రారబ్ధకర్మలను తొలగిస్తుంది. దానికా శక్తిసామర్థ్యాలున్నాయి. బంగారు రంగు ప్రారబ్ధకర్మలను కచ్చితంగా తొలగిస్తుంది.

2. ఇంట్లో ఎవరికైనా మూడ్ బాగా లేకపోయినా, కుటుంబాలలో సయోధ్యత లేకపోయినా ఇంకా అలాంటి ఏ సమస్యలనైనా సరిచెయ్యటానికి, ఆ కుటుంబసభ్యులనందరినీ ఒకే చోట ఊహించుకొని – అందరూ నవ్వుతూ నవ్వుతూ, సంతోషంగా, ఆనందంగా ఉన్నట్లు ఊహించుకుంటూ మనం చేసినా లేదా ఆ కుటుంబసభ్యులలో ఎవరు చేసినా, ఆ ఇంటి వాతావరణంలో అందమైన, ఆహ్లాదకరమైన మార్పు వస్తుంది.

ఇంకో సాధన: మన లక్ష్యం పృథ్విని స్వర్గంగా మార్చటం. దానికి సమాజాన్ని, పరిస్థితులను సరి చెయ్యాలి. 1986వ సంవత్సరంలో కరువు, కాటకాలు, యుద్ధాలు రావటంతో ప్రజాజీవితం అల్లకల్లోలమైంది. మొత్తం ప్రపంచపరిస్థితులనే మార్చివేయాల్సి వచ్చింది.

దానికి మాస్టారు ఒక చిన్నసాధనను చెప్పారు. ఎక్కడెక్కడ గొడవలు, అల్లర్లు జరుగుతున్నాయో ఆ ప్రదేశాలకి వెళ్ళి, అక్కడ కొంతమంది వ్యక్తులు కలసి కూర్చొని ఆ ప్రాంతం మీద బంగారు రంగును ఊదితే పరిస్థితులు త్వరలోనే చక్కబడతాయి. ఈ ప్రక్రియను రోజుకు 2 సార్ల చొప్పున రెండు, మూడు వారాలు చేస్తేచాలు.

3. సూరత్‌లో ఒకసారి ప్లేగువ్యాధి సంభవించింది. ఆ ప్రమాదాన్ని తొలగించటానికి కూడా ఈ ప్రయోగమే చేయగా ఆనాటి ఆ పరిస్థితి త్వరలోనే అదుపులోకి వచ్చింది.

4. మనం ఏ వూరిలో వుంటే ఆ వూరిని కూడా ఇలాంటి సాధనతో సరి చేయవచ్చు. ఇళ్ళల్లో దోమలు ఉండవు. పండ్లు, కూరలు అన్నీ తాజాగా తక్కువ ధరలకే దొరుకుతాయి. ప్రజలకు అనేక రకాలుగా ఈ సాధనతో మేలు చేయవచ్చు.

5. వాతావరణాన్ని మార్చుకోటానికి కూడా ఈ సాధనను చేయవచ్చు. ఒక్క భారతదేశంలోనే కాదు, ప్రపంచపరిస్థితులను మార్చాలన్నా శాటిలైట్ పిక్చర్‌ని ఉపయోగించుకొని పరిస్థితులను బాగుచేయవచ్చు.

ఒకసారి మాస్టారి దగ్గరకు ఒక అమ్మాయి తల్లిదండ్రులు వచ్చారు. వాళ్ళమ్మాయికి, అల్లుడికి మధ్య గొడవలు. ఎలా పరిష్కరించాలి? అదీ వాళ్ళప్రశ్న. మాస్టారు అప్పటికి వాళ్లకేదో పరిష్కారం

చెప్పి పంపించేశారు. తరువాత కొంత వివరణతో పాటు సాధనను కూడా ఇలా చెప్పారు.

భార్యా, భర్తల విషయంలో గొడవలు పోవాలంటే – అమ్మాయి కర్మ మంచిదైతే ఇంకా ఆ అమ్మాయి సాధకురాలైతే సమస్యలు చాలా సులువుగా పరిష్కరించబడతాయి. కర్మమూలాలు ఆ అమ్మాయిలోనే కనుక ఉండి వుంటే వాటి మూలాలను సమూలంగా తీసివెయ్యటం ఎంతో సులభమే కాక అవసరం కూడా. వాటిని ముందు కదిలించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ప్రారబ్ధ పరివర్తన జరగటానికి – సాధన అంచెల వారీగా చెయ్యాలి.

మొదటి చరణం – కపాలభాతి ప్రాణాయామం చేస్తూ, దాంతోపాటు భర్త పట్ల ఆమెకు గల కోపాన్ని, ద్వేషాన్ని బయటకు తోసిపారెయ్యాలి. **ఎవరి పరిస్థితికి వారే కారణం.** ముందు కపాలభాతి ప్రాణాయామంతో క్లీన్ యువర్ సెల్ఫ్. ఎన్నాళ్ళు చెయ్యాలీ అంటే పరిస్థితులు మారేటంత వరకు.

రెండవ చరణంలో భర్త కండిషన్‌ని మార్చాలి. దీనికి ఒకే ఒక్కసూత్రం 'మా ఆయన మంచి వాడు. మా ఆయన మంచి వాడు,.....' ఇదే జపం. ఇదే నామస్మరణ. ఇదే మంత్రం రోజుకో వందసార్లు అనుకోవాలి. నాతో చాలా ప్రేమగా ఉన్నాడు అని పదేపదే అనుకుంటూ వుండాలి. అదిచాలు. ఆయన మారితీరతాడు. ఇదే మంత్రం భార్య విషయంలో కూడా చేసుకోవచ్చు.

మూడవ చరణంలో వృషభ వాహిని గాయత్రీమాతను నీలిరంగు చీరలో, అభయహస్తంతో ఊహించుకోవాలి. భర్తను కూడా బ్లూ డ్రెస్సులో, ఇంకా ఆ రంగు అతని చుట్టూ ఆవరించి ఉన్నట్లు భావించాలి.

ధనలాభానికి – ప్రతీ శుక్రవారం పసుపు నీళ్ళల్లో వేసుకొని శుభ్రంగా తలస్నానం చేసి హాయిగా, ప్రశాంతంగా ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ శ్రీం శ్రీం శ్రీం. రోజుకు ఒక మాల చేస్తే మంచి ధనలాభం వస్తుంది.

72. సాదాజీవనం – ఉచ్చవిచారణ

ఈనాడు ఆధ్యాత్మికత పేరుతో ఎటు చూసినా ఆర్భాటాలు, అట్టహాసాలు, అంతస్తుకు మించిన వైభవాలు పటాటోపాలతో ప్రపంచం తళ, తళ మెరిసిపోతోంది. అలాంటి పరిస్థితుల నుంచీ మానవజాతిని దారి మళ్ళించి సనాతన, సాంప్రదాయమైన సాదా జీవన వ్యవస్థనుద్ధరింటానికి

పూజ్యమాస్టారు తమ జీవితాన్నే ఆదర్శంగా జీవించి చూపించారు. అతి సాధారణ జీవనము ద్వారా మహోన్నతస్థానాన్ని పొందారు. ఈర్ష్య, అసూయ, ద్వేషాలు, భయ, కోపాది సందేహాలు ఈనాటి దుఃఖానికి కారణాలు. నిజం చెప్పాలంటే ఇతరులలో తప్పులు పట్టటం మానేస్తే మనస్సు హాయిగా ఉంటుంది. దాని వలన మానసిక ఆరోగ్యం కలుగుతుంది. మన ఎదుట బాధల్లో ఉన్న ఆర్తులైనవాళ్ళ రూపంలో ఉన్న భగవంతునికి సేవచేసి వారి బాధను తొలగించటానికి మన సమయము, శ్రమను ఉపయోగించటంలోనే బ్రహ్మానందమున్నది.

పూజ్యశ్రీమాస్టరుగారు తమ సాధనను, తపస్సును, యోగసిద్ధులను, అద్భుతమైన జ్ఞానాన్ని అలాంటి ఆర్తుల కొరకు సద్వినియోగం చేసేవారు. ఎంతో సహజంగా సూచనల ద్వారా, సలహాల ద్వారా, అవసరమైన చోట హోమియోపతి మందుల ద్వారా వారికి ఊరటని కలుగ చేసేవారు. పరమగురువులైన వారందరి జీవితలక్ష్యం మానవులకు మేలు చేయటమేనంటారు ఇ.కె గారు. ఆనాటి దేశకాల పరిస్థితులకు ఏది ఎంత వరకు అవసరమో, ఆ పద్ధతిలోనే వారు మేలు చేస్తారు. అదీ అనంతమైన తమ ప్రేమతో. ముఖ్యంగా రోగుల పట్ల మాస్టారి వైద్యవిధానం ఎంతో విలక్షణంగా వుండేది. వైద్యానికి సంబంధించిన ఎన్నో విధానాలను వారు అవలంభిస్తున్నప్పటికీ, రోగితాలూకు కర్మబంధాల మరో కోణాన్ని వారు విస్మరించేవారు కాదు. ఆ పక్షంలో కూడా తగిన నివారణోపాయాలను చూపి ఎంతమందికో జీవనదానం చేశారు. కాలమే స్వస్థతా ధర్మం కల్గి వుంటుంది. ఒక్కొసారి అనేవారు, కర్మపరిపాకమై రోగం తగ్గే సమయం వచ్చింది కనుకే వాడు నా దగ్గరకొచ్చాడనే వారు. నేను రోగం తగ్గించాననుకుంటారు. కానీ చేసేదంతా ఆయనే. అయితే పూజ్యగురుదేవులకు నా తరపునుండీ కూడా వినతి వుంటుంది కనుకే తొందరగా తగ్గుతుందనే వారు. కొన్ని సందర్భాలలో శాంతికుంజ్‌కు ఉత్తరాలు వ్రాయమనేవారు. హోమియో విధానం, యోగాసనాలతో కొంతమందికి రోగాలను తగ్గించేవారు. గోవుకు సేవ చేయటం ద్వారా, దానికి ఆహారం పెట్టటం ద్వారా క్యాన్సర్ లాంటి వ్యాధులను నయం చేయటం చూశాము.

73. భోజనం

పూజ్యశ్రీ మాస్టర్‌గారిలో మనం నేర్చుకోవలసిన మంచి లక్షణం ఏమిటంటే అందరూ ఒక్కసారే కలసి కూర్చొని భోజనం చెయ్యాలనే నియమాన్ని పెట్టేవారు. అన్నం పరబ్రహ్మస్వరూపం. కనుక

వడ్డించేదానికి ముందే వచ్చి భోజనానికి కూర్చునేవారు. భోజనం విషయంలో స్థిమితంగా కూర్చొని మితంగానూ, హితంగానూ, రుచిని ఆస్వాదిస్తూ భుజించేవారు. ఎంత ఎక్కువమందితో కలిసి భోజనం చేస్తే వారికంత సంతోషం. వడ్డించిన వాటిని వదిలెయ్యటం గానీ, ఇది బావుందని ఎక్కువ తినటం గానీ ఉండేదిగాదు. సాధారణంగా క్రొత్తగా వచ్చినవాళ్ళు మాస్టారు అన్నం కలుపుకోగానే దగ్గరకొచ్చి చెయ్యిచాపి ప్రసాదం పెట్టమని అడిగేవారు. అలాంటి ప్రసాదం ఎంత మందికి ఎన్నిరకాల ప్రయోజనాన్ని కలుగ చేసిందో చెప్పలేం.

పూజ్యులైన పెద్దలెవరైనా వస్తే మాస్టరుగారు ఎంతో వినయవిధేయతలతో వారికి నమస్కారం చేసేవారు. వారికి దగ్గరగా కూర్చొని అనేక విషయాల గురించి సంభాషించేవారు. తమ వైపు నుండీ వారికి చెయ్యదగినదేదైనా వుంటే తక్షణం చేయించేవారు. అత్యవసరమైతే తప్ప ఎప్పుడూ ఏ కార్యక్రమాన్ని వాయిదా వేసేవారు కాదు. పరివార్ సభ్యుల ఇళ్ళల్లో జరిగే కార్యక్రమాలకు వీలైనంత వరకు వెళుతునే వుండేవారు. ఎవరికి ఏ ఆశీర్వాదాలు ఇవ్వవలసి వచ్చినా మనస్సులో గురుదేవులను ధ్యానిస్తూ హృదయం దగ్గర చెయ్యిపెట్టుకొని పుష్పంలా వారికి ఆశీర్వాదాలను కురిపించేవారు. ఎవరింటికి వెళ్ళినా పరిస్థితులకు తగ్గట్టుగా, ఎక్కడెలా వుంటే అక్కడ అలా పొందిగ్గా వుండేవారు. ఎవరి ఇళ్ళకైనా వెళ్ళినప్పుడు వారి పిల్లలు ప్రదర్శించే రకరకాలైన ఎంటర్‌టైన్‌మెంట్లు చూసి వారిని ఇంకా, ఇంకా ప్రోత్సహిస్తుండేవారు. ఎప్పుడైనా తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లల విద్యావిషయాలను గురించి సంప్రదించాలని వస్తే వారికి తగు సూచనలనిస్తుండే వారు. కొందరితోనైతే 'వీళ్ళ బాధ్యత నాది, మీరు నిశ్చింతగా ఉండండని' ధైర్యం చెప్పి పంపేసేవారు. అలా ఒక్కొక్కరితో ఒక్కోలా సందర్భాన్ని బట్టి చెప్పేవారు.

రాత్రిళ్ళు పడుకున్నాక పరమపూజ్య గురుదేవులకు సమర్పణ చేసుకుంటూ మౌనంలోకి వెళ్ళిపోయేవారు. అది చెప్పాలంటే 'ప్రతీ రాత్రీ ఒక మృత్యువు – ప్రతీ పగలు ఒక నూతన జన్మ' అనే గురుదేవులిచ్చిన ప్రజ్ఞాయోగసాధనలోకి వెళ్ళిపోయేవారు. వారు చేసే ప్రతీ పనీ ఒక యోగంలాగా, ఒక సాధనలా ఉండేది. సాధనాశిబిరాలలో తప్ప నిత్యకృత్యంలో నిర్దిష్టంగా ఒక జపంగానీ, ధ్యానంగానీ చేయటమనేది అరుదుగా వుండేది. వారిసాధనంతా 24/7 గానే ఉండేది. మాస్టారు అంతటి యోగీశ్వరులు.

74. సుకృత పెండ్లి

భారతీయ సంస్కృతిలో మొత్తం షోడశ సంస్కారాలున్నాయి. వాటిలో వివాహ సంస్కారమనేది అత్యంత పవిత్రమైనదీ, ప్రాచీనమైనదీ కూడా. పూజ్యశ్రీ మాస్టరుగారి పరిధిలోకి వచ్చిన పరివార్ సభ్యుల పిల్లలందరి పెళ్ళిళ్ళు మాస్టరుగారి సమక్షంలోనే చాలా వరకు జరిగాయి. సుధ పెళ్ళి, కిరణ్మయి పెళ్ళి, దుర్గ ఇంకా లావణ్య పెళ్ళి, ఇవంతా దాదాపు ఒక్క సంవత్సరంలోనే జరిగాయి. శ్రీశాంతారావు గారి అమ్మాయి లావణ్య పెండ్లి 2012 నవంబర్ 1వ తేదిన రేపల్లెలో జరిగింది. లావణ్య, సుకృత, రమ్య, సమీర, సింధు ఇలా చాలా మంది పిల్లలు ఒకే వయస్సు వాళ్ళు కలిసిమెలిసి ఎంతో హుషారుగా, ఆనందంగా శ్రీశ్రీమాస్టరుగారికి కంప్యూటరు పనులు చేసిపెడుతుండేవారు. వాళ్ళు ఎంతో దగ్గరి స్నేహితులు. వీళ్ళంతా లావణ్య పెండ్లికి రేపల్లెకు వచ్చారు. శ్రీశ్రీమాస్టరుగారు కూడా పెండ్లికి వచ్చారు. ముహూర్త సమయంలో వధూవరులను ఆశీర్వదించి, వచ్చి కూర్చుంటూ అన్నారు. వీలైనంత తొందరగా మా సుకృతకు కూడా పెండ్లి చేయ్యాలి. సుకృతతోపాటు మిగిలిన వీళ్ళందరికీ వీలైనంత తొందరగా పెళ్ళిళ్ళు చెయ్యాలి. చూడమ్మా! అన్నారు. సుకృత అప్పటికే మెడిసిన్ పూర్తిచేసి హైద్రాబాద్‌లోని హాస్పిటల్‌లో అప్రింటిస్‌గా చేస్తున్నది.

శ్రీమాస్టరుగారు అన్నారూ అంటే అది జరిగితీరాల్సిందే గద! అంతే 2013లో సుకృతకు చక్కటి సంబంధం కుదిరింది. వరుడు శరత్‌కుమార్. వారూ డాక్టరుగా పని చేస్తున్నారు. మారెళ్ళ వంశానికి గల ఏకైక కుమార్తె, ఎంతో అపురూపంగా పెరిగింది, ముఖ్యంగా మాస్టారికి ఆ పిల్లంటే చెప్పలేనంత ప్రాణం. ఆ అమ్మాయి చదువు గురించి, ప్రాక్టీసు గురించి, పెండ్లి గురించి వారు ఎప్పుడూ ఆలోచిస్తుండేవారు.

2013 ఆగష్టు 18వ తేదీ వివాహానికి సుమూహూర్తం కుదిరింది. తల్లిదండ్రులు, తాతగారితో సహా అందరి ఆనందానికి అవధులు లేవు. ఇంక మాస్టారి సంగతి చెప్పనవసరంలేదు. పెండ్లి దగ్గర పడింది. ఎంతో ఘనంగా పెండ్లి ఏర్పాట్లు చేశారు. 17వ తేది సుకృతను పెండ్లి కూతురిని చేశారు. పరివార్ సభ్యులందరికీ కూడా సుకృత అంటే ఎంతో అభిమానం. అందుచేత పరివార్ సభ్యులందరూ కలిసి ఆ అమ్మాయిని పెండ్లి కూతురును చేశారు. ఆనందమే ఆనందం. పిల్లలందరూ మెహందీ ఫంక్షన్ అనీ, సంగీత్ అని రకరకాల వినోదాలతో సమయాన్ని చక్కగా సద్వినియోగం చేశారు.

17వ తేదీ రాత్రికే అందరూ కళ్యాణమంటపం దగ్గరకి వెళ్ళిపోయారు. ఇంటి దగ్గర శ్రీశ్రీమాస్టరుగారు ఒక్కరే వున్నారు. వారితోపాటు నాగమణి, నేను, శిరీష వున్నాము. రాత్రి 10.30 గంటలకు మాస్టారికి బాగా ఆకలి వేసింది. తినటానికేం చేసి పెడతారు? అని అడిగారు. ఫ్రిజ్‌లో చూస్తే కాస్త దోశపిండి కనిపించింది. వెంటనే రెండు దోశలు వేసి అల్లపచ్చడి వేసి మాస్టరుగారి చేతికిచ్చాను. అవి తింటూ ఆ రోజు ఉదయం "శ్రీమతి సక్కుబాయి అమ్మగారి ఫోటో పెట్టి పూల దండలు వేసి పసుపుకుంకుమలు ఇచ్చిన" ఫోటో మాస్టరుగార్కి ఎదురుగా కనిపించింది. ఒక్కసారిగా వారి కంటిలో ఆనందాశ్రువులు కనిపించాయి. చాలా ఆనందంతో ఇదంతా మా అమ్మ ఆశీర్వచనాలే. ఆమె ఎంత గొప్ప సాధకురాలో ఎవ్వరికీ తెలియదు. మీకే కాదు, మా వాళ్ళక్కూడా తెలియదు. ఆవిడ గొప్ప 'ఇంద్రాణి' ఉపాసకురాలు. ఇప్పటికీ నన్ను ఒక కంట కనిపెట్టే ఉంటుంది. రాజ్యలక్ష్మిగారి మాట వింటానని అందరూ అనుకుంటుంటారు. కొన్ని కొన్ని సమయాలలో మా అమ్మ, రాజ్యలక్ష్మి గారి ద్వారా తాను చెప్పాలనుకున్న దానిని చెప్తుంటుంది. ఆ సమయంలో ఆవిడ మాట్లాడే విధానంలో అది నాకు చాలా స్పష్టంగా కనిపిస్తుంటుంది అని చెప్తూ దోసెలు తింటున్నారు. ఆ రోజున ఓ చిత్రం జరిగింది. అక్కడ వున్నది కేవలం 4 దోశలకి సరిపోయే పిండి మాత్రమే వున్నది. ఒక్కొక్కటి వేసి తెచ్చి ప్లేటులో వేస్తూనే ఉన్నారు నాగమణి గారు. మరి వారికి ఎంత ఆకలిగా వున్నదో తెలియదు గానీ, దాదాపు 10, 12 దోశలు వేయటం జరిగింది ఆ కాస్త పిండితో. (ఇక్కడ చెప్పటానికి సులువుగానే ఉంది కానీ ఆ రోజున దోశలు పోస్తున్న నాగమణికి, నాకు ఎంత గాభరా వచ్చిందో చెప్పలేను. ఒకపక్క పిండి అయిపోవస్తున్నది. మాస్టారేమో అలా తింటూనే ఉన్నారు. ఆపదలో గుర్తువచ్చేది మాతాజీయే గదా! మనసారా ఆవిడకు నమస్కారం పెట్టుకున్నాం. అంతే, ఉన్నది 4 దోశలయ్యే పిండి మాత్రమే. కానీ అది 12 దోశల వరకు ఎలా సరిపోయిందో, ఆ తల్లికే తెలుసు. అనాటి ఆ సంఘటనను తలుచుకుంటే ఇప్పటికీ ఆశ్చర్యంగానే ఉంటుంది.)

అలా మాస్టరుగారు తన చిన్ననాటి విషయాలను గుర్తు చేసుకుంటూ ఎంతో హాయిగా ఆ రాత్రి పడుకున్నారు. 18వ తేదీ పెండ్లికి, పెండ్లి వారితోపాటు గాయత్రీ పరివార్ సభ్యులు చాలామంది వచ్చారు. మధ్యాహ్నం భోజనాలయ్యాక మాస్టారు పరివార్ అందరితో కలిసి కాసేపు కబుర్లు చెప్పారు. అంతలో విజయశ్రీ, యుగంధర్‌గారు వచ్చి మాస్టారికి నమస్కరించారు. వెంటనే వారిని దగ్గరకి పిలిచి కూర్చోబెట్టుకొని మౌంట్ శంబళ విషయాలు ముచ్చటిస్తున్నారు. ఇంతలో శ్రీ డి.వి.యన్.బి.

విశ్వనాథ్‌గారు అక్కడికి వచ్చారు. వారిని చూస్తూనే విజయశ్రీ వాళ్ళతో విశ్వనాథంగారు రాజసూయాలు చేయటంలో మంచి ఎక్స్‌పర్ట్. వారితో మాట్లాడుకోండన్నారు. శ్రీశ్రీమాస్టరుగారి సంకేతాలకలువాటు పడ్డ యుగంధర్, విజయశ్రీగార్లు శ్రీ విశ్వనాథ్‌గారితో 'రాజసూయం' గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత 2015 డిసెంబరు 21, 22, 23 తేదీలలో శంబళలో దత్త జయంతికి అక్కడ రాజసూయ యాగం చేశారు. ఇప్పటికీ ప్రతి సంవత్సరం దత్త జయంతికి చేస్తూనే ఉన్నారు.

18వ తేదీ సాయంత్రం కళ్యాణమంటపంలో ఎదురుకోలు ఎంతో వేడుకగా జరిగింది. అనంతరం వరపూజ – సరిగ్గా ముహూర్తానికి వివాహం ఎంతో వైభవోపేతంగా జరిగింది. సరిగ్గా సమయానికి శ్రీ విఠల్‌బాబావారూ వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వచ్చిన ఆహూతులందరికీ విందుభోజనాలతోపాటుగా గాయత్రి సహస్రనామావళి పుస్తకాలను బహూకరించారు. చి.ల.సౌ. సుకృతకు పెండ్లి చెయ్యాలన్న వారి కోరిక అలా శీఘ్రంగా, ఘనంగా కోరుకున్న విధంగా జరిగిపోయింది.

సుకృత వివాహం అయిపోయాక కొన్నాళ్ళు పూజ్యశ్రీ మాస్టారు హైదరాబాద్‌లోనే వున్నారు. అది సెప్టెంబరు నెల 7వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు మాస్టరుగారు ఫోన్ చేసి ఇలా చెప్పారు. ఆ రోజు ఫోనులో మాట్లాడుతున్నప్పుడు వారి కంఠం ఎంతో దృఢంగా స్థిరంగా వున్నట్లు తోచింది. చాలా శ్రద్ధగా విను. పెన్ను, పేపరు దగ్గరుందా! రాసుకో అంటూ మొదలుపెట్టారు.

(1) ఇకనుంచీ నా జన్మదినాన్ని (పుట్టినరోజు) వినాయక చవితి రోజే జరపాలి. అక్టోబరు 14వ తేదీ కాదు.

(2) అనంతపద్మనాభ వ్రతం రోజున మాతాజీ వర్ధంతి, ఇంకా మా అమ్మగారు శ్రీమతి సక్కుబాయి గారి వర్ధంతి రెండూ ఒకే రోజున చెయ్యాలి.

(3) ఈసారి నా బర్త్‌డే కి ఎవ్వరూ హైదరాబాద్‌కు రావద్దు. ఎక్కడివాళ్ళు అక్కడే వినాయక చవితి రోజుననే నా బర్త్‌డేను కూడా చాలా బాగా చేసుకోండి. ఇది నా ఆదేశం. అందరికీ వెంటనే చెప్పాలి మరి, ఫోన్లు చేసుకుంటారో, మెస్సేజ్‌లు, మెయిల్స్ పెట్టుకుంటారో మీ ఇష్టం. కానీ కచ్చితంగా ఈ విషయాలను అందరికీ చెప్పాలని శ్రీశ్రీమాస్టరుగారు చెప్పారు. చెప్పినదేదైనా సరే, తక్షణమే చెయ్యటమనేది మాస్టరుగారు మాకు నేర్పిన మొదటి విద్య. వార్త క్షణాల మీద వెళ్ళిపోయింది.

పూజ్యశ్రీ మాస్టరుగారి మాట ప్రకారం అందరూ వినాయక చవితినాడు మాస్టర్‌గారి బర్త్‌డే ఫంక్షన్‌ని ఎక్కడివాళ్ళు అక్కడే చేసుకున్నారు. 2013 అక్టోబర్ 14వ తేదీన జరుగవలసిన బర్త్‌డేకి ఎవ్వరూ హైదరాబాద్‌కు వెళ్ళలేదు. అయితే శ్రీమతి విజయశ్రీ, యుగంధర్ వాళ్ళు కొత్తగ ఇల్లు కట్టుకున్న సందర్భంగా ఆ రోజున గృహప్రవేశమయ్యారు. ఆ కార్యక్రమానికి మాస్టరుగారు వారింటికి వెళ్ళారు. అక్కడ వారికి జన్మదిన కార్యక్రమాలను అక్కడున్న అతిథులతో ఎంతో వైభవంగా జరిపించారు. అది వారి అదృష్టమే గదా మరి!!

2014 ఫిబ్రవరిలో వసంత పంచమినాడు, రంగనాథ్ వాళ్ల ఇంటిలో గృహప్రవేశం జరిగింది.

అధ్యాయం-7

శంబళ – విశ్వశక్తి కేంద్రం (2014)

75. 2014 గాయత్రీ జయంతి సందేశం

జూన్ 2వ తేదీన శ్రీశివగారు మాస్టారిని హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. విశ్వనాథ్‌గారింటి నుంచి శంబళకు వచ్చి శంబళలో పనులను సమీక్షిస్తూ ఉండేవారు. ఊపిరి సలపనిరీతిలో శంబళతీర్థం పనులను మాస్టారు వేగవంతం చేశారు. జూన్ 6,7 తేదీలలో శ్రీయుగంధర్, విజయశ్రీగార్లతో మాస్టారు కడప దగ్గరున్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిగారిని దర్శించుకోటానికి వెళ్ళారు. అక్కడ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిగారు రచించిన తాళపత్ర గ్రంథాలను స్పృశించారు. అలానే శ్రీ బ్రహ్మారెడ్డిగారు కడపలో ఏర్పాటుచేసిన యజ్ఞానికి వెళ్ళి అందరికీ తమ ఆశీర్వాదాల నందించారు. జీవితంలో ఎక్కడ, ఎప్పుడు ఏం చెయ్యాలనుకున్నారో అక్కడికంతా వెళ్ళివచ్చారు. వారు చేయాలనుకున్న పనులను రాత్రి, పగలు అనే తేడా లేకుండా విధి, విరామం లేకుండా చేయించటమనేది మాస్టారి ప్రత్యేకత. ఎన్ని ఆశ్రమాలు స్థాపించారో అన్ని చోట్ల ఆ పని అలా సాగిపోతూనే ఉండేదనేది ఆ రోజులలో వారితో కలిసి పనిచేసినవారికి ఆ తీవ్రత ఎలా ఉంటుందనేది తెలుస్తుంది. అలానే మౌంట్ శంబళలో జూన్ 8వ తేదీన అన్నపూర్ణాలయాన్ని ప్రారంభించారు. ఆ సందర్భంలో పంచకుండీ యజ్ఞం జరిగింది. ఆనాటి వారి ప్రవచనం చిన్నదే కానీ ఆచరణీయాత్మకంగా వుంది.

మీరు గంటలు, గంటలు సాధన చేయనక్కరలేదు. భక్తి, శ్రద్ధలతో మనస్సు పెట్టి ఐదు నిమిషాలు చేస్తే చాలు. సాధన చేస్తున్నాననే దృఢవిశ్వాసంతో చేయండి. అలా చేసినప్పుడు మీరు ఒక శబరి, ఒక భరతుడి స్థాయికి చేరిపోతారు. శబరి ఎంత భక్తి, శ్రద్ధలతో పండ్లు తెచ్చి కడిగి, శుభ్రం చేసి, రామునికి నివేదన చేసేది. అలానే భరతుడు శ్రీరామపాదుకలకు నమస్కరించిన

తరువాతనే ఆ రోజు పనిని ప్రారంభించేవాడు. పని చిన్నదే గానీ అలనాడు వారు చేసిన పనులు చిరస్థాయిగా మిగిలిపోయాయి. అందరికీ ఆచరణీయాలయ్యాయి. ఈ రెండు విషయాలు చిన్నవే గానీ అందరి హృదయాలలో స్ఫూర్తినిచ్చేవిగా ఉదాత్తమైన సాధనలుగా...., ఎంతో చక్కగా చెప్పారు.

ఆ రోజు గాయత్రీ జయంతి. మేమందరం ఒంగోల్లో గాయత్రీ పీఠంలో కార్యక్రమాలు మొదలు పెట్టాము. ఇంతలో మాస్టారి దగ్గర నుంచీ ఫోన్ వచ్చింది. పీఠంలో ఏం చేస్తున్నారిప్పుడని అడిగారు. సరిగ్గా అదే సమయంలో అందరం గాయత్రీ సహస్రనామ పారాయణ చేస్తున్నాము. నేను వినాలన్నారు. వెంటనే మొబైలు ఫోనులో దానిని మాస్టారికి వినిపించాము. కొంచెం సేపు విన్నాక చెప్పారు, 'విష్ణుసహస్రనామపారాయణ, లలితాసహస్రనామ పారాయణల' మాదిరి గాయత్రీ సహస్రనామ పారాయణలు కూడా ప్రాచుర్యంలోకి తేవాలి. ఆ పనిని మీరే చెయ్యాలి. కోట్ల, కోట్ల పారాయణలు జరిగేలా చూడండని మాస్టరుగారు చెప్పగా శ్రీమతి విజయా విశ్వనాథ్‌గారు శ్రావణ పూర్ణిమకు లక్షపారాయణలు చేయించి పూర్ణాహుతి కూడా చేశారు. ఆ తరువాత అలానే చాలా మంది ఆ కార్యక్రమాన్ని నిష్ఠగా కొనసాగించారు. గాయత్రీ జయంతి అయిన వెంటనే శ్రీపటేల్‌గారి కారులో బెంగుళూరుకు వెళ్ళిపోయారు.

76. శంబళ వ్యవస్థ

మౌంట్‌శంబళనందు ప్రతీ రోజూ యజ్ఞము, సంస్కారాలు నిర్వహించబడుతుంటాయి. ప్రతీ పూర్ణిమకు యజ్ఞశాలలో చంద్ర యజ్ఞము, అంతర్యాగము, పూర్ణిమాధ్యానాలు, శివతాండవము శ్రీమతి విజయశ్రీ, శ్రీయుగంధర్‌గారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంటాయి. వీరికి తోడునీడగా వెంకటసుబ్బులుగారు, కుటుంబ సమేతంగా శంబళలో జరిగే ప్రతీ కార్యక్రమాలని బాధ్యతతో, భక్తిశ్రద్ధలతో చేస్తుంటారు. మాస్టరుగారంటే వారికి ఎనలేని ప్రేమాభిమానాలు.

భవానీశంకరం వందే శ్రద్ధా విశ్వాసరూపిణీ ।
యాభ్యాం వినా న పశ్యంతి సిద్ధాః స్వాన్తస్థ మీస్వరం ॥

పార్వతిని శ్రద్ధగా, పరమేశ్వరుణ్ణి విశ్వాసంగా తులసీదాస్ అభివర్ణించారు. భగవంతుడు వ్యక్తి రూపంలో ఉండడనీ, ఇలా సున్నితమైన పదజాలంతో చెప్పారు. భగవంతుడంటే ఒక సిద్ధాంతం యొక్క పేరు, ఆదర్శం యొక్క పేరు. ఒక వ్యక్తి యొక్క శ్రద్ధే - భవానీ, విశ్వాసమే - శంకరుడని

దాని అర్థం. శ్రీమతి విజయశ్రీ, యుగంధర్ గార్లకు అలాంటి శ్రద్ధావిశ్వాసాలున్నందువల్లనే, ఎలాంటి సదుపాయాలు లేని కొండను అందమైన 'మౌంట్‌శంబళ"గా తీర్చిదిద్దగలిగారు. "శ్రీగురుప్రియ"ను నిర్మించగలిగారు. తరువాత శ్రీగురుప్రియ పేరునకు బదులుగా SUPARNA పేరును పెట్టారు. ప్రస్తుతము "ఓం" సింబల్‌ను పెట్టి ఓం హాల్‌గా పిలుస్తున్నారు. వీరికి అండ దండలుగా మాస్టరుగారి శిష్యులు ప్రతీ విషయంలోనూ సహకరించారు. ముఖ్యంగా శ్రీమతి లీలగారు, శ్రీనాగమల్లేశ్వరరావు, రమేష్, రాము, వేణు, తీర్థ, శీను, సుధ బాధ్యతతో ఎవరి పనులు వాళ్ళు ఉత్సాహంగా చేసేవాళ్ళు.

పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది సమారోహానికి శాంతికుంజ్‌కి వెళ్ళటానికి ముందు మాస్టరు గారు మౌంట్ శంబళలో వేర్వేరు ప్రయోజనాల కోసం ఆశ్రమ వ్యవస్థలో రకరకాల మార్పులు చేశారు. 2011 సెప్టెంబర్ 30వ తేదిన రాత్రి 11 గంటలకు మాస్టర్‌గారు శంబళకు చేరుకున్నారు.

ఉదయాన లేస్తూనే శంబళలోని ఈశాన్యప్రాంతాన్ని సాధకుల సహాయంతో శుభ్రం చేయించారు. **అదేరోజు సాయంత్రం ఆగ్నేయంలో ఉన్న అన్నపూర్ణాలయం ప్రక్కనే ఉన్న మూడు శిలలను బలరామ, శ్రీకృష్ణ, సుభద్రలుగా ప్రకటించి వాటిని పావక, పవమాన, శుచి అగ్నులుగా ప్రకటించారు. అక్టోబర్ 2వ తేదీ నుంచీ ఆశ్రమంలో మార్పులు చాలా త్వరితగతిన ముందుకు సాగాయి. అక్కడ ఉన్న శ్రీదత్తవిగ్రహాన్ని బుద్ధఅవతారము దగ్గరకు, శ్రీ శిరిడీసాయి విగ్రహాన్ని మత్స్యావతారం దగ్గర ప్రతిష్టించారు.** అక్కడ ఉన్న అన్నపూర్ణాలయాన్ని తొలగించి, జీవన దేవతా సాధన అని వ్రాయించారు.

6వ తేదిన ఇచ్చిన ప్రవచనంలో మాస్టారు మనం చేసే ఆచమనాల గురించి, అగ్ని గురించి, తురీయ స్థితిని గురించి చెప్పి చివరగా ఒక గంటసేపు యోగనిద్రను చేయించారు. అక్టోబర్ 7వ తేదిన మధ్యాహ్నం జగజ్జనని మహాయోగేశ్వరీ దేవి హృదయము (ప్రాణశక్తిని) భూస్థాపితం చేశారు. దానికి ముందు కొంతసేపు శ్రీ సుపర్ణలోని నచికేత అంటే మాస్టర్‌గారి బెడ్‌రూంలో అమ్మవారి హృదయాన్ని, మహాకాలుణ్ణి ఉంచటం జరిగింది. తరువాత శ్రీమహాయోగీశ్వరీ దేవిని స్థాపించిన ప్రదేశంలోనే మహాకాలుణ్ణి కూడా స్థాపించారు. ఆ తరువాత మూడవరోజు సాయంత్రం మహా యోగీశ్వరీదేవిని సమాధి చేశారు. ఒక రెండు రోజుల తరువాత మళ్ళీ దానిని తెరచిచూడగా అమ్మవారి ముఖంలో దివ్యమైన కాంతి దేదీప్యమానంగా కనిపించింది.

దానిని చూస్తూ మాస్టారు 'అమ్మవారు తన అనంతమైన శక్తి ప్రపంచానికి విడుదల చేస్తున్నదని' చెప్పటం జరిగింది. వెంటనే కొబ్బరికాయలు కొట్టించి ఆరతినిప్పించారు. ఇంక ఆ మరుసటి రోజున శంబళ పర్వతానికి ఉత్తరమార్గ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తరువాత రోజు ఉదయాన "ధ్యాన, ధారణ, సమాధి" విశ్వవిద్యాలయము కోసము ఒక ప్రదేశాన్ని నిర్ధారించి, శుభ్రం చేయించారు. ఆ తర్వాత మెల్లమెల్లగా మహాయోగీశ్వరీదేవిని స్థాపించిన చోట అర్ధరాత్రి 2.30 గంటలకు మహాకాలుని పతిష్టించారు. సరిగ్గా 4.00గం.లకు (తెల్లవారుఝామున) మహా సూర్యదేవాలయాన్ని ప్రారంభించారు. ఇదంతా అక్టోబర్ 13వ తేది రాత్రి 9.30గం.ల నుంచీ తెల్లవార్లు జరుగుతునే వున్నది. సరిగ్గా రాత్రి 12 గంటలకు పరివార్ సభ్యులందరూ మాస్టారికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పి అందరికీ లడ్డూలు పంచారు.

14వ తేదీ ఉదయం నుంచీ మాస్టరుగారి జన్మదిన వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆ రోజు ప్రవచనంలో అతి త్వరలోనే "ధారణ, ధ్యాన, సమాధి" విశ్వవిద్యాలయంలో తురీయస్థితిని పొందగలిగే సాధనా తరగతులు ప్రారంభిస్తానని ప్రకటించారు. మాధురీ, రాజీవ్‌ల కుమారుడు 'అతుల్' జన్మదినం కూడా అదే రోజున అవడంతో పూజ్యశ్రీ మాస్టరుగారితోపాటుగా చిరంజీవి అతుల్‌కి సంస్కారము చేసి, కేక్ కట్ చేయటంలాంటి వేడుకలు ప్రతీ సంవత్సరం ఎంతో ఉత్సాహంగా చేస్తుంటారు. పూజ్యగురుదేవుల 'ప్రాణశక్తి ఏక్ దివ్య విభూతి' అనే 17వ వాఙ్మయాన్ని శ్రీమతి లక్ష్మీ, తేజశ్రీ, వల్లీ తెలుగులోకి అనువదించి ప్రింట్ చేయించి **"ప్రాణశక్తి - ఒక అమూల్య విభూతి"** అనే పేరుతో మాస్టారుచేత ఆవిష్కరింపచేశారు.

ఈ జన్మదిన వేడుకలు అయిపోయిన మరునాడు మాస్టరుగారు నిద్రలేస్తూనే 'ఈ రోజే నా జీవితములోని సత్యయుగము కోసము గురువుగారి ప్రణాళికలో మొదటి రోజు' అని చెప్తూ భవిష్యత్తులో నిర్వహించబోయే విశ్వవిద్యాలయానికి అవసరమైన విషయాలను ఇవాళ చెప్తాను అన్నారు. 10 గంటలకు క్లాసు మొదలైంది.

ధారణ, ధ్యాన, సమాధి విశ్వవిద్యాలయం కోర్సులో భాగంగా భగవద్గీత 11వ అధ్యాయంలోని 46 శ్లోకాలకు, ఇంకా భజగోవింద స్తోత్రాల్లో శ్లోకాలకు అనుసంధానము చేస్తూ సాధనాత్మక ప్రవచనాన్ని చెప్పారు. ఆ రోజు మధ్యాహ్నం శ్రీమతి అమ్మాజీగారింట్లో ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీమతి మణి, శారద, శోభగార్లు, గతంలో శ్రీమాస్టారు చెప్పిన ప్రవచాలను చక్కగా ఏరి కూర్చి

సీక్రెట్ డాక్ట్రిన్, థాట్‌ఫామ్స్, వైట్‌మాజిక్ అనే మూడు పుస్తకాలను మాస్టర్‌గారి అమృతహస్తాల మీదుగా ఆవిష్కరింపచేశారు.

జన్మదిన వేడుకలు ముగిశాక మాస్టరుగారు కోణార్క్ దేవాలయానికి ప్రయాణమయ్యారు. కోణార్క్ నుండి తిరిగివచ్చాక Meditation హాల్ ముఖద్వారానికి ఇరువైపులా, సరిగ్గా కోణార్క్ దేవాలయ ముఖద్వారమునకు ఉన్నట్లుగా, మనిషి, ఏనుగు, సింహము ప్రతిమలను పెట్టించారు. హాల్‌కు ఇరువైపులా పన్నెండు, పన్నెండు చక్రాల చొప్పున 24 చక్రాలను అమర్చారు. శంబళ మెడిటేషన్ హాల్ కోణార్క్ సూర్య దేవాలయము వలె సూర్య భగవానుని రథముగా మారిపోయినది. ఇప్పుడు మెడిటేషన్ హాల్ పేరు "సుపర్ణ". సుపర్ణ హాల్‌లో మాస్టారు "సూర్య పాదాల"ను ప్రతిష్టించారు. ప్రపంచంలో మరెక్కడా సూర్యపాదాలు లేవని మాస్టారుగారు స్వయంగా వెల్లడించారు.

మౌంట్ శంబళ - ఆధ్యాత్మిక ధ్రువ కేంద్రము

వైజ్ఞానిక ఆధ్యాత్మిక జీవనవిధానములో ఒక గొప్ప నూతన అధ్యాయము ప్రారంభించబడుచున్నది. చేతనత్వములో ఒక విశాలమయిన మార్పు రాబోతున్నది. **మానవుడు దేవతలతో కలిసి పని చేసే శుభఘడియలు ముందున్నవి. భగవంతుడిని గుర్తించగలిగే ఒక నవసామర్థ్యము మనిషికి ఇవ్వబడుతోంది.** ఈ సత్యయుగమునకు పూర్వాశ్రమముగా మానవునిలో కొంతప్రక్షాళన, స్వభావములో మార్పు, ధారణాసామర్థ్యములలో పెరుగుదల అవసరము. దేవాత్మ హిమాలయాల నుండి ఇవ్వబడుతున్న ఈ సందేశమునకు స్పందించిన మానవజాతికి పరమగురువులచే ఇవ్వబడుచున్న దీక్షా విజ్ఞానమును సమస్త మానవాళికి అందించడానికి "శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురుదేవుల"చే నెలకొల్పబడిన ఆధ్యాత్మిక ధ్రువకేంద్రము **– మౌంట్ శంబళ.**

హైదరాబాద్ నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో విజయవాడ హైవేలో బాటసింగారం క్రాస్ నుంచి 3 కిలోమీటర్ల దూరంలో దేశముఖి – పిగ్లీపూర్ గ్రామాల మధ్య గల కొండపై ఒక దివ్యజ్యోతి దర్శనం అవుతూ వుండేది. ఈ కొండ నుంచి ఓంకార నాదాలు వినపడేవని అందువల్ల ఈ కొండ దగ్గరకు ఎవరూ వచ్చేవారు కాదని, దీనికి "దేవునికొండ"గా నామకరణం చేసి దూరం నుంచే నమస్కరించుకొని వెళ్ళేవారని ఇప్పటికీ చుట్టు ప్రక్కల గ్రామస్థులు చెప్పుకుంటారు.

తర్వాత సరిగ్గా 18 సంవత్సరాలకు మాస్టరుగారు ఈ కొండను తమ పాదస్పర్శచే పునీతం చేశారు. స్వగృహప్యారడైజ్ అనే రియల్ ఎస్టేట్ సంస్థచే ఆశ్రమ నిర్మాణమునకు దానము చేయబడిన

స్థలంలో పూజ్యశ్రీమాస్టరుగారి దివ్య ఆశీస్సులతో "మౌంట్ శంబళ – ది గ్లోబల్ పవర్ సెంటర్" స్థాపించబడినది. 1988 సంవత్సరంలో మహాశివరాత్రి రోజున మంచు గడ్డలతో కూడిన భారీ వర్షం కురిసింది. పెద్ద పెద్ద (ఐస్) మంచుగడ్డలు పడ్డాయి. కానీ ఆ బ్లాకులు కరగకుండా కొన్ని రోజులపాటు అలాగే వుండిపోయాయి. చాలా మంది సైంటిస్టులు వచ్చి చూసి ఇది ఒక చమత్కారమని అన్నారు. వాళ్ళకి తెలీదు. ఈ స్థలానికి ఋషులతో సంబంధం ఉందని, ఉత్తరాన ఉన్న గురువులు ఇక్కడ ఈ శంబళను కేంద్రంగా పెట్టుకున్నారు. అలానే మూడు జ్యోతులు వరుసగా మూడు నెలల పాటు బలభద్ర, సుభద్ర మరియు జగన్నాధులు శిలల పైన కనిపించాయి. సమయం వచ్చినప్పుడు వీటి సాధనా విశేషాలు వివరిస్తానని చెప్పారు.

77. మౌంట్ శంబళ స్థాపన - పూర్వ భూమిక

దశాబ్ద కాలం క్రితం ప్రపంచాన్ని కలవరపెట్టిన అంశము "యుగాంతం" మాయన్ క్యాలెండర్ (Dooms day 21-12-2012), నోస్ట్రడామస్, వీరబ్రహ్మేంద్రస్వామిగార్ల అంచనాల ప్రకారం అటువంటి పరిస్థితులు నెలకొన్నాయని విశ్వసించారు. ఈ భవిష్యవాణులను ప్రక్కన పెడితే యుగాంతం జరిగే సంభావ్యతను అమెరికా అంతరిక్ష సంస్థ NASA గుర్తించింది. కచ్చితంగా 21-12-2012 నాటికి, (అంతరిక్షములో జరుగుచున్న మార్పులు, సూర్య కళంకాలను అధ్యయనం చేసిన తర్వాత) ఏడు రకాల వైజ్ఞానిక కారణాల ఆధారముగా ప్రళయము సంభవించవచ్చునని ఒక ఆర్టికల్‌ను పబ్లిష్ చేసింది (2010, 2011 సంవత్సరాలలో హైదరాబాద్‌లో మాస్టర్‌గారు ఇచ్చిన ప్రవచనాలలో ఈ ఏడు కారణాలను ప్రొజెక్టర్‌లో చూపించేవారు). ఆ ఏడు కారణాలలో అతి ముఖ్యమయినది "పోల్‌షిఫ్ట్".

గుంటూరు సప్తర్షి ఆశ్రమములో మాస్టర్‌గారు ఒక పెయింటింగ్ వేయించారు. ఉత్తరాన ఉన్న హిమాలయ పర్వత గుహల్లో శ్రీవెంకటేశ్వరస్వామి, దక్షిణాన ఉన్న తిరుమల కొండల్లో శ్రీ శ్యామాచరణ లాహిరీ మహాశయులు ఉన్నట్లు చిత్రించబడినది. Pole Shift అంటే ఉత్తరాన ఉన్న హిమాలయాలు దక్షిణానికి రావడం, భూగోళం తలక్రిందులవ్వడం కాదు. ఉత్తరాన హిమాలయాలలోని శక్తిధారలు దక్షిణానికి మళ్ళించబడడము. మాస్టారుగారి లైబ్రరీ పుస్తకాలలో John White వ్రాసిన "Pole Shift" పుస్తకము ఉండడం గమనార్హం. 1988 నాటి హిమవర్షపు ఘటన శంబళ, హైదరాబాద్ ద్వారా పోల్‌షిఫ్ట్ జరిగిపోయినదని మాస్టారు చెప్పారు. పరమగురుమండలి సమిష్టి కృషిచే

ప్రసాదింపబడుచున్న జ్ఞానప్రవాహము మౌంట్ శంబళచే సునియోజిత రీతిలో సమస్త ప్రపంచమునకు అందించబడుతుంది.

ఈ కొండకు క్షేత్రమహిమ ఉన్నది. అనేక యుగాల నుంచి మునులు, ఋషులు, మహావతారులు ఇక్కడ తపశ్చర్య జరిపారని తెలిసింది. (శంబళ ఏర్పడిన తర్వాత అనేక మంది మహాత్ములు శంబళను దర్శించి వారి అంతఃదృష్టితో దర్శనముచేసి చెప్పినమాట ఇది.) సముద్రమట్టానికి 800 అడుగుల ఎత్తులో ఉన్నదీ కొండ. దట్టమయిన చెట్లతో నిండి వున్న ఈ క్షేత్రమును అభివృద్ధి పరచుట దుస్సాధ్యమయిన పని. పూజ్యమాస్టారు ఆదేశిస్తే అసాధ్యము సుసాధ్యమవుతుంది. "కొండల్ని పిండి చేసే పరివారము" మాస్టరుగారికి హైదరాబాద్‌లో ఏర్పడింది. కాలపరీక్షకు నిలబడి, అనేక హేళనలు, అవమానాలను తట్టుకొని విపరీతముగా ధనమును, కాలమును, శ్రమను వెచ్చించి, శరణాగతి మంత్రముతో మాస్టారికి సమర్పణ చేసుకొని "మౌంట్ శంబళ"ను సర్వాంగ సుందరముగా మలిచి నేడు సర్వులకూ అందుబాటులో ఉంచిన "మాస్టారు గారి పరివారము" ధన్యము!!! అడుగడుగునా కఠిన పరీక్ష-అణువణువునా మాస్టారి అనుగ్రహములతో సాగిన మౌంట్ శంబళ స్థాపనను అవలోకిద్దాము.

78. శంబళ ఫీచర్స్

మౌంట్‌శంబళ-ది గ్లోబల్ పవర్‌సెంటర్‌లోని ముఖ్యమైన శక్తి కేంద్రముల యొక్క సంక్షిప్తవివరణ.

1.శంబళ తీర్థము:

మౌంట్ శంబళ కొండపైన 1988వ సంవత్సరములో మహాశివరాత్రి పర్వ వేళలో వడగళ్ళతో కూడిన పెనువర్షం కురిసింది. ఆ తరువాత వారంరోజుల వరకు కొండపైన 5,6 అడుగుల ఎత్తు గలిగిన మంచుగడ్డలు నిలిచిపోయాయి. దూరం నుంచీ చూచేవారికి ఒక పెద్ద మంచుకొండలాగా కనిపించేది. ఆ మహాశివరాత్రి రోజు వరకు కొండపైన జ్యోతి దర్శనం అయ్యేది. చుట్టు ప్రక్కల గ్రామస్తులు ఈ జ్యోతిదర్శనం చేసుకునేవారు. వర్షం పడిన ఘటన తరువాత జ్యోతి అదృశ్యమైంది. ఈ సంచలనాత్మక ఘటనపై వైజ్ఞానిక పరిశోధనలు జరిగాయి. ఈ సంఘటన జరిగిన 18 సంవత్సరాలకు ఈ కొండపైన 'మౌంట్ శంబళ ది గ్లోబల్ పవర్‌సెంటరు' స్థాపించబడినది. ఆధునిక సైంటిస్ట్‌లను కలవరపెట్టిన 'పోల్ షిఫ్ట్' అనేది జరిగిపోయింది. పోల్ షిఫ్ట్ అంటే ఉత్తర

ధ్రువం, దక్షిణధ్రువంగా మారటం కాదు. ఉత్తరధ్రువంలోని శక్తిధారలు, దక్షిణధ్రువం వైపుకు ప్రవహించటం. హిమాలయాలలోని 10,12 వేల అడుగుల ఎత్తున అదృశ్యజగత్తులో ఉండే శంబళా, దక్షిణమున హైదరాబాద్‌లోని కొండపైకి 'మౌంట్ శంబళ ది గ్లోబల్ పవర్ సెంటరు'గా భౌతిక రూపం దాల్చినది. పురాణాలలోని ఇంద్రద్యుమ్నుని కథకు ఈ మౌంట్‌శంబళా తీర్థమునకు సామ్యము కనబడుచున్నది. సత్యయుగంలో ఇంద్రద్యుమ్నుడు ప్రతిష్టించిన జగన్నాథ, బలరామ, సుభద్రా మూర్తులు, ఈ శంబళ తీర్థము వద్ద మూడు అగ్నులుగా వెలిశాయి. సత్యయుగ పునరాగమనానికిదే పెద్ద నిదర్శనం. శంబళతీర్థము వద్ద జలచికిత్సా సూక్తమును పఠించి స్నానము చేయటం వలన రోగరహిత జీవితాన్ని పొందవచ్చును.

2. గిరి ప్రదక్షిణా పథము:

సూర్యుడు శక్తి యొక్క ఉద్గమస్థానము. భూమి సూర్యుని చుట్టూ తిరుగుతూ కాంతిని, శక్తిని, వనరులను పొందుతున్నది. చంద్రుడు, భూమి చుట్టూ తిరుగుతూ సూర్యుని నుండీ భూమి గ్రహించిన శక్తిని గ్రహిస్తూ అమృతత్వంతో ప్రకాశిస్తాడు. దేవాలయం చుట్టూ చేసే ప్రదక్షిణ వలన ఆ దేవతాశక్తి యొక్క లక్షణములు మనం గమనించకున్నా అవి మనలో ఆవహింపబడతాయి. ఒక శక్తికేంద్రము చుట్టూ చేసే ప్రదక్షిణ మనలను శక్తివంతులుగా చేస్తుందనేది నిశ్చయమైన తథ్యము. అలాంటిది పరమగురుమండలి చేత ఎన్నుకోబడి, సమర్థ సద్గురువుల ఆవాసంగా ఉంటూ, ఆధ్యాత్మిక ధ్రువకేంద్రంగా విరాజిల్లుతున్న, మౌంట్ శంబళ గిరిప్రదక్షిణ, ఎన్నెన్ని భౌతిక లాభాలను ఇవ్వగలదో ఊహించలేము. అష్టసిద్ధులు, నవనిధులను ప్రసాదించే హనుమంతుని మందిరం నుండీ ప్రారంభమయ్యే ఈ గిరిప్రదక్షిణా పథములో అఖండగురుసత్తాగా సర్వమతములకు చెందిన సద్గురువులు కొలువుదీరి ఉన్నారు. సమృద్ధి, వైభవములను ప్రసాదించటానికై అష్టలక్ష్మీ మందిరములు ప్రదక్షిణాపథంలో ప్రతిష్టింపబడి వున్నాయి. శివుని యొక్క 49 మరుద్గణములకు ప్రతీకగా 49 అగ్నులు స్థాపన చేయబడి వున్నాయి. విశ్వరూప సందర్శనముగా విష్ణువు యొక్క నాలుగు ఆయుధాలు – శంఖ, చక్ర, గద, పద్మములు నెలకొల్పబడినవి. మరియొక అతి విశేషమైన సాధన కలదు. ప్రదక్షిణా పథములోని సంతానలక్ష్మి ఆలయం నుంచీ గజలక్ష్మి ఆలయం వైపుకు పరిక్రమ చేస్తున్నప్పుడు ఆర్థిక సమస్యలు, కోర్టు సమస్యలు, ఇంకా ఇతరే ఇబ్బందులున్నవారైనా, ఆయా సమస్యలు తొలగిపోతున్నాయనే భావనతో చేసుకోవాలి. అప్పుడు ఆ సమస్యలు నివారించబడతాయి.

గజలక్ష్మీ ఆలయం దగ్గర గజేంద్రమోక్షం చదవటం వలన ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయి సమృద్ధిగా జీవిస్తారు. వ్యక్తిలోని స్వాధిష్ఠానచక్రజాగరణ వలన ఇవన్నీ సాధ్యమౌతాయి. యోగుల దృష్టిలో శంబళ అనేది సూర్యశక్తి యొక్క కేంద్రము. శంబళ గిరిప్రదక్షిణ చేసే సాధకునిలో క్రమంగా సూర్యశక్తి ధారణ చేయబడుతుంది. గాయత్రీమాతను దర్శించుకొని సాధకుడు తన ప్రదక్షిణను పూర్తి చేస్తాడు. శంబళ గిరిప్రదక్షిణ మీ నెగటివ్ కర్మలను దగ్ధం చేస్తుంది. మీ కోర్కెలను తీరుస్తుంది. అంతరంగంలో యోగసాధన ప్రారంభమౌతుంది. శంబళగిరి ప్రదక్షిణ వలన దేవమానవ నిర్మాణం జరుగును.

3. దక్షిణామూర్తి ధ్యాన స్థలము, కుండలినీ రాక్:

సర్వజ్ఞత్వము, సర్వసమర్థత, సర్వవ్యాపకత్వములను ప్రసాదించే ఆ సద్గురుశక్తిని మనం మౌనంలోనే సాధించగలము. సక్రియ మౌనం ద్వారా మన చేతనత్వము శూన్యస్థితిని అనుభవిస్తుంది. ఈ శూన్యస్థితిలో సకలదేవతాశక్తులు, దివ్యవిభూతులు మనలో పలుకుతాయి. ఈ విద్యను మానవజాతికందించుచున్న జ్ఞానానందమయ స్వరూపము 'దక్షిణామూర్తి', మౌంట్ శంబళలో దక్షిణదిశలో కొలువైయున్న 'దక్షిణామూర్తి ధ్యానస్థలము' – ఒక చిన్నగుహరూపంలో ఉండి శాంత స్థితిని సహజముగా కలుగజేస్తుంది. గుహరూపమును కలిగివున్న పవిత్రమైన రాయి 'పాముపడగ ఆకారంలో' ఉండి, రాతిని రెండు సమభాగాలుగా చేస్తూ నిలువుగా ఒక చీలిక ఏర్పడి ఉన్నది. ఈ చీలిక సుషుమ్న నాడిగా, పడగాకారము జాగృతమైన కుండలినీ శక్తికి ప్రతీకగా భాసిల్లుచున్నది. ఈ స్థలవిశిష్టతను తెలిసిన మాస్టరుగారు దీనిని కుండలినీరాక్ అని పేరు పెట్టారు. సద్గురు దక్షిణామూర్తిని దర్శించుకుని మనమూ శక్తివంతులమౌదాము.

4. బ్రెయిన్ రాక్:

మానవమస్తిష్కము పరమాద్భుతముల నిధి. మెదడులోని రెండు భాగాలు, కుడిఎడమలుగా ఉండే కాన్షియస్, సబ్–కాన్షియస్‌మైండుల యొక్క సక్రియత మరియు సంతులనము పైననే వ్యక్తి యొక్క పురోగతి ఆధారపడి వుంటుంది. అతి సూక్ష్మమైన న్యూరాన్ల కదలిక నుంచీ మొదలు మెదడు యొక్క సంపూర్ణ క్రియాకలాపాలకు విద్యుదయస్కాంత శక్తి కారణమని ఈనాటి వైజ్ఞానికులు గుర్తించారు. యావద్బ్రహ్మాండంలో ఉన్న అనంతమైన ప్రాణశక్తి మెదడులో 'మెదుల్లా అబ్లాంగేటా'

ద్వారా శరీరంలోకి ధారణ చేయబడుతుంది. ప్రయత్నపూర్వకంగా మనము ఈ ధారణాశక్తులను పెంపొందించుకోవచ్చు.

మౌంట్‌శంబళాలో ప్రకృతిచే సహజసిద్ధంగా ఏర్పరచబడిన 'బ్రెయిన్‌రాక్' దగ్గర చేసే ధ్యాన, సాధనల వలన మెదడులోని అసంతులనము, రుగ్మతలు తొలగిపోయి మెదడు చురుగ్గా, ఆరోగ్యవంతంగా తయారౌతుంది. ఈ బ్రెయిన్ రాక్ పైన మానవమెదడుకు ప్రతీకగా లెఫ్ట్‌బ్రెయిన్, రైట్‌బ్రెయిన్, మెడుల్లా అబ్లాంగెటా మెదలైనవి సహజంగా ఏర్పడి హీలింగ్‌శక్తిని కలిగివున్నాయి. ప్రకృతిలోని అలౌకిక శక్తులతో ఈ క్షేత్రం అనుసంధానింపబడి ఉండటంవల్ల ఈ రాక్ దగ్గర చేసే ధ్యానం, మన మెదడులోని సూక్ష్మశక్తులను, రహస్యగ్రంథులను జాగృతం చేస్తుంది. భౌతిక పరమైన లాభంగా మన సంకల్పశక్తి పెరుగుతుంది. ఆధ్యాత్మికంగా సహస్రదళకమలం వికసిస్తుంది. సూపర్‌మైండ్ చేతనత్వమునందుకొనుటకు మౌంట్ శంబళలోని 'బ్రెయిన్‌రాక్' మంచి వేదిక.

5. భగీరథ తపస్సు:

గంగామాతను పృథ్వీ మీదకు తీసుకురావటానికి భగీరథుడు చేసిన తపస్సు పురాణాలలో ఉత్కృష్టమైన తపస్సుగా వర్ణించబడింది. తపఃఫలముగా ప్రచండవేగంతో భూమి పైకి అవతరిస్తున్న గంగాదేవిని శివుడు తన జటాఝూటంలో ధరించి పృథ్వీ జనులకు అనుకూలంగా భూమిమీద ప్రవహింపచేశాడు. అదే విధంగా మహాగొప్పవేగంతో సాగుతున్న విశ్వపరిణామక్రమము యొక్క విద్యలను మానవజాతికందించటానికై, నరమానవులను, దేవమానవులుగా తీర్చిదిద్దటానికై పరమ గురుమండలిచే ఈ మౌంట్‌శంబళ ఎన్నుకోబడినది. దేవమానవునిగా మార్చే, 'సూర్యకిరణ విజ్ఞానం' అనే గంగను ఈ భగీరథ తపస్సు వద్ద దింపుకోండి. 'యన్మండలం దీప్తి కరంవిశాలం...' అంటూ ఆ సవితృమండలాంతర్వర్తి అయిన సూర్యుణ్ణి ఈ 'భగీరథశిల' నుండీ ప్రార్థించండి.

6. విశ్వకచ్ఛపము:

దీని బొమ్మ ఇక్కడ పెట్టాలి. విశ్వకుండలినీ శక్తికి ఆధారభూతముగా ప్రకృతిసిద్ధముగా ఈ 'విశ్వకచ్ఛపము' ఏర్పడినది. దేవదానవులు అమృతం కోసం పాలసముద్రాన్ని మథించినప్పుడు మంధరపర్వతమునకు ఆధారంగా శ్రీమహావిష్ణువు కూర్మావతారం ధరించవలసి వచ్చింది. కూర్మము కుండలినీశక్తికి ఆధారశిల. మానవశరీరంలో వెనుబాము మంధరపర్వతమునకు ప్రతీక. శ్వాస,

ప్రశ్వాసలనే తాడుతో వెనుబాము అనే కవ్వమునుపయోగించి మనస్సును చిలికి అమృతత్వమును పొందాలి. ఈ ప్రక్రియకంతటికీ ఆధారమైన కూర్మశిల మానవ శరీరంలోని వెన్నుపూస చివరన ఉంటుంది. శంబళలోని విశ్వకచ్ఛపము వద్ద ధ్యానము మీ శరీరంలోని కూర్మమును జాగృత పరుస్తుంది. బహిర్గతముగా ఉన్న ఇంద్రియాలను తాబేలువలె లోపలికి మళ్ళించుకొని, ఆ ఇంద్రియాల శక్తితో కుండలినీ శక్తిని జాగృతపరచుకొని, తోటి మానవజాతినంతా ఈ విద్య వైపుకు పురికొల్పాలనే ప్రేరణను ఈ 'విశ్వకచ్ఛపము' నుండి పొందండి.

7. గోనిలయము:

గోవు సర్వదేవతా స్వరూపము. సమస్తదేవతాశక్తులు గోవునందు ఆశ్రయము పొందివున్నాయి. శ్రీకృష్ణుడు స్వయముగా గోపాలన చేసి గోవు యొక్క మహత్యమును ప్రపంచానికి వెల్లడి చేశాడు. గోసేవ వలన తీరని కోరిక లేదు. సేవావిజ్ఞానమును తెలుసుకొని, కర్మలను నశింపచేసుకుంటూ ఆధ్యాత్మికంగా పురోగతిని సాధించుటకు 'మౌంట్‌శంబళ'లో 'గోశాల' నెలకొల్పబడినది. ఈ గోశాల సహస్రగోశాలగా విస్తరింపచేసి ఇక్కడ పరిశోధన, అభివృద్ధి, స్వావలంబన విభాగాలను నెలకొల్పి గోవిజ్ఞానమును శాస్త్రీయంగా ప్రపంచానికందించే బృహత్ప్రణాళిక ప్రారంభించబడినది. ఇక్కడ పుట్టిన ప్రతి గోమాత సాక్ష్యాత్తు గోకులం నుంచి దిగివచ్చిందే అని అనడానికి కారణం ప్రతి గోవు పుణ్య తిథులలో, పండుగలలో మాత్రమే పుట్టాయి.

8. విశ్వకుండలినీ శ్రీగాయత్రీ మహాస్థూపము:

విశ్వపరిణామక్రమమును వేగిరపరచే ఉపకరణముగా "మౌంట్ శంబళ"లో "విశ్వకుండలినీ గాయత్రీ మహాస్థూపము" నిర్మించబడినది. 21-12-2012 రోజున (ఏ తేదీనైతే వినాశనము సంభవించి, మరో నూతనయుగము ప్రారంభమౌతుందని ప్రపంచమంతా భావించారో ఆ రోజున) స్థూపమునందు 24 లక్షల లిఖిత గాయత్రీ మహామంత్రమును నిక్షిప్తం చేయడం జరిగింది. సప్త చక్రములు, వాటి దళములను శిల్పితో నల్లరాయిపైన చెక్కబడిన స్థూపమును శ్రీశ్రీశ్రీ విఠలానంద సరస్వతీ మహారాజ్ (వల్లభాపురం) వారి కరకమలాలచే ప్రారంభించబడి "విశ్వ కుండలినీ స్థూపము" గా వెలుగొందుతూంది. ఈ స్థూపమునకు క్రింద భూగృహంలో యోగమాయాశక్తి, జగజ్జనని మహాయోగీశ్వరీదేవి, విశ్వకుండలినీ ఆధారంగా విగ్రహరూపంలో కొలువుతీరి, పృథ్విని వాహనంగా చేసుకొని సూక్ష్మశరీరంలోని ఏడు చక్రాలకు, చేతనాజగత్తులోని ఏడు తలములకు ప్రతీకగా ఏడు

వర్ణములు కలిగిన ఏడు శిరస్సులు, దివ్యాయుధములు ధరించి పద్నాలుగు చేతులను కలిగివుండి, యోగవిజ్ఞానమును విశ్వజనీనము చేయుచున్నది. ఈ స్థూపము వద్దనే సకల భువనాలను పాలన చేయుచున్న 'విశ్వగురువు' శివలింగ రూపమున దర్శనమిచ్చుచున్నారు. ఈ శివలింగమునకు ఇరువైపులా జటాయువు, సంపాతిల ఫొటోలు పెట్టబడి ఉన్నాయి. జటాయువు ఊపిరితిత్తుల శ్వాసను, సంపాతి డయాఫ్రం శ్వాసను సూచించును. చేతనత్వమును వికసింపచేసుకొనుటకు మనము శ్వాసవిద్యను ఆశ్రయించాలి.

49 అగ్నులు

1. అగ్ని, స్వాహా	2. పవమాన	3. పావక	4. శుచి
5. నిర్మథ్యాగ్ని	6. వైద్యుతాగ్ని	7. సౌరాగ్ని	8. హవ్యవాహ
9. సహరక్ష	10. కవ్యవాహ	11. భరత	12. వైశ్వానర
13. సభ్య	14. అవసథ్య	15. సమ్రాడగ్ని	16. పరిషద్య
17. ప్రతక్వాన్	18. అసంమృష్ట	19. ఋతధామ	20. బ్రహ్మజ్యోతి
21. ఏకపాత్	22. బుధ్నియాగ్ని	23. ప్రవాహణః	24. హవ్యవాహన
25. ప్రచేతస్	26. విశ్వవేదాః	27. కవి	28. బంభారి
29. దువస్వాన్	30. మార్జాలీయః	31. హృదయ	32. మన్యుమాన్
33. సంవర్తక	34. సహరక్ష	35. క్షామ	36. క్రవ్యదాగ్ని
37. మహిష	38. సహస	39. అద్భుత	40. వీర
41. వివిధాగ్ని	42. అర్క	43. రక్షోహ	44. ప్రతికృత
45. సురభి	46. వసుమర్యాద	47. హర్యశ్వ	48. రుక్మవాన్
49. ప్రవర			

శ్వాసవిద్యాపరముగా ఇడ, పింగళ నాడులు. మధ్యవున్న 'విశ్వకుండలినీ శ్రీ గాయత్రీ మహా స్థూపము' సుషుమ్నా నాడి. కుండలినీశక్తి సుషుమ్నా నాడి గుండా ప్రయాణించును. ఈ జ్ఞాన నేపథ్యములో శంబళలోని ఈ స్థూపము వద్ద సాధన చేసుకొని ఆ యోగమాయాశక్తిని మన జీవితాలలో సిద్ధింపచేసుకోవాలి.

9. సాందీపని ఆశ్రమం:

ప్రాచీన కాలం నుండి భారతదేశంలో గురుకుల ఆశ్రమవ్యవస్థ సాంప్రదాయముగా వస్తూ ఉన్నది. భారతదేశము రత్నగర్భగా ప్రఖ్యాతిగాంచడానికి గురుకుల ఆశ్రమ విద్యావ్యవస్థయే కారణము. పురాణాలలో అనేక ఋషి ఆశ్రమాలు మనకు దర్శనమిస్తాయి. చక్రవర్తులు సైతము తమ పిల్లలను విద్యాభ్యాసం నిమిత్తం సంవత్సరముల తరబడి ఋష్యాశ్రమాలలో వదిలివెళ్ళేవారు. శిష్యులు తమ తమ గురువులను పరబ్రహ్మస్వరూపముగా భావించి గురువుల నుండి అపౌరుషేయములైన వేదవిద్యను, జీవనీకళను, సకల అస్త్ర, శస్త్రవిద్యలను నేర్చుకునేవారు. శ్రీకృష్ణుడు తన బాల్యములో సాందీపని మహర్షి ఆశ్రమములో విద్యాభ్యాసము సాగించాడు. సాందీపని మహాముని ఆశ్రమం ప్రకృతి రమణీయతతో ఆహ్లాదముగా, శోభాయమానంగా ఉంటూ శిష్యులకు సహజ ధ్యానస్థితిని కలగచేస్తూ ఉండేది. ఈ ఆశ్రమము యొక్క దివ్యత్వము ఎలాంటిదంటే ఆవు, సింహము తమ వైరభావములను మరచి కలిసిమెలిసి జీవించేవి. శ్రీకృష్ణుడు సాందీపని ఆశ్రమంలో రోజుకు ఒక కళ చొప్పున 64 రోజులలో అరవైనాలుగు కళలు నేర్చుకున్నాడు. మరణించిన తన గురుపుత్రుని జీవింపచేసి తన గురువుకు గురుదక్షిణ చెల్లించుకున్నాడు. గురువు పట్ల అచంచలభక్తికి, గురువు ద్వారా సాధించిన యోగశక్తులకు ఈ సంఘటన ఒక నిదర్శనం. ఇలాంటి యోగవిద్యలను నేటి మానవజాతికి అందించి భారతదేశమును తిరిగి జగద్గురుపీఠమును అధిష్టింప చేయాలని పరమగురువులు తాపత్రయపడుతున్నారు. వారి దివ్యప్రేరణతోనే మౌంట్ శంబళలో సాందీపని ఆశ్రమం నెలకొల్పబడింది. పూర్వకాలములోని ఋషుల ఆశ్రమముల వలెనే ప్రకృతి అందాలతో, దివ్య వాతావరణముతో శంబళలోని సాందీపని ఆశ్రమం శోభిల్లుతున్నది. సాందీపని ఆశ్రమం నుండి వెలువడే మహావిద్యలను సాధకులు త్వరితగతిన అందుకోవడానికై ఆశ్రమప్రాంగణంలో గాయత్రీమాత యొక్క 24 శక్తిధారల యంత్రములను ప్రతిష్టించడం జరిగింది. సాధకులు తమ పాత్రతను, యోగ్యతలను పెంచుకోవడమే తరువాయి. అఖండ నవభారత నిర్మాణమునకు నాందీస్థలముగా 'ది గ్రేట్ ఇండియా స్టార్ట్స్ ఫ్రమ్ హియర్' అని గురుదేవులచే పిలువబడిన ఈ ప్రదేశములో ఈ విద్యలను అభ్యసించి సాధన చేసి భారతదేశమును జగద్గురువుగా నిలబెట్టే క్రమంలో మనందరమూ భాగస్వాములమౌదాము.

10. విశ్వ ఆధ్యాత్మిక గ్రంథాలయం:

వైజ్ఞానిక ఆధ్యాత్మికతను స్థాపించుట గురువులందరి చిరకాల వాంఛ. పూర్వం నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలలో అఖండజ్ఞాన, విజ్ఞానాన్ని బోధించి ప్రపంచదేశాలను ఆకర్షించేవి. భారతదేశాన్ని తిరిగి జగద్గురుపీఠాన్ని అధిరోహింపచేసే ఈ పరిణామక్రమ విద్యను ప్రతి ఒక్కరికి అందచేయాలన్నది గురుపరంపర ఆదేశము. **ఈ నవయుగ నిర్మాణ సమయంలో ప్రతి మానవునికి రోగరహిత, వృద్ధాప్యరహిత, మృత్యురహిత జీవితము అందుబాటులో ఉంది.** హిమాలయాల శక్తిధారలతో నేరుగా సంబంధము కలిగివుండి ఆధ్యాత్మిక ధ్రువకేంద్రముగా విరాజిల్లుచున్న మౌంట్ శంబళ ది గ్లోబల్ పవర్ సెంటర్‌లో ఈ విజ్ఞానమే వైజ్ఞానిక ఆధ్యాత్మికతగా అందింపబడుచున్నది. వైజ్ఞానిక ఆధ్యాత్మికత నేర్చుకుంటూ మునుపెన్నడూ లేనంత వేగముగా సాగుతున్న విశ్వ పరిణామ క్రమమును అర్థము చేసుకొని దేవమానవులుగా ఎదగవచ్చుననేది డాక్టర్ శ్రీరామకృష్ణగారి ఆశ్వాసన.

ఈ విజ్ఞానాన్ని అందించడానికై మాస్టరుగారి దివ్య అనుగ్రహముతో మౌంట్ శంబళ యొక్క అతి ముఖ్యమైన విభాగాలలో ఒకటిగా ఆధ్యాత్మిక గ్రంథాలయమును నిర్మించుటకు సంకల్పించ బడినది. అఖండ గురుసత్తా అనుగ్రహముగా, మాస్టరుగారు స్వయముగా మూడుసార్లు అధ్యయనము చేసిన 12,000లకు పైగా పుస్తకాలు మనకు అందించబడినవి. అఖండగురుసత్తా సాధనలు, బోధనల గ్రంథాలే కాకుండా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రచయితల గ్రంథాలు, శాస్త్ర గ్రంథాలు, సర్వమతాల, సర్వసాంప్రదాయాల గ్రంథాలు, అరుదైన వేదసాహిత్య గ్రంథాలు, శ్రీ అట్లూరి వేంకటేశ్వరరావు గారి సాహిత్యము వారి లైబ్రరీలోని 3000 పుస్తకాలు, మొత్తము ఈ మౌంట్ శంబళ విశ్వ ఆధ్యాత్మిక గ్రంథాలయములో పొందుపరిచే బృహత్తర కార్యక్రమము కొనసాగుచున్నది.

11. మెడిటేషన్ హాలు:

ప్రతిరోజు మెడిటేషన్ హాలులో మూడు శరీరాల ధ్యానము, జ్యోతి అవతరణ సాధన, నాదయోగసాధనలు నిర్వహించబడుచున్నవి. ధ్యానమందిరములోని సాయినాథుడు, దత్తుడు, సూర్యభగవానుడు సాధకులను అనుగ్రహిస్తున్నారు. నిత్యసాధనలతో పాటు మరిన్ని విశిష్ట యోగ సాధనలు, ముద్రావిజ్ఞానము, వేదసూక్తముల అధ్యయనం, సందర్భానుసారముగా నిర్వహించబడు చున్నవి.

12. మన లక్ష్యం:

సాధన, స్వాధ్యాయము, సంయమనము, వైజ్ఞానిక సేవలను అవలంబిస్తూ మౌంట్ శంబళ ది గ్లోబల్ పవర్ సెంటర్ నుండి అఖండగురుసత్తా సాధనలు నేర్చుకొని జ్వాలాకూల్ మహర్షియొక్క 24 గ్రంథాల సారాంశమును అధ్యయనం చేసి ఆచరిస్తూ, చక్రాలతో అన్వయించిన దేవతా సాధనలను అవగాహన చేసుకొని మీ జీవితాలలో ప్రతిక్షణం, ప్రతి పనిలో యోగత్వాన్ని ఇంటిగ్రేట్ చేసుకొని, మానవునిగా జన్మించిన ప్రతి ఒక్కరూ పొందవలసిన రోగరహిత, వృద్ధాప్య రహిత జీవితంతో అమరత్వాన్ని సిద్ధింపచేసుకొని దేవమానవులుగా మారి పృథ్విపై స్వర్గావతరణను సాధించాలి.

మౌంట్ శంబళ నుండి వెలువడుతున్న శక్తిధారలను, ప్రాకృతిక శక్తులను మీలోకి దింపుకుంటూ మీలో నిబిడీకృతమైన శక్తిని వెలికితీసుకొని పరిణామక్రమములో ముందుకుసాగండి. ఇప్పుడున్న సమయంలో భక్తి, జ్ఞాన, కర్మయోగాల కన్నా, వైజ్ఞానిక ఆధ్యాత్మికత, సేవావిజ్ఞానము మిమ్మల్ని ముందుకు తీసుకువెళతాయి.

మానవుని చేతనత్వము పెంపొందించుకోవడానికి ఏడు సూర్య కిరణాలు, అఖండగురుసత్తా ద్వారా మనకు అందించబడ్డాయి. ఈ నవయగావతరణ శుభతరుణంలో గురుసత్తా చూపిన బాటలో నడవడమే కాకుండా, ఆ బాటగా మనందరమూ మారిపోదాము.

13. పూర్ణిమాధ్యానాలు:

మౌంట్‌శంబళాలో ప్రతీ పూర్ణిమరాత్రికి ప్రత్యేక సాధనలు నిర్వహించబడతాయి. కోరికలు తీర్చుకోటానికి సామూహిక గిరిప్రదక్షిణ. సద్గురువులతో సంపర్కం ఏర్పరచుకోటానికి, గురు ప్రణాళికలో ఉత్సాహంగా ముందుకు సాగగలిగేందుకు, "సమర్థ సద్గురు స్పర్శ ధ్యానం", అలాగే ప్రారబ్ధకర్మల నుండీ విముక్తిని పొందేందుకు గోశాలలో, గోవులకు సప్తధాన్య నివేదన, గోప్రదక్షిణ చేస్తారు. వీటన్నింటితో పాటు మకరసంక్రాంతికి, 'చిత్రగుప్త' వ్రతాలు నిర్వహించబడుతుంటాయి. ఇవే కాకుండా మాఘపూర్ణిమకు లలితాసహస్రనామ పూర్ణాహుతి జరుగుతుంది. మిగిలిన పర్వాలలో గాయత్రీ నవరాత్రులు, చైత్ర నవరాత్రులు, మాస్టరుగారి ఆరాధన మహోత్సవం, అనంతపద్మనాభ వ్రతాలు, శ్రీమహాలక్ష్మీసాధన అన్నీ యధావిధిగా నిర్వహించటం చేస్తారు. ఇక్కడ థియోసాఫికల్

సొసైటీని స్థాపించి క్లాసులు నిర్వహిస్తున్నారు. ప్రతి పూర్ణిమ రోజున ఇక్కడ "చంద్రగాయత్రీ సహిత సప్తగోప్రదక్షిణ" యజ్ఞమును నిర్వహింపబడును. అరుదైన ఈ యజ్ఞములో పాల్గొన్నవారికి ఆరోగ్యము, సంపదలు, సకలశుభములు లభించగలవు.

హోటల్ అంబరీష్: ఆహారమే మనస్సుగా మారుతుంది అనే లక్ష్యంతో హోటల్ అంబరీష్‌ను పెట్టమని శ్రీనారాయణరావుగారిని మాస్టారు సూచించారు. మాస్టరుగారి మాటను వేదంగా భావించే నారాయణరావుగారు తక్షణమే ఎంతో అందంగా ఆ హోటల్ కట్టించారు. అందమైన, దివ్యమైన వాతావరణంలో, ప్రకృతి ఒడిలో ఆహారం తింటున్నామనే అనుభూతిని కలిగించే విధంగా శ్రీనారాయణరావుగారు దానిని తీర్చిదిద్దారు. 2014 అక్టోబరు14వ తేదీన ప్రతిఒక్కరూ వచ్చి మాస్టరుగారి ప్రసాదంగా అందరూ భోజనాలు చేశారు. మాస్టరుగారి మాటను శిరసావహించి, వారి ప్రణాళికను కార్యరూపంలో పెట్టిన శ్రీనారాయణరావుగారి కుటుంబానికి మాస్టరుగారి ఆశీస్సులు పరిపూర్ణంగా లభించును గాక!

2012 డిసెంబర్ 25వ తేదీ క్రిస్టమస్ రోజున Green Hills Colony సెంటర్ లోకి గృహప్రవేశము జరిగింది. మాస్టారు తరచుగా వస్తూ ఉండేవారు. కొత్తపేట గ్రీన్‌హిల్స్ కాలనీ నుంచి మౌంట్‌శంబళ ఏర్పాటుకు శ్రీకారం చేశారు. మాస్టారు విజయశ్రీగారికి "భాగవతము-దశమ స్కంధము" పుస్తకమును ఇచ్చి "అఖండ భాగవత యజ్ఞము"ను ప్రారంభించమన్నారు. 3 నెలల పాటు అకుంఠిత దీక్షతో, నిరాటంకంగా, రాత్రిపగలు యజ్ఞము కొనసాగింది. మాస్టర్‌గారు చాలాకాలము నుండి హైదరాబాద్‌కు తూర్పుదిశన ఒక ఆశ్రమము కావాలని, చాలా క్యాంపుల్లో శిష్యులకు సూచించారు. చాలా మంది దాతలు స్థలాన్ని ఇవ్వడానికి సుముఖత చూపించారు. ఒక దాత ఏకంగా 25 ఎకరాలు స్థలాన్ని ఇవ్వడమే కాకుండా మాస్టరుగారికి అన్ని సౌకర్యాలతో ఇల్లును కూడా కట్టిస్తానని చెప్పాడు. హైదరాబాద్ - విజయవాడ హైవేకి కేవలం 10 కిలోమీటర్ల లోపే మెయిన్ రోడ్ మీద ఉన్న ఈ స్థలమును సాధారణముగా ఎవ్వరూ వదులుకోరు. కానీ మాస్టరుగారు ఈ స్థలాన్ని నిరాకరించారు. తీవ్రమయిన తపశ్చర్య జరిగి సిద్ధులు, మహర్షుల సంచారము చేత పునీతమయిన ఓ సిద్ధక్షేత్రము కావాలనేది మాస్టారి అభిలాష. అది ఎక్కడ ఉందో ఆయనకు ముందే తెలుసుగా! ఆ రోజు రానే వచ్చింది. విజయశ్రీగారి స్నేహితురాలు, క్లాస్‌మేట్ అయిన శ్రీ భోగ నీరజా ప్రభాకర్‌గారు, వారికి దేశ్‌ముఖి గ్రామ సమీపాన ఒక రియల్ ఎస్టేట్

వెంచర్ ఉందనీ, మీకు స్థలము నచ్చితే ఆశ్రమ నిర్మాణానికి భూదానము చేస్తామని ముందుకొచ్చారు. యుగంధర్‌గారు స్థలాన్ని దర్శించి, స్థలాన్ని ఆనుకొని ఉన్న కొండపైన ల్యాండ్ ఇవ్వగలరా అని ప్రభాకర్‌గారిని అడిగారు. ఈ కొండ కూడా తమ స్వగృహప్యారడైజ్ భూమేనని, ఇవ్వగలనని చెప్పారు. వెంటనే యుగంధర్‌గారు మాస్టారికి ఫోన్ చేసి లోకేషన్, ఈ కొండ గురించి వివరించారు. వెంటనే మాస్టారు గారు "పది గజాల స్థలము దొరికినా సరే, వెంటనే తీసుకో" అని తమ సమ్మతిని తెలిపారు. శ్రీభోగ ప్రభాకర్‌గారు వేయి చదరపుగజాల స్థలాన్ని శంబళ తీర్థమునకు దానం చేశారు. ఆగస్టు 12న కొండపైకి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. గ్రీన్‌హిల్స్ కాలనీలో జరిగిన విధముగా ఈ కొండపైన కూడా "అఖండ భాగవత యజ్ఞము" జరగాలని మాస్టారి ఆదేశము. కొండంతా దట్టమయిన చెట్లు పెద్ద పెద్దరాళ్ళు. ఎక్కడా చదునయిన ప్రదేశం కనిపించడం లేదు. దారి సరిగా లేదు. ఒకసారి కొండపైకి వెళ్ళితే మళ్ళీ తిరిగి అదే దారిలో క్రిందికి రావడం కష్టం. వన్యప్రాణుల సంగతి ప్రక్కనపెడితే అసలు దోమలు, కీటకాల బెడదని తట్టుకోలేము. కరెంటు, నీరు ఏమీ లేవు. ఇటువంటి చోట రాత్రి పగలు, అఖండంగా యజ్ఞము చేయడం ఎలా సాధ్యము? ఇదే సందేహాన్ని మాస్టారి వద్ద ప్రస్తావించగా "అన్నీ అనుకూలముగా ఉంటే ఎవరయినా చేస్తారు. ప్రతికూలతలతో నిర్వహించడమే తపస్సు అనబడుతుంది" అని జవాబిచ్చారు. తపశ్చర్య ప్రారంభించబడినది. శంబళ సంపర్క కేంద్రము మూడు నెలలుగా అఖండముగా గ్రీన్‌హిల్స్ కాలనీలో జరుగుతున్న భాగవత యజ్ఞాన్ని మౌంట్ శంబళకి తరలించడము జరిగింది. ఆ రోజు ఆగస్టు 16, శ్రీకృష్ణ జన్మాష్టమి.

ఎ) గ్రీన్ హిల్స్ కాలనీ ఇంటిలో 12 గంటలపాటు అఖండ భాగవత యజ్ఞము

బి) శాలిబండలోని సహస్రగోశాలలో అఖండ భాగవత యజ్ఞము.

సి) మౌంట్ శంబళలో "అఖండ శ్రీమద్భాగవత యజ్ఞము" ప్రారంభించడము.

మూడు వేర్వేరు ప్రాంతాల్లో స్వయముగా పాల్గొంటూ, ఇంకా రెండు చోట్ల పరోక్షముగా యజ్ఞములను జరిపిస్తూ అన్నింటినీ సమన్వయము చేసుకొని విజయశ్రీగారు విజయవంతము చేశారంటే, అది నిజంగా మిరాకిల్!!

మౌంట్ శంబళలో అఖండ భాగవత యజ్ఞము ప్రారంభింపబడిన మూడవ రోజు మాస్టర్‌గారు

మొదటిసారి శంబళపై తమ పాద పద్మములను మోపారు. (August 18, 2006) జగజ్జనని మహాయోగేశ్వరీ దేవి రూపాన్ని మానవ శరీరంలోని ఎండోక్రైనాలజీకి సమన్వయం చేస్తూ మౌంట్ శంబళ నుండి అందించవలసిన 'వైజ్ఞానిక ఆధ్యాత్మికత' ను "Institute of New Era Education" గా అందించారు. ఆనాటి ఆ ప్రవచనంలో 'మౌంట్‌శంబళ' కార్యాచరణ, లక్ష్యాలను మాస్టారు నిర్దేశించారు. కల్కి అవతారము యొక్క సేనాధిపతులుగా 'అఖండ గురుసత్తా' ని కొత్త కోణములో దర్శింపజేశారు.

ఆగస్టు 19వ తేదీన "మౌంట్ శంబళ" చుట్టూ" గిరి ప్రదక్షిణా పథము" మూడు రోజులలో పూర్తికావాలన్నారు. యుగంధర్‌గారు తక్షణం కార్యరంగంలోకి దూకారు. ఫోన్‌లో మాస్టారిచే మార్గదర్శనం తీసుకొంటున్నారు మూడు రోజులు పగలు, రాత్రీ పనిచేయాలి, అమావాస్య రోజులు! దారి కనిపించడం లేదు. యుగంధర్‌గారు అరచేతిలో దిక్సూచిని పెట్టుకొని ప్రదక్షిణా పథము దిశలకై ప్రయత్నిస్తున్నారు. లేబర్ అంతా వెనకాతల ఉన్నారు. కారు చీకటి, అద్భుతం జరిగింది!! యుగంధర్‌గారి అరచేతిలో నుంచి కాంతి పడడం ప్రారంభమయ్యింది. పనికి అవసరమయినంత మేరకు కాంతి వచ్చింది. తరువాత ఆగిపోయింది. మూడు రోజులలో గిరి ప్రదక్షిణా పథము ఏర్పడినది.

కొండపైన అఖండభాగవత యజ్ఞము జరుగుతూనే ఉంది. మొదటి అయిదు రోజులు యజ్ఞకుండములో యజ్ఞభస్మము కనిపించడం లేదు. పగలు, రాత్రి నిరాటంకంగా సాగుతున్న యజ్ఞానికి ఒక్క రోజులోనే యజ్ఞకుండము పూర్తిగా భస్మముతో నిండి పోవాలి. కానీ అలా జరుగలేదు! మాస్టారికి ఈ విషయము తెలియపరచగా ఈ యజ్ఞభస్మము సూక్ష్మంగా భూమి క్రింది భాగం నుండి టన్నలింగ్ అవుతూ బద్రినాథ్ క్షేత్రానికి వెళ్తుందని చెప్పారు (Teleportation). గిరి ప్రదక్షిణ మొట్టమొదటసారిగా 24వ తారీఖున పూజ్యమాస్టారితో ప్రారంభించబడినది. ఆ సమయంలో పెద్దవర్షము కురిసినది. గోవర్ధనోద్ధారణ సమయములో శ్రీకృష్ణుని వెంట ఉన్న గోపబాలురు మీరే! అందువల్లే నేడు శంబళగిరి స్థాపన సమయాలలో ఉండగలిగారని చెప్పారు. కొండపైన వృత్తాకారంగా ఎనిమిది దిక్కులలో అష్టలక్ష్మి ఆలయాలు నిర్మించమని ఆదేశించారు. నీటి లభ్యత లేని ప్రదేశంలో కాంక్రీట్ పనులు ఎలా చేస్తారు. యజ్ఞము జరుగుతున్న ప్రదేశానికి కొంత దూరంలో ఒక పెద్ద రాయి ఉంది. ఆ రాతిపైన ఉన్న గుంతలో కొంత వర్షపు నీరు నిలువ

ఉంటుంది. దాన్ని తోడుకొని ముందు పని ప్రారంభిద్దామని అనుకున్నారు. ఎందుకంటే మాస్టారుగారు తక్షణం ప్రారంభించమంటారుగా! అందువల్ల ప్రస్తుతం ఉన్న వనరులతో ప్రారంభిద్దామనుకొని ఆ గుంత నుంచి నీళ్ళు తోడారు. ఆశ్చర్యం! ఎన్ని నీళ్ళు తోడినా మళ్ళీ ఆ గుంత నిండుగానే ఉంటుంది. అలా రోజుకి 3,4 డ్రమ్ములు, ఒక్కో డ్రమ్ము 200 లీటర్ల నీరు లభించేది. అష్టలక్ష్మి దేవాలయాల నిర్మాణం పూర్తి అయ్యింది. నీరు ఆగిపోయింది.

2006 ఆక్టోబర్ 4, తిధి, నక్షత్రాల ప్రకారం మాస్టారి జన్మదినము కావడంతో మౌంట్ శంబళపై ఒక పెద్ద మహాకాల చక్రవర్తి యంత్రమును గీసి ఆ యంత్రములో 108 కుండీలను అమర్చి 600 మందిచే శ్రీమహాకాల మహాయజ్ఞము నిర్వహించడమయినది.

అక్టోబర్ 5 నుండి 12వరకు "అఖండ గురుసత్తా నవరాత్రుల" పేరుతో 9 రోజుల పాటు మహోత్సవములు నిర్వహింపబడ్డాయి. గురుసత్తా సంస్థల నుండి ఒక్కో రోజు, ఒక్కో ప్రతినిధిని వారి వారి గురుతత్వాన్ని విపులంగా వివరించేవారు. అక్టోబర్ 13న మౌంట్‌శంబళ నుండి వేటపాలెం వరకు మాస్టారి జన్మదిన వేడుకలకై కొన్ని కార్లను ర్యాలీగా, వీలయిన ప్రతిచోట రోడ్ షోచేస్తూ, అఖండ గురుసత్తా స్టిక్కర్స్ పంచుతూ సాగిపోయారు. అక్టోబర్ 14న వేటపాలెంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగినవి. నవంబర్ 25, 2006న మౌంట్‌శంబళలో 500 మందిచే "లక్ష్మీగణపతి మంత్ర సాధన" పూర్ణాహుతి జరిగినది.

2007 జనవరి 5, 6, 7 వ తేదీలలో కొండ పైన మాస్టారిచే "A Treatise on Cosmic Fire" క్యాంపు నిర్వహింపబడింది. 7వ తేదిన క్యాంపు పూర్ణాహుతి జరుగుతుండగా ఒక శిష్యుడు 7X7 కొలతలుగల "జగజ్జనని మహాయోగేశ్వరీ దేవి" విగ్రహాన్ని తీసుకువచ్చాడు. పూర్ణాహుతిగా కుండలినీ మహాశక్తి, మహాయోగేశ్వరీదేవిగా వచ్చిందని తెలుపుతూ మాస్టారు తక్షణం అమ్మవారికి ఆలయమును నిర్మింపజేశారు.

మార్చ్ 27 న శంబళలో "శ్రీ సీతారామ కళ్యాణము" నిర్వహించడం జరిగింది. ఇదొక ఆనవాయతీగా ప్రతి సంవత్సరం కళ్యాణాన్ని వేడుకగా జరుపుతూ వస్తున్నారు. శ్రీనారాయణ తీర్థులగారి తరంగాలను పాడుతూ రుక్మిణీ కళ్యాణము జరుగుచున్న సమయములో దత్తుని విగ్రహము మౌంట్ శంబళకి చేరుకుంది. అదే రోజు దత్త ప్రతిష్ఠ జరిగింది.

నాలుగు గోమాతలతో శ్రీకృష్ణాష్టమి రోజున మౌంట్ శంబళలో గోశాల ప్రారంభించబడినది. 2008లో "అన్నపూర్ణాలయము" నిర్మాణము, నవంబర్ 23న శిరిడి సాయి విగ్రహ ప్రతిష్ఠలు జరిగినాయి. 2009 వ సంవత్సరం మంత్రాలయములో జరిగిన "సత్రయాగ మహోత్సవము" అనుయాజగా, 2010 శంబళలోనూ, హైదరాబాద్ నగరంలో పలుచోట్ల ప్రతీ పౌర్ణమికి "సత్ర యాగము" లను నిర్వహించడము జరిగింది.

జనవరి 2011లో మాస్టారి కోసం బెడ్‌రూంతో కూడిన హాల్‌నిర్మాణం చేపట్టారు 25/02/2011న హాల్‌కి "గృహ ప్రవేశము" జరిగినది.

2012 జనవరి 15వ తేదీ నాడు సుపర్ణ హాల్ ముందర స్థలములో పంచకుండీ యజ్ఞశాల ప్రారంభించబడినది. తరువాత దానిని అన్నపూర్ణాలయంగా మార్చారు. సెప్టెంబర్ మాసములోనే నవయుగ శక్తిధారగా "శంబళ శ్యమంతకమణి" మ్యాగజైన్ ప్రారంభింపబడినది.

2013 జూలై 20వ తేదీన సుపర్ణ హాల్‌లో మాస్టారుగారు సాయిని, దత్తుడిని, సూర్యుడిని త్రిభుజాకారములో ఉంచి, ఆ త్రిభుజ కేంద్ర స్థానమును మార్క్ చేసి ఆ పాయింట్‌ను "Centre of Universal Gravity' గా ప్రకటించారు. జులై 21 న గురుపౌర్ణమి వేడుకల ప్రారంభంగా 'క్రికెట్ టోర్నమెంట్'ని నిర్వహించారు. గురుసత్తాలోని ఏడుపరంపరలకు ప్రతీకగా ఏడు టీమ్‌లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. జులై 23న గురుపౌర్ణమి రోజు ఘనంగా గురుపూజను నిర్వహించారు. మాస్టర్‌గారు బ్రహ్మనాయుడుగా దర్శనమిచ్చారు. పాలరాతి శివలింగమును పంచకుండీ యజ్ఞశాలలో మహాకాలుడిగా ప్రతిష్టించారు. టోర్నమెంట్ విజేతలకు షీల్డు ప్రధానం చేశారు. శ్రీకృష్ణాష్టమి రోజు గోశాలవద్ద శ్రీకృష్ణుని ఆలయం నిర్మించారు.

సెప్టెంబర్‌లో గిరి ప్రదక్షిణా పథమునకు మెట్లు నిర్మించే పనులు మొదలయ్యాయి. ప్రదక్షిణా పథములో 49 అగ్నులు, గురుసత్తా ఫోటోలు, All Religions and Their prophets ఫోటోలు పెట్టడం జరిగింది. ప్రదక్షిణా పథములో వీరలక్ష్మిమాత ఆలయము ప్రక్కన ఒక్క పెద్దశిలపై గాయత్రి మంత్రము లిఖించబడి ఉన్నందున, ఈ శిలను గాయత్రి రాక్ అని మాస్టరుగారు తెలిపారు. డిసెంబర్‌లో మెట్ల నిర్మాణము పూర్తి అయినది.

2014 ఫిబ్రవరి 27 మహాశివరాత్రి రోజున మాస్టారుగారు స్ఫటిక లింగము, స్ఫటిక సుమేరులను మౌంట్ శంబళకి తెచ్చారు. మార్చ్ 11న Book Stall ప్రారంభించబడినది. మార్చ్ 14న మాస్టారుగారు భోజనానంతరము సాందీపని ఆశ్రమంలో ఉండి శిష్యులందరినీ తనతోనే ఉండమన్నారు. సడెన్‌గా భీభత్సమయిన గాలివాన వచ్చి అన్నపూర్ణాలయం రేకులుపైకి ఎగిరిపొయాయి. యజ్ఞశాల కప్పు పడిపోయింది. కానీ ఎవ్వరికీ కించిత్ హాని జరగలేదు. అన్నపూర్ణ ఆలయమునకు నూతనగదిని నిర్మించమన్నారు.

మార్చ్ 16న రాత్రి 12 గంటలకు హోళిపౌర్ణమి రోజు విశ్వకుండలీని స్థూపము ముందు "మహా విశ్వలింగ ప్రతిష్ట" జరిగినది. **మార్చి 17వ తేదీన సాందిపనీ ఆశ్రమ ప్రాంగణంలో గాయత్రీ మంత్రము-24 శక్తిధారల యంత్రాలను ప్రతిష్టించారు.** 27 మార్చ్‌న సూర్యుడు, సాయి, దత్తుడిని సుపర్ణ హాల్ ఉత్తరము వైపుకు మార్చారు.

2014 ఏప్రిల్ రాశి సంక్రమణము నుంచి 2015 రాశి సంక్రమణము వరకు ఒక ఏడాది పాటు ప్రతినెలా "చిత్ర గుప్త వ్రతము' నిర్వహింపబడింది. ఏప్రిల్‌లో "శంఖ, చక్ర, గదా, పద్మాలు" విశ్వగిరి ప్రదక్షిణా పథములో స్థాపించడము జరిగినది.

గహనా కర్మణోగతిః

బెంగుళూరులో శ్రీ వెంకటేశులుగారింట్లో 09.05.2014వ తేదీన మాస్టరుగారికి మరియు శ్రీ డి.బి.యన్.బి. విశ్వనాథ్‌గారికి మధ్య జరిగిన సంభాషణలోని కొన్ని ముఖ్యాంశముల యొక్క సంగ్రహణ 2014 జూలై, ఆగష్టు నెలలో మేథాలో ప్రచురించారు. చాలా ఆవేదనతో, మర్మగర్భితంగా వున్న వారి మాటలను చాలా దీక్షతో చదివితే గానీ అందులోని అంతరార్థాలు అవగతం కావేమోననిపిస్తుంది. శ్రద్ధగా చదవాలి మరి.

డబ్బు అంటే టైమ్: కర్మ - రోగము. డాక్టర్‌కి దక్షిణ ఇస్తే రోగము తగ్గుతుంది అని ఎన్నో సార్లు చెప్పాను. కానీ ఎంత చెప్పినా అర్థంకావటం లేదు. అందుకనే నేను చెప్పటం మానేశాను. చెప్పేది ఏమీ లేదు. అందుకనే నేను చెప్పటం మానేశాను. ఇంకో మార్గమూ లేదు. వేంకటేశ్వరస్వామీ అంతే. డబ్బులిస్తేనే పలుకుతాడు. ఇది అర్థంకాని వారు, ఇది మిస్ అయినవారు కొన్ని ప్రళయాల తరువాతనే నేర్చుకుంటారు. ఎందుకంటే టైమ్ అయిపోతోంది కదా! చెప్పలేను కదా! కానీ గురువు

గారితో లింక్ ఉన్న వాళ్ళు అదృష్టవంతులు. మిగతా వాళ్ళకి కొన్ని ప్రళయాల తరువాత మాత్రమే లింకు దొరుకుతుంది. గురువుగారితో లింక్ వున్నవాళ్ళకి అని కూడా గ్యారింటీ లేదు. పాసిబిలిటీ ఉంది. కాని మళ్ళీ ఎంత మంది అనేది క్వశ్చన్‌మార్క్.

చదువుకోరు మనుష్యులు. చదువుకొని అర్థం చేసుకుంటే.....! నాకేమి పట్టింది. లేకపోతే నాకు తెలియదా? దేనికి ఏది చేస్తే ఏమౌతుందో. ఇంక ఆపేశాను ఇంక లాభం లేదు అని. ఎందుకు ఇంకొకళ్ళకోసము నేను ఇంత అవస్థ పడటం.

When they are not interested కానీ, ... నేను వెళితే అప్పుడు కూడా జరుగుతుంది.

అసలు ఎందుకు చెయ్యాలి గురువుగారికి? గురువుగారు ఎప్పుడో చెప్పేశారు. “You have done too much. నేను కూడా ఇంత చేయలేదురా. ఇది కూడా నీవు వుంటేనే అవుతుంది”. (ఈ మాట ఎందుకన్నారో ఆలోచించండి మరి).

హెల్ప్ చేసేవారు కూడా లేరు నాకిప్పుడు. నేను ఊరు వెళతాను అంటే నన్ను ఆపడము తప్ప!! (ఇదీ ఎందుకన్నారో). నేను మాట అన్నాను అంటే It is fixed. ఎండ అంటారు. నాకు నవ్వు వస్తుంది. నేను fourth dimensionలో వున్న వాడిని అని తెలిసినా three dimensionలో వున్న వారు నాతో అంటే ఎలా? అంచేత ఏమీ చెప్పను. నేను చూస్తూ ఉండటం తప్ప. ఇంక ఇది చాలనిపించింది. కానీ నేను, **నా ప్రయత్నము మాత్రము బాగా చేస్తాను. మళ్ళా కర్మ కదా! గురువు ఒప్పుకోడు కదా! వీళ్ళ కోసము కాదు. గురువు కోసము నేను చాలాసార్లు ట్రై చేశాను.** they are not doing it.

ఫోర్తు డైమన్‌షన్ వాళ్ళకి టైమ్ మరియు డబ్బు వాల్యూ లేదు. కానీ ఇక్కడి వాళ్ళకు డబ్బు చాలా ఇంపార్టెంట్. నా దృష్టిలో అది కాయితం ముక్క మాత్రమే. నువ్వు వేసుకున్నావు ఆ కాయితం మీద వాల్యూని. నాకు కావలసిన వాల్యూ నేనూ వేసుకుంటాను. కానీ నాకు కావలసినది నాకు కచ్చితంగా వస్తుంది. నేను ఒంగోలు నుంచీ హైదరాబాద్‌కు కారులో వెళ్ళేవాడిని. హైదరాబాద్‌కు చేరగానే ఇమీడియెట్‌గా వెనక్కి వెళ్ళిపోయేవాడిని. పదివేల రూపాయాలు ఒక్క ట్రిప్‌కి. కానీ దాని వలన ముగ్గురు బతికారు. అదే మీరు వెళ్ళనివ్వరు. ఏముంది పోయేవాడు పోతాడు. (అనుకున్నారు) నేనేమీ చెయ్యగలను. సరే వాళ్ళ ఇష్టం అనడం తప్ప.

గురువులంతా ఒక ఎత్తు. నేను ఒక్కడినీ ఒక ఎత్తు. తర్వాత ఎప్పుడో తెలుస్తుంది. కానీ ఉన్నప్పుడు ఉపయోగించుకోవాలిగా! ఇప్పుడు నా వర్క్ ఏమిటి? సోలార్ సిస్టమ్ అనేది కొన్ని కోట్ల కోట్ల సంవత్సరాల తరువాత కానీ తయారు కాదు. కానీ ఇంకో సూర్యుడు ఉన్నాడు. డెవలప్ అవుతున్నాడు. నేను అక్కడికి వెళ్ళవలసి వస్తుంది. ఇక్కడ "May be not allowed". అక్కడకి వెళ్ళవలసి వస్తుంది. ఇక్కడ ఎందుకు? ఏమి చేస్తాను ఇక్కడ కూర్చొని. కానీ ఎందుకు గురువు ఆపుతున్నాడు అన్నది క్వశ్చన్‌మార్క్? అయినా నాచేతిలో ఏముందీ? I am just waiting. ఆహారము కూడా ప్రసాదం లాగా తీసుకుంటున్నాను. కానీ పని లేనప్పుడు ప్రసాదము ఎందుకు? తినలేనుగా! తినలేను, అందుచేతనే ఇంకా ఆగుతోంది కాబోలు. I donot know. అందుకే గురువు చెప్పాక ఏమి చెప్పినా చెయ్యాలి. కానీ నాకు ఇక చాలేమో అనిపిస్తున్నది. అయినా నా చేతిలో ఎప్పుడూ ఏమీ లేదు. బయట నుంచీ రావాలి. May be the time has come. ఇక్కడ movement లేనప్పుడు నేనెందుకు ఇక్కడ.

ఈ సూర్యుడు నాకు అక్కరలేదు. ఈ సోలార్ సిస్టమ్ కి చాలా టైం ఉంది. కానీ చాలా Solar Systems develop అయినవి ఉన్నాయి. అందుచేత చెప్పలేను ఏమవుతుందో! ఎందుచేతనంటే చెప్పినా అర్థమవ్వదు. I am staying at a place which I do not want. అందుచేత I will go నా చేతిలో లేదు. ఎప్పుడో పోతుంది. ఇంక వర్క్ లేదు. వర్క్ లేనిదే I can't live. అందుకే నేను ఆశ్చర్యపోతున్నా. ఇంత చేసినా నన్ను ఇంకా ఎందుకు వదలటం లేదురా అని. టైమ్ అంతే. పోవాలని వుంది నాకు ఇంక, కానీ అది అనిపించటము ఈ మధ్య కాలములో ఎక్కువ అవుతోంది. May be the time has come. లేకపోతే అనిపించదు కదా! వెళ్ళాలి, వెళ్ళాలి అని విసుగెత్తి పోయింది. అందుకే క్లోజింగ్ డోరు. అందుకే మెల్లమెల్లగా అందరినీ దూరంగా గెంటేస్తున్నాను. నా పని చేయాలి.

నాకు కాదు కదా చేయ్యాల్సింది - నా పని చెయ్యాలి

నా మాటలలోనే అర్థమయ్యేలా చాలా సింపుల్‌గా చెప్పాను. అందుచేత మళ్లీ ఆర్డరు ఇవ్వటం అంటూ ఏమీ వుండదు. గీత చెప్పేసిన తరువాత మళ్ళీ ఇంకో గీత ఉండదు. అర్జునుడితో చెప్తాడు. ఇక చెప్పాను కదా – ఇంక మళ్ళీ మళ్ళీ చెప్పలేనురా నేను. అది అయిపోయింది అని నాకనిపిస్తోంది. ఇంక గురువు ఏమి చేస్తాడో! అసలైన వాడు గురువు. వాడేమి చేస్తాడో చూడాలి.

ఇంక చెప్పటం మానేసి వెళ్ళిపోవడమనే మూడ్‌లోకి వస్తున్నాను మెల్లగా. ఇంక ఎవరి యాంగిల్‌లో వారు డెవలప్ అవ్వాలి. నీ ఇంట్లో దీపము నీవు పెట్టుకో. ఇంకోడిది పెట్టి వస్తే నీకేమి లాభము. మీ దీపాలు మీరు చూసుకోండి. అందరినీ తోసేస్తున్నా. చాలా చోట్ల మనుషుల నుంచీ బాగా దూరమైపోతున్నా. అందుచేత wasting my time. ఇదివరకు మనవారిని డెవలప్ చేశా. వాళ్ళకి మంచిది కదా అని, మే బి వాళ్ళు కూడా నాతో ఇంకో సోలార్ సిస్టమ్ కి వెళతారేమో. ఇక్కడ టైమ్ వేస్ట్ చేసుకోవడమెందుకు? కాని ఒక్కటి అర్థమైంది. చాలా కష్టం. ఇక జంప్.

79. కేరళ ఆనంద ఆశ్రమంలో

ఒంగోల్లో శ్రీరంగనాథ్‌గారింట్లో నూతన గృహప్రవేశానికి వచ్చిన పూజ్యశ్రీ మాస్టారు గృహ ప్రవేశమయ్యాక, ఫిబ్రవరి 9వ తేది సాయంత్రం శంబళకు వచ్చారు. అప్పటికే సాందీపని ఆశ్రమం తయారై ఉండటం చేత తక్షణమే సాందీపని ఆశ్రమం 09.02.2014న ప్రారంభోత్సవం చేశారు.

2014వ సంవత్సరం జూన్ నెలలో శ్రీమతి సుశీలమ్మగారి కోరిక మేరకు పూజ్యశ్రీ మాస్టారు కేరళలో ఉన్న శ్రీ నిత్యానంద స్వామివారి ఆశ్రమానికి వెళ్ళారు. మాస్టారితోపాటు చందన కూడా వెళ్ళింది. మంచి ఎండాకాలం అయినా కేరళలో ఎంతో చల్లగా హాయిగా వుంటుంది. అందులోనూ వెళుతున్నది ఆశ్రమానికి. సాధారణంగా ఆశ్రమాలలో సాధన తొమ్మిది రోజులు చేస్తే చాలా మంచి ఫలితాలు వస్తాయి. అందుచేత ఆ ఆశ్రమంలో తొమ్మిది రోజులుండాలనే మాస్టారు వెళ్ళారు. శ్రీ నిత్యానంద స్వామివారి గురించి, ఆశ్రమం గురించి చాలానే చెప్పారు. ముఖ్యంగా కేరళలో 44 గుహలు వున్నాయి. కానీ సాధన చేసుకోవటానికి మనుషులు లేరు. కార్యకర్తలు దాదాపు 240 మంది దాకా వున్నారు. కేరళ ఆశ్రమంలో మూడు రోజులు వున్నారు. మాస్టరుగారిని ప్రవచనం చెప్పటానికి డోలీలో తీసుకెళ్ళేవారు. మరల డోలీలోనే తీసుకువచ్చేవారు. 9 రోజులుండాలని వెళ్ళారు. కాని "ఇక్కడ నీకు సాధనలు ఏమీ లేవు. టైం వేస్ట్. నీవు శంబళకు వెళ్ళు. అక్కడ చేయవలసిన పన్లు చాలా వున్నాయి" అని అంతరాత్మలో నుంచీ ప్రబోధం వచ్చింది. అనుకున్నదాని కన్నా ముందుగానే బెంగుళూరుకు వచ్చేశారు.

2014 జూన్ 26వ తేది మధ్యాహ్నం 2.30 గంటలకల్లా హైదరాబాద్ విమానాశ్రయంలో మాస్టారు, చందన దిగిపోయారు. అయితే చందన వెంటనే తిరిగి బెంగుళూరుకు వెళ్ళిపోయింది.

నారాయణగారు విమానాశ్రయానికి వెళ్ళి మాస్టారిని శంబళతీర్థానికి తీసుకువచ్చారు. వస్తూనే కాస్త భోజనం చేసి నిద్రపోయారు. మాస్టారు నిద్ర లేస్తూనే సాయంత్రం నుంచీ శంబళలో క్రొత్త ప్రణాళికలను ప్రారంభించారు. బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్‌లో వున్న విధంగా ఇక్కడ కూడా 24 గాయత్రీ శక్తులను పెట్టాలి అన్నారు.

తర్వాత కాసేపయ్యాక ఇక్కడ సాందీపని ఆశ్రమం దగ్గర 24 యంత్రాలున్నాయి కదా. ఇక్కడ సాధన చేస్తే సరిపోతుంది. ఉదయం 6 గం.లకు, మళ్ళీ సాయంత్రం 6.00 గంటలకు ఈ యంత్రాల దగ్గర ఒక్కొక్కరు కూర్చొని సాధన చెయ్యాలి. మనుషులు అంతమంది లేకపోతే 2 యంత్రాలకు ఒక్కొక్కరి చొప్పున 12 మంది కూర్చొని గురువుగారి వాణితో 24 సార్లు గాయత్రీ మంత్రం ఉచ్చరిస్తే 15 నిమిషాలలో సాధన అయిపోతుంది. ఈ రోజు ఉదయం 6 గంటలకు జపం చేస్తే మరల అక్కడ 24 గంటల తరువాతనే, అంటే అక్కడ అంత శక్తి ఉందని చెప్పారు.

శంబళకు వచ్చిన రోజు నుంచీ అంటే 26వ తేది నుంచీ ఇన్సులిన్ తీసుకోవటం మానేశారు. ఆహారాన్ని బాగా తగ్గించేసారు. బాగా నీర్సంగానే ఉన్నారు. ఎండలకి వారు తట్టుకోలేకపోతున్నారు. శారీరకంగా చాలా బాధపడుతున్నట్లుగా చూసేవాళ్ళకు అనిపించేది. మరునాడు ఉదయాన్నే లేచి స్నానాదికాలు పూర్తి చేసుకొని శంబళ తీర్థం దగ్గర కూర్చున్న మాస్టారు, "నేను కట్టిందే నీవు కట్టు. నేను తిన్నదే నీవూ తిను" అని గురువుగారు చెప్పారు అంటూ గురువుగారు అన్న మాటలను గుర్తు చేసుకున్నారు.

మీరు వేదాలు చదవక్కర్లేదు. అధర్వణ వేదంలోని అపాంభేషజ సూక్తంలోని 4 సూక్తాలు ఇచ్చారు.

స్నానం చేసేటప్పుడు వాటిని ఉపయోగించుకోండి. స్నానం చేసేటప్పుడు చదువుకుంటే రోగాలు పోతాయి. చెప్పినా ఎవ్వరూ ఆచరించరు. మనకు రోగాలు తగ్గక్కర్లేదు. ఎంత చెప్పినా ఎవ్వరూ వినటం లేదంటూ బాధపడ్డారు. ఇంతలో పద్మజాసురేష్ అక్కడికి వచ్చింది. టైంకి వచ్చింది అని సంతోషపడ్డారు. ఇంతలో అన్ని రకాల పండ్లు ముక్కలుగా చేసుకొని తెచ్చారు. మాస్టరుగారు ఒక్క ముక్క తీసుకొని మిగతా వాటిని 'అందరూ తినెయ్యండి అని చెప్పారు'. "ప్రసాదం వెంటనే తినెయ్యాలి. సత్యనారాయణస్వామి ప్రసాదం ఇంటికి తీసుకువెళ్తూ వుంటారు. వెంటనే తింటేనే గదా దాని పవర్ ఉంటుంది" అన్నారు. తరువాత మళ్ళీ కొన్ని విషయాలు చెప్పారు.

Humanity remains, Humans may go

ఎన్ని యజ్ఞాలు చేయించానో, ఎన్ని సాధనా శిబిరాలను పెట్టించానో మరి వాటి పేర్లు కూడా మరిచిపోయాను. 2000 సంవత్సరం తరువాత ఈ సెంచురీ (అంటే ఈ వంద ఏళ్ళ) లోపల మానవజాతి ఫోర్తు డైమెన్షన్ (fourth-dimension) లోకి వెళ్ళాలి. వెళ్ళగలిగేవాళ్ళు ఇప్పుడే వెళ్ళిపోవచ్చు. కానీ మనుషులకు ఇది ఒకటి ఉందీ అని తెలియాలి గదా! అప్పుడుగదా వెళ్తారు. అసలు చాలా మందికి fourth-dimension అంటే ఏంటో తెలియదు.

ఈనాడున్న పొల్యూషన్ (pollution) కు సమా'ధీ' కరెక్ట్ సమాధానం. ఈ పొల్యూషన్‌లో మనుషులు బ్రతుకలేరు. ఓజోన్‌పొరకు రంధ్రం వచ్చేసింది కదా! చెప్పేవారు లేరుకానీ fourth-dimensionలో ఉంటే ఈ పొల్యూషన్ నిన్నేమీ చెయ్యదు. అందుకే గురుదేవులు రెండువందల సంవత్సరాలు ముందే వచ్చేశారు. గాయత్రిని ఒక్కసారి పట్టుకున్నా చాలనేవారు (అంటే ఒక్కసారి అన్నాచాలు). ఈ జన్మలో కాకపోయినా మరోజన్మలోనైనా అది పని చేస్తుంది. ప్రకృతిలో హ్యూమానిటీని ఉంచే శక్తిని గురువుగారు పెట్టేశారు. కానీ వచ్చిన సమస్యల్లా మనుష్యులతోనే. ఎప్పుడెలా వుంటారో ఎవరూ చెప్పలేరు. సమస్యంతా వాళ్ళతోనే!

Humanity remains, Humans may go

ఇంత చెప్తున్నా ఈనాడు గాయత్రీమంత్రం ఎంతమందికి వెళ్ళింది? గురువుగారి తప:శక్తి వలన మానవత్వము, మానవ–తత్వము ఉండవచ్చునేమోగానీ, మానవుడు ఎగిరిపోయే ప్రమాదం వున్నది. ఈ విషయం చాలా మందికి తెలియదు. అందరికీ మనం చెప్పాల్సిందే! గాయత్రీ మంత్రం వుంది కనుక హ్యూమానిటీ ఎగ్జిస్ట్. తండ్రి కొడుక్కి చెవిలో రహస్యంగా చెప్పేమంత్రం. (ఉపనయన మప్పుడు తండ్రి తన కుమారుడికి బాజా, భజంత్రీల మధ్య చెవిలో రహస్యంగా గాయత్రీమంత్రం చెప్పేవారు.) గురువుగారికీ అలాగే ఇవ్వబడింది, అలాంటి రహస్యాన్ని ఆయన బాహాటంగా అందరికీ ఇచ్చేశారు. గాయత్రీ మంత్రం ఎంతమందిని ఫోర్త్‌డైమెన్షలోకి తీసుకువెళుతుందో చెప్పలేను కానీ ఇప్పుడున్న హ్యూమానిటీకి ఇది చాలదు. మీకు fourth-dimension అంటే అర్థం కాలేదూ అంటే మీకసలు గాయత్రీమంత్రం అర్థం కాలేదూ అని.

అందుకే గురువుగారు చెప్పారు. మీకు అర్థమైనా, అవకపోయినా ఈ మూడుసాధనలూ చేసుకోండి. అవే మిమ్మల్ని అక్కడికి తీసుకువెళతాయి.

1. మూడు శరీరాల ధ్యానము 2. జ్యోతి అవతరణ సాధన 3. సాయంత్రం 6:00 గంటలకు చేసే నాదయోగ సాధన. ఈ మూడు గురుదేవుల వాణితో నడుస్తాయి కాబట్టి, it works.

గురువుగారి లైఫ్‌ని జాగ్రత్తగా అర్థం చేసుకొని ఆ రూల్స్‌ని మనం కూడా మన జీవితాలలో తెచ్చుకోవాలి. అలా కొంతకాలం పాటు సాధన చేస్తూ వుంటే ఫోర్త్‌డైమెన్షన్ అంటే ఏమిటో అర్థమౌతుంది. ఒక్కసారి ఫోర్త్‌డైమెన్షన్ అర్థమైపోతే ఇంక మీ ఇష్టం. మీరక్కడే ఉండిపోవచ్చు. ఫోర్త్‌డైమెన్షన్‌లో వుండి ఒక థాట్ అనుకుంటే అది జరిగిపోతుంది. గురువుగారి గొప్పతనమేమిటంటే వారు ఫిజికల్‌బాడీలో వుంటూనే ఆస్ట్రల్ ట్రావెల్ చేసేవారు. ఆయన అన్నీ ఫిజికల్‌గా చేసి చూపించేవారు.

నేను కూడా చేసి చూపించాను కదా! ఎక్కడ? హరిద్వార్‌లో జన్మశతాబ్ది వేడుకల్లో ఎంత గందరగోళమైందో తెల్సుగదా ! మరి అక్కడికి పరిగెత్తాను. కాళ్ళు నొప్పి. ఆరోగ్యం సరిగ్గా లేదు. అయినా పరుగెత్తుకొని వెళ్ళగలిగాను గదా! అక్కడున్న మూడురోజులూ అలాగే తిరగగలిగాను. మరి అప్పుడు ఆ పెయిన్స్ అవీ ఎక్కడికి పోయాయి? ఫోర్త్‌డైమెన్షన్ ప్రభావం అది. కానీ నేనెందుకు అక్కడ వుండటం. నాకెందుకా ఫోర్త్‌డైమెన్షన్? గురువుగారి పని కోసం ఉపయోగించాను. అంతే! అక్కడే వుండటం అనేది ఐయామ్ నాటెటాల్ ఇంట్రెస్టెడ్ (I am not at all interested). సరే, మళ్ళీ అసలు విషయానికి వద్దాం.

ఇప్పుడున్న ఈ పొల్యూషన్‌కి 'సమధీ' కరెక్ట్ ఆన్సర్. ఓజోన్‌పొరకు రంధ్రం వచ్చింది గదా! దాన్ని మీరేం చెయ్యలేరు. కానీ మీరు ఫోర్త్‌డైమెన్షన్‌లోకి వెళితే అదేం చెయ్యలేదు మిమ్మల్ని. మీరు చెయ్యాల్సిందేమిటంటే

1. హ్యూమానిటీ, అంటే మానవజాతిలో ప్రతీ మనిషికీ గాయత్రీ మంత్రం వెళ్ళాలి. ఇంక మీరు ఆ పనిమీద ఉండండి.

2. స్వాధ్యాయం కంపల్సరిగా చెయ్యండి. గురుదేవులు చివరిరోజు వరకు స్వాధ్యాయం చేస్తూనే వున్నారు.

3. గురుదేవులు గాయత్రీమహావిజ్ఞాన్ మూడుభాగాలు ఇచ్చారు. గాయత్రీ మహావిజ్ఞాన్‌లో, **'మహా' అంటేనే ఫోర్త్‌డైమెన్షన్. ఫోర్త్‌డైమెన్షన్ అంతా గాయత్రీమంత్రంలో వుంది.**

అందుకే గాయత్రీమంత్రం చేస్తే అందరూఫోర్త్‌డైమెన్షన్‌లోకి వెళ్లిపోతారని చెప్తున్నాను.

ఆ తరువాత లేచి తిరుగుతూ కేరళలో ఉన్న గుహలలాగే శంబళలో ఉన్న గుహలను చూపించారు. అక్కడ్నుంచీ అన్నపూర్ణాలయానికి వచ్చారు. అప్పటికే బాగా ఢీలాపడ్డారు. త్రాగటానికి ఒక డైట్‌కోక్ ఇచ్చారు. కాస్త తేరుకున్నాక మళ్ళీ మొదలుపెట్టారు. మీరందరూ తలా ఒక గుహ తీసుకోండని చెప్పారు. మాస్టరుగారు మటుకు 2 గుహలు సాయి, దత్తుడివి తీసుకుంటానన్నారు. వెంటనే వెళ్ళి ధ్యానము చేసుకొని వచ్చారు. ఎండగా వుంది అంటున్నా 'తక్షణమే చెయ్యాలి గదమ్మా' అంటూ వెళ్ళిపోయారు. అక్కడ్నుంచీ వస్తూనే బాత్‌రూంలో ఉత్తరం గోడను వెంటనే పడగొట్టించారు. తరువాత భోజనము చేసుకొని వెళ్ళి పడుకున్నారు.

ఆ సాయంత్రం ఆరుబయట కూర్చొని "నేను వచ్చి 2 రోజులైనా ఎవ్వరూ రాలేదని" చాలాసార్లు అనుకున్నారు. ప్రక్కనే ఉన్న సుబ్బులుగారు "గురుపూర్ణిమ దగ్గరలోనే వుంది కదా మాస్టారు అప్పుడు అందరూ వస్తారనే" సరికి 'అప్పుడు అందరూ వస్తారా' అని ఎంతో అమాయకంగా అడిగారు. ఆ తరువాత ఎంతో మౌనంగా అయిపోయారు. ఆ మరునాడు ఉదయం మామూలుగానే లేచారు. టిఫిన్ తినే సమయంలో విజయశ్రీ, సమీర అందరూ సరదాగానే మాస్టారితో టిఫిన్లు తిన్నారు. తరువాత యుగంధర్‌గారు రావటంతో వాళ్ళిద్దరు ఆఫీసుకు వెళ్ళిపోయారు. తరువాత ఏదో ఒక సందర్భంలో అన్నారుట. గుహల గురించి ఇంత ఆర్భాటం ఎందుకు? కళ్ళు మూసుకొని ధ్యానం చేసుకుంటే సరిపోతుంది గద. నా లైబ్రరీని కూడా ఒంగోలు నుంచీ గుంటూరు, గుంటూరు నుంచీ శంబళకు అలా అన్ని చోట్లకు తిప్పి తిప్పి ఇక్కడకు తీసుకువచ్చి పెట్టాను. పిల్లలందరూ హైదరాబాద్‌లోనే కద చదువుకుంటున్నారు. అందరికీ వీలుగా వుంటుందని ఇక్కడ పెట్టించాను అన్నారు.

మూడు రోజులైనా ఎవ్వరూ రావటం లేదని పదేపదే అనుకుంటున్నారు. మనస్సులోనే ఎంతో ఆవేదన చెందుతున్నారు. పైకి ఎంతో గంభీరంగా కనిపించినా కృంగిపోతున్నట్లుగా అనిపించేది. వారి బాధను ఎవరు అర్థం చేసుకోగలరు? వారి అంతరంగంలోకి ఎవరు తొంగిచూడ గలరు? వారిని అనునయించగల వారెవ్వరున్నారు? ఇన్సులిన్ మానేశారు. ఆహారము కూడా చాలా కొంచెం తీసుకుంటున్నారు. చాలా చాలా నీరసంగా ఉంటున్నారు. ఎవరైనా ఏదైనా అడగబోతే ఏదో చెప్పి వారిని అక్కడ ఆపేసేవారు. ఆ రోజు భోజనం చెయ్యటానికి అన్నపూర్ణాలయానికే వచ్చి నేల మీద పసుపు నీళ్ళు చల్లమని చెప్పి చాప వేసుకొని కూర్చొని భోజనం చేశారు.

కారణాలు తెలియవు కానీ మాస్టరుగారు నారాయణగారిని 'అంబరీష్' అనే కాంటీన్‌ను కట్టించమని చెప్పారు. ఆ రోజు మధ్యాహ్నం అక్కడ బోర్ వేయించామని శ్రీమాస్టరుగారికి చెప్పారు నారాయణగారు. సరే, ఓకే అని టిక్ పెట్టారు. 390 అడుగుల లోతులో నీరు పడింది. అక్కడ అలా నీరు పడటం మాస్టారి అనుగ్రహమే. 28వ తేది సాయంత్రం మాస్టారు వాకింగ్‌కి వెళ్తున్నానని చెప్పి బయలుదేరి 'సప్తగోప్రదక్షిణ'కు ఏడు యజ్ఞకుండాలను పెట్టించి 6000 ప్రదక్షిణలు చేస్తే సత్యయుగము వస్తుందని, ఇక్కడ సూర్యశక్తిని దింపాను, ఉపయోగించుకోండని చెప్పారు.

ఇంక ఆ సాయంత్రమే 'నేను' వెళ్ళిపోతానన్నారు. ఇక్కడే ఉంటానని నిన్ననేగా చెప్పారు. ఇంతలో సడన్‌గా ఏమిటని అందరికీ బాధ గలిగింది. సాందీపని ఆశ్రమం కూడా అయిపోయిందిగద. ఇంక ఇక్కడే వుంటారనుకున్నారంతా. ఆ తరువాత పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. వాళ్ళమ్మగారి గురించి, గురుదేవులు గురించి, ఏవేవో మధురానుభూతులు చెప్పారు. ఆ రోజు రాత్రైంది. శ్రీయుగంధర్‌గారు వచ్చేంత వరకు ఉండి మాట్లాడి రేపు వెళ్తానులే అని పడుకున్నారు. ఆ రాత్రి కాస్తంత పాలు మాత్రమే తాగారు. అక్కడ వున్న వారికి ఎన్నో విషయాలు చెప్పి పడుకున్నారు. తెల్లవారుఝామున 4:30 గంటలకు లేచి నొప్పి, నొప్పి అంటున్నారని సమీర వచ్చి చెప్పింది. శ్రీయుగంధర్, విజయశ్రీ అందరు లేచి వచ్చారు. అలా ఉండి కూడా **'లైబ్రరీలో 12000 పుస్తకాలున్నాయి. అవన్నీ నేను చదివి అండర్‌లైన్ చేసినవే. శంబళ నుంచీ వెళ్ళిపోతున్నాను. ఇంక రాను'** అన్నారు. అదేంటి మాస్టారు గురుపూర్ణిమ వస్తోంది గదా, అన్నారు అక్కడున్న వాళ్ళు. దానికి తప్పకుండా వస్తాను. టైం ఫిక్స్ చేసుకోండి అన్నారు.

(గురుపూర్ణిమనాటికి మాస్టారు శరీరం వదిలిపెట్టి 13 రోజులు అయింది. 13వ రోజున వైకుంఠ సమారాధన గుంటూరు, సప్తర్షి ఆశ్రమంలో జరిగింది. దానిలో ఆ పరమాత్మ స్వరూపులు అందరిని సూక్ష్మ శరీరంలో అనుగ్రహించారు).

నేనెందుకు వెళ్తున్నానంటే జ్వాలాకూల్ పుస్తకాలు వ్రాయటానికి వెళ్తున్నాను. "నీవు తప్ప ఎవరూ లేరురా" అన్నారు గురువుగారు. అందుకని వాటిని వ్రాయటానికి వెళుతున్నాను. ఇప్పుడెంత చేసినా శంబళకు ఎవ్వరూ రావటంలేదు. గురువుగారి వాఙ్మయాలు పూర్తి చేయాలి. ఇక్కడ వుంటే ఆశ్రమాన్ని అభివృద్ధి చేయటానికే సరిపోతుంది. దీనికి, దానికి కుదరటం లేదు. అందుకని వెళుతున్నాను అన్నారు గానీ, వారు చాలా తపన పడ్డారు.

శ్రీయుగంధర్, విజయశ్రీగార్లు అటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే ఇటు ఆశ్రమంలో ఎప్పుడు, ఎక్కడ ఏమి చెయ్యాలన్నా అది సాధ్యమైనంత త్వరగా చేస్తూనే వున్నారు. నారాయణరావు గారు కూడా మాస్టారు చెప్పారనే అంబరీష్ హోటల్ నిర్మాణం చేస్తున్నారు. అయినా మాస్టర్‌గారెందుకు వెళ్తున్నారని అందరి మనస్సులలో ఒక ప్రశ్న ఏర్పడింది. అందరి మనస్సులు చదవగలిగిన ఆయన అన్నారు, "బాగా లేనప్పుడు ఆశ్రమంలో ఉండకూడదు. ఇంటికి వెళ్ళాలి అంటారు గురువుగారు అందుకే వెళుతున్నాను" అంటూ సంభాషణను మళ్ళించి నవ్వుతూ కబుర్లు మొదలు పెట్టారు. దాని తరువాత ఓపిక లేక వాళ్ళ తమ్ముడుగారింటికి వెళ్ళాలన్నారు.

29వ తేది ఉదయం 6 గంటలకు శ్రీయుగంధర్‌తో బయల్దేరి తమ్ముడుగారింటికి వచ్చారు. ఆ రోజంతా విరోచనాలయ్యాయి. సుకృతవాళ్ళు మందులు వేస్తూనే ఉన్నారు. అయినా నీరసంతో బాగా ఢీలా పడ్డారు. సాయంత్రానికి షుగర్ 479లో ఉంది. 30వ తేదీ ఉదయం మాస్టారుగారిని ఆదిత్య హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారు. ఈ సమాచారం వాట్సప్‌లో వచ్చేసింది. అలా, అలా ఫోన్ల ద్వారా అందరికీ తెల్సిపోయింది. నిన్నటి దాకా బాగానే ఉన్నారుగదా, ఇంతలో ఏమైంది, హాస్పిటల్‌లో చేర్చేటంత పరిస్థితి ఏమిటని అందరికీ కంగారు వచ్చేసింది. అందరి హృదయాలలో ఏదో తెలియని ఆరాటం, ఆదుర్దా. విశ్వనాథ్‌గారికి ఫోన్ చేస్తే 'నిన్నబాగానే వున్నారు. రాత్రి కాస్త ఇబ్బంది పడ్డారు. అందుకని ఉదయాన్నే అడిగాను, అన్నా హాస్పిటల్‌కు వెళదాం బయల్దేరు అంటే లేదురా విశ్వనాథ్, నాకు బాగానే ఉన్నది. నీవు కోర్టుకు వెళ్ళు. ఏదో మామూలుగా అయ్యే మోషన్స్, దానికి హాస్పిటల్‌కు ఎందుకు. నేను 120 సంవత్సరాలు బ్రతుకుతానురా. ఏం కంగారు పడకు అని చెప్పి నన్ను కోర్టుకు పంపించారు. ఇంతలో ఎందుకిలా అయిందో నాకూ ఏం అర్థం కావటం లేదు' అంటూ ఆయన చాలా వర్రీ అయిపోతూ చెప్పారు.

మరి కాసేపటికల్లా పిడుగులాంటి వార్త. అప్పుడు సమయం 7:05నిమిషాలు. శ్రీశ్రీమాస్టరు గారి దివ్యచైతన్యం, మహాచైతన్యంలో విలీనమైపోయిందనే వార్త. "హి ఈజ్ నో మోర్" అనే గుండె పగిలే వార్త. ఇలలోకాదు, కలలో కూడా ఊహించలేని దుర్భరమైన వార్త. ఒక్కసారిగా ఈ మాట వినేసరికల్లా అందరిలోనూ జవ, సత్వాలు క్షీణించిపోయాయి. అంతా అంధకారబంధురమైపోయింది. హే భగవాన్, ఏమిటీవింత. ఎందుకిలా జరిగిందని వాపోతున్నారందరూ. ఇంతమంది పడుతున్న ఆవేదనకు ఎక్కడ నుంచీ జవాబు వస్తుంది. ఫోన్లలో రకరకాలుగా వారి, వారి బాధలను వ్యక్తం

చేసుకుంటూ అమితంగా దుఃఖిస్తున్నారు. నా దగ్గరకు చాలా మంది వచ్చారు. తమ దు:ఖాన్ని అలా చెప్పుకుంటూ పోతున్నారు. వారిని ఎలా అనునయించాలో నాకేం బోధ పడలేదు. వాళ్ళను సమాధాన పరచగల భాషగానీ భావాలు గానీ నా దగ్గర లుప్తమైపోయాయి.

అప్పుడు నాకు శ్రీమద్భాగవతంలోని శ్రీకృష్ణనిర్యాణం ఘట్టం గుర్తుకు వచ్చింది. ద్వారకలో శ్రీకృష్ణుణ్ణి చూడటానికి వెళ్ళి వచ్చిన తమ్ముడితో, అన్నగారైన ధర్మరాజు,' ద్వారకలో శ్రీకృష్ణుని పరివారమంతా కుశలమే గదా, ...' అని ప్రశ్నించగా, అర్జునుడు తీరని ఆవేదనతో అక్కడ జరిగిన వృత్తాంతాన్ని ఇలా చెప్తాడు,

మన సారథి, మన సచివుడు, మన వియ్యము,
మన సఖుండు, మన బాంధవుడున్,
మన విభుడు, మన గురుడు, దేవర
మనలను దిగనాడి చనియె, మనుజాధీశా ॥

మహారాజా! ఏమని చెప్పేది. మన సారథి, మన మంత్రి, మన వియ్యం, మన మిత్రుడు, మన బంధువు, మన గురువు, మన దేవుడు, మన వాసుదేవుడు, మన అంతర్యామి మనలను వదలి మరోలోకానికి వెళ్ళిపోయాడు అన్నా అంటూ భోరున దు:ఖిస్తాడు అర్జునుడు. మన పనీ అలాగైంది ఇప్పుడు.

జ్ఞాపకాలు, రకరకాల జ్ఞాపకాల సముద్రంలో కొట్టుకుపోతున్న నాకు, రకరకాల సందర్భాలలో ఆయనమూర్తి ఇలా, ఇలా దర్శనమిచ్చింది. ఒక మాటు ఆత్మబంధువై ఆదరించే వారు. ఒక మాటు ఔదార్యమూర్తియై బహుసంతోషాలను పంచిపెట్టే వారు, ఒక మంత్రియై హితోపదేశం చేసేవారు, గురువై కర్తవ్యాన్ని బోధించేవారు. వేరొకమాటు ఆత్మీయుడై అందమైన సలహాలనిచ్చేవారు. ఒక్కొక్కసారి అందరినీ చుట్టూ కూర్చుండబెట్టుకొని హాయిగా, ఆనందంగా కన్నతండ్రిలాగా అన్నం తినిపించేవారు. అనంతమైన జ్ఞానాన్ని పతంజలి మహర్షిలాగా బహుధా, బహుముఖాలతో పంచి పెట్టారు. గురువులతో కూడా, 'నువ్వే చెయ్యాలిరా ఈ పని, నీవు తప్ప ఇంకెవరూ లేరురా' అని అనిపించుకున్న మన పరంధాముడు, పరమధామానికి వెళ్లిపోయారనే మాట మనకు బాధగా.... వున్నది. అలాంటి మహాత్ముణ్ణి మరచిపోవటం ఎలా?

భగవంతునిలా సంరక్షించిన ఆయన ఇక లేరు. నిలకడలేని ఈ ప్రస్తుత ప్రపంచంలో ఆయన లేకుండా ఎలా జీవించాలనే మనోక్షోభను పొందారు. శ్రీరామకృష్ణులు మహాసమాధి చెందారు. వారు జీవించి ఉన్న కాలంలో వారి సేవలో తరించిన అనేక మంది దుఃఖ సముద్రంలో మునిగి పోయారు. వారితోపాటుగా అతి సన్నిహితంగా మెలుగుతూ అనేక కార్యక్రమాలలో పాల్గొన్నవారి పరిస్థితి వర్ణనాతీతం. ప్రగాఢమైన ప్రేమతో వారితో కలసిమెలసి జీవించిన కుటుంబసభ్యులు, బంధువులు... పితేవపుత్రస్య, సఖేవసఖ్యుః అన్నట్లుగా జీవించిన పరిజనుల దుఃఖానికి ఆవలి గట్టు కనబడలేదు. మార్గదర్శిగా ఉన్న వ్యక్తి హఠాత్తుగా కనుమరుగవటమనేది అందరికీ తీరని సంతాపానికి, భయాందోళనకు గురి చేసింది.

అఖిలేశ్వరుడైన ఆ పరమాత్మస్వరూపులు, వచ్చిన కార్యం పూర్తి చేసుకొని, నిబ్బరంగా, నిశ్చలంగా, నిర్వికల్ప సమాధిస్థితిలోకి వెళ్ళిపోయారు. ఎవ్వరికీ ఏమీ చెప్పకుండానే, ఒక దివ్యమైన వెలుగులాగా తిరిగి రాని మహర్లోకాలకి వెళ్ళిపోయారు. ఇంక చెప్పటానిక్కానీ, చెయ్యటానిక్కాని ఏమీ కనబడటం లేదు.

మహాప్రస్థానం

అవతార పురుషుల యొక్క గానీ, మహాపురుషుల యొక్కగానీ జీవితాలనధ్యయనం చేసినట్లైతే వారి మహాప్రస్థాన పద్ధతి ఎంతో విలక్షణంగానూ, విశేషంగానూ కనిపిస్తుంది. మహాప్రస్థాన పద్ధతిలో ఉత్తమగతిని కోరు మహాత్ములు యోగము చేత శరీరత్యాగమును కాంక్షిస్తుంటారు. అవతార పురుషుడైన శ్రీరాముని జీవితంలోగానీ, శ్రీకృష్ణుని జీవితంలోగానీ, శ్రీరామకృష్ణులజీవితంలోగానీ, యుగావతారులు పండిత శ్రీరామశర్మఆచార్యగారి జీవితంలో గానీ మనం గమనించినట్లైతే, ఒకటి కనిపిస్తుంది. వారు ఇచ్ఛాపూర్వకంగా, తాము నిర్ణయించుకున్న సమయంలోనే యోగమార్గంలోనే తమ భౌతికదేహాలను త్యజించినట్లు తోస్తుంది. ఇంకా వారి జీవితచరిత్రలలో చదువుకున్నాము కూడా !

ఏ లోకాలలో, ఏ పరిస్థితులను సరిచేయాలని పూజ్యగురుదేవులు వారికి ఎలాంటి ఆదేశాలను ఇచ్చారో ఏమో, దానికనుగుణంగా స్వచ్ఛందంగా, సమయానికి ముందుగానే (వారి లైఫ్ స్పాన్ 58 సంవత్సరములని ఒకసారి చెప్పారు) అనాయాసంగా తమ దివ్యదేహాన్ని స్వీకరించమని కాల

పురుషునికి తమ సమ్మతిని తెలిపారు. మహాత్ముల జీవితాలలో చదువుతుంటాము. శరీరంలో ఉండి పనిచేసిన విధంగానే, వారు శరీరం లేకపోయినా తమకు నిర్దేశించిన పనిని మిగిలిన లోకాల నుంచీ కూడా చేయటమనేది నిర్వివాదంగా చెప్పదగిన ఒక తథ్యం, ఒక సత్యం. ప్రణాళిక భగవంతునిది కనుక 'జరగాల్సిందే జరుగుతుంది కానీ, జరగాలనుకున్నది ఎన్నటికీ జరుగదు'.

పూజ్యశ్రీమాస్టారు ఒకానొక సందర్భంలో 'ఆ రోజు నాకు చేయవలసిన కర్మకాండ అందరికి లాగే యధాతథంగా కానిచ్చెయ్యండి. ఆర్భాటాలేం వద్దు. ఒక విశాలమైన ప్రదేశంలో మహాత్ముల మరియు సూక్ష్మశరీర ధారుల ఉపస్థితిలో ఆ కార్యక్రమం అతి సామాన్యంగా జరుగుతుంది...' అంటూ అనేక విషయాలు చెప్పారు. (ప్రస్తుతం అవి అప్రస్తుతం.) సమాధి స్థలము శంబళాలో నిర్ణయించారు. వారు చెప్పిన విధంగా చాలా సహజంగా అన్నీ పద్ధతులు జరిగిపోతున్నాయి. వారి మహాప్రస్థానాన్ని చూడవలెనని గ్రామ, గ్రామాల నుండీ భక్తులు వచ్చారు. మహాత్ములూ, పీఠాధిపతులు వచ్చారు. అనేక సంస్థల వ్యవస్థాపకులు వచ్చారు. అన్నింటినీ మించి శాంతికుంజ్ నుంచీ పూజ్యగురుదేవుల ప్రతినిధి రూపంలో పూజ్యశ్రీ గౌడ్‌గారు వచ్చారు. సంస్కారానికి సంబంధించిన వ్యవస్థనంతా మాస్టారి అనుంగుశిష్యుడు శ్రీ సీతారామాంజనేయ ప్రసాద్‌గారు, (వారిప్పుడు హిందూ ధర్మ పరిరక్షణ సంస్థ అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు) భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా అన్నీ ఏర్పాట్లు చేశారు. పూజ్యశ్రీగౌడ్‌జీగారు సంస్కార ప్రకరణలో ఇచ్చిన పద్ధతి ప్రకారం కర్మకాండనంతా దగ్గరుండి చేయించాక ముందుగా మాస్టారి తమ్ముడు శ్రీవిశ్వనాథ్‌గారు, తరువాత బాబయ్య అని ఎంతో ప్రేమతో పిలిచే సుబ్రమణ్యం (శ్రీశామలరావుగారి అబ్బాయి) తదుపరి కార్యక్రమాలను పూర్తిచేశారు. అంతే హుతాశనులవారు ఎంతో ప్రేమ, ఆత్మీయతలతో దేదీప్యమానంగా ఎగిసిపడుతున్న దివ్యజ్వాలలలో వారిని ఎంతో అనునయంతో, ఆదరంగా, తమ ఒడిలోకి తీసుకొని తమలో విలీనం చేసుకున్నారు. ఆనాటి ఆ దృశ్యం చూస్తున్నవారి గుండెలు పగిలిపోయాయి. దుఃఖం కట్టలు తెంచుకొని వెల్లువలా ప్రవహింపసాగింది. మాస్టారి ముద్దుల పట్టి సుకృత దుఃఖాన్ని చూచినవారి హృదయం ద్రవించిపోయింది. ఆమెను చూచి అందరూ కన్నీరు మున్నీరౌతున్నారు. ఎవ్వరూ తనను ఓదార్చలేక పోయారు. ప్రతీ ఒక్కరి పరిస్థితీ అలానే ఉందానాడు. ఏది ఎలా ఉన్నా, జరుగవలసిన తదుపరి కార్యక్రమాలనన్నింటినీ విధివత్ పూర్తిచేశారు. ఆయన శిష్యులు ఆవంచ శ్రీ సీతారామాంజనేయులు గారు సంస్కారాన్ని పూర్తిచేశారు. అందరిలో ఒక నిస్పృహ,

నిర్లిప్తత, నిరాసక్తి ఆవహించింది. అంతా శూన్యంలోకి వెళ్ళిపోతున్నామా అనిపించిందాక్షణాలలో! అదే శ్మశానవైరాగ్యమేమో!!

ముక్తాయింపు

ఇన్ని సంవత్సరాల నుంచీ ఎంతో ఆత్మీయంగా మనశ్రేయోభిలాషిగా, మన మధ్యనే నడయాడి, మనకంత జ్ఞానాన్ని ప్రసాదించిన పూజ్యమాస్టరుగారి బాటలో నడవటం మన కర్తవ్యం. పున్నమినాటి వెన్నెల, అమావాస్యనాటి చీకటి శాశ్వతంగా ఉండవు. సంతోషాలు, దుఃఖాలనేవి చక్రీయక్రమంలో వస్తుంటాయి, పోతుంటాయి. This is the Eternal Truth. వారి జీవితం నుంచీ మనం ఏం నేర్చుకున్నామని ఎవరికి వాళ్ళం అంతరంగాన్ని ప్రశ్నించుకుంటే, అక్కడి నుంచే దాని జవాబు వస్తుంది.

ఎవరైనా చెయ్యగల్గింది గానీ, చేయవలసింది గానీ ఏమిటంటే మనకు చేతనైనదాన్ని అశ్రద్ధ లేకుండా చేయటం, తక్షణమే చెయ్యటం. మన పరివార్‌లో గానీ, బంధువులలోగానీ, స్నేహితులలో గానీ, మనలను నమ్ముకున్నవాళ్ళకుగానీ అవకాశం వున్నంత వరకు చేతనైన సహాయం చెయ్యటం. రక్షణ కల్పించటం. అవసరమైన చోట సేవ చెయ్యటం. అడిగిన వారికి ఉచిత సలహాలు కాకుండా మంచి సలహాలనివ్వటం అనేవి వారి నుంచీ మనం నేర్చుకోవలసిన దైవీలక్షణాలు. ఎక్కడైనా సేవ చేయవలసిన అవసరం వస్తే అది ఇళ్ళల్లోగానీ, గుళ్ళల్లోగానీ, పెళ్ళిళ్ళల్లోగానీ, దైవీకార్యక్రమాలలో గానీ అపారమైన శ్రద్ధతో, ఒళ్ళు దాచుకోకుండా చేయటం నిజమైన మానవత్వం, మానవ లక్షణం. మన సత్ప్రవర్తన బట్టే మన ఆలోచనా విధానంగానీ, మాట్లాడే విధానంగానీ ఉంటాయి. సేవాదృష్టి, త్యాగబుద్ధితోపాటు శాస్త్రవిజ్ఞానం కూడా జతపడితే అది నవయుగనిర్మాణానికి ప్రథమ సోపాన మౌతుంది. దానికి మాస్టరుగారిచ్చిన మూలమంత్రం –

ప్రేమించటం నేర్చుకో, సేవించటం నేర్చుకో, క్షమించటం నేర్చుకో !!

ఓం శాంతిః శాంతిః శాంతిః

సమర్పణామయ జీవితానికి మాస్టరుగారు ప్రసాదించిన అమృత బిందువులు

1. ఆధ్యాత్మిక జగత్తులో బాధ్యత ఇవ్వబడదు. తీసుకోబడుతుంది.
2. మితవ్యయము అంటే సమయాన్ని సదుపయోగం చేసుకోవడమే!

3. సంపూర్ణ మానవజాతి కలిసి చేసినా పరమగురువుల పనిని పూర్తిచేయలేరు.

4. సంవత్సరములో ఒక్కరోజున మాత్రమే గురువు స్పర్శ మీరు అడిగినా, అడగకపోయినా ఈ భూమ్మీద ప్రసరిస్తుంది. అదే గురుపూర్ణిమ యొక్క గొప్పదనము.

5. మీరు చేయలేనటువంటి పనిని మీకు గురువు చెప్పడు.

6. నేను మీ కోర్కెలు తీర్చటానికి రాలేదు. ఒక గురువులాగా మిమ్మల్ని మార్చటానికి వచ్చాను.

7. చెయ్యగల్గింది వెంటనే మొదలు పెట్టు. చెయ్యలేనేమోనని అసలు మొదలు పెట్టకుండా వుండవద్దు.

8. మీ యొక్క హృదయంలోనే భావాల రూపంలో నేనున్నాను. బయట వెదకకండి.

9. సర్వవ్యాపి అయిన భగవంతుడు మన హృదయంలోనే సద్గురురూపంలో వెలుగొందుతూ సర్వదా మార్గదర్శనం చేయటానికి సిద్ధంగా వున్నాడు.

10. సంతోషం అంటే పరిణామక్రమాన్ని అర్థం చేసుకొనుట.

11. అనుకున్నాక జరగకపోవటమనేది ఉండదు. అసంభవమది. గుర్తుంచుకోండి.

12. చావగొడుతున్నప్పుడు అవతారము. చెబుతున్నప్పుడు గురువు.

13. ఈ విశ్వప్రణాళిక వైపు వెళ్ళేటటువంటి వ్యక్తులెక్కడున్నా ప్రకృతి వాళ్ళకు సహకరిస్తుంది.

14. గంగామాతకు జరిగినట్లే మిగతా నదులకూ ఆరతులు జరగాలి.

15. ఇవ్వటమనేది మర్చిపోయాము. అందుకే మనకెప్పుడూ కష్టాలే! మన బాధ్యతలతోపాటు ఆధ్యాత్మికతలో సాధించవలసిన లక్ష్యాలకు సమయాన్ని సర్దుబాటు చేసుకోవాలి.

17. సాధన: నిటారుగా కూర్చొని మెడను కూడా నిటారుగా పెట్టుకోవాలి. జ్ఞానముద్రలో వుండి శ్వాస లోపలికి వెళుతోంది, బయటకు వస్తోంది. దానిని గమనించటమే యోగవిద్యకు ఆధారం. ఆ ఆసనంలో కూర్చుంటే ధనం మనవైపుకు ఆకర్షించబడుతుంది. కష్టాలనేవి వుండవు. భౌతికమైన బాధలు రావు. చేసి చూడండి.


18. ఇది తప్పు అని తెలిశాక వదిలివేయగల్గాలి. అలా వదిలివేయలేకపోతున్నాము అంటే అది ఆధ్యాత్మిక విద్యలోపమే.

19. వ్యక్తిగత సాధనకు తక్కువ సమయాన్ని కేటాయించి, జ్ఞానయజ్ఞమునకు ఎక్కువ సమయాన్ని కేటాయించాలి.

20. అనేక బాధలకు కారణం ఆచరణలోపమే తప్ప దేవుడు కాదు, దయ్యమూ కాదు. దాన్ని సరిచేసుకోండి.

NOTES

మౌంట్ శంబళ ఫోటో గ్యాలరీ



మౌంట్ శంబళ ది గ్లోబల్ పవర్ సెంటర్, శంబళ హిల్స్, హైదరాబాద్ యొక్క ఏరియల్ వ్యూ




జయ ఘంట



బ్రెయిన్ రాక్



మాస్టర్ గారి దివ్య సుందర విగ్రహం



మాస్టారు మహాకాలయంత్రం



శంబళలోని గోమాతలు


మాతా మారెళ్ళ సక్కుబాయి విశ్వ ఆధ్యాత్మిక గ్రంథాలయము


మాతా మారెళ్ళ సక్కుబాయి
విశ్వ ఆధ్యాత్మిక గ్రంథాలయము
MAATA MARELLA SAKKUBAI
WORLD SPIRITUAL LIBRARY
మాతా మారెళ్ళ సక్కుబాయి విశ్వ ఆధ్యాత్మిక గ్రంథాలయము


THEOSOPHY
SRI RAMAKRISHNA
A BIOGRAPHY
పుస్తక కేంద్రము




మహాకాల శక్తి (శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురుదేవుల సమాధి మందిరము)



శ్రీ శ్రీరామకృష్ణ సమర్థ సద్గురుదేవుల మహాకాల సమాధి



గాయత్రీ యంత్రములు - సాందీపని గురుకులము








షిర్డీ సాయి = సత్యసాయి



మహాయోగేశ్వరీ దేవి


శ్రీ రాజ్యలక్ష్మి స్థూపం


గాయత్రీ మంత్రలేఖన బ్యాంక్






సప్త గో ప్రదక్షణ



సుభద్ర - బలరాములు



విశ్వ కచ్ఛపం



ధ్యాన గుహ



ధ్యాన గుహ



క్రాంతిధర్మ సాహిత్యము - మహాపూర్ణాహుతి పుస్తకమాల - 2

21వ శతాబ్ది - ఉజ్జ్వల భవిష్యత్తు 2, పేజీ. 42

7. రాబోయే శతాబ్దికి అధిష్ఠాత - సూర్యుడు

బ్రహ్మ ముహూర్తములో నిద్రలేచి యథాశక్తి శరీరము మనస్సులను శుద్ధిపరచుకొని కనులు మూసుకుని ప్రాతఃకాలంలో ఉదయిస్తున్న స్వర్ణిమసవితను ధ్యానము చేయాలి. ఆ స్వర్ణిమ సూర్య కిరణములు తమ శరీరముల లోపలికి ప్రవేశించడము వల్ల వాటి స్థితి చంద్రుని వలె అవుతున్నదని భావన చెయ్యాలి. సూర్యునినుండి ప్రకాశమును గ్రహించిన చంద్రుడు మెరుస్తూ, తన శీతల ప్రకాశముతో రాత్రిని ప్రకాశింపజేసి అమృతమును కురిపిస్తాడు. ధ్యానస్థితిలో భావన ఎలా ఉండాలి అంటే సూర్యకిరణములు సాధకుని శరీరములో ప్రవేశించినాయి. శరీరములోని అంగ ప్రత్యంగములలో చంద్రుని అమృతజ్యోతి నిండి పోయింది. ఈ జ్యోతి ప్రపంచమంతా వ్యాపించి అమృతజ్యోతితో నిండిన వాతావరణమును నిర్మిస్తోంది. దానితో పదార్థములు, ప్రాణులు అనుప్రాణితమవుతున్నాయి. ఉపయోగకర వాతావరణములు నిర్మించబడు తున్నాయి. అవాంఛనీయతలు తొలిగిపోతున్నాయి.

గాయత్రీమంత్రము సూర్యమంత్రము. ఎవరికి గాయత్రీ మంత్రముపై శ్రద్ధ వుంటుందో వారు పైన చెప్పిన ధ్యానముతోపాటు గాయత్రీమంత్రమును మానసికంగా జపించవచ్చు. ఎవరికి మంత్రజప విధానము నచ్చదో వారు కేవలము సూర్యకిరణములను తమ శరీరములోకి ఆవాహనచేసి దానిమూలముగా తయారయ్యే చంద్రోపమశరీరముతో అమృతజ్యోతి వితరణ ధ్యానమును మాత్రమే చేసుకుంటూ ఉండవచ్చు.

దీనికొరకు 15 నిమిషాలు సమయమే నిర్ధారించబడినది. కారణము అందరూ దీనిని ఆచరించుటకు వీలుగా వుండాలి. ఒకే భావన ఒకే సమయములో లక్షల, కోట్ల మంది కలిసి చేస్తే ఆ సంయుక్తశక్తి నుండి ఉద్భవమయ్యే సూర్యచేతన మానవ సమాజముపై అధిక అనుగ్రహమును కురింపిచగలదు, ఇటువంటి నమ్మకము మనకు వుండాలి.

SLS PRINTERS, HYD @ 98491 55699, 91777 55699